కొళ్ళపల్లి పీఠికలు

C



సంపాదకులు

ఘట్టమరాజు అశ్వత్థనారాయణ

ఆర్వీయస్. సుందరం

CI

YDRO1E124

రాళ్ళపల్లి పీఠికలు

సంపాదకులు

ఘట్టమరాజు అశ్వత్థనారాయణ

ఆర్వీయస్. సుందరం

రాళ్ళపల్లి అభినందన సమితి

RALLAPALLI PEETHIKALU- A collection of prefaces written by Dr. Rallapalli Ananthakrishna Sarma. Publishers: Rallapalli Abhinandana Samithi. First Edition, 1978.

© **Dr. Rallapalli Ananthakrishna Sarma**

Editors :

G. Aswathanarayana, M. A.,
Lecturer in Hindi, Visweswarapura College,
Bangalore-4

Dr. R. V. S. Sundaram M. A., Ph.D., (Tel.) M. A , (Kan.)
Lecturer in Telugu, I. K. S.
University of Mysore,
Mysore-6

Price : Rs. 15/-

For Copies:

1. Rallapalli Abhinandana samithi,
   53, II Block, Thyagarajanagar,
   Bangalore-28.
2. A. P. Book Distributors,
   Rashtrapathi Road,
   Secunderabad-A.P.

Cover page: P. R. Thippeswamy

Printed at:
Aravinda Printers,
Seetharamarao Road, Mysore-4.

మనవి

నా యెడ తమకుగల అనంత ప్రేమను 'అనంత రాగం' అన్న గ్రంథం పేరుతో నగారా వాయించిన ● వ్యాజమైత్రీమూర్తులు, చిరాయుష్మంతులు,

శ్రీ రాళ్ళపల్లి సుందరం,
శ్రీ ఘట్టమరాజు అశ్వత్థనారాయణ,
శ్రీ శివలంక శ్రీరామచంద్ర మూర్తి,

అను వారిలో నిద్దరు ఈ నా పీఠికలను మూలమూలలను వీర్చి కూర్చి ప్రకటించినారు. వీరికి ఈ ఉత్సాహోద్యోగములకు దోహదం కల్గించినది శ్రీ జి. యన్. రెడ్డిగారు. శ్రీ శ్రీనివాసులు సకలేష్టార్థ సౌభాగ్యములను వీరికి ●నుగ్రహించు గాక! ఇంతకు మించి ఈ విషయమున నేను చేయ గల్గినదియు చెప్పగలిగినదియు వీమియు తోపదు

"అహేతుః పక్షపాతోయః తస్య నాస్తి ప్రతిక్రియా"

బెంగళూరు,
ఫైంగళ ఫాల్గున శుక్ల చతుర్థి
భానువారము
12-3-1978

రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ

చెప్పఁబోవుదానిఁ జిప్పమాటల చేతఁ
జెప్పవచ్చుఁ ; దాన మెప్పు లేదు
చెప్పవలయు రసము చిప్పల నీయట్లు
కీర్తనీయ చరిత ! కృష్ణశర్మ !

డా. చిలుకూరి నారాయణరావు



పీఠికార్చన

ఆచార్య జి. యన్. రెడ్డి

శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారు (జననం 1893)· సంగీత సాహిత్య కళాప్రపూర్ణులు; సరస సాహిత్య విమర్శకుల్లో అగ్ర గణ్యులు. నేడు వయోవృద్ధులు. ఇటు తెలుగువారికి అటు కన్నడిగులకు, ఇటు సాహిత్యాభిమానులకు అటు సంగీత ప్రియులకు పరమ పూజనీయులు, సంగీత సాహిత్య రంగాలలో తనదైన ఒక ప్రత్యేకతను సాధించి స్థాపించు కొన్న సుమధురమూర్తి రాళ్లపల్లి.

తెలుగు వాఙ్మయంలో వచన రచన అర్వాచీనం. శాస్త్రీయమూ, చారిత్రకమూ అయిన సాహిత్య విమర్శ కూడా అధునాతనమే. పాశ్చాత్య ప్రభావ కారణంగా గత శతాబ్దంలో మనవారు నేర్చిన విద్యల్లో ముఖ్యంగా గ్రంథ ముద్రణ, గ్రంథ పరిష్కరణ, ఎన్నదగినవి. తెలుగు ముద్రణకు, గ్రంథ పరిష్కరణ విద్యకు పితామహుడనదగిన మహనీయుడు సి. పి. బ్రౌన్ (1798-1884). గ్రంథపరిష్కరణవిద్యను అంటిపెట్టుకొని ప్రచారానికి వచ్చిన ఒకానొక సాహిత్య వ్యాసంగం పీఠికారచన. అది రానురాను తెలుగు రచయితల గద్యపద్య నాటకాది వివిధగ్రంథాలలో ఒక భాగంగాను అలంకారంగాను అభివృద్ధి పొంది ఈ నాడు ఒక సాహిత్యాంగంగా పరిణమించింది. పీఠికారచన ఒక కళగా భావించి వైయక్తికమైన ముద్రతో విలక్షణమైన ఫక్కీలో పీఠికలు వ్రాయ నేర్చిన వారు మన కెందరో లేరు. ఉన్నవారిలో అగ్రస్థానం రాళ్లపల్లివారిదే.

తెలుగు విమర్శక వాఙ్మయంలో పీఠికాసాహిత్యానికి ఇంతవరకు గుర్తింపు లేదు. నిజానికి సాహిత్య విమర్శలో ఒక శాఖగా గుర్తించవలసిన రచనా వ్యాసంగం ఇది. సాహితీవేత్తలు, విమర్శకులు, పండితులు, పరిష్కర్తలు వ్రాసిన పీఠికలు అమూల్యము లైనవి మనకు ఎన్నో వున్నాయి. వాటిని ఏరి సంకలనం చేసి ప్రత్యేక సంపుటంగా లేదా సంపుటాలుగా ప్రకటించడం చాలా అవసరం; ప్రయోజనకారి. కాని అట్టి మంచి ప్రయత్నం ఇంతవరకూ జరగలేదు. దానికి ఎవరూ పూనుకోలేదు. కట్టమంచి రామలింగారెడ్డిగారి పీఠికలు కొన్ని మాత్రం ఆంధ్రవిశ్వకళా పరిషత్తువారు 1947 లో ప్రకటించిన వ్యాసమంజరిలో చోటు చేసుకొనివున్నాయి. అందులో రెడ్డిగారి ఉపన్యాసాలు, వ్యాసాలు కూడ కొన్ని వుండడం వల్ల వ్యాస మంజరిని కేవలం పీఠికలకే పరిమితమైన సంపుటిగ గణించలేము.

రాళ్లపల్లి వారి వ్యాసాలు, ఉపన్యాసాలు ఇదివరకే ప్రత్యేక గ్రంథాలుగ వెలువడినాయి. కాని వారి పీఠికలు మాత్రం ఆయా గ్రంథాల్లోనే ఆణిగి మణిగి ఉండిపోయినాయి. రాళ్లపల్లివారి పీఠికలు శతాధికం. అవి రమణీయములు, కమనీయములు, ఆలోచనామృతాలు. ఈ గ్రంథం అట్టి పీఠికల సంకలనం. తెలుగులో పీఠికల సంకలన గ్రంథం ప్రకటనకు తొలిప్రయత్నమిదే. ఇట్టి ప్రయత్నంలో పీఠికా పరమైన తొలి తెలుగు సంకలన గ్రంథంగా రాళ్లపల్లివారి పీఠికలు వెలువడడం ముదావహం. ఈ గ్రంథ ప్రకటనకు ఒక ప్రణాళికను రూపొందించుకొని సాధక బాధకాలను సహించి వ్యయప్రయాసలను ఎదుర్కొని పట్టుదలతో అమూల్యమైన ఈ పీఠికా పేటికను మన కండించిన ఈ సంపాదకులు సర్వదా అభినందనీయులు. ఈ వాఙ్మయతపస్వి తెలుగు సాహిత్యరంగానికి చేసిన సేవకు మనం అర్పించు నీరాజనమిది.

రాళ్లపల్లివారి సాహిత్య జీవిత చరిత్ర జిజ్ఞాసువులకు గమనార్హం; పరిశోధకులకు పరిశీలనార్హం. ఇటీవల శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రాళ్లపల్లివారి సాహిత్యసేవను గూర్చి ఒక విద్యార్థి పరిశోధించి సిద్ధాంత వ్యాస మొకటి సమర్పించడం కూడా జరిగింది. వాస్తవానికి రాళ్లపల్లివారి వ్యక్తిత్వం లోని వివిధాంశాలు వారి పీఠికల్లోనే సువ్యక్తమై వున్నాయి.

శతాధికమైన వారి పీఠికల్లో అభిప్రాయాలు లేదా అభినందనప్రాయాలైన చిన్నచిన్నవి చాలా వున్నాయి. అవి పోగా గణింపదగినవి చాలావరకు ఈ గ్రంథంలో చేర్చబడినాయి

రాళ్లపల్లి వారి పీఠికలు ప్రధానంగా రెండు రకాలు. 1. స్వీయ రచనలకు - పరిష్కృత గ్రంథాలకు వ్రాసినట్టివి. 2 ఇతరుల రచనలకు వ్రాసిపెట్టినవి. ఏ రకానికి చెందినవైనా రాళ్లపల్లి పీఠికలు యథాలాపాలు మాత్రం కావు. అవి విషయప్రధానములు, విమర్శతత్త్వ సమన్వితములు, సమీక్షా ప్రాయములు, వైయక్తిక వచన రచనా శిల్పవిలక్షణములు. ఎవరో ఒక రచయిత కోరికను మన్నించి మర్యాదకో, మొహమాటానికో నాల్గు మాటల్లో తన అభిప్రాయాన్ని వ్రాసినా అందులోనూ ఒక మెలకువో, ఒక మురిపెమో, ఒక చిన్న మెరుపో ప్రతిబింబితమై వుంటుంది. పెద్ద పీఠికల్లో విషయోన్నత్యం, అభిప్రాయగాంభీర్యం, పటుత్వం తప్పని సరసవాక్కు, శైలీ సంపన్నత ప్రధాన లక్షణాలు నిజానికి రాళ్లపల్లివారి పీఠికలు ఒక నిర్మితి గలిగి సుందరంగ, శిల్పశోభితంగ రూపొంది వుంటాయి. వాటిని విశ్లేషించి పరిశీలిస్తే పీఠికా రచనలో రాళ్లపల్లివారిదైన ఒక శిల్పం సుగోచరమవుతుంది. సాధారణంగా మొదట రచయితను-ఆ రచయిత చిన్న అయినా, పెద్ద అయినా, పరిచితుడైనా, అపరిచితుడైనా-అభినందించే మాటలు. అటు తర్వాత గ్రంథస్థ విషయపరమైన మెప్పుకోలు, పిదప రచనలోని లోటు పాట్లను చాటే లలిత విమర్శ, అవసరమైనచోట్ల సోపపత్తికమైన భేదాభిప్రాయ ప్రకటన లేదా శబ్దార్థ చర్చ, చివర మరల రచయితకు ప్రోత్సాహరూపమైన ముగింపు-ఇవి స్థూలంగా రాళ్లపల్లివారి పీఠికా రచనల్లోని పద్ధతి.

భాషాశైలి పరంగా వారి దృక్పథంలో కలిగిన పరిణామం కూడా రాళ్లపల్లి పీఠికల్లో గోచరిస్తుంది తొలి పీఠి ల్లో అరసున్నల సందడి, బండిఱాల ఒరువు, సంధుల బిగింపు బాగా కనిపిస్తుంది రానురాను శ్రుతికింపైన సంధుల సడలింపులు, డోగూ తూగూ వున్న వాక్యాల కూర్పు, దేశిపదాల సార్థక ప్రయోగం, నూతన పదబంధ కల్పనాభిలాష గోచరిస్తాయి చివరకు వచనరచయితలు వ్యావహారిక శైలిని వరించి చేపట్టడం

దోషం కాదన్నట్లు శుద్ధ వ్యావహారికంలో ఆశీర్వదించిన పీఠికల్ని కూడా వ్రాసినారు. వ్యావహారికం విషయంలో రాళ్లపల్లివారు కోస్తా, మఱక సీమల (తెలంగాణా) భాషా మాండలికాలను కాదనలేదు. అయితే వారు 'స్వస్థాన వేషభాషాభిమతులు'; కాబట్టి 'రాయలసీమ బాస వట్టి వాతలు పెట్టుకుంటూ నిసర్గమైన నింపుసొంపులను దారబోసుకుంటూ వుంది. ఇక్కడ పుట్టిపెరిగిన చదువరులే తమ రాతకోతల్లో ఆ యాసే, ఆ వేసమే పూసుకొని గడ్డ కెక్కు తున్నా రెందరో' (చూడు. పు. 328) అని మందహాసంతో మందలిస్తారు.

పీఠికల్లో కూడ రాళ్లపల్లి వారి శైలి విలక్షణం, అననుకరణీయం. విషయభేదాన్ని బట్టి అభిప్రాయ ప్రకటనోద్దేశాన్నిబట్టి వారిశైలి ఇంపైన వంపుసొంపుల ఒయ్యారింపులతో నడయాడుతూ వుంటుంది. ఉదాహరణకు వారి పీఠికలోని కొన్ని వాక్యాలు :

".....సృష్టిలో పిన్న పెద్దలు రెండును స్వతంత్రములు. అవశ్యక ములు. గుణదోషములు రెండును రెంటను గలవు. గొప్ప వస్తువు నందలి గాంభీర్యము చిన్న వస్తువున కుండదు. చిన్నదానికి గల చెలువము గొప్ప దానికి రాదు. పెద్దలకు మ్రొక్కులు పిల్లలకు ముద్దులు, వస్తువు పెద్దది యగునప్పుల్ల నయ నాజ్యములు తగ్గును. చిన్నదియైనప్పుల్ల గౌరవ గాంభీర్యములు కృశించును రెండు గుణములును ఒకచో జేరుట సృష్టి లోని యుద్దేశమే కాదేమో!....." (చూ. పు. 124).

"..... .....ఈయన నియోగికవి మాత్రమే కాదు. కవియోగి కూడ....." (చూ. పు 132).

".....రక్తిలోను విరక్తిలోను సౌందర్యమున్నది. వికారము గూడ రెంటను గలదు. రెండును పరస్పర సంస్కారకములుగా పోషక ములుగా ఉండగలవు. ఉండవలయును. ఈ తత్వమును గమనింపక పోపుట చేతనే మనదేశమందు చార్వాక మతముతోగూడ బౌద్ధమతమును నశించిపోయినవి. గురుదేవుడు, పద్మదేవుడు ఇద్దరును శుష్క హృ వాదులే. వీరిరువురి నడుమ పరవశముగా నలిగినది శాంతిశ్రీ....." (చూ. పు. 164).

".....నారాయణాచార్యుల వాక్కు వణకు లేనిది. స్వతంత్ర మగు భావనాబలము, తీవ్రములైన భావములు, అడకువలేని యభిప్రాయ ములు అనుభవశూరుల లక్షణములన్నియు నిందు గలవు. తోచిన పొగడ్తను గాని, తెగడ్తను గాని, వెనుదీయక విసరి చెప్పు నార్జవ మీతనికి గలదు. ముఖస్తుతిగాని, ముఖనిందగాని విద్యగానేర్చిన పాతకమున బోనివాడు. అనుభవమునకు మితిలోపము ఉండవచ్చును. కాని ఆరో పితము మాత్రము కాదు. భావోద్రేకముతో కావేరివలె ఇతని వాగ్ధార తెగదూకులు దూకుచుండును. ఆ వేగములో కొన్ని యభిప్రాయములు అందదుకులుగా గానరావచ్చును. కొన్ని మాటలు కొంత కఠినముగా దొరలవచ్చును. కాని వానికి కారణము చారుదత్తుడు చెప్పినట్లు 'యౌవన మత్రా పరాధ్వతి, న చారిత్రమ్' (మృచ్ఛకటిక)..... (చూ. పు. 290–91).

".....రాజుల యాశ్రయమున నెమ్మదిగా బ్రతికిన కాలమున తెలుగు కవుల లేఖిని శృంగారభావలహరిలో తలమున్కలు వేసి తేల గండ్లు వేసినది. పాశ్చాత్యుల దాస్యమున నీరసమై నిలిచిన నాళ్లలో విప్లవాత్మకమైన అల్లకలోలములు చెలరేగించి ఆవేశము ననుభవించినది. స్వతంత్రత సిద్ధించిన తరువాత త్రివర్గ మార్గముల మూటను నడవలేక కాళ్ళీచవడుచుండగా చేయునది లేక సహజముగ సర్వశక్తుడగు శ్రీని వాసుని శరణు చొచ్చి హృదయావేదనలను ఆయన పాదాలపై ధారవోయ చొచ్చినది. అట్టి కవితలలో శ్రీకుంటిమద్ది శేషశర్మగారి యీ లఘుస్తోత్ర మొకటి....." (చూ. పు. 184).

".....పెండ్యాల వారి యపభ్రష్ట గ్రంథమును ఎంత ఖండించి నను తగును. తామా పని చక్కగా చేసితిరి. అసలు ఆయన చిత్తవృత్తిని చెఱచినది కట్టమంచి రామలింగారెడ్డిగారు. ఆయన వినోద ప్రియుడు. విప్లావకబుద్ధి కనుక కొంత వినోదముగాను, మఱికొంత నవ్యదర్శన ప్రీతి తోను రెడ్డిగారు చేసిన వాదములకు ఆపాదమస్తకముగా వంగి సలాము కొట్టి పెండ్యాల శాస్త్రులు కృతకృత్యమ్మన్యులైరి. వారి పాండితికి నేను కొంత గౌరవము చూపుచుంటిని. నాయెడ వారికిని వాత్సల్య ముండెను....." (చూ. పు. 254–55).

"ఉండినది ఉండినట్లే 'నికరముగా ప్రవాసిపెట్టుదు' మనటి చరిత్రకారులు ప్రకటించుకొన్న 'ధర్మధ్వజము' కాని, కట్టివారి వాతలందే అభిమాన మూలమున ఎన్నియో అనుక్తులు. దురుక్తులు, అతిశయోక్తులు, అతుక్తులును చొచ్చి చేరుకొని యుండుట నిశ్చప్రవమైన మాట. అంతో ఇంతో వేతలు తీతలు లేని కేవల వాస్తవమైన చరిత్ర గ్రంథము మనము చూడలేని ఏంత. అట్టిచో ఉండిన దానికి తోడు ఉండవచ్చు దానిని, ఉండ వలసిన దానిని గూడ ఉత్తరోత్తర ప్రాముఖ్యముతో చేర్చి తీర్చు కావ్య రచనను ఆ చరిత్ర దృష్టితో పరికించుట కవితా సరస్వతికి చేయు నపచార మగును....." (చూ. పు. 242)

".....మన కవుల చరిత్ర చాలా భాగం వేర్లు చేతి కందకుండా పెరిగిన శీగిపొద. ఎక్కడ వేలు పెట్టినా కథల కింవదంతుల, అభిమానాల ముండ్లు కుచ్చుకోక తప్పదు....." (చూ.పు. 311-12).

".....స్వాతంత్ర్యమనగా స్వరాజ్యమని మాత్రమే కాదు కేవలము దానిని పోరాడుచు ప్రజలలోని నీతి మత ధర్మాదుల యందు గల దాస్యమును దైన్యమును గమనింపక విడిచిన స్వతంత్రవాది ప్రాయశ: స్వార్థపరులలో మొదటివాడని భావించి మనము దూరముగ తొలగవలయును రాజకీయ స్వాతంత్ర్య మొక కొమ్మలేని పండేకాని పంటయంతయునదే కాదు. తక్కిన వానితో పాటుదియు పండును. దానికై ప్రత్యేకముగా శ్రమించి తక్కిన వానిని వదలుట వెట్టిసేద్యము. కావుననే ఈ వ్యాస కర్తలు భరతఖండ రాజకీయ స్వాతంత్ర్యమును గూర్చి యెక్కువ జోక్యము చూపరాదు వీరు పొమ్మనువారుగారు. పొగ బెట్టువారు....." (చూ పు. 285)

".....శృంగార నైషధము నూతిన శ్రీనాథుడే గేయ: మలముల వంటి చాటు పద్యముల నెన్నోటినో వెద చల్లెను. ఇట్లే 'చాటు కవితలు' మహాకవిల కెందును వెలో తిసిపోనివి ....."

(చూ పు. 124).

నలగురు వాడే మాటల్ని నాణ్యంగా వాడడం, అపూర్వమైన కొవ్వి పదబంధాల్ని కల్పించి చమత్కారంగా ప్రయోగించడం కూడ రాళ్లపల్లివారి

వచన శైలిలోని వైలక్షణ్యానికి కొన్ని హేతువులని చెప్పవచ్చు. ఇట్టి ప్రయోగముల వెనక సుస్నితమైన హాస్యము మెదులుతూ వుంటుంది. రాళ్లపల్లివారి పదకల్పనలకు ప్రయోగవైచిత్ర్యానికి కొన్ని ఉదాహరణలు :

అంగడి కవులు; అర్ధపండితుడు, ఒడాయి మాట, మర్మజ్ఞ మన్యులు, కృతకృత్యమన్యులు, ముఖనింద, సత్యశ్రద్ధ, వట్టి పుట పూరణం; మైల పలుకులు; కప్పు కొన్న వైష్ణవం; కిం వదంతి ప్రవాహము; ముద్రాక్షర శోధనము (proof reading); చిప్పగుర్తులు (brackets); పగులు మొగ్గలు (blooming buds); బిత్తలి కవిత్వము; (దిగంబర కవిత్వము) —— మొదలైనవి.

మనకు స్వరాజ్యం రావడానికి పూర్వమే రేడియో ప్రచార సంస్థకు "ఆకాశ వాణి" అనే పదాన్ని సూచించిన ఘనత రాళ్లపల్లి వారిదే!

ఇంచుగాగమము చేర్చి క్రియాపదాలను విలక్షణంగా ప్రయోగించడం కూడ రాళ్లపల్లి రచనలో కనిపిస్తుంది. ఉదాహరణలు కొన్ని :—

తలలు బోడించు కొనుట; తమపేరు మరిగించుకొనుట;

లక్షించినట్లు; స్వాగతింప వలసిన—— మొదలయినవి.

ఈ సంకలనంలో పీఠికలు రచనా కాలక్రమాన్ని బట్టి కాకుండా విషయ సాదృశ్య భేదాన్ని బట్టి కొన్ని ఖండాలుగా వర్గీకరించి కూర్చబడి వున్నాయి. ఇట్టి కూర్పు ఒక విధంగా మంచిదే అయినా పీఠికా రచనల్లోను విమర్శనా విధానంలోను రాళ్లపల్లి వారిలో క్రమంగా రూపొందిన పరిణామ స్వరూపం ఇట్టి కూర్పువల్ల సుగమం కాదు. చారిత్రక దృష్టిగల విమర్శకులు కాలక్రమాన్ని పాటించని ఈ కూర్పు పద్ధతిని గొప్పగా మెచ్చక పోవచ్చు. అయినా సంపాదకుల ప్రయత్నం నిజంగా ప్రశంసనీయమని అందరూ చెప్పగల మాట!

మనోజ్ఞమైన రాళ్లపల్లివారి పీఠికల సంపుటికి నన్నొక పీఠిక వ్రాయమని ఆదేశించిన డా. ఆర్వీయస్. సుందరం గారికి కృతజ్ఞత చెప్పడం

నా ధర్మం. 'శిలాపురి' మహోదయుల పీఠికలకు పీఠిక వ్రాయదగిన శక్తి సామర్థ్యాలు నాకు లేవు. వారి ప్రతిభా పాండిత్యాలకు సర్వదా ముగ్ధుణ్ణై కైమోడ్పుతో నేనందచేయదగిన పీఠికార్చన మాత్రం ఇది. ధన్యోఽస్మి.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం,
తిరుపతి

జి. యన్. రెడ్డి

XV
తొలిపలుకు

విమర్శను ఒక కళగా భాసింప జేసిన వారిలో శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ముఖులు. ఛందో బద్ధ రచనలలాగా గుర్తుపెట్టుకోదగిన సుందరవచనరచన చేయడం ఆయనకే చెల్లుతుంది. . వివిధ గ్రంథాలకు అనంతకృష్ణులవారు వ్రాసిన అందమైన పీఠికలు అలవోకగా, అనాలోచితంగా, ముఖపీఠికోసం వ్రాసినవి కావు. 'కొండ అద్దమందు కొంచెమై ఉండదా' అన్న వేమన సూక్తిలాగా చిన్న మున్నుడిలో కూడా రాళ్ళపల్లివారి వ్యక్తిత్వం ప్రస్ఫుటమవుతుంది. వారి సహృదయత, ప్రామాణికత నిశిత పరిశీలనాదృష్టి, భాషాశిల్పం పీఠికల్లో ప్రతిబింబిస్తూ ఉంటాయి.

'పీఠికలు' అన్న పేరుతో ప్రచురితమైన ప్రకృత గ్రంథంలో తొలిపలుకులు, ఆశీర్వచనాలు, మంగళాశాసనలు, సంపాదకీయాలు, పరిచయాలు, కొన్ని అభిప్రాయాలు ఉన్నాయి. మరీ లేఖాప్రాయంగా ఉన్న అభిప్రాయాలను వదలి వేయడం జరిగింది. షష్టిపూర్తి కూడా చేసుకున్న రాళ్ళపల్లివారి పీఠికారచనలో భాషాపరంగా ఒక క్రమపరిణామం గోచరిస్తుంది. అందువల్ల ఈ పీఠికలను కాలక్రమంగా కూర్చి ఉంటే బాగుండేదని డా. జి. ఎన్. రెడ్డిగారు తమ 'పీఠికార్చన'లో సూచించారు. వివిధ సారస్వత ప్రక్రియానుగుణంగా పీఠికలను వర్గీకరిస్తే, విషయపరంగా రాళ్ళపల్లివారి పీఠికలలోని రచనా విధానం సువ్యక్తమవుతుందని మేము అభిప్రాయ పడ్డాము. ఒక్కొక్క అధ్యాయంలోనూ పీఠికలు కాలక్రమాన్ను సరించే కూర్చబడి ఉండడం చేత భాషాధ్యయనం చేయగోరే వారికి కూడా ఇబ్బంది ఉండదు.

రాళ్ళపల్లివారి పీఠికలను గూర్చి ప్రత్యేక పరిశ్రమ చేసినవారు ఆచార్య జి. ఎన్. రెడ్డిగారు. రాళ్ళపల్లి వారికి నిరుడు మేము సమర్పించిన 'అనంతరాగం'లో పీఠికలను గురించిన డా. జి. ఎన్ రెడ్డిగారి పరిశోధన వ్యాసం ఒక మణిపూస. నిరంతర సాహిత్యార్చకులైన డా. రెడ్డిగారు అనంతకృష్ణులవారి సారస్వతమూర్తికి 'పీఠికార్చన' చేయడానికి అంగీకరించడం మా అదృష్టం.

రాళ్ళపల్లివారి చేత పీఠికలు వ్రాయించి, పుస్తకగ్రంథం రూపొందడానికి ముఖ్యకారకులైన తిరుమల-తిరుపతి దేవస్థానం వారికి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వారికి, సంగీత నాటక అకాడెమీ వారికి, వివిధ ప్రచురణ సంస్థల వారికి, గ్రంథకర్తలకు మా కృతజ్ఞతాపూర్వక వందనాలను అర్పించుకుంటున్నాము.

రాళ్ళపల్లివారి సన్మాన సందర్భంగా (19-2-1977) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారు ఇచ్చిన రూ. 4000 ధన సహాయం ఈ పుస్తక ప్రచురణకు ఎంతో ఉపకరించింది. వారికి మా నమస్సులు.

రాళ్ళపల్లివారి సాహిత్యసేవను గూర్చి పరిశోధన చేసిన శ్రీ ఎస్. చంద్రశేఖర్ మాకు దొరకని ఎన్నో పీఠికలను ఇచ్చి తోడ్పడ్డారు. శ్రీ ఆర్. ఎ. జయంత, డా. పి. వి. అరుణాచలం, డా. అక్కిరాజు రమాపతి రావు, శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి, శ్రీ నాగళ్ళ గురుప్రసాదరావు-ఇంకా ఎందరో సహృదయులు పీఠికల సేకరణలో తోడ్పడ్డారు. వారి కందరికీ మా ధన్యవాదములనర్పించు కుంటున్నాము.

వ్రాతప్రతిని సిద్ధంచేయడంలో సహకరించిన ఘట్టమరాజు శ్యామరావుగారికి, రాళ్ళపల్లివారి ఛాయాచిత్రాన్ని తీసిన శ్రీ టి. ఆర్. రాజయ్యగారికి, అనవరతమూ మాకు అండగా నిలిచిన డా. బెజవాడ గోపాలరెడ్డి, శ్రీ బాలాంత్రపు రజనీకాంతరావు, డా. టి. వి. సుబ్బారావు, డా. చెన్నాప్రగడ తిరుపతిరావు ఇత్యాది సహృదయుల కందరికీ మా కృతజ్ఞతలు. ముఖచిత్ర రచన చేసిన శ్రీపి.ఆర్. తిప్పేస్వామికి, గ్రంథాన్ని చక్కగా ముద్రించిన అరవింద ముద్రణాలయం వారికి మా ధన్యవాదాలు.

'రాళ్ళపల్లి పీఠిక' ప్రచురణతో రాళ్ళపల్లి అభినందన సమితి కార్యకలాపాలు పరిసమాప్తి చెందాయి. ఈ మహాప్రయత్నంలో మాకు తోడ్పడిన అందరు మహానుభావులకూ నమశ్చతాలను సమర్పించు కుంటున్నాము. ముఖ్యంగా మమ్మల్ని ఆశీర్వదించి, ప్రోత్సహించిన రాళ్ళపల్లి వారికి మా కృతజ్ఞతలు. భాషాపర శేషభోగి, నిర్మల ధర్మకర్మ దీక్షాపరతంత్రులు, ఆచారాధ్యాపన తత్పరులు అయిన అనంతకృష్ణువారిల పీఠికాకుసుమాల సుగంధం తెలుగువారిని అలరించగలదని నమ్ముతున్నాము.

సంపాదకులు

విషయసూచిక

ప్రాచీన కవిత్వం

వేమన పద్యములు	...	...	1
అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము 7)	...	...	22
అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము 8)	...	...	23
అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము 9)	...	...	25
అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము 10)	...	...	27
కాళ్ళపాక పాటలు (సంపుటము 1)	...	...	29
శ్రీమదాంధ్ర భాగవతము	...	...	39
అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము 11)	...	...	52
శృంగార సంకీర్తనములు (సంపుటము 12)	...	...	56
కాళ్ళపాక పాటలు (సంపుటము 2)	...	...	59
శృంగార సంకీర్తనములు (సంపుటము 13)	....	....	61
శృంగార సంకీర్తనలు (సంపుటము 19)	....	....	63
శృంగార సంకీర్తనలు (సంపుటము 20)	....	....	79
పాండురంగ మాహాత్మ్యము	....	....	81
శృంగార సంకీర్తనలు (సంపుటము 22)	....	....	116
కాళ్ళపాక అన్నమయ్య పాటలు	....	....	118

ఆధునికకవిత్వం

మీరాబాయి	....	....	121
కొక్కారు మెఱుగు	....	....	123
రాణాప్రతాపసింహ చరిత్ర	....	....	130
శ్రీ చౌడేశ్వరీ మాహాత్మ్యము	....	....	131
యాతికుడు	....		136
శివభారతము	....	....	137
శ్రీ దండక రామాయణము	....	....	142
కళాజీవి	....	....	146
అనుభవామృతము	....	....	149

శాశ్వతము	....	....	153
బుద్ధగీత	....	....	158
నాగార్జున సాగరం	....	....	159
పెనేటి పాట	....	....	165
గంగిరెద్దు	....	....	170
తెనుగుమీరా	....	....	176
సుధాబిందువులు	....	....	188
ఆనందభిక్షువు	....	....	190
గ్రామసీమ	....	....	192
గాథా సప్తశతి సారము	....	....	194
శ్రీ వేంకటేశ్వర శతకము	....	....	211
సర్వజ్ఞుని వచనములు	...	...	213
శ్రీయతిరాజీయము	...	...	216
శ్రీరామ నిర్వేదము	...	....	226
సీతా ఉపవాసము	....	....	229
ఆంధ్ర పద్యగీతాంజలి	....	....	231
సుందర పాండ్య విరచిత ఆర్య	....	....	233
శ్రీ రఘునాథీయము	....	....	240
స్వాతంత్ర్యవీరుడు	....	....	245
శ్రీ కృష్ణతాండవము-గోపికాలాస్యము	....	....	247
త్యాగశిల్పము	....	....	250
ద్రోణప్రశస్తి	....	....	253
అపవాదు	....	....	256
స్వప్న శీతావలము	....	....	257

నాటకాలు

ముద్రారాక్షసము	....	....	263
ధ్రువవిజయము	....	....	267
శ్రీశైల మల్లికార్జున మాహాత్మ్యము	....	....	269

నవలలు-కథలు

లీలాదేవి	....	....	275
పరంతప విజయము	....	....	276
పగడాలు	....	....	278

వ్యాసములు-విమర్శలు-పరిశోధనలు

వేమన	...	....	283
వదరుబోతు	....	....	284
ప్రబంధ నాయికలు	....	....	289
సాహిత్య సంపద	....	....	292
ఆంధ్రుల సాంఘిక చరిత్ర	....	....	294
సారస్వతా లోకము	....	....	300
ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము	...	....	301
భాసుని రామనాటక మూలములు	....	....	307
సమగ్రాంధ్ర సాహిత్యం (సంపుటం 8)	....	....	311
వేమన చరిత్రము	....	....	318
సాహిత్య తత్త్వము-శివభారత దర్శనము	....	....	324
జానపద కళాసంపద	....	....	327
క్షేత్రయ్య పదసాహిత్యం	....	....	331
తాళ్ళపాక కవుల పదకవితలు	....	....	338

ఇతరములు

శ్రీకృష్ణ భూపాలీయము	....	....	349
నూతన సంస్కృత వ్యాకరణ బాలబోధినీ	....	....	351
శ్రీరామానుజ ప్రభావ కల్పకము	....	....	353
శబ్దప్రపంచం	....	....	356
వృత్తరత్నావళి	....	....	366
తాళ్ళపాక వారి పలుకుబళ్లు	....	....	370
సంగీత సంప్రదాయ ప్రదర్శని	....	....	373

ప్రాచీన కవిత్వం

వేమన పద్యములు

ఫలాపేక్ష లేక, యితరులను సంతోషపఱుచుటకుఁ గాక, తాము చేయుపనికి భవిష్యత్కాలమునఁ గలుగఁగల విలువను గమనింపక, కేవలము జిహ్వాచాపల్యమును దీర్చుకొనుటకై స్వాభావికముగఁ గవన మల్లువారు వేవాఙ్మయమునఁగాని యనేకు లుండరు. కావ్యమును దమ యిచ్చవచ్చినట్టు తీర్చుటచేఁ గలుగు మానసికానందము, పరాభిప్రాయ ములకు దాసులై చేయుటచేఁ గలుగు బాహిరసౌఖ్యానందములకన్న వేయిరెట్లు నిష్కల్మషమును నిస్సీమానమును నైనదనుతత్త్వమును గమనించిన కర్తలరుదు. తాతలమతము, తమఁబోషించు పాళయగాండ్ర మతము, ఈరెంటి ననుసరించుటకుఁ బోయియాండ్రకవులు తమసారస్వ తమును నలుదిక్కుల బంధించిరి. కాని, యీతాళ్లను ద్రెంచికొను సామర్థ్య ముగల కవులుగూడ నందందు భాగ్యవశమున లేకపోలేదు. త్యాగరాజు, క్షేత్రయ మొదలగువారు నిదర్శనభూతులు. ప్రాయికముగ నీతిబోధకై యేర్పడిన శతకకర్తలనేకు లీడ్చివారే.

ఈతెగకవులపద్ధతి యిది: జనసామాన్యముయొక్క నింపనము నందనము రెండును 'వీరికొకటే: నీకవనము బాగుగ లేదు. నీరస' మని యెవరైనఁ దిరస్కరించిరేని యది బాగుస్సదనికాని యందు రసము గల దని కాని వారితో వాదించి స్థాపించవలసినది లేదు. వీరలు సూతనముగ నభిరుచిని గల్పించువారేకాని యున్నయభిరుచికే యుదాహరణము లిచ్చు

పీఠిక, 1917.

† వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, చెన్నపురి.

వారు గారు. మఱియు లేనియభిరుచిని గల్పించవలయునను నుద్దేశమును వారి కుండదు. కాబట్టియే కవిత్వమనుపేరు విన్నమాత్రమున సామాన్యముగ దాని కావశ్యకము లని మనకు దోచునట్టి వ్యాకరణశుద్ధి, ఛందోనియమము, అలంకారవిభేదములు మొదలగు సారస్వతనియమములను వీరు గమనింపరు. మఱియు నొక్కొక్కని కవిత్వము జదివినప్పు డెల్ల వానివలె వ్రాయవలయునను పిచ్చిపట్టి, నేడు తిక్కనవలె, రేపు రవీంద్రనాథుని వలె, మరునాడు మఱొక్కనివలె వ్రాయబోయి మూడును జెడిన నేటి యంగడికవు లనేకులవలె నొకదారి తెన్ను లేనిబదుకు బ్రతుకువారుగారు. ఇచ్చవచ్చినప్పు డిచ్చవచ్చినట్లు తమంతట గవిత్వమును పాడుకొని సంతోషించుటయే వీరిభావము. అట్లగుటచే వీరికవిత్వమున కొకపరిణామముగాని లేదు. మఱియు నేభావ మెప్పుడు దోచునో దాని నప్పుడు పద్యరూపముగానో పదరూపముగానో యల్లుకొని పాడి సంతసించుట, తరువాత మఱచిపోవుట తప్ప, తమకు స్ఫురించిన భావము యుక్తమా, యయుక్తమా, నీతియా, దుర్నీతియా, సకారణమా, నిష్కారణమా యసుచర్చలు జేయరు. తార్కికులకును ధర్మప్రవర్తకులకును దగిన యాకార్యకారణభావ విమర్శము వారిహృదయముల కంటని తత్త్వశాస్త్రము. కావ్యనవే వారిభావములు కొన్నిదుర్నీతి ప్రదములని మనము నిరసించుటయు, మఱికొన్నిటి ననుభవించి సత్కావ్యనము చేయజాలక పిచ్చికూతలని తిరస్కరించుటయు సంభవించుచున్నది. వీరియందు సామాన్యముగ దానుసరించు పద్ధతులే సరోత్తమములనుట, యితరులను నిర్దాక్షిణ్యముగా ఖండించుట మొదలగు నభిమాన గుణములు మెండుగానుండును.

వేమన యీజాతిలో జేరినకవి. ఇతని కాలమును గూర్చి మన కేమియు నాధారము లభింపదు. శాసనాద్యాధారములు ప్రతిష్ఠించు రాజుల నాశ్రయించి జీవించుచుండిన ప్రబంధపురాణకవు లేయనేకులు నేటి కింకను నేకాలమునకును జేరకయుండగా, ఈ ప్రపంచమందే జిహ్వస గలిగి నిరపేక్షుడై సిద్ధుడైన వేమనవంటివాని కవనమున నాతనికాలము నిర్ణయించుటకు దగిన యాధారము లుండు నని యాశించుట నిరర్థకము, మఱియు

గొంత వ్యాప్తిని సంపాదించిన ప్రాచీనపురుషులవిషయమున లేనిపోని కథలను దమకును దెలియకయే యల్లుట జనసామాన్యస్వభావము గావున నట్టివేమనను గూర్చి వాడుకలోనున్నయట్టి కథలన్నియు బ్రకృతవిమర్శకాధారము లనిభావించుట యుక్తము కాదు. కొందఱు భావించినట్లితఁడు పదునైదవ శతాబ్దివాఁడైనను, బ్రౌనుదొరగారు భావించినట్లు పదునేడవశతకమువాఁడైనను గావచ్చును. రెండును గాకపోవచ్చును. ఎందుకనఁగా రెండుసిద్ధాంతములును నిష్కారణములు. కావున నవియన్నియు విడిచి వేమనపద్యముల నుండియే మనమేయే విషయములఁ ప్రగహింపఁగల్గుదుమో చూతము. అంతమాత్రమే సత్యమని నమ్మఁదగదు.

ప్రకృత మనేకులచేఁ బ్రకటింపఁబడిన వేమన పద్యములను జూడఁగా నవి మూఁడువేలకుమించినవని తేలుచున్నది. ఇంకను గొన్ని తదీయ పద్యములు కీలవదంతీ పత్రవాహమున మునిఁగిపోయినవని కూడ మనము నమ్మవచ్చును. అతఁడే యొకచోట 'వాల కందనిపద్యముల్ వేలసంఖ్య' గఁజెప్పితి నని వా కొనుచున్నాఁడు. అతఁడే వచింపఁగా విన్నవారును వారినుండి విన్నవారును, ఎంతవరకు జ్ఞప్తియం దుంచుకొనగల్గిరో యన్ని పద్యములలో గూడ కొన్నిమాత్రమే ప్రకాశకులకు లభింప గల్గినవి. తెనుఁగు దేశమంతయు గాలించి చూచుట యే ప్రకాశకునకుఁ గాని యసాధ్యము. మఱియు నీతఁ డన్యములు తెనుఁగుదేశమందే కాక కన్నడపు దేశమందును వ్యాప్తిఁ గాంచినవి. కర్ణాటవాఙ్మయమున 'సర్వజ్ఞమూర్తి' యను కవియొక్కఁడు గలఁడు. అతడు సర్వవిధముల వేమన్న ననుకరించువాఁడు. వేమన యందలి సుగుణదుర్గుణము లన్నియు సర్వజ్ఞునియందును గలవు. తెనుఁగున వేమన కెంత మర్యాదగలదో సర్వజ్ఞునకు కన్నడమున నంత మర్యాద గలదు. వీరు సమకాలికులని కర్ణాటకుల వాడుక. దానికిఁ దగినట్లు .సర్వజ్ఞవేమన్న సంవాద' అనుపేర నించుమించు సమానార్థకము లగునిరువుర పద్యములను ప్రథమముగా నొకబజారువర్తకుఁడు కన్నడమునఁ బ్రకటించినపుస్తకమును నే జూచియున్నాను. సర్వజ్ఞుఁడు సుమారు నూట యేఁబదియేండ్లలోపలివాఁడని కన్నడపువారి నమ్మకము. అంతే కాని వేమన కాలచరిత్రాదివిషయమున పున కెన్నిసందేహములు గలవో సర్వజ్ఞు

ని కాలచర్రితాది విషయమునఁ గర్ణాటకవిమర్శకులకుఁగూడ నన్ని సందే హము లుండఁజేసే నతనివిచార మిప్పుడు మన కేమియుఁ బనికి రాదు.

మఱియు నిప్పుడు ప్రకటింపఁబడిన పద్యములలో వేమన ప్రాసిన వన్నియుఁ గల వని యెట్లు చెప్పలేమో. యట్లే ప్రకటితపద్యము లన్నియు వేమన చెప్పినవే యనియుఁ జెప్పలేము. వేమన వంటిసర్వజనీనుఁ డగుకవి లభించినపుఁడు పక్షపాతములఁదు వేయకుండిరేని హిందువులకుఁ గులము తప్పుగదా ! తమతమ యభిప్రాయములకు గౌరవముకావలయునని వేమనమతముపారును తద్విరుద్ధమతముపారును అతనియంకితమునే యుంచు కొని పద్యముల రచించి చేర్చినారు.

"వైష్ణవు లనునట్టివార్తమాత్రమె కాని
ప్రజలఁ జెఱుతురయ్య భ్రష్టులుగను"

అని సోరునిండ వచించినవాఁడే మరల వేఱుచోట

'ప్రాణికోటు లెల్ల బరఁగ వైష్ణవులయా'

యని వచింపఁగలఁడా? మఱియు నెవఁడు 'భరణీసురులకన్న దాసరిమత మెచ్చ'గా భావించెనోయతఁడే మరల

"తిరుమలకును బోవఁ దురక దాసరి గాఁడు
"కాశి కేఁగఁ బంది గజము గాదు
వేఱుజాతివాఁడు విప్రుండు గాఁడయా"

యని చాటు నని యూహింపనగునా? ఇట్లే

"వదరి వదరి వదరి వాఁడు రం డాయెను
తిరిగి తిరిగి తిరిగి ద్రిమ్మ రాయె
మునిగి మునిగి మునిగి ముండమై పోయెరా"

యనుపద్యమునకును,

"దేవతార్చన జపతప తీర్థయాత్ర
దానధర్మముల్ క్రతువులు దలచి చూడ
పుణ్యసాధనవృత్తులు పుడమిలోన"

అను పదాంతరమునకును ఎంతశత్రుత్వము గలదో మనకు దుర్గ్రహము

గాదు. మఱియు,

"నస్య మేసినవాఁడు నరలోకపూజ్యుండు
నస్య మేయనివాఁడు నంబివెధవ"

ఇత్యాది కృతక వేమనపద్యములను తెనుగువారంద ఱెఱుఁగుదురు.

కాని యొకమాట. ప్రకృతము మనకు లభించు వేమనపేరిపద్య ములలో తొఁబదివాళ్లాతనివేయని నిక్కముగా నమ్మవచ్చును. కారణ మేమనగా, కవియం దొకగొప్ప ప్రామాణ్యజ్ఞానము లేదేని యందు ప్రక్షేపముల జేర్పగోరువారు చాలమంది యుండరు. వేమనవాక్యము లన్నియు వేదవాక్యములుగా భావింప బడ వలసినంత ప్రామాణ్యము నాతఁడు సంపాదించి యుండెనేని యతనిపద్యములు నేఁటికి నాల్గువేదములసం ఖ్యను మీఱి యుండును. అదృష్టవశమునఁ దెలుఁగువారికి వేమనకవిత్వమం దెంత రుచియున్నదో యంతగూడ ప్రామాణ్య మాతనియందులేదు. కారణ మతఁడు విద్యావంతుడు గాకపోవుటయే. ఏ ఖైరాగి యుపదేశముచేతనో యోగసిద్ధాంతరహస్యములఁ గొన్నిటి ననుభవ పూర్వకముగా గ్రహించి, యాత్మ బ్రహ్మాద్వైతమతము నాశయించి యదియే శాశ్వతసిద్ధాంతముగా నమ్మి, ప్రపంచవ్యవహారముల నన్నిటిని దిగవిడిచి, యాపిషయములనే నోటికివచ్చిన తెలుఁగున బోధింప మొదలిడినఁవాడే కాని, కొంతవిద్యా గంధము గలవారి నార్జింపగల పాండిత్యాదిగుణము లేవియు వేమన సంపాదించినవాఁడుగాఁడు. ఇతఁడు చింతామణీమంత్రోపదేశభావముచే 'వేదవేదాంగాది సమస్తవిద్యలను' నేర్చినవాఁడని కట్టుకథలు ఘోషించుచున్నను ఇతనిపద్యములలో నొకటియు నాగంధమునైనఁ జూపదు. 'వేదసార మెల్ల వేమనయే యెఱుఁగు' నని యతఁడు చెప్పుకొనుట నాకుఁ జూడఁగా బడాయి మాటతప్ప వేఱుగాదు. కావున శాస్త్రీయవాగ్వాదము లచే సిద్ధాంత ముగా నిర్ణయించుచు, ప్రాచీనపద్ధతులను నిస్సందేహముగా నాచరించు విద్యావంతులగువారికిని, వారిశిష్యులకును, ఈతనియెడఁగాని యీతనిబోధన లయెడఁగాని భక్తియుఁ బ్రామాణ్యమును జనింపదు. వాచాలుఁడైనవాఁడు వేయుప్రశ్నములకు ధీరముగా సకారణముగా ప్రత్యుత్తర మిచ్చుట కెవరి చేతఁగాదో, విద్యలేక పోవుటచేదన్మూల మగు కారణవిమర్శశక్తి లేక యె

వ్యరిహృదయములు, ప్రాపంచిక వ్యవహారనివృత్తి, నిష్కామ ప్రవృత్తి,రస వాదము మొదలగు గుణములచే సులభముగా వశీకరింపఁబడునో యట్టి పామరజనులకుమ్రాత మీతనివంటివానియెడ భక్తి గౌరవాదులు జనించుట స్వాభావికము. అట్టివారిలో ననేకులకు పక్షేపించుసామర్థ్యముండదు. ఇంక పండితుల కితఁడు 'వెట్టివేమన' యనియే జ్ఞానము గలదు కావున వారి కాయావశ్యకత లేదు. కాఁబట్టి యవివేకపామరజనుల రంజించుటకుఁ బూనుకొన్న యర్ధపండితులైన యాచార్యపురుషులవంటి కొందరుమ్రాత్రము, 'వేమన యిట్లు చెప్పినాఁడే' యన్న 'అట్లుగాదిట్లు గూడఁ జెప్పినాఁ' డని వాఁనోరు మూయుట కనువుగా నతనిపద్యములవంటిపద్యములనే కల్పింప వలసి యుందురు. కావున సామాన్యముగ వేమనపేరిపద్యములలోఁ జాలవఱి కతఁడు రచించినవే యని నమ్మట యుక్తము. ఏపద్యములు సంపూర్ణ ముగాఁ బూర్వోత్తరవిరోధమును స్పష్టముగాఁ జూటునో, యట్టి పైఁజెప్పిన పద్యముల వంటివి ప్రక్షిప్తములని నమ్మక తప్పదు.

జాతిచే నితఁడు కాఁపువాఁడు. ఇతని సంతతివారు నేఁటికిని కడిరి తాలూకాలోని నల్ల చెఱువు, కటారపల్లి గ్రామములలో నతనిసమాధికిఁ బూజా దులు నడుపుచు ధర్మకర్తలైయున్నా రని వినుచున్నాను. ఇతఁడు కర్నూలి యనవేమారెడ్డి కుటుంబమునకు సంబంధించినట్లును వాడుక కలదఁట.

కలియుగమున నున్నకాఁపుకులానకు
వేమన తనకీర్తి వికృయించె
నున్నధర్మ మెల్ల నుర్వీలో నొరులకుఁ
గొల్లబెట్టెఁ బరము గోరి వేమ."

యనుపద్యము వేమన చెప్పినదైనను కాకున్నను ఈ విషయమున బూర్తిగా సాక్ష్య మీయఁజాలదు. మఱియు

ఒరులకొఱకు భూమి నొరసెడువారును
అవనిపతికి వశ్యు లైనవారు"

నగు కాఁపువారికులమును పాలవంటికులముగా వచించుట ముఖ్యముగా స్వజాతీయం దితనికిఁ గలనిష్కల్మషాభిమానమునే సూచించుచున్నది. కావున బౌనుదొరగా నితనిని జంగాలజాతిలోఁ జేర్చుట న్యాయము గాదు.

జంగాలమతము లింగధారిమతము. వేమన యభిప్రాయము పగ్గారము 'లింగధారికన్న దొంగలులేరు' మఱియు

".....శిలలింగంబు
నిష్ఠ మీఱి మెడను నీల్గఁ గట్టి
కష్టపడుటె కాని కలుగదు మోక్షంబు."

కావున 'ఈమత మొక్కటిమాత్రమే యతఁడు నిందింపని' దని వా రను కొనుట పొరఁబాటు. ఇతఁడు వాస్తవముగ నిందింపనిది కాఁపుజాతియొక్కటే.

"వాగు లడ్డగట్టి వల్లకాడులు దున్ని
మును నడిచెడి ప్రోవ ముల్లుగొట్టి
పైరుఁ బెట్టునట్టిపాపులు గలరొకో!"

యని యొకచో నితఁడు వచించినపద్యము, ఎన్నఁడో యొకనాఁడు తొలుత పచ్చినదాకివేఁటనె రాఁబోయి, యది తోఁటగా మార్పఁబడియుండి ముండ్ల కంచెచే నావృతమై యుండఁగాఁ గని తిరిగి పోవునంతటియోర్పు లేక యాకస్మికముగాఁ దిట్టినతిట్టే కాని యొకకాఁపుజాతిని నిందించుటయే కాదు. ఈకార్యము విప్రులాదిగానందఱును జేయునదే కావున నీయాశీర్వాదమున కఁదఱును భాగులే.

జన్మమును గాక యాచారమునుబట్టి నిర్ణయింపఁ జూచెదమేని వేమన కే జాతియు లేదు. నాకుఁ జూడఁగా జాతి భేదములు ఖండింపఁ బూనినయాం ధ్రులలో వేమనయే మొనటివాఁడని తోఁచెడిని. ఇప్పటివారు దేశాభివృద్ధికి భంగకర మని జాతిభేదము వలదందురు. కాని వేమన కట్టి యుద్దేశము లేపియు లేదు. సముదాయముయొక్క యిహలోక సౌఖ్యమునకన్న నొక్కొ క్కని పరలోకసౌఖ్యము ముఖ్యముగా గమనింపఁదగినది. శమదమాదిగుణ ములు దానికి సాధనములే గాని జాతిభేదాదు లచేఁదద్వ్యతిరిక్తము లగుహిం హంకారాదులు బలియును గావున నివి ముక్తికి సాధనములు గావు. ఇవిగాక జన్మములో నెచ్చుదక్కువలు రావు. నిజము చూడఁగా 'ఇందు నందు శివుఁడె యేకమైయుండును' గాన, 'కులము హెచ్చుతగ్గుకొదవలు పనిలేదు' మఱియు 'గౌరవమునకు ముఖ్యకారణ మెఱుక' 'ఎఱుకలేనివార లేజాతి యైనను, మాలకంటె చెడుగు'. ఇందు 'మాల' పదముగూడ నీచార్థబోధకమే కాని జాతిదక్కువను బోధింపదు. మాలవాడైనమ 'ఆత్మమీదను మనసు

నిల్వనేని మాల గాఁడు'. ఇతనిమతమున మాలలకును ఇతరులకును భేదమే మనగా : మాలవాడు గోవుమాంసము దినును ; తదితరులు క్రొవ్వు (నేయి) తిందురు. ఇంతే. ఇట్లు హిందువులలోని యవాంతర భేదములను ఖండించుటయేకాక 'అన్నిటఁ బరిపూర్ణమల్లామహాత్మ' డని చాటుచు దేశభేదప్రయుక్తమగు జాతిభేదమును గూడ నిరాకరించినవాఁడితఁడు.' తమకు భేదమైన దత్త్వంబు భేదమా ?' యని యతని ప్రశ్న. కావున,

"ఉర్వివారి కెల్ల నొక్కకంచమునఁ బెట్టి
పొత్తు గుడిపి కులము పొలియఁ జేసి
తలను చేయిఁ బెట్టి తగనమ్మఁ జెప్పరా !"

యని యుద్ఘోషించినాఁడు.

ఇట్లు మనుష్యజాతికెల్ల నభేదమును స్థాపింప మొదలిడినవాఁడు కావుననే యందఱిలో నగ్రజాతి యని పిలువఁబడెడు బ్రాహ్మణుల నితఁడతి తీవ్రముగా ఖండించెను. జన్మముచే శూద్రతుల్యుఁడై యుపనయనాదికర్మముచే బ్రాహ్మణుఁడగు నని ద్విజు లాడుకొనువాదమున కితని ప్రతిప్రశ్న యేమనఁగా : 'నీతల్లి కెట్లు ద్విజత్వ మని ? ఆమె కుపనయనము లేదుకదా ! ఇంక 'తల్లి శూద్రురాలు తా నెట్లు బ్రాపఁడు ?' ఇంక 'సతికి శూద్రతనము సర్వదాను !' ఇట్లుండ 'ద్విజుఁడు నే ననఁగ నధిక మేమి తనవల్ల ? కాఁబట్టి సత్య మేమనఁగా,

"బ్రాపఁ డనఁగ నేమి ? భక్తుఁ డనఁగ నేమి ?
జోగి యనఁగ నేమి ? సొంపు లేక
యెన్న పేరు లైన నినజుఁడు పని దీర్చు"

అట్లగుట ద్విజులాచరించు, ఆచరింప జేయుకర్మములలో నితఁడు మెచ్చునదొకటియులేదు. వ్రతములు, ఉపవాసములు, సన్యాసము, యజ్ఞములు, విగ్రహపూజ ఉపనయనము, తీర్థయాత్ర మొదలగునవన్నియు నితనిఖండనమునకు లోబడినవే. వారికి పరమ ప్రమాణమైన 'వేదవిద్యలెల్ల' నతనికి 'వేశ్యల వంటివి' ; ఇంక 'శాస్త్రసంచయములు సర్వపురాణముల్ జబ్బులు' ; కారణ మేమనగా : నవి 'భ్రమలబెట్టి తేటపడగ నీ' వట ! కాబట్టి 'వెట్టినక్కలవల వేదముల్ చదివెదరు' గాని 'యయ్యగార్లు' ఆశయ మెఱుగ' రట. కాబట్టి యీవైదికమతము నాశయించి 'బ్రహ్మవేత్తలమని పౌరుష మాడే' వారిలో

నెవ్వరికి గాని పరబ్రహ్మము 'తెలుపొ నలుపొ యెఱుపొ' తెలియదు. వీరి వన్నియు వట్టివేషములు. సమయమువచ్చినప్పు డందఱును 'పసిఁడిగల్గు వాని బానిసకొడుకులు. 'వారి ననుసరించు సామాన్యజను లెల్ల ఁగొయ్యగులా ములు' వారికి 'జ్ఞానము వెయ్యైనా తెలుపరాదు'!

కావున సర్వసమత్వ మితనిమతము. ఒకరి యెక్కువయు మఱొ క్కరి తక్కువయు నుండరాదు. ప్రబ్రహ్మజ్ఞానమే సాధ్యము. అదియే ముక్తి. ఁప్రబ్రహ్మ మనగ వేఱె పరదేశమున లేదు.' తానే ప్రబ్రహ్మము. ప్రతిజంతువును తనంతట బ్రహ్మస్వరూపమే. అది యెఱిఁగి దానికిని దనకు నభేదమును గుర్తించి యనుభవించుటయే ముక్తి. దానిని సాధించుటకు మున్న అహింస, జితేంద్రియత్వము, సర్వసమత మొదలగువాని నభ్యసించి గురూపదేశాధీను డై యోగసాధనమునకుఁ బూనుకొనవలయును. సోమయాజుల మనుపేర మేకపోతుఁ బట్టి మెడలువిఱుచుచు స్వర్గలోకమున రంభాసంభోగమున కాశించి 'పంచబాణునకు బానిసకొడుకులై' మే మెక్కువ యని విఱ్ఱవీగు ద్విజులందఱును తక్కిన ప్రాణులవలె 'యమునిబారి గొఱ్ఱెలై' యుండుదురే కాని వారికి 'పరమపదము రాదు.' దారపుత్రాదిసంసార మంతయును నిరర్థకము. యోగ్యులగు భార్య పుత్రుఁడు మొదలగువారు పొగడదగినవారే కాని వారు ముక్తిమార్గమునకు భంగకరులు. వారిని మనమై దగ్గరఁ జేర్చు కొనుట 'నేలమీది రాయి నెత్తి కెత్తినయట్లు' ప్రాణు లెల్ల కర్మాధీనులై యున్నను ప్రబ్రహ్మజ్ఞానముచే నాకర్మములను ప్రదెంచివేయవచ్చును. ఆ బ్రహ్మమునకు హరిహరాది నామరూపములు కల్పితములే కాని సత్య ములు గావు. రామకృష్ణాదులు దేవతలు గారు.

"కనకమృగము భువిని కద్దు లే దనకయు
తరుణి విడిచివోయె దాశరథియు
తెలివిలేనివాఁడు దేవుఁ డెట్లాయెరా?"

ఇవియే యితని ముఖ్యమతసిద్ధాంతములు. ఐన నొకటి. పరప్రబ్ర హ్మమునకు విష్ణుపర్యాయ నామములు గూడ నందందు వాడఁబడినను శివ పర్యాయనామముల నతని బేర్కొనుటయందే యితనిని జంగాలలో ప్రబౌను చేర్చుటకుఁ గారణమని తోచెడిని. కాని యితఁడు హరిహరాదు లందు నాస

విడిచినవాఁడు. 'తానె నేను, నేనె తాను' అనుటయే యితని సత్యమతము. ప్రాయికముగఁ ఋతిపదాంతమునందును ఇతఁడుంచుకొనుచుండు 'విశ్వ దాభిరామ'* యను విశేషణ మీయర్థమునే చాటుచున్నది.

ఈ సిద్ధాంతములను బోధించుటకై, పుఱీయుఁ దద్విరుద్ధము లగు ప్రాచీనపద్ధతులను ఖండించుటకై దేశములను దిరుగుచుండినవాఁ డితఁడు. కాఁబట్టియే యితనిస్థల మిదియే యని యేర్పఱుపఁగాదు. తెలుగుదేశమంతయు నించుమించుగ నితనిస్థలమే. వేమనయోగి జీవితకర్తలు 'భాషా వైఖరిని బట్టిచూడగా నితఁడు కొండవీటికి సంబంధించినట్లు గానవచ్చుచున్నది' అని వ్రాసిరి. ఆ భాషావైఖరి యేదోవారు తెలుపలేదు. కాని యితని పద్యములందు అనంతపురము కడప జిల్లాలయందు ముఖ్యముగా వాడుకలో నుండు పదములు కొన్ని గలవు. 'అలిగండ్లు మలిగండ్లు' 'తారాడక' 'దుడ్డు' (డబ్బను టకు) 'బసివి' 'సొడ్డు' 'కుళ్ళుపోతు' ఇత్యాదులఁ బేర్కొనవచ్చును. మఱియు,

"గండికోటలోన కత్తిఁ గట్టినయంత
రాజుగారి దొడ్డరౌతు గాఁడు"

అనుపద్యము గండికోట కితఁడు సమీపస్థుఁడని సూచించుచున్నది. పై గండికోట యనంతపురము కడపజిల్లాల సంధిప్రదేశమున నున్నది. మఱియు నిన్నాళ్లును కడపమండలమునకుఁ జేరియుండి ప్రకృత మనంతపుర మండలమునకుఁ జేరఁబడిన కదిరి తాలూకాలోని కటార్లపల్లిలో నితని సమాధి యున్నది. కాఁబట్టి బ్రొనుదొరగా రూహించిన ట్లితఁడు తెనుఁగు దేశము ప్రత్యగ్దక్షిణభాగమునకు (అనఁగా దత్తమండలములకు) జేరిన వాఁడే యని తలఁచుట న్యాయ్యతరము. ఎట్లును ఇతఁడాంధ్రదేశము చాలవఱకు సంచరించినాఁడని యూహింపవచ్చును. సమయముతట్టుచిన పుడు జ్ఞప్తియున్న ప్రాతపద్యముల నుదాహరించియో, నూతనపద్యముల

---

* విశ్వతా + ప్రపంచత్వము. అనఁగా నందఱును దానైయుండుట. దానిచే నభిరాముఁడని యర్థము. 'విశ్వదాభిరామ' యనుట నాకుఁజూడ నుచ్చారణవికారమే కాని వేఱుగాదు. 'విశ్వదాభిరామ' యనియు, 'విశ్వ తోభిరామ' యనియుఁ బాఠాంతరములు. మొదటిదే యుక్తము. దీనికి సంబం ధించిన 'అభిరామయ్య' కథ కాళ్లులేనిది.

నప్పుడెకల్పించియో, మాటాడుచుండువాఁడు. కావుననే యనేక పద్యములకు రూపము మాఱియున్నను లోపలియర్థ మొక్కటే. మఱియుఁ గొన్నిటికి రూపభేదమును అంతగా నుండదు. ఇంతేకాక తోఁచినమాట తోఁచినప్పుడు వచించువాఁడు గావుననే కొన్నిస్థలములఁ బూర్వోత్తరభావములకు విరోధమును సంభవించుచున్నది. వెనుకఁ జెప్పినవిషయమునే వేఱొకచోట ఖండించునట్లుదోఁచును. అట్టిచో నవి ప్రక్షిప్తపద్యము లని యొకమాటచేఁ ద్రోసివేయుదురేమోకాని నాకుఁ జూడ నది యుక్తిసహము గాదు. వేమన పద్ధతులను స్వభావమును జక్కఁగా విమర్శించిన నీవిషయము స్పష్టమ వును. పద్యము లన్నియుఁ పరస్పర సంబంధము లేనివయ్యును మూఁడు నాల్గు చేరి యొకయర్థము నిచ్చుచు నేకకాలమున ప్రాయఁబడిన వని యూహింప నెనువగునవిగూడ నందందుఁ గలవు. పోయినచోటఁ దనమాట లెవరు విందురో యట్టివారికిఁ దనయభిప్రాయములను యోగశాస్త్రమర్మ ములను ఉపదేశించుచుఁ బద్యములు చెప్పి విననివారిని బూతులు తిట్టుచు ముందుకు వెడలుచుండువాఁడు. ఇతనికి సహజమైన యాకారముతప్ప కృత్రిమ మైన యేవెలుపలిహార్పును సరిపడదు. భస్మపుండ్రాదులను ధరించుట, కావిబట్టలు గట్టుట, తలలు బోడించుకొనుట మొదలగు బాహిర వేషములన్నియు నాంతరంగికవిద్య కేమాత్రము నుపకరింపవు; ఇంతేకాక వీనియం దెక్కువగ మనము గలవాని కంతరంగశుద్ధి యుండదనియు నితని మతము. తుదకుఁ దాను వస్త్రధారణమైనను జేసినవాఁడు గాఁడు. కాపీనము మాత్ర మొక్కటిగలదేమో! అదియు సందేహమే. స్నానముగూడ నితనికి నిరర్థకమే. ఎందు కనఁగా:

"మలము మూత్రరక్తములు మాఁంసయుక్తమౌ
ముట్టుకుండ నీళ్ల ముంప నేల?
పైముటీకియె కాని లోముటీకియుఁ బోదు."

లజ్జాసంకోచాదు లతని కెన్నఁడును లేవు. 'లజ్జ గలుగువాని లాభంబు లేమయా?' యని యితనిప్రశ్న. మఱియు 'తనకుఁగల్గు సిగ్గు పైప మెఱుంగును.' ఏయూరనో యితనిని,

"గోచి తీసె ననుచుఁ గొట్లాట లాడించి
వెఱ్ఱియనుచు నూరు వెళ్ళఁగొట్టి"

రఁటు! ఎట్టి నిస్పృహుఁడైనను నిందాభినందనముల లెక్కింపనివాఁ డైనను ఇట్టి సమయములందు తన వర్తనముల స్థాపించుకొనక యుండ సాధ్యము గాదు. కావున నప్పుడు వారి కితఁ డిట్లు ప్రత్యుత్తర మిచ్చు చున్నాఁడు.

"తల్లిగర్భమునను దాఁబుట్టినప్పుడు
మొలను బట్ట లేదు మొనసిచూడ
నడుమ బట్ట గట్ట నగుఁబాటు గాదొకో"

ఇత్యాది సిద్ధాంతములను విన్నవా రితనిని వెఱ్ఱివాఁడనిన నాశ్చర్యమేమి? తన్ను వెఱ్ఱివాఁడని జనులన్నను ఇతఁడు మనస్సు నొచ్చుకొనలేదు సరి గదా, తానే తన్ను 'వెఱ్ఱివేమన' యని పిలుచు కొనుచున్నాఁడు! అతని కది యొకయానందము! కాని గురువున కున్నంత యోర్పు శిష్యుల కుండునా? పూర్తిగా వెఱ్ఱి ముదరనిది యీవేషములు నీసిద్ధాంతములును సాధువులని నమ్మి పూజించుట కష్టము. వారే యొకతూరి వినయ పూర్వక ముగా నిట్టి వేషమున కర్థమేమని యడిగిరి కాఁబోలు; నిట్లు బదు లిచ్చి నాఁడు:

"చిఱుగుబట్ట గాదు చీనాంబరము గాని
మఁటీకియొడలు గాదు ముక్తి గాని
పరమయోగిమహిమ పరికింప నరుదురా."

ఈ పరమయోగి మహిమకు వన్నె పెట్టునది రసవాదము, అనఁగా కృత్రిమముగా సువర్ణరజతాదులు తయారుచేయుట. నేఁటిప్రకృతిశాస్త్రజ్ఞులీ విషయమును సంపూర్ణముగా మిథ్య యని తిరస్కరించినను, ఇప్పుడు గూడ నావిద్యను ప్రతికరణ శుద్ధిగా నమ్మి తత్సంపాదనమునకై వేల కొలఁది వెచ్చ పెట్టువారు లేకపోలేదు. మనము నమ్మినను సరే నమ్మకున్నను సరే; వేమన్నకు మాత్ర మందు సంపూర్ణవిశ్వాసము గలదు. అంతేకాక దానిని తానే చేయ నెఱిఁగినవాని వలెనే చాటుచున్నాఁడు. ఇతనికి రెండే విద్యలు వలసినవి.

"ఇహమున సుఖియింప హేమతారకవిద్య
పరమున సుఖియింప బ్రహ్మవిద్య
కడమవిద్య లెల్ల కల్ల మూఢులవిద్య"

ఆ హేమతారకవిద్యను గూర్చి సుమారు పదునైదు పద్యములు మనకు లభించును. స్వర్ణయోగమును గూర్చిన పలుదెఱగు లందు వివరింపఁబడినవి. కాని యర్థముమాత్రము గాదు. ఎచ్చోటనో యింగిలీకముతో చిత్రమును ప్రాసియుండగా జూచి యితఁ డిట్లు చింతించుచున్నాఁడు:

"ఇంగిలీకమహిమ హేమింపనేరక
చిత్రపటమువ్రాసి చెఱిచినారు
బొంతజెముడుపాలఁ బొంగించ నేరరు"

ఎంత సులభవిద్య! ఇంగిలీకమునకు గురువు లేదు; బొంతజెముడును గన్నచోటనెల్ల నున్నది. ఐన నా 'పరమయోగిమహిమ' యెట్టిదో కాని, నేఁడు బంగారమువెల దినదినము హెచ్చుచునే యున్నది. వేమన మనల నెన్నితిట్లు తిట్టినను బాధలేదుగాని యావిద్య యొక్కటి హిందువుల కెఱుఁగఁ జెప్పియుఁడెనా మూఁడుమూర్తులను మూలకుఁ ద్రోసి వాలవ మూర్తిగా నత నికి నమస్కారములు పెట్టుచుండి యుందుము. ఇంతేకాక యితనికి వైద్య విద్యగూడఁ గొంతవఱకును దెలిసినట్లు గానవచ్చుచున్నది.

ఇట్లితని వేషచారిత్రాదు లెంతవిచిత్రములో ఇతడు బోధించునర్థ ములుగూడ నంత దుర్గ్రహములు. దుర్గ్రహము లనఁగాఁ గొన్ని యర్థమే కావు, మఱికొన్ని యర్థమైనను ఆచరింప మన కిష్టము లేదు. ఎన్నియో శతములయేండ్లనుండి హృదయము లందు స్థిరముగా నాటియున్న సిద్ధాంత ముల నన్నిటిని కల్లలని నిస్సందేహముగా మోమోటము లేక వచించి నాఁడు. సామాన్యముగ ననుభవము నభ్యాసమును లేక సత్యాపనము చేయరాని యోగసిద్ధాంతములే జీవితమును దరింపఁజేయుమార్గము లని చాటు చున్నాఁడు. వచించువానియందు నిష్కారణమైన పిచ్చినమ్మిక, భక్తి గలవారు తప్ప కారణమిమర్శకుఁ బూనుకొనువారందఱు ననుభవమాత్ర గమ్యము లైన యావిషయముల నమ్మరు. ఎఁదైన నితఁడు కారణముల వచించినను అవి దూషణమున కుపయోగించునంత సిద్ధాంతసత్యాపనముల కుపయోగింపవు. కావుననే యనేకుల కితని శిష్యులకే యితనిబోధల గ్రహింప నలవి గాకుండెను. గ్రహింపఁ జాలనివాఁకి నిదానముగా బోధించి గ్రహింపఁజేయునంత పాండిత్యమును ఓర్పును లేనివాఁడు గావున నొకచో

నిట్లు వేసరపడు చున్నాఁడు.

"ఎద్దుకైనఁగాని యేడాది తెల్పిన
మాటఁ దెలిసి నడుచు మర్మ మెఱిఁగి
మొప్పె దెలియ లేఁడు ముప్ప దేండ్లకు నైన."

ఇంతయే కాక యితనిపద్యములలో 'కూటము' లనఁబడు భావగుప్త పద్యము లనేకములు గలవు. ఏ యుద్దేశముతో నిఁ ప్రవాసినాఁడో వచింప లేను. సామాన్యముగ నిట్టి పద్యముల రచించువారికి, ఇతరుల కర్థము కానిపద్యముల ప్రాయఁగల మను నహంకారమును, ఇతరులను సభలలోఁ బరాభవింపవలయు ననుటయునుద్దేశములుగా నుండును. ఒకవేళఁ దన్ను పామరుఁడని యుదాసీనులుగా నుండు పండితులఁ బరాభవించుటకో, వారి కన్నఁ దా నెఱిఁగినవాఁడని స్వశిష్యులకుఁ దెలుపు కొనుటకో, యితఁ డిట్టివి ప్రవాసినాఁ డనియు నూహింపవచ్చును. లేక వినోదమునకుఁ గూడనిట్టివి ప్రాయుట కలదు గావున నడియే యతని యుద్దేశమైనను గావచ్చును. ఎట్లును అతని కూట పద్యముల కనేకముల కతఁడే యర్థమును వచింప వలసియున్నది. తొంబదిపాళ్లు నా కర్థము దుర్గహ మని నాయొక్కని యశక్తియైన నంగీకరింపక తీఱదు.

"మాఁటి న్మాగహించి మాఁటి విసర్జించి
మాఁటి మాఁటి మాఁటి మాఁటి రోసి
మాఁటి మాఁటి మాఁటి మాఁటనే తత్త్వంబు"

"విత్తులేనియట్టి వృక్ష మొక్కటి పుట్టె
ఫలము పువ్వు మొదటఁ బ్రతి లేదు
స్వాదు లేదు చూడ సాపాటునకు తెస్స
దీనిభావ మేమి తెలుపు వేమ."

వీనిలో, గొన్నిపద్యములకు 'తేఱమఱేఁడ' కు బదులుగా 'తెలుపువేమ' యను పదము వ్యవహార ప్రమాదమునఁ బడియున్నను బడియుండవచ్చును. ఇట్టి వానిని గూర్చియే కాఁబోలు

"వేయివిధము లమర వేమనపద్యంబు
లర్థ మిచ్చు వాని నరసి చూడఁ
జూడఁ జూడఁ గల్గు జోద్యమౌ జ్ఞానంబు"

అనుపద్య మొకటీ వేమన పేరనే యున్నది.

పైఁ జెప్పిన యోగశాస్త్రోన్మాదము, సంస్కారకత్వము, బోధకత్వము, విద్యాద్వేషము మొదలగు గుణము లతనికి బిగువుగాఁబట్టువడి యితనిని స్వాభావికముగ కఠినస్వభావునిగను, ప్రపంచపు నడువడులందే మాత్రము సానుభూతిలేనివానిగను, స్వాభిమానపూరితునిగను, ముంగోపిగను జేసినవి. ఖండింపవలయునని తోఁచినతోడనే వెనుకముందులు చూడక, బూతుసాతులు లెక్కింపక, న్యాయాన్యాయముల విచారింపక, నోటికివచ్చిన మాటలతో రెండుతుండ్లుగాఁ గత్తిరించుటయే యితనిమతము.

'వినినంతనె వేగపడక వివరింపవలెఁ'

అనుట యితఁడితరులకు బోధించినదే కాని, తనకు మాత్రము,

'కనినంతనె చూడకుండ ఖండింపవలెఁ'

అనుటయే సిద్ధాంతము. స్త్రీలు, బ్రాహ్మణులు మొదలగువారియం దితని కొకతూరి జిహాస గలిగినది. గడియవలపులు గలకొందఱు స్త్రీలును, వేషధారులై వంచకు లగు కొందఱుబ్రాహ్మణులును కారణములు గావచ్చును. ఆట్టివారు లేకపోలేదు. తన్మాత్రమున 'స్త్రీలనడవలన సిగ్గుపోయే' ననియు, 'ఇటునటుఁ బుట్టినబుషులకుఁ, బటుతర ముగఁ బుట్టినట్టిబాపనవార' లనియుఁ గారణవిమర్శాదులు లేక సముదాయమునే బూతులు దిట్టుట యితని మన్నింపరాని యపరాధములలో మొదటిది. ఇంకను నీచతరము లైన మాటలును భావములు నుపయోగింపఁబడిన వని చదువరు లెఱుఁగుదురు. 'మరుఁగు మర్యాద లేని మోటువిధముగా నితఁడుతిట్టెఁ'. అని శ్రీకట్టమంచి రామలింగారెడ్డిగారు వచించుట నాకుఁ జూడ పైమాట కోపము జనించినప్పు డారెండుపదములను వేమన వాఙ్మయమున లేవు.

నేను బ్రాహ్మణుఁడ నగుటచే నాజాతి నితఁడు దూషించినాఁ డని, యందుచే నా కేమో నష్టము కలిగినదని కాని తలఁచి, తన్మూలమున నెన్నఁడో సమాధినిష్ఠుఁ డైనవేమనపై నిప్పుడు ద్వేషము సాధించుచున్నాఁడ నని చదువరులు తలంపరాదు. ఇతనిచేదూషింపఁబడనివారు లేరు. కంసాలివారు, జంగాలు, శైవులు, వైష్ణవులు, వైశ్యులు, వేశ్యలు ఆచార్యపురుషులు మొదలగు నెవ్వరినిగాని యితఁడు మర్యాదపెట్టినవాఁడు గాఁడు.

ఎట్లో 'గంటి పల్లెముత్త' డను కొక్క డేజాతికి జేరినవాడో యితని భూషణ మునకు బాతుడైనాడు కాని తక్కినవా రందఱు కొంచెమో గొప్పమో యితనిషట్కారములకు లోపడియే యున్నారు. మొత్తముమీద జూడగా నితనికాలముననే కలియుగము మునిగి యాజలప్రళయములో హిందూశబ్ద మునకు సంబంధించిన దంతయు నూపిరాడక నశించియుండెనేని యితనికి సంతోషముగా నుండియుండునేమో! కావున నటుగాని చింత యితనిదే. మన కదేమియు బనిలేదు.

ప్రకృతము మనచింత వేఱు. వేమన నొకగొప్ప సంస్కారకునిగానో బోధకునిగానో మనము గమనింపము. అతని జీవితకాలమునందే యతని కా బిరుదము జనాంగీకృతము కాలేదు. అతనికి తనయం దున్నంతప్రత్యయము మన కాతనియందు లేదు. మనకన్నుల కతడు ప్రకృత మొకకవిగా మాత్రము కానవచ్చును. కాని సంస్కారకత్వమును కవిత్వమును అవినా భూతములై యతని నాశ్రయించి యనేకస్థలములఁ గవిత్వమును వృద్ధిఁజెంద సీక పోవుటయేకాక తప్పదారికిఁ గూడ నీడ్చిన వని యెఱిఁగి చింతింపవలసి యున్నది.

శబ్దశుద్ధి, ఛందోనియమము మొదలగునవి కవిత్వమున నంతముఖ్య స్థానము వహింప వనియాధునికులరాద్ధాంతము. అపిరెండు నంతగా గమ నింపమిచే వేమనకుఁ గాని మనకుఁ గాని యంత నష్టము లేదనుకొందము. కాని కవికిఁ గావలసిన ముఖ్యలక్షణము మృదుహృదయము, సౌమనస్యము గలిగియుండుట యని యంద ఱంగీకరింపవలసినదే. నైయితని సంస్కార కత్వాదిగుణము లీగుణము నీతనినుండీ పూర్తిగా విడఁదీసినది. కథను జెప్పుచు నితరులవాక్యముల ననువదించునప్పుడు కవి యెంత క్రూరచిత్తుఁ డుగా నుండినను జెల్లును. అందు నిందార్హుఁడనవదింపఁ బడినపాత్రమే కాని యనువదించువాఁడు గాఁడు. మఱియు నట్టిచోట్ల బరానుసరణమను శిల్ప చాతుర్యమును కవియందు మనము గమనింతుము. కాని తానై తనభావ ములను వచించునప్పుడు కవికి వలసినవి మృదుమనోభావములు: 'సంతో షము, దయ, దాక్షిణ్యము, సానుభూతి, శోకము, భక్తి, వాత్సల్యము, ప్రణయము' ఇత్యాదులు. ఇవి యెచ్చటనున్నను దమంతహృదయమును గరఁగింపఁగలవు. అట్లుగాక, జిహాస, అసూయ, రోషము, కోపము,

మత్సరము, అహంకారము ఇత్యాది తీక్ష్ణగుణములు ప్రధానములుగా నుండె నేని కవిమనోభావములతో చదువరు లేకీభవించుట సంభవింపదు. సంస్కారికే యీ గుణములు యుక్తములు గా వన్నప్పుడు కవికి వేఱు వచింపవలయునా? హృదయముల వశీకరింపఁజేసుకొనుట కవిధర్మ మే కాని వెగటు పుట్టించుట కాదు కదా! యోగ రహస్యముల నిర్వచించుపద్యములవిడిచినఁ దక్కిన యితని పద్యములలో నూటఁ దొంబదిపద్యములు ప్రైస్వభావమునే చాటుచున్నవి ఇప్పటికే యెక్కువ యుదాహరించితిని. ఐనను మఱి రెండుదాహరించెదను.

"బారెఁడేసి జడలు భస్మంపు బూఁతలు
మరునితోడ మాఱుమలయఁ గలరు
ముంజికోక లెల్ల లంజకోకల కాయె"
"ఒక్క ప్రొద్దు లున్న నూరఁబండై పుట్టుఁ
బృథివిఁ దపము చేయఁ బేదయగును
నిగిడి శీలకు మొక్క నిర్జీవు లౌదురు"
"కూలినాలి చేసి గుల్లాముపని చేసి
తెచ్చి పెట్టెనేని మెచ్చు నాలు
చిక్కపడ్డవేళఁ జీకాకుపఱుచురా"

ఇత్యాదులు. "ఇతఁడు మతబోధకైవెడలిన వాఁడేకానికవిత్వమునకై కాదు. కావున నివియితని దోషములుగా" వందురేమో! ఇతనికిఁ దాను కవి యనుభావము సంపూర్ణముగాఁ గలదు.

"రవి కననిది కవి యెఱుఁగును
కవి యెఱుఁగనిచోటు రవియుఁ గానఁడు ధరలో
రవికన్న మిగుల నెక్కువ
కవియే విలసిల్లు నీవు గానవె వేమా!"

ఇట్లైనను మనకు వేమన పద్యములం దున్నంత యాదరము భక్తియు ననేక ప్రబంధపురాణకవులయం దుండదు. కారణ మేమి! వారి యందు దట్టముగఁ గానవచ్చుదుర్గుణము పారతంత్ర్యము. శైలి, భావము,

కల్పన మొదలగువానియం దెల్ల వారు పరులకు దాసులై గీసినగీఱదాటక
యుందురు. వేమన దీనికి పూర్ణముగా వ్యతిరేకదృష్టాంతము. ఇతరానుసరణ
విషయమున నితఁడు 'తెగిన గాలిపటిము.' నావలె నే నుందు ననువాడేకాని
యొకరివలె నుండవలె ననుట కలలోఁ గూడ నితఁడు తలఁచిన వాఁడుకాఁడు.
ఈస్వాతంత్ర్యబుద్ధి కవికిఁ గీర్తిదెచ్చు ముఖ్యగుణములలో నొకటి. ఇందుచే
మనకుఁ గల్గులాభ మే మనఁగా నితని ప్రతిపద్యము నందును 'నవ్యత'
యనుగుణము తాండవ మాడుచుండును. పాతకవిసమయములు గాని,
ప్రాతదృష్టాంతములుగాని, పాతయలంకారములు గాని లేవు కావున
నొకవిధముగాఁ జెఱిచినవైనను బైసంస్కార కవిత్వాదిగుణములు వేఱొక్క
విధముగా నితనికవిత్వమునకు వన్నెఁ దెచ్చినవే. అట్లుగాక యందఱివలె
నితఁడును గురుమూలకముగ సాహిత్యాదివిద్య లభ్యసించి కవిత్వమున
కారంభించి యుండెనేనియందఱకువలె భావముల యొక్కయు, భావనాశక్తి
యొక్కయు నవకాశము సంకుచితమైయితనినోటినుండియు నేదో యొక
'పరిణయము' బైటఁబడి సముద్రములో నుప్పరాయి యగుచుండెనేమో!

ఇఁక రెండవగుణ మితనికి నాంధ్రభాష పూర్ణముగా స్వాధీనపడి
యుండుట. తక్కినకవుల కందఱకించుమించు చదివినచదువంతయు, నేఁటి
చదువాంగ్లవాఙ్మయమునకుపలె, సంస్కృతవాఙ్మయమునకుఁ జేరియుండు
టచే, వారికవిత్వము, శిఖా యజ్ఞోపవీతాదులు ధరించినయాంగ్లేయునివలె,
తెనుఁగువేషము ధరించియున్నను నిజమునకు సంస్కృతమే యగుచున్నది.
వేమన పాపముజన్మమం దైన నాగంధ మెఱుఁగనివాఁడు గావున నితని పద్య
ములలో నిజమైన తెనుఁగుజీవితము ప్రతిబింబించు చుండును. తెనుఁగువారి
మనోధర్మముల కితనికవిత్వ మొకసాటిలేని దృష్టాంతము. కావుననే పండిత
పామర భేదము లేక యని హృదయముల నంటుచున్నవి. అనఁగా సంస్కృ
తపదముల నితఁడు వాడఁ డని కాదు. వాడినను ఆ పదములన్నియు విన్న
వే కాని నేర్చినవి కావు. కావుననే భాషకు సంబంధించిన లోపము లతని
యం దేవైనఁ గలవేని యివి చాలవఱకును సంస్కృత పదములకు సంబంధిం
చినవే యై యుండును. మఱియు సంస్కృతపదభూయిష్టపద్యము లన్ని

యు యోగశాస్త్రమునకు సంబంధించినవే; వానియందుఁగవిత్వగంధమే లేదు. కావున మనకు వానిచర్చ పని లేదు. తెనుఁగులో వ్యాకరణకారు లంగీకరింపనివాడుకలోని రూపములు కొన్ని గలవుగానివాని నితరకవులు గూడఁ గొంతవఱ కంగీకరించినవారే. కావునఁ దెనుఁగు భాషలో సత్యమైన యచ్చతెనుఁగు కావ్యమును రచించినవాఁడు వేమనయే కాని, 'భూమి'కి 'బూమి' యనియు, 'బుద్ధి' కి 'బుద్ధి' యనియు మహాపౌరాణముల నల్పప్రాణములుగా మార్చుకొన్న వారి కవనమునందు అచ్చమును తెనుఁగును రెండును లేవు.

అన్నిటికన్న ముఖ్యమై హృదయము నాకర్షించు గుణము ఇతఁడు స్వాభావికముగ కవిగానుండుట. కవి కావలయువానికి ప్రకృతికూడ యెన్నిగుణముల నొసగగలదో యవన్నియు నితనియందున్నవి. వాని కితడు కల్పితము లైనమెఱుఁగులు మాత్ర మిచ్చినవాఁడుగాఁడు. ఎంతకొంచెము మాటలలో నెంతయర్థ మిమిడింపవచ్చునో యితనికిఁ గాని యితరులకుఁ దెలియదు. తక్కినగుణము కలదు గాని యీసౌలభ్య మితనియందపూర్వము. ఏమాట నేచోట నుపయోగించిన హృదయమున నాటునో యితఁడే యెఱిఁగినవాఁడు. సంగ్రహశక్తి యందలి సత్తువ యితనివలెఁ జూపంగలవాఁడు లేఁడు వీనికిఁ దోడు సహజమైన హాస్యప్రియత్వ మొకటి నిండి యున్నది. ఖండించుసమయములం దెల్ల ప్రాయికముగ రోషావిష్టుఁడై జిహ్వ నుపయోగించెను గాని, యెఱ్ఱైనహాస్యముపయోగించెనేని తలఁచుకొని తలఁచుకొని కడుపులు చెక్కలగునట్లు నవ్వఁజేయఁ గలఁడు. 'తిట్టిననుసరే బాగుగా దిట్టినాఁడురా,' యని తిట్టించుకొన్నవారే మెచ్చవలసియుండును. ఇదియే యితని యఁదలి యిన్నదజాలవిద్య!

"లోభివానిఁ జంప లోకంబులోపల
మందు లేదు వేఱె మతము గలదు
పైక మడిగినంత భగ్గునఁ బడి చచ్చు'
"సకలతీర్థములను సకలయజ్ఞ-ఫలఁ

దలలు గొరుగ కున్న ఫలము లేదు
మంత్రజలముకన్న మంగలిజల మెచ్చు”

ఇత్యాదు లనేకములు. లోకోక్తు లితనికవితలోని జీవితములు. లోకోక్తు లనఁగా వాడుకలో నున్న సామెతలను ప్రస్తావాప్రస్తావాదివివేకము లేక యుద్దేశపూర్వకముగాఁ దూర్చినాఁడని కాదు. ఇతనిజన్మమునందే యట్టి పరదాస్యమునకుఁ జోటులేదు. మఱి తానే వానిని సృజించినాఁడనుట. కొండంతయర్థమును గోరంతచోటున ముద్దు ముద్దుగా విశదముగా నితఁడు నిర్వచించుట నొకమాఱు వింటిమేని మరల నెన్నఁడును దాని మఱువలేక యవసరము సంభవించునప్పుడెల్ల దాని నే జపించు చుందుము,

‘కొయ్యబొమ్మఁ దెచ్చి కొట్టినా పలుకదు’
‘పంది బురద మెచ్చుఁ బన్నీరుమెచ్చునా’
‘తలలు బోడులైనఁ దలఁపులు బోడులా’
‘ముక్కవంకఁ జూచి ముకురంబు దూఱుట’
‘పండ్లు పడ్డకుక్క పసరంబుఁ గరువదా’
‘దాసరయ్య తప్పు దండంబుతో సరి’

ఇత్యాదివాక్యముల మాధుర్యవైశద్యములును సర్వజనీనతయు నేను వేఱి వివరింపఁ బని లేదు.

శ్రీనాథునకు సీసమును, తిక్కనకు కందమును వలె వేమన కాట వెలఁది వెన్నంటివచ్చినవృత్తము. తక్కిన వృత్తములఁ గూడ నితఁడు రచించినాడు గాని యవి యతని యాటవెలఁదిసొగసునకు దీటురావు. ఈ వృత్తమునం దితఁడు చూపినంత ప్రౌఢిమయు మాధుర్యమును శ్రీనాథుఁడు సీసమందుఁగాని తిక్కన కందమంచుఁ గాని చూప లేదనుట యతిశయోక్తిగాదు. ఇదియుఁ బ్రకృతిదత్త పద్యసాదములలో నొకటి గాని వేఱు గాదు. వృత్తము తనంతఁ జిన్నది. తెనుఁగున నింతకన్నఁ జిన్న వృత్తము వాడుకలో లేదు. అందును నాలవపాద మంకితములో ముగియును. తక్కిన మూఁడు పాదముల నడుగడుగునకు యతి నియమము వదలఁడు. యతియందును తిక్కనాదులు వాఁడునట్లు పదమధ్యవిచ్ఛేదము గాదు. యతిస్థానమునకు సరిగఁ బదమును

అనేకస్థలముల భావమును గత్తరింపబడినట్లు తునకలై పడును. అట్లని యధిక పదము లేవైనఁ గలవందమా? మందునకును దొరకవు. ఐనను, కుంతికడుపునుండి కర్ణునివలె, సద్యోగర్భముచే సహజాలంకృతమై యాటవెలఁది వేమన నోటినుండి ప్రొందికి దూఁకుచున్నది!! హృదయమునందు భావసంయోజనము, నోట బదముల రచన, ఉచ్చారణయు నేకకాలమందే యొకటితో నొకటి మాటలాడుకొని కుప్పించు చున్నవో యని యాశ్చర్యపడునట్లు చేయు పద్య రత్నము లిం దనేకములు గలవు.

"చెప్పలోనిరాయి చెవిలోనిజోరీగ
కంటిలోనినలుసు కాలిముల్లు
ఇంటిలోనిపోరు నింతింత గాదయా!"
పనస తొలలకన్నఁ బంచదారలకన్న
జుంటితేనెకన్న జున్నుకన్నఁ
జెఱుకురసముకన్నఁ జెలిమాట తీపురా!"
"జారపురుషునకు జాజిపువ్వులతోడఁ
బాన్పు వేయునయ్య పాఁతలంజ
సొంతమగనిమీదఁ జింతనిప్పులు చల్లు"

ఇట్టితనియెడ మహాకవులకుఁ గావలసిన రచనాసౌమనస్యము, వాగ్మిత్వము మొదలగు గుణములు సమృద్ధిగా నున్నవి. భావసౌమనస్యము మాత్ర మనేకస్థలములఁ గుంటుపడిన దనుట పూచదువరులకు దుర్గ్రహము గాదు. అదొక్కటి మఱచితిమేని యాంధ్రభాషలో నింతటికవి లేఁడని కంతోక్తముగా వచింపవచ్చును. మఱియు,

"వేమఁ డిట్లు చెప్ప వేయిపద్యంబులు
తప్పు లెన్నియున్న నొప్పియుండు"

నను పద్యము వేమనదైనను కాకున్నను దానిని జెప్పినవాఁడు జనులమనస్తత్త్వము నెఱుఁగని వాఁడు కాఁడనుట మున్మాటికి సత్యము.

పైంగళ భాద్రపద కృష్ణ
త్రయోదశి శనివారము

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
శ్రీమహారాజావారి కాలేజి,
మైసూరు.

o—o—o

అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము 7)

అన్నమాచార్యులు

ఇవి శ్రీ అన్నమాచార్యకీర్తనల యేడవ సంపుటము. శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఐదవసంపుటము శోధించి ప్రకటించి అకాలమున పరమపద మలంకరించిరి. ఆరవ సంపుటమును, దీనిని రేకులనుండి సవరించి ఎత్తి వ్రాసినవారు శ్రీ శాస్త్రిగారి శిష్యులై వారికి చోదోడువాదోడుగానుండిన శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులే. ఈ కీర్తనల శోధనకార్యమునకై శ్రీవేంకటేశ్వర దేవాలయాల అధ్యక్షులచే నియమింపబడి నేను వచ్చి చేయివేయుసరికి ఈ సంపుటము బహుభాగము ముద్రితమైనది. కడపటి రెండుమూడు ఫారములు మాత్రము నేను సరి చూడగల్గితిని. ఈ సంపుటమున 151 వ రేకు మొదలు 200 వ రేకు వరకును అధ్యాత్మకీర్తనలుగలవు.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారు వేసిన పథమున, శ్రీ శ్రీనివాసాచార్యుల నిష్కళంక భక్తి శక్తులు తోడుగా ఇకముందు తాళ్ళపాకకృతుల శోధన ప్రకటనములు త్వరగా జరుగగలవని యాశించుచున్నాను. కాని యీ మహా కార్యము పూర్తియగుటకు ఆ శ్రీనివాసుని మహాసంకల్పమే సాధనమై మమ్ము నడపవలసియున్నది.

ఈ కైంకర్యమునకు నాకవకాశము గల్పించిన శ్రీ వేంకటేశ్వర దేవాలయాధికారుల దయ నాకృతజ్ఞతాశక్తిని మించిన బరువు.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా పరిశోధనాలయము
తిరుపతి
30-11-51

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

పరిశోధకులు: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, ఉదయగిరి శ్రీనివాసాచార్యులు

పీఠిక, 1951, నవంబర్, 30.
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము 8)

అన్నమాచార్యులు

అన్నమాచార్యుల అధ్యాత్మకీర్తనలలో 201 వ రేకు మొదలు 250 వ రేకువరకు గల 289 సంకీర్తనలు ఈ 8 వ సంపుటముగా ప్రకటింపబడినవి. ఇక మూడు సంపుటములలో ఆయనగారి అధ్యాత్మకీర్తనలన్నియు ముగిసి ముద్రణ కెక్కగలవు. వాని సంశోధనా కార్యము త్వరగా సాగుచున్నది. అందుపై వారి శృంగార సంకీర్తనల సముద్ధరణము నీమ ప్రయత్నము చేయ వలసియున్నది. ఈదించువాడు శ్రీ వేంకటేశ్వరుడు. ఈదు కోరిక మాత్రమే మాది.

ఇందలి సంకీర్తనలలో "అటీముటీ జూడబోతే" అను 126- వదియు, 'ఈతడే ముక్తిదేవ' అను- 183- వదియు అన్నమాచార్యునివి కావనుట స్పష్టము. కుమారుడు పెదతిరుమలయ్యగారిదో, మనుమలదో కాగలదు. చెప్పినవారిదో చెక్కినవారిదో అసడ్డచే అన్నమాచార్య సంకీర్తనములలో గలిసి నవి. రేకులలోని ప్రమమును మార్చు స్వాతంత్ర్యము వహింపలేదు గనుక ఉన్నరీతినే ప్రకటించుటయైనది.

కీర్తనలన్నిటికి గాకున్నను కొన్నిటికైనను లఘుటీకవలసి ప్రకటించుట మేలని కొందఱు మిత్రులు సూచించిరి. కాని "దీన్ని గడిచి దీర్ఘాయుష్మంతుడైతేగదా పెన్నడాటి పెరుమాళ్ళసేవ చేసేది" అను సామెత పదే పదే జ్ఞప్తికి వచ్చి నన్ను భయపెట్టుచున్నది. ప్రకృత మీయుగడు పర స్పరాపకృతులను ప్రకటింప గల్గితిమేని అదే పదివేలు. అందుమీద

పరిశోధకులు : రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, ఉదయగిరి శ్రీనివాసాచార్యులు

పీఠిక, 1952, మార్చి, 15.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

అన్నమాచార్యుల భాష, కవిత, మతము మొదలగు విషయముల చర్చ యెంతో చేయవలసియున్నది. అది నాచేతనే చేయించునో నాకంటె సమర్థుల కాకైంకర్యము నిచ్చునో ఆ శ్రీనివాసులకే యెఱుక.

యథాపూర్వకముగా ప్రాచ్యపరిశోధనాలయమందలి గ్రంథ భాండాగార పండితులగు శ్రీ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు ఈ సంకీర్తనల సంశోధన కైంకర్యమందు చూపుతున్న అసాధారణ శ్రద్ధాభక్తులు అభినందనీయములు–వారికి నాయనంత మంగళాశాసనములు.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా
పరిశోధనాలయము,
తిరుపతి
15–3–52

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

o—o—o

అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము 9)

అన్నమాచార్యులు

ఈ తొమ్మిదవ సంపుటమున 251 వరేకు మొదలు 299 వరేకు వరకును గల 288 అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు ప్రకటింపబడినవి. ఒక్కొక్క సంపుటమందు 50 రేకుల సంకీర్తనములను క్రమముగా ప్రచురించుట యీవల మేమవలంబించిన పద్ధతి. 300 వ రేకు మాకు లభింపమిచే 49 రేకుల సారస్వతము మాత్రమే ఇందు చేర్చబడినది. 8 వ సంపుటమున గూడ 219 వ రేకు లభింపమిచే ఇట్లే 49 రేకులకే సంపుటము ముగింపబడినది. ఈ సంపుటమున 296- వరేకును పేర్చుకొనకపోవుట పొరపాటు. 265 సంకీర్తనము మొదలి ఆరు పదములు అసంఖ్యగల రేకులోనివి.

184- సంకీర్తనము 'ఆ రీతి తాళ్ళపాక అన్నమయ్య ఘనుడాయ వారివార మై నేము వహికి నెక్కితిమి' అనిముగియుటచే 8-వసంపుటమందలి 126,183 సంఖ్యల కీర్తనములవలె ఇదియు అన్నమాచార్యుల రచన కాదనియు, పుత్రపౌత్రులలో ఎవరో రచించినదనియు, సంకలనము చేసిన వారి పొరబాటు ఇందు చేరినదనియు ఊహింప వలసియున్నది.

యథాపూర్వముగా శ్రీ వేంకటేశ్వర ప్రాచ్య పరిశోధనాలయ మందలి గ్రంథభాండాగార పండితులు శ్రీ అర్చకం ఉదయగిరి శ్రీనివాసాచార్యులు ఈ సంపుటమును సిద్ధపఱుచుటయందు నాకు చేసిన తోడ్పాటు శ్రీ శ్రీనివాసుని పరమానుగ్రహమునకు పాత్రమైనది.

పరిశోధకుడు: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

ప్రతిక, 1952, జూన్, 18.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

తప్పొప్పుల పట్టిక యావశ్యకత లేకుండవలెనను సంకల్పముతో చిత్తులు దిద్దుట జరిగినది. ఐనను అందందు కొన్ని చిఱుతప్పులు కన్నుమీఱి నిలిచినవి. సహృదయులు వానిని సులభముగా సవరించుకొందురు.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా
పరిశోధనాలయము,
తిరుపతి
18-6-52

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
సంగీత వాఙ్మయ పరిశోధకుడు

o——o——o

అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము 10)

అన్నమాచార్యులు

ఈ పదవసంపుటమున శ్రీ అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనల రేకులలో 301- మొదలు 350 వ దాని వఱకును గల సంకీర్తనలు అనుక్రమముగా ప్రకటింపబడినవి. ఎప్పటివలెనే శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యుల సైంకర్యమిందు చాల గలదు.

ఈ సంపుటమున గూడ అన్నమాచార్యుల రచన కాజాలని 'హరి యపతారమె అతడితడు'- అనుపాట (192వ సంకీర్తన) ఎట్లోరేకులో చొచ్చుకొనియుండి ప్రకటింపబడినది. 'ఉన్నాడు వైకుంఠము' అనుమాటయొక్కచే చాలును దీనియన్యకర్తృకత్వమును తెలుపుటకు.

"ఓహోరాకాసులాల' (295) అనుపదము 2వ సంపుటములోని 146 వ సంకీర్తనమే. కొన్ని చిల్లర పాఠభేదములు మాత్రమిందు గలవు. కాని ముఖ్యమైన భేదము రెంటి రాగమునకు సంబంధించినది. ఇందలిది 'శోకవరాళి', అందలిది 'గౌళ' లో నున్నది.*

ఈరాగభేదము ఆ కాలమందే యెట్లు, ఏల యేర్పడెనో దురూహము. అన్నమాచార్యులే ఈ సంకీర్తనను వేఱువేఱు కాలములందు వేఱువేఱు రాగము

---

* ఇట్లే అన్నమాచార్య సంకీర్తనల రెండవ సంపుటమున 'బేళి' రాగమున నున్న 'వెన్నలు దొంగిలి నాటి' అను (26) వ సంకీర్తనమే 6వ సంపుటమున చిఱుమార్పులతో 'పాడి' రాగముననున్నది.

లందు పాడెనో, లేక తరువాతి అనుయాయులు వ్యుత్పత్తి కొలది, రుచికొలది రాగము మార్చిరో చెప్పజాలము. కాని సంగీతకళ యందిట్టి మార్పులు సహజములు. దుర్నిరోధములు గూడ.

పరిశోధకుడు: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.
పీఠిక, 1952, అక్టోబర్, 18.
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా
పరిశోధనాలయము
తిరుపతి
18–10–52

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

o—o—o

తాళ్ళపాక పాటలు (సంపుటము 1)

అన్నమాచార్యులు

తెలుగుసారస్వతమున కాలమునందును పరిమాణమునందును గుణమునందును ఇప్పటికి అగ్రస్థానమలంకరించినవి తాళ్ళపాక అన్నమయ్యగారి గేయరచనలు. ఇంచుమించు ఆ యంతస్తుకే రాగలిగినవి ఆయన కుమారుడు తిరుమలయ్యగారి గేయములు. తిరుమలయ్యగారి పుత్రుడు చినతిరుమలాచార్యుని రచనలును గణనీయములే. పదునాలుగువేలకు ఈషదూనముగానుండి, శ్రీ వేంకటాచలము మీది స్వామిసన్నిధిలోనే, రాగిరేకులందు రచయితలే చెక్కించి సంకీర్తన భాండారమున ఈ నాలుగు వందల యేబదియేండ్లుగా అసూర్యంపశ్యముగా భద్రపఱచియున్న యీ రచనలను వెలికిదీసి పరిశోధించి ప్రకటించుచుండు శ్రీ తిరుమల తిరుపతి దేవాలయ కార్యనిర్వాహకుల మహా ప్రయత్నము సర్వవిధముల ఆ శ్రీనివాసుల యనుగ్రహమునకును ఆ అన్నమాచార్యుల యాశీస్సులకును పాత్రమైనది.

1938 లో గాంబోలు ఈ కీర్తనలు మొట్టమొదలు నాదృష్టినాకర్షించినవి. వట్టి సాహిత్యము మాత్రము ప్రకటింపబడియుండుటచే, అది గూడ చాల సవరింపవలసియుండుట వలన, ఇంతలో ఏవో కారణములచే

ఉపోద్ఘాతము, 1952, డిసెంబరు, 13.

ఇదే ఉపోద్ఘాతము "తాళ్ళపాక అన్నమయ్య పాటలు" (స్వరపరచినవారు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, నేదునూరి కృష్ణమూర్తి) లో ప్రచురితమైనది. తిరుమల తిరుపతి దేవస్థానములు, 1976.

ఆ పాటల తరువాతి ముద్రణము కొంతకాలము నిలుపఁబడినందున వాని విషయమై కొంత యుదాసీనముగా నుంటిని. కాని యెప్పుడైనను చదివినప్పుడు ఆ రచనలందలి అసాధారణ భావనాశక్తి, భాషయందలి స్వతఃసిద్ధ మధురధార, భావములందుఁ గానవచ్చు అసందిగ్ధమైన యార్జవము, విషయ వైవిధ్యము-వీనికి పరవశము కాక తప్పినదికాదు. మీఁదు మిక్కిలి ఇవి నిబద్ధమైన గేయ ప్రబంధములుగా రచింపఁబడినవే తప్ప పద్యగద్య కావ్యములవలె చదువరికి స్వాతంత్ర్యము నిచ్చునవికావు. నిబంధించు రాగతాళములలో ఎందును—ఒకటి రెండుచోట్లఁ దప్ప—తాళమును బేర్కొని యుండలేదు. వట్టి రాగము పేరు మాత్రము సూచింపఁబడి యున్నది. రాగతాళములలో రాగముకంటె తాళమే ప్రబలతరమైనది. రాగమును మార్చినంత సులభముగా, ధారాళముగా, పాటతాళమును మార్చలేము. పాటయందలి యక్షరములు ప్రాయశః తాళగతినిబట్టియే కూర్పఁబడి యుండును. ఇట్టిచో రాగములను మాత్రము పేర్కొని, రేకులు చెక్కఁబడిన వారు తాళముల నేల చెప్పరైరో ఊహించుట కష్టము. మఱి ఆ రాగములలోఁగూడ ఎన్నో ఇప్పుడు వాడుకలో లేనివి. కొన్ని ప్రబలరాగములలో కలసి పోయినవి. మఱికొన్నిటి స్వరూపమే మనకిప్పటికి తెలియదు. తెలిసిన రాగములలోను కర్తలు ఏకృతిని, ఏ స్వరములో, ఏయే మఱుఁగు మెఱుఁగులతో ఎట్లు ఎత్తి, ఎట్లు ముక్తాయించికో తెలిసికొను మార్గము కానరాదు. రచనలు వ్రాసిపెట్టు లిపి యేర్పడనందున. సంగీతకళ మనదేశమందెంత అభివృద్ధిఁ జెందెనో అంత నష్టమును అనుభవించినది. స్వరపఱచి, తాళమాత్రలను అంగములను సూచించి ప్రాయుపద్ధతి సంగీతమునకు ప్రాయశః కడచిన శతాబ్దపు కడపటిభాగములోనే వ్యాప్తికి వచ్చినదనవచ్చును. అంతకు వెనుక గానకళయంతయు శ్రుతిపాఠమువలె, ఉపాధ్యాయశిష్యపరంపరల వాదానువాద ప్రవాహమందే నిలిచియుండెను. నే నెఱిఁగిన ప్రాచీన సంగీత విద్వాంసులందఱును పాఠముచేసిన కీర్తనలభాషనుమాత్రము వ్రాసిపెట్టుకొని స్వరరచనను శక్తికొలఁది ఏకసంధగానో బహుసంధగానో గురువుగారినుండి గ్రహించి సాధించినవారే. ఇఁక ఈ తాళ్ళపాకవారి పాటలు పాడు పరిపాటి యేకారణముల చేతనైననేమి, చాలానాళ్ళక్రిందనే క్షీణించినది.

దక్షిణదేశమంచలి నిత్యభజనక్రమములో సంప్రదాయముగా 'దేవేశ గణారాధిత' 'నారాయణ తే నమోనమో' అను నిట్టి తాళ్ళపాకవారి పాటలొకటి రెండు పాడు పద్ధతి నేటికిని కలదని విన్నానుగాని నేనెఱుగను. తాళ్ళపాక వంశీయులలోగూడ ఆ పాటఁపద్ధతినినిలుపు కొన్న వారునాకుగానరాలేదు. మఱి సంగీతము కళగా, జీవనో పాధిగా, అభ్యసించు ఆధునిక విద్వాంసులను త్యాగరాజస్వామి, దీక్షితులు, శ్యామశాస్త్రులు మొదలగు మహనీయుల యపూర్వోదార రచనలు ఆకర్షించి అంతకు వెనుకటి రచనల విషయమున అసడ్డగలుగఁ జేసినని. ప్రాచీన విద్వాంసులు వీనిని పాడుచుండిరనుటకు సందేహము లేదు. ఈ శతాబ్దము మొదటిభాగమున సంగీతరచనలు సస్వరతాళ గమక చిహ్నముగా ప్రచురించుటలో భగీరథ ప్రయత్నము చేసిన మహానుభావుఁడు ఎట్టియాపురపు శ్రీ సుబ్బరామదీక్షితులు, తన 'సంగీత సంప్రదాయ ప్రదర్శిని' రెండవభాగపు అనుబంధమున (పుట. 52) 'నామొరాలింపవే అయ్య వెంకటరమణా' అను కాంభోజిరాగ ఝుంపతాళ కీర్తనను, తన 'ప్రథమాభ్యాసపుస్తకము' నందు (పు. 101) 'శ్రీపతిపాదతీర్థమే చెడనిమందు' అను అట తాళపు శంకరాభరణ కీర్తనను, మొట్టమొదలు ప్రకటించెను *

తరువాతి యే సంగీతగ్రంథమందుఁగాని తాళ్ళపాక గేయ కారుల పేరుగూడఁ గానరాదు. పై రెండుకృతులైనను ఏ సంగీత విద్వాంసుఁడుగాని పాడఁగా నేవినలేదు. ఎవరైనను అనుభవరసి కులగు సమర్థులు ఈ రచనల సంగీతసంప్రదాయము నుద్ధరింతురేమో యని యెంతో యాసతో నుంటినికాని అట్లు జరుగలేదు.

---

*ఈ రెండు కీర్తనలును రేకులలో కానరావు. 'శ్రీపతిపాద' అనునది మాత్రము శ్రీ తాళ్ళపాక వెంకటశేషాచార్యుల వారింటి వాఙ్మయప్రతిలో ఈషత్పాఠ భేదములతో నున్నది. ఇవి రెండును తాళ్ళపాకం చిన్నయ్య రచనలని దీక్షితులు ప్రాసిరి. చిన్నన్నవి ద్విపదకృతులు లభించినపిగాని గేయములు ఇంకను లభింపవలసియున్నవి.

ఉన్నస్వరూపము తెలియనప్పుడు ఊహించియైనను అనుభవింపజూచుట మానవ స్వభావచాపలము. కనుక నాకు తెలిసి రాగముల సంకీర్తనములలో, నే నూహింపఁగల తాళమునకు సరివచ్చువానిని, నే నెఱిఁగినంతలో ప్రాచీనమైన వాగ్గేయకారకుల సంప్రదాయము స్మృతగగొని మెట్టులువేసి పాడుకొనఁ ప్రయత్నము చేసితిని. అట్టు మొట్టమొదలు నేఁ పాడుకోఁగలిగినది 'అలరులు గురియగ' అను అలమేలుమంగమ్మ దివ్యనృత్యపుపాట. కనుక ఈ పాటల సంగ్రహములో దానినే నాందీపదముగా చేర్చితిని. నే నూహించిన స్వరరచనలోఁగూడ 48-తాళ్ళపాక పాటలు ప్రపథమున తమ ఆంధ్ర వారపత్రికలో ప్రకటించి నన్ను ధన్యఁజేసినారు శ్రీ శివలెంక శంభుప్రసాదుగారు. వారియప్పు నేను నీఁగలేనిది.

ఈ పాటలకు వర్ణమెట్టను కుదిరించుటకు మూలమైనది నా రచనాశక్తికాదు. మఱి ప్రాచీన వాగ్గేయకారుల దాటులే, వారి పలుకుబడులే యిందు బహుళముగా నుండుట అనుభవముగలవారందఱికిని సుగ్రహమే. మనదేశమున సంగీత సాహిత్యరచనలు అనాదిగా అవినాభూతముగా కలిసి నడుచుచున్నను సంగీతము సాహిత్యమునకు శోభాకరము మాత్రముగానే వెనుకనుండి నడచినదనియు వట్టి నాదరచనలు అంతగా పూర్వకాలమున లేవనియు చెప్పవచ్చును. ఎట్లును దక్షిణ దేశమున భక్తి, శృంగారము, వీరము మొదలగు భావములను భగవద్విషయముగాఁగాని, ప్రభువులను గూర్చికాని వెలువరించు రచనలు చాలవఱకు నిబద్ధగేయములేయైనను వాని భాషారచనకు దేశములోనున్న విలువ నాదరచనకు లేదుగావుననే ఆ గానపద్ధతులు నశించినవి. లేదా అసలు గుర్తింపరానంత మార్పును జెందినవి. ఆళ్వార్ల, నాయన్మార్ల శ్రీసూక్తులన్నియు నిట్టే పరిణమించినవి. అందును ఆళ్వార్లదివ్యప్రబంధములు వాని కేర్పడిన ప్రాచీనరాగతాళములు రెంటిని పూర్తిగా త్యజించినవి. ఇప్పటి వానిపఠనపద్ధతిలో సంగీత గంధము కూడ లేకుండుట యట్టుండఁగా కర్ణవేధకమైన కటుధ్వనియే

ఆవాపోవ్వాపమలలో వినవచ్చుచున్నది. శైవసమయాచారుల గేయరచనలు ఎంతో మేలనియు వాని సాంప్రదాయికగాసమును ఆయా మతాధిపతులు ఎంతోజాగ్రత్తతో కాపాడుకొనుచు వచ్చుచున్నారనియు విన్నాను. కాపచ్చును. రాజాస్థానములలోసి గేయరచనలు ఆయా రాజులతో సన్నియోగశిష్టములై అంతరించినవి. భగవద్భక్తపరంపర వారు సంగీత మెప్పైనను సాహిత్యమునేమో బహుశః సంరక్షించుకొని వచ్చినారు. ఆంధ్ర కర్ణాటదేశములలో విష్ణుభక్తిని శివభక్తిని ఎక్కువ వ్యాపి'ం చెచ్చిన శ్రీ ఆనందతీర్థబసవేశ్వరుల కాలమునకు తరువాతనే గానశోభితమైన భక్తిశృంగార రచనలు ఎక్కువగా బయలుదేరినవి. జనుల నుద్బోధించి యాకర్షించుటయందు, ఆత్మానుభవమునందు, గానకళకుంగల ప్రబలశక్తి నాకాలమువారు ఎక్కువగా కనుంగొన్నారు. కాని వీరశైవ మతభక్తులు పాట పద్యము గద్యము వీదియుంగాక అన్నిటి గంధమునుగల 'వచనము' అనుబడు రచనలయందు మత ప్రచారమును సాగించిరి. కన్నడములో అవి అసంఖ్యముగాం గలవు. కర్ణాటక వైష్ణవులు రాగతాళనిబద్ధమైన పదములనే యుపయోగించు కొనిరి. కాని రాజకీయ విప్లవముల కారణమునంగాంబోలు 15-వ శతాబ్దమువఱకు వారి రచనాకార్యము సుస్థమై సాగలేదు. విజయ నగర సామ్రాజ్యము వేళ్ళూరి నిలుచుచున్న కాలమది. మహమ్మదీయ దండయాత్రల భయము క్షీణించి దేశము శాంతిదాంతుల ననుభవింప నుపక్రమించిన సమయమది. ప్రజలలో అంతఃకలహములు స్వార్థపరత మొదలగు విప్లవము తర్వాత ప్రబలు దుర్గుణములను తొలంగించి సంస్కరింపవలసిన యవసరమది. మాధ్వమతప్రవర్తకులతో శ్రీపాదరాయ స్వామి, అయనశిష్యుడు వ్యాసరాయస్వామి, ఆయన శిష్యుడైన పురందరదాసు మొదలగు మహోమహులు పాటలమూలమున భక్తి. తత్త్వ నీతి, ధర్మాదులను బహుముఖముగా కన్నడభాషలో బోధించిరి. మాధ్వవైష్ణవ సంప్రదాయమందు 'దాసకూటము' అనుబడు శాశ్వత సంస్థనే నెలకొల్పిరి. అది నేటికిని నడచి వచ్చుచున్నది. ఆ సంస్థ రచించిన 'దేవరనామములు' అనుబడు పాటలు లక్షలకు మించినవి. అదే 15-వ శతకమందే వీరశైవ మతానుయాయియగు 'నిజగుణ

శివయోగి' అనునతఁడు చక్కని పాటలమూలమునఁనే తత్త్వములను బోధించెను. 'కైవల్యపద్ధతి' అను పేరుగల ఆతని కన్నడగేయ ములు—సుమారు రెండవందలకు పైఁబడినవి—నేఁడునుగలవు. కాని వీరశైవులలో తరువాత ఆ సంప్రదాయము పర్ధిల్లలేదు. భగవద్రామా నుజుని శ్రీవైష్ణవ మతమునకును ఆంధ్రదేశములో ఆశతాబ్దమందే వ్యాప్తి మొదలైనట్లున్నది. ప్రాచీన వీరశైవుల వచన రచనలు అనుకరించియే కాఁబోలు, కృష్ణమాచార్యుఁడను శ్రీవైష్ణవభక్తుఁడు పదమూఁడవశతకమున కాకతీయ సామ్రాజ్యకాలమున రచించిన 'సింహగిరి నరహరి వచనములు' అనునవి తప్ప ప్రాచీన రామానుజీయుల రచనలు తెలుఁగులోఁ గానరావు. అవిగూడ ఇంకను వెలువడలేదు. పదునైదవ శతకమందే అహోబల నృసింహదేవత నాశ్రయించి శ్రీకాది శఠగోప యతీంద్రుని ప్రయత్నము తెలుగుఁదేశమున విశిష్టాద్వైత సంప్ర దాయము వ్యాప్తినెక్కువ సాధింప మొదలిడీనది. నందవరీకనియోగియైన తాళ్ళపాక అన్నమయ్యకు విశిష్టాద్వైత సిద్ధాంతోపదేశ మీ యతీంద్రుని వద్దనే జరిగినవి. పంచ సంస్కారములు మాత్రము అన్నమయ్యకు చాల చిన్నతనమందే శ్రీ వేంకటేశ్వరుని యాజ్ఞచే 'విష్ణు' నామకుఁడగు నొకానొక యాచార్యుఁడు తిరుమలమీఁదనే చేసినాఁడు. ఆ కాలమందలి శ్రీపాదరాయ స్వామి కర్ణాట గేయరచనలు చూచిన యుత్సాహముచేఁగాబోలు, అన్నమా చార్యుఁడును తెలుఁగున పాటలు రచించుట కుపక్రమించి సమాజప్రతిభా బలముచే అవిచ్ఛిన్నమైన భగవద్భక్తి తపశ్శక్తిచే అధ్యాత్మశృంగార భావభరితములైన పాటలు ముప్పది రెండువేలు రచించి, తక్కిన వారికెట్లెనను, తెలుఁగువారికి సత్యమైన 'పదకవితాపితామహుఁడు' అయ్యెను. అతని కుమారుఁడు పెద తిరుమలాచార్యుఁడు, మనమలు చిన్నతిరుమలయ్య, చిన్నన్నయనఁబడు చిన్నతిరువేంగళనాథుఁడును ఆ సంప్రదాయమును ముందుకు సాగించిరి. తరువాతఁగూడ ఎందఱో పదకవులు తెలుఁగున రచ నసాగించిరి. కాని వారు అన్నమాచార్యుల శృంగారరసపదముల ననుక రించినంత అధ్యాత్మభక్తిపదముల ననుకరింపలేదు. మఱియు, అన్నమా చార్యులనే పూర్తిగా మఱచి తరువాతి వట్టి శృంగార పదముల కర్తయగు క్షేత్రయ్యనే పదకవితకు మూలముగా భావించినాము మనము. తెలుగులో

పదమనగా శృంగారమయమైన గేయరచనకే పేరైనది.

విస్తరమునకు క్షంతవ్యుడను చెప్పవచ్చినదేమనగా: ఈ ఐదు శతాబ్దములుగా మనదేశమున-ముఖ్యముగా తెలుగు కన్నడ సీమలందు-ప్రవహించుచున్న పదసారస్రవంతమున కండగా నిలిచిన సంగీతకళ, ఒక సంప్రదాయముగా ఏర్పడి, ఇంచుమించుగా ఒక స్వరూపముతోనే, ఎక్కువ రచనాభేదములు లేక, నిలిచియున్నది. రాగముల సంఖ్యగూడ మితము. మనకు లభించిన యీ 14 వేలకీర్తనములందెల్ల నియుక్తములైన రాగములు 89, ఒక నూటికిని దక్కువ! ఇప్పుడు లభించిన త్యాగరాజ కీర్తనలు వందలకే 250 కి మించిన రాగములుపయోగింపబడినవి! ఆ 89 టిలోను ఎక్కువగా నుపయోగించినవి 25 రాగాలు మాత్రమే ఇంక తాళ ములమాట లేకులలో లేదని చెప్పితిని. కాని కన్నడాంధ్రములలో గల యితర పదములను పాడునట్టి పద్ధతిని జూచినచో ఈ పాటల యక్షర ప్రమాణమును యతిప్రాసలను పరీక్షించితిమేని, అది రూపకము, జంపె, ఆట, మిశ్రచాపు, త్రిపుట మొదలగు సుప్రసిద్ధ తాళములే ఇదును ఉప యోగింపబడినట్లు ఊహింపవచ్చును. భావము భాషారూపముగా మన స్సులో స్ఫురించిన వెంటనే, తత్కాలమున స్ఫురణకు వచి న యే సిద్ధ మైన వర్ణమెట్టునో గ్రహించి రచన సాగించినట్లే కానవచ్చునే ఇప్ప నూతన నాదశరీర కల్పనకై ప్రత్యేకముగా వారు పరిశ్రమించినట్లు తోచదు. కనుకనే ఈ పాటలను స్వరపఱుచుటయందు నాచేసినపని యెల్ల నాకు తెలిసినంతలో ప్రాచీన పదకీర్తనల మెట్టులకే ఈ సంకీర్తనముల సాహిత్యమునతికించుట. మఱీయు స్వతంత్రముగా ప్రొత్తవర్ణమెట్లు కల్పించు సాహసమునకు చేయివేతమని చాపల్యము. స్థిరమైన యతిపా సలు దాని ననుసరించిన పదవాక్య భావముల విఱుపు-వీనిచే దృఢముగా నియ మితమైన యీరచనలు ఆ స్వతంత్రమునకవకాశమీయలేదు. ఆ పొ్రకార

---

* ఇట్లే కర్ణాటకులు కర్నాటక సంగీతకళకే పితామహుడని పురందరదాసులను పొగడుచున్నారు. పురందరదాసుల రచనలన్నియు గానవిషయమున ఆయనకాచార్య పొ్రచార్యులైన వ్యాసరాయ శ్రీపాదరాయల పద్ధతిలోనే యున్నవి. మఱీయు పురందరదాసులు అన్నమాచార్యులకు శిష్యుడవఁటివాఁడు. (చూ. అన్నమ చార్య చరిత్రము పు. 44-45)

ములోపల నాచేయఁగలిగినంత చేసితిని. చేయవలసినవి వేలు. నేఁజేసినవి వఁదలు గూడఁగావు. స్వతంత్రముగా నవనవముగా వీనికి స్వరరచన చేయఁగల ప్రతిభాధన్యులకు కావలసినంత యవకాశమున్నది.

ఈ పాటలకు రేకులలో పేర్కొనఁబడిన రాగములన్నయు ఇంచు మించు ప్రాఁతబడి నవ్యతను గోల్పోయినవనియు, కనుక ఇప్పుడు జన ప్రియమైన క్రొత్తక్రొత్తరాగములలో పోకడలలో వీనిని పొదిగించిననే తప్ప లోకులుపేని నాదరింపరనియు పలువురికి సందేహమున్నది. కొంత నిజమే. కాని రాగమురక్తికి వాని స్వరూపమునకంటి పాడునట్టి కలావంతుని ఆధ్యాత్మిక చిత్తవృత్తి ముఖ్యకారణమని నాయనుభవము. ఏరాగమందు రచించిన యేకృతినైనను మఱి యేరాగమందైనను పాడవచ్చుననుట సంగీత విద్యార్థులుగూడ ఎఱిఁగిన విషయమే. కనుక రాగభేదముచేతరక్తి కలుగుననుట చాలా స్థూలమైనయభిప్రాయము. మఱియు నేఁటి క్రొత్త రేపటికి ప్రాఁతగా మారకతీరదు. ఇంతేకాదు. కర్తయుపయోగించిన పదములు భావములును ప్రాఁతపడినట్లు మనకు తోఁపవచ్చునుగదా. అప్పుడు వానిని గూడ మనరుచికిఁ దగినట్లు మార్చుటకు పూనుకొంటిమేని మననవ్య ప్రియత్వపుదుబ్బకే ప్రాచీన మహాకవియును తట్టుకోలేఁడు! కనుక కలోపాసకులుపయోగించిన పరికరముల యంతస్తును మీఱి లోఁతుకు డిగి వారి యధ్యాత్మిక వృత్తులను గ్రహించి యనుభవించుటయే కళారసికుల ప్రయత్నము గావలయును.

తాళ్ళపాక వారుపయోగించిన రాగములనేకము లిప్పుడు వాడుకలో లేవని చెప్పితిని. కాని దేశాక్షి, సామంతము మొదలగు కొన్ని రాగముల స్వరూపము ఇంకను పూర్తిగా అంతరించలేదు. క్వాచిత్కముగానున్న లక్ష్యములను లక్షణగ్రంథములను బట్టి. స్వరసంచార స్వరూపమునుబట్టి. వాని వ్యక్తిని నిలుపవచ్చునని నానమ్మిక. ఇది గాక ఇప్పుడెక్కువగా వాడుకలో ఉండు రాగములస్వరూపముగూడ వట్టి జన్యజనకస్వరూపముల ఆరోహణావరోహణముల మెట్టును దాఁటి, స్వరసంవాదములు, (స-మ, ప-స, మ-సి) పరస్పర సాంగత్యము, వివాదానువాదములు, సిద్ధమైన సంకేతము చారిత్రిత పరిణామము,- మొదలగు తత్త్వములను బట్టి నిర్ణయింపవలసి యున్నది. ఈ సంపుటమండలి రాగములకీ దృష్టితో కొంతస్వరూప నిర్వ

చనము చేయఁ ప్రయత్నించినాను. అనుభవముగల రసిక విద్వాంసులు నా నిర్వచనము విలువను నిర్ణయింపఁగలరు.

ఇందుపయోగించిన తాళములుగాని, స్వరపఱచి వ్రాయు పద్ధతిగాని ఇప్పటి సంగీత విద్యార్థులందఱికిని పరిచితములైన సామాన్య విషయములే. అట్టతాళమును 3–4, 3–4 గా విభజించి, జంపెతాళమును 2–3, 2–3 గా పంచి 'చాపు' తాళముగా వేసి కీర్తనలు పాడు నట్టి పద్ధతి చాలనాళ్లుగా వచ్చుచున్నది. చిట్టి వ్రాయుటలో మాత్రా సంఖ్యను ఆవర్తముల ఆదృంతములను స్పష్టముగా వివరించే చూపితినిగాన దానికి విరోధములేక యెట్లైనను తాళమును వేసికొని పాడవచ్చును.

మొత్తముమీఁద తాళ్ళపాకవారి రచనలు అర్థభావప్రధానములైనవి. త్యాగరాజదీక్షితాదులవానివలె నాదరచనా ప్రధానములు గావు. కనుక గాయకులు ఆ దృష్టితో సాధించి పాడిరేని తప్పక సభ్యుల నాకర్షింపఁగలరని నమ్మిక. దానికై పదములకు లఘు టీకగూడ చేర్పఁబడినది.

భగవన్నామములకు అష్టోత్తర శతమొక పవిత్ర సంఖ్యగా పెద్దలందఱంగీకరించినారు. సంపుటము చేతికదనుగా నుండవలెనని దాని సగముగా 54 కృతులను ఇప్పుడు ప్రకటించడమైనది. సంకీర్తనలను యథారుచిగా యథానుకూలముగా ఏరుకొన్నాను. అన్నమాచార్యులవే యెక్కువగా, పెదతిరుమలాచార్యులవి కొలఁదిగా అధ్యాత్మ శృంగార సంకీర్తనలు రెండును ఇందు గ్రహింపఁబడినవి. శ్రీ వేంకటేశ్వరుల సంకల్పాధీనముగా ముందు రెండవ సంపుటముగా మరి 54 సంకీర్తనలు త్వరలో ప్రకటించు నాశగలదు.

నిరుద్యోగిగానున్న నన్ను ప్రణయ గౌరవ పాశములతో మైసూరి నుండి శ్రీ శ్రీనివాసుని సన్నిధికి పట్టితెప్పించి, స్థానమానములు కల్పించి, వలసినయనుకూలములు స్వతంత్రమునిచ్చి, నాచే వీనిని వ్రాయించి, విని నిస్సంకోచముగా ఆనందమును వెలువఱిచి, ఈ పాటల ముద్రణ ప్రకటనములందు అసాధారణమైన అభినివేశమును ఆత్రమును జూపుతున్న తిరుమల తిరుపతి దేవాలయముల ప్రధాన కార్యనిర్వాహకులగు శ్రీ చెలికాని అన్నారావుగారి నిర్హేతుక విశ్వాసము నేను మోయలేని బరువు. నా పేర

నున్న యీ కైంకర్యము నిజముగా వారిదే. శ్రీ వేంకటేశ్వరుఁడు దీని నంగీకరించి వారి ననుగ్రహించుఁగాక!

చాల చిక్కు పనియైన యీ ముద్రణకార్యమును ఎంతో ఓర్పుతో అభినివేశముతో ఇంతయందముగా నెరవేర్చిన తిరుమల తిరుపతి దేవస్థాన ముద్రాశాలవారికి నా హార్దమైన అభినందనలు.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ,
తిరుపతిప్రాచ్యపరిశోధనశాలలో
సంగీత వాఙ్మయ పరిశోధకుఁడు.

తిరుపతి
నందన సం॥ మార్గశీర్షబహుళ
ద్వాదశి, భానువారము
(13-12-1952)

○—○—○

శ్రీమదాంధ్రభాగవతము

బమ్మెర పోతన

కన్నుల కంచముగా, పదవాక్యములను సుబోధముగా విడదీసి, శ్రీ పోతన మహాకవి భాగవతమును శుద్ధముగా ముద్రించి తెలుగువారి కందీయ వలెనని 'రాయలు' ప్రకటనాలయ సంచాలకులగు శ్రీ జక్కా సుబ్బరాయలు గారి యుదారాశయము. దాని ఫలమే యీ క్రొత్తకూర్పు. వారి కోరిక ప్రకారము ఈ మహాప్రబంధమును స్థూలముగా సరిచూచిన సామాన్య కైంకర్యము మాత్రమే నాది. ఈ పనికి నేనుపయోగించుకొన్న పాత కూర్పులివి :—

(1) 1770-వ శాలివాహనశక కీలక సంవత్సరమున శ్రీ పురాణం హయగ్రీవ శాస్త్రులవారు ముద్రించినది.

(2) 1877-వ క్రీస్తుశకవత్సరమున పంచాంగము దేవరాజ పెరుమాళయ్యగారు శోధించి వేసిన కూర్పు.

(3) పైరెంటి జాతికే చేరిన మఱొక్క ముద్రణము (ముఖపత్రము చినిగి యుండుట చేత దీని కాలము తెలియదు.)

(4) 1894-వ క్రీస్తుశక వర్షమున కొమాండూరు అనంతాచార్యులుగారు పరిశోధించిన 'ఆనంద' వారి ముద్రణము.

(5) 1948-వ క్రీస్తువత్సరమున ముద్రించిన 'వావిళ్ళ' వారి కడపటి కూర్పు.

పరిష్కర్త : రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
ప్రతిక, 1954.
రాయల్ అండ్ కో, కడప.

వీనికి తోడు మూలశ్రీభాగవతమును గూడ సంప్రతింపులకుపయోగించితిని.

ఈ నా పర్యవేక్షణము చాల స్థూలముగా, బహిరంగముగా మాత్రమే చేయగల్గితిని. ఇంతకంటె లోతుకుదిగి పరీక్షించుటకు వలసిన యవకాశమును, అనుకూలములును-శక్తిమాట యట్లుండనిండు-నా కిప్పటికి చాలవు. ఇవి మూడును గలవారికిని ఈ భాగవతశోధన కార్యము ఒక యెత్తున ముగియునదియు, సుకరమును గాదు.

ఆ మహాకవితాతపస్వి పోతన్న తన యమృతభారతిని ఏ విషఘటికలో 'శ్రీ కైవల్యపదంబు' అని యుప్పకమించెనో కాని, ఇంచుమించుగా ఈ కడచిన యాఱువందల సంవత్సరాలును అది తిన్న-తిను చున్న-దెబ్బలు అన్ని ఇన్ని కావు. ఇన్ని యాఘాతములకులోగిన తెలుగు గ్రంథ మింకొక్కటిలేదు. దీనివలెనే ఆంధ్రమహాభారతము, భాస్కర రామాయణమును పలువురు రచనల సంహితలే యైనను ఆ గ్రంథముల భాగములు నిష్కర్షగా వీరువీరు రచించినవని మన మెఱుగుదుము. అందు సామాన్యముగా కానవచ్చు పాఠభేదములు ప్రాసిన, ముద్రించిన వారి అవ్యుత్పత్తినిగాని, పాండిత్యమునుగాని పట్టి యేర్పడినవి. అంతే కాని, దీని వలె పదము, వాక్యము, పద్యము, ఘట్టము, స్కంధము అను నన్నిటి యందును లుప్తపూరణమును ఇతరులు చేయవలసిన దురవస్థ కవి పాల్పడ లేదు. ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక సిద్ధార్థి సంవత్సరపు 1-2 సంచికలో 'ఆంధ్ర భాగవత కర్తృత్వము' అని కీ. శే. కొత్తపల్లి సూర్యారావుగారు ప్రాసిన వ్యాసము చదివితిమేని ఈ భాగవతరచన ఎంత చిక్కైనదో, దానిని విడదీయుట యెంత శ్రమసాధ్యమో తెలిసికొనగలము. అప్పుడు వేరువేరు దేశములనుండి సంపాదించిన సుమారు 56 ప్రాతప్రతులను పరస్పరము పోల్చి పరిషత్తువారు ఈ విషయమున జేయవలసిన పనియెంత, ఎట్టిది అనిమాత్రము తేల్చుకొన్నారు. తరువాత ఈ 35 సంవత్సరములుగా పరిషత్తువారుగాని, ఇతరు లెవ్వరుగాని ఈ పనిలో ఆ అంతస్తు దాటినట్లు కానరాదు. అధికారము, అవకాశము, పరికరము, ధర్మమును గల సాహిత్యపరిషత్తువారే మరల బూనకొని, ఈ గ్రంథమును పరిశోధించు పని తలపొలము దాకీంపగలవారు. స్థూలముగా, ముద్రితములైన ప్రతు

లను మాత్రము చూచువారికి తోచునట్టి కొన్ని చిక్కులకు ఒకింతవెండుదా
హరణము లిచ్చు చున్నాను :—

(1) తృతీయస్కంధమందలి కపిల దేవహూతి సంవాదమున మాతృగర్భగతుడైన జీవుని పరిచింతనముగా ఈ కిందిశ్లోకము మూలమైన వ్యాసభాగవతమున గలదు :—

"యన్మాయయోరు గుణకర్మ నిబంధనేస్మిన్
సాంసారికే పథి చరం స్రదభిశ్రమేణ,
నష్టస్మృతిః పున రయం పృవృణీత లోకం
యుక్త్యా కయా మహదనుగ్రహ మంతరేణ (3-31-15)

ఈ శ్లోకార్థమును జీవుని యాత్మగత చింతాంతర్గతమైన కపిలుని వాక్యముగానే శ్రీధర వీరరాఘవ శుకదేవాది వ్యాఖ్యాతలందఱును నయించి నారు. కాని తెలుగులో ఇది దేవహూతి కపిల్ని నడిగిన పశ్నగా కాన వచ్చుచున్నది :—

సీ. * నావుడు సుతునికి దేవహూ తిట్లను 'మహితాత్మ యెవ్వని.....
ప్రబోధకలితముగ బల్కు' మనవుడు గపిలుడనియె....."

(3-996)

ఈ మార్పు ఎట్లు వచ్చిపడీనది? మూల మందలి 'కయా' అను ప్రశ్నవాచక పదమునకు తాత్పర్యమును గ్రహింపజాలక సామాన్య ప్రశ్నముగానే భావించి, ఇంకెవ్వరును దగ్గఱలేరు గనుక, దేవహూతికే దాని నంటగట్టి నట్లున్నది.

(2) అష్టమస్కంధమున వామనావతార కథలోని—

క. "శుద్ధ బ్రహ్మర్షిసమా—రాధ్యుండై, విహితమంత్రరాజి జదువుచు

---

*ఈ సీసపాద మిట్లే ప్రాతముద్రణములలోగలదు. ఆనంద, వావిళ్ళ వారి ముద్రణలలో 'అనవుడు సుతునకు జనని యిట్లను దగ' అనిమార్పు గలదు. ఈ మార్పు వావిళ్ళ రామస్వామిశాస్త్రిగారు మొట్టమొదలు శోధించి 1888 వ సంవత్సరమున విజయనగరమున ముద్రించిన ప్రతి లోనే కలదు.

నిద్ధంబగు ననలంబున-వృద్ధాచారమున వటుడువేల్చెన్
గడిమిన్" (8-519)

అనుపద్యము పూర్వముద్రణములందెల్ల-ఆనందవారి ముద్రణమునగూడ-ఈ పాఠముతోనే యున్నది. కాని వావిళ్ల వారి పాఠ మిట్లున్నది:—

శుద్ధ..... సమారాద్ధుండై .....ప్రోద్ధంబగు ననలంబున ....."

'రాధ్య-రాద్ధ' ల కంతగా అర్థభేదము లేదు గావున ప్రాససంరక్షణకై రెండవ రూపము న్యాశయించినను అంత నష్టము లేదుగాని, ఈ 'ప్రోద్ధ' యేమోనాకర్థము కాదు. సంస్కృతమూలమున 'సమిద్ధ మాహితం వహ్నిం" అనియే కలదు. (8-18-19)

(3) వ్యాసభాగవతము అష్టమస్కంధమున దేవాసుర యుద్ధమున దెబ్బలు దిని దేవతలు మొఱవెట్టుకోగా వారి నాశ్వాసించు శ్రీ మహా విష్ణువు వాక్యములలో ఈ క్రిందిశ్లోకమున్నది:—

"నభేతవ్యం కాలకూటా ద్విషా జ్జలధి సంభవాత్,
లోభః కార్యోనవో (వై?) జాతు రోషః కామస్తువస్తుషు"

ఇందలి యుత్తరార్ధమునకు 'వస్తువులందు లోభము, రోషము కామము చేయరాదు' అనియే వాఖ్యాతలందఱును అర్థమును వ్రాసిరి. కాన దీని తెలిగింపు ప్రాతముద్రణములలో-

ఆ. "అలసటయును లేక నఖిలార్థములు గల్గు
విషధిలోన నొక్క విషము పుట్టుఁ
గడగి చెఱుపలేవు కామదోషంబులు
వస్తుచయమునందు వలయు జేయ." (8-175)

అనియేకలదు. ఒకదానిలో మాత్రము 'లేక యఖిలార్థములు' అనుపాఠము 'లేక' కు కళాత్వమును చూపినది. ఆనందవారి ముద్రణము నిరర్థకమైన సముచ్చయమును గమనించి 'అలసటేమి లేక' అని సవరించి, తక్కిన పదార్థమును గమనింపక విడిచినది. వావిళ్ళవారి ప్రతి, యుత్తరార్ధమున

"కలగి వెఱవవలదు కామరోషంబులు
వస్తుచయము నందు వలదు చేయ"

అని మూలముతో కొంత యనుకూలించు పాఠము నంగీకరించినది, కాని యీ పాఠ మెక్కడనుండి సంపాదింపబడినదో తెలుపలేదు.

(4) అష్టమస్కంధమందే 182-వ వచనమందు 'సురాసురయూథంబులు.....యమందగమనంబున మందరనగమునకుం జని' అనివావిళ్ళ వారి పాఠము. ప్రాతముద్రణము లన్నియు 'మందగమనంబున' అనియే పఠించినవి. మూలమున వారి నడక మందమని కాని అమందమని కాని గమనింపనే లేదు!

(5) 7-41వ పద్యమున యుద్ధమృతుడైన ఉశీనరుని వర్ణించుచో 'రయరోషదంష్ట్రాధరంబు తోడ' అనియే అన్ని ముద్రణాల పాఠము. అన్వితము. మూలమును చూడగా అందు 'రభసాద్దష్టదచ్ఛదమ్' (7-2-30) అనికలదు. కనుక 'దష్టాధరంబు తోడ' అని సవరింపవలసియున్నది.

(6) 'ఏని' అను నవ్యయము కళయే యని ప్రాచీనమహాకవి ప్రయోగము లన్నియు స్పష్టపఱుచుచున్నని. 'ఏనిన్' అను క్వాచిత్క ప్రయోగములు 'మిక్కిలిన్-మరిన్' ఇత్యాదులవలె పాక్షికమైన యువర్ణలోపముచే నేర్పడిన వనియే చెప్పవలసియున్నది. ప్రాతభాగవత ముద్రణములలో నెల్ల 'ఏనియు' అనియే ఎన్నో చోటులందు పాఠము కానవచ్చును. కాని ఆనంద-వావిళ్ళ వాకల ముద్రణములలో సర్వత్ర 'ఏనిని' అని తిద్దుపాటు జరినది! తరువాత ఇంకొకయచ్చు వచ్చినా మూడవసకారము ప్రత్యక్షము కావలసినదే!

భాగవతమును తెలిగించుటలో పోతనయును, తరువాతి సింగన గంగన నారయలును వ్యాసులమూలమునే భక్తితో ననుసరించినను రసభావావేశమున్నచోట్ల విస్తరమును, శుష్కవిషయములందు కొంత సంక్షేపమును చేయుచునే రచన సాగించినారే కాని కేవలము మూలశబ్దానులుగా రచింపలేదనుట స్పష్టమే. కనుక మూలముతో సంప్రతించినను తెగని చిక్కు లెన్నో ఇందు గలవు. ఈ న్ని ముద్రణములందును ఒకటే విధముగా నున్నను, మూలము సహాయపడకున్నను పాఠము వేఱువిధముగా నుండవచ్చునని యూహింపవలసిన స్థలములు గూడ కొన్ని లేకపోలేదు. ఉదాహరణముగా ప్రథమస్కంధము 86-వ పద్యమున-

"భద్రవిమల కీర్తిపారగు డారూఢనయవిశారదుండు నారదుండు" అనుచోట అంత్యానుప్రాసప్రియుడగు పోతన 'కీర్తిపారదుడు' అనియే రచించియుండునని యూహింపవలసియున్నది. కాని ఏముద్రణమందును ఆ పాఠము నాకు గానరాలేదు.

ఈ గ్రంథ మింత పాఠభేదములకును, అపపాఠములకును, గ్రంథ పాఠపూరణములుకును ఆకరమగుటకు నిర్వివాదముగా అందఱంగీకరింప గల కారణములు రెండు గలవు :—

(1) విషయమహత్త్వము చేతను, అసాధారణమైన శైలీమధురిమ చేతను ఇది అన్న గ్రంథములకంటె ఆంధ్రలోకమును నంతటిని ఆకర్షించినది. భగవద్భక్తిరసానుభవమునకు తెలుగుకావ్యములలో దీనిని మించినది కాని దీని వంటిదిగాని ఇంకొక్క గ్రంథము లేదు. సంస్కృతభాగవతముగూడ రసావేశమున దీనికి తరువాతిదే. కనుక తెలుగు దేశమున అక్షరాస్యులైన అందఱి యిండ్లలోను ఏగ్రంథముండినను లేకున్నను ఇది యుండక తప్పినది గాదు. దీని ప్రతులు వ్రాసికొన్నవారిలో పండితుల కన్న పామరులే యెక్కువ. కనుక వేయువేయి లేఖకుల చేతి తప్పు లెన్నో ఇందు చేరినవి.

(2) పండితు లట్టివానిని బట్టి తమ ప్రతులను వ్రాసికొనునప్పుడు వారివారి శక్తివ్యుత్పత్తుల కొలది సవరణలు చేసియుండుట సహజము. అచ్చువచ్చిన తరువాతను ఈ సవరింపుపనులు నాటినుండి నేటిదాక జరుగుచునేయున్నవి.

ఇక నిర్వివాదముగా అందఱును అంగీకరింపలేని కారణములును రెండు సాంప్రదాయికముగా వచ్చుచున్నవి.

(1) మొదటిది ఈ గ్రంథమును తొలుదొల్త ముద్రించిన శ్రీపురాణం హయగ్రీవ శాస్త్రిగారు తెలిపినది. వారికి 'బమ్మెర పోతనామాత్యుని జన్మకర్మ ప్రభావాదుల దెలిపెడు వచనరూపంబగు ప్రాచీన పండిత జన లిఖిత గ్రంథంబు' (శా.శ. 1770 ముద్రణపు పీఠిక) ఒకటి లభించినదట. కాని మఱల ఇంతవఱకు ఆ గ్రంథము మనకు లభింపలేదు. దానినుండి వారు సంగ్రహించిన విషయము లివి: "పోతన తన నిర్యాణకాలమున కొడుకు మల్లన్నను పిలిచి తాను తెలిగించిన భాగవతము ముముక్షువులకు

తప్ప ఇతరుల కధ్యయనము చేయరాదని చెప్పెను. మల్లన్న దానిని దేవ తార్చన పెట్టెలో భద్రముగా దాచియుంచి తన యవసానకాలమందు తన సహాధ్యాయియైన నారయ్య కానిధిని రహస్యముగా నుంచుకొమ్మని యిచ్చెను. నారయ్య కొంత కాలమునకు ఆ కట్టును విచ్చి చూడగా అందు చాలభాగము క్రిమిదష్టమై నశించియుండెను. దుఃఖించుచుండిన ఆతని కలలో ఒకనాడు పోతనయే కానవచ్చి నష్టభాగములను పూరింపుమని ముదల యీయగా అతడు గంగనసింగనల సహాయముచే ఆపని నెరవే ర్చెను'.

కాని భాగవతభాగములను పూరించిన గంగన్న సింగన్న నారయ్య లలో ఎవరుగాని పైకారణము పేర్కొనలేదు. తక్కిన యిద్దఱి మాట యట్లుండగా పోతన్న సాక్షాత్కారమును, లుప్తపూరణాసక్తిని కలలో కాంచనోచుకొన్న నారయ్యగూడ ఈ విషయమును సగర్వముగా పేర్కొ నక మౌనము వహించుటకు హేతువేమి? నీవు పూర్తిచేయుమని పోతన తన కాజ్ఞ చేయగా గంగన్నసింగన్నలనుగూడ కలుపుకొను నధికారము నారయ యేల వహించెను? పోతన తన జీవిత కాలమంతయు ఈ గ్రంథ మును ఏయాప్తశిష్యునికిని ఉపదేశించక, తన కుమారునికిగూడ అట్లే దానిని దాచిపెట్టుమని కట్టడ చేయుట, కుమారుడు పిత్రువాక్య పరిపాలనము అక్షరశః నెరవేర్చుట, అతని నుండి క్రమముగా అదే యుపదేశమును పొందిన శిష్యుడు నారయ్య మాత్రము దాని నతిక్రమించి కట్టవిచ్చి చూచుట, పోతన్న అతని ననుగ్రహించి స్వప్నములో 'ఇంక నీవీ మహా గ్రంథ మును అనేక గ్రంథులుగా నేర్పఱచి సౌకర్యంబుగా భక్తిష్టంబులయిన ఘట్టం బుల యందు నన్ను ధ్యానింపుచు నవీనముగా రచియించి యీ గ్రంథంబం తయు మత్కృతంబుగా నుండు నట్లు ప్రకాశపరచవలయు' నని యాజ్ఞా పించుట, దానికి విరుద్ధముగా నారయ మఱి యిద్దఱిని గలుపుకొని 5, 6, 11, 12 స్కంధాల నైనను బహిరంగముగా తమతమ రచనలుగానే రచించి ప్రకటించుట-ఇత్యాదులు పైకథలో సుగ్రహము కాని ఘట్టములు. నాకిందు నమ్మకము చాలదు.

(2) ఇక రెండవకారణము రాచకొండ సర్వజ్ఞసింగమనేని కథ. సింగమనాయడు భాగవతము తనకంకితముగా చేయుమని పోతనను

కోరగా–అతడు తిరస్కరించుట, రాజు కోపించి ఆ గ్రంథమును బలవంతముగా పట్టి తెప్పించి భూమిలో పాతి పెట్టించుట; అందు మూలాన మన్నిదిని గ్రంథభాగములు శిథిలముగాగా ఆయాభాగములను నారయాదులు పూరించుట, అది కారణముగా అసంస్కృత ప్రయోగములును, అందదుకుల శైలియు ఈ సంహితలో చేరుట ఇవి ఇందలి ముఖ్యవిషయములు దీనిని ఇన్నాళ్ళకింద కూచిమంచి తిమ్మకవి సర్వలక్షణ సారసంగహమున నుల్లేఖించినాడు.

దీనిని పలువు రంగీకరింపరు. 'సర్వజ్ఞ బిరుదాంచితుడును, తాను గొప్ప పండితుడును, గ్రంథకర్తయు నైన సింగమనాయడు పోతనవంటి మహా భక్తకవి విషయమున ఇంత క్రూరముగా వర్తించునా' యని వారి సందేహము. కాని ప్రభువులు పండితులైన గ్రంథకర్తలైన మాత్రాన మనుష్య సహజములైన కోపతాపము లుండ వనుట యనుభవ విరుద్ధమైన వాదము. ఆజ్ఞాభంగమును సహింపరాదనుట రాజులందఱను అనూచానముగా నేర్చుకొన్న నీతి. మఱియు అవిధేయతను ఓర్చుకొని యూరకుండుట ప్రాభవము గలవారి ధర్మమును. కర్మమునుగాదు. మఱి పోతన్న అవిధేయుడైనందుకు అతనినే పూడ్పింపక ఆరాజు గ్రంథమును మాత్రము పూడ్పించియుండునా యను నాక్షేపణ గలదు. బ్రహ్మహత్య మహాపాతకముగా సింగమనీడు భావించియుండవచ్చును. మఱి పూడ్పించుటయేల, కాల్పించగూడదా అనియు నడుగవచ్చును. ఇట్టి ప్రశ్న లెన్నైనను ఏకథ విషయమునన్నైనను వేయవచ్చును. పోతన్నకు వయస్సులో చిన్నవాడై సమకాలికుడైనవాడు తాళ్ళపాక అన్నమాచార్యుడు, అతని కంటె భగవద్భక్తియందుగాని, కవితాకౌశలమందుగాని యేమియు తక్కువకాని తపస్వి. అతని పదకవితామాధుర్యమునకు ముగ్ధుడై పండితప్రియుడైన సాళువ నరసింగరాజు వేయివిధముల నతనిని సన్మానించి 'హితునిగా గురునిగా నెల్ల బంధులుగ'[1] భావించి పూజించినవాడు. ఇతడే పిన వీరభద్రుని నఖండముగా

[1,2] అన్నమాచార్యుల మనమడు చిన్నన రచించిన అన్నమాచార్య చరిత్రము, పు. 32–36. తిరుమల తిరుపతి దేవస్థానము వారు ప్రకటించినది.

సన్మానించిన దాత. తుద కేమైనది? శ్రీ వేంకటేశ్వరునిపై ప్రాసిన పదముల వంటి దొక్కపదము నాపై జెప్పమని ప్రార్థింపగా అన్నమయ్య-

".....హరిహరీయనుచు
పరమ పత్నివకాభావంబు బూని
హరి ముకుందుని గొనియాడు నాజిహ్వ
నిను గొనియాడంగ నేర దెంతైన
నను నెట్లు పలికి తీనైచ్యంపు బలుకు!"[2]

అని తిరుగఁబడగా నారాజు అతనిని 'మూరురాయరగండ సంకెల' వేయించి చెఱలో ప్రోయించినాడు! కనుక ఈ అభిమానికవాద మంత విమర్శ సహము కాదు. హయగ్రీవ శాస్త్రిగా రీకథ పేర్కొనక పోవుటకు హేతువు ఆకాలమందు తిమ్మకవి సర్వలక్షణ సారసంగ్రహము ముదితముగాక పోవుట కావచ్చును. సర్వజ్ఞ సింగమనాయని వంశీయు లెవరో ప్రోత్సహించి మొదటికథను కల్పించి గ్రంథగతముగా చేయించుటచే అసలుకథ జనసామాన్యమందు నిలువక మఱుగుపడి యుండవచ్చును. ఇంతే కాని పోతన్న కవితయందు నక్షీణదోషములు లేవని స్థాపించుటకై కూచిమంచి తిమ్మకవియే యీకథకల్పించి గ్రంథగతము చేసినాడను నభిప్రాయము న్యాయ్యముగా దోపదు. కనుక పోతన్నగారి గ్రంథపాతమునకు వ్యవహారమునందున్న పైరెండు కారణములలో ఏమైన సత్య ముండెనేని అది నాకీ రెండవదానియందే గోచరించుచున్నది.

సత్య మెందున్నను ఎందును లేకున్నను; పోతన్న గ్రంథము శిథిలమగుటయు, ఇతరులు యథాసంభవముగా చొచ్చి పూరించుటయు మనకు ప్రకృతమైన సత్యము ఎవరెవ రేయేభాగముల బూర్తిచేసి నాడను విషయమున సామాన్యముగ పరంపరాగతమైన. గ్రంథగతమైన నిర్ణయ మున్నది పంచమస్కంధము గంగన్న. షష్ఠ స్కంధము సింగన్న, ఏకాదశ ద్వాదశ స్కంధములు నారయ్య రచించినట్లు ముద్రితపుస్తకముల లోనున్నది. ఇదిగాక ద్వితీయ స్కంధమంచలి 92-వ పద్యము తరువాతి భాగము; దశమస్కంధోత్తర భాగమందు 237-వ పద్యమునుండి స్కంధాంతమువఱకును గల గ్రంథమును నారయ రచించినట్లు ప్రవాద మున్నది. మఱి క్రొత్తపల్లి సూర్యారావుగారి ప్రాత పత్రికము సాహిత్య

పరిషత్తులోని ప్రాతప్రతులలో ఈ విషయము గూడ నిశ్చయింపరాక యథా తథముగా నున్నది. మఱి పోతన్నగారిది కుంటు లేక, ధారాళమై, వర్ణ స్వీయై, భావోద్రేకపూరితమైన పరిశుద్ధ రచన యనుకొని మనము గ్రంథ మును చదువునప్పుడు పోతన్న రచించినవనబడు భాగములందును ఎన్నో చోటులందు ఇతరుల క్రైవాడము తేపలుతేపలుగా గ్రంథమందంతటను గలదని తోచును తాటాకుల పుస్తకము పురుగులుదిన్నను మన్నుదిన్నను, ఆదోషము అల్పముగాను, అధికముగాను స్వేచ్ఛగా గ్రంథమునంతటిని వ్యాపించుట ఆనుభవగమ్యమైనదే. కనుకనే గ్రంథమాద్యంతమును అందందు నిస్సారములు, అసంస్కృతములు, పునరుక్తములు, అనన్వితములు అనవలసిన పదవాక్య పద్యములు చదువరుల రసానుభవధార కడ్డుతగులు చున్నవి. గంగ సింగ నారాయణకవుల కవితా సంస్కారము పోతన్నగారి వరవడిలోనే నడచినది. కాని పోతనకు గల ప్రతిభావిశేషము, సహజ మైనను సంస్కృతమైన పాండిత్యము, అసాధారణములైన శ్రద్ధాభక్తి తపస్సులును వారికి చాలవు. కాని గురువుగారియందును, గ్రంథమునందును గల భక్తిచే యథాశక్తిగా పూరించి వారు సంపూర్ణ భాగవతమును మన కందిచ్చినారు. ఇంతేకాని పోతన్నయే గ్రంథభాగములను వేఱువేఱుగా శిష్యులు మువ్వురికి పంచియిచ్చి భక్తిసారమైన భాగములను మాత్రము తాను రచించినాడనియు, దశమస్కంధము ముగించు లోపల అతని యాయువు ముగియుటచే ఏకాదశ ద్వాదశములు నారయ పోతన్న యను మతి చేతనో, లేకయో రచించియుండు ననియు శ్రీ నిడదవోలు వేంకటరావు గారు చేయు నూహ కాధారము చాలదు.* ఇతరుల కవిత్వమని నిష్టముగా నున్న భాగములలో పోతన రచన లనవలసిన భాగములెన్నో కలవు. ఉదాహరణముగా నారయ రచితమయిన 11-వ స్కంధమునందలి యీ పద్యమును జూపవచ్చును :—

---

* వావిళ్ళవారి 1948-వ సంత్సరపు ముద్రణము పీఠిక పు, 83. ఈ పీఠిక అచ్చయిన తర్వాత రాళ్ళపల్లివారు గుర్తుచేసుకొన్న సవరణ (సం 11)

చ. "నగుమొగమున్ సుమధ్యమును నల్లని మేనును లచ్చికాటప
ట్టగు నురమున్ మహాభుజము లంచిత కుండలకర్ణముల్ మదే
భగతియు నీలవేణియు గృపారసదృష్టియు గల్గు వెన్ను డి
మ్మొగ బొడసూపుగాత గనుమూసిన యప్పుడు, విచ్చినప్పుడున్."
(11-124)

ఇందు పోతన్న వాక్సౌరభ్యము స్పష్టముగానున్నది. నారాయణ కవి వైన ఏకాదశ ద్వాదశములలో ఇట్టిపద్య మింకొకటి కంటబడదు. (అసలీ పద్యము ప్రాతముద్రణములలో కానరాదు!) ఇది నవమస్కంధాంతమున నున్నది. చూడమి పొరబాటు. ఇట్లే పోతన్నదే అనబడు నవమస్కంధ మందలి యీ పద్యము జూడుడు:—

ఉ. "ఆతతమైన వేడ్క దనుజాధిపమంత్రి సురారి నందనో
పేత దనూభవం బిలిచి పెండ్లి యొనర్చె మహా విభూతికిం
బ్రీతి మహోగ్రజాతికి నభీతికి సాధువినీతికిన్ సిత
ఖ్యాతికి భిన్న దుఃఖ బహు కార్యభియాతికి నయ్యజాతికిన్."
(9-539)

ఈ యంత్యప్రాసరచన పోతన ననుకరించిన యపక్వబుద్ధి యెవడో చేసిన దనుట ప్రత్యేకముగా చెప్పబనిలేదు. ఇట్లే నవమస్కంధమందలి శ్రీరామ చరిత్రమున ఇతరుల చేతిపని చాల కలదని నాశంక. దశమ స్కంధోత్తర భాగమందు, 'సంతత నిర్మలి నాకుశ స్థలిన్' (307), 'మున్ను దన చౌల నెన్నడు' (327), 'కచాకరషణముల్' (330) 'చిరయశోల్లాసు' (380), 'నిర్వాణమూర్తైన' (1049) 'మిథిలనుపురమున' (1177)-ఇత్యాది ప్రయోగ ములు నిస్సంశయముగా ఇతరుల చేదూర్పులను చాటుచున్నవి.

ప్రాతప్రతు లనేకములు సంపాదించి పోల్చిచూచుట, మూలముతో సరిచూచుట, రేఫ ఱకారములు, సబిందుక నిర్బిందుక ప్రాసయతులు, విశిష్ట శబ్దవాక్య ప్రయోగములు మొదలగువాని విషయమున ప్రాచీనులు వహించిన స్వాతంత్ర్యమును నిశ్చయించుట-ఇత్యాది పద్ధతులకు దోడుగా పోతన్న రచనను నిర్ణయించుటకు ఆతని సీసపద్యము లందలి క్రమబద్ధ మైన యతినియమము గూడ సహాయపడునని శ్రీ కే. శే. వావిలికొలను

సుబ్బారావుగారు శోధించి చూపినారు. దానికి దోడు మఱొక్క విషయము గూడ పేర్కొనవచ్చునని తోచుచున్నది. పోతన్న ఆటవెలదులను అద్భుతముగా నడిపించిన తెలుగుకవులలో నగ్రగణ్యుడు. అతని రచనలందెల్ల సాధారణముగా కానపచ్చు ధర్మము యతిప్రాసల స్థానములలో పులుముడు లేక పదములు, వాక్యములను అపరియత్నముగా ఛందోగతితో అతుకుకొని యుండుట. ఇది తక్కినయన్న పద్యములకన్న ఆయన యాటవెలదులలో ఎక్కువగా గానవచ్చును. తేటగీతి నతడెక్కువ యభిమానింపలేదని తోచెడిని. సీసపద్యపు ఎత్తుగీతులలోను ఆటవెలదులే చాల ఎక్కువ. ప్రథమస్కంధమందు తేటగీతులు 27, ఆటవెలదులు 46. ద్వితీయమందు తే.గీ. లు 43, ఆ.వె. లు 15. కాని ఈ స్కంధమందు చాలభాగము పోతన్నది కాదను వాదమున్నది గదా. తృతీయ చతుర్థములలో ఆటవెలదులు చాల తక్కువ. తేటగీతు లెన్నో. మొత్తము మీద ఆ రెండు స్కంధముల రచనయు అంత తృప్తికరము గాదు. 7, 8 స్కంధములలో మరల ఆటవెలదుల ప్రాబల్యమును గుర్తింపగలము. నవమములో తే.గీ. లు44, ఆ.వె. లు99! ఈ స్కంధమున ఈ విషయమున ఇంకొకవింత. 694–వ 'నేమమే యని సతుల్' అను సీసపుతెత్తుగీతి ఆనంద–వావిళ్ళవారి ముద్రణములందిట్లున్నది. "నూతనాజినంబు ననుపిది మేలని–గీచివిడిచి మృదుదుకూలమిచ్చి మౌనిమరగ జేసి మాపర్ణశాలకు–బోదమనుచు గొంచుబోయిరతని." ఈ యాట వెలది చోటనే ప్రాతప్రతులలో ఈ తేటగీతియున్నది:—

"చర్మవస్త్రము వదలించి భర్మ్యకాంతి
మించి చెలగు పీతాంబర మిచ్చి వెసను
మనము సొక్కంగ నతని జేకొనగవాది
మఱుగునకు జేరె నతడు వేమఱిగివారి.

ఈ రెంటిలో పైని యాటవెలదియే పోతన్న రచన కాగలదని చెప్పనక్కర లేదుగదా. పోతన్నగారి యాటవెలదు లెన్నిటికిట్టి తేటగీతులను తరువాతివారు ప్రక్షేపించియము చేసినారో! పోతన్న వేరిటి తేటగీతులలో ఎన్నో ఇట్టి కుంటి నడకగలవి కలవు. ఇట్లే దశమస్కంధపు పూర్వభాగమున కంటె ఉత్తరభాగమున తేటగీతుల ప్రాబల్యము గుర్తింపవచ్చును. పోతన తేటగీతి వ్యాయలేదని కాని, చక్కగా రచింప లేడని కాని నాయభిప్రాయము గాదు.

'చేతులారంగ శివుని బూజింపడేని' అను పద్యము ఆయనది కాదని యెవరన గలరు? అట్టివి యెన్నో కలవు గూడ. కాని అతని రుచియు. రచనయు ఆటవెలదియు దెక్కువగా కానవచ్చుననుట మాత్రమే నాయిప్పటి మనవి.

ఇక పోతన్న వసించిన దేశమును గూర్చి వావదూక మహామహులెందఱో 'గగనం గగనాకారం' గా చేసిన యుద్ధము పరిష్కృతము శాంతించినది. కాన మరల దానికై కాలు ప్రవ్వబనిలేదు. నామట్టుకు ఒంటిమిట్ట-యొరుగల్లులు రెంటితోను పోతన్నకు సంబంధ ముండ వచ్చునని నమ్మితిని. రెండు చోట్లను ఆయన యుండినట్లు ప్రవాద మున్నది గనుక, ఇతర సాక్ష్యములును గలవు కావున, ఇట్టి సన్నివేశములా కాలమందును, ఈ కాలమందును సంభావ్యములేయగుట చేత, అక్కడివాడు కాడనికాని, ఇక్కడివాడు కాడనికాని కొందఱు చేసినట్లు నిశ్చయముగా సిద్ధాంతము నేను చేయలేను. మఱి పైరెండు చోట్లుగాకయిక నే స్థలాంతరములందెనను ఆయన జీవితకాలములో భౌతిక దేహముతో సంచారము చేసినాడో లేదో తెలియదు గాని ఆయన యాధ్యాత్మిక తేజస్సు, ఆయన భగవద్భక్తిసుధ, తెలుగుదేశమందు సంచరింపని, పావనము చేయని ప్రదేశము లేదు.

తిరుపతి
1-12-53

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

ఆనందముద్రణము ఈపాఠభేదము నుద్ధరించినది. వావిళ్ళవారి ముద్రణలో ఇదిలేదు.

o—o—o

అధ్యాత్మ సంకీర్తనలు (సంపుటము 11)

అన్నమాచార్యులు

ఈ పదునొకటవ సంపుటములో అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనల ముద్రణము ముగిసినది. కే. శే. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు అన్నమాచార్యుల రచనలని పృత్యేకముగా గుర్తించిన అధ్యాత్మ సంకీర్తనల రేకులు 1 మొదలు 391వఱకును గలవానిలోని కీర్తనలన్నియు తాళ్ళపాక వారి గేయరచనములు 5, 6, 7, 8, 9, 10, 11 సంపుటములుగా శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధన సంస్థ ప్రకటించినట్లైనది. మొత్తము ప్రకటనకు లభించిన అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 2209. వానిలో కొంచెము తక్కువగా అన్నియు సాధారణ తామ్ర పట్టములలోనివే, ఈ రేకులకు సా. రే అనిగుర్తించితిని.

ఇవిగాక సుమారు 2 అంగుళముల వెడల్పు 33 అంగుళముల పొడవునుగల నిడురేకులు 120 గలవు. సా. రేలలో చెక్కించుటకు పూర్వము ఈ రీతిగా రేకులు చేయించి చెక్కింపను ప్రత్యించి వాని పలు చదనమును, నిడుపును అనుకూలముగా తోపని కారణముచేగాబోలు, అంతటితో వదలి, చేతికనువై, లావైన సా. రేకులలోని మొదటినుండి మరల పాటలను చెక్కించినట్లు తోచుచున్నది. మరియు నిడురేకుల ప్రాతగూడ అందము తక్కువ. ప్రాసినవారి భాషావ్యుత్పత్తియు సామాన్యము. నలుగురైదుగురు లేఖకుల హస్తవాడము స్పష్టముగానున్నది. కొన్ని రేకులలో మాత్రముకడపట

పరిశోధకులు: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.
పీఠిక, 1955.
తిరుమల తిరుపతి దేవస్థానములు.

"అన్నమాచార్యుల సంకీర్తనలు 10 మంగళమహా శ్రీ శ్రీ శ్రీ జేయును శ్రీ తిరుమలయ్యగారి ఆనతిని అన్నమరాజు తిమ్మయ్య వ్రాసెను." ఇట్లు లేఖకుని పేరుగలదు. తక్కిన యేరకపు రేకులందు గాని వ్రాసిన వారిపేరు గానరాదు. సా. రేలలోలేని అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు 77 ని. రేలలో లభించినవి. ఈ సంపుటమున అవి రెండవభాగముగా చేర్పబడినవి. వాటికిని దక్షిణదేశమందలి హరిభజన సంప్రదాయమున 'తోడయ మంగళం' అనబడు తొలి పాటలలో నొక్కటిగా సర్వత్రవ్యాప్తిలో నున్న 'నారాయణతే నమో నమో' అనుసంకీర్తన మనకీ నిడురేకులలోనే దొరికినది. *రాగముహూత్రము మారినది. రేకులో దీనిది పాడిరాగము. వ్యవహారములో ఇప్పుడిది మధ్యమావతి. ఇదిగాక యిందలి వ్రాత అంత వ్యుత్పన్నముగాకున్నను సా. రేలలోని యెన్నోపాఠసందేహములను తీరినవి.

మరియు అహోబల నరసింహస్వామి దేవళమున లభించిన పెద్ద రేకులు 35. ఇవి 27 అంగుళముల పొడవును, 16 అంగుళములవెడల్పును గలవి. ఇవి ఐదైదు రేకులు గుదిగా ఒకలావైన కడియములో చేర్చియుంచ బడినవి. పై. రే. అనివానిగుర్తు. సా. రేలలోని సంకీర్తనలే ఇందును పునరుక్త ములు. ఇందలివ్రాత తప్పులెన్నో ఇందు సవరింపబడినవి. అక్షరముల జాతియదే. కనుక సా.రే. పె.రే లవ్రాత ఒక్కవ్యక్తి చేతిమీదుగానో లేక ఒకలేఖన సంప్రదాయమునకు చేరిన గురుశిష్యులచేతనో నడచినదని యూహింపవచ్చును. ఈ రెండుపీఠముల రేకులను ప్రత్యేకముగా తయారు చేయించి రెండుమార్లుపాటలను చెక్కించు వ్యయప్రయాసము లింతయని యూహించుట కష్టము. దాని యుద్దేశముగూడ చురూహామే. ఈ పె. రేలు ఎన్ని యుండినవో తెలియదు. మనకు దొరికినవి 35 మాత్రమే. అందు అన్నమా చార్యుల, తిరుమలాచార్యుల అధ్యాత్మశృంగార సంకీర్తనలు వేరుపరచి యియ్య బడినవి. పె.రేలు సా. రేలకు అనువాదములే కనుక పాఠభేదములు ప్రాయశః యిందు లభింపవు.

---

* దీనినే కడపటి చరణమున 'పురందరవిఠలతే నమోనమో' అనిమార్చి పురందరదాసరాయల పదముగా కర్ణాటకులు కొందరు వాడుచున్నారు!

ఇదిగాక తంజావూరి సరస్వతీమహలు భండారమునందలి పే. 465 సంఖ్యగల తాటాకుల ప్రతి 'శ్రీ వేంకటేశ్వరవిన్నపాలు' అనుదానికి పాఠాంతరాలు వాయించి తెప్పించబడినది. అందు 90 సంకీర్తనలు వేంకటేశాంకితములు కలవు. కాని యిందులో అన్నమాచార్యుల వేవో ఇతరుల వేవో తెలుపబడ లేదు. రేకులలోని అన్నమాచార్యుల కృతులు కొన్ని ఇందుగలవు. పాఠ వివేకమునకు ఇవియు కొంత తోడుపడినవి.

వీనికి తోడు తిరుపతి వాసులైన శ్రీ తాళ్ళపాక వేంకటశేషాచార్యుల యింటి ప్రాతప్రతి యొకటివారి దయతో లభించినది. (S.V.O., 6609). ఇందు శృంగారాధ్యాత్మ రచనలు 275 కలవు. కాని ఇందును కర్తలపేర్లు తెలియవు. మరియు తరువాతి పదకవుల రచనలును ఇందు కలిపినట్లున్నది. కొన్ని పాదముల సవరణలకిదియు నుపకరించినది.

వీనినన్నిటిని పరస్పరము సంపాదించుపనికై కొంతకాలము పట్టినది. ఇదిగాక 1936లో తిరుమల తిరుపతి దేవస్థానమువారు ప్రచురించిన 'The works of Thallapaka poets, Vol. 11.' అనుదానిలోని అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనల ముద్రణము చాల అసడ్డగా జరిగినది. పైని రేకులను ప్రాతప్రతులను పరిశీలించి సరియైన పాఠములతో వానిని మరల ప్రచురించుట అత్యావశ్యకమనిపించినది. అట్లు చేసి సవరించిన 173 అన్నమాచార్యుల అధ్యాత్మ సంకీర్తనలు ఈ సంపుటమున 3-వ భాగముగా పాఠకులకొసగ బడినవి, ఇట్లు చేయుటకు ఈ ప్రాచ్య పరిశోధనాలయాధ్యక్షులు శ్రీ పరవస్తు రామానుజస్వామి ఎం.ఏ. గారు దయతో నాకనుమతినిచ్చిరి. వారికి నా ధన్యవాదములు.

ఈ కారణముచేత ఈ సంపుటము కొంత విలంబముతో వెలువడ వలసివచ్చినది. ఈ కార్యములో మొదటి కొన్ని దినములు మాత్రము శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యుల తోడు నాకు లభించినది. దానికై వారికి కృతజ్ఞత ఇందు మూలముగా తెల్పుకొనుచున్నాను. తరువాత వీకాంగిగానే నేనీపని నిర్వహింపవలసితిని. ఇదిగూడ విలంబహేతువైనది.

12-వ సంపుటమునుండి అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు ప్రకటింపబడును. ఆ సంపుటముగూడ ఇంతలో ముద్రణకెక్కు స్థితిలో

నున్నది. స్వరపరచిన 'తాళ్ళపాకపాటలు' రెండవ సంపుటమును త్వరలో ప్రకటింపబడుటకు సిద్ధమయినది.

శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానముల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారగు శ్రీ చెలికాని అన్నారావు బి.ఏ. గారు ఈ సంకీర్తనల ప్రకటనకై వ్యాప్తికై చూపుచున్న అపారమైన యుత్సాహమునకు తగినంత త్వరగా పని జరుపు శక్తి శ్రీనివాసుడు నాకనుగ్రహించినచో కొంతయైనను వారి దయాఋణ మును తీర్చుకోవలెననుటయే నాయాశంస.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా
పరిశోధనాలయము, తిరుపతి.
30-3-55

తాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
సంగీత వాఙ్మయ పరిశోధకుడు

○—○—○

శృంగార సంకీర్తనములు (సంపుటము 12)

అన్నమాచార్యులు

శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యుల శృంగార సంకీర్తనల సమ్మేళనమును ఈ 12 వ సంపుటముతో ఈదుటకు ప్రారంభించినట్లైనది. మొత్తము 2002 గల ఆ సంకీర్తనల రేకులలో మొదటి నూటి రేకులందలి సంకీర్తనలిందు పరిశోధితములై ప్రకటింపబడినవి. రేకులలో 19, 96, 97, 98, 99, 100 సంఖ్యల రేకులు మాకు లభింపలేదు. మఱి నాల్గవ సంపుటమున 31-వ రేకులోని మూడవ సంకీర్తన మొదలు 60 వరకుగల రేకులలోని సంకీర్తనలన్నియు కీ॥ శే॥ పద్మాకరశాస్త్రిగారి చేతిమీదుగా పరిశోధితములై ప్రచురింప బడినవి. తక్కిన సంకీర్తనలన్నియు ఈ సంపుటమున క్రమముగా చేర్చబడినవి. 11వ సంపుటమందువలె ఇందును సాధారణ రేకులు (సా.రే.) నిడురేకులు (ని. రే.) పెద్దరేకులు (పె.రే.) తంజావూరు సరస్వతీ భండారపు ప్రాతప్రతి (త. ప్ర) శ్రీ తాళ్ళపాక వేంకటశేషాచార్యుల వారింటి ప్రాతప్రతి (తా. వే)- అను నైదుమూలములను పోల్చి సరిచూచి పాఠములను నిర్ణయించితిని. పాఠభేదములు క్రింద సూచింపబడినవి.

అధ్యాత్మ సంకీర్తనలు యేబదిరేకులలోనివి. ఒక్కొక్క సంపుటముగా ఇంతకు ముందు ప్రచురణ కెక్కినవి. ఇక ముందు శృంగార సంకీర్తనలు నూరునూరు రేకులవి ఒక్కొక్క సంపుటముగా చేర్చి ముద్రించు సంకల్పమున్నది. ఈ మహాకార్యము త్వరగా సాగుట కిది కొంత యుపకరించు.

పరిశోధకులు : రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

పీఠిక, 1956, అక్టోబర్, 4.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

నని, సంపుటములు గూడ చేతి కందముగా అందుపాటుగా నుండగలపని నా నమ్మిక.

1937-వ సంవత్సరమున శ్రీ తిరుమల-తిరుపతి దేవస్థానమువారు ప్రచురించిన 'The works of Thallapaka Poets-Vol III' అను సంపుటములో అప్రకమముగా ప్రకటితములైన అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు ఈ సంపుటమునుండి యథాక్రమముగా పరిశోధిత పాఠములతో వెలువడుచున్నవి.

శృంగారరసవీధులు వివిధ జాతీయ దేశీయ భాషావిశేషముల కాకరములు కనుక "విదితార్థ గ్రామ్యోక్తులు-పదిలముగా బొంక మెఱిగి పలుకగ జెల్లున్"- అనుటయు "ఉచితభాష పదముల జెల్లున్" అనుటయు అన్నమాచార్యుల యభిప్రాయమని చినతిరుమలాచార్యుడు "సంకీర్తన లక్షణము" నలిపినాడు. [ప్ర. 55, 56] మరి వ్యాకృతము, అవ్యాకృతమునైన భాషను "ఇదం బ్రహ్మ మిదం క్షాత్ర" అన్నట్లు నిర్లక్ష్యముగా లొంగదీసికొని ప్రయోగించు సిద్ధహస్తుడు అన్నమాచార్యులు". ఆయన రసావేశముతో పాడినపాటలువిని వ్రాతకెక్కించినవారు, రేకులపై చెక్కునప్పుడు చెప్పినవారు, చెక్కినవారును, శబ్దస్వరూపములు, సంధులు మొదలగు విషయములందు వారివారి వ్యుత్పత్తికిని అభ్యాసమునకును తగినట్లు ఎన్నో మార్పులు చేసియుండక తప్పదు. అరసున్నల, బండిఱాల ప్రయోగ విషయమున పద్ధతియు, పట్టుదలయు రేకులు గీసినవారి కున్నను, వ్యుత్పన్నమైన నియమమున్నట్లు గానరాదు. రేఫ ఱకారనిర్ణయమును ఎంతో శ్రద్ధతో జేసి విధించిన పెద్దతిరుమలాచార్యుల అధ్యక్షత క్రిందనే జరిగిన యీ రేకుల లేఖనములో ఆరెంటి విషయమున గానవచ్చు అవ్యవస్థ వింతగా తోపకపోదు. ని. రే. లలోని పాఠములు, సా. రే. లలోను, వానిలోనివి పె. రే. లలోను, కొంతకొంత సవరించినట్లున్నవి. ఇట్టి స్థితిలో అన్నమాచార్యులన్నుగహించిన శబ్దరూపముల యథాతథ్యమును నిర్ణయించుట అసాధ్యము. ఆకాలపు శబ్దముల వ్యవహార స్వరూపము తెలియుటకై ప్రాయశః ఆయారూపము లట్లట్లే ఇందు నిలువరింపబడినవి. నేటి పఠనరీతి కనువుగా కొన్ని చిఱు మార్పులు మాత్రము చేయక తప్పినదిగాదు.

అన్నమాచార్యుల శృంగార భావనలు ఆధ్యాత్మికముగా అసాధారణ ములైనవి. ఆది భౌతికముగా అతని యనుభములును అట్టివేయని యూహింప వచ్చును. కనుక ఈ శృంగార సంకీర్తనలలో ప్రతిఫలించిన పురుషోత్తముడగు శ్రీ వేంకటేశ్వరుని విశ్వశృంగారలీలలు, ఆ నిరంకుశ ప్రవాహముతో ఈదులాడుచు తలమునకలై తనుకులాడు విశ్వజీవనాయికల వింతవింత లైన అనుభవాలు, వానిని వెలువఱుచు వివిధములగు సందర్భములు, వాక్యములు, పదములు-అన్నియు అసాధారణములుగానే యుండుట యందాశ్చర్యమేమియులేదు. యథాశక్తిగా వానిని తెలిసికొని సంతరించు ప్రయత్నమిందు చేసితిని. కాని ఎన్నో సందేహములు నిరుత్తరముగా నిలిచినవి. పరిశోధన రసికులకు ఇక ముందు ఎంతోపనియిందు గలదు. భావుకులైన పండితులును గాయకులును ఈ రచనల రసానుభవమును ప్రజల కందజేసిని పంచిపెట్టి వలసిన పూటకాపులు.

ఈ కార్యము నాచే ఇంతవఱకు చేయించినది శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానముల కార్యనిర్వాహకులగు శ్రీ చెలికాని అన్నారావుగారి నిర్హేతుక దయయని, ఈ శ్రీనివాస కైంకర్యమును, ఫలమును, వారివేయని చెప్పుట పునరుక్తి. దీనిని తుడదాకించు నవకాశము గల్పించి శ్రీ వేంకటేశ్వరుడు వారి ననుగ్రహించుగాక.

శ్రీ తిరుమల తిరుపతి దేవాలయ ముద్రాశాలవారు దీనినింత యందముగా ముద్రించి నాధన్యవాదములకు పాత్రులైరి.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా పరిశోధనాలయము, తిరుపతి.
4-10-1956.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
సంగీత వాఙ్మయ పరిశోధకుడు

o—o—o

తాళ్ళపాక పాటలు (సంపుటము 2)

అన్నమాచార్యులు

కొంత విలంబమైనను ఇప్పటికి స్వరపఱిచిన యీ తాళ్ళపాక పాటల రెండవసంపుటమును వెలువఱుప గలిగినందులకు శ్రీనివాసుని సంకల్పసిద్ధతను స్మరించి ధన్యవాదము లర్పించుచున్నాను. ఇందు మఱి యేబదినాల్గు సంకీర్తనల రాగతాళగతు లూహించి స్వర సంయోజన చేయ బడినది. ఇప్పటికి మొదటి సంపుటమున సంకల్పించిన అష్టోత్తరశతమను సాంప్రదాయిక సంఖ్య పూర్తియైనది. ఇంకొక యష్టోత్తర శతపూజయైనను చేయునాశయున్నది. కాని చేయించు కొనువాడు శ్రీనివాసుడు. "పాలుపోసి పెంచిన నాపాలి వేంకటేశ నేతోలుబొమ్మ జుమ్మి" అన్న అన్నమాచార్యుని అమృతవాక్కు [43 వ సంకీ.] నాకిందు స్మరణీయము. ఇందలి సంకీర్తన లన్నియు అన్నమాచార్యులవే. అధ్యాత్మ, శృంగారసంకీర్తనలు రెంటును సంగ్రహింప బడినవి. వీని నేఱు కొనుటకు నాభావనాసౌకర్యము తప్ప వేఱు కారణమేమియు లేదు.

మొదటి సంపుట మందు లేని తొమ్మిది [కొత్తరాగములిందు చేకినవి. నాశక్తి ననుసరించి వాని స్వరూపమును వివరించు [ప్రయత్నము చేసినాను. మొదటి సంపుటమందలి నాస్వరరచనను విశ్వాసముతో అంగీకరించి ఆ పద్ధతిలో [కృతికి తోడుపడిన-పడుచున్న గాయక [కొనుచున్నాను. ఈ సంపుటమంపలివి [కాశంప.

నా యల్ప కైంకర్యమును గొప్పగా భావించి మన్నించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థాన నిర్వాహకులు శ్రీ చెలికాని అన్నారావుగారు శ్రీ వేంకటేశ్వరుని పూర్ణానుగ్రహమునకును, నాధన్యవాదములకును పాత్రులు.

తి. తి. దే. ముద్రాశాలవారు ఈ చిక్కైన పనిని ఇంత యందముగా నిర్వహించుట యందు చూపిన శ్రద్ధయు, ఓర్పును, నాకృతజ్ఞతను చూర గొన్నవి.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యవిద్యా పరిశోధనాలయము, తిరుపతి.
23-10-1956.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
సంగీత వాఙ్మయ పరిశోధకుడు.

o—o—o

శృంగార సంకీర్తనములు (సంపుటము 13)

అన్నమాచార్యులు

ఇది శ్రీ అన్నమాచార్యుల శృంగారసం కీర్తనముల సంపుటములలో రెండవది. ఆదినుండి పదుమూడవది. రేకులలోని రెండవ శతములోని 596 సంకీర్తనలు ఇందు క్రమముగా చేర్చబడినవి.

శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయమును శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానాధికారులు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయమునకు సమర్పించిన తరువాత కొన్నిమాసములలోపలనే నేను వయోపరిమితిని దాటి యున్నందుచే ఉద్యోగమునుండి విరమించుకోవలసి వచ్చినది.

అప్పటినుండి ముందుకు సాగకయున్న యీ సంకీర్తన ప్రకటన కార్యమును మరల శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము వారే స్వీకరించి సాగింప సంకల్పించిరి. శ్రీ కార్యనిర్వాహకులు శ్రీ చెలికాని అన్నారావుగారు మరల ననే్న యీ సంకీర్తనల పరిశోధన కార్యము వహించునట్లు నియమించి యథాపూర్వముగా నా యెడ తమకుగల అసామాన్య ప్రణయమును వెల్లడించి నారు. వారికి నాధన్యవాదములను సమర్పించుచు నాశక్తికొలది ఈ మహా కార్యము సాగించుటకు తలయొగ్గినాను.

శ్రీనివాసుని యనుగ్రహబలముచే రాగల సంపుటములు ఇంతవిలంబము

పరిశోధకులు : రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.
పీఠిక, 1960, మార్చి, 12.
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

లేక క్రమముగా వెలువడగలవని నాయాశంస, నా ప్రార్థన.

ఎప్పటివలె అందచందములకు కొదవలేక యీ సంపుటమును సిద్ధ పఱిచిన శ్రీ వేంకటేశ్వర ముద్రాలయాధికారుల శ్రమక్షమలు నాకృతజ్ఞ తను చూఱగొన్నవి.

శ్రీవికారి, ఫాల్గుణ, శుక్ల 14
స్థిరవాసరము, తిరుపతి.
12-3-1960.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

o—o—o

శ్రీ వేంకటేశ్వర సంకీర్తనలు (సంపుటము 19)

అన్నమాచార్యులు

మరల మూడవసారి నన్నీకీర్తనల పరిశోధన కార్యమునకు లాగుకొని తెచ్చిపెట్టి శ్రీ శ్రీనివాసుడు తన విచిత్ర సంకల్పమును వెలయించినాడు. శ్రీ తిరుమల-తిరుపతి దేవాలయ శ్రీకార్యసభకు అధ్యక్షులైన శ్రీ కల్లూరి చంద్రమౌళి మహాశయులును, కార్యనిర్వాహకులగు శ్రీ బి. నరసింగరావు మహోదయులును, ఆ శ్రీనివాసుని రెండు దీర్ఘదృఢభుజములుగా నన్ను బంధించి పెట్టినారు. ఆ విశ్వాసపుగట్టునుండి తప్పించుకొనలేక తలవంచినాను. వారికి నాహార్దమైన ధన్యవాదములు.

ఈ గొప్పపనికి నాకు చేదోడు వాదోడుగా వారు శ్రీ వేంకటేశ్వర సంస్కృత కళాశాల యందలి ఆంధ్ర-సంస్కృత సాహిత్యోపాధ్యాయులగు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ, శిరోమణి-విద్వాన్-గారిని వీర్పఱిచుట నాయదృష్టము. శ్రీ శర్మగారు అష్టావధానము, ఉభయభాషలందును ఆశుకవిత, మంత్రతంత్రశాస్త్రములు, ఆయుర్వేదము మున్నగు పలువిషయములలో పరినిష్ఠితులు, నిష్కల్మషమై నిష్పక్షపాతమైన మేధ, ప్రామాణికమైన దృష్టి, ఆత్మార్థమైన సదాచార సంపత్తి గలవారు; ఈ పల్లెపట్టులందలి దేసితెలుగు నుడీకారములు చక్కగా నెరిగినవారు. మీదు మిక్కిలి నాయెడ సుస్నిగ్ధమైన హృదయము గలవారు, కార్యోత్సాహపూర్ణులు.

పరిష్కర్తలు: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, గౌరిపెద్ది రామసుబ్బశర్మ.
పీఠిక, 1965, మార్చి, 29.
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

ఇక కావలసినదేమి? యథాశక్తిగా ప్రయత్నింతును. తక్కిన బరువు శ్రీనివాసునిది.

ఈ 'తాళ్ళపాకవారి గేయరచనల' 18వ సంపుటమును సంస్కరించి ప్రకటించిన శ్రీ డాక్టరు పి. జి. జగన్నాథరావుగారే ఈ సంపుటమును గూడ ముద్రణకు సిద్ధపఱచియుండిరి. ఇదిగాక పెదతిరుమలాచార్యుల సంకీర్తనములు గూడ రెండు సంపుటములుగా వారే సిద్ధపఱచి యిచ్చినారు. వారి యేర్పాటు ప్రకారము పెదతిరుమలాచార్యుల సంకీర్తనల పైసంపుటములు 19-వ, 20-వ సంపుటములుగాను, ఈ అన్నమాచార్య సంకీర్తనలది 21-వదిగాను ప్రకటింపవలసినవి. కాని రాశియందును కావ్యగుణము నందును చాలాగొప్పవైనవి పదకవితాపితామహుడగు ఆ సంకీర్తనాచార్యుని కృతులు. కనుక వానిని పూర్తిగా ప్రకటించిన తరువాత ఆయన పుత్ర పౌత్రుల రచనలు ప్రచురింప దగునని, ఈ సంకీర్తనల ప్రకాశనమునకు పితామహులైన శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి యభిప్రాయము. దాని యౌచిత్యమును గ్రహించి వారి తరువాత ఈ పని సాగించిన శ్రీ ఎ. వి. శ్రీనివాసాచార్యులను నేనును ఆ వరవడిలోనే నడిచితిమి. అట్లు అన్నమాచార్యుల ఆధ్యాత్మ-శృంగారసంకీర్తనలు రేకులలోని క్రమము ననుసరించి, ఈ గ్రంథమాల 4వ సంపుటము నుండి 14వ సంపుటము వాక 11 సంపుటములుగా వెలువడినవి. 16వ సంపుటముగా శ్రీ శ్రీనివాసాచార్యుల చిన్న పెరుమలాచార్యుల సంకీర్తనలను పూర్తిగా ప్రకటించి, మరల 17వ సంపుటముగా అన్నమాచార్యుల రచనలనే క్రమముగా సాగించిరి. ఇప్పుడు మేము. శ్రీ జగన్నాథరావుగారు 21 వదిగా నిర్దేశించిన అన్నమాచార్యుల శృంగారసంకీర్తనల సంపుటమును 19 వడిగా ప్రకటించుచు రాబోవు సంపుటములలో ఆ క్రమమునే కడదాక నీదు సంకల్పము చేసితిమి. శ్రీ జగన్నాథరావుగారు సిద్ధపఱచిన పెదతిరుమలాచార్య సంకీర్తనల రెండు సంపుటములును ఆ తరువాత పరిగ్రహింపవచ్చును. అదీ నందోరాజా భవిష్యతి వంటిమాట.

ఈ సంపుటమున అన్నమయ్యగారి శృంగారసంకీర్తనలు 538 గలవు.

ఇవి సాధారణపురేకులలో 501 మొదలు 600 ల దాక నున్న వానిలోనివి. ఇందు 21 మొదలు 30 వఱకును గల పదిరేకులు లేవు. రాగభేదముతో మాత్రము రేకులలో పునరుక్తములైన రెండు కీర్తనలు ఒకతూరియే ప్రకటింప బడినవి. ఆ విషయము అక్కడ క్రింది సూచికలో సూచింపబడినది.

ఈ సంపుటమందలి పాఠమును జాగ్రత్తతో రేకుల ప్రాతతో పోల్చి సరిచూచి సిద్ధపఱుచుట జరిగినది. ప్రకరణము, వాక్యసందర్భము, పాట నిరణము లందలి శబ్దార్థముల పొందిక, ఆ రేకులందలి లిపిపద్ధతి-మొదలగువానిని గమనించి శ్రీ ప్రభాకరశాస్త్రిగారి పద్ధతినే పాటల పాఠములు సమకూర్పబడినవి. ఇట్లు చేయుటలో శ్రీ జగన్నాథరావుగారి పాఠములు అందందు కొంత సవరింపవలసి వచ్చినవి. కాని శ్రీరావుగారి పరిశ్రమమే మాకీ సంపుటపరిష్కరణమునకు మూలవస్తువుగాన వారికి మాధన్యవాదము లిందు చెల్లించుచున్నాను.

నేను సరిచూచి ప్రకటించిన 12వ సంపుటమున, "తొల్లియును మఱ్ఱాకు తొట్టెలనె" అను అన్నమాచార్య సంకీర్తనము పొరపాటున లుప్తమై యుండినది. శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు దానిని గమనించి, తాము ప్రకటించిన 17వ సంపుటపు పీఠిక (పు 6)లో పునరుద్ధరించి చూపినారు. నా యీచేతప్పును చూపినందుకు, అంత మధురమైన ఆ సంకీర్తన నా మూలాన అంతరించి పోనీక మరికెత్తినందుకు వారికి నేను కృతజ్ఞుడను.

శ్రీ శ్రీనివాసాచార్యులు ప్రకటించిన 16వ సంపుటపు పీఠికలో కొన్ని యభిప్రాయములను వెలువఱిచియున్నారు. వానిలో ముఖ్యమైన వానిని గూర్చి నాకుదోచిన మాటలిందు సంగ్రహించుచున్నాను.

(అ) చిన్నన్న—పదకర్త

పెదతిరుమలాచార్యుల నాల్గవ కుమారుడు తిరువెంగళనాథుడు-చిన్నన్న కూడ కొన్ని సంకీర్తనములను రచించి యుండవచ్చుననియు అవి ఇంకను లభింపవలసియున్నవనియు, నేను సస్వరముగా ప్రకటించిన 'తాళ్ళపాక పాటలు' తొలి సంపుటపు పీఠికలో వ్రాసితిని (పు. 7). "చిన్నన్న ద్విపద కెఱుగును" అను తెనాలి రామకృష్ణుని మాటకు ద్విపదలు రచించుట

యందు చిన్నన్నకు అభిమాన మెక్కువ అని మాత్రమే అర్థము చెప్ప దగును గాని తక్కిన రచనా భేదముల నతడు చేయలేదని కాని, చేయలేడని కాని చెప్పదగదు. అట్లే "పన్నగ బెద తిరుమలయ్య పదముల కెఱిగున్" అను పై ఖండము రెండవ వాక్యమునకును పడిసులు తప్ప ఇంకేమియు అతడు రచింప లేదని చెప్పలేము గదా! అతని రగడ, వృత్తశతకము, నీతి సీస శతకము మొదలైన భిన్న రచనలను మన మెఱుగుదుము. అతని 'ద్విపద హరివంశము' వలె చిన్నన్న పదములును కాలవశమున వెలికి రాకపోయి యుండును. తాత, తండ్రి, అన్న అంచఱును పదము లక్షణ ముగా అద్భుతముగా రచించి లోకమును సమ్మోహింప జేయుచుండగా, చిన్ననాటి మహోకవికి ఆ వాసన, ఆ యుత్సాహము తాకకుండునా? మరి చిన్నన్న మేనమరది రేవణూరి వెంకటాచార్యుడు శ్రీపాదరేణుప్రభావ ముసందు (1-52) "మా తాళ్ళపాక చిన్నన పదంబులు పాడిన నాడె సర్వరా ట్ప్రేమల విభుండు" అని సగర్వముగా చెప్పుకొన్నమాట నమ్మరాని దని శ్రీనివాసాచార్యుల యభిప్రాయము. దానికి కారణము, వెంకటార్యుడు 'శకుంతలా పరిణయము' నందు పెద తిరుమలాచార్యుల కుమారులను 'తార్యారుగా' చెప్పుటయని వారు సూచించినారు (సం. 16-పీఠిక పు. 34). పెదతిరుమలయ్య కుమారులలో ముగ్గురికి వేంకటనాథనామము గలదు. వ్యవహార సౌకర్యమునకై వారిని క్రమముగా పెద్ద తిరువేంగళనాథుడు, చిన్న తిరువేంగళనాథుడు, కోనేటి తిరువేంగళనాథుడు అని వాడినట్లున్నది. ఇంకను పెద్దన్న, చిన్నన్న, తిరువేంగళప్ప అనియు వాడియుందురు. శకుంతలాపరిణయకర్త ఇండు చేసిన 'తార్యారు' చిన్నన్నను కోనేటి తిరు వెంగళనాథుడని, కోనేటి వెంకటనాథుని తిరువెంగళప్పయనియు పేర్కొనుట మాత్రమే. ఇదొక పెద్దలోపముగా గొని శకుంతలాపరిణయ కర్త-సమకాలి కుడైన మేనమరది-చెప్పినమాటనే తిరస్కరించుట తగదు. ఇట్లే "తాళ్ళ పాక చిన్ననన్న పండెమీటులుగావు" "అల తాళ్ళపాక చిన్నన్న రోమమునైన తంబుర దండెకు దంతు లౌనె" అను అర్వాచీనులు చెప్పిన మాటలు గూడ వట్టి బూకరింపులని తోచునవే యరానివే. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు "చిన్నన్నకు అన్న, తండ్రి, తాత, గొప్ప గాయకులు గాన, యిటీవలివారు గ్రంథముల బట్టి చిన్నన్ననే యెఱిగినవారుగాన, వారియోగ్యత సీతనికి జేర్చి చెప్ప

యుండవచ్చును" అని భావించుటకు కారణము "చిన్నన్న గాయకుడనుట కిక్కడి రాగిరేకులలోగాని గ్రంథములలోగాని యాధారములు గానరావు" అనుటయే. కాని వెనువెంటనే "కాక యీతడును గాయకుడేమో!" అనివారు తమ యూహను కొంత సడలించు కొన్నారు. (అన్నమాచార్య చరిత్ర పీఠిక, పు. 95). వారిది పౌరాణిక చిత్తవృత్తి. చిన్నన్నను కవిగా మాత్రమే యితరులు పొగడుట ప్రాధాన్యవ్యపదేశమంతే. అతడు యోగియనియు ఎవరును పేర్కొనినట్లు కానరాదు కాని పరమయోగివిలాసము రెండవ యాశ్వాసమున శ్రీ భక్తిసారచరిత్రమున చిన్నన్న వెలువఱిచిన యోగ విజ్ఞానము అసాధారణముగా నున్నది. ఇంక నేయే విద్యలలో యెంతెంత అతని ప్రతిభ ప్రవహించెనో మనకేమెఱుక?

చిన్నన్న సంకీర్తనరచన చేసినాడని నేను భావించుటకు అతనివని గాయక సంప్రదాయమున నిలిచి నేటికి లభించు రెండు కృతులాధారమని వెనుక సూచించితిని (తాళ్ళపాకపాటలు 1సం. పీఠిక పు. 7) అవి యీ శతాబ్దాదిలో సుబ్బరామదీక్షితులు రచించిన 'సంగీత సంప్రదాయ ప్రదర్శిని' యందున్నీతములైనవి. అవి యిట్లున్నవి

[1. కీర్తనము – శంకరాభరణరాగము – ఆటతాళము – తాళ్ళపాకం చిన్నయ్య].

ప॥ శ్రీహరిపాద తీర్థమే–చెడనిమందు

ద్ర॥ మోహపాశమును గోసి–మోక్షమిచ్చేమందు

చ॥ 1 · గౌరవై కాయని మందు–కడుచల్లజేసేమందు
కారవై కంటగించని–కమ్మని మందు
నూరని పూయనిమందు–నునుపు కనినమందు
వేరు లెల్లంకులు లేని–వెల కేనిమందు. ॥శ్రీహరి॥

2 గురుతైన రోగముల–గుణము జేసేమందు
దురితమ్ము లెడబాపే–దొడ్డమందు
నిరతము ప్రబ్రహ్మాదులు–నిలిచి సేవించేమందు
నరకము చొరనీయని–నయమైన మందు ॥శ్రీహరి॥

3 పొంకముతో గుణముల-పొందజేసేమందు
మంకుబుద్ధిని నెడబాపి-మన్నించేమందు
పంకజాక్ష ! పసన్న-వెంకటరాయనిమందు
శంకలెల్ల పోగొట్టి-సంరక్షించే మందు. ॥శీహరి॥

(ప్రథమాభ్యాస పుస్తకము పు. 101)

[2. కీర్తనము – కాంభోజి రాగము – ఝంప తాళము–తాళ్ళపాకం చిన్నయ్య]

ప॥ నా మొరాలింపవే–అయ్య వెంకటరమణా–నామీదదయలేదా

అ॥ ప్రేమతో నేటికిని–శరణాగతత్రాణ–బిరుదు పోనాడ తగునా వో స్వామి

చ॥ 1 కరిమకరిచే జిక్కి-గాసిబడి మొరలిడగ-గాచి రక్షించలేదా
నరమృగాకృతిబూని–ప్రహ్లాదు కొరకుదా–నవనాథు చీరలేదా
పరగద్రౌపదిమాన–భంగంబు గాకనే–పలువలువ లొసగలేదా
మరచితివో ఆనాటి – శౌర్యప్రభావంబు – మటియన్నచందమేమీ స్వామి ॥నా॥

2 మున్నురక్కసబాధచే-భయార్తులైన-మునుల కభయము లియ్యవా
పన్నగా లాక్షాగృహాగ్నిచే బడకుండ–పాండవుల వెడలింపవా
మొన్న నీశరణుజొచ్చిన విభీషణు లంక–కెంన్న రాజుగ జేయవా
ఖిన్నుడని భాగ్యోపహీనుడని ననున్నడలచి క్రీగంట జూడరావా వో స్వామి ॥నా॥

3 గోపుల మీరకు పరాకు సేయక నాడు–కొండ వేలెత్తలేదా
అపత్ప్రసన్నుడని జనులు పలికిన పలుకు–లకట దబ్బర లాయెనా

నాపుణ్యమో లేక నిత్యోవానంద-మహిమచే మరచినావో
యీపట్ల అలమేలుమంగ వేంకటరమణ-యెవరు నన్నాదరించేరు
వో స్వామి ॥నా॥*

(సం. ప్రదర్శని; భా 2. అనుబంధము 13, పుట 52)

ఈ రెండును చిన్నన్నవి కావని తీర్మానమగువఱకు నన్నెవరును "పెడదారి" ని పెట్టలేదని; ఇది "దురభిప్రాయము" కాదని సహృదయులు భావింపలేరు. కనుక "చిన్నన్న కేవలము కవిత్వము చెప్పినవాడేయనియు పదములు రచించి పాడినవాడు కాడనియు" శ్రీనివాసాచార్యులవలె దృఢముగా నేను తెలియలేను.†

---

* సాహిత్యము మాత్రమే యథామూలముగా ఇందు చూపితిని. స్వర రచన విస్తరభీతిచే వదలితిని. 1-వ పాటలో 'శ్రీపతిపాద' అని నేను 'తాళ్ళపాకపాటలు' పీఠికలో వ్రాయుట చేతప్పు. ఈ రెండే తాళ్ళపాక వారి పాటలలో సాంప్రదాయిక స్వరముతో నేటికి లభించునవి.

† తాళ్ళపాకము చిన్నయ: ఇతడు తెలుగు బ్రాహ్మణుడు. వెంకటాచలపతి భక్తుడు. తిరుపతిలో నుండినవాడు. వెంకటరమణ విషయమై భాగవత సంప్రదాయముగా వాడుకలోగల ఉత్సవ పద్ధతి నేర్పఱిచిన పుణ్యపురుషుడు. దానిలో-తోడయ మంగళము, మంగళము, శరణు, హెచ్చరిక, కీర్తనములు, ధూపదీపాలంకారనైవేద్యాద్యుపచారముల కీర్తనములు, పవ్వళింపు, దివ్యనామసంకీర్తనము, వసంతోత్సవముల కీర్తనములు, స్వామిని మేలుకొలుపుటకై కీర్తనములు ఇవి మొదలైనవియు నణగియున్నవి. ఇదిగాక విడికీర్తనములును గలవి. ఇతని భక్త్యాతిశయము వలన మాటిమాటికి వెంకటరమణుడు ఇతనికి సాక్షాద్దర్శన మిచ్చి మాట్లాడినట్లు పెద్దలు జెప్పుచున్నారు. భజనపద్ధతికి యితడే మూలపురుషుడు." (సం. సం. ప్రదర్శని, వాగ్గేయకారులచరిత్ర, 8వ పుట). పై సుబ్బరామదీక్షితుల మాటలు గాయక ప్రపంచమున చిన్నన్నకు గల సాంప్రదాయిక స్థానగౌరవమును స్పష్టపరుచుచున్నవి.

ఈ సందర్భమున 'తాళ్ళపాకవారి పదములు' మరి మూడు నా దృష్టి కందినవి. కర్త నిర్దేశములేదు. చెన్నపురి వీణ రామానుజయ్య అను పండితుడు 1912 వ సంవత్సరమున రచించి మద్రాసులో ప్రకటించిన 'సంగీత సర్వార్థ సారసంగ్రహము' నందు ఇవికలవు (పు 142). ఆ పుస్తక మిప్పుడు దుర్లభము గనుక ఆ పాటలు నశించిపోకుండుటకై యిందుద్ధరించు చున్నాను, యథామూలముగా :

[1. గౌళిపంతురాగం-అట చాపుతాళం-తాళ్ళపాకవారి పదములు]

ఏరీతి బొంకేవురా నాసామి ॥ప॥

ఏరీతి బొంకేవు ఇదుగో నీభుజమును। దేలిన పసపునిగ్గులు నీమేనెల్ల। జారిన కుంకుమ జగ్గులు। నీరెప్పలపై। పేరిన కాటుక కగ్గులు। వేణంగిరాయ। రారా యేటికి సిగ్గులు నాసామీ ॥అ॥

1. ఎంకువు తక్కేవు మందగమనలతో పొందుసేయ నంటివి
పొందులు జేయగ బోకుంటే యేడది సందిట గాజుల కోతలు
నీమేనెల్ల చిందిన గంధపు పూతలు। నీ పెదవుపై కందిన కెంపుల
పూతలు। చెక్కిట చెలువొందిన కస్తూరిగీతలు। నా సామి ॥ఏ॥

2. నిన్ననాతోనల్ల నీరజముఖియింటి-కెన్నడు పోనంటివి।
ఎన్నడు పోకుంటే యిదిగో నీచెవినంటుకున్నది ముక్కరనొక్కులు।
నెత్తురు గమ్మిచున్నది రొమ్మునపెక్కులు। నీనాలుకపై సున్నము
మించిన పొక్కులు। నీ నిడువాలు కన్నుల నిద్దుర సొక్కులు। నా
సామి ॥ఏ॥

3. నిక్కము వేణంగి నిలయుడ। ననుగూడి యెక్కడ పోనంటివీ
యెక్కడ పోకుంటే యిదుగో నీగళమున చొక్కపు చందురుకూనలు।
నీ మేనెల్ల
చిక్కిన చెమట వానలు। నీశిఖలోను సొక్కిన పువ్వుల సోనలు।
ననునంటకు మిక్కిలి నామీదానలు। నాసామి. ॥ఏ॥

[2. కేదారగౌళరాగము-ఝంపెతాళము]

భామ శృంగారించు భావమే యందము ॥ప॥

కామని రతిపాట కాంతకీలాగు ॥అ॥

1. పూవొకటి వికసించె పున్నమచం్రదునివలె పూమీద మరిరెండు పూలుబూసె
రెండు పూవుల నడుమ పూసెనొక పువ్వు పూవు కింద ముప్పది రెండు పూమొగ్గలెత్తె.

2. పక్షి యొక్కటి వాలె భద్రదేహమనగాను పక్షిమీదను రెండు పక్షులాయెన్
రెండుపక్షుల నడుమనే ప్రాలెనొకపక్షి పక్షితోజోడుగా పలికెనొక పక్షి ॥భా॥

3. చిగురెత్తునే రెంటి చెందామరోయనగ చిగురుమీదను రెండుచిగురులెత్తెన్
చిగురుబోణియింట శ్రీ వేంకటేశుడు చిగురులోపలితేనె చెలగి చవిజూచెన్ ॥భా॥

[3. కేదారగౌళరాగము–ఝంపెతాళము]

ఎటువంటి రాజీకమే చెలియ నేడు ॥ప॥
కటకటా యెందైన కంటిరా మీరు ॥అ॥

1. గోకంట్లసీమ పెనుకూటంబు మూకచే భారంబు చక్రములు పట్టుబడెను
సారెసారెకు మధ్యదేశంబు బయలాయె చేరి మధురాపురము సూరలటుబోయెన్

2. కదిసియట్టిట్టాయె కాశ్మీరమండలము నెరిచిక్కువడెను కుంతలరాజ్యము
వరుసచీకాకాయె నెరికుంభకోణంబు తురువుగాయల గోలకొండలో నాయెన్.

3. వింతపూర్వుల పూర్వులిడవండు విడిచిన కొండతామెరకోలన కోలుపాపె

నంత శ్రీ వేంకటేశుడలమేలుమంగజేరి సంతతము కల్యాణ
సామ్రాజ్యమేలెన్.*

(ఆ) పాటల స్వరముల లేఖన పద్ధతి

స్వరవిన్యాసము తోడ కీర్తనలు వ్రాసి పెట్టుకొను పద్ధతి మనదేశ
మున ఇటీవల వ్యాప్తికి వచ్చినదని సంగీత విద్యార్థులును విద్వాంసులును
ఎఱుగుదురు. ఆ మాటయే నా "తాళ్ళపాక పాటలు" మొదటి సంపుటమున
(పు 6) నేను సూచించితిని. ఆ విషయమున శ్రీనివాసాచార్యులకు కొంత
సందేహము గలిగినది. దానికి కారణము వారు శ్రమించి బయటికి దీసిన
రెండు పెద్ద శిలాఫలకములు. అవి తిరుమల శ్రీసన్నిధి 'చంపకప్రదక్షిణము'
మొదట నుండినవట. సస్వర సాహిత్య విన్యాసమును అవి చూపుచున్నవి.
తిరుపతి సంస్కృత కళాశాల యావరణములో పడియున్న ఆ ఫలకములను
నేను పలుమారు చూచినాను. వ్రాత చాలాభాగము అరిగిపోయినది. కనుక
చదువుకొనలేక పోయితిని. ఈవల శ్రీనివాసాచార్యులు ప్రయత్నించి వాని
ప్రతిబింబములు దీయించి యీ గ్రంథమాల 16వ సంపుటమున ప్రకటించుట
శ్లాఘ్యమైన పని. ఆ ఫలకములు చిన్న తిరుమలాచార్యులే చెక్కించి నిలిపి
నాడని, అతని "సంకీర్తన లక్షణము" నకు లక్ష్యములందు చెక్కినట్టున్నదని
వారు వ్రాసినారు. (సం. 15 III, 16. 33-35) ఆ విషయము లింకను
నిర్ధరింపవలసినవి. ప్రతిబింబములు గూడ నాదృష్టికి చాలా అస్పష్టముగానే
యున్నవి. "తరువాతి సంపుటమున నీశిలాఫలకముల పాఠము వివరణ
ములతో పాటు ప్రకటించుటకు యత్నింతును". సం. 16-36) అన్న వారి
సంకల్పము ఇంకను కొనసాగలేదు. ఆ వివరముల వ్యాసమును దయ
యుంచి వారు మాకిచ్చినచో కృతజ్ఞతతో రాబోవు సంపుటములందు వారి

---

* ఈ కృతులలో మొదటిది తాళ్ళపాకవారిది కాదేమో! వేంకటేశ
ముద్ర దానికి లేదు. వేణంగినిలయుని పేరున్నది. మరి తాళ్ళపాకవారి పాట
లలో రేకులలో గొళిపంతురాగము కానరాదు. భాష-భావములు రెండును
కొంత తరువాతికాలమును సూచించుచున్నవి. తక్కిన రెండును తాళ్ళపాక
వారివి కావచ్చు.

పేరనే ప్రకటింపగలము.

అదియట్లుండనిత్తము. స్వరసాహిత్య లేఖనమును గూర్చిన నాయభి ప్రాయమును కొంత యిక్కడ వివరింపవలసియున్నాను. పాటస్వర ములను సరిగమపదని అను సంజ్ఞలచే గుర్తుగా వ్రాసిపెట్టు కొనుట చాలా ప్రాచీనమైన సంప్రదాయమే. మరియు సహజముగా ఆవశ్యకమైన పద్ధతియే. 13వ శతాబ్దిలోని నిశ్శంక శార్ఙదేవుడే తన సంగీత రత్నాకరమున ప్రాచీన మైన పాటలు కొన్ని సస్వరముగా నిలువ చేసినాడు. అది నాకు పరిచిత చరమైన విషయమే. కాని ఆ పద్ధతి, వేదఋక్కులవలె ప్రత్యక్షరమునకును నియతమై వ్యాకరణనిబద్ధమైన స్వరసంయోజనము గల్గి, మార్పుల కేమాత్ర మును అవకాశమియ్యరాదని నియమింపబడిన గీతముల విషయమున మ్రాతమే కొంతకాలము వ్యాప్తిలో నుండినది. సంగీత రత్నాకరమున పై పాటలు బ్రహ్మచేసిన శివస్తుతులని, వానిని మార్చుట వేదస్వరములను మార్చినట్లే పాపహేతువగునని శాసింపబడినది. అది మార్గసంగీత విధానము. ఉపవేదమను ప్రతిష్ఠను సంగీతవిద్యకు నిలబెట్టుటకై చేసిన పనియది. కాని సప్తస్వరములు మాత్రమే కలిగిన సామవేదముననే గానవిషయమున ఎన్నో విభేదము లేర్పడినవి. 3-4 స్వరములు మాత్రమేకల ఋగ్యజుర్వేద ములందు మాత్రము అకట్టుబాటు కృతకృత్యమైనను అందును విభేద ములు నెలకొనక పోలేదు. ఇక 22 శ్రుతులవరకు స్వరభేదములు పెరిగి, మూడుస్థాయులు గలిగి, వాదవివాద సంవాదాను వాదముల స్వాభావిక సంబంధమును గమనింపవలసి, లయభేదములైదు, అసంఖ్యతాళములను గలిగి, రక్తిప్రధానముగా, రాగభేదములతో, గమక విన్యాస విలాసములతో నిబద్ధారూపములతో, విచ్చలవిడిగా పెరిగిన సంగీతమును వ్రాతకు లొంగదీ యుట సాధ్యము గాకపోవుట వింతగాదు. తరువాత వివిధముగా ప్రచార ములోనికి వచ్చిన 'దేశి' ప్రబంధములు ఎన్నో ఇట్టి అక్షర స్వరనియమ ములో వ్రాత కెక్కినట్లున్నది, గాని పైకారణముచేతనే అవన్నియు ఇంచు మించు అంతరించిపోయినవి. గీతములు, స్వరజతులు, వర్ణములు, మొద లగు కొన్నిరచనలు మాత్రమే నేటికి స్వరము మొదలు కంఠపాఠము చేసి కొని సాధింపవలసినవిగా ప్రాతకెక్కినవి. మరిసాహిత్య ప్రధానమై అర్థ భావోద్రేకములకు తగినట్లు స్వరములను లొంగదీసి పాడవలసిన కీర్తనలు

పదవర్ణములు మొదలైనవి, వినువారి నాకర్షించుటకు వివిధ రక్తిమార్గములు కల్పించి పాడవలసినవి, నోటిపాఠముగానే ఇంకను సాగవలసియున్నవి. ప్రబంధము లంతరించి సంకీర్తనలు వ్యాప్తికి వచ్చిన 15, 16వ శతాబ్దులలో సాంప్రదాయికముగా తాళ్ళపాకవారును కొన్ని ప్రబంధములు రచించి యుందురు. అట్టి స్వరప్రధానమైన కొన్ని రచనలే పై శిలాఫలకములతో ప్రాయించి నెలకొల్పినారని ఊహింతును. పల్లవి చరణములు అను రెండంగములు మాత్రమే కల సంకీర్తనవలెగాక, ఉద్గ్రాహము, ఆభోగము మొదలగు ప్రబంధ 'ధాతు'వుల పేర్లు ఆ శాసనశిలలలో కానవచ్చుట, సాహిత్యము చాల మితముగానుండి సామవేదమునందలి 'స్తోభ' ములవంటి అయ్యం-వయ్యా-తియ్యా-అంవో అను నక్షరములు విస్తరముగా కంటికి తోచుట, ఇవి నా యూహకు కారణములు. సంకీర్తనములు గూడ సస్వరముగా ప్రకటించు తలపుండెనేని యీ తామ్రశాసనములలో కొన్నింటనైనను కొన్ని సంకీర్తనములనైనను అట్లు చేయలేకపోయిరా పెద్ద-చిన్న తిరుమలయ్యలు? మరి పదములు, కీర్తనలు, సూళాదులు మొదలగు తర్వాతివారి అర్థభావప్రధాన రచన లేవిగాని సస్వరముగా ప్రవాసినవి తెలుగు కన్నడ భాషలలో ఒక టియు నాకంటికందలేదు. నాయెఱిగినంతలో 19వ శతాబ్ది కడపటిభాగమందే సుమారు అట్టి ప్రయత్నము జరిగినది. నాసంగీత ప్రథమాచార్యులైన శ్రీ కరిగిరిరాయలు మైసూరిలో, సుబ్బరామ దీక్షితులు ద్రవిడదేశములో, అట్టి ప్రయత్నము చేసినవారిలో సగ్రగణ్యులు. వారి శిష్యపరంపర ఇంకను ఆ పని ముందుకు సాగించుచున్నది. దానివలన ఇప్పుడు కొంత స్పష్టముగా పాటలను స్వరపఱచుట సాధ్యమైనది.

[ఇ] సంకుసాల నరసింహకవి తాళ్ళపాకవాడా?

'కవికర్ణరసాయన' కర్తయగు సంకుసాల నరసింహకవిని గూర్చి, అన్నమాచార్యులకు పెద్ద భార్యయందు జన్మించిన నరసింహకవియే అతడన్న శ్రీనివాసాచార్యుల నిస్సందేహమైన నిర్ణయము (సం. 16-పు. 9) గూడ ఇంకను గొంత నాన్చి చేయదగినది.

శ్రీ ప్రభాకరశాస్త్రిగారు మొట్టమొదట అట్లుకావచ్చునని యూహిం

చినవారు గాని నిర్ణయించినవారు గారు. (అన్నమా-చరిత్ర. పీఠి. 81-84) ప్రామాణికమైన వారి చరిత్రవిజ్ఞానమున కట్లు నిశ్చయించు సాధనములు చాలవుగనుక. నరసింహకవిదిగా పైగ్రంథమొకటే మనకు లభించినది. అందతడు తలిదండ్రులు కులగోత్రములు మొదలగు తనవిషయము లేవియు పేర్కొనలేదు. భట్టపరాశర శిష్యుడనని మాత్రమే తెలిపెను. అది అతని శ్రీ వైష్ణవ సంబంధమును దెలుపునుగాని, ఆ శిష్యత్వమెట్టిదో తెలుపదు. విశిష్టాద్వైత సిద్ధాంతమందు భక్తిశ్రద్ధలు అతని కుండినవనవచ్చును గాని, కృత్యాదిలోని శివగణేశ స్తుతి చేయుటచే అతని మతశ్రద్ధ అన్నమయ్య, చిన్నన్న మొదలగు వారి యభినివేశము వంటిదిగాక, పెద్దనామాత్యుడు, రామకృష్ణుడు మొదలైనవారి దానివలె కొంత సంకీర్ణముగానే యుండినదనక తప్పదు. అతడు అన్నమయ్య కుమారుడే యై యుండినచో ఇట్లేల జరిగినది? లక్షణగ్రంథములందలి 'సుంకసాల' వ్యవహారమునను ముద్రణమందును గల 'సంకుసాల' ఒకటే కావచ్చునా? ఐనను అది 'సుంకేసుల' కు రూపాంతరమే యగునా? రాయలసీమలో 'సుంకేసుల' అను గ్రామములు మరికొన్ని గలవని వినికి. అట్లుండగా కడపజిల్లా పులివెందల తాలూకాలోని 'సుంకేసుల' యే నరసింహకవి పేరుకంటినదని యెట్లు చెప్పగలము? మరి ఆ 'సుంకేసుల' అతని 'తాతగారిల్లు' అన్న నిర్ణయమున కాధారమేమి? నరసింగన్న సుంకేసుల నుండి అహోబలము చేరి తమ మతగురువుల ప్రోత్సాహముతో శ్రీరంగము చేరినట్లున్నాడు (VI-9) అని యూహింపనేల? అహోబలమునననే మఠము స్థాపించుకొని నరసింహోపాసన చేయుచున్న మతగురువులు శ్రీరంగమునకు పొమ్మని శిష్యుని ప్రోత్సాహింపనేల? ఇట్టి ప్రశ్నలెన్నో ఇప్పుడు దొరకినవానికంటె ప్రబలములైన ఆధారములు దొరకనిచో తీరవు.

(ఈ) తిరుమలలో దివ్యప్రబంధముల పారాయణము

శ్రీనివాసాచార్యుల యూహలు ఇట్టివింకను కొన్ని గలవు. అన్నిటికంటె ప్రబలమైనది "ఈ అన్నమయ్య కీర్తనలు తిరుమలలో స్వామి సన్నిధిని ద్రావిడ వేదమునకన్న పూర్వము నుండియే గానము చేయబడుచుండెడివి. ఆ తర్వాత నీ ద్రావిడాగమమునకు ప్రవేశములోన లభించినట్లున్నది" అన్నది. (సం. 16-33).

ఇది చాలా బరువైన విషయము. దివ్య ప్రబంధములను పునరుద్ధరించిన శ్రీనాథమని యోగీశ్వరుడు ఆ శ్రీసూక్తులను అన్ని వైష్ణవదేవాలయాలలోను నిత్యనైమిత్తిక పూజోత్సవాల కాలమున పారాయణము చేయవలసిన కట్టడి చేసినవాడు. తిరుమల శ్రీనివాసుల సన్నిధి శ్రీవైష్ణవులకు పరమ ప్రాప్యములైన దివ్యదేశములు నాల్గింటిలో నొకటి. అట్టిచోట 16వ శతాబ్దము వరకు ఆ సూక్తులకు అవకాశము లేకపోవుట యెట్లు? అన్నమయ్య సూక్తులకు ముందు ఏ కృతులను పాడుచుండిరి? అదిగాక చిన్నన్న, పరమయోగి విలాసమున నాథముని చరిత్రమునందు (ఆ8. పు. 477) ఇట్లు వ్రాసెను.

"దివిజగానమున దద్దివ్యప్రబంధ-నివహంబు తాళమానితముగా బాడి, తన శిష్యవరుల కందఱకు నాకృతుల-నొనర నవ్విధమున నుపదేశ మొసగె నటుగాన నీదాస్యవిడాగమాంతములు-పటుగతి దదన్వయపాలుర చేత విను చుండునెపుడు శ్రీ వేంకటేశ్వరుడు....."

నాథమునిగారి కాలము 10 వ శతకపుటాది. నాటినుండి నేటిదాక పాంచరాత్ర వైఖానస సంప్రదాయములలో దేనిప్రకారము ఆరాధనము జరుగుచున్న యే విష్ణుదేవాలయమందైనను దివ్యప్రబంధ పారాయణము లేకుండదు.

తాళ్ళపాక కవుల చరిత్రప్రభావములు, రచనలు, ఎంతో ఆ కాలమున విరివిగా ప్రబలముగా దేశమున వ్యాపించియుండి యుండవలయును. వానిని సంగ్రహించి ప్రకటించుట శ్రమసహిష్ణువులైన ఉత్సాహులు, తరుణులు, చేయవలసినపని. శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులు ఆ విషయమున చూపుచున్న ఉత్సాహప్రయత్నములు శ్లాఘనీయములు.

అన్నమాచార్యుల చరిత్రకు సంబంధించి యీవల నాదృష్టికి వచ్చిన విషయ మొక్కటి ఇక్కడ ఉదాహరించుచున్నాను.

సిద్ధనంజేశుడను వీరశైవ కన్నడకవి 'గురురాజ చరిత్ర' అను తన గ్రంథమున లక్ష్మీభక్తుడను కన్నడపద కవిని గూర్చి యీ విషయములను పేర్కొన్నాడట.

"ఇతడు గారల దిన్న అను గ్రామము నందలివాడు. గురులింగ

జంగమారాధకుడు. తత్వజ్ఞాని, వేదశాస్త్ర పురాణ పారంగతుడు. పాంచాళ (కమసాలి) వృత్తిగలవాడు. ఇత డొకతూరి శివాధిక్యమును స్థాపించు, క్షేత్రములను దర్శించుచు 'రాచవట్టి' కి వచ్చి అక్కడ తనయంగడి పెట్టి కొంత కాలముండి గంగాధరుడను శైవరాజును వీరశైవునిగా చేసెను. అక్కడ నుండి ముందుకు వెళ్ళినపుడు, వైష్ణవాచార్యుడైన తాళ్ళపాకం అన్నమయ్యయనువాడు తన యిష్టదైవమైన యోగంటీ యీశ్వరు (వేంకటేశ్వరు)డే గొప్పవాడు తక్కిన దేవతలు అనిత్యులు అనిపదాలు కట్టి పాడుచుండుటను చూచెను. అప్పుడు అన్నమాచార్యుడు లక్ష్మాభక్తుని పాటలలో శృంగారరసము లేమిని ప్రస్తావించి విమర్శింపగా, లక్ష్మాభక్తుడు 'తన తల్లిదండ్రుల శృంగారమును గూర్చి చెప్పెడివాడు సత్పుత్రుడుగాడు' అని ప్రత్యుత్తరమిచ్చెనట. ఆ తిరుపతి తిమ్మప్ప చేత శివాధిక్యమును పలికించెనట."

పైమాటలు మైసూరి విశ్వవిద్యాలయమున కన్నడ 'రీడరు' గానున్న శ్రీ ఎల్. బసవరాజుగారు రచించిన 'శివదాస గీతాంజలి' అను చక్కని గ్రంథపు పీఠికలోని వానికి (పు 114) అనువాదములు. వీరశైవుల పవ సారస్వతమును గూర్చిన యెన్నో ప్రామాణికములైన కొత్తవిషయములు ఆ పీఠికలో సవిమర్శముగా సంగ్రహింపబడినవి. 188 శివకీర్తనలు పరిష్కరించి అందాయన ప్రకటించినారు.

పైవాక్యములందలి 'గారలదిన్న' అనంతపుర మండలమందు గుంతకల్లు రైలుమార్గమున అనంతపురము తరువాతి స్టేషనుగానున్న గ్రామము గావచ్చును. కడప జిల్లాలో నేటికిని ప్రసిద్ధమైన శైవక్షేత్రమైన 'రాచవటి'—'రాయచోటి' కలదు. శైవ వైష్ణవ భక్తులకు ఆ కాలమున ఇట్టి వాద వివాదములు జయపరాజయములు జరిగినట్లు, వారెన్నో అద్భుతచర్యలు-పవాదములు ప్రకటించినట్లు గ్రంథగతమైన సాక్ష్యమెంతో కలదు. అది ఆ యా భక్తుల శ్రద్ధాబలమును యోగశక్తిని తెలుపునుగాని పరతత్వస్వరూప నిర్ణయమునకు ఏమాత్రమును పనికిరాదనుట వివేకశాలులందఱును గ్రహింప గల విషయము. చారిత్రికముగా ఇట్టి సందర్భములు అసత్యములని త్రోసి

వేయనక్కరలేదు. ఇంతకన్న పైసందర్భమును గూర్చి ప్రకృతమేమియు చెప్పలేము.

ఇంతకంటె ఈ పీఠికను విస్తరింపబనిలేదు. ఈ సంపుటము ముద్రణ మును ఎంతో చక్కగా ఓర్పుతో నిర్వహించి సహాయపడిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థాన ముద్రాశాలాధికారులకు హార్దమైన ధన్యవాదములు.

తిరుపతి.
29-3-1956

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
సంగీత వాఙ్మయ పరిశోధకుడు

o—o—o

శృంగార సంకీర్తనలు (సంప్రుటము 20)

అన్నమాచార్యులు

శ్రీ అన్నమాచార్యుల శృంగారసంకీర్తనలు, రేకులు 501 నుండి 600 వరకును గలవానియందలివి 538 కీర్తనలు 19-వ సంపుటముగా యథాశక్తి పరిష్కరించి, కడచిన 18-వ అన్నమాచార్యోత్సవ సందర్భమున వెలువరుప గలుగుట శ్రీ శ్రీనివాసుల యనుగ్రహఫలము.

ఇప్పుడు 601 నుండి 700 లదాక రేకులలోని పాటలను ఈ 20 వ సంపుటముగా ప్రకటించుచున్నాము. ఈ రెండు సంపుటములను గూడ వైయుత్సవము నాటికే ప్రకటింప సంకల్పించి, సిద్ధపరచియున్నను ముద్రణసౌలభ్యము చాలక అట్లు చేయ వీలుపడలేదు. రాబోవు ఉత్సవకాలమున ఇది గాక మరి రెండు సంపుటములైనను ప్రకటించి, నన్ని కైంకర్యమునకు నియోగించి ప్రేమగౌరవములు వెలయించిన శ్రీ దేవస్థాన శ్రీ కార్య నిర్వాహకుల పెద్దయప్పమీది వడ్డియైనను చెల్లించు ప్రయత్నము చేయు సంకల్పము గలదు. ఈ కైంకర్యమునకు సర్వవిధముల సాహాయ్యము నెరపు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు నా రెండుచేతుల యూత. అందు మీద శ్రీ శ్రీనివాసుల దయ.

"అకించననిధిం సూతి మపవర్గ త్రివర్గయోః!
ఆంజనాద్రీశ్వర దయామభిష్టామి నిరంజననామ్!

-(దయాశతకం, 10)

పరిష్కర్తలు: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, గౌరిపెద్ది రామసుబ్బశర్మ.
ప్రతిక, 1965, ఏప్రిల్, 12.
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

అను శ్రీ వేంకటనాథసూక్తిని నమ్మి స్మరింతును.

19-వ సంపుటముతోవలె ఇందును మరికొన్ని అపూర్వపదముల సమీక్షచేసి చేర్చినాము. (అను 1) ఈ సందర్భమున కడచిన సంపుటి మందే కృతజ్ఞతతో తెలిపికొనవలసిన విషయమొక్కటి పొరపాటున తప్పినది. ఇప్పుడు తెలుపుకొనుచున్నాను. ఈ పరిష్కరణభారము వహించినప్పుడు మిత్రులు శ్రీ జీరెడ్డి చెన్నారెడ్డిగారు, శ్రీ వేంకటేశ్వర విశ్వకలాశాలయందు ఆంధ్రోపన్యాసకులు, తమవద్దనున్న ప్రాచీనమైన పెద్ద తమిళ-ఇంగ్లీషు నిఘంటు వొకటి—(A Dictionery, Tamil and English, Based on Johann Philip Fabricious's Malabar English Dictionary) నాకు ప్రీతితో దానము చేసిరి. వారికి నా యనంత ధన్యవాదములు. అది పదార్థస్వరూప వివేచనకు నాకెంతో యుపకరించినది. మేము ఇక్కడ చేసినది సమీక్ష మాత్రమే, నిర్ణయము గాదు. ఆ విషయమున సౌహార్దముతో సహృదయ పండితులు చేయు విమర్శలు సూచనలును శిరసావహించి పరిశీలింపబడును.

ఎప్పటివలె ఈ కార్యమున తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయమువారు చూపుచున్న ఉత్సాహసౌహార్దములు కృతజ్ఞతతో పేర్కొనదగినవి.

తిరుపతి
12-4-65

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
పరిష్కర్త

o—o—o

పాండురంగ మాహాత్మ్యము

తెనాలి రామకృష్ణకవి

సులభముగా శుద్ధముగా ప్రాచీనాంధ్ర ప్రబంధములను జనసామాన్యమున కందజేయవలెనని ఆంధ్రప్రదేశపు సాహిత్య అకాడమీవారు ఉదాత్తముగా సంకల్పించిరి. ఆ సందర్భమున తెన్నాలి రామకృష్ణ కవీంద్రుని పాండురంగ మాహాత్మ్యమును అందుకై సిద్ధపరిచి యిమ్మని దయతో నాకు వారు నియమించుటకంటె, నేను దాని నంగీకరించుటకు కొంత ప్రబల కారణమున్నది.

ఈ మహాప్రబంధము ఇదివఱకు మూఁడుమార్లు వేఱువేరుగా ముద్రితమై ప్రకటింపబడి అందు మొట్టమొదటిది 1887 వ సంవత్సరమున మదరాసులో 'కొండూరు అనంతాచార్యులచే పరిష్కరింపబడి తెన్మఠం వేంకటనరసించార్యులుగారిచే లఘుటీకతోడ ముద్రింపబడినది. అది ఆరు మార్లకు తక్కువ లేక, మార్పులు చేర్పులు లేక, పౌనఃపున్యముగా అచ్చు కెక్కినది.

రెండవది 1918 లో తణుకులో, మూలము మాత్రము ముద్రితము.

మూడవది శ్రీ బులుసు వేంకటరమణయ్యగారి పెద్దటీకతో మద్రాసు వావిళ్ళవారు 1952 వ సంవత్సరమున ప్రకటించినది.

బులుసువారి టీక వెలువడుటకు మునుపు, తెన్మఠం వారి మూలము

పరిష్కర్త : రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.
ఉపోద్ఘాతము, 1967.
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి, హైదరాబాదు.

గాని టీక గాని చదువు వారికిని చదివించువారికిని ఎంతో అతృప్తిని నిర్వేద మును కలిగించుచుండినవి. వావిళ్ళవారి 'ప్రకాశకుల విజ్ఞప్తి' లో "శ్రీ చిన్నయసూరిగారు తొలుత దీనిలోని మొదటి మూడాశ్వాసములను ప్రకటించిరి. మేము నొకసారి యామ్రాతమే ప్రకటించితిమి" అనికలదు. కాని నేనా రెంటిని చూడ వీలుపడలేదు. శ్రీ వేంకటరమణయ్యగారు "మద్ర్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారములోని మూడు వ్రాత ప్రతులతో ముద్రిత ప్రతిని సరిపోల్చి పాఠములు సేకరించి" వ్యాఖ్యానము చేసి ప్రచురించిన పరిశ్రమ పాండురంగమాహాత్మ్యమునకు కొంత మెరుగిచ్చినది. కాని వారు సంపాదించిన మూలమును చేసిన వ్యాఖ్యయు పలుచోట్ల అతృప్తికరముగానే యున్నది.

సరియైన పాఠములు సంపాదించి ఈ కావ్యతత్వమునకు స్పష్టముగా, చిన్నగా, టీకను వ్రాయవలెనను పేరాస నాకు ఎన్నో యేండ్లుగా గలదు. కాని అది నెరవేరు సూచనలు ఇప్పటికి లేవు. ముఖ్య కారణము పాఠములందలి తెగని సందేహము. జనను ఈ దృష్టితో అవకాశములు లభించినంతలో మడల మూలమును చదువుకొనుచు, వ్రాత ప్రతులను విచారించుచు, దొరకిన, తోచిన సాధు పాఠములను గుర్తు లేసు కొనుచుంటిని. ఈ వ్యవసాయములో ఈ కింది ప్రతులు నాకుపకరించినవి.

1. (క) తిరుపతి శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యపరిశోధనాలయము నందలిది. కాగితములపై వ్రాసినది. ప్రాత పలచని కాగితములు. దీని సంఖ్య ఒక్కడ 7591 మొత్తము 250 పుటలు. కే. శే. మానవల్లి రామకృష్ణ కవిగారు సంపాదించి భండారమున కిచ్చినదట. గ్రంథము పూర్తిగాగలదు. ప్రాత మంచిదే కాని లేఖకుసది సామాన్య వ్యుత్పత్తి.

2. (చ) ఇది గూడ పై పరిశోధనాలయములోనిదే. తాటాకుల ప్రతి. దీని సంఖ్య 7637. పూర్తిగా వ్రాసినది. కాని చేతితో తాకరానంత శిథిలము. కొన్ని యాకులులేవు. ఉన్న వానిలో కొన్ని విరిగిపోయినది. కొన్ని చూరులైనవి. ఆకులు రెండు జేనల పొడువు ఒక యంగుళము వెడల్పునుగలవి. ప్రాత వ్యుత్పన్నము గాదు, కడపటి "చాంద్రమాన శ్రీముఖి నామ సంవత్సర పుష్య బహుళ దశమీల వరకు పాండురంగ మాహాత్మ్యము

పంచమాశ్వాసము సంపూర్ణం. నరసింగనికి "వాసినాను" అనికలదు. లేఖకుని పేరులేదు. సుమారు ఇన్నూరేండ్ల నాటిది. లుప్తశేషమైనను ఈ ప్రతి కొన్ని మంచిపాఠము లిచ్చినది.

3 (ట) ఆంధ్ర సాహిత్య పరిషత్తు బండారములోనిది. తాటాకు లది అక్కడి దీనిసంఖ్య 1206. ఆంధ్ర మహాభారతాది పర్వముతో చేర్చి కూర్చినది. ఇందు పాండురంగ గ్రంథము మొదటి యాశ్వాసము మ్రాతమే. 10వ తాటాకునుండి 22వ దానివరకును గలదు. 10వ ఆకు గూడ సగము విరిగి పోయినది. ఆ యాకులో కృత్యాది భాగశేషము షష్ట్యంతాలును గలవు. 11 మొదలు 16 దాక ఆకులు కుడిప్రక్క సగమునకు కొంచెము తక్కువగా తెగిపోయినది. 17వది ఇరు ప్రక్కలను కొంచెము భిన్నము. వ్రాత ప్రౌఢము, వట్టిసున్న అరసున్నగా, తరువాతి హల్లు ద్విత్వమున్నచో నిండుసున్నగా గ్రహింపవలసినది. ఇన్నూరేండ్లకు తక్కువ కాని వయస్సు. వ్రాత తప్పులుగలవు.

4. (త) గద్వాల సంస్థానమువారు ఆంధ్ర సాహిత్య అకాడమీకి సమర్పించిన పుస్తకసంచయములోనిది. తాటాకులది. $1\frac{1}{4}$ జేనల పొడవును గల ఆకులు 71 షటకు 8–9 పంక్తులు. అందందు కొన్ని యక్షరాలను పురుగులు దిన్నవి. గ్రంథము ఆద్యంతము పూర్తిగాకలదు. అరసున్నలు బండి రాలును లేవు. హల్లుల మీది ఇ-ఈ ఎ-ఏలకు ప్రాయశ: భేదములేదు. అందమైన వ్రాత, కాసి అప్పుత్పత్తి భూయిష్ఠము. "కాళయుక్తినామ సంవత్సర మాష శుద్ధ 14 రాజ్ఞి రాజారామభూపాలరాయణీవారు వ్రాయించిన పాండురంగమాహాత్మ్యము వ్రాలు సురపురం చాతాసి రమణయ్య మంగళ మహాశ్రీ" అని ముగింపు.

5. (ప) కీ శే. శ్రీ గన్నవరం సుబ్బరామయ్యగారు వ్యవహారము వ్రాయ లిఖిత గ్రంథాలయమందు చూచి పాఠభేదములను నల్లమసితో గుర్తు పెట్టిన తాటాకుల ప్రతి. వారు దీనికి పెట్టుకొన్న గుర్తు (చ).

6. (గ) అక్కడిదే. పై వారే చూచి డూడూబసవరాలో వ్రాత భేదాలు సూచించిన తాటాకుల ప్రతి. దీనికివారి గుర్తు (ట).

7. (జ) పెన్సిలుతో గుర్తించిన తాటాకుల ప్రతి. వారి గుర్తు (త).

8. (డ) తెన్మఠం వేంకట నరసింహాచార్యులుగారిచే లఘుటీక తోడ వసురత్నాకరముద్రాయంత్రమునందు మద్రాసులో 1887వ సంవత్సరమున ముద్రింపబడినది.

9. (ద) తణుకు సౌదామినీ ముద్రాక్షరశాలయందు 1918వ సంవత్సరమున ముద్రించుటకు ఉద్యుక్తమైన మూలము మాత్రము. దీనికి తెన్మఠం వారి మూలమే ముక్కాలు ముప్పావు ఆధారము.

10 (బ) తెన్మఠం శ్రీ రంగాచార్యులచే టీకాకర్త పేరులేక 1922లో మద్రాసు 'మాడన్ అండ్‌కో' (టెమ్మర్ ప్రెస్సు)లో ముద్రింపబడిన నాలుగవ కూర్పు. (దీనియందే గన్నవరం సుబ్బరామయ్యగారుపై మూడు (ప.గ.జ) తాటాకుల ప్రతులలోని పాఠముల నెక్కించుకొన్నది.)

11. (య) తెన్మఠం వారిదే 6వ కూర్పు. మదరాసు అంధ్ర పబ్లిషింగు హౌసు వారిచే 1945వ యేట ప్రకటింపబడినది. (నాసొంత పద్ధతి నే నూహించిన పాఠాల గుర్తుగలది).

12. (ర) 1952లో శ్రీ బులుసు వేంకటరమణయ్యగారి టీకతో మదరాసు వాపిళ్ళవారు ప్రచురించినది.

ప్రైప్రతులలో 3వ దైన ట. ప్రతియు, 8వ దగు డ. ప్రతియు కాకినాడలోని మరవరానినా మిత్రుడు కీ.శే. ప్రతివాది భయంకరం పార్థసారథి నాకొదగించినవి. పలువిధముల నాయండు భ్రాతృ వాత్సల్యము చూపుచుండిన గన్నవరం సుబ్బరామయ్యగారు తాము పాఠ భేదాలను స్పష్టముగా గుర్తు పరచుకొనియుండిన బ. ప్రతిని చేతులార నాకిచ్చిరి. (వారు గుర్తించిన నల్ల డొడా సిరాలు కాలక్రమమున మలినములై భేదము తెలియుట కొన్ని చోట్ల సాధ్యము కాలేదు. కనుక ఈ కూర్పున నేను సూచించిన ప.గ. గుర్తులలో వ్యత్యాసముండవచ్చును). గద్వాల సంస్థానపు ప్రతి కంటబడిన వెంటనే నాకు తెలిపి కొన్ని నాళ్ళది నాకు ఎరవుగా ఇప్పించిన పుణ్యము మిత్రులు శ్రీ డా. బిరుదురాజు రామరాజుగారిది. తణుకు ప్రతి గుత్తిలో మాబంధువు కీ. శే. ఉప్పరపల్లి రంగాచార్యులవారిఁటిది. వారి కుమారుడు ప్రశే

గోపాలాచార్యులు నాకిచ్చినది. పైపుస్తకముల సహాయము నాకు మాత్రమే కాదు, పాండురంగ మాహాత్మ్యమును రసించు తెలుగు రసికుల కందరికిని మరవరానిది.

కీ.శే. వేదం వేంకటరాయశాస్త్రి మహోదయులు తమవద్ది పుస్తకములో సాధుపాఠములనేకములు సంగ్రహించియో ఊహించియో గుర్తు పెట్టుకొన్నారని వినికి. వారు ప్రకటించిన విమర్శవినోదము 50, 51. 52 పుటలలో అట్టివానిని ఏడింటిని చవిచూపినారు. అందు 3, 4, 5, 6, 7 లకు ప్రాతప్రతుల సంవాదముగలదు. మొదటి రెండును వారు తలచినట్లు సందిగ్ధముగనేయున్నవి. వారు సూచించుకొన్న పాఠ సంస్కారములన్నియు లభించియుండినచో నాకెంతో యీ కూర్పునకవి సహాయపడియుండును. కాని దానికి నేను నోచుకోలేదు.

ఈ వ్యాసంగము చేత నాకు ఎన్నో మంచి పాఠములు లభించి గ్రంథము చాల భాగము సుగమమైన దనుకొనుచున్నాను. అవి నావద్దనే జీర్ణములు కానీయక, పాఠాంతరములతో గూడ ప్రకటించుట దీని వ్యాసంగమును కొనసాగింపగల పండితులకుపకరించునని నమ్మి అకాడమీ వారు దయతో ఇచ్చిన యీ అవకాశమును సంతోషముతో తీసుకొన్నాను. సరియైన వని తోచిన పాఠములను మూలమున కెక్కించి, తక్కినవి యెట్టివైనను అన్నిటిని అడుగున చూపినాను. అచ్చుతప్పులు ప్రాత తప్పులు అని స్పష్టముగా తెలిసిన వానిని మాత్రమే ఉటంకించితిని. ఇంతపై అవశ్యకమని తోచిన చిన్న సవరణలు ప్రశ్న గుర్తుతో ఓప్ప గుర్తుల నడుమ సూచించితిని. నా పాలికి సందిగ్ధము గానే నిలిచిన పద వాక్యముల ప్రక్క వట్టి ప్రశ్న చిహ్నము ఓప్పలనడుమ (?) నిలిపితిని. పరిగ్రహించిన మంచి పాఠములన్నియు ఏదో యొక్క ప్రాతప్రతిలోనైనను ఉన్నవేయని సహృదయులు గమనింప వేడుచున్నాను. పాఠాంతరముల ప్రతులను సూచించితిమి గాని పాఠముల ప్రతులను గుర్తు చేయ లేదు, విస్తరమగు నేమోయని, ఇంచుద్ధరింప బడిన సత్పాఠములకుదాహరణముగా కొన్నిటిని వేరొక్కనుచున్నాను—

(1) 3–24వ వచనములో "వనకేళి వలాశ దోహదంబునగుటకు" అని అన్ని ముద్రణములయు పాఠము, అర్థములేనిది. అడవి మొక్కలకు

చేసిన దోహదక్రియ" అన్న బులుసువారి వివరణమువట్టి కకూర్కిమూట; 'కేళీ' శబ్దమునకు సంగతిలేదు. 'పలాశ' ఆకుగాని మొక్కగాదు. సరియైన పాఠము 'అవకేశి పలాశి దోహడంబు'. మొదటి ఆకారము మీది నకారము వెనుకటి నువర్ణము మీద విసంధికి వెరచి వచ్చినది.

'అవకేశి'-ఫలములు లేని గొడ్డు, 'పలాశి'-చెట్టు "వంధ్యో ఽఫలోఽ కేశీచ". "పలాశి ద్రుమాగమాఃు" అని అమరుని యనుశాసనము. పండసి చెట్టుకు ఎరువు పెట్టుట వంటిదని భావము, ఇట్లయినది నిగమశర్మ భార్య యౌవనము.

(2) 2-133వ పద్యమున ముద్రిత సామాన్య పాఠము "నానా-భూములను నిగిడి మదగజ-భైమి". ఇక్కడ 'మదగజ భైమి' కి 'మదించిన యేనుగులకును భయము గొల్పునది' అను ర. ప్రతిలోని టీక సంగతి చాలనిది. మరి 'పర్వి' అను క్రియకు కర్త లేకపోవును. సంగతమైన వ్రాత ప్రతుల పాఠము 'భూముల నిగిడి మదంగజ, భైమి' అనునది. ఇక్కడ పార్వతికి శివుడు పౌండరీక క్షేత్ర విశేషములను సంగ్రహముగ తెలుపు సన్నివేశము. అక్కడి ముఖ్యనది భైమి-భీమరథి. ఆ నది శివుని చెమటనుండి పుట్టినది. ఇది ఇంతకు కొంచెము వెనుకనే (2-74) "భీమ ఘర్మాంబు సంభూత భైమి" అని స్పష్టపరచిన మాట. కనుక ఇక్కడ మదంగజ=నా దేహమునుండి పుట్టినది, భైమి అని అర్థము.

(3) 2-208వ సీసము నాల్గవ పాదమున ముద్రిత టీకిత పాఠము "అశ్రికాభ్రముల భ్రమతిని గూకలు పెట్టు క్రియమయూరంబులు కెరలిపలుక అని. పూర్వార్ధమున యతిభంగము స్పష్టము. ర. ప్రతిలోని దీని టీక "అశితాభ్రములు మేఘముల నాశ్రయించిన, అభ్రమతిని=వేఁజే మబ్బులను బుద్ధిని; కూకలు పెట్టు క్రియన్=పెఱుమురీతిని. కెరలి=విజృంభించి; పలుకన్=కేకలువేయగా". అనునది, మనలనెక్కడి కీడ్చుకొని పోవునో తెలియదు. 'అశితాభ్రములభ్రమూర్తి' అని వ్రాత ప్రతుల పాఠము". అదియు భగ్నయతినిగాని, తటుకని యర్థమును గాని సరిచేయదు. కనుక "అశితాభ్రములు భ్రమూర్తి గూకలు" అను చిన్నమార్పు ఇక్కడ సూచించి తిని. పార్వతీ పరమేశ్వరులు మందర పర్వతమున విహరించు సంద

ర్భము. మథన కాలమందు వలెనే ఇప్పుడు గూడ మందరగిరి తోచినదనీ శివుని చమత్కారము. 'ఆ మథన కాలమున కొండవెంట తిప్పలు పడలేక కూతలు పెట్టుచుండిన మేఘములవలె, నెమళ్ళు కేకలు వేయుచుండగా', అని యర్థమగును. "ఆశితాభ్రములాభ్రమూర్తి" "లక్ష్మమూర్తి" అనియైనను సవరింపవచ్చును.

(4) 4-182వ పద్యమున "ముదకి మదంగ భాగతా తిలకిత విభ్రమంబగు" అని ముద్రితమూలము. "ముదక్కి.....విభ్రమంబు = సంతోషముతో గూడిన కన్నుల విలాసముగలది". అని డొరుడు టీక. "మదక్కి మదంగ భాగతా" అను వ్రాత పాఠము ఇందు గ్రహింపబడినది. కథ చెప్పినది పరమశివుడు; దానిలో సుశీల అగ్నిదేవతను ధ్యానము చేయును. ఆ యగ్నికి విశేషణము ఈ "మదక్కి మదంగ భాగతా తిలకిత విభ్రమంబు" అనునది. శివుని మూడు కన్నులలో ఒకటి అగ్ని; అతని యష్టమూర్తులలో ఒకటియునగును. "వహతి విధిహుతం యాహవిః" అని శాకుంతల నాందిలో కాళిదాసు. కనుక 'నాకన్ను, నాశరీరములోని భాగమును అగుటచే వెలగి విలాసముగలది' అన్నాడు శివుడు.

(5) 5-190 ఇందలి ముద్రిత పాఠము "శాస్త్ర శబళికావార పేటిక లొక్క వటువు పూన" అనునది. దానికి తెన్మఠం వారి వివృతి "శబళికా = నానా వర్ణాత్మకమైన" అని మాత్రమే స్వచ్ఛందముగా సాగినది. దాని నాక్షేపించి బులుసువారి టీక, "శాస్త్రశబళికా వార పేటికలు = శాస్త్రముల వేర్వేఱు విభాగములున్న పెట్టెలను" అని ఇంకొక అడ్డదారిలో చొచ్చినది. "కబళికాసారపేటిక లొక్కచట్టు" అని రెండు వ్రాత ప్రతులందున్న పాఠము. 'కబళికా' శబ్దము సంస్కృతాంధ్ర నిఘంటువులలో నాకు కానరాలేదు. కాని కబళ శబ్దముయొక్క అలాంకారిక రూపము కావచ్చును. 'కవళికై' అని తమిళునందును, 'కవళిగె' అని కన్నడమందును ఇదీ వ్యవహారమున నున్నది. బొట్టనజుట్టున వ్రేళ్ళనుము అడగునట్టి తమిళ పాకుల కట్ట దానియర్థము. తాటాకుల కట్టయని యిక్కడ తాత్పర్యము చెప్పుకోవచ్చును. కపిలె కవిలియ దీని రూపాంతరమే కావచ్చును. ఇదీ గాక హర్షచరిత్రమున బాణభట్టారకుడు 'గృహీతాకవిపయ పతల ప్లీహాం

కపాటికాం' అని ప్రయోగించినాడు (పు. 85). ఇక్కడ ఇదే యర్థము సంగత మగుచున్నది. 'కపాటికా' భవమే 'కవాళికా' కావచ్చును. కాని నిఘంటు వులలో నాకీపదమును కాన రాలేదు. ఇట్లే 'వారపేటిక లొక్క వటువు' అనుదానికి ,సారపేటిక లొక్కచట్టు' అను వ్రాత ప్రతుల పాఠము. 'సార పేటిక' దేవుని పెట్టె. ఈ రెంటిని ఒక చట్టు-భ్రాతుడు-మోసికొనిరాగా అని అరము.

(6) 5309 ఇందు మూడవ పదమున 'వాగురాసన్నహానంబు' అని ప. ప్రతిలో మాత్రమున్నది. దానినే ర. ప్రతి గ్రహించినది. తక్కిన యన్ని ప్రతులందును 'వాగురీ' అనియే పాఠము. 'వాగురా' అను ఆకారాంత రూపమే నా యనుభవమునను సార్వత్రికము. కాని శ్రీ హర్షుని ద్వ్యర్థ కోశమున 'వాసురావాసురీతి స్యాత్' అను వాక్యము కానవచ్చినది. 'వాగు రావాగురీ' అనుటకు మీదిది అచ్చుపొరపాటని భావింతును. 'వాసురావాసురీ' రెండును దుర్లభ శబ్దములు గనుక. ఇట్టి దోషములా ముద్రణమున గలవు. రామకృష్ణుని గడుసుదనపు పలుకుల కీది గూడ ఒక యుదాహరణము గాబోలు ననుకొని దానినె యిక్కడ పైకెత్తితిని. నాయూహ తప్పైనచో తిద్దు కొనుట సులభము.

(7) 5-314 "ఏషమశరుడేయు తూపుల వేట్ల నెన్ను
వాఁడువాథూల మునిశాప వర్ణతతుల
రాఁటికొడుకైన యిల్వలారాతిచట్టు
మనసు గరగించి మమతలఁబెనగెఁగాన"

అను నీ ముద్రిత పాఠము ఎన్ని డొంకలు దిరిగినను అన్వయింపనిది. 'వేండ్ల కన్న వాండ్లు' అను ఇక్కడ ఎత్తుకొన్న వ్రాతప్రతుల పాఠము నేడు కొంత వింతగా తోచును. ఇవి వేఁడి-వాఁడి అనువాని బహువచన రూప ములు. ఇట్టి ప్రయోగము తాళ్ళపాకవారు పలుచోట్ల చేసినారు. 'గొంది నున్న కుచములు కొనవాండ్లై తేను, చెఁదిన యాతని మేను చిల్లులయ్యానా' అని అన్నమాచార్యులు వాడినాడు. (శృంగార సంకీర్తనలు, 12వ సం.పాట 263. తిరుపతి దేవస్థానముల ప్రచురణము) 'ఏషమశరుడేయు తూపుల వేడకంటె వాథూలమని శాపవర్ణ తతులెవాడీ' అనిసరసమగు వాక్యాన్వ

యము. నాల్గవ పాదమున దీనికి తగినట్లు 'మమతలఁబెనఁచె' అని ప్రాత పాఠము.

(8) 5-128 ఈసీసము మూడవ పాదాదియందలి ముద్రిత పాఠము. 'బడెగండ్ల నొంటి మైఁబడిన' అనువానినే 'బడిగఁడ్ల' అను చిన్న మార్పుతో ఇక్కడ మీది కెత్తి (బడిగండు లొంటిపై?) అను సవరణ సూచించితిని. ప్రాత ప్రతులందలి వేరువేరు పాఠములు దీగువనియ్యబడినవి చూడవచ్చును. అందేదియు సుగ్రహముగా తోపలేదు. 'ఒంటి' యనునది, ఒడలిఁటికి వ్యావహారిక రూపము నేఁ గలదు గదా. నాఁడును ఇడివాఁడుకలో నుండగా రామకృష్ణుడు ఓట్టకనముతో ప్రయోగించినాఁడని నా యూహ. దనికి తోడుగా ఈ యాశ్వాసమఁదే 197వ పద్యమున 'కల్వకచ్చవంటియొంటివాని' అని పిట్టలుని వర్ణనమున ఈ 'ఒంటి' కలదు. 'కల్వకంటు వంటి యొంటివాని' అన్నదీని ముద్రితపాఠము వీవాతప్రతిలోను గానరాదు. 'ఒంటివాసిన్ = ఒంటరిగా లక్ష్మీవిరహితముగా ఉన్నవాసిన్ అను ర. ప్రతి టీక స్వారస్యమును సాంప్రదాయికమును గాదు. ఇట్టి వ్యావహారిక రూపములొకటి రెండు ఇతరత్ర ప్రయోగించిన వాడేగదా రామకృష్ణుఁడు! 'ఆమౌనీంద్రుఁడు శాప మిచ్చెనిటుగానైతే మరే మింకిటన్' అని ఘటికాచల మాహాత్మ్యమున (1-95) వాడినాఁడు. పాండురంగ మాహాత్మ్యమునందే (4-275) 'పాటింతు రెవ్వరు తద్ద నమ్మినుయి దాటే వానికిఁజిత యొకంతైసన్' అని కదలింప రాకుండ వ్యావహారికము పొదిగినాఁడు. 'ఇది ప్రమాద పతితము' అని ఒక వ్యాకర్త వ్యాసెను. కాని రామకృష్ణుని వంటి వానికిట్టి ప్రమాదమంట గట్టుట న్యాయముకాదు. ఇతనికి శబ్దపరిహత పూర్వులై సుగృహీత నామధేయులైన నండిమల్ల-ఘంటసింగకవులు ప్రబోధచంద్రోదయమున ఇట్టి యతిస్థాన మందే బిగించి ఇట్టి ప్రయోగమే (೧) "గెలపఁబూనుట నాకు దొడ్డి గుడి మిఁదగే వానికిఁదలుపులపడమల్ గావున" (2-67) అనిచేయుండగా చూచి' 'నేనేమి తక్కువ!' అనుధోరణిలో రామకృష్ణుడిట్లు చేసినాఁడనుకో

---

(೧) ఈ ప్రయోగమును నా దృష్టికి దెచ్చినది శ్రీ ఆరుద్రగారి "సమగ్ర ఆంధ్ర సాహిత్యం" (సం. 6, పు. 236).

వచ్చును. ఇడ్ర వాయించి చేసిన వద్దన్నపని. అంతేకాని రామకృష్ణుడు అ కాలపు వ్యావహారికవాదియనుకొనుట అపచారము. తెలుగు వాఙ్మయమున ఖట్టి చిలిపిపనులొకటో రెండో చేయని వారే లేరేమో!

ఇక 'బడిగల్లు' పదమునకు మోదునట్టిరాయియని యర్థము. దీనిని 'పడిగల్లు' గా గ్రహించి 'తుపాకి గుండు' అన్నయర్థమిచ్చుట శబ్ద రత్నా కరపు పొరబాట్లలో నొకటి. సూర్యారాయ నిఘంటు విచ్చిన 'చాప రాయి-ఠాతిబోన' అనునడే సరియైన దనవచ్చును! పంది కొక్కులను ఛంపునట్టి యేదోమంత్రమని మాత్ర మూహించియుంటిని. 'మోదు' అను నర్థమున 'బడి' ధాతువ్రను, 'బడిగల్లు' శబ్దమీయర్థమునను కన్నడమున గ్గలవు. (చూ. కిట్టెలు) ఇప్పుడును ఆ భాషలోరాయి కల్లే. కాని ఆయంత్ర మిట్టిదని నాకు ఓవరించిన పుణ్యము మిత్రులు వాఙ్మయ మందరులు శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రిగారిది. (గ) పై పలుకుబడికి వ్రాత ప్రతులలో గల 'బడిగండ్లుమింబీ-బడీగుండ మెట్టి వెంబడిన-గండు మిట్టి-' అను పాఠభేద ములకు మూలమేమై యుండునో తెలియదు. 'ఒంటిమై' అనియే పాఠకులు నిలుపుకోవచ్చును. 'మై' అనుటకు 'పై' అను అర్థమును గలదుగదా.

మీది యుదాహరణములు చాలును. ఇంకను ఇట్టి వెన్నోకలవని పోల్చి చూచు సహృదయులు గమనింపగలరు. ఈ మార్పులోని యీ సవరింపులు ఈ గ్రంథమున చాలభాగము సుగమము చేయగలవని నాయాశ. ఈ బరు

(గ) శ్రీ శాస్త్రిగారు ఈ విషయమున జాబులో వ్రాసిన వివరణమిదీ. "బడెగండ్లు అనుపాఠము, 'పెద్దకలుగులు' అను టీక, రెండును సరియైనవి కావు. శబ్దము 'బడిగల్లు' గాని 'బడెగల్లు' కాదు. బడిగల్లు-అనగా వెడలు పైన పెద్దబండ. అట్టి బండను కొక్కులను చంపుటకుపయోగింతురు. ఎట్లనగా ఆ బండ నొక పుల్ల సహాయమున, వేటవాలుగా నిలువబెట్టి దాని క్రింద ఎర యుంతురు. ఆ పుల్ల కొక పొడుగైన దారము కట్టియుండును. వేటకాడా ధారము పట్టుకొని దూరముగా కూర్చుండియుండును. కొక్కు బండ క్రిందికి వచ్చుట కనిపెట్టి, వాడా క్రాడు లాగును బండ కొక్కుపై బడును. అది ఋణాగి అవ్వచ్చియగును".

వునకు నేను తల డొగ్గుట కదే ముఖ్య కారణము. ఇది అకాడమీవారి యుద్దేశమున కంకె కొంత భిన్నమైనను వారు సన్మా మన్నించి ప్రకటింప ననుగ్రహించిరి.

ఇంతేకాదు ఆరోగ్యము చాలక నేనొంటరిగా ఈ పనిచేయలేనని సహాయముగా శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారిని ప్రేరపచిరి. శ్రీ శర్మగారు ఆంధ్ర సంస్కృత సాహిత్యములలో విద్వచ్చిరోమణులు. ఆయుర్వేద, మంత్ర, జ్యోతిష్య, ధర్మశాస్త్రాదుల లోతును దిగిచూచినవారు. తిరుపతి ప్రాచ్య కళాశాలలో ఉభయ భాషోపాధ్యాయులు. అవధానమును, శుకవితను రెండు భాషలందును అడ్డు లేక సాగించు శక్తి గలవారు. మీదు మిక్కిలి నాపై చాల విశ్వాసము. సహృదయులు. వీరి తోడు పాటు మొదటి నుండి కడవరకు ఈ పరిష్కరణ కార్యమున నాకు లభించుట సామాన్య విషయముగాదు. అదిలేక యీ కార్యము ఇట్లు సాగియుండదు. అకాడమీ వారి, శర్మగారి యీ యుపకారముచే ఈ కూర్పు ఇక ముందు ఉచిత వ్యాఖ్య రచింపగల కోవిదులకు కొంతయైనను ఉపకరింపగలదని నాసమ్మిక, నాధన్యత.

తెనాలి రామకృష్ణుడు

శ్రీ రామకృష్ణుని కాల దేశాదులను గూర్చి ఎంతో కాలముగా ఎందరో ప్రాజ్ఞులు చర్చించి నిర్ణయించినారు. ఈ క్రిందిది ఆ వ్యాసంగపు సారాంశము.

గార్లపాటి రామపండితుడు తెనాలిలో నుండినవాడు. ఆ యూరిలోని రామలింగేశ్వరస్వామి దేవళమున పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను చేయించి ప్రతిష్ఠించినవాడాయన. అతని కుమారులు ముగ్గురు. రామలింగడు, శ్రీగిరి, అన్నయ్య.

గార్లపాటి లక్ష్మణకవి పైరామపండితుని తమ్ముడని యూహ. ఇంటి పేరునిబట్టి. వారి పేళ్ళను బట్టి, ఇతడు వీరరస ప్రధానముగా 'వీర భద్రదేశవిజయము' అను గ్రంథమును రచించినట్లు తెలియుచున్నది ఈ గ్రంథము దొరకలేదు.

తెనాలిలోవసించుటచేత గార్లపాటివారి యింటిపేరు తెనాలివారైది. రామకృష్ణుడు 'తెనాల్యగ్రహారనిర్దేశ'గా గూడ నుండినవాడు. (పాండు.1-23)వారు

కాత్యాయన సూత్రముల ననుసరించు శుక్లయజుశ్శాఖ బ్రాహ్మణులు. కౌండిన్యసగోత్రులు, నియోగులు, శ్రీ శంకరాచార్యుల అద్వైత సిద్ధాంతమునే అంగీకరించిన వారైనను శివభక్తి, శైవ సంప్రదాయములను ఎక్కువగా ఆచారవ్యవహారములందుంచుకొన్నవారు. వీరి శైవసమయాచార్యులు 'పాలగుమ్మి' వారు.

రామపండితు డేమియు గ్రంథములు రచించినట్లు తెలియరాదు. అతని పెండవ కుమారుడైన శ్రీగిరి శ్రీశైల మాహాత్మ్యము అను గ్రంథమును రచించెనట. కాని ఆ గ్రంథము లభింపదు. రామలింగడును అన్నయ్యయు ప్రసిద్ధ గ్రంథకర్తలు. శ్రీగిరి కుమారుడు ఇమ్మడి రామకృష్ణుడును, ఆతని పెద్ద కుమారుడు, వీరరాఘవుడును కవులేనట. వీరరాఘవుని తమ్ముడు రామభద్రుడు 'ఇందుమతీ కళ్యాణ' కర్త. ఈ పండిత వంశమునకు కీర్తి దెచ్చిన ప్రధానవ్యక్తి రామలింగడు.

15 వ క్రిస్తు శతాబ్దియందు అహోబల నృసింహక్షేత్రమందు, శ్రీ ఆదివణ్ శఠకోప యతీంద్రులు నెలకొల్పిన గురుపరంపరవారి యాదరువున, భగవద్రామానుజుల శ్రీ వైష్ణవ సంప్రదాయము ఆంధ్ర కర్ణాట దేశములందెక్కువ ప్రచారమును గన్నది. దానికి తోడుగా కర్ణాటక సామ్రాజ్యము నాశయించి, శ్రీ మధ్వాచార్య సంప్రదాయ పరంపరలోని శ్రీ శ్రీపాదరాయస్వామి, శ్రీ వ్యాసరాయస్వామి మొదలగు మహనీయులు విష్ణుభక్తిని దేశమున చాలా వ్యాప్తికి దెచ్చిరి. కాని ఆంధ్రజాతిలో శ్రీ రామానుజ సంప్రదాయమే పైచేయిగా ప్రబలి శైవశాక్తాది మతముల బిగువును మిక్కిలి సడలించెను. దానికి ముఖ్యకారణము మాధ్వుల మత సంస్కార ప్రచారము బ్రాహ్మణ జాతిలోనే ఎక్కువగా జరిగియుండుట గావచ్చును. అహోబలమఠమున కంటె మొదలు తిరుపతిలో నెలకొన్న బ్రహ్మతంత్రపరకాలమఠము యతీంద్రులు, కందాడైవారు, ఆద్దంకివారు, భట్టరువారు, పెనుగొండ తిరుమల తాతాచార్య పరంపర మొదలగువారు ఈ ప్రచారమును అన్నిజాతులందును సాగించి సంస్కరించిరి. 15–16 శతాబ్దము లందు ఈ పనిచాలా చురుకుగా తేజస్వీగా జరిగినది. ఆంధ్రదేశపు వైదికుల

కన్న నియోగి బ్రాహ్మణులలో పలువురు ఈ ప్రచార ప్రభావమునకు లోగినారనవచ్చును. పూర్తిగా మార్పు చెందగలిగినవారే కొందరోకాని, యితరుల మార్పు వేరు వేరంతస్తులలో జరిగియుండునని యూహింపవచ్చును. అట్టి కుటుంబములలో ఈ తెనాలివారి దొకటి. రామయపండితుని సమాచారము తెలియదుగాని అతని సంతతిలో మనకు తెలిసిన వారందరికిని ఈ శివవైష్ణవుల వర్చస్సు తగిలిసట్లున్నది. రామకృష్ణుని అల్లునియింటివారు, లింగముకుంటి వారు, కొంత శివ వైష్ణవులు.

రామలింగడు రచించిన ఆంధ్రగ్రంథములు నేటికి మూడు మనకు లభించినవి. అందొకటి శైవ సంప్రదాయమును తెలుపును. అది ఉద్భటా రాధ్య చరిత్రము. తక్కిన రెండు పాండురంగ మాహాత్మ్యము, ఘటికాచల మాహాత్మ్యమును. ఇవి వైష్ణవాభిమానముతో రచించినవి. ఈ రెంటిలోను కవి రామకృష్ణుడని తన్ను పేరొక్కొన్నాడు. ఇది సంప్రదాయము మార్చుచే పెట్టుకొన్న పేరే కాని వేరుకాదని విమర్శకు లందరును అంగీకరించిన విషయము. అనూచానమైన వాడుకయుగలదు. అనాంధ్రదేశముల లోని కథలందును నేటికిని రామకృష్ణుడను పేరే ఇతనికి చెల్లివచ్చుచున్నది. మతము మార్పు వెంట పేరును గూడ మార్చుకొనుట ప్రాత వాడుకయే. ఇతనితమ్ముని-శ్రీగిరి-మనుమడైన తెనాలిరామభద్రకవి ఇందుమతీ పరిణయమున కృతిభర్త తన్ను గూర్చి చెప్పినట్లుగా—

"ప్రౌఢి మీ పెదతాత పాండురంగాది సత్కృతులు చేసెను రామకృష్ణ కవి" అని నిస్సందేహముగా ఈ పేరు మార్పును దిట్ట పరచినాడు.

శైవ సంప్రదాయశ్రద్ధతో నున్నప్పుడు రామలింగడు లింగధారణము గూడ చేసినట్లు సూచన యున్నది. అద్వైతి స్మార్త బ్రాహ్మణులలో శివభక్తి యెక్కువగా గలవారుకూడ లింగధారణము చేయరు. శైవమున లింగధారణము, వైష్ణవమున తప్తముద్ర. ఇట్లే శాక్త సౌర గాణపత్యములలో కొన్ని విశిష్ట పద్ధతులను వారు నిషేధింతురు. ఈ రామలింగని గూర్చి సరస్వతీ సోమయాజి పృథుచరిత్రలో ప్రాసినాడట

"శృంగార రసాలింగిత, రంగత్కపో[illegible] హృదయ
త్వంగధ్వజంగ మాంగద, లింగమ్మో[illegible]తున్"

(వేటూరి ప్రభాకరుల ఉద్భటారాధ్య చరితము, పీఠిక, 14) ఉద్భటారాధ్య చరిత్రమున (ఆ 3 ప; 145-157) ఇష్టలింగధారణ విధిని కవి వర్ణించిన తీవ్ర ధోరణిని గమనించితి మేని ఆ దీక్షను ప్రతడును గ్రహించి యుండె నేమో యనిపించుచు. కాని స్మార్తుల సాంప్రదాయిక మైన అతని విష్ణు భక్తిని ఉద్భటారాధ్య చరిత్రమునగూడ-

"చూడాభూషణ రత్న మై వెలయుచున్ శ్రుత్యుత్తమాంగంబులన్
జూడంగాఁదగు విష్ణుపాదము" (1-1-57)
"దేవకీయును వసుదేవుఁడును గన్న కేలిమనుజ
విగహుండగు త్రైలోక్య విభునకు" (3-59)

అనుమాటలు సందు చేసికొని చూపుచున్నవి.

శ్రీ వైష్ణవమునకు మార్చుకొన్న తరువాత రచించిన రెండు కావ్యములలో ఘటికాచల మాహాత్మ్యమున వైష్ణవము కొంతముదిరిన సూచన లున్నవి. అందలి నారదుడు దర్శించిన నూట యెనిమిది క్షేత్రములు శ్రీ వైష్ణవులకు ముఖ్యమైన 'తిరుపతు'లే. గోవిందశర్మ "తిరుపవిత్రంబును దిరుమణి తిరుమార్జనమును మేన ధరియించి"నవాడు. అతడు పూజచేసినది "తిరుతులసి"తో (2-8-11). ఆయన యాచగించు సుమ్మష్టాన్నమున 'తైరు' నీరుమోరును గలవు. (1-17) తిరుపతి వద్ద సప్తర్షులు స్నానమాడినది శ్రీ వైష్ణవుల "ఆళ్వారు తీర్థము"న, ఇతరుల "కపిలతీర్థము"న గాదు మటికో చలమందలి నృసింహమూర్తి "అక్కారకణ్ణి (1-61)ఆది, శర్వాది సుపర్వనయన సాధ్వసకరము" (3-4). ఇట్లు పలుచోట్ల విష్ణుపారమ్యము చెప్పబడినది.

కాని, మానస సరస్తీరమున తపస్సుచేయు యోగులందును "నిటల ఫలక తిలకిత శశిసిత భసిత లసిత" మూర్తులు. (1-3) మరి విష్ణు దశావ తారములలో బుద్ధమూర్తిని చేర్చినాడు. (2-218) అది శ్రీ వైష్ణవుల మతము గాదు. రామానుజ [illegible] గాయ శబ్ద యొక్కువగా ముదిరిన "ఆముక్తమా మాల్యద"లో [illegible] శ్రమ-నిలిచియుండుట వింత ! ఘటికాచలమా హాత్మ్యము [illegible] శ్రీ రామకృష్ణుడు రచించినది కాదు గనుక [illegible] సంస్కార మెట్టిదో యూహింపలేము.

పాండురంగ మాహాత్మ్యములోనిది ఇంకను శిథిలమైన వైష్ణవము. ఇందలి ప్రధాన విషయము పాండురంగడు శ్రీ కృష్ణుడే. కథ పార్వతికి చెప్పువాడు శివుడే. ఆ పార్వతిని స్తుతించుచు కవి కోరినది 'పిహూని వేదా ప్రదికి విష్ణుభక్తి మహిమాతిశయంబు నయంబు నీవుతన్' అనియే (1-6): ఆ శివుడు 'దక్షిన విష్ణుభక్తి' (2-184) గలవాడే, ఐనను రామకృష్ణుని శివభక్తి చాల గొప్పదే యిందును. ఇంతేకాదు శివుడు 'దనుజరిపుప్రసాద జనిత ప్రతిభానిధి (2-207) యైనను 'మూర్తిత్రయైక నిలయుడు' (1-197) కనుకనే కృత్యాదిలో శ్రీ వైష్ణవ ప్రీతిగా విష్వక్సేన గరుడానంతులను ప్రార్థించినను, వినాయక స్తుతి వదలినను, పార్వతీపరమేశ్వరులను మరవలేదు. ఇందలి అగస్త్యమహర్షి 'పరమ శైవోత్తంసు'డు (1-128)కథలోని ప్రధాన భాగవత వ్యక్తి పుండరీకునిది 'భస్మోద్ధూళన పాండురాంగము' (2-54).తుదకు తపస్సుచేయు రాధకును 'భసితము'నే యితడలదినాడు (4-3).మరి వేసవిని వర్ణించుచు 'వ్యావహారిక సత్యత్వంబు ప్రకటించు ప్రపంచంబు చేత వంచితులగు నెఱుక లేని కరటుల కరణీ హరిణంబులు మరీచికాపీచికా పాన దివశంబులై దిశలంబరి భ్రమించె అన్నాడు. (4-16) ఇది విశిష్టాద్వైతు లాడు మాటకాదు, అద్వైతు లాడవలసినది. రామకృష్ణుని కాచార్యులైన భట్టరుచిక్కాచార్యులుగాని కృతిభర్త వేదాద్రికి గురువైన 'నేటి యాళవందారుకందాళయప్పగారు, (1-77) గాని పై మాట విని యెట్లోర్చి యుండిరో తెలియదు. ప్రాయశః వారు వినియే యుండరేమో! నామరూప వ్యాకృతిభగవంతునిసృష్టి భాగవతుల దృష్టియు దానిని మీరిపోలేదేమో!

అసలు బుడమే భద్రములేని రామకృష్ణుని యా వైష్ణవములో అడి వడగల సంప్రదాయమా, తెంగల సంప్రదాయమా అను ప్రశ్నవట్టి వినోదము మాత్రమే. పరతత్త్వనిర్ణయమును గురించి యీ రెండు తెగలవారికిని గల భేదము చాలా సూక్ష్మము, సామాన్యుల కర్థము కానిది. అర్థమైనను వ్యవహారమునందది యకించిత్కరము. ఈ రెండు తెగలవారును నేడు రచ్చకెక్కి సిద్ధాంతముచేయునది ముఖ్యముగా పుండ్ర స్వరూపమును గూర్చి. తెంగల నామము కనుబొమలనుండి మీదికి వెడల్పుగా సాగి నిలుచును, వడగలవారిది సమముగా విరివి తక్కువగును. తెంగల తిరుమణి రేఖలు రెండును బొమల

నడుమ గలిసి ముక్కుమీదికి వీరముగా దిగజారును. వడగలది అర్ధవలయా కారములో ముక్కు మొదట కలియును. నడిమి శ్రీ చూర్ణమిద్దరికిని తుల్యమే. అప్పుడప్పుడు ఈ రెండు సంప్రదాయాల వ్యక్తులెందరో పుండరీతిని మార్చుకొనుట నేటికిని జరుగుచున్నది. కందాళ, అద్దంకి, మాడభూషి, నల్లాన్ చక్రవర్తుల, ఆసూరి మొదలగు అన్నతెగలవారును ఇంచుమించుగా ఇరు ప్రక్కలను గలరు. కనుక రామకృష్ణునికి గురుప్రసాదు పెట్టిన నామ మెట్టిదో యిప్పుడు చెప్పలేము. ఘటికాచలమాహాత్మ్యమును ఖండోజి రాయనికి తెచ్చియిచ్చిన రామకృష్ణుని పౌత్రుడు 'వెదురాకువంటి తిరుమణి నుదుట' ధరించి యుండెనట (ఘటి 1-12). అయినా అది వడగల నామము కాగలదు. ఇదిగాక పుండరీకుడుచేయు 'తిరువారాధనము'లో ఆతడు బడిపంట మొరయఁ జేయుచుండెనట (పాండు. 2-22) తెంగలవారు ఇంట లిజలలో ఘంట వాయింపరు.

ఎట్లును ఆతని యెడనే యింతశిథిలముగా నుండిన రామకృష్ణుని వైష్ణవము సహజముగా అతని వంశములో చాల కాలము అనువర్తించినట్లు తోపదు. చిత్తూరు జిల్లా వాయల్పాడు తాలూకా లోని గోరంట్లపల్లి అను గ్రామ మున తెనాలివారి కుటుంబ మొకటి కలదని, వారిది ప్రథమశాఖ కౌండిన్య గోత్రమే అని, అయింటి పెద్ద, అశీతి వృద్ధు తెనాలిరామలింగవ్వ అనువారు కొన్నేండ్లంకు ముందే పరమపదించిరని వారిసంతానము వృద్ధిలో నున్నదని. ఆయన పౌత్రు డొక్కడు రామకృష్ణరావు అను పేరి వాడని, వారింట వైష్ణవ చిన్నలు విశిష్టముగా నేపయు లేని స్మార్తసంప్రదాయమే చెల్లుచున్నదని మిత్రులు శ్రీగౌరిపెద్ది రామసుబ్బశర్మగారు తెలిపినారు. వారిస్వగ్రామమైన 'నూతన కాలువ'కు గోరంట్లపల్లి చాలా సమీపమట. తెనాలి శాఖవారు ఇంకను ఎక్కడనైనను తెలుగు దేశమునన్నారేమో తెలియదు. ఉండి యుందురు.

దొరికిన రామకృష్ణుని మూడు గ్రంథములలో మొదట దడవ వలసినది ఉద్భటారాధ్య చరిత్రము. అప్పుడతనిది శైశవదశ. దానిని కొండవీడు దుర్గ మున కధ్యక్షుడైన నాదెండ్ల గోపమంత్రికి 'రాజ కార్యనిర్వాహకుడు'గా నుండిన ఊరదేవ మంత్రికి అంకితమిచ్చినాడు. గోపమంత్రి శ్రీ కృష్ణదేవ

రాయల సామ్రాజ్యమున ప్రధానమంత్రియగు సాళువ తిమ్మరసుకు మేనల్లుడు. అల్లుడు గూడ (ఇది సందిగ్ధము). రాయలు కొండవీటిని జయించి స్వాయత్తము చేసుకొన్నది 1515వ కిస్తు సంవత్సరమునందట. ఈమ అతనిని ఆదుర్గాధిపత్యమునకు అప్పుడే నియమించి యుండును. చేచమంత్రి రాజ కార్య నిర్వాహకుడుగ చేసిన యేర్పాటు గూడ అప్పుడే జరిగియుండును. గోపమంత్రి సంస్కృతాంధ్రములలో గొప్ప పండితుడు. వాఁభ్రాత, కవి. అతని కార్యదర్శి దేచమంత్రియు అంతటి వాడే గోపమంత్రి దేచ మంత్రికి 1517 వసంవత్సరమున ఒక యగ్రహారము దానము చేసినాడట. కనుక ఆ దేచమంత్రికి తన కృతి నంకితమిచ్చిన రామలింగకవి ఆ కాలమువాడే. కాని గోపమంత్రి కొండపీటిని 1533వ సంవత్సరము దాక ఏలినవాడు. అంతదాక దేచమంత్రి ఆ యుద్యోగమునందే ఉనికినాడో లేదో తెలియదు. ఏమైనను ఉదయగిరాధ్య చరిత కృతి స్వీకారము 1515-1533 సంవత్సరాల నడుమ జరిగియుండక తప్పదు. దేచమంత్రి అగ్రహార దానము తీసికొన్న తరువాతనే, అనగా 1521వ సంవత్సరము సుమారులో, ఈ కృతి కొన్నాడని, అప్పటికి రామలింగనికి ప్రాయశః 25 సంవత్సరాల వయస్సని, ఊహింతురు. కాని, అగ్రహార స్వీకారమునకును కృతి స్వీకారమునకును గడుసాయవలసిన పనిలేదు. ఉదయగిరాధ్య చరిత్రమును దేచ మంత్రికి కృతియిచ్చటలో రామలింగని ముఖోద్దేశము ఏదో తాత్కాలిక ద్రవ్యలాభమైయుండునని కొనుట కంటె ఆ మంత్రి సిపారసు మూలముగా గోపమంత్రి పరిచయము, దాని ద్వారా మహామంత్రి తిమ్మరసు కటాక్షము, అది సాధనముగా కృష్ణదేవరాయల భువనవిజయ సభావనమునందు ప్రవేశమును సంపాదించుటయే ఉన్నం కాంక్షనగును. కనుకనే దేచమంత్రిని పేర్కొనుటకన్న మొదలగనే గోపమంత్రిని ప్రశంసించుచు 5 పద్యములు, ఒక మత్తేభము నాల్గు సీసములు-రచించి కూర్చిపెట్టినాడు! (ఉద్య. 1-15, 16, 17, 18, 19) కాగ కృతిని రచింపుమని యడుగుచు దేచమంత్రి రామలింగ కవిని 'తారహారాంగుళీయ కంకణ కర్ణభూషణ పట్టమాడిష్టాది శిష్ట పరివారవస్తు పదానము' (1-25) చేసినాడన్న మాట మనమంగీకరింప దగినది. ఎట్లను ఉదయగిరాధ్య చరిత్ర కృతి స్వీకారము కొందరు తలచినట్లు 1525వ సంవత్సరమునకుగాని,

ఇంకను సాగనీడ్చి 1535 కు గాని, తోయనక్కర కానరాదు. ఆ భావనచే రామలింగడు రాయల అదృష్టభానుడు పడమట కానుచున్న కాలమున సామాజ్యాస్థానమును జేరియుండుననియు ఊహింప నగత్యములేదు. గోపమంత్రికి గాని, తిమ్మరసుకుగాని, రాయలకు గాని రామకృష్ణుడే కృతి నైనను అంకితమేలచేయలేదను ప్రశ్నలిప్పటికి నిరుత్తరముగానేయున్నవి. అతడు రచించినవని సూచింపబడిన యితరకృతులలో ఏవైనను పై వారిలో నెవరికైనను అంకితమైనవేమో తెలియదు. కృతికరణము కృతిభరణము రెంటి విషయమునను ఎన్నో తెరమరుగు సమాచారములు జరిగిన కాలమది. ఆ కాలమే కాదు, అథవా బహువృత్తాంతాని రాజకులాని నామ అను భాస మహాకవిమాట (ప్రతిమ 1 అంకము) సార్వకాలికము. కనుక, శ్రీ చాగంటి శేషయ్యగారు తలచినట్లు (ఆంధ్రకవితరంగణి సం. 8, పు. 25) 1465 ప్రాంతమున రామలింగడు జన్మించి, 1560కి పైబడి జీవించి యుండెనని భావించుట యుక్తము. 1490 నుండి 1575 దాక 85 సంవత్సరాలు అతని జీవితము సాగియుండుననుకొన్నను అస్వాభావికమేమియు రాదు. అలియ రామరాయనివలె రామకృష్ణుడును 'సహస్రసమాసజీవి'యై యుండరాదేమి? ఈ స్థితినంగీకరించినచో రామకృష్ణ, రామరాజభూషణుల సమకాలికత్వము, పరస్పర స్పర్ధయు అసంగతములనుకోవలసిన పనిలేక పోవును. అరువ దేండ్లు దాటిన వారందరికిని బుద్ధి అస్తవ్యస్తమగునని భావించుటయు ప్రకృతి నెరుగని యూహ.

కృష్ణదేవరాయల ఆస్థానమందలి యష్టదిగ్గజకవులలో ఇతడుండెనని లోకవాదమున్నది. నంది తిమ్మకవితో, అల్లసాని పెద్దనతో భట్టుమూర్తితో గొడవలు పెట్టుకొన్నట్లు కథలున్నవి, వారికి సంబంధించిన చాల పద్యములు తెలుగునోళ్ళలో మారుమోగినవి. కాని పలువురు చరిత్రపరిశోధకులు వానిని ప్రమాణముగా తీసుకొనరు. కాని శాసనములను కావ్యములను నమ్ముదురు. ఎందుకో తెలియదు. అసత్యములకు కల్పనలకు రెంటిలోను చోటున్నది. ఆ చోటిని శాసన కావ్యకర్తలు యథాసంభవముగా ఉపయో గించుకొనియే యున్నారనుటయు నిశ్చప్రచమే.

రామకృష్ణుని కావ్యములలో కడపటిది ఘటికాచల మాహాత్మ్యమని

యూహించుకు. దానికి కారణమిది—

ఈ గ్రంథము కథాభాగము మాత్రము మూడాశ్వాసములుగా రచించి రామకృష్ణుడు దాని నంకితమిచ్చుటకు తగిన ప్రభువెవడును కానరాక పోవుటచే 'ఇటనే యుంచె'నట. కనుక కృత్యాది సాధారణాయిక గ్రంథము దీనికి అతడు రచింపలేదు. అట్టి పంథువు దొరకినచో అదెంత, ఒకపూటపని! రామకృష్ణుని పౌత్రుడు—తాతచనిపోయిన తర్వాత గాబోలును—ఆ ప్రబంధమును దెచ్చి భండోజి విచిత్తరాయడను నొక ప్రభువునకు సమర్పించెను. 'అతని యిష్టసిద్ధిగావించి' ఆ దొరయు తన్నాశ్రయించి యుండిన 'వేంకటగిరి' యను కవిని రప్పించి ఆ కావ్యమునకు కృత్యాది భాగమును తనకంకితముగా రచించి కూర్చిపెట్టుమని ఆదేశింపగా, అతడు 'ఖండోజి క్షోణీమండలాఖండలుపై బంధురంబుగా నొకానొక మహాప్రబంధంబు రచియింపంబూనియున్న సమయంబున 'ఆ పూనిక యింతసుళువుగా నెరవేర్చగల్గుటకు సంతోషించి, దేవతాస్తుతి మొదలుగా షష్ట్యంత కందాలవరకును గల 60 పద్యములు రచించి చేర్చెను. ఇంతలో ఏమి మూడెనో గాని; రెండవ ఆశ్వాసాదియందొక కందము, మూడవదాని తుదలో ఒకమాలిని మాత్రమే వ్రాసి నిలిపినట్లున్నాడు! దొర తన్ను పిలిపించి యీపని చేయుమని యిచ్చిన 'అభ్రకార్తస్వరదుకూల సారఘనసార వాసనాలోల తాంబూలంబులు' తప్ప వేంకటగిరి కవికి మరేమియు లాభము గలుగలేదేమో! (మతికా. పీఠిక) మరి దీనిని దెచ్చి సమర్పించిన రామకృష్ణ పౌత్రునికి ఆ ప్రభువు కావించిన 'ఇష్టసిద్ధి' యెట్టిదో! పాపము, ఆ యనామధేయ బ్రాహ్మణుడు, తాత దేవకాంక్షితముగా వ్రాసిన ప్రబంధమున కృత్యాది భాగమును తొలగించి దురాశచే ఖండోజికి అమ్ముకొన్నాడేమో అను అపవాద వికల్పమునకును పాత్రుడైనాడు! (ఆం. క. త. 8–11)

కాని అట్టి సందర్భములు వింతలనుకోనక్కరలేదు. రామకృష్ణుని సమకాలీనులైన హరిభట్టు, నారన సూరకవి అనునిద్దరు కవుల కావ్యములు ఇట్టియవస్థకే పాల్పడినవని మన మెరుగుదుము. (ఆం. క. త. 8–9 సం) హరిభట్టు నారసింహ పురాణమును అతని కొడుకు 'రాఘవమసీషి' కృత్యాద్యంతములు శాస్త్రోక్తముగా రచించి, ప్రోలుగంటి రంగనుంత్రికి కృతి యిచ్చెను.

నారన్న సూరన్న రచించిన 'ఉదయమనోదయ'మును అతని కుమారుడు నారన్న కొనిపోయి ముడియము భాస్కరమంత్రికి ధారపోసెను. కృత్యాద్యవస్థ' అను తెలుగు పలుకుబడి ఇకను నిలిచియుండుటకు కృతిని రచింపిపెట్టుకొని కృతిపతిని సంపాదించు కొనుటకై తన పూర్వీకులు పడిన పాట్లు మూలమనుట నిస్సందేహము. 'ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి ప్రభు దురాత్ముల నెవ్వాడు ప్రస్తుతించు' ఇత్యాదిగా నిర్వేదము ప్రాచీనకవులలో కొందరికి ప్రబలియుండుటకు బహుశః యీ యభావ వైరాగ్య మహత్త్వమును ఒక ప్రబలకారణము కాగలదు.

ఎట్లైనను ఘటికాచల మాహాత్మ్యము రామకృష్ణనిరచనమే యనుట నిస్సందేహము. తక్కిన రెండు కావ్యములలో కానవచ్చు ధార, పలుకుబడి చొరవ, పాండిత్యము మొదలగు గుణములన్నియు ఇందులోను సహృదయులు చూడగలరు. ఇది రామకృష్ణుని కడపటి కృతి యగునో కాదో చెప్పలేము. కాని పాండురంగమాహాత్మ్యమునకు తర్వాతిదని మాత్రము మూహింపవచ్చును. దీనిలో నారదుడు దర్శించిన నూటయెనిమిది తిరుపతులలో నెల్లవిక్కవ మిక్కవతో వాండురంగస్వామిని వర్ణించిన యాఁకింది తీయని పద్యము చదివినచో తట్టుపించును.*

---

*రామకృష్ణుని పటి శివ-విష్ణుభక్త శిరోమణి యిట్టి అపభ్రష్ట రచనను చేసియుండడని నమ్మట మనుష్య స్వభావమందలి నైచిత్రి నెరుగని చిత్ర వృత్తి. పై పుస్తకముండలి రెండు ఆటగీతి పద్యములు పీఠికాశ్లిగముగా రుదాహరించినవి తప్ప దానిని నేను చూచియుండ లేదు. కాని అదే పేరుగల శతక మొకటి సంస్కృతమున, ముద్రితము గలదు. దాని పంతియొకటి మైసూరు ప్రాచ్యపుస్తక భాండాగారమున చాలాకాలము క్రింద చూచినాను. ఇప్పుడు దానినక్కడ చూడినచ్చినాచో లేదో తెలియదు. అది యే కట్టులకును లొగని శివాసాచార్యులను మహాపండితుడొకడు, 19వ శతాబ్దమున నున్న వాడు, రచించినది. ఏరాజునో, రాజవైతాళికులనో మనసున నుంచుకొని ఆశువుగా అతడు రచించెనట. ఇది దానినాది —

"స్తుత్యా ఘ్మణోజలసధిం కపిలా సహాయం. దృష్ట్వాచ
లబ్ధక నరస్తుతి లోభ రాజః

"చిప్పకూకటిరేక నొప్పునొదలమీదఁ
జలిది చిక్కము వింత చెలువు గులుక
వేతల వలపుగొల్పెడు దిస్సమొల హత్తి
గచ్చకాయల తిత్తి రచ్చసేయ
మ(ము?)వ్వంపు మురుషతో మురళి యూదెడు నిండు,
సొగసు గోములచుక్క (?) సొక్కఁజేయఁ,
జిలుతనవ్వుల డాలు చేనున్న వలమురిఁ
గలముడిపెమునకుఁ గళుకునింప,
భైమి దక్షిణ దిక్తట ప్రాంతభూమి
సకల దివిజులతోడ సాక్షాత్కరించి
పుండరీకుని మనిచిన పాండురఁగ
విట్ఠలాధీశు ఁ గోటిరవిప్రకాశు" (1-65)

కాని కాళ్ళు చేతులు లేని కథ, పోలఁపొందులు లేని యతుకులు, అనావశ్యకమైన విస్తరమును కలిగి, యీ కావ్యమొక బలవంతపు మాహస్సానముగా, ఏ ఘటికాచల భక్తుని కోసమో వ్రాసి, యెందుకో మూలబడ వేసినట్లు కానవచ్చుచున్నది. దీనికంటె శుద్ధభారాధ్య చరిత మేకొంతమేలనిపించుచున్నది. అది యొక కృతిపతినైనను సంపాదించుకో గలిగి కవికి

తేషాం కరోతి పరిహాస విధిత్సయా ఽధఃకేశీయ పద్యశతకం
కపిదంతి సింహాఃఁ"

ఇట్లే సంస్కృతమున 'కట్టికవి' రచించిన 'మహిష శతకము' గలదు కదా! ఆకోశమునకును, అసభ్యతకును అందు కొరత యేమియు లేదు. ప్రకీనాథుని పెక్కుచాటువులును, రామకృష్ణుని కొంకెతనపు కథలును ఇట్టివే. వానిని అసత్యములనీ, ఆరోపితములనీ వాదించుట వట్టి అభిమానాడంబరము. సంస్కృతమైన చిత్తవృత్తి గలవారు అట్టి వానిని ఉదాసీనదృష్టితో చూతురంతే. స్వతంత్రుడై సమర్థుడైన వానికి ఉల్లాసమో, ఉద్రేకమో కలిగినప్పుడు అసభ్యత, అవివేకము, అశ్లీలము వంటి తెరలు పైకి తేలి యుగగుట యెప్పుడును వీమియు వింతగాదు.

కొంత ధన్యతనిచ్చినది.

పై మూడు గ్రంథములుగాక 'హరిలీలావిలాసము', కందర్పకేతు విలాసము అను రెండు ప్రబంధములను రామకృష్ణుడు చేసియుండినట్లు తెలియుచున్నది. వానినుండి కొన్ని పద్యములను పెదపాటి జగ్గకవి తన ప్రబంధ రత్నాకరమను సంకలన గ్రంథములో చేర్చిపెట్టినాడు. అవన్నియు అష్టాదశ వర్ణనల లోనివే కనుక, ఆ గ్రంథములు ఎవరికంకితములో, ఎప్పుడు ఎక్కడ వ్రాసినవో, వాటిలో రామకృష్ణని శైవ-వైష్ణవ ప్రతిపత్తు లెట్లు ప్రతిఫలించినవో ఊహించుటకును సందులేదు. ప్రీ నాథుని హరవిలాసమును నిశ్శంక కొమ్మన శివలీలా విలాసమును దృష్టినుంచుకొని ఇతడు వానికి ప్రతిగా హరిలీలా విలాసమును కూర్చి యుండును. కందర్పకేతు విలాసమును పేరునుబట్టి శృంగార ప్రబంధముగా కొందరూహించుదురు. మరి 'లింగపురాణము'ను రచించినట్లు ఉత్తవాడుక, 'ఆదిపురాణము'ను చేసినట్లు అప్పకవిది నమ్మరానిమాట, కలవు. ఇదిగాక 'ప్రతిపద్యశిరఃకంపము' అను ఇంకొక పెద్ద పేరిరచనగూడ ఇతని కంటగట్టుదురట. ఇక పేరొక్కనరావి శతకమొకటి యెవనిమీది కచ్చికో చేసివేసినట్లును ఒక గాథ. ఎట్లును రామకృష్ణుడు, శ్రీనాథునివలెనే, పట్టుమని కూర్చున్నచో ఎన్ని గ్రంథములైనను ఎంతో ఎత్తులో రచింపగల ప్రతిభ, పాండిత్యము గలవాడనుటకు సందియము లేదు. కాని, ఆ పట్టుమని కూర్చుండుటయే, భోగలాలసవల్ల అతనికి, పరిహాస చాపలము చేత ఇతనికిని, సాధ్యముగాక, ఇద్దరికిని కావ్య ప్రపంచమున రావలసినంత మహత్త్వము రాకపోయిన దనవచ్చును. వేరు వేరుగా అందచందములు లోతు పాతులును గల పద్యములెన్నెన్నో రచించినను మొత్తము గ్రంథమునకు గాంభీర్య గౌరవములను సంపాదించు విశేచనమును విశ్రాంతియు వలసినంత వీరలవర్చుకోలేదు. వీరికి లేనిది నేర్పు గాదు, ఓర్పు.

రామకృష్ణుని రచనలలో నెల్ల ఈ పాండురంగ మాహాత్మ్యమే ఉదాత్తమైనది. కనుకనే కాబోలును, ఇదొక్కటే నిండుగా నిలబడినది. తక్కిన రెండును అక్కడక్కడ తునితములుగానే కన్నుగుట్టుచున్నవి. 'పాండురంగసుకవి పద్యంబు హరువును' అన్ననానుడియు, 'పొగడి మీ

పెదకాత పాండురంగాది సత్కృతులు చేసెను' అని రామభద్రకవి గొప్పగా చెప్పించుకొన్న మాటయు ఈ రసిక లోకాభిప్రాయమునే సమర్థించుచున్నవి. ఇందలి సందిగ్ధ పాఠములను సవరించు ప్రయత్నము నెందరో పండితులు చాలనాళ్ళుగా చేయుచుండుట, ఇప్పటికి రెండు టీకలు దీనికి వెలువడుట, మూడవది యావశ్యకమని పలువురు భావించుట ఇవి దీని యుదాత్తతకు పునరుక్తులు.

పదునైదు పదునారవ శతాబ్దులలోని తెలుగు వాఙ్మయమున ప్రధానముగా వెలువడి వెలసిన 'ప్రబంధము' అనబడు చంపూకావ్య రీతికి శ్రీనాథుడు నాయకుడన వచ్చును. ఏదోయొక కథ యెంత శిథిలమైనను తీసుకొని, లేని యవకాశములను కల్పించుకొనియైనను అష్టాదశ వర్ణనములు చేతనైనంత చమత్కార రచనలతో పెంచి కావ్యమును నించుట దానిశైలి. ఎవనికో అంకితమిచ్చి, ఇంతో అంతో సంభావన సంపాదించుట దాని పరమ ఫలము. ఆరాధ్యులు శైవమును, ఆచార్య పురుషులు వైష్ణవమున ప్రభువుల యాశ్రయముతో, పరస్పర స్పర్ధతో ప్రచారము చేయుచుండిన కాలమది. ఆయా పురాణములలో, క్షేత్ర మాహాత్మ్యములలో, కావ్యకర్తలకు వలసిన ఆ మాత్రపు కథాపంజరములకు కొదవలేదు. అనుస్యూతమైన పెద్దకథ, అందు వివిధ పాత్రలు, వారి భిన్నమనోధర్మాల సంఘర్షణ, దానిచే గలుగు సూక్ష్మ ధర్మనీతుల పరిణామములు, సార్వభౌమముగా వ్యాపించు ప్రధాన రసము, మొదలగు మహాకావ్య వస్తువులను గ్రహించి పరిశ్రాంతితో రచన సాగించు శక్తియుక్తులు, సౌకర్యమును ఆ కాలపు కవులకు చాలవనిపించును. అది వివిధములైన రాజకీయ విప్లవములతో, దినగండ దీర్ఘాయుస్సులతో, కలుషితమైన కాలము; పండితులకు ప్రాయికముగా కవిత్వమే జీవనోపాధిగా నేర్పడిన సమయము; కవులును, రాజులవలె, ఎదిరించిన వారి నోడ గొట్టుటకు వలసిన క్లిష్టమార్గములను వక్రపద్ధతులను అలవరచుకోవలసియుండిన పీరయుగము. 15 శతాబ్దమున భక్తిబలముచే జీవించిన అన్నమయ్య-పోతనవలె, 16వ శతకమున పింగళి సూరనవలె, ఏ కొందరో ఆ మేరలు మీరిన మహనీయ ప్రతిభలు వారి యంద[illegible] సోకు లేకపోలేదు.

పాండురంగ మాహాత్మ్యమందలి మూ[illegible]

నిధి కౌస్తుభమై" నదన్నాడు కవి. కాని ఆ మహాపురాణ సంహితలో ఉమా మహేశ్వర సంవాదముగా ఈ కథయున్నట్లు తొమ్మిదధ్యాయముల సంస్కృత రచన యొకటి గలదుగానియది యీ తెలుగురచనకు తర్వాతనే కల్పింప బడినదని శ్రీ బులుసు వేంకటరమణయ్యగారి యభిప్రాయము. (వావిళ్ళ. పాండు. పీఠిక, పు. 14, 15) అది యింకను పరీక్షించ వలసిన విషయము. నేనా గ్రంథమును చూడ గలుగలేదు. అట్టికల్పనలు మనలో అసంభావ్యములు కావుగాని ఆ నిర్ణయమునకు వారిచ్చిన కారణములు చాలవు.

ఆ కాలమందు విజయనగరమందు పాండురంగస్వామి గొప్పమహిమతో పూజలు గొనుచుండిన దైవము. శాసనాద్యాధారములు మాత్రము కాక ఆ 'పాడుపట్టణము'లో నేటికిని కన్నులుగుట్టు మహాశిల్పకళానిధి విట్టలరాయని గుడి, దాని వంటి దింకొకటి అచ్చట కానరాదు. తిరుపతి వేంకటేశ్వరునికి జీవితమును గుత్త చెల్లించిన అన్నమాచార్యులు గూడ విజయనగర పట్టలుసీపై ఏన్నో కీర్తనలు రచించినాడు. అసలు పండరంగి క్షేత్రము వైష్ణవమైనను రామానుజుల సంప్రదాయముది కాదు. మాధ్వులైన మహారాష్ట్ర కర్ణాటకులకది ప్రాణప్రదము. ఐనను, రామానుజ సంప్రదాయానుయాయులగు కృతి భర్తయు, కర్తయు ఆ క్షేత్ర కథయందు శ్రద్ధాభక్తులను చూపుటకు కారణము ఆ మూర్తికాకాలమున దేశీయముగా వెలయుచుండిన వైభవమే యనవచ్చును. మరి హార్దముగా శివకేశవుల భేదమంతగా గమనింపని రామకృష్ణునికి వైష్ణవ క్షేత్ర మైనను ఒకటే.

ఇందలి పెద్ద-చిన్న కథలన్నియు భక్తిభావమును ప్రపంచించి శాంత రసమున పర్యవసింప వలసినవి. కనుక సామాన్య ప్రబంధములవలె శృంగార రసపేలాసములు వీక పేహారాలును ఇందులేవు. ఉన్నవి చిత్త విక్షేపమును గలిగించునంత మితిమీరినవి గాని, సంప్రదాయముల భిన్న ముద్రలుగాని, కావు. ఈ కావ్యమునందలి సుగుణములలో ఇది ముఖ్యము. శ్లిష్టరచన దీనిలో కాంచిత్కము. చిత్రరచన లేనేలేదు. ఎత్తిన సందర్భ మరచరనాగున. వర్ణించిన వస్తువు కన్నులకు ముఖముతో, కదలికతో, నడచును. సంగహ

మైన విషయము, చక్కనిమాటలు. ఇంకను కొంత వివరించియుండిన బాగుండునుగదా' యనిపించుచుండును. ఈ సంయమముతోడి వస్తు చిత్రణశక్తి ఎందరో మహాకవులు నోచుకోనిది. ఇందు కవి చూచిన యే బొమ్మగాని మన హృదయాకాశమున తళుక్కని మెరయక మరుగుపడదు.

పాండురంగ మాహాత్మ్యమునందు కవితా పూర్ణ ఫలములవలె తీరినవి మూడుకథలు: (1) నిగమశర్మకథ (2) సుశీలచరిత్ర (3) అచ్యుతుని వృత్తాంతము. అందు నిగమశర్మ కథ తెలుగు రసికులకెక్కువ హృద్యమై యున్నది. అనగా తక్కిన రెంటను కావ్యకళ తక్కువయని కాదు. దానివలె అవియును సానలదీరినవే. కాని నిగమశర్మ వంటి ప్రాతమే స్వతో రంజకము. నియమములు తప్పక నడుపుకొనగల 'సంశిత వ్రతుల' విషయమున ఇతరులకు భయ భక్తులుండును. నడుపుకొనలేక ఇంద్రియ పరవశులై పోవు దుర్బలాత్మలమీద కనికరము, కొంత అసూయయు గలుగును; తప్పువారిది కాదేమో యనిపించును. ఇట్లు విషయ మౌల్యమువల్ల అకాల మృత్యువు వాతబడిన అగ్నివర్ణుడను రాజుకథను ముగించుచు కాళిదాస మహాకవి,

"స్వాదు భిస్తు విషయైః హృతస్తతో దుఃఖమింద్రియగణో
నివార్యతే" (రఘు. 19స, 49ప)

అని నిర్వేదపడినాడు. దశరథుడు వేటయందలి వ్యసనముతో కన్న గానక మునికుమారుని జంపి శాపము పాలైనది వర్ణించి ఆ మహాకవియే,

"అపథే పదమర్పయంతి హి శ్రుతవంతోపి రజోనిమీలితాః"
(రఘు. 9-74)

అని సానుభూతితో సరిపుచ్చుకొన్నాడు! ధర్మశాస్త్రము లెంత కటికతనముతో శాసించినను తత్త్వశాస్త్రములు అట్టి పతితులకును ముక్తి మార్గము కలదనియే ఆశ్వాసము నిచ్చుచున్నవి. దేవతాక్షేత్ర తీర్థ మాహాత్మ్య కథలలోనెల్ల అత్యుక్తి యెంతయున్నను అంతర్గతమైన తత్త్వమిదే.

ఈ ప్రబంధయుగమున ఎందరో కవులు నిగమని వంటిపాత్రములను ఉత్సాహముతో, ఉత్కంఠతో వర్ణించినారు. యుగపురుషునదగిన

శ్రీనాథుడు కాశీఖండములో మొదలు సంగ్రహముగా 'మహానందు'ని కథ (ఆ-7) కొంత విస్తారముగా, అందే 'గుణనిధి' కథ (ఆ-4), ఇంకను విస్తరముగా శివరాత్రి మాహాత్మ్యమున (ఆ.2,3,4) 'సుకుమారు'ని కథయు వివరించినాడు. హరిభట్టు నారసింహ పురాణమునందలి 'మందేహు'ని గాథయిట్టిది. (ఆ. 5 ప. 126-196) కంచకూరి రుద్రయ్య నిరంకుశోపాఖ్యానము నాలుగాశ్వాసములును ఇట్టికథనే పెంచి ముగిసినవి. రామకృష్ణుడే ఉద్భటారాధ్యచరిత్రలో పదాలసుడను ఇట్టి ప్రాతమునే వివరించినాడు (ఆ.2 ప 115నుండి). అతని 'హరిలీలావిలాసము'లో ఇట్టికథ మరొక్కటియును డవచ్చును. వీమైనను పైరచనలేవియు నిగమశర్మోపాఖ్యానమునకు సాటిగావు. అవేవియు ఇది సాధించిన తీర్మానము నందుకోలేవు. "అటువంటి రచన మళ్ళీ రామకృష్ణుడే చేయలేనంత గొప్పగా రచించాడు" అన్న శ్రీ ఆరుద్రగారి యభిప్రాయము సహృదయులందరును అంగీకరింతురు (సమగ్ర ఆంధ్రసాహిత్యం 8 59). ఇందలి తక్కిన రెండు కథలును ఇంతటి కవితా కళావిలాసమేకలిగిన కామనీయక మూర్తులు; ఇట్టే నిండుమనసుతో అనుభవింప దగినవి. తిక్కనకు తరువాత చిన్న కథలనింత హృద్యముగా రచింపగల నేర్పు రామకృష్ణునికే, యీ కావ్యమందే, అబ్బినది.

సీసపద్యములను రామకృష్ణుడు శ్రీనాథుననుకరించి తీర్చినాడని భావించుటలో కొంత సత్యమున్నది. కాని శ్రీనాథుడే, అందందు నన్నయ తిక్కనాదులు యథాసంభవముగా అలంకరించిన నడకనే, యేర్పాటునే, గ్రహించి తన సీసాలకు తీర్పు తెచ్చుకొన్నవాడు. ఇంతేకాదు ప్రాచీన సంస్కృతాంధ్ర కవులనుండి అతడెన్నో చిన్న-పెద్ద చిగుళ్ళను అలవోకగా గిల్లుకొన్నవాడే. తరువాతివారు ఆ గురువుకు తిరుమంత్రము చెప్పిన శిష్యులగుటలో వింత యేమియులేదు. కాని రామకృష్ణుని రచనలో, ముఖ్యముగా పాండురంగ మాహాత్మ్యమున, హరిభట్టు నారసింహ పురాణము ప్రభావము నాకెక్కువగా కంటికందినది. హరిభట్టు రామకృష్ణునికి కొంతవయసు చెల్లిన సమకాలికుడనవచ్చును. ఈ క్రింది సంవాదములు గమనింపదగును-

(1) "థళు థళుక్కుననింగి దాటించె బలుమారు లలిత విద్యున్నటీలాస్య కేళి (నార. 4-5)

"తళుకుతళుక్కున దాటించెఁ బలుమాఱు నీరాళ్ళనొందిఁ గన్నియ మెఱుంగు" (పాండు. 4-5)

(2) తాండవ్రకీడ ముక్తాశశి (సేపి) సోఁగకాసియ యూడ్చె శిఖి వన శ్రేణియందు" (నార. 4-10)

"శిఖి తాండవము కళానికఁ జేసి సడలించెఁ గఱకుటీ కలపేరి కాసె బిగువు" (పాండు. 4-37)

(3) "తల లోపలి నాలుక పూసలఁ గ్రుచ్చిన బొందు దుగ్ధ సంయుతజలముం బలెఁ గపట భూసురోత్తమ, కుల తిలకము దనుజపతులఁ గొలిచి మెలంగున్" (నార. 5-22)

"తలలోపలి నాలుక పూసలఁ గ్రుచ్చిన నూలు పాలఁ జల్లిన నీరుం బలె వెలి యెఱుఁగక మనసులు, గలసి యభేదముగఁ గాఁపుకడ నతఁడుండెన్" (పాండు. 3-59)

(4) "చిల్లర చేఁతల నిల్లుం బొల్లుం జెల్లఁగ వెఱంజి" (నార. 5-132)

"మత్త కాశిన ల కిల్లుం బొల్లునుం జెల్లఁగ" (పాండు. 3-42)

(5) "అఁతారిపు జ్వలన జ్వాల" (అంతర్+రిపు) (నార 5-175)

"అఁతారి పూత్కరముం బోవ నదల్చి" (పాండు. 5-120)

(6) "అతి కఠోర నియమ శష్కులై యుండెడు వాకికి" (నార. 5-51)

"తీవ్ర వ్రతాచార శష్కులై యుండెడు ముండధారులు (పాండు. 5-214)

(7) "కప్పురము గుమ్మరించిన కరవటంబు" (నార. 2-42)

"కప్పురము గుమ్మరించిన కనుపకోవి" (పాండు. 4-8)

(8) కపట నటనానటుండైన" (నార. 5-23)

"కపట నటనా నటుఁడు క్రొఁతగట్టుబోయ" (పాండు. 3-68)

(9) "పాప రూపము పటాపంచ (చు) చేసి" (నార. 2-7)
"పాప పూరుషఁ బటాపంచు చేసి" (పాండు. 2-8)

(10) "గుడినుఁడి కోయఁజూచెదు గుడి త్రాళ్ళను" (నార. 4-124)
"గుడి నుండి గుడఁతాళ్ళుదీయు (తాళ్ళుగోయు) కరణి"
(పాండు. 3-68)

ఇట్లింకను రాజార్ధ కిరీట, పాణిధ్వమ, పెన్నాటకంబు, బుజులువైచి, గురి గంటి గాని, కాఁపెయ ఒఱగుముండా, ఉహ్లూన హోమాగ్ని, ఏదురు వెల్లి, హరి కౌస్తుభమైన ఇత్యాది పదములందిద్దరికిని సంవాదముగలదు. హరిభట్టు రచించిన యితర గ్రంథములతోను పోల్చి చూడ గలిగితి మేని యీ యిద్దరి సంబంధమింకను కొంత విశదము గావచ్చును.

ఇంత చక్కని కావ్యమును శ్రీకృష్ణదేవరాయని కంకితముగా రామకృష్ణుడు చేయ గలుగలేదు. సరిగదా, మహామంత్రి తిమ్మరసుకు గాని, ఉపమంత్రి గోపన్నవంటి వానికి గాని అంకితము చేయనోచుకోలేదు. పొత్తపి నాటిలో, కృష్ణరాయల తర్వాత సదాశివరాయలకు లోబడి రాజ్యము సాగించు చుండిన 'మహామండలేశ్వర' మంగయగుర వరాజు కుమారుడు సంగరాజు చేతికిందఁ 'రాయసము'చేయుచున్న విరూరి వేదాద్రికి ఈ కృతి కన్యాదానము చేసినాడు! ఉదృటూరాధ్య చరిత్రమును కృతియందుకొన్న దేవమంత్రియే యీ వేదాద్రికంటె ఎక్కువ యంతస్తుగలవాడేమో! అతడు "గోపన మంత్రికి రాజకార్యనిర్వాహకుడు" [ఉదృ. 1-20] ఇతడు "సంగభూపాలమణి రాయస ప్రవృత్తి" [పాం. 1-20] ఈ రెండుద్యోగములును ఒకటే యెత్తువగునేమో! ఎట్లును దేవమంత్రి కున్నంత పాండిత్యమును వేదాద్రి కున్నట్లు తోపదు. అతని యెడ రామకృష్ణునికి విశిష్టముగా కానవచ్చిన శక్తి చక్కని చేతిప్రాత! కనుకనే కాబోలు కొందరు పై 'రాయసము' 'ప్రాయసము' గా పఠించినారు. కాని 'ప్రాయసము' అను రూపము వ్యుత్పన్నముగా గాని ప్రామాణికముగా గాని నాకు తోపదు. 'రాజసము' 'రాయసము'గా ప్రాకృత కన్నడ ద్రమిళ భాషలలోనున్నది. అర్థమందును భేదములేదు.

రామకృష్ణుని ఘటికాచల మాహాత్మ్యము తల-తోకలు లేక నిలిచిన సంగతి యెరుగుదుము గదా. ఇతని తమ్ముడు అన్నయ్య సుదక్షిణా పరిణయము గూడ ఎవడో రాజోద్యోగికి అంకితమైనది. ఇట్లు చిల్లర పల్లర యుద్యోగులకు కృతినంకించి యేదో "శాకాయలవణాయనా" గా సంపాదించు కొన్న కవులు నాటికి నేటికి ఎందరో తెలుగులో గలరు. ఈ కష్టమును నిరాశను నిర్వేదమును ఓర్వలేక ప్రభువులను సగటుగా తిట్టి పోసినవారు గలరు. కృతిని నరాంకితము చేయుట నరక హేతువని రోసి ఇష్టదేవతాంకితము చేసిన పోతన్న, సంకుసాల నరసయ్య వంటివారును కొందరుగలరు. ఇంకను కొందరు ఆత్మాపహారమునకైనను ఒడబడి తమ కర్తృత్వమును ప్రభువులకు తర్పణము విడిచిన వారున్నారు. సంస్కృత సారసత్వమున మహోన్నత ప్రజ్ఞామండితులగు చెరుకూరి లక్ష్మీధర పండితుడు, అప్పయ్య దీక్షితులు, గోవింద దీక్షితులు మొదలగు వారాపని చేసినారు. వారిలో బుద్ధిమంతులు కొందరు తమ కృతులను తమ పేరకొన్ని, ప్రభువు పేర కొన్ని ప్రతులను వ్రాయించి యథానుకూలముగా ఇంటను బైటను ప్రకటించి నెమ్మది పడినవారును గలరు! తెలుగులో రంగనాథుడు, అల్లసాని పెద్దన మొదలగు వారు ఇట్టిపని చేసినారని యూహింప నవకాశము గలదు. కాని ఆ మాట చెప్పినచో నేడు అభిమానావేశముతో, ఆగ్రహముతో మీదికి దూకు చరిత్ర వావదూకులు గలరు! పెద్దలయెడ అభిమాన గౌరవములు తమకు మాత్రమే యున్నట్లు, ఆ పెద్దల అంతరంగ బహిరంగవృత్తులన్నియు తామే యెరిగినట్లు! పోగా, ఇది బ్రాహ్మణేతరులకు వచ్చిన కీర్తి నోర్వక బ్రాహ్మణులు పన్నిన యెత్తుగడ యని వింత యక్కసుపడు మర్మజ్ఞమన్యులున్నారు. ఈ వ్యవహారములలో నిజముగా, కర్తృత్వమును ఆమ్మినవారిది కడుపుకక్కుర్తి, కొన్నవారిది పేరు పేరాస; ఇంతేకాని ఇద్దరిపనియును అల్పమే, అసహ్యమే. సత్యశ్రద్ధ గలవారు ఈ నాటకరంగమందలి వన్నెల తెరను దూరమునుండి చూచి తృప్తిపడక సమీపించి చూచినచో దాని చిరిగిన తూట్లలో ఎన్నో వెనుకటి రహస్యములు కంటికందును.

రామకృష్ణుని పాండిత్యము విరిపియైనది. బహుముఖమైనది. ఈమాట అతడే చెప్పుకొన్నాడు. 'కుమారభారత' అని కౌమారవయస్సునసే

బిరుదు అతనికెవరో యిచ్చినారు. దొరికిన మూడు రచనలందును అతని పాండిత్యము స్ఫుటముగా నున్నది. "శారద నీరూపము" అని 'మహిన్ మహోంధకవితావిద్యాబలప్రౌఢి నీకెదురేరీ!" (పాం. 1–27) అని వేదాది పేరిట అతడే చేసిన సవాలుకు 'నేనున్నాను' అని యెదురొక్కనగల వారు నాటికి నేటికి అరుదే. ప్రతిభ, చొరవ, లోకజ్ఞత, లోతులుచూచు పదను, సంయమము, ఆర్జవమును అతనికి అసాధారణముగా గలవు. ఇట్టి వానికి ఆ కాలమున తగిన మహారాజుల యాశ్రయ సమ్మానములు దొరకక పోవుటకు ప్రకృతి సిద్ధమై అణచుకోలేని అతని వికట మనోధర్మము ముఖ్య హేతువని యూహింప వచ్చును. దానికి మూలము తెలివి చురుకు. అది పైకెత్తినపుడు సభ్యతాసభ్యతలు ,పరికార వికారములు, దయాదాక్షిణ్యములు-తుదకు తన యోగక్షేమములు మొదలైన ఛాయా భేదములు నడతలో వెనుకబడును. దీని దెబ్బదిన్న వారికి తప్ప తక్కిన వారి కందరికి ఇది ఆకర్షకమైన వినోదమగును. దీని బలము రాజసభలలో ఇంకను ఎక్కువ. అక్కడ పదవి, గౌరవము గలవారికి దీనిదెబ్బ తగిలినప్పుడు కలుగు కోపాసూయలు సామాన్యమైనవిగా నుండవు. సమయము వచ్చినప్పుడు ఎదురు దెబ్బ దీయక మానవు. రామకృష్ణుని వికటములలో అసభ్యములని మనకు దోచినవన్నియు అతని మీద తరువాతి వారెవరో కల్పించి మోపిన వనుట అనవసరముగా కట్టుకొన్న మడుగుమాట. అసభ్యత పరిహాసములో సహజమైన యొకచెంప. ఈ యుగమునకు ప్రథమాచార్యుడైన శ్రీనాథుని శృంగార నైషధమున బువ్వపు బంతిలో వియ్యాలవారి పరస్పర పరిహాసముల పచ్చని చదివిన వారికీ తత్త్వము ప్రొత్తది గాదు. అవన్నియు మామిడి సింగ మహామంత్రి మహాస్థానములో చదివినవే. సభాసదులు పండితులందరు విన్నవే. మరి రామకృష్ణునివన్నియు అసభ్య వికటము లనుగావు. దోషమేలేని పద్యము నేను చెప్పగలనని, ఇతరకవులందరును సంకోచముతో ఊరకుండగా, పెద్దన్నగారు లేచి ఆశువుగా, రాయలను పొగడుచు, ధీరముగా,

"శరసంధాన బలక్షమాది వివిధై (బహువిధై?) శ్వర్యంబులుంగల్గిదు
ర్భర షండత్వబిల ప్రవేశచలన ప్రబ్రహ్మఘ్నతల్ మానినన్

నరసింహక్షితిమండలేశ్వరుల నెన్నన్ వచ్చు నీ సాటిగా
నరసింహ క్షితి మండలేశ్వరుని కృష్ణారాజకంఠీరవా!"

ఆను పద్యము రచించి పఠింపగా, ఇతర కవిపండితులు తెలిసియో, తెలియకయో, ఊరకుండినారు. పెద్దన్న 'రాజచూడామణీ' అని యుండిన ఏ తకరారును ఉండియుండదు. కాని ఆ మహాకవి విజయోత్కంఠలో ఆ చిదరను గమనింపలేదేమో! కాని రామకృష్ణుడు తెలిసి నాకెందుకని మౌనముతో ఉండ లేక పోయినాడు. "తాతా! ఈరాయలతో పోలిక నాకు కుయ్యోమొరో? వద్దని తలదప్పించుకొని గుహబిలములో దూరిన సింహాన్ని తీరుగా బలవంతంగా తోకపట్టియీడ్చి 'రాజకంఠీరవా'అని రచ్చకు తెస్తిదేమి?" అన్నాడట. అందరును గొల్లుమని కాకున్నను నోరుమూసుకొని యైనను నవ్వియుందురు. ఆంధ్రకవితాపితామహుని మొగమప్పుడెట్లుండెనో! ఇది రామకృష్ణుని అవివేకము గావచ్చును. కాని అసంగీతము మ్రాతము కాదు.

ఇట్లే ఇంకొకమారు ఇతరులు కవులందరికిని రామకృష్ణుడు మొగము నీళ్ళు దించినకథ నా చిన్నతనమున విన్నాను. కంఠీరవాచార్యులను వృద్ధ వైఖానస పండితులొకరు చెప్పినది. అచ్చుకది యెక్కినట్లు కాన రాదు. కనుక ఇందుద్ధరించుచున్నాను.

ఒక సాయంసమయమున రాయలు నిండిన చెరువు కట్టమీద వాహ్యాళి వెళ్ళిరి. వెంట కవులను పరివారమును ఉన్నారు. చెరువు మరవకాని నలు దిక్కులను వ్యాపించియున్న ఆ జలరాశిని జూచి "ఈ నీరెట్లున్నది? చెప్పండి" అని రాయలు అడిగెనట. కవీశ్వరు లొక్కొక్క రొక్కొక్క వింత రూపకోత్ప్రేక్షలతో వర్ణించిరట. కాని రాయల తల అడ్డముగానే కదలు చుండినది. రామకృష్ణుడు మ్రాతము గంభీరముగా ఊరకున్నాడు. 'ఏమి రామకృష్ణా! నీవేమంటావు?' అని కడపట రాయలడిగెను. "ఏముంది మహాప్రభు! చెరువుకట్ట దిట్టముగా కట్టించినారు తాము. కాబట్టి నీరు పార కుండా ఉందంతే!" అన్నాడట తిన్నగా అతడు! ఆ యుదాసీనమైన యుత్త రమునకు రాయలును పరివారమును మెచ్చుకొని నవ్వియుందురు. కాని ఆ కవీశ్వరుల మొగములు మాడివడక యుండవు. ఇట్టి వ్యక్తికి ఎక్కువ

చనవిచ్చి నమ్మి దగ్గరకు చేర్చుకొనుట యెవరికైనను కష్టమే. చేర్చు కొన్నను ఆ పొత్తు ఎక్కువ కాలము నిలువదు.

హృదయోల్లాసము ప్రధానముగాగల యీ వికటకవిధర్మమును ఇతడు చాలా అణచిపెట్టుకొని కావ్యరచన-మనకు తెసినంతవరకు-చేసి నాడు. కాని ఆ సహజ పరిహాసపు చూపు ఈ భక్తిప్రధానమైన యుదాత్త కావ్యములలో గూడ అందందు ప్రతిఫలింపక పోలేదు. పాండురంగ మాహా త్మ్యమున నిగమశర్మయక్క 'క్రొత్తగాఁజేయిఁచుకొన్న ముక్కురకునై' (3-50) యేడ్చెనన్న మాటలో రామకృష్ణుని చిరునవ్వు గలదన్న దృష్టి, కొందరికి గాకున్నను. మరికొందరు సహృదయులకు యుక్తమనిపించినఁ.

వేసవిలో "మల్లియల పెల్లు కన్నడ కవితావితానంబునుంబోలె షట్పద వృత్తవిలాస భాసురంబై" (4-16) యుండినదట! ఆ కాలమున కప్పుడే కన్నడ వాఙ్మయమున చంపకోత్పలాది సంస్కృత వృత్తములను తోసి రాజని షట్పదులను పేర కొన్ని మాత్రాలయ ప్రధానములైన పద్య రీతులను ఎక్కువగా ప్రచారమునకు దెచ్చియుండిరి. తెలుగువారు ద్విపదను దెచ్చినట్లు. ఐదారు విధములైన ఆ షట్పదులలో 'భామిని' షట్పది-7మాత్రల మిశ్రగతి గలది-అధికవ్యాప్తి గాంచినది. ద్విపద కవితా పితామహుడన దగు పాల్కురికి సోమనాథుని బసవపురాణమును ఈ ఛందస్సులోనే భీమ కవి కన్నడించెను. రాయల కాలమునకు ముందే గదగు నారణప్ప ఇందులో రచించిన దశపర్వ భారతము దేశము నలుమూలలమ మారు మ్రోయించుచుండెను. రాయల యాస్థానమందే యుండిన తిమ్మణాచార్యుడు, తిక్కనను దగ్గరగా ననుసరించుచు, స్త్రీపర్వము మొదలు తక్కిన యెని మిది పర్వములను అదే ఛందస్సులో ప్రాసి భారతము ముగించియుండెను. మనవలెనే ఆంగ్ల సాహిత్య ప్రభావమున పుట్టిన శిథిలచ్ఛందస్సు కన్నడ మునను ఇటీవల ప్రచారమగు చున్నది; కాని, అంతకుముందు కవితా వేశము గలవారిలో తొంబదిపాళ్ళు ఈ షట్పదులను ముఖ్యముగా భామినిని పరిగ్రహించిన వారే యనవచ్చును. మన ద్విపదము ఇంత వ్యాప్తిగాని, చంపకాదివృత్తములకు ఇంత అనాదరముగాని, నేటికిని రాలేదు. కనుకనే రామకృష్ణుని పాలికి ఈ షట్పది రోకటిపాటగా బేజారు గలిగించి

యుండును. ఆ విసుగునే శ్లేష మరుగులో అతడిక్కడ వెలువరిచి నవ్వు కొన్నాడు. దీనినే ఆస్థానమందలి ఇతరులెట్లున్నను, కన్నడులెల్ల నొప్పిదిని యుందురు.

'పరిహాసము పవిత్ర వస్తువును గూడ గమనింపదేమో' అను భావమునకు ఇంకొక విస్పష్టమైన యుదాహరణ మీవచ్చును. తిరుపతి శ్రీవేంకటేశ్వరుడు దక్షిణదేశమున సర్వజనీనమైన దైవము. 14–15 శతాబ్దములలో వ్యాపించిన విశిష్టాద్వైత సంప్రదాయమును విజయనగరాధీశ్వరుల భక్తి ప్రపత్తులును తెలుగు కన్నడ దేశములలో తక్కినయే దేవతామూర్తికిని లేనంత వ్యాప్తిగౌరవములను శ్రీనివాసమూర్తికి సంపాదించినవి. ఆ వైభవము ఉత్తరోత్తర వృద్ధిలో నున్నదిగదా. రామకృష్ణునికిని ఆయభిమానము పఠబలముగానుండుటలో వింత యేమియు లేదు. కనుక, ఘటికాచల మాహాత్మ్యమున, సప్తర్షులు ఘటికాచలమునకు పోవు త్రోవలో కవి, అదేపనిగా అవకాశము కల్పించుకొని, వారికి శేషశైలమును వేంకటేశ్వరుని దర్శనము చేయించినాడు. ఈ సందర్భమునకై అతడు వినియోగించిన గద్య పద్యములు 23! అందు శ్రీనివాసుని దివ్యమూర్తిని ఆనందావేశముతో ఐదు సీస పద్యములతో వర్ణించినాడు. ఆ వర్ణన అమోఘముగానున్నది. కాని కడపట, పాయసమునకు దించి తిరుగబోత వేసినట్లు–

"తిండి మెండయగాని తిగళ† గురుని గాంచి సేవించి" (2-144) అని

---

† తిగళ–తిగుళ శబ్దములు కన్నడులు ద్రవిళులకిచ్చిన తద్భవ ప్రసాదము. నేటికిని మైసూరు సీమలో ఎప్పుడో వలసవచ్చి నిలిచిన 'తిగళ'లున్నారు. వారరవవారే. "జగళవల్ల తిగళర యేకాంత" (జగడముగాదు తిగళల యేకాంతం) అని సామెతలకును ఎక్కిన ప్రసిద్ధులు. "తిగళ భూములు తెంకులుగ జరించిన దొడ్డ చెవులపోతుల నెల్ల జెండివైచి" (జైమి భా. 1-45) అని పిల్లలపుట్టి పినవీరుడు వీరినే పేర్కొన్నది. అరవ వారికి చెవులు సహజముగాను కృతిమముగాను పెద్దగా వేలుచుండుట తెలిసినదే. కన్నడ దేశమునందలి శూరజాతులలో వారిదొక్కటి.

విశేషించి రామకృష్ణుడు తన యంతరాత్మను తృప్తిపరచు కొన్నాడు! శ్రీనివాసుని నిత్య నైవేద్యరాశి చాల పెద్దది. దానిని గుత్తకు తీసుకొని యమ్మి యెందరో ధన్యులైనారు; అగుచున్నారు. మరి అక్కడి క్షేత్ర యాజ మాన్యము మొదటినుండి ప్రవిడులది. తమిళనాడునకు దక్షిణమున కన్యా కుమారియు ఉత్తరమున వేంగడమును ఎల్లలని వారి ప్రాచీన విభాగము, దివ్య ప్రబంధములలో అందరి కంటె ఎక్కువ ప్రకీపాదింపబడిన దైవము వేంకటేశ్వరుడే. కనుక రామకృష్ణుడు చెప్పినది సత్యము. కాని చేసినది కువాడమే.

ఈ కావ్యమునకు 'పొండరీక మాహాత్మ్యంబు' అని కవి పేరుపెట్టి నట్లు ముద్రిత ప్రస్తావనలోనున్నది. ప్రాతప్రతి క.లో 'పాండురంగ మాహాత్మ్యంబు' అనియే కలదు. (1-95) ఆశ్వాసాంత గద్యలం దెల్ల 'పాండురంగ మాహాత్మ్యము' అనియే కానవచ్చుచున్నది. వ్యవహార మందును ఆ పేరే నిలబడినది. కాని, వేదాద్రి రామకృష్ణుని అడిగినది 'పొండ రీక విభుచరిత' రచింపుమని (1-25). అసలు ఆ క్షేత్రదేవతకు పాండు రంగడను పేరు ఎట్లు వచ్చినదో రామకృష్ణుడు తెలుపలేదు. కాక 'పండ రంగి' అను వ్యావహారిక రూపమును గూడ ఇతడు వాడినట్లున్నది. (5-197).

ఈ యుపోద్ఘాతము అనుకొన్నంతకంటె విస్తరమైనది. ఇంకను పొడిగించుట తగదు. ఇందలి రామకృష్ణుని కవితావిశిష్టగుణములు ఇది వరకే పలువురు రసికులు వివరించివారు.

ఈ కూర్పున సిద్ధఖండములు బండితాలును శ్రద్ధతో గాక సామాన్య దృష్టి చేతనే సంతరింప బడినవి; రెంటి యందును పలుచోట్ల ప్రామాణిక మైన నిశ్చయము నా కేర్పడలేదు గనుక.

పొండరీక క్షేత్రమును సాక్షాత్తుగా దర్శించి యందలి విషయములను నిదానముగా విచారించి తెలుసుకోగలిగినపుడు దప్ప ఇందలి కొన్ని సందేహములు పోవు. 2-93వ పద్యమున 'వేణుముద్ర-రేణుముద్ర' అను రెండు పాఠములలో ఏది యుక్తమో నిర్ణయింపలేరు. ఇట్టి వింకను గొన్ని కలవు.

ఈ గ్రంథమును ఇంత త్వరగా కమనీయముగా ముద్రించిన

మద్రాసు 'ప్రీడమ్' ముద్రణాల వారికి నా ధన్యవాదములు. తొలిచిత్తులను శ్రద్ధతో దిద్దియిచ్చిన శ్రీ టి. వి. రంగాచార్యులగారికిని శ్రీ సి. మాధవ కృష్ణ కవిగారికిని చాలా కృతజ్ఞుడను. మా కనుచూపు తప్పిన కొన్ని సవరణల పట్టిక కడపట చేర్చినది చదువరులు గమనించి యనుగ్రహింతురు.

తిరుపతి
పరాభవ మార్గశీర్ష బహుళ పంచమి
భానువారము (1-1-1967).

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

శృంగార సంకీర్తనలు (సంపుటము 22)

అన్నమాచార్యులు

కడచిన పదిసంవత్సరాలుగా నిలబడియుండిన అన్నమాచార్య సంకీర్తనల ప్రకటనకార్యము ఈ సంపుటముతో పునరారంభమైనదని నాహృదయము ఆనందముతో పొంగి పొరలుచున్నది. అట్లే ఈ మహా శ్రీనివాస కైంకర్యమునకు వయోదోషముచేత నేను మరల చేయివేయలేని స్థితిలోనున్నానే అను నిర్వేదమున్నది. కాని యీ కార్యము సంపన్నముగా నిర్వహింపగల శక్తియుక్తిరక్తులు నిండిన నా అంతరంగ మిత్రులు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారే ఇందుకు నియమింపబడుట నాహృదయమున కెంతో నెమ్మది నిచ్చినది. వారిని ప్రత్యేకముగా ఈపనికి నియోగించిన తిరుపతి తిరుమల దేవస్థానముల నిర్వాహక సంఘాధ్యక్షులు శ్రీ చెలికాని ఆన్నారావుగారు, కార్యనిర్వాహణాధికారము వహించిన శ్రీ పి. ఎస్. రాజగోపాలరాజుగారును శ్రీ శ్రీనివాసుల పరమానుగ్రహపాత్రులు; సంగీతసాహితీ రసికులందరి ధన్యవాదములును హార్దాభినందనములును ముఖ్యముగా వారికి చెల్లవలసినవి; చెల్లగలవు.

నేను, శ్రీరామసుబ్బశర్మగారును కలసి పనిచేయుచుండగా ఈ సంపుటమునందలి చాలభాగము పరిశోధించి ముద్రణార్హముగా వ్రాయబడినది. అప్పుడే ఆపనికి అ చింతితముగా విఘ్నమేర్పడినది. ఆ చిక్కు

పరిష్కర్తలు: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, గౌరిపెద్ది రామసుబ్బశర్మ

ఆముఖము, 1974, డిసెంబరు, 16.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

దీర్చుకొని మరల నుప్రకమించుటకు ఇంతకాలము కావలసి వచ్చినది. దీనికి కారణములు అనేక విధములు, అనేకములు. వాని నిక్కడ తడవ నక్కరలేదు. ఆ యధికారమును నాకు లేదు.

కీ. శే. శ్రీ ప్రభాకరశాస్త్రిగారు మొదలు మావరకును జరిగిన యీ సంకీర్తన పరిశోధన కార్యములో మానవజ్ఞానమితికి సహజములైన లోపములు కొన్ని దొరలి యుండ గలవు. దోషజ్ఞులైన సహృదయులు వాటిని తెలిపి ప్రతిబోధింపగలరు. వారు మాకృతజ్ఞతను చూరగొనువారు. వట్టి పురోభాగిత్వముచే స్వచ్ఛందముగా ఖండనకు పూనుకొను వారి విషయమున ఈ ప్రకింది మా యాచార్య శ్రీపాదుల సూక్తిని స్మరించి యూరకుందుము.

"నిందతువా నందతువా మందమనీషో నిశమ్య కృతిమేతామ్
హర్షంవాఽమర్షంవా సర్షపమాత్రమసి నైవ విందేమ."

శ్రీ రామసుబ్బశర్మగారి యీ ప్రయత్నము సాంగముగా తుది దాకించునట్లు, అందుకు వలయు దీర్ఘాయురారోగ్యాది సమృద్ధిని శ్రీ శ్రీనివాసులనుగహింతురు గాక! అనన్య సామాన్య సౌందర్య సురభిళమైన తాళ్ళపాకవారి యీ భాగవత సాహిత్య సంపత్తి మనదేశమున సర్వంకషముగా ప్రసరించును గాక!

బెంగళూరు
16-12-74.

సుధీపాదపాంసువు
రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

o—o—o

తాళ్లపాక అన్నమయ్య పాటలు

తిరుమల తిరుపతి దేవస్థానాధికారులు ఈ తాళ్లపాక అన్నమయ్య పాటల సంగ్రహమును ప్రకటించుచున్నందుకు వారికి నా కృతజ్ఞతా పూర్వకమైన అభినందనలు సమర్పించుచున్నాను.

నేను స్వరపరచి ప్రకటించి యుండిన 108 పాటలలో 15 పాటలు యథాతథంగా సంగ్రహించి ఈ సంపుటములో చేర్చినారు. తోడుగా నేటి ఆంధ్ర గాయకాగ్రగణ్యులైన శ్రీ నేదునూరి కృష్ణమూర్తిగారి స్వరరచన గల 15 పాటలను కూర్చినారు. అవి చాలా మధురముగా నున్నవని ప్రత్యేకించి చెప్పబనిలేదు. మూర్తిగారి స్వభావము, సంస్కారము. భావనాశక్తియు ఆ పాటలలో చక్కగా ప్రతిఫలించినవి. శ్రీ కామిశెట్టి శ్రీనివాసులు శెట్టిగారు చేర్చిన టీకా తాత్పర్యములు వారి వ్యుత్పత్తికి, శ్రద్ధాభక్తులకు, రసికతకు సాక్షిగా ఈ సంపుటము పిలువ నలంకరించినవి. ముద్రణం శుద్ధంగా అందంగా తీరింది. శ్రీ శ్రీనివాసులును అన్నమాచార్యులను పై సహృదయ రసికుల నందరిని సర్వవిధ శుభసంపదలకు పాత్రులుగా అనుగ్రహించి ఆశీర్వదింతురు గాక.

బెంగళూరు
23-3-76

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ.

స్వరపరచినది: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, నేదునూరి కృష్ణమూర్తి;
భావవివరణ: కామిశెట్టి శ్రీనివాసులుశెట్టి.
అభినందనలు, 1976.
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

ఆధునిక కవిత్వం

120

మీరాబాయి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారిచే రచింపబడిన రాజస్థాన కథావళినుండి కథను గైకొని యీ చిన్న పొత్తము వ్రాసితి. రచనయైన పిదప నేను భక్తవిజయమను గ్రంథమును జూడఁ దటస్థించినది. అందలి మీరాబాయికి నీ మీరాబాయికిని సంబంధమేమియు లేదు. వేఱు విధముగఁగూడ నీ కథను గొందఱివలన వినియున్నాను. ఇం దేమీరాబాయి సత్యయో నిక్కముగఁ జెప్పఁజాలను గాని యింగ్లీషులోనున్న రాజస్థాన చరిత్రను దెనిగించిన వారగుటచే బ్ర. శ్రీ. చి. లక్ష్మీనరసింహముగారి మీరాబాయియే సత్యయని యించుక నమ్మిక నాకుఁగలదు. నాకన్న ముందే హిందూ సుందరీ పత్రికా సంపాదకురాలగు శ్రీమతి మొసలిగంటి రామాబాయమ్మగారీ కథనె పద్యకావ్యముగ వ్రాసిరి కాని నేను దానిఁ జూడలేదు. వారందఱును దీనిని మోదాంతముగనె రచియించియుందురు. పతిచే బహిష్కృతయై యేటఁబడఁబోవునప్పుడు శ్రీకృష్ణుడు మీరాబాయి నుద్ధరించుటయు, నాపై యోగినియై బృందావనమునఁ గాలము గడపె ననియునున్న చరిత్రాంశమంత నమ్మఁదగినది కాకుంట వలనను, రస భంజకముగావునను దానిఁ బాటింపక నేను దీని ఖేదాంతముగా వ్రాసితి. మనవారిలోననేకుల కీరీతి రుచింపదని యెఱుఁగుదు. ఇఁక దీని మోదాంతముగా రచింపవలయుననన్న మరల మీరాబాయికిని గుంభునకును గఁటు వేయవలయు. ఇదీ రసభంగమునకు హేతువగు. అట్లుగాకున్న మీరాబాయి బ్రతికి వేఱుగ జీవించెనని వ్రాయవలయును. ఇంతకన్న నామె దేహము

పీఠిక, 1913.

మానవ సేవా గ్రంథమాల 19, రాజమహేంద్రవరము.

విడనాడె ననుటయే సరోత్తమముగదా! మంచివారందఱికును మంచియే కలుగునా? ఇట్లును నేల జరిగియుండరాదు? ఇంతకు నిది కావ్యముగాని చరిత్రముగాదే? ఇందు నా మనసుననుండు మిరాబాయిననుసరించి కథను ప్రదిప్పవలెఁగాని కథననుసరించి మిరాబాయిని ప్రదిప్పట సాధ్యమా!

రసపుష్టికై కొన్ని మార్పులు చేసినది గాక తుదకు సంపూర్ణమగు కరుణరసము నిరర్గళముగ నిల్చినది గానఁ గొన్ని పాత్రముల చరిత్ర యూపై నుడువక విడువవలసి వచ్చినది. అట్లు ప్రాసి చదువరులకు విసుగు గల్గించుట పానకము ప్రాపునపుడు పుల్ల నడ్డమిడినట్లుగదా! ఇంతకును అసలునకే మోసము వచ్చినపుడు వడ్డిని గూర్చి దుఃఖింపనేల?

దీనిని బలుమాఱు విని యెన్నియో నూతన భావములు నాతో నిందుఁ జేర్పించి దీనికి వన్నెఁదెచ్చినవారును, సర్వవిధముల మత్కవితాలతకు నుత్సాహసేసికంబుసేసి పెంచువారును మన్మిత్రశిరోమణులునగు మ. రా. కట్టమంచి రామలింగారెడ్డి ఎం.ఏ గారికిని దీని వ్రాయుటకు మూలముంజూపిన ప్రబ.ప్రశ్నే. చి. లక్ష్మీనరసింహముగారికిని, దీనిని గృపతో దమ పత్రికయందు ముద్రింపనవకాశమొసఁగిన మానవ సేవా పత్రికా సంపాదకులకును, ఆజన్మము నేనెంత కృతజ్ఞుఁడుగ నుండిసను దీఱదు.

ఓపినకొలఁది శోధించియున్నాను. నాకన్న మీఱిన దొసంగు లిండే వైన ననున్న సహృదయాగ్రగణ్యులగు పండితులు కరుణించి నాకుందెలిపిన సాధ్యమైనంత సవరింతునని సవినయముగ విన్నవించెద. పీఠికా లేఖన పద్ధతి ననుసరించి ప్రపార్థించితిఁగాని యిందువలనం బ్రయోజనము గానను. ఎఱిగిన సుహృదయులు దోషములను మన్నింతురుగాని కవికిఁదెలియఁ జేయరు. ఇఁక నెఱుఁగని దుర్హృదయులు గుణములనే దోషములుగ గ్రహించి వషట్కారముల కుపక్రమింతురు. ఇఁక మాకుఁ గరుణించి తప్పులఁదెల్పువారెవరు?

ఇట్లు

సహృదయాధీనుఁడు

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

మైసూరు మహారాజుగారి కలాశాలలోఁ

దెలుఁగు పండితుఁడు.

క్రొక్కారు మెఱుగు
వెల్లాల ఉమామహేశ్వరుడు
పాళ్ళూరు సుబ్బణాచార్యుడు
మఠం వాసుదేవమూర్తి

అనంతపురపు 'కవికుమార సమితి'కి జేరిన కవితయము ఇదివఱకే 'తొలకరి చినుకులు' అను పేరి ఖండకావ్య సంపుటి మొకటి పేరువాసిన గన్నవారు. వారింతలోనే మఱిల నీ సంపుటమును గూర్చి ప్రచురింప గల్గుట శుభసూచకము, సంతోషదాయకము.

ఇది ఖండ కావ్యములే కాని మహాకావ్యము లవతరించుకాలము కాదని కొందఱు విమర్శకులందురు. మనుష్యజాతి కంతయు నీ న్యాయ మెంతవఱకన్వయించునో చెప్పగల విశ్వదృష్టి నాకు లేదు. ప్రకృతము మనదేశమున మాత్రము ఇది చాల వఱకు సత్యమనక తప్పదు. ఎందు కనగా మహత్త్వము అనుధర్మము తక్కిన జీవిత వ్యవహారములలో లేనిది కావ్యములందు మాత్ర మెట్లు పొడ సూపగలదు! ఇప్పటి మన ఆశలు, ఆస్తులు, ఉద్రేకములు, ఓర్పులు–అన్నియు సల్పములు. మనలో నిజముగా వేదాంతము ప్రతికియున్న కాలమున ఉపదేశింపబడిన అల్పతృప్తి యిప్పుడు సిద్ధించినది. సముద్రమునకు సేతువుగట్టు సాహసమునకు బూనువారి కాల మున 'శతకోటి ప్రవిస్తర' మగు కావ్యమును రచించు యోచన జనించుట వింతగాదు. అట్లే అరకప్పు కాఫీతో ఆకలి దీర్చు కొనువారి చేతిపనులు

పుస్తావన, 1934.
కవికుమార సమితి, రాయలసీమ.
శ్రీసాధన ముద్రాశాల, అనంతపురం.

చిన్నవిగా నుండుటయు నరుదుకాదు. కావ్యములెట్టివో కార్యములు నట్టివె యగును. ఈ మాట కావ్యపు ప్రయాణమునకు మాత్రమే గాక యందలి వస్తువు, పాత్రములు, సన్నివేశములు మొదలగు నన్నిటికిని అన్వయించును.

అనగా చిన్నకావ్యములు పరిత్యాజ్యమూని చెప్పరాలేదు. మహా కావ్యములు వ్రాయలేక పోయితిమే యని లజ్జపడవలసినదే కాని లఘుకావ్యములు వ్రాయుచున్నామని లజ్జపడవలసిన పనిలేదు. సృష్టిలో పిన్న పెద్దలు రెండును స్వతంత్రములు, అవశ్యకములు. గుణదోషములు రెండును రెంటను గలవు. గొప్పవస్తువునందలి గాంభీర్యము చిన్నవస్తువున కుండదు. చిన్నదానికి గల చెలువము గొప్పదానికి రాదు. పెద్దలకు మ్రొక్కులు పిల్లలకు ముద్దులు, వస్తువు పెద్దది యగునట్లెల్ల నయనాణ్యములు తగ్గును. చిన్నదియై నట్లెల్ల గౌరవ గాంభీర్యములు కృశించును. రెండు గుణములును ఒకచో జేరుట సృష్టిలోని యుద్దేశమే కాదేమో!

మన ప్రాచీను లీరెంటి తత్త్వము నెఱిగినవారు. కేవలము పరిమాణ ప్రియులై వారు మహాభారతము వంటి మహాకావ్యములను మాత్రమే ప్రోసియూరకుండలేదు. మేఘసందేశమువంటి మురిపెముల మూటలను ప్రోసిరి. ప్రాకృతములో సేతుబంధము వంటి గంభీర కావ్యములతో పాటు 'గాథ'లను రసఘుటికలను వేఱొలదిగా గాలికి విసరి, భరతఖండము వీధివీధులందును వెలయించిరి. శృంగారనైషధము నూఱిన శ్రీనాథుడే గేయకమలముల వంటి చాటుపద్యముల నెన్నింటినో వెదచల్లెను ఇట్లే 'చాటు కవితలు' మహాకవితల కెందును వెలలో తీసిపోనివి. మఱియు అనేక మహాకావ్యముల కంటె అనేక చాటువులలో రామణీయక మెక్కువ యనుటయు అనుభవవేద్యము.

ఖండకావ్యములు మహాకావ్యములకంటె సులభముగా రచింప వచ్చునని తలచుటయు పొరపాటు. కొన్ని విషయముల వానికన్న నివి కష్టములును. మహాకావ్యములందలి కథ, పాత్రములు మొదలగువాని మహత్త్వము మఱుగులో చిల్లర రచనాలోపము లెన్నియో తలదాచు

కొనును. చిన్న కావ్యములలో నట్లుగాదు. అన్నియు చిన్నవి గావున ఇందంగాంగ పరీక్ష యెక్కువ. కాబట్టి అత్యల్పలోపములను గూడ గమనించి, తొలగించుకొను శక్తి లేని కవి దీనికి జేయివేసినను నగుబాట్ల పాలగును. ఇదిగాక గొప్ప కావ్యములలో భావములకును, అభిప్రాయములకును తగినంత గొప్పతనమును, బలమును ఇట్టివి రూపుగొల్పుటకు వలసినంత పూర్వోత్తర సందర్భములను వివరించుట కవకాశమున్నది. ఖండకావ్యములలో అతి ముఖ్యమైన విషయములు దప్ప తక్కినవి విస్తరింప వీలులేదు. సంగ్రహము వీనికిని, విస్తరము వానికిని స్వాభావిక లక్షణము. పనికి మాలిన విస్తరము మహాకావ్యములలో నెంతదోషమో పని చెఱుచు సంగ్రహము ఖండకావ్యములలో నంతకన్న దోషమగును. కావ్యము కొలతను చగ్గించుటలో నందలి విషయపు తీవ్రతను గూడ తక్కువ పఱచు నపాయము గలదు.

ఈ తీవ్రతయే సాధింప గష్టమైనది. మనసులో లేని తీవ్రత మాటలలో రాదను విషయము ఖండకావ్య కవులనేకులు గమనింపవలసియు గమనింపనిది. ముఖ్యముగా ఖండకావ్యము ప్రవృత్తినిమిత్తము; కవికి గలిగిన హార్దభావములను తలపులను జిఱ్ఱింపు నుద్దేశము. కాబట్టి కవికి నిజముగా లేనిభావములు కవితలోనికి రాజాలవు. ఒకవేళ నేదో కారణాంతరమున కొన్నిభావములు కలిగినను, అప్పటికవి తీవ్రముగా తోచినను, ఆ కారణము తొలగిన వెంటనే యవి నశించును. కాన వానికి నిజమైన తీవ్రత యుండమిచే నవియు కవితలోనికి రాదగవు. గాంధీ మహాత్ముడు ఖద్దరు ప్రచారము చేయుచుండినప్పుడు రాటము నందతనికి గల యభిమాన భక్తులలో గొంత మన హృదయమును ప్రజ్వరిల్ల చేసినది. అప్పుడు వందలకొలది కవులు రాటములపై గావ్యములను రచించిరి కాని యిప్పుడేమైనది? రాటము లట్టువ కెక్కినవి. ఇంతలో నతడు హరిజన సేవకు వెడలినాడు. వెంటనే హిందువులు మాలమాదిగలకు జేసిన యన్యాయముల నేకరువు పెట్టుచు కవితలు పత్రికలనింపుటకు మొదలిడినవి. పై రాటపు భక్తియు, హరిజనప్రేమయు మనకు సహజము గాక తాత్కాలికముగా ఆరోపితములైనవి. కావుననే వానియెడ తీవ్రత లేదు, వాని నాశయించిన పద్యములలో కవిత యు లేదు.

ఈ విషయమున కీసంపుటము నుండియే యుదాహరణ మొకటి యీవచ్చును.

ఉ.మ. గారి 'ఆంధ్రవీరుడా!' అను కావ్యము చూడుడు. ప్రచలిత మైన ఆంధ్రోద్యమమునకు ఫలముగా ఆంధ్రులను ప్రోత్సాహపరుప వలె నని అందరివలె కవిగారికిని నుద్రేకము గలిగినది. కాని యెంత నిజమైనను ఆకస్మికముగా పైబాటిన తెఱవఁటిది గావున ఈ భావము తీవ్రముగాదు. విమర్శసహముగాదు గావున స్థిరమును గాదు. లేపవలసిన వాడిప్పుడు మనదేశమున ఆంధ్రు డొక్కడేనా? అఱవలు, కన్నడులు మొదలుగా అందఱును, కూర్చుండియో, నిద్రించుచునోయున్న వారి నడుమ వీడొక్కడు మాత్రము లేచి, గంతులు వేసిన నిప్పటి భరతఖండ ముద్ధారమగునా? ఆ వీరుల కన్న నీవీరు డెందులో ఎక్కువ? ఏమిట దక్కువ? ప్రాత కాలపు పల్నాటి వీరులవలె కత్తిసి దీసి, దూసి లెమ్మని కవి పురికొల్పును. ఏల? ఎవఁటిని నఱకుటకు? పాశ్చాత్యులనా? లేక ఆంధ్రులు కాని వారి నందఱినా? అవియు గాక ఆంధ్రులలోనే 'వీరు' లు కాని వారందఱినా? కత్తినెత్తుట యనగా నిజముగా నట్లేయని యర్థము కాదు. కార్యశూరత్వము నకు ప్రేరేచు అతిశయోక్తి మాట-అనియందురేమో! నేనును అదే చెప్ప వచ్చినది. అసలు తక్కువైనప్పుడే అతిశయోక్తి మార్గము.

ఇక వీరిదే 'రక్షకుని ప్రాపు' అను ఖండకావ్యము జదువుడు. హిందువుల యన్యాయములకు రోసి అంటరాని వాడొక్కడు క్రీస్తుమతము గొలువబోవుట దీని విషయము. పై పద్యములకన్న వీనిలో బిగువు బీరము లెక్కువగా నుండుటకు హేతువు-ఇందలి భావమందలి ఖాపము కన్న సహజమై తీవ్రమై యుండుటయే. ఈ సంపుటిలోని 'వారు' అను కడపటి ఖండమంత కంఠె వర్చస్సు గలది. అంటరానివారి కష్టములకన్న సామాన్యముగా ఆకలిగొన్న యనాథభిక్షుకుల యేడ్పులు మనల నెక్కువ లోబఱచుకొనును. కావున పద్యములును పదనెక్కును.

వీనినెల్ల మించినది 'ఐక్యము' అనబడు వీరి ఖండము. ఆంధ్రుల మీది యభిమానమున కన్న, అస్పృశ్యుల మీది కనికరము కన్న, ఆకొన్న యనాథులు రేపు తిరుగబడి మన యుదాసీనమునకు ప్రాయశ్చిత్తము చేయక

మానరు అను భయము కన్న ప్రణయిని యందలి తారుణ్యానురాగము నైసర్గికమై బీకము గలది. "ఎంత బిగి గౌగలించిన నీవిభేద మంతరింపక యున్నదే" యనుట ప్రణయవేగము ననుభవించిన, .ప్రాయపువారెల్ల పడిన పడుచున్న, పడగల వేదన. భావతీవ్రతకు దగిన సులభశయ్య, దానికి తగిన సంగ్రహము, అందుకు దగిన వస్త్రైక్యము గలిగి యీ ఖండమింత తేజస్వీగా నుండుటకు నైకారణము దప్పవేఱుకాదు.

ఈ గ్రంథమందు పొడసూపిన ముగ్గురు కవులలో 'మూర్తి' గారి కవనమందు బుద్ధిబల మెక్కువగా గానవచ్చును. వీరియందు భావము రచనకు సాధనము. చెప్పవలసిన మాట నేదో యొక క్రొత్తతీరున చెప్పు వేడుక వీరికి గలదు. గంభీరములైన యోచనలు, అపూర్వములగు పోకడలు, నిరర్గళమగు నుత్సాహమును వీరి రచనకు వ్యక్తి నిచ్చును. దీనికి తోడు తీవ్రమగు తత్త్వదృష్టియు గలదు. " పాఁపల స్నేహగ్రంథ మెన్నటి వఱకుండు నంతకు వినఁబడుసస్వర వీక లేఁపుల్" అనియును, "నిర్భరప్రేమ గలట్టి వాఁకిన్ నిరతము మంటగాక మది నెమ్మదియేడ?" అనియును చెప్పగల కవిదృష్టి సామాన్యమైనది గాదు. "ప్రశాంతమూర్తి", "పరమాత్మ మనుజుండు భాషించుభాష" మొదలగు వానిలో వీరి భావ బుద్ధుల తీవ్రత గానవచ్చును. 'తల్లి-బిడ్డ'యను ఖండదురంత కావ్య ములో మాతృస్నేహము, మాతృ దుఃఖమును హృదయ ద్రావకముగా వర్ణిత మైనది కాని సామాన్యముగా బుద్ధికి భావములను తెగదినుశక్తి గలదు. కవిత్వము నందు అస్పష్టతను దెచ్చిపెట్టు దోషమును గలదు. వీరి 'అర్చన', 'స్వయంకృతాపరాధము' అనువానిలో ఈ పరిణామమును చూడవచ్చును. వీనియందలి కేంద్రభావము నా కవగతము కాలేదు. భావమున కన్న బుద్ధికి ప్రాబల్యమెక్కువగానున్నది కావుననే 'గాడిద గారు' ఆను వీరి వేళాకోళపు గావ్యములో రసభావములకు దగిన ధారాళ శైలి గాని తలపుల సామరస్యము గాని కుదరలేదు.

ఉ.మ. గారి కవనమందు భావబల మెక్కువ. అభిమానము, ప్రేమ, వాత్సల్యము, కనికరము, వేసట మొదలగు భావముల తీవ్రరూపములు వీరి రచనల ప్రతిబింబించును. వీరి హృదయతంత్రికి జీవాళి చాల

సుకుమారమైనది. ముట్టిన ప్రయోగును. దానికి దగినట్లు రచనయు, డొంక తిరుగుళ్ళు లేక ధారాళముగా వ్యవహించును. 'మారుక్కు' 'బిడ్డనేల కొట్టితివి' ఇత్యాది ఖండములలో పై గుణములు పరిమళములుగా నున్నవి. కాని భావములుద్రేకముగా మాటినప్పుడు కవిత్వ రచనకు వలసిన వివేకమును నెమ్మదిని మందగింపజేయును. ఉద్రేకము కార్యకారి యగునేమో కాని కావ్యకారి కానేరదు. వారి కావ్యములందు పలుచోట్ల యుద్రేకపు మహత్తు కానవచ్చును. 'వృద్ధాశ్రువులు' అను దానిని జూడుడు. ఇది రెండు భాగములుగా నేల జేయబడినదో పూర్వోత్తరభాగములకు సంబంధమేమో తెలియ రాదు. దీనియందు కవి ప్రపంచమున మనుజుల దౌర్జన్యమును జూడలేను, గంగలో దూకెదననుచున్నారు! ఇంత యక్కసు వచ్చినప్పుడు వారు నిజముగా గంగలో దూకకపోవుట మన యదృష్టమే. అది పల్చబడిన వెంటనే ప్రపంచమంతయు రాక్షసమయమే కాదు. అందు దివ్యగుణములును గలవనుట వారును అనుభవించి యుందురు. అంతకు ముందే కవిత్వమునకు దూకుట మాత్రము మన యదృష్టమని మాత్రము చెప్పలేరు. ఇది కళ నిదానముగాదిద్ది తీర్చవలసినది. ఉద్రేకమును పొందగల్గిన భావింపగల్గిన హృదయము దానికి సాధనము గాని యుద్రేకమే కాదు. నటునికి నిజముగా భావావేశమే కల్గినచో అభినయ మెట్లు చెడునో కవి కవనమును అట్లే. ఈ యుద్రేకపు దోషమును కవి గారెఱుగక పోలేదు "ఎప్పుడేన్ మతినొక యింత శాంతమును మందునకైనను నీక నమ్మనఁ, క్షతిశిఖచే దహించెదవే శంకర" యని వారు వేదనపడుచున్నారు. భగవదుపాసనకువలె కలో పాసనమునకును శాంతిసాధనము. ఇంతే కాక ఆరెఁటి వరఫలమును శాంతియే. "కళలు పరిశ్రమంబుననె లభ్యములే, పరమాత్మ వాని లోపల దన్ను దెల్పుగాన, తగ వానిని గొల్చి కొలందులన మనుష్యులు ఋషివర్యు లౌదురు" అను 'మూర్తి' గారియందలి వాక్యము చాల మేల్మియైనది. ఋషులు 'ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః' అని తమ పురుషార్థ పరమావధిని నిర్ణయించినవారు. కావున నిర్మల కవితాకళ నుపాసన చేయుచుండి ఉమామహేశ్వరరావు గారి కాఫలము తప్పక లభించును. కళకును వన్నె హెచ్చును.

మూడకవియగు 'ఆచార్య' చారి. రచన పైరెండు విధములను

మూడవ కవియగు 'ఆచార్య' గారి రచన పైరెండు విధములను నడువ ప్రయత్నించుచు నడుమంత్రపు దారిలో నున్నది. 'నిర్వేదము' 'సంగరావని మాట' మొదలగునవి తీవ్రభావ మూలములు. 'వియోగ విద్యార్థి' 'గీతము' మున్నగు వానియందు తీవ్రములై సూక్ష్మములగు యోజనలు గలవు. కాని పైరెండు సాధనములను వారింకను నూతీపదను చేయవలసియున్నది. 'వియోగజ్ఞానవిద్యార్థి' 'ప్రణయ ప్రణవపు జ్ఞానంబు' ఇత్యాది విచిత్ర శబ్దములచేతగాని 'స్థామము స్థావిరమయ్యె' నని రచించి దానికి 'శరీరబలము తగ్గెను' అని బలవంతపు టీక వ్రాయుటచేగాని కవిత్వమునకు నిజముగా గలుగు నుపకారము నాకు దోపదు. స్పష్టత యనునది కవిత్వమునకు జీవధర్మ మనుట ఆధునిక భావకవు లనేకులు మఱచిన విషయము. శ్రీ రాయప్రోలు సుబ్బారావు మొదలగు కవివరుల ననుకరించు దౌర్బల్యమును మాని స్వతంత్రముగా వీరు రచింపదొరకొనిరేని "జీవకళ బోసి నూతన భావ మొసగి గర్వమున బెంతు రాంధ్ర నిక్కాలకవులు. కాలగర్భాని పేర్లేక కలయు టొకటి మిగిలి నా పాల బడెనేమొ విధివశాన" యని నిర్వేద పడవలసిన యక్కర ఆచార్య' గారి కుండదని నా నమ్మకము.

సౌఖ్యత, జిహ్వామాలిక, సర్వాంతర్యామి-మొదలగు పద ప్రయోగ ములును 'మా, మన' శబ్దములకు భేదము గణింపకుండుట మున్నగు తెలుగు కొదవలును. ఇక ముందటి గ్రంథములలో రానీయక జాగ్రత్తపడుట యుక్తమని యీ కవివరులకు నా మనవి.

ఈ ప్రస్తావన నింత స్వతంత్రముగా నిస్సంకోచముగా నేను వ్రాయుటకు పైకవులు దయయుంచి యిచ్చిన యనుజ్ఞయే చేయూత. 'శాస్త్ర'పు పీఠిక లక్కర లేదని వారనిరి. కాబట్టి యీ పురాణమును వ్రాసితిని. వారి యీ యుదార బుద్ధికి కృతజ్ఞుడను. సాహిత్యజీవితమున నిప్పుడే యింతటి ధీరత్వము నలవఱుచు కొన్న పీరి నుండి ముందింకను మహోన్నత కావ్యములు బైలుదేరునని యెదురు చూచుచున్నాను.

మైసూరు
శ్రీముఖ పుష్య
కృష్ణచతుర్థి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

రాణా ప్రతాప సింహ చరిత్ర

దుర్భాక రాజశేఖర శతావధాని

తమ రచన చాల గొప్పది. ఒకానొక కాలమున నేనును ప్రతాపరాణా చరిత్రమును పద్య కావ్యముగా వ్రాయనుత్సాహపడి యుపక్రమించి యుండినవాడను. సుమారు 300 పద్యములు వ్రాసి నడుమంత్రమున వదలితిని. వ్రాతప్రగంథము గూడ నాయొద్ద క నశించినది. తమ గ్రంథము జదువ మొదలిడగానే నా ప్రయత్నము నిరవశేషముగా నశించుట యెంతోమే యాయె ననిపించినది. ఇంత గొప్ప ప్రగంథమును ఒకే ధారతో అందదుకులు, తొదుకులు లేక రచించి ముగింపగలిగిన తమ శక్తిసామర్థ్యముల కాశ్చర్యపడి యభినందించుచున్నాను. తమది ప్రబంధ ముల పక్వతతో గూడిన పురాణశయ్య. ఈ శైలిలో నిశ్చయముగా పురాణమునే వ్రాసియుండిన నెట్లుండెడిదో యనియూహపడుచున్నాను. ఈ స్థితిలో నీ కావ్యము నింత రసవంతముగా పఠనీయముగా జేయుశక్తులు చాలమందికి లేవనుట నిస్సందేహమైన విషయము. ఎక్కువ విన్నవింప లేను. యథావకాశముగా ప్రగంథమును బూర్తిగా బఠింతును.

మైసూరు
30-8-34

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

అభినందనము, 1934
జానకీ ముద్రాక్షరశాల, ప్రొద్దుటూరు.

శ్రీ చౌడేశ్వరీ మాహాత్మ్యము

గుమ్మరాజు రామకవి

ఈ మృదుమధుర కావ్యమును కవిగారు ప్రాతలోనున్నప్పుడే నాకై వెదుకుకొనివచ్చి వినిపించి నన్ను నిర్హేతుక ప్రణయ గౌరవములందు ముంచియుండిరి. ఆ బరువు చాలదని యిప్పుడు దీనికి ప్రస్తావన ప్రాయుమన్నారు. వారి ప్రణయమునునమ్మి ప్రస్తావన ప్రాయు నగత్య ములేదని చెప్పి తప్పించుకొను నధికారము నాకుండెను గాని అట్లు చేయుట యధర్మమని, ఈ కవికావ్యములను యథాశక్తి ప్రచురపఱుచుట విధియని, మనసార నమ్మి ప్రాయుచున్నాను.

ఎందుకనగా:- శ్రీ గుమ్మరాజు రామకవిగారిని ఎఱిగిన యాంధ్రులు చాలమంది లేరు. భావకవిత్వము, చిన్నకథలు, నవలలు, నాటకములు, విమర్శనలు, వ్యాసములు, మొదలగు ఆధునికసాహిత్య వ్యాపారములలో దేనికిని వీరు చేయి వేసినవారు కారు. అట్లుండినచో ఏ పత్రికల మూలమున నైన వీరికీర్తి బైలుపడుచుండెను. వీరు రచించినవి ఆపద్బాంధవశతకము, తరువాత నీగ్రంథము–రెండే. ఇట్లగుటకు ప్రజాసేవాసక్తిచే విరామములేమి కారణమని పీఠికలో వీరే చెప్పుకొన్నారు. శతకములనింకను మనము చదువునేర్చినవారు చదువవలసిన పుస్తకముల గుంపులో చేర్చుకొనలేదు! ఇంక నీగ్రంథమిప్పుడుగదా వెలువడనున్నది.

మఱియు వీరి 'గవనిపల్లి' కోలారుజిల్లాలో నున్నదిగాని కృష్ణా గోదావరిజిల్లాలలో లేదు; సరిగదా 'రాయలసీమ'లో నైనను తలదూర్చు కొను భాగ్యము దానికి లేదు! వీరిది 'రాగులసీమ'. పూర్వాంధ్రులకుగాని,

---

ప్రస్తావన, 1935.
మదన పల్లె.

పశ్చిమాంధ్రులకుగాని యీప్రపక్క దృష్టి యింకను పాఱినట్లు లేదు. మైసూరిరాజ్యము పూర్తిగా కన్నడసీమయను భ్రాంతి బైటి వారికున్నది. లోపలి వారికి కన్నడసీమ కావలయునను పేరాస యున్నది. వారి యుదాసీనము వీరి పట్టుదల రెండును జేరి ఈ రాజ్యమందలి యించుమించు పదునొకండు లక్షల తెలుగువారి తెలుగుతనము నానాటికి-గడియ గడియకు-మాపుచున్నది. ఇట్లుండగా నక్కడికవులు కావ్యములు వెలికి వచ్చుటయెట్లు? ఇట్టి యిరుకులోగూడ మామిత్రులు ఇంతటి సరసప్రబంధము రచించి ప్రకటించు నుత్సాహమునకు గారణము నాటినుండి నేటివఱకు నందవరీకనియోగులనాడులలో వ్యాపించి నాటుకొన్న ఆంధ్రకవితాశక్తియేకాని ఆంధ్రులు కల్పించిన యవకాశములును అనుకూలములును గావు.

ఈయన నియోగికవి మాత్రమే కాదు కవియోగి కూడ. కావ్యరచనచే వీరికి కావలసిన దేమియులేదు. ద్రవ్యమునకు కొదవ లేని భూస్వామి. కీర్తిప్రతిష్ఠలపై నాశలేని సహజవినీతిభూషణుడు.

"కవివరులెల్ల మెత్తురను కౌతుక మొందియుగాదు, ధాత్రిలో
గవినని విఱ్ఱవీగగల గర్వమొకింతయు లేదు; జ్ఞానకీ
ధవు కృపచేత నేర్చిన విధంబునఁ జెప్పెద నాంధ్రభాషకున్
భవిమల సేవసేయగల భాగ్యమునొందు కుతూహలంబుతోన్"

అను వీరి వాక్యమునం దతివినయమేమాత్రమును లేదని యెఱిగి చెప్పగలను. స్వదేశమున నెక్కువ గౌరవము, పలుకుబడి, చనువును పారంపర్యముగాను స్వతంత్రముగాను సంపాదించుకొన్నవారు. మైసూరు ప్రజాప్రతినిధిసభ మున్నగువానిలో నెన్నికగల సభ్యుడుగానుండి హార్దమైన దేశప్రజాభిమానములతో పెక్కేండ్లు పనిచేసిన-చేయుచున్న నయశాలి. ఇట్టివారికింత చక్కని ధారాళశైలిలో, అచ్చమగు ప్రౌఢ తెలుగు పోకడలతో ఇంత గొప్పకావ్యమును రచించు నేర్పును ఓర్పును ఈ కాలమందలవడియుండుట, మైసూరురాజ్య మందలి యాంధ్రభాగమందు ఆంధ్రసాహిత్యమెంత సర్వజనీనముగా నుండెనో-ఎట్టి పరాయణముగలదిగా నుండెనో-స్పష్టముగా చాటుచున్నది. ఇంతటి యున్నతస్థితికి వచ్చియుండిన [illegible]ను కావ్యరచనానైపుణ్యమును దిక్కువిచా
యొత్తిడిచే సమసి యింతరించుమండగా

చూచి చూడక యూరకుండుట ఆంధ్రులకు న్యాయమా యని ప్రశ్నించుటయే నా యిప్పటి పని.

మైసూరుదేశమందలి తెలుగువారు కన్నడమును నేర్చుచున్నారని నాకు దుఃఖములేదు, మఱీ సంతోషమే. సాహిత్యాభిరుచి కలవారికి ఒకభాష ఒకవాఙ్మయము ఎప్పుడును చాలదు. తెలుగు వారికి కన్నడభాషనుండి సాహిత్యమునుండి నేర్వవలసిన విషయము లెన్నోకలవు. కన్నడమహా కవులు ఇతర మహాకవుల కెందును తీసిపోరు. కాని తరతరములుగా వచ్చిన స్వభాషను సాహిత్యమును వదలి యితర భాషాసాహిత్యములను నేర్చి వ్యవహరింపఁ బూనుటలో తమకు నష్టము; ఇతరులకు లాభము లేదు. కోలారు మొదలగుచోట్ల తెలుగు వారిగతి నేఁడిట్టిదైనది. రామకవిగారి కుమారులకు మనుమలకు ఇంటిభాష-ఇరుగుపొరుగుభాష-తెలుగైనను వారివాత చదువులు తెలుగు కాని దుస్థితి కలదు. తండ్రిగారి యీమధుర కావ్యమును చదువుకొని సంతోషించుభాగ్యము వారికిఁ గలదా యను సందేహము నాకున్నది! మైసూరుదేశమందు అందందు చెదరియున్న కొందఱు తెలుగువారిమాట పోనిచ్చినను శుద్ధాంధ్రమైన భూభాగమందలి లక్షల కొలఁది యాంధ్రుల యవస్థ నేఁడిట్లేయున్నది. తలిదండ్రులింకను తెలుగు పద్యములు చెప్పుకొనుచు తెలుగులో జోఁబులు మొదలగునవి వ్రాయుచుండఁగా, కొడుకులును బిడ్డలును వచ్చీరాని కన్నడమున వ్యవహారము చేయుచున్నారు. అనేకస్థలములందు తండ్రులు తెలుఁగక్షరములతో కన్నడభాషలో కుమారులకు యోగక్షేమవార్తలను వ్రాయవలసిన స్థితికి వచ్చినారు! దీనికి ప్రతీకారమే లేదా?

బలవంతముగా తెలుఁగునేర్చి అందు వ్యవహరింపవలసియున్న బళ్ళారి మొదలగు సీమల కర్ణాటకులగతియు నిట్టిదేకదా యని కొందఱు గుదురు. సందేహమేమి? ఇట్టిస్థితి యెవరికి వచ్చినను శోచనీయమే. ఇతరులను వారివారి భాషను విడిపించి తమ భాషను బలవంతముగా నేర్పు వారెవరైనను నింద్యులే. మన భాష సాహిత్యము ఇతరులకు నేర్పవలయు ననుఁ నభిమానము శ్లాఘనీయము కాకపోలేదు; ప్రపంచమందలివారెల్ల తెలుఁగు నేర్చి తిక్కన మొదలగు వారి వాగమృతము చవిచూడవలయుననుఁ

పేరాస నాకున్నది! కాని యట్టియభిమానము ఇతరుల స్వరూపనాశమునకు హేతువు కారాదనుట మఱువరాని న్యాయము. ఇప్పటి స్వదేశస్వభాషాభిమానములనంటిన పెద్ద విషమది. ప్రపంచమంతయు తెలుఁగు వారికి తెలుఁగై కన్నడులకు కన్నడమై పోవలయును! ఈ భాషల దాడిలో మాతన్యాన్యాయము ప్రబలి అధికారము అవకాశము గలవారెల్ల సుఁగీవాజ్ఞ చెలాయించుచున్నారు. లేనివారు తలవంచుకొని తగ్గి నడచుచు అడుగంటుచున్నారు. హైదరాబాదు, పర్లాకిమిడి మొదలగు చోట్ల ఉర్దూ, ఒడ్డె మొదలగు భాషలు సంఖ్యాబలములో నెంచుకును పనికిరాకున్నను అధికార బలముండుటచే వాని యొత్తిడిచే తెలుఁగు ఎంత నలినూకలగుచున్నదో అందఱెఱుఁగుదురు. మహారాష్ట్రులు తెలుఁగులు మొదలగువారి కధికారము కలచోట్ల కన్నడ భాషాసాహిత్యముల గతియు నిట్లేయున్నది. దీనికి ప్రజల స్వభాషాభిమానము మూలమనుటకంటె పరభాషావమానము మూలమనుట యుక్తతరము. ఇతరుల స్వాతంత్ర్యమును జూచి యోర్వరాని వారిని పనికిమాలిన దాసులనుజేయఁ బ్రయత్నించు దుర్గుణములలో నిది యొక్కటి. ఈవల ఇది దినేదినే ప్రబలించుచున్నది. పూర్వకాలమున బహుభాషాపాండిత్యమునకై యవకాశముగల చదువరులందఱును ప్రయత్నించుచుండిరి గాని పరభాషానాశనముచేత తృప్తిపొందఁ బ్రయత్నించిన వారెవరును గానరారు. వందలకొలఁది భాషలుగల భరతఖండములో ఇట్టి యన్యభాషాద్వేషమును పెరుగనిచ్చినచో, చిత్తసంస్కారమునకుఁ గలుగు నష్టమట్లుండఁగా, అసలు భారతీయుల సంఘీభావమునకే మూలచ్ఛేదము గలిగి యనర్థముగా పరిణమించును. ఇన్నాళ్లును భరతఖండమువారి యైకమత్యములేమికి భాషాభేదమొక కారణముగా నుండలేదు. ఇప్పుడు తక్కినవానికి తోడు అదియొక ప్రబలకారణమగు సూచనలున్నవి. దానిని విఱుచుటకు దేశాభిమానులందఱును ప్రయత్నింపవలయును.

ఈ కావ్యమునుగూర్చి నే నెక్కువ ప్రాయవలసినదేమియు లేదు. కథ, రచన, శయ్య—అన్నియు ప్రాచీనపద్ధతికిఁ జేరినవి. అందును—సంప్రదాయము ప్రకారము తెలుఁగు మహాకవులందఱు ప్రొక్కులు చెల్లించియున్నను—కవిగారికి, ఆంధ్రకవితన్నములగు తిక్కన, పెద్దన, పింగళి

సూరన్న మొదలగువారి కవిత పై నభిమానము మెండనుటకు కావ్యమంతయు సాక్ష్యమిచ్చుచున్నది. మాధుర్యప్రసాదములు వీరి కవితలోని సహజ గుణములు. కల్పనలు సుకుమారములు. లేనిభావములకు రాని శయ్యలకు ప్రయత్నించుట ఈ కవిగారెఱుఁగని విద్య. ఎందును మితిమీఱుట వీరి రచనకంటని కావ్యదోషము. పండితపామరులిరువురకును — తెలుఁగువా రైనఁ జాలును — ఈకావ్యము హృదయహారియగు ననుటలో సందేహము లేదు.

ఆంధ్రదేశభాషాభిమానులు ఇట్టి కావ్యమును కోలారుజిల్లాయందలి అచ్చతెలుఁగు జీవితవృక్షమునకు కడపటి ఫలముగానుండ నంగీకరింతురా? లేక యింకను ఇట్టివనేకములు పండ్లునట్లు ఆ ప్రమానిని శాఖోపశాఖలుగా పెరుగఁ బ్రోది చేయుదురా? చూడవలెను.

మైసూరు,
యువ భాద్రపద శుక్ల
తృతీయ.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ,
తెలుఁగు పండితులు,
మహారాజా కాలేజి.

యాత్రికుడు

భాస్కరాచార్య రామచంద్రస్వామి.

పుట్టలివి వట్టి వనితాఁక
బోతిగాని
ఫణమణీ రశ్మి యొకఁడు క
న్నాపఁ బొడిచె
వెలికి రాఁబోక తమ వెలుం
గులకె తనిసి
ఎన్ని యేవున్నచో లోన
నెవరి కెరుక !

నాన బాలైన జిమిలియై
ననుఁ రవంత
లేదు నాచేత నెట్లు చె
ల్లింతు నోము
కాని యంజలికన్న మే
లైన నోము
లేవి ? కేలుండగా వాని
కేమి కొదవ !

తొలినోము, ఫిబవరి, 1942.

శివభారతము

గడియారము వేంకట శేషశాస్త్రి

మనకు మహాకావ్యములు రచించు కాలము గడచినదని యొకచో తొందఱపడి వ్రాసితిని† ఆతప్పునకు ప్రాయశ్చిత్తముగ ఈ 'శివభారతము'నకిప్పుడుపోద్ఘాతముగా రెండు మాటలు వ్రాయుచున్నాను. దీని యుద్దేశమును ఫలమును అదే, ఈ వాక్యమున నా యధికారమును అంతే.

ఈ గ్రంథకర్తగాది పరిచయముగాని, దర్శనముగాని నాకీ వఱకును లభించిన భాగ్యములేదు. వారు అహేతుక పక్షపాతముతో నాకు తమ గ్రంథమును బంపి తొలిపలుకులు వ్రాయుమని నియమించినదే మాయిద్దఱి పరిచయమున కంకురార్పణము. ఆధునికాంధ్ర కవి మండలములో వారి పేరు గూడ నేను చదివిన జ్ఞప్తికిలేదు. మఱి వారింకేమైన గ్రంథములు రచించినారేమో యెఱుఁగను. తెలుగు దేశములో కవిత లేనిది అవధానము లేదు గనుక, వీరికిదివఱకే లభించిన 'కవిసింహ' బిరుదము 'అవధాని పంచానన' బిరుదమునకే పర్యవసానమేమో యనికూడ నాకు సందేహము గలిగినది–అనఁగా ఈ గ్రంథమును చదువక మునుపు. దీనికి నా జ్ఞాన సంకోచము కారణమేమో లేక వారి కవిత యొక్క గజగర్భ పద్ధతి కారణమో చెప్పలేను.

ఎట్లును ఆధునికాంధ్ర సాహిత్యమందు నాకుఁగల యల్పానుభవములో మహాకావ్యమును పేరున కింత తగిన గ్రంథమును నేఁజూడ లేదు. దీని

ఉపోద్ఘాతము, 1943.

గ్రంథకర్త.

† 'గ్రొక్కాఱు మెఱుగులు' అను అనంతపురపు కవికుమార సమితి వారి పద్య సంహితకు పీఠిక.

రాశియు పెద్దది, సుమారు 2500 పద్యములు. గుణము అంతకన్నగొప్పది.

విషయము శుష్కమగు చరిత్రము. శుష్కమనగా కథకు పనికివచ్చు ముఖ్య సందర్భములు కొన్ని మన మెఱుగుచుముగాని కావ్యమునకు పనికి వచ్చు వ్యక్తుల విశిష్ట ధర్మములుగాని, మఱినిత్య నైమిత్తిక జీవితములో మేళవించిన అసంఖ్య పరికరములు గాని, మన ప్రాచీన మహాపురుషులను గూర్చి మన మెఱుఁగము. ఇప్పటి మన చరిత్ర జ్ఞానము వట్టి కొండ గుర్తులగుంపు. రావణుని జంపిన రాముఁడు, ఆదిల్‌ఖానుని జంపిన కృష్ణ దేవరాయుడు, అఫ్‌జుల్‌ఖానుని పులిగొళ్ళతో ఱొక్కచీల్చిన శివాజి. వీరికి పరస్పర వ్యక్తి భేదమును గల్పించుకొనుట చాలకష్టము. దుష్టశిక్షణము, శిష్టరక్షణము, ధర్మ నీతిమతముల నుద్ధరించుట, అసిధారావ్రతముగా సత్యము. సౌశీల్యము, ఔదార్యము, శౌర్యము, మొదలకు మహాతత్త్వ ములను పాలించి యాచరించుట, దానికై మితిలేని కష్టపరంపరలకు గుఱి యగుట-ఇత్యాది ప్రధాన స్థూలభావములతోనే మన చరిత్ర మహాపురుషుల వ్యక్తి సత్యాపసము మన మిప్పుడు చేసికోవలసియున్నది. కాని యింత మాత్రపు మూలద్రవ్యముతోనే మహాకావ్యము రచింపవచ్చునను తత్త్వ మును ఈ శివభారతము వెల్లడించినది.

అసాధారణమగు తమ శీలసిద్ధులచే కావ్యరచనోత్సాహమును గల్గించు మహాపురుషులు మన హిందూదేశ చరిత్రలో పలువురున్నారు. అ యుద్యోగమును లోగి యెందఱో ఖండాఖండ కావ్యములను రచించినారు గూడ. కాని ప్రాయికముగ వారి కావ్యమందలి వ్యక్తులకు జీవకళ మందము. వ్యక్తులు కథా సూత్రములను నడుపుదురుగాని, యందలి ప్రజకు తాము ప్రబదికినట్లుగాఁ దోఁపరు. మఱియు ఇట్టి రచనలలో గ్రంథ కర్తలకు కథానాయకులందు భక్తిగౌరవములు వారి శత్రువులయెడ ద్వేషా సూయలును కృతినిర్మాణమునకు మూలసాధనములుగా నుండును. పై భావము లెంత న్యాయ్యములైనను వాని యుద్యోగమును చాలవఱకు హద్దులోనుంచని యెడల, అవి కవికి కావ్యనిర్మాణమున ముఖ్యముగా వలసిన ప్రశాంత చిత్తమునకు, దాని ఫలమగు ప్రతిభా వికాసమునకును అడ్డుగా పడిణమించి పనిచెఱుచును. "నానృషిః కురుతే కావ్యమ్" అను వ్యతిరేక విధికివే భావమని నా తలపు. శాంతసిద్ధి కలవాఁడే ఋషి. అది కలవారంద

ఱును కావ్యకర్తలు కా లేరుకాని, కావ్యకర్తకు మాత్రము ఋషిత్వ సిద్ధిలే నిది వాని చేతి నిర్మాణమునకు మహాకావ్యమను పేరుపెట్టుట మాత్రము సత్యము.

ఈ తత్వమునకు ప్రథమోదాహరణము మనలో తిక్కన సోమయాజి. అతడుపాసించిన హరిహరనాథుడు 'శాంతమూర్తి'. అతనిది 'భేదము లేనిభక్తి', భేదము లేమియే శాంతిపరిణామము. ఫలము ఆనందము. ప్రతి పర్వాంత మాలినీ పద్యము కడపటి పాదమందలి హరిహరనాథ సంబోధనలందు ఆనంద శబ్దము తప్పక ప్రయోగించి యా తెలుగు మహర్షి తనజీవిత మందలి జీవకళను వెలిపెట్టినాడు. 'వైదిక మార్గనిష్ఠమగు వర్తనము' నందే యుండియు లౌకిక ప్రపంచ మందెల్ల నిరర్గళముగ తేజరిల్లినాడు. కావుననే ఆయన ప్రళయ సాగరము వంటి మహాభారతపు మహోద్రేచక భావకల్లోలములలో నెమ్మదిగా, ఏక్షోభయులేక నిర్లిప్తుడై, నగు మొగముతో కడముట్టసీదినాడు మనల నీదించుచున్నాడు. ఏ సన్నివేశమును వర్ణించినను, ఏ పాత్రను చిత్రించినను, ఏ ధర్మమును నిర్వచించినను ప్రతి పద్యమునందును తనదే యొక ముద్రవైచి, ఒకటే విధమగు శయ్యతో ఎగుడు దిగుళ్ళు లేక పదునైదు పర్వములు రచించి ఇంతటి మహాకార్యము కడపట పూర్ణ కార్య సిద్ధునికి, చిత్తశుద్ధునికి సహజమగు గాంభీర్యముతో

"హరిహరనాథ! సర్వభువనార్చిత! నన్దయ జూడు మెప్పుడున్"

(స్వర్గారోహణ పర్వము, ప 97.)

అని యొక చిన్న మాటతో తిక్కన తనచేతులు దులుపుకొనగల్గుటకు నిజమైన మూలము, సహజమగు నాతని ప్రతిభారత్నమును సంస్కరించి సానబెట్టస యీ యానందానుభవమే.

ప్రకృత గ్రంథమునకు 'శివభారత' మని పేరుపెట్టిన శ్రీ గడియారము వేంకటశేష శాస్త్రిగారు పైతత్త్వమును చాల గౌరవించినారనుటకు దీనియందలి ప్రతి పద్యమును సాక్షిగానున్నవి. భారత కథవలె శివాజి కథయు ప్రతిహిందువు యొక్కయు చిత్తవృత్తినుడికించి సివమెత్త జేయునట్టిది. కథచెప్పువారును వినువారును వివేకమును గోలుపోపుట యిందు చాల సులభము. ఈ సాహస కార్యమునకు చేయివేసినను. వీరాశయించినది పూర్వ సూచిక్షుణ్ణమగు ఘంటాపథము. నడచునపుడు కుడి యెడమల

నుండు సందుగొందులు చూచుటకేగాని చొచ్చుటకుగాదు. ఇందు అసహ్యము లగు తూగడింపులు గాని వికారములగు పరువులు గంతులుగాని చేయవీలు లేదు. పాత్రములాడు మాటలన్నియు అచ్చకట్టుగా ఆలోచించినవేతప్ప ఆక్రోశపుటధిక ప్రసంగములుగావు. అక్కఱలేని అర్థముగాని చక్కిందాలు లేవు. ఇందలి వ్యక్తులు, చక్కదనముగలిగి, సందర్భమునకు స్వరూపమునకు దగినట్లు చెప్పవలసిన వన్నియు జెప్పి, చేయవలసిన వన్నియు జేసి తీఱుదురు. చారిత్రక వ్యక్తుల యాధిభౌతిక స్వరూపము మనకప్పుడెక్కువగా తెలిసికొన వీలులేదంటినిగదా! ఆ లోపము విధిలేక యిందును గలదు. కాని, కవిగారికి వారి విషయమున తీవ్రమైన తలస్పర్శియగు ఆధ్యాత్మిక దృష్టికలదు గావున, పై లోపము మన మనస్సునకు దగులదు. కవిత్వమందలి మహత్త్వమున కిది యొక ప్రధానసాక్ష్యము, పాత్రముల యాత్మల వర్చస్సును చిత్రించి, వారి భౌతిక స్వరూపము తెలియదను చింతయే మనకు పుట్టనీక చేయుట.

ఇందలి భాష ఛందస్సు కూడ పైచిత్తవృత్తినే చాటుచున్నవి. అందందు అపురూపముగా వాడిన సంస్కృత పదములు-సమాసములు చూచితిమేని ఆ భాషయందు వీరికి గల గొప్ప చొఱవ స్పష్టమగును. కాని యీ రచనలో దానిని వీరు చాల ఆణచి పెట్టుకొన్నారు. తుదమొదలు నడక యంతయు తెలుగు పలుకు బళ్ళతోనే సాగించినారు. 'సంస్కృతముకూడ' దను బిగుమానములేదు. సరిగదా, తెలుగు తమ పనికి చాలదేమో యను పేద సందేశమును వీరికిలేదు. కనుకనే యీ భారతము భాష గొప్ప వర్చస్సుతో ప్రసన్న మధురముగా ప్రరహించుచున్నది. పలుచోట్ల తెలుగుకింత లగువు బిగువు కలదా' యని యాశ్చర్య పడునట్లు చేయు నుపకారము విందుగలదు. కారణము ఈ కవిగారు

"పొత్తమునఁగాక ప్రకృతిలోఁ బుటులువిప్పి
పదములను గాక భావముల్ పట్టి తరిచి"

శివభారతము. ఆ.2ప 217

నవారు గావున, గ్రంథమంతయునిందు కుదాహరణము. గనుక వేఱుగా నిందు దాహరించుట పునరుక్తి దోషమగును. ఇందు ఛందస్సు నాటినుండి

నేటిదాక తెలుగు నాటలో మెదిపి నిలిపినదే. అందును తిక్కనకు ప్రీతి పాత్రములైన చంపకాది చతుష్టయము, కండగీతములు, ఆటవెలది.— ఇవి మాత్రమే వీరు గ్రహించిరి. క్రొత్త, కొత్త మార్గములలో నడకలలో పద్యములను ప్రయోగించు పరీక్షా దృష్టి వీరికిలేదు. ఉన్నవి, వాడుక పడినవి, చాలునను వినయము వీరికి గలదు. కావ్యమందలి రసభావసిద్ధికి ఛందస్సు గూడ ముఖ్యమైన సాధనమను కొందటి సిద్ధాంతమున వీరికి నమ్మిక లేదని తలచెదను. నామట్టుకు నాకు లేదు.

అనపేక్షిత విస్తరముగా ఈ పీఠికను పెంచు పాపములోబోను. మహా కావ్యము ముందున్నది. సొంతముగా చదివి చూడుడని ఆంధ్రులను వేడుచున్నాను. అట్లు చేసిన వారానదింప కుండుట యసంభవమని, యసాధ్యమని నానమ్మిక.

మైసూరు.
18-2-1943

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

o—o—o

శ్రీ దండక రామాయణము

కలుగోడు అశ్వత్థరావు

శ్రీ కలుగోడు అశ్వత్థరావుగారు నాకు సాక్షాత్తుగా పరిచితులు గారు. ఐనను ఈ రామాయణమునకు పీఠిక వ్రాయుమని నన్ను ఒత్తిడిచేసి తమ యుదారహృదయమును వెలువరించినారు.

నే నెఱిగినంతలో ఇది క్రొత్త తోవ; మఱియు సాహసకార్యము. దండకచ్ఛందస్సు సంస్కృత వాఙ్మయమందే చాల ప్రాచీనము. తెలుగులో దాని వ్యాప్తి ద్విపదవలె, పండితులకంటె సామాన్యజనుల సాహిత్య మందెక్కువ. దానికి ముఖ్యమైన కారణము దాని నడక స్పష్టముగా లయబద్ధమై విన్న మాత్రాననే వెనువెంట నృత్యము చేయు బుద్ధి నుదేకింప జేయఁగల్గుట. దానిని చదువుకొనుచున్నప్పుడు అర్థభావము లెట్లుండినను, మన హృదయాలలో ఏదో యొక్క నిర్లక్ష్యత, పొగరు, నిండు కడుపుఁ దనము—ఇటువంటి అనిర్వచనీయము, అసంలక్ష్యక్రమమును అగు ఉల్లాస మొకటి అనుభవమునకు వచ్చును. సీసము, ద్విపద, అక్కర మొదలగు దేశీయచ్ఛందస్సులలో కొంత సందేహముతో కుంటుచు నడచిన ఖండ జాతి నడక ఐదుమాత్రల గణగతి దీనిలో సర్వాధికారముతో విజృంభించును. వట్టి గతిచేతనే తెలుఁగువారి హృదయములను ఇంతగ చూరగొన్న, కొనఁగల, వేఱొకచ్ఛందస్సు నేనెఱుఁగను. కనుకనే నన్నయ భట్టారకుడు మొదలుగా మహాకవులును, అల్పకవులును, ఇంచుమించుగా అందఱును బరిగ్రహించి యనుగ్రహించినారు. కాని స్పష్టమై నిర్దయమైన దీని లయ ప్రాకారరేఖలలో అర్థభావ రచనలకు స్వాతంత్ర్యము చాలక, వారంద

పీఠిక, 1946.

ఱును స్తుతివర్ణన మొదలగు ఖండవిషయములకు మాత్రము దీనిని క్వాచిత్కముగా నుపయోగించిరి కాని దీర్ఘకావ్యరచనకు ఎత్తుకొనలేదు. శ్రీరామ చరిత్రవంటి పెద్ద కథను ఇందులో రచించి నిర్వహించినవారు నాకు శ్రీ అశ్వత్థరావుగారొక్కరే కానవచ్చినారు.

నిరోష్ట్యాది నియమాలతో ఇట్టి కావ్యమును రచించుట వంటిదే ఇది గూడ. రగణమయమగుటచే ఈ కూర్పులో అదిగాక య-త గణములు రెండే సాధ్యములు. అనగా ఛందస్సున గల యెనిమిది గణాలలో ఐదు గణములు పనికి రావన్నమాట! రెండు లఘువులు చేరికగానుండ వీలులేదు. గురువులకంటే లఘువులే యెక్కువగాగల తెలుగు భాషలో ఈ నియమ మెంత తొందరనిచ్చునో ఊహించవచ్చును. అసలు రామకథ చెప్పుచు దశరథుడు భరతుడు జనకుడు మొదలగు ప్రధాన వ్యక్తులను గూడ అనామధేయులనుగా జేయవలసియున్నాడు కవి. కొన్ని పేళ్ళు కొంత స్వరూప హానికిని లోగవలసి యున్నవి. అశోకవనము 'శ్రీశోకావతి'గా విభీషణుడు'విభీషుడు'గా ఈ గ్రంథములో మార్పడి యుండుట చూడవచ్చును. ఇట్లైనను కవిగారు ఇంత దీర్ఘముగా ఇంత సరసముగా. ధారాళముగా నిర్వహించి యుండుట చాల విస్మయావహమైన విషయము.

ఆ మహాకవి వాల్మీకి మహర్షి యమృత రసనారంగమున ఏ స్థిర ముహూర్తమున శోకము, శ్లోకమై శ్రీరామకథారూపమున తాండవింప నారంభించెనో కాని నాటినుండి నేటివరకు ఆ చరిత్రసుధలో వ్రేలద్దని కవి మనదేశములోఁ గానరాకున్నాడు.

"యది క్షుణ్ణం పూర్వైరితి జహతి రామస్యచరితం
గుణై రేతా వద్భిః జయతి పునరన్యో జగతికః"

అని భట్ట మురారి అనర్ఘ రాఘవమున తన చాపల్యమును సమర్థించు కొన్నాడు. అది తక్కిన అందఱు కవుల సాహసమునకు సమాధానము కాజాలును.

కథ ఎంత పవిత్రమైనను పురాణమైనను ప్రమాణభూతమైనను

దానిని ఉన్నదున్నట్లు తు చ. తప్పక అనువాదము చేయుటలో తృప్తి తక్కువ. యథారుచిగా యథాశక్తిగా చేర్పులు తీర్పులు చేయక యుండ లేము. ఇది మనుష్యులకు సహజమైన నిర్మాణోద్రేకపు ఫలము. కాళిదాసు మొదలుగా మహాకవులు అందఱును ఇంచుమించుగా ఈ పనిచేసిన వారే. శ్రీరామకథలో వాల్మీకికి తరువాత ఇట్లు జరిగిన మార్పులు సమకూర్చి, వానికి ప్రోత్సాహకములైన భారతీయుల కళానీతి ధర్మదృష్టులను చర్చించుట యొక ఘనకార్యము. అది యట్లుండనిత్తము. ప్రకృతము శ్రీ అశ్వత్థ రావుగారి రచనలో గూడ అట్టి స్వాతంత్ర్యము అందందు తళుక్కుమను చున్నది. వాల్మీకినే ప్రధానముగా ననుసరించుచున్నను రంగనాథుని రామాయణము మొ॥ గూడ వీరి రచనకుపకరించినవి. ఇందు ప్రధానముగా గానవచ్చు ఉపకథలకును కథాభేదములకును అకరములేవో కవిగారే సూచింపవలసియున్నది. అవి యట్లుండగా వాల్మీకి రచనలో సూక్ష్మముగా వీరు చేసిన కొన్ని మార్పులు వీరి దృష్టి నైశిత్యమును వెలువరించు చున్నవి. మచ్చు కొకటి రెండు.

[ఎ] దశరథుని మృతికి కైకేయి యెపుడుగాని దుఃఖించినట్లు వాల్మీకి స్పష్టముగా వచింపలేదు. సవతి మత్సరము పుత్రవాత్సల్యమును మందర బోధనచే ఆమె హృదయమును కొంత కఠినము చెసినపిగాని భర్తమృతికి కన్నీరైనను విడువనంతటి అసతికామగదా ఆమె! ప్రస్తుత కవిగారు అందఱి కన్న నెక్కువగా కైకచే ఏడిపించి ఆ పాత్రమును కొంత పోషించి నారు. తరువాత భరతుడు వచ్చి చూచు వేళకు ఆమె 'హర్షంబునన్ బొంగుచు' డుండెననుట గూడ ఆ పాత్రపోషణకు వన్నెనే తెచ్చినది.

[ఏ] మారీచుని వెన్నంటిన శ్రీరాముని క్షేమము విచారించుటకై లక్ష్మణుని అనరాని మాటలాడి సీత తఱిమినపుడు అతడు చాలనొచ్చి వది నెను 'దిక్ త్వామద్య ప్రణశ్యత్వమ్' చి నీవు పాడయిపో- (వా. రా. అ ర. 46-31) అని కటువుగా తిట్టినట్లు వాల్మీకి రచన. అశ్వత్థరావుగారి లక్ష్మణుఁడంత తెగించి మాడలాడు వాడు కాడు. 'తల్లీ! ఇటుల్ చెల్లునే తప్పుగా నన్ను భావింప గానిమ్ము నిన్ బంచ భూతమ్ములే ప్రోచు!

జాగ్రత్త! నేనోయి వత్తున్' అని మాఱుతము 'దేహంబు కంపింపగా, నీరు నేత్రంబులన్ ధారాళ గేలోడ్చి' పల్కి వెడలి పోయినాడు.

[ఇ] వాల్మీకి హనుమంతు నెంత గొప్పవ్యక్తిగా నిరూపించి యున్నను ఒక్కచో మాత్రము పచ్చికోతిగానే చిత్రించినాడు. అతని గొప్ప తనమంతయు సంపాదితమే కాని సహజమైనది కపిత్వమే యనియే వాల్మీకి సమాధానము. సీతకై రావణుని యంతఃపురమంతయు వెదకునప్పుడు రాతి రావణుని ప్రక్కలో నిద్రించుచున్న మండోదరిని చూచి దాని సౌందర్యమునకు భ్రాంతుడై సీతమ్మనే అనుకొని హనుమంతుడు

'ఆస్ఫోట యా మాస చుచుమ్బ పుచ్ఛం
ననర్దచిక్రీడ జగౌజగామ
స్తమ్భనరోహ న్నిప పాతభూమౌ
నిదర్శయన్ స్వాంపశుకృతిం కపీనాం' (రా. సుం. 1054)

సహజమైన తన కపిత్వమును చూపుచు "తోకను జాడించెను, ముద్దు గొనెను; సంతసించెను, గంతులువేసెను, పాడెను, పాఱాడెను, కంబా లెక్కెను, క్రిందికి దూకెను.

ఈ గ్రంథమున హనుమంతుడు మండోదరి "దివ్యసౌందర్య రేఖల్ విలోకించి యన్నాతియే సీత కానోపనంచెంచిలో నుల్లమున్ గ్రాత మా పాదమున్ జల్లనన్ సీరు ప్రగమ్మన్ ఓచేష్టుండునై నిల్చి 'హా! సీత దుష్టా త్ముడైన రావణున్ గూడె నింకేల నా సాహసం, బేల శ్రీరాము యత్నంబు" అని గాబరా మాత్రము చూపి గౌరవము నిల్పుకొన్నాడు.

ఇట్టి వన్నెలు చిన్నెలు ఇందందు చూడవచ్చును. గ్రంథమాద్యంత మును కవిగారికి గల శ్రీ సీతారామభక్తికి నిదర్శనముగా నున్నది. దీనిని యథార్థముగా చవిగొని ఆంధ్రులు గ్రంథకర్తగారి ప్రయత్నము సఫలము చేయుదురుగాక!

మైసూరు
వ్యయ ఆశ్వయుజ
శు॥ 15

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

కళాజీవి

బెళ్ళూరి శ్రీనివాసమూర్తి

రాయలసీమలోని పల్లెటూరి వివిక్త జీవితమునకే అలవాటుపడి అందే తమ భావనానందయోగమున మగ్నులైన కవులెందఱో యున్నారు. వారిలో అగ్రపంక్తి ఈ గ్రంథకర్తగారిది.

"మధురకవి"! ఎంత మంచిమాట! ఎవరిచ్చిరో కాని యా బిరుదు ఈ ఖండికా సంపుటియందలి ప్రతిపంక్తియందును ప్రతిఫలించుచున్నది. భావములలో మధురత; భాషలో మధురత, నడకలో మధురత; భావములలో క్రొత్తవేవియు లేవు. ఈ సంపుట మందలి ఇరువది యైదు ఖండకావ్యము లందెల్ల ఆమూలచూడముగా వ్యాపించిన భావము ప్రకృతిసౌందర్యానుభవము. కాని భగవల్లీలామయమైన యీ సృష్టిలోని అసాధారణమైన అందమునెంత, యెన్నాళ్ళు అనుభవించినను ఈ కవికి తృప్తిలేదు. అందుకే,

ఏను స్వేచ్ఛాశకుంతమనే మహీరు
హాగశాఖి కావితతులం దధివసించి
కాలమును బుత్తునో—ఒక్క కల్పమైన
ప్రకృతి మాధుర్యతృష్ణ తీర్చుకొనుదాఁక,

అని చాల మితమైన యాయువునే కోరుచున్నాడీ కవి! సృష్టిసౌందర్య మందలి వైవిధ్యమును గాంభీర్యమును వైచిత్ర్యమును అనుభవించుటకు నిజముగా ఆ సృష్టికిగల అనాద్యంతమైన యాయువే కావలెనే కాని, అందులో

మాస్టర్‌మన్ ముద్రాశాల, కాకినాడ, 1948.

ఒక్క కల్పము ఏనిమిషము క్రింద గూడ లెక్కకు రాదు. ఆ విషయమున ఈ కవికిగల యల్పతృప్తి మెచ్చుకోదగినది.

కవు లందఱును సౌందర్యపూజ చేయువారే కాని యెందఱో అది కేవలము, మాటల మట్టమ్రీంది లోతుకు దిగక, బైట యాడంబరముగానే యుండిపోవును. దానికి కారణము వారి పూజ సాంప్రదాయికముగా చేయునపుడే తప్ప, ఆర్జవముతోడి యాశతో చేయునదిగాదు. పద్యమును చదువగానే కవికి ఆ యార్జవగుణ మెంతయుండునదియు కావ్యానుభవరసికులకు స్పష్టముగా తెలిసిపోవును. శ్రీనివాసమూర్తిగారి కవనమందు ఆ గుణము నిండియుండుటను ప్రతిపద్యమందును మనము చూడవచ్చును.

కనుకనే యీకవి సమకాలికుడై కీర్తిశేషుడైన దువ్వూరి రామిరెడ్డి కవికోకిలమును గూర్చి (30-వఖండిక) అంత మధురమైన కన్నీళ్ళు రాల్చినాడు.

'ఈ లోకము వాసినీవు నవలోకము జేరినగాని పాడుకో
లేక సుఖింపలేవనుచు రెడ్డికవీశ్వర నాకు దోచెడిన్'.

అన్నమాట రామిరెడ్డి విషయమందెంత సత్యమైనను, ఆర్జవములేని కవినోట రాజాలదు.

'పూరిగుడిసెలలోనైన బుత్తుగాని
గీతమల్లక బ్రబుకు సాధింపలేను.'

(3-వఖండిక)

అని చెప్పుకోగల యీకవి రామిరెడ్డివంటి కవితల్లజుని చిత్తవృత్తిని స్పష్టముగా దెలిసికొన గల్గుటలో ఆశ్చర్యమేమియు లేదు. ఈ యార్జవగుణముచేత వీరి సుందరవస్తు ప్రపంచము విశాలమైనది. దృష్టి లోతుగా విరివిగా ప్రసరించినది. సుఖము గలచోట సౌందర్యమున్నదనుభావిన అందఱికిని సహజము. కాని సౌందర్యమున్నచోట సుఖమున్నదని భావింప గల్గుట, తపస్వులకు మాత్రము సాధ్యము. భగవన్నిర్మాణమంతయు లీలామయమే, సౌందర్యమయమే. విషామృత విభాగమందులో లేదు. ఈ కవిగా రీరహస్యము గుర్తించి యనుభవించినారు. దానికి సాక్షి

'అజ్ఞానము' అను 22-వ ఖండిక, నాదృష్టిలో ఈ సంగ్రహమందలి ఖండములకెల్ల అన్నిపద్ధముల తలమానికము వంటిది.

వీరి కావ్యములు-జాముకోడి, జపమాల, మొదలగునవి-ఇదివరకే తెలుగు సరస్వతి నలంకరించినవి. రసికహృదయముల నావర్జించినవి. ఇది వీరి ఖండకావ్యసంకలనమున పూర్వఖండము, ఉత్తర ఖండములు కొన్ని తప్పక ఇంతలో రాగలవని ఆశతో వేచియున్నాను.

మైసూరు,
14-7-48

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

o—o—o

అనుభవామృతము

కలుగోడు అశ్వత్థరావు

ఈ యనుభవామృతమును తెలిగించిన శ్రీకలుగోడు అశ్వత్థరావు గారిపేరు ఇదివరకే వారి "దండకరామాయణము" మూలమున ఆంధ్రదేశ ములో విరివిగా వెలసినది! "అశ్వత్థేశ శతకము" మొదలగు వీరి ఇతర రచనలును తెలుగువారు చవిగొన్నారు. నాయెడల నిర్హేతుకముగా ప్రణయ గౌరవము లపారముగా గలవారు కనుకనే దండకరామాయణమునకు నేను ప్రాసిన యుపోద్ఘాతము చాలక దీనికిని ఒకటి నన్నే ప్రాయుమని ఒత్తిడి చేసినారు, అనావశ్యకమని ప్రార్థించినా వినరు. దాని ఫలమీ నాల్గుమాటలు. "ఉపచార మంతే".

మూలగ్రంథము కన్నడదేశమున చాల వ్యాప్తి గౌరవముల గాంచి నది. విషయము అనూచానమైన అద్వైత సిద్ధాంతము. అశ్వత్థరావుగారి శైలియందలి ధార, గడుసుదనము తీపి, చలువ, నాల్గుపద్యములు చదివిన మాత్రాన అనుభవమునకు రాగలవు. గ్రంథము తనంత చదువరులను తలపొలముదాక ఈడ్చుకొని పోగలదు. ఇక నెవరి పీఠికలతో నేమిపని?

మఱియొకవింత ! మూలగ్రంథకర్త శైవసంప్రదాయమునకు చేరిన అద్వైతి. అశ్వత్థరావుగారు ద్వైతపథమునందు సాంప్రదాయకమైన శ్రద్ధా భక్తులుగలవారు. నేనును అట్లే విశిష్టాద్వైతమతానుయాయిని. ఈ మూడు మార్గములును పరస్పర సౌహార్దముతో పర్తింపనిది తత్వపులోతునకు స్వతంత్రముగా దిగజాలవనుట సూచించుట కేమో భిన్నాధ్వనీనులగు మేము ముగ్గురును ఈ కార్యములో చేరవలసివచ్చినది.

పీఠిక, 1949, అక్టోబర్, 1.

అవాఙ్మానసగోచరమగు పరబ్రహ్మతత్త్వమును అట్టిదిగా నెఱిగియు అనుభవమునకు తెచ్చుకొనుటకు ప్రయత్నించుట మనుష్యుడు చేసెడు పరమ సాహస కార్యములలో మొదటిది. అట్లుచేయుటకు మనకు గల సాధనములు ఆ వాఙ్మానసములు రెండే. ఏమాత్రమైనను అనుభవమును కలిగించుటకు మూడవసాధన మేదియులేదు. కనుకనే "నమోనమో వాఙ్మనసాతి భూమయే, నమూవాఙ్మనసైక భూమయే" అని యామునముని ఘోషించెను. వ్యాసమహర్షి విష్ణుసహస్రనామములలో "శబ్దాతిగః శబ్దసహః" అనురెండు పేళ్ళను జేర్చెను. ఇవి "మనోతీతో మనస్సహః" అనుట కుపలక్షణములు. మనోవాక్కులు రెండునూ గుణభూమిలో సంచరించును. వీని సంచారము నిలిచినపుడు ఆత్మ నిర్గుణభూమి యగును. బ్రహ్మతత్త్వానుసంధాన మందలి యీ సగుణనిర్గుణ భూమికాద్వయమే అనేక విభిన్నమతములకు మూలమైనది. బహిరంగములైన ఆచారవ్యవహారములలో లోకకల్యాణ దృష్టితో ఉత్తమ మధ్య మాధమములను నిర్ణయింప వచ్చును. గాని అంతరంగమైన పరతత్త్వ స్వరూప విషయమై అభేద భావములను గమనించుట కొంతవఱకు వినోదము, మితి మీరితే విరోధము. దాని సగుణత్వమును గాని నిర్గుణత్వమును గాని నికరముగా సిద్ధాంతీకరించుటకు తర్కశాస్త్రము చాలదు. మఱి ఆ రెంటిని అనుభవమున గ్రహించుశక్తి మనస్సునకు గలదు. అఖండమైన సాధన ఒకటి కావలెనంతే. గుణగ్రాహులగు మనోవృత్తులను ఒక్కొక్కటిగా వదులుచు ఏకాగ్రతను సాధింప బూనిన వానికి క్రమముగా తుదకు జ్ఞేయమే అంతర్ధానమై సాక్షీభూతమగు జ్ఞాతృత్వము నిర్విశేషముగా శేషించి నైర్గుణ్యాను భావము కలుగును. దానికి ప్రతిగా గుణముల ప్రమాణమును సంఖ్యను ఒక్కొక్కటిగా పెంచు కొనుచు పరమాత్మను వానికన్నిటికిని ఏకమాత్రాశయముగా ధ్యానించువానికి ఆయనంత కల్యాణగుణపరిపూర్ణ పరతత్వము స్వాధీన మగును.

మొదటిది సంకోచపద్ధతి. రెండవది వికాసమార్గము. ఈ రెండునూ పరతత్వము యొక్క "అణోరణీయాన్ మహతో మహీయాన్" అను సమన్వితస్వరూపమును తెలుపును.

ఈ "అనుభవామృతము" అద్వైతమును అనుభవించు మార్గమును విపులముగా మాటలతో వివరింప పృయత్నించిన గ్రంథము తర్క మీమాంసానిశిత బుద్ధులగు పండితులకు గాక సామాన్యజనులకు ఆయనుభవ మును సుగహము జేయుట గ్రంథకారుని యాశ. కనుకనే ఒక్కొక్క విషయమును పదివిధములుగా మాటలు మార్చి పిష్టపేషణముచేయుట గ్రంథ మందంతయు మూశవచ్చును. ప్రమేయమును మాత్రము పట్టిచూచితి మేని ఈ గ్రంథము పదింట నొక్కపాలునకు సంగహించి దించినను జాలునని పించును. కాని గంథకర్త యుద్దేశము ఆ మార్గమున ఫలింపదు. విషయ దార్ఢ్యమునకు పునరుక్తి ముఖ్యసాధనము. కాబట్టియే మూలగ్రంథము కన్నడదేశమందలి "పామర" జనులలో ఎక్కువగా వ్యాప్తి చెందినది. వీధి పురాణముగా దీనిని పల్లెపల్లెలలోను పఠించి వ్యాఖ్యానింతురు.

మూలగ్రంథకారుడు రంగనాథకవి. మహాలింగరంగడని రంగావ ధూతుడని కూడ ప్రసిద్ధుడు. కర్ణాటక కవిచరిత్రకారు లితనిని బ్రాహ్మణు డుగా నుండవచ్చునన్నారు. తుదకితడు సదానందుడను పేరు పడసి యుండునని కూడ ఊహింతురు. శైవసంప్రదాయాభిమాని యగుట స్పష్టము. పరమహంస పరివ్రాజకాచార్య సహజానందుని శిష్యుడు. ప్రాయశః 17 వశతాబ్ది మధ్యభాగములో జీవించియుండునని చారిత్రకుల యూహ. 18వ శతకాది భాగమున ఈ గ్రంథము సంస్కృతభాషకు పరివర్తింప బడి యుండుట కూడ దీనివ్యాప్తికిని విలువకును సాక్షి. ఇందలి ఛందోనుసార ముగా వచ్చిన అధిక పదజాలమును జనసామాన్య బోధ, దార్ఢ్యమునకై చేసిన పునరుక్తిని తీసివేసి చూడగల జిజ్ఞాసువులకు నిర్విశేష చిదా నందానుభవ సిద్ధాంతము నెఱుగుటకును, సాధించుటకును వలసిన విషయ ములెన్నో లభించుననుటలో సందేహములేదు. ఇది ప్రత్యక్ష ప్రయో జనముగల పర్యాణ గ్రంథముకాదు. మఱి ప్రమేయమును పలువిధముల ఆవాపోద్వాపములతో ఎదల కంటించి భక్తి ప్రత్యయములను గలిగించు ఉపన్యాసవిస్తరము, ఛందోరూపమంతే.

ఇందలి ఛందస్సును గూర్చి ఒకమాట. సప్తమాత్రల గణములు

1, 2, 4, 5 పాదములయందు రెండేసివచ్చును. 3, 6 పాదములయందు మూడేసిగణములును ఒక్క గురువును వచ్చును. అనగా ఆ కడపటి గురువు నిజమునకు వీడుమాత్రల కాలమునే ఆక్రమించునుగాన సీసపాదములందు కడపటి లఘువు వలెనే ఒక గణమే యగును. గనుక 3-6 పాదములలో నాల్గేసి గణములగును. ఆ యేడు మాత్రలును 3-4 మాత్రలుగా రెండుభాగములుగా నుండును. రెండవభాగము జగణముగా నుండరాదు. ఆరుపాదములలోను ప్రాసముగలదు. "భామినీషట్పది" యని కన్నడులు దీని పేర్కొనిరి. కన్నడ సాహిత్యమున ఈషట్పదివృత్తములు పలువిధములు గలవు. వానిలో నెల్ల భామినీషట్పదియే బహుళ ప్రచారము గలది. తెలుగువారు ద్విపదతో తృప్తులైరి. అనంతామాత్యుడు మొదలుగా ఛందోలక్షణకారులు షట్పదులను లక్షించిరి. కాని ఎందుకో ఆ ఛందస్సు తెలుగులో వ్యాప్తికి రాలేదు. నే నెఱిగినంతవరకు హిందూపురములో నుండిన శ్రీ అనంతరామాచార్యులనబడు "హరికథా" కవి యొక్కడే తాను రచించిన యక్షగానములలో భామినీషట్పది అపురూపముగా వాడినాడు. మఱి గురజాడ అప్పారావుగారి "ముత్యాలసరము" దీనికి చక్కనగమే. తెలుగు భాష ఈ ఛందస్సుతో ఎంత చక్కగా అతుకుకో గలదనుటకును అశ్వత్థ రావుగారు ఇందు స్పష్టముగా చాటినారు.

వారి భాషాంతరీకరణమును గూర్చి ఎక్కువగా నే జెప్పగలిగిన దేమియు లేదు. వారు తీసుకొన్న స్వాతంత్ర్యము చాలా మితమైనది. యతిని 3-6 పాదములలో 3 గణాదక్షరములో చక్కగా నిలిపినారు. దీనితో అది మనదై పోయినది. ఈ మాత్రావృత్తపు మిశ్రజాతిగతిధోరణికి తగినట్లుగా శ్రీ అశ్వత్థరావుగారి ధారయు సొంపుగా, నిర్భయముగా, ఆదర్శంతముల్లోకే విధమగు మెఱుగు చెక్కడపు జక్కదనములో నడచినది. చదువుకొని సంతోషించుట మన పని.

మైసూరు
విరోధి, కార్తీక కృష్ణపంచమి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

శ్రావణము

గొట్టుముక్కల రామకృష్ణశాస్త్రి

అమృతమయయైన వాల్మీకి రచనాదుగ్ధాంబుధిలోని యొకచిన్న బిందువైనదిందలికథ. అనుషంగికముగా వచ్చినది. అదియిప్పుడు శ్రీ గొట్టుముక్కల రామకృష్ణశాస్త్రిగారి సిద్ధలేఖినీమూలమున స్వతంత్రముగా పెరిగి అన్నివిధముల బెద్దదై మనచేతికందినది.

శ్రీ రామకృష్ణశాస్త్రిగారా ఆయుర్వేదవిద్యాపారీణులు. వైద్యులకు సహజముగానుండు, ఉండకతప్పని, ఆత్మసంయమమును, ఏకాగ్రతయును వారికి అవధానవిద్యలో ప్రతిఫలించినవి. అట్టిదేయైన ఆ ర్ద్ర హృదయత వారి కావ్యరచనలో కూలమ్ము దుజమై ప్రసరించినది. ఇంచుచేతనే మహాభారత మందలి పాత్రములలోనెల్ల కుంతి వారి నాకర్షి చినది. కుంతీదేవినోరనే ఆమె జీవితమందలి కరుణగాధలు వెలువడి మహాభారత వ్యక్తులందఱి చిత్రములును మెఱుపులవలె నొక్కొక్కమాఱు తళుక్కున మెఱయించి ఇన్నిటిలో నడుమ మూలమూర్తిగా ఆ దయనీయ ధీరవ్యక్తిని శాశ్వతముగా అచ్చొత్తినవి. కుంతిని దేవతగా భావించి మనదేశపు పామరులు నోములు నోముచున్నారు. కాని పండితకవులు–కవిత్రయమును వదలిలిమేని–ఎవరును తెలుగుదేశమున ఆమె మహత్త్వమును తగినంత వెలువరచలేదే యని నాకుండిన నిర్వేదమును శ్రీ శాస్త్రిగారి 'కుంతి' పోగొట్టినది.

మహాభారత నాటకమున తుదవఱకును సూత్రధారిణియై కుంతి

పీఠిక, 1952.

అరుణాశ్రమ ప్రచురణము–3, కాకినాడ.

యుండినట్లే ఇంచుమించుగా రామాయణ కథకును మూలప్రాయముగా మునికుమారుని కరుణకథయున్నది. దశరథుడు యౌవరాజ్యపు టడ్డాగత్తతో శబ్దవేధి విద్యాగర్వముతో ఆ మునికుమారుని జంపియుండ డేని వాని తండ్రి శాపమిచ్చియుండడు. ఇట్టకాలమృత్యువు పాల్పడి యుండడు. అరువదివేలయేండ్లు బ్రదికినను దశరథుడు చచ్చినది అకాలపుఁ జావే. తండ్రి జీవించియేయుండెనేని శ్రీరాముని యరణ్యవాసపు కథ యెట్లు పరిణమించియుండెడిదో! ఆ పదునాలుగేండ్లు దశరథుడు ఊరక యింటిలో కూర్చుండి యేడ్చుచు కడపియుండడనుట సత్యము.

శ్రీ రామాయణమందీ కథ చాల సంగ్రహముగానున్నది. మమూర్షు వైన దశరథునినోట అంతకన్న విపులముగా విస్తరింపజేయు నవివేకి కాదు వాల్మీకి మహాకవి. అసహ్యమై అపారమైన పుత్రవియోగ దుఃఖ ప్రపంచ మున ఈ చిన్న కథాఖండము కరుణమయమై నిర్వేదపర్యవసాయియై ఆతుకుకొని పోయినది. శ్రీ శాస్త్రిగారు ఆ యాపరణమునుండి వెలికి దీనిని దీసి ఈ కావ్యమూర్తితో వెలయించినారు, విస్తరించినారు. ఆ విస్తరణ పరిస్పందము వింతపింతలుగా నడచినది.

ఈ మునికుమారుని పేరేమో వాల్మీకి చెప్పలేదు. కాని శ్రీ మద్రామా యణపు పశ్చిమోత్తర శాఖీయ పాఠమున చచ్చిన కుమారునితల్లి 'యజ్ఞదత్త' అని సంబోధించుచు నేడ్చినది. రంగనాథుడు ఎక్కడ ఆ పాఠమును చూచి నాడో తెలియదు గాని తన రామాయణమున అతని కాపేరే తల్లి నోటనే చెప్పించినాడు తులసీదాసు. అతనికి 'సరవన' అనిపేరుపెట్టినాడు. ఇది "శ్రవణ" శబ్దపు వికృతియని, అయోధ్యకు ఇరుగుపొరుగుల బిచ్చగాండ్రు నేటికిని ఈ కథను పాటగా పాడుకొందురని, బుద్ధ జాతకకథ యిట్టిదే యొకటున్నదని, శ్రవణ శబ్దమును బట్టి యీకథ బౌద్ధులసంప్రదాయము నుండి వచ్చిమనలో కలిసియుండవచ్చునని హిందీ శబ్దసాగరము తెలుపు చున్నది. ఇంగ్లీషులో ఈ కథను కావ్యముగా వ్రాసిన తోరోదత్తు కవయిత్రి ఈ పేరే వాడినదని నాజ్ఞాపకము. శ్రవణశబ్దమే శ్రావణశబ్దముగా మాటీన చేమో! మఱియు దశరథుని వేటకు పురికొల్పినది వర్షాకాలము. అనగా శ్రావణమాసము. ఈ శ్రావణ నామమున శ్రావణమాసము ఏ మాత్రమైనను

దోహదము చేసినదేమో?

ఈ కథలో గొప్పచిక్కొక్కటి ప్రాచీనులకు కలిగినది. ఈ మునికుమారుని దేజాతి? బాహ్మణుడైనచో దశరథునికి మురోచమైన బ్రహ్మహత్య పాతకమనవచ్చును. శూద్రుడైనచో తపస్సునకును వనప్రస్థవృత్తికిని అధికారముండదు. ఆ తప్పునకే కదా శంబుకుని రాముడు దండించినది? కనుక ఈ శ్రావణుడు-యజ్ఞదత్తుడు-రెండును అయి రెండును కాని సంకరజాతి కావలసినాడు. పశ్చిమోత్తర శాఖా పాఠములు బ్రాహ్మణునికి శూద్రికిని జనించినట్లు గలదు. ఎట్లును తల్లినిబట్టి బ్రాహ్మణత్వము తండ్రినిబట్టి తపోధికారమును మునికుమారునికి కలిగినది. శ్రీ శాస్త్రిగారు ఈ సాంకర్యమును తప్పించి తలిదండ్రులిద్దటిని చక్కని వైశ్య కులము వారినిగానే తీర్చినారు. బ్రహ్మహత్య చేసితినేయని దశరథుడు భయపడగా "మేము వైశ్యులము కనుక భయపడవలదు" అని శ్రావణుని తండ్రి అతని నిందూరార్చినాడు. బ్రహ్మహత్యాపరీక్ష జాతిని బట్టిచేయవలయునా? లేక వృత్తిని బట్టిచేయవలయునా? అన్నది చాల చిక్కైనప్రశ్న. ఎప్పటికిని తెగనిది. ఎట్లుచూచినను తొందఱ తప్పదు. వ్యక్తివృత్తిని బట్టి చూచితిమేని జాతి నియమముండదు. జాతిని బట్టి నిర్ణయించితిమా వ్యక్తులెందరో అనర్హులైన సుఖదుఃఖాల పాలగుదురు. ధర్మ న్యాయసూత్రముల యీ పరస్పర విరోధమే మానవ జీవితమందలి యెన్నో విప్లవములకు మూలము-నాటికి నేటికి రేపటికికూడ.

ఈ ధర్మ న్యాయశాస్త్రములకు జెందిన మఱి యొక్క చిక్కు ఈ కవిగారి కల్పనలోవచ్చినది. క్షత్రియ కన్య ఇందిర ఈ కవిగారి కల్పనలో వచ్చినది. క్షత్రియ కన్య ఇందిర ఈ వైశ్యమునికుమారుని వలచి వరించినది. ఆమె తలిదండ్రులు దానికంగీకరించినారు. వైశ్యునికి గాని శూద్రస్త్రీతోడి వివాహము నిషిద్ధమైనను అనులోమమైనది గావున సహ్యమైనది. కాని క్షత్రియస్త్రీ వైశ్యపురుషునితోడి పెండ్లి ప్రతిలోమమై సంఘాంగీకారమును పొంద గలిగినదికాదు. కవిగారు ఈ విషయము నేమియు చర్చింపలేదు కాని యిట్టివి సంభావ్యములని, దుశ్చికిత్స్యములని చదువరులకు చూపి వదలినారు. ఇటులే కాదా కామినీవృత్తములే (89-పుట) అనుటయే వారి కవిపిమర్శ.

కామినీ శబ్దముపలక్షణమంతే. కాముకులపృత్తములును ఇట్లే. ఇదేమాటనే "దుఃఖమిందియగణో నివార్యతే" అని చేయి వెల్లకిలవేసినాడు కవిగురువు కాళిదాసు.

శ్వావణుని తలిదండ్రులు కడపట చితాగ్ని రగిలించి దాని యందాత్మాహుతి చేసిరని వాల్మీకి రామాయణమునన్నది. కాని వారట్లు తనకన్నుల యెదుటనే అగ్నిలో దగ్ధమగుటను చూచుచుండ దశరథుడెట్లోర్చెను? ఆయ బ్రాహ్మణ్యమును వానికంటగట్టలేక కవిగారు ఇందు వృద్ధదంపతులిద్దఱను యోగసిద్ధులనుగా తీర్చి ప్రాణాయామాగ్నిచే జీవితము దహింపజేసినట్లు రచించినారు. దశరథుడు చేసినది ఆ మృత దేహముల యగ్నిసంస్కారము మాత్రమే.

ఇదే కథను సంగ్రహముగా వ్రాయుచు రఘువంశమున కాళిదాసు పుత్రశోకమువే మావలె నీవును చావుము అన్నమునిశాపమునకు ప్రతిగా దశరథునినోట వినయముతో

శాపోప్య దృష్టితనయా ననపద్మశోభే
సానుగ్రహో భగవతామయి పాతితోఽయమ్ (9–80)

(స్వామీ, కొడుకుల ముఖపద్మము చూడనోచుకొనని నాకు మీ శాపమే అనుగ్రహమై పుత్రభాగ్యము నిచ్చును) అనిపించినాడు. ఇక్కడ తానిచ్చిన శాపమునకు తానే పశ్చాత్తప్తుడై వృద్ధమునిం. "నిస్సంతాన ఖిన్నుండవే నాపాలన్ వరమౌ నొకప్పుడీది సందేహమ్ములేదింతయున్" అని యూరడించి తన వానప్రస్థ ధర్మమును నిలుపుకొన్నాడు. "క్షణ కోపాః మహాత్మనః" కదా!

ఇవి శాస్త్రిగారి కల్పనయందలి సూక్ష్మదర్శిత్వమున కుదాహరణములు. మఱి వెనుకముందులు రెండును లేని పట్టినడుమంత్రపు దుర్యోగముగా నున్నయీకథకు వీరు పూర్వోత్తరములను చమత్కారముగా గల్పించి పూర్ణీకరించినారు. కాళిదాసు మేఘసందేశమున సూచించి విడచిన యక్షుని స్వాధికార ప్రమత్తత యీ కథకు పూర్వరంగమై ఊర్వశీనలకూబరులను భూమికిదించి శాపానుభవము తరువాత వారినిమరల స్వస్థానము

జేర్చివారి పరస్పర పరీరంభముతో ముగియుచు, కవిగారి ప్రతిభా ప్రవాహమునకు వలసిన దివ్యభౌమ సన్నివేశముల నందిచ్చినది. ఆయా సన్నివేశములను భావములను చిత్రించుటలో కవిగారు చూపిన లోకజ్ఞత, సంయమము. దృష్టివిశాలత, సహృదయత, ధారాళ పవిత్రశయ్య, చాల శ్లాఘూర్హములు. అవి యీ కావ్యమున పలుమారు చదివి మననము చేసి యనుభవించి ఆనందింపవలసినవి. పీఠిక లో పునర్వచింపవలసినవి కావు.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
నందన కార్తిక కృష్ణనవమి,
తిరుపతి.

బుద్ధగీత

శంకరంబాడి సుందరాచారి

కరుణ రసధార సెలయేటు, గరువతనపు
తెల్ల, ప్రేమామృతంబున కేడుగడయు
ధర్మమార్గంబు నొరవడి, దయకు దారి
దివ్య మానుష్యమిది బుద్ధదేవు చరిత.
తేటు గీతుల, దెలుగు తీదీపురుచుల
యూట, కొంకుల కొసరుల కాటుపడక
నమ్మి నమ్మించు నిత్యబోధమ్ము దారి,
సారతర మిది సుందరాచారి కవిత.
ధర్మ గోవు దారితప్పు కాలము నేడు
పిన్నలనక మీరు పెద్దలనక
వదువుడయ్య, యొరుల జదివింపుడయ్య యీ
రమ్య రచన తెలుగు రసికు లార!

తిరుపతి
విజయాశ్వయుజ
కృష్ణ దశమి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

పౌది, 1953

నాగార్జున సాగరం

సి. నారాయణరెడ్డి

ఈ మధురభావనామయ కావ్యమునకు ఉపోద్ఘాతము వ్రాయఁగోరి శ్రీ నారాయణరెడ్డిగారు నన్ను సన్మానించినారు. అందుకు నా ధన్యవాదములు.

తరుణ వయస్సులో నున్నను ఈకవి కావ్యసౌరభములు ఈవఱకే ఎంతో కాలముగా తెలుగుదేశపు మూల మూలలను ప్రసరించినవి. ప్రాచీనాధునిక సంస్కారాలు రెంటినిగూడ ఔచిత్య మెఱిగి సమ్మేళము చేసికొని భావనలను భాషను సంయమముతో నడపఁగల ప్రతిభాశాలులు కొందఱే. అట్టి కవుల అగ్రపంక్తిలోని వారు రెడ్డిగారు.

ఇది గేయ కావ్యమన్నారు కవిగారు. గేయములందు కాలలయమగు మాత్రానియమము మాత్రమే కాక నాదలయమగు స్వరనియమము గూడ ఆవశ్యకమే. కాని నేఁటి గేయకవులు ఆ నాదమును పూర్తిగా చదువరులకే వదలికృత కృత్యత ననుభవించుచున్నారు. ఈ కావ్యముగూడ ఆ దృష్టితోనే రచింపఁబడినది. నాదకాల నియమములు రెంటినిగూడ చదువరుల స్వేచ్ఛకు వదలినవారు ప్రాచీన వృత్త జాత్యుపజాతి కవులు. వారేర్పఱుచుకొన్న నియమమంతా అక్షరమాత్రా సంఖ్యకు చేరి నియమమాత్ర ఫలకమై నిలిచినది. ద్విపద, సీసము, రగడ మొదలగు కొన్ని నిబంధములు మాత్రమే తెలుగు సారస్వతమున కొంత శిథిలలయ బంధమును ఇంకను పట్టుకొన్నవి.

మంగళాశాసనము, 1955.

తెలఁగాణా రచయితల సంఘం, హైదరాబాదు.

నాద నియమము రాగము. కాలనియమము తాళము. ఈ రెంటిలో లయించి పనిచేయుట పాట. అర్థభావములంచు లయమునను భవింపఁగోరు కవికి పైరెండు నియమములును అలంకారములుగా మాత్రమే అప్పుడప్పుడు పనికిరాఁగలవు. అంతేకాని వేరువేరు రూపరేఖా ప్రమాణములుగల అర్థభావములను, వానిని వెలువరుచు భాషను, ఆ నియమములతో బిగించి కవి నడపఁలేడు. ఆ ప్రయత్నములో అతఁడు గాయకుడు కాఁగలఁడేమో కాని కవిగా మాత్రము మిగులలేఁడు ఆవర్తముల తుదమొదళ్ళను, వానినడుమ నుండపలసిన విఱుపులను తాళమందు యతిప్రాసలు నికరముగా చూపి పెట్టును గనుక, ఆయాచోట్ల తెగిపడు భావములను వానినితెంచు భాషను రచించుట ప్రాయికముగా అసాధ్యము. కనుకనే కవులు గేయరచనా నిర్బంధములను కొంచెము కొంచెముగా సడలించుకొనుచునే నడచినారు. తుదకు రాగతాళములకును, వట్టి లయకును కవితాకళతో సంబంధమే అపురూపమైనది. యతిప్రాసలు కొన్నిచోట్ల నియమములేని శబ్దాలంకారములైనవి. తెలుగు కవులలో అవి రెండును ఉన్నవనుకొని లాక్షణికముగా తృప్తి పడుటకు మాత్రము పనికివచ్చిన నిర్బంధములైనవి.

పై సహజపరిణామముతో తృప్తిపడలేని కొందఱు, రాగతాళముల మాటు యెక్కునన్నన, లయప్రధానముగా నైనను కవితారచన సాధించు ప్రయత్నమును జేయుచునే యున్నారు. చిక్కులులేని యేరాగ ధాటిలోనైనను ఇచ్చవచ్చినట్లు వీనిని పాడుకొనవచ్చును. ఆధాటినిగూడ కవియే సూచించె నేని మంచిదే. లయమయమైన గణములను పక్కి కిన్నియని లెక్కించి నడుపునది తాళము. దీనిని ఈగేయ కవితలో నిర్వహించుట సాధ్యము కాదు.

(1) ఇక్ష్వాకు వంశ శీ
తీధ్రదచంద్రుల కీర్తి
కౌముదులు నల్గడల
కలయ విరిసిననాడు

(2) కృష్ణవేణీ తరం
గిణీ పయఃకింకిణులు
త్రిశరణకాణాల
దెసల నింపిననాడు

ఇందలి ఒక్కొక్కవాక్యమును ఐదైదు మాత్రలగణములు ఎనిమిది గలిగి ఖండగతిగల ఆదితాళమునఁ గూర్పబఁడినది. కాని సరిపెణవలె అఖండముగా సాగిన యీ నడకలో భావము ముగిసినప్పుడుగూడ విశ్రాంతికి చోటులేదు. విశ్రాంతి తీసికొంటిమా తాళము పటాపంచలగును. దానికై ఆ విశ్రాంతికాలమును చక్కగా నలువదిమాత్రలకాలము పెంచితిమా పూర్వోత్తరభావములు పరస్పరము అసంబద్ధములుగా సాగును. కనుక ఈరచనలో ప్రధానమయిన మూలద్రవ్యము లయ మాత్రమే. అది చదువరులను తనవెంటనీడ్చుకొని పోవుచు అలౌకికముగా కావ్యరసము ననుభవించుటకెంతో సహాయపడును. మఱి అందందు రసభావానుగుణముగా ఆ లయనుగూడ మనము సడలించుకొనవలసియుండును. కావ్యకళకు పరమార్థమదే కనుక. లేకున్న ఆ బంధము బిగువై తప్పెటవాద్యమువలె మనలను శుష్కపఱుచును.

ఏకప్రమాణముగల మాత్రల నడక లయ. అది గణములుగా నడచును. ఆ గణములు అనంతవిధములైనను స్పష్టమై సుగ్రహమయిన భేదముగలవి ఐదని లాక్షణికుల నిర్ణయము: త్ర్యస్రము, చతురశ్రము, ఖండము, మిశ్రము, సంకీర్ణము అని. వానికి క్రమముగా 3,4,5,7,9 మాత్రలుండును. అందు సంకీర్ణలయగూడ సుగ్రహముకాదని. చతురశ్ర ఖండముల కూర్పుగానే నడపవలసియున్నదని, వ్యావహారికముగా దాని నుదాసీనముగా నుంచుకొన్నారు గాయకులు. తక్కిన నాల్గింటిని యథారుచిగా వాడుచున్నారు దేశీయ చ్ఛందస్సులలో. తెలుగు 'రగడ'లలో ఈ నాల్గింటిని చూడవచ్చును. కాని. కారణమేమో చెప్పలేము. తెలుగు దేశ్యరచనలలో 5-7 మాత్రల ఖండమిశ్రగతులే యెక్కువ వ్యాప్తిలోనికి వచ్చినవి. అందును మిశ్రమునకంటె ఖండమే ప్రబలము. మనవిదేశ్య

చ్ఛందస్సులైన అక్కరలు. సీసము, ద్విపద, దండకము. వీనియందెల్ల సామ్రాజ్యముచేయుచున్నదిదే. కన్నడభాషలో భిన్నలయము నాధారముగా గొని నడచు షట్పదులలో మిశ్రమరూపమయిన 'భామినీషట్పది' అనూ చానముగా చాలా వ్యాప్తిలో నున్నది. దాని అక్కడ గూడ ఆధునిక స్వాతంత్ర్యముతో రచించుకవులు ఖండగతినే యెక్కువగా వాడు చున్నారు-

శ్రీ నారాయణరెడ్డిగారుగూడ ఈ కావ్యములో ఎక్కువపాలు ఖండ గతినే నడపినారు. తృతీయతరంగము మొదటిఖండమందుమాత్రమే కొంత మిశ్రగతి చూపినారు. అదే తరంగమందే 55వ పుటలో-

'ఆమె చలించెను అమనిపోలిక'

ఇత్యాదిగా 8 పంక్తులలో మాత్రమే చతురస్రగతి స్పష్టముగాచూపి చాలించు కొన్నారు. పంక్తికి పండ్రెండు మాత్రలుగా రూపకతాళములో వీరు పొదిగిన త్ర్యస్రగతి ఎందో యొకటి రెండు చోటులఁదప్ప చతురస్ర రూపముగానే వెలసినది. వీరి ధారాఖలమంతము ఖండగతియందే యెక్కువ కానవచ్చుచున్నది. వీరెంతో ప్రియపడి ఈ కావ్యమందు వర్ణించిన కృష్ణ వేణీ ప్రవాహమువలనే వీరి కవితాలహరికూడ ఒడుదుడుకులు లేక. అడ్డమా కలు లేక, విశాల గంభీరమూర్తితో ప్రసన్న మధురమై నడచి వచ్చినది. భావములన్నియు చతుష్పదములుగానో ద్విపదములుగానో ముగిసి నడచుట ఈ గేయకావ్యమున కందమిచ్చిన ముఖ్యమూర్తి. సంయుక్త వ్యూర్వాక్షర శిథిలత, ఆదిమధ్యాంతములలోను ఆతుకుల బొంతలైన సమాసములు, అపూర్వ శబ్దములు, మొదలగు పుల్లలీ పానకములోలేవు. ఉన్న యొకటి రెండు ప్రవాహము పోవు అడ్డుచొప్పులవంటి వంతే. అడుగడుగునకును ఇందు యతిప్రాసయతులను నియమితముగానే ప్రయోగించినను వాని కళ్ళ ము కవిచేతులలోనే భద్రముగా నిలిచినది.

విరక్తియను మోక్షరహస్యమునకును రక్తియను బంధరహస్యమున కును గల అనాది స్పర్ధ-అది అనంతముగూడ-ఇందలి కథాబీజము. బౌద్ధ

మత ప్రచారము వ్యాపంచమందంతా జయశీలముగా సాగుచుండిన కాలమది. నాగార్జున గిరియందలి మహాచైత్యము శిల్పారామముగా నిర్మింపబడుచున్నా నాళ్ళవి. శిల్పసృష్టికై మతాచార్యునిచే నియుక్తుడైన పద్మదేవుడు ఈ కథానాయకుడు; తరుణుడు; సుందరుడు; గానమూ, చిత్రకర్మ, విగ్రహ రచన అను మూడు కళలయందును సిద్ధహస్తుడైన సహృదయుడు. 'ఆంధ్రుడతడు' అని రెడ్డిగారు స్వాభావికముగా నూహించి నారు. కాని అంతటితో తృప్తిపడక 'ఆనంత విశ్వాత్మజుండు' అని వారి కవి హృదయము అతని వ్యక్తిని విరివి చేసినది. కనుక

'అతనికి ప్రాంతపు తెల్లలు
అక్షిగోచరములు కావు,
అతనికి మతవైషమ్యము
లణుమాత్రము తెలియరావు (పు. 9)

బుద్ధభగవానుని జీవితగాథలు కళకైయతనికి రుచించినవి కాని బౌద్ధమత మునందు కాని భిక్షువులయెడగాని అతనికి శ్రద్ధాగౌరవములు లేవు.

కథానాయిక శాంతిశ్రీ; అచ్చటి సంఘారామమున ఆచార్యునివద్ద బౌద్ధ సిద్ధాంత తత్వముల నభ్యసించుటకై వచ్చిన విద్యార్థిని, తరుణీ; సుందరి. ఆమెది 'కళాత్మక జీవనము'. ఆమె నేర్చినకళ యేదో కవి చెప్ప లేదు. కాని నృత్యగీతము లందు అభినివేశము గలదియని సూచించినారు. మఱి ఆమె యేదేశముదో మనకు తెలియదు. అక్కరలేదు గూడ. స్త్రీ సహజమైన హృదయద్రుతి గలగినది, కనుక గురుదేవుని విరక్తి 'ధర్మపీ యూషవిమలో ర్మికా దోలికలలో నోలలాడి' నది ఆమె హృదయము మఱి.

'ప్రకృతిలోని ప్రత్యణువున
పరమాద్భుత శోభాన్విత
సౌందర్యము నిర్లిప్త
స్థాయిలోన నిద్రించును'

కనుక వానిని మేల్కొలుపుటయే జీవిత పరమార్థముగా నెంచిన పద్మదేవుని

తారుణ్య సౌందర్య చాతుర్యములకు ఆమె పరవశయై అట్లే ఆత్మార్పణము చేసినది. ఈ యిరువురి 'విలాసజీవన పిపాస'ను తెంచు ప్రయత్నములో ఆచార్య డామెకు శాశ్వత బ్రహ్మచర్యదీక్ష నియ్యఁగలిగినాఁడు. ఆధిభౌతికముగా శాంతిశ్రీ విరక్తిదీక్షను తీసికొన్నను ఆధ్యాత్మికముగా రక్తిని త్యజింపలేక తపించినది. పద్మదేవుఁడు పౌరుషముతో ఆసంఘమునుకళా మయమైన తన యుద్యోగమును వదలి శాంత్రిశ్రీ చింతతో ఎక్కడికో పోవును. విరక్తిరూపమున రక్తి కై పరితపించు శాంత్రిశ్రీ కలలో కలగా, మానవసేవ చేయుదునని వెడలిపోయిన పద్మదేవుని ప్రయత్న ఫలముగా గాఁబోలు, ఆ సంఘారామమున్నచోట 'విశాల దివ్య నవ్యసాగర' మొకటి చూచినది. ఇట్లే కథావస్తువు దీనముగా ధీరముగా నిలిచి పోయినది.

రక్తిలోను విరక్తిలోను సౌందర్యమున్నది. వికారముగూడ రెంటను గలదు. రెండును పరస్పర సంస్కారకములుగా పోషకములుగా ఉండఁ గలవుఉండవలయును, ఈ తత్త్వమును గమనింపక పోవుటచేతనే మనదేశ మందు చార్వాకమతముతోఁ గూడ బౌద్ధమతమును నశించిపోయినది. గురు దేవుఁడు పద్మదేవుడు ఇద్దరును శుష్కహృదయవాదులే. వీరిరువురి నడుమ పర వశముగా నలిగినది శాంతిశ్రీ. కాని కవికి పద్మదేవుని పక్షమున కొంత యభిమాన మెక్కువగా నున్నదని చదువరులకు తోఁపవచ్చును.

ఈ చిఱుకథలోని విభిన్న సందర్భములను, భావభేదములను ఎంతో సంయమముతో, మధుర భాషతో, రమణీయములైన భావనలతో చిత్రించి నారు శ్రీనారాయణరెడ్డిగారు. వారికి నా హార్దాభినందనములు. వారి భవిష్య త్కవితామతల్లికి నా అనంత మంగళాశాసనములు.

o—o—o

పెన్నేటి పాట

విద్వాన్ విశ్వం

రాయలసీమ నేడు అఖండాంధ్ర దేశములోని ఒక పరిష్టఖండముగా ఏర్పడియుండుటకు దాని యిప్పటి దరిద్రావస్థ ముఖ్య కారణమ్ము, మైసూరు పర్వతాల అధిత్యకా భాగమై, అడుగడుగునను పెద్ద చిన్న కొండలు అడవులు కలిగి, ఎన్నో చిన్న పెద్ద నదుల వెల్లువలచే చల్లధనము కొల్లపంటలు గలిగి, అపారమైన గోధనమును పోషించుచు సర్వ సమృద్ధమై యొకానొకప్పు డుండినది. ఎన్నో చిన్న పెద్ద రాజ్యములకు రాజధానులకు చోటిచ్చినదీ సీమ. పరిగి, హేమావతి, రాయదుర్గము, గుత్తి, పాగొండ, బళ్ళారి, మడకసిర, మధుగిరి మొదలగునవి అట్లుండగా. విజయనగరపు చక్రవర్తులకు వేసవికాలమందలి చలువరాజధానిగా ఎంతో కాల మాశ్రయమిచ్చిన పెనుగొండ–ఘనగిరి, ఇందలిది. రామరాజ భూషణుని నోరూరించిన "దాడిమలకా లలితాంగు"లు, ఆ కాలపు 'జటిల ద్రాక్షాగుచ్ఛంబులు' నేడును అక్కడ పుణ్యవంతులు చవిచూడవచ్చును. షష్టిపూర్తి చేసుకొన్న ఆ సీమవారందరికి అక్కడి ప్రాచీన సమృద్ధిలో కొంత భాగమైనను చిన్నతనమున అనుభవమునకు వచ్చియుండును. మఱి వారు దానిని మరవలేరు.

ఆ వైభవపరిశేషము కలమముగా మావంటి వారి కన్నుల యెదుటనే అంతర్ధానమైనది. అక్కడి లెక్కలేని చెరువులలో ఎన్నో తెగిపోయినవి. ఉన్నవి ముప్పాతిక పూడిపోయినవి. మైసూరు రాజ్యమువాళ్ళు

పీఠిక, 1956.

పైనుండి దిగివచ్చు నదులకు వంకలకు చెఱువులు గట్టుకొని ఊటనడ్డగించుటచే నదులకు వాననీరు తప్పవేఱు నీరు రాకపోయినది. 'సరవ' అనుపేర అంతర్గామినిగా శాఖోపశాఖలుగా ప్రవహించుచుండిన సరస్వతి వట్టి యిసుకపాతరగా మాఱినది. అందందు సహజముగా ఎగజిమ్మి చుండిన 'తలపరిగలు'—నీటిబుగ్గలు, వట్టివాయి విడుచుకొని క్రమముగ మన్నుమూసికొన్నవి. అడవులన్నియు పంటచెఱుకులై పొగబాకిపోయినవి. ఇక మనుష్యుల మాట చెప్పనేల? ఆంగ్లేయుల దొరతనములో ఈసీమ యెన్ని విధముల ఎండవచ్చునో అన్ని విధములను ఎండినది; ఎండింపబడినది. ప్రజల పరవశత, అధికారుల అలక్ష్యము, ఇరుగు పొరుగుల వారి స్వార్థపరత, వీనికితోడు దైవము దయదప్పుట, ఇన్ని కలిసి నేటి రాయలసీమ రూపుగొన్నది. మఱి ఆంధ్రులే అధికారము అవకాశము గలిగినప్పుడు గూడ ఈసీమ యోగక్షేమములను గమనింప లేదు. సరిగదా, మీదుమిక్కిలి ఇది రాళ్ళసీమయని, అరణ్యమని, ఇక్కడి వారికి చదువుసంతలు లేవని, వారు అనాగరకులని పరిహాసమును ఆక్షేపమును జేసినవారును కొందరుండిరి. నేడును లేకపోలేదు. ఇది 'క్షతే క్షారమివాసహ్యం' అన్నట్టియినది ఆ సీమలవారికి. ఇది ముఖ్యకారణముగా ఈ ఆంధ్రఖండమునకు 'రాయలసీమ' అని విభిన్ననామమును తాము ఇతరాంధ్రులతో చేరియుండలేమనుభావము ఇందలి ప్రజలకును గలిగి వ్యాపించినది. ఆంధ్రరాష్ట్ర సాధనకు ఇది అడ్డుదగులునేమోయను తీవ్ర భయమును ఉండెడిది. కాని కొందఱు దూరదృష్టిగల మహనీయుల ప్రయత్నము చేత అట్లు జరుగలేదు. మారాళ్ళపల్లికి సమీపమందలి పేరూరు అను గ్రామము వద్ద మల్పురిరుగు పెన్నేటి నడ్డగించి చెఱువు కట్ట వలెనను భావము సర్కారు వారికి ఏమహనీయుడో సుమారు 55 సంవత్సరాలకు ముందు కలిగింపగా ఆపని మొన్న మొన్నటిదాకా రూపెత్తలేదని, నేటికిని పూర్తికాలేదని తెలిసికొన్నవారికి ఈ సీమదైన్యమును, దీనిని గమనించిన సహృదయులకు గలుగు నిర్వేదమును క్రొంత అర్థము కాగలవు.

నామిత్రులు విద్వాన్ శ్రీ విశ్వంగారి అట్టి తీవనిర్వేదమే ఈ పెన్నేటిపాటుగా వరిణమించినది. వాల్మీకి తనకు గలిగిసశోకము శ్లోకమయినదని చెప్పుకొన్నాడు. కాని వాల్మీకి మనుష్యత్వపరభాగమైన మహర్షిత్వమును సాధించుకొన్న మహాతపస్వి, కనుక అతని శ్లోకములలో మూలమైన శోకము ఎక్కువగా ప్రతిఫలింపలేదు. శాంతి, దాంతి, శౌర్యము, వివేకము దయ, ధర్మము, చింతలు, వినోదములు ఇత్యాది భావములే యెక్కువగా నుండి అయనరచన ప్రశాంత మధురమైనది. విశ్వంగారిది మానవ హృదయము. ఊహకన్న, భావనకన్న అనుభవమే మూలాధారముగా వెడలిన పరవశరచన వీరి 'పాట'. నిర్వేదము తీవ్ర మైనప్పుడు అన్ని నియమాలను చెల్లాచెదురుచేయు వేసటగా పనిచేయును. అది యీ 'పాట' లో కవిగారిని ఎన్నో ఆటలాడించినది.

ఈ దేశమునందలి ప్రాచీన వైభవము అంతయు ఒక దృశ్యముగా కన్నులకు పట్టి ఈ కావ్య తాండవమునకు నాందిగా ఒక సీసము ఒక గీతము మెఱుపు దీగవలె మిఱుమిట్లు గొల్పుచు కవిగారి కలమున మెఱసి పోయినది. ఉత్తర క్షణమందే,

"కోటిగొంతుల కినెర మీటికొనుచు
కోటిగుండెల కంజరి కొట్టుకొనుచు"

'నేటి రాయలసీమ కన్నీటిపాట' స్వచ్ఛంద వృత్తముతో వెలువడినది. అందు ప్రతిఫలించినది 'పీనుగుల పెన్న', 'పట్టియెడారి', 'నక్కబావలు', 'నాగుబాములు', 'బొంతగద్దలు', 'రేణ గంపలు, పల్లేరుగాయలు, తుమ్మ తోపులు', ఇత్యాది అసంఖ్యసామగ్రితో విశ్వంగారి కవితా విరూపాక్షుడు తాండవించినాడు. భాష, అర్థము, భావము, ఛందస్సు అన్నియు ఆ తాండవమునకు ప్రక్కవాద్యాలు వాయించినవి. 'పీనాట్యం' పాడినవి! ఒక మాటలో, ఒక చేయూపులో, ఒక తలయాడింపులో, ఒక తిరుపులో ఈ నటరాజు రాయలసీమలోని భూతభవజీవితమునందలి చిన్న పెద్ద ఖండికలెన్నో విసరివైచినాడు.

ఈ దృష్టికి-ఈసృష్టికి కథయనావశ్యకము. అసాధ్యముగూడ. రంగడు ఒక పెద్దరైతుకు ఏక పుత్రుడు. ఆ తండ్రి 'పెగ్గిలు' ఇతుకులో కొడుకుకు మిగిలిన ఆస్తిపాస్తులవ్వియు వాని శరీర మొకటి, వాని చిన్న యిల్లాలు గంగమ్మ. ఆ 'గంతకు తగిన బొంత'. కాని ఆరెంటిలోను ఎంతో ఒద్దిక, మార్దవము, సామరస్యము గలదు. ఇద్దఱికిని ఆ యిద్దఱు తప్ప వెనుకముందుల వారెవరును లేరు, గడ్డియో, కట్టెలో దొరకినది అడవి వుండి మోపుగట్టు కొనివచ్చి వచ్చినంత కమ్ముకొను కూలిపని రంగనిది. ఇరుగుపొరుగువాడింట వడ్లో, ఇటుకులోదండి నూకలో తవుడో తెచ్చుకొను నాలిపని గంగమ్మది. ఈ యిద్దరి పరస్పర ప్రేమ, పరోపకారబుద్ధి, కవుడు లేని నడత, అంతులేని దారిద్ర్యము, విసుగుకొనుటకును వీలులేని కాయకష్టము, ఇరుగుపొరుగువారి నిస్సహాయకత, చేతనైనవారి యుదాసీనత, ఈ నడుమ గంగమ్మ గర్భము, దోహదము విశ్రాంతిలేక ఆ పిల్లవాడు కష్టములను మాచి వేయునదేమియులేక రంగడు 'సమాధిగతుండగు చోగిబోలె స్తబ్ధుడై యుండుట-వారి భవిష్యత్తును గూర్చి పెద్దగా ధ్వనించు ప్రశ్న-ఇదే ఇందలి వస్తువు. కడపట

'హృదయమా! మానవుడు నిన్ బహిష్కరించె!'
'చచ్చె నీ లోకమున మనస్సాక్షియన్నచ్చు
నెత్తి నోరిడి కొట్టుకోనిండు నన్ను!'

అని భరతవాక్యము పాడినారు కవిగారు!

కాని ఇంత నిస్సహాయమైన నిర్వేదమునందును కావ్యపుకమనీయత యెంతోయున్నది. దానికి పెనవేసిన 'నీటిలో కమ్మదనము వారు చుండును' అను అంతస్తత్వమును కవిగారు మఱువకుండుటయే కారణము.

"గుండె జలదరింపజేయు దండతనము తుల్చివేయు
ఖండితవాదిని జేయును దండితల్లి సుమ్మినది!"
"నిండుమనసు నిదాయితీ-దండిచేయి ధర్మదీక్ష
పండువయసు పట్టుదలా-పండించును గుండెలలో."

అను నమ్మకము వీరి కావ్యకామనీయక బలమునకు చేయూత. ఇతర

సీమల వారికీ గుణములు ఎంతవఱకు ఉన్నవి, ఆ దేశాలలో దరిద్రదేవత ఏయేరీతులలో తాండవించుచున్నది అను చింత, చర్చ ప్రకృతవిషయము కాదు. పైగుణములు రాయలసీమవారి కేమాత్ర ముండినను వారు మరల చేతరించుకోగలరు. 'సమానానా ముత్తమశ్లోకో అస్తు' అను వైదిక మంగళాశంస యెట్లున్నను 'సమానానాం సమానశ్లోకో అస్తు' అనుకో గలిగిరేని రాయలసీమవాసులు ఎవరికిని తలవంచ బనిలేదు. అనారు పెరగు కాలము వచ్చినది. పంటగూడ ఎంతో దూరమున లేదు.

శ్రీ విశ్వంగారి వివిధ విస్తృత వాఙ్మయసేవను చవిచూచుచున్న తెలుగువారు ఈ చిన్నకావ్యమునందలి పెద్దహృదయమునకు తప్పక స్వాగతమిత్తురు.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

గంగిరెద్దు

పల్లా దుర్గయ్య

చిన్నతనమున ఎన్నడో పల్లెటూరి జీవితమున చూచి అనుభవించి, ఆనందించినదిు పట్టణాల ప్రపంచములో పూర్తిగా మరచి పోయినది గంగి రెద్దుల ఆట. దానిని మరల ఆధ్యాత్మికముగా ఆద్యంతముగా నేడు నేననుభవింపగలిగినాను. శ్రీ పల్లాదుర్గయ్యగారి ప్రతిభాదేవి పెట్టిన ఈ పుణ్యభిక్ష చేత. ఆ నాళ్ళ లౌకిక వినోదము ఈనాటి యలౌకిక రసముగా పరిణమించి హృదయప్రశాంతి సాయించినది.

దుర్గయ్యగారిది యిదొక సాహసమైన ప్రయత్నము. అది ఇంత సర్వాంగీణముగా, ఇంత మధురముగా ఫలించుట సరస్వతీవిలాసపు వింతలలో నొక్కటి. "పాలవెల్లి"లో పలువిధములుగా చిందులు త్రొక్కిన వీరి కావ్యకళ ఈ 'గంగిరెద్దు'లో పరిపక్వమై ప్రశాంత మధుర గంభీర రూపము దాల్చినది. రసమయమైనది.

'రమ్యం జుగుప్సిత ముదార మథాపి నీచం
ఉగ్రం ప్రసాది గహనం వివృతంచ వస్తు-
యద్యప్యవస్తు-కవిభావక భావ్యమానం
తన్నాస్తియన్న రసభావ ముపైతిలోకే'

[దశరూపకమ్. పరిచ్ఛే. 4. ప. 79]

[అందమైనది గాని, అసహ్యమైనది గాని, చిన్నది గాని, భయంకరము

పీఠిక, 1956.

తెలంగాణా రచయితల సంఘం, హైదరాబాదు.

గాని, ప్రసన్నము గాని, మఱుగైనది గాని, స్పష్టమైనది గాని వస్తువు, మరివస్తువు కానిదైనను సరే భావన చేయగల కవి భావించినపుడు రసముగా పరిణమింపనిది ఏదియు లోకమున లేదు]—

అని ధన జయుడు కట్టకడపటిదిగా చెప్పిన రసవేద మహావాక్యము ఎంత సత్యమో, ఈ కావ్యము చదివి యనుభవింప గలవారికి గోచరమగు.

నా చిన్న యస్సులో ఎప్పుడో ఏదో యొక పల్లెకు ఎద్దుబండి మీద ప్రయాణము చేయుచుండగా మార్గమధ్యమున ఒక ప్రామనీడలో గంగి రెద్దుల వాడొకడు కాబోలు బసవన్న కా విద్య నేర్పుదృశ్యమును చూచి నాను. ఎడమచేత ముకుర్రాడు కుడిచేత లావైన బడితెయును పట్టుకొని వాడు దానిని శిక్షించు నృశంసత, ఆ నోరులేని జీవి పడుచున్న యాతన నేనెన్నడును మరువలేనిది. అది మొదలుగా గంగిరెద్దుల ఆట చూచుటకే నాకోర్కిపోయిన్ది. ఇంటిముంగిటికి వచ్చిన వెంటనే వానిమీద ఏపాత వస్త్రమో పాఱవేసి తప్పించుకొనుట నాపరిపాటి. ఈ కావ్యమున గంగిరెద్దుకు శిక్షాచార్యుడైన భిక్షుకుడు "సామదానదండ చతురోపాయ ములగుచు [పు 63]" నేర్చినాడని మాత్రము సూచించి దండోపాయమును వివరింపక విడిచి కవిగారు తమ హృదయ సౌకుమార్యమును వెల్లడించిరి:

ఈ హృదయ సుకుమారత్వమే ఈ కావ్యమున ఆమూలాగ్రముగ ప్రతిఫలించినది. ఊరి కరణమయ్యది "ఒకానొక చక్కని పాడియావు". ఒక పేద కాపుదంపతులు దానిని కోరుకు తెచ్చుకొని పోషించుచుండిరి. పెరుగుపాలన్ని కాపువే. పెయ్యలన్ని కరణమయ్యవి. మగదూడ కావు పాలు. పెయ్యలన్నియు కరణమువే అన్నపుడు మగదూడలు కూడ పుట్టిన వన్నియు కాపుపాలికి రావలసినవే. కాని కవిగారికి ఏకవచనము చాలు ననిపించినది. వారి కవికర్మ కది చాలును గనుక. ఎంతో మధురమైన ప్రేమతో ఆశతో ఆ కాపుమిథునము ఆయావును పోషించినారు. దాని తొలి చూలు పెయ్యదూడయేయైనది. మలిచూలికైనను "కోడెయే పుట్టును గాక

వీనికి ప్రభూ" అని కాపు మొఱపెట్టుకొన్నాడు. అతని యిల్లాలు మాత్రము పెయ్యకన్న కోడె మేలని యంగీకరించుటకు సహజముగా ఇష్టము లేక- ఏదైనను సరే యని యుండినది. మఱి పెయ్యలమీదనే అభిమానము. ఆమెకు మొగ్గినదని కూడ చెప్పవచ్చును. మలిచూలున పుట్టినదేమో కోడెయే. కాని దానికి మూపురము మీద ఐదవకాలు, రెండు తోకలు! అదే ఈ కథానాయకము.

ఈ వింతజంతువును సృజించుట యందు బ్రహ్మకేమి యుద్దేశ ముండినదో, తెలియదు గాని కవికి మాత్ర మొక్క గొప్ప భాప మున్నది. గోవు ఆవైనను, ఎద్దయినను మనుష్యుని చేతిలో చిక్కి వడుచుండు శోచనీయమైన యవస్థ చాలా దారుణము. ఈ వింత కోడెదూడ ఈ కవిప్రతిభా ప్రపంచమున రెండు పూర్వజన్మము లెత్తినది. మొదలు ఆవుగా రెండవ తూరి యెద్దుగా, ఆవై పుట్టిన తొలినాళ్ళలో ఎంతో గారాబుగా గోముగా పెంచిన కాపు ఆది చూలై ఈనిన పిదప పాలకై దానిని నానా బాధలకు లోపఱచును. దాని ముద్దుదూడను, తల్లిపొదుగును కాకసీయక, తప్పకాగి కాకినప్పుడు తల్లిపిల్లలకు రెంటికిని "దుడ్డుపూజ" చేయుచుండెను. "ఈత లుడిగిన పిమ్మట గీతనడుగు కాటి వానికి నమ్మ కొక్కమ్ము గొనియె, అందు మీద 'ఈ అడజన్మ నే నోపగ జాలనంచు' గట్టిగా సంకల్పించి రెండవ జన్మమున అచి కుఱ్ఱయై పుట్టినది. కాని అప్పటి కాపు దాని కిచ్చిన గతి "ఓలు కొక ప్రక్కనె-మద్దెల కెంచి చూడ నిర్వాపుల గూడ దెబ్బ లను వైఖరి" గా సాగినది. దాని నాల్గవవీటి సేద్యమునకై దానిని తయారు చేయ ప్రణాళికలో రైతు—

"ముక్కునకు ప్రాడు విగియించె, ముందువెనుక
కాళ్ళ బంధించి నాల్గుడెక్కలకు నినుప
నాడెములు గొట్ట నంత బోనాడ కకట!
యెందు కక్కఱ రాకుండ యెద్దుగొట్ట!!"

కడపటి ముక్తాయముగా వంగతోటకు నీరు పెట్టుటకై బావి కపిలెకు దానిని గట్టి తోలుచుండ బొక్కెన మునుగ కుండుటచే ఎందుకోయని రైతు బావిలో

తొంగి చూచినప్పుడు ఆ మోట గుట్టకూలినది. ఇద్దరి గతి "సహ్యా ప్రవృత్తిః సహ్యా నివృత్తిః" ఐనది. ఆ గోజీవనము "రోసి దేవుని కడన్ మాటాడి" మొక్కినది. ఏమి మాటాడినదో కవిగారు చెప్పలేదు. కాని ఆవు జన్మమందైనను, ఎద్దు జన్మమందైనను, పూర్వవయస్సున రైతు పెంపకము నందలి బుజ్జగింపుల చవి యెఱింగిది గనుక ఆ సుఖములుండి, యీ కష్టములు లేని గోజన్మమే, మరల తనకు వర మిమ్మని అది దేవుని వేడు కొన్నదని మన మూహింపవచ్చును. దేవుడు వరమే యిచ్చినాడు. దాని ఫలమే యీ భవిష్యద్భవన్న జన్మము. ఈ విపరీతపు పుట్టువు కన్నతల్లియావుకే "యెద చుమ్మలు చుట్టగ బొక్క" నంత దుఃఖము నిచ్చినది. పశు పక్ష్యాణులలో గూడ పరీత-విపరీత జ్ఞానముండక తప్పదన్న రహస్యము ఈ కవి భావింపగలిగినారు. వానికిని నాల్గు కాళ్ళును ఒక తోకయు ఉండుటయే జాతియందమన్న శైలివి యెట్లు లేకపోవును? దానికి విరుద్ధమైన యీవీపుకాలు, ఈ యిరుదోక వికారముగా ఎట్లు దోపక పోవును? కాని మమకారము గ్రుడ్డిది గాదా! మఱి—

".....పుట్టిన పిమ్మట నెట్టి పసిన్
వెట్టిగ బారవేయ పదివేలొకొ చేతులు కన్న తల్లికిన్!" కావు, నిజముగా గావు.

కాని గంపెడాస పెట్టుకొని యీ యెద్దును గట్టుటకు నాగలి సిద్ధము చేసికొని యున్న కాపు దీనిని చూచి నిరాశతో బావురుమని యేడ్చినాడు. వాని యిల్లాలు 'తన కనులనీరు పయ్యెద కొనల నొత్తి' తిన్నగా మగనిని పేదరికము, అడతనము, మగని మీది పేమ, ప్రాయపువయస్సు ఇన్నిటి వేదాంతాలు కలిపి యూరడించి పుచ్చినది. తల్లియావుగూడ దూడ పూర్వజన్మ వృత్తాంతమును దాని నోటనే పని తృప్తిపడి

పూర్వజన్మల దేవదేవు దరిసించి
అందగంటివి నీయిష్టమైన జన్మ
నీవు సామాన్యుడవె వత్స! నిన్ను మోసి
కనుట నా జన్మమదియ పావనమె యయ్యె!"

అన్ని పసులకును, కాపులకు గల మధురబాంధవ్యమును గూర్చి మంచినీతులు దూడని కుపదేశించి కాలక్రమమున కన్నులు మూసికొన్నది.
వానిచే దూడకు —

అమ్మలేని యిల్లు నడవియై కనిపించె
కానతోచె వల్లకాడ కరణి
ఇంట నడవి రెంటనుంట సంకటమె యై
ఊరు విడిచి పోవ నూహ చేసి!
కట్టు విప్పుచున్న కాపును కడసారి
కాంచె కనులనీరు గ్రమ్మ కొనగ
ఇంటి నాల్గుతట్టు లిట్టుట కనుగొనె
బంధములను దెంప వశమె యకట!

ఈ చొఱవ దానికి గలుగుటకు మఱొక్క కారణము ఊరిలోని వారందఱును, దాని పక్కన వింతగా చూచుట, హాస్యము చేయుట, కుళ్ళికారు అల్లరిపెట్టుట, చిల్లపెంకులు రువ్వుట ఇత్యాది అనుభవములు. తుదకు 'పసులకాపరి' గూడ తల్లిపిల్లలను తిట్టి మొదలు పెట్టినాడు. అందుకే అది రోసి యిల్లు ఉడాయించి

తరువాత అది అడవిలో అనుభవించిన స్వతంత్రత, మేసినమేత, తిరిగిన తిప్పలు, చూచిన చూపులు, పడిన భయము తల్లియావు ఆధ్యాత్మికముగా ప్రత్యక్షమై దారిచూపుచు ఒక పల్లెటూరి రచ్చపట్టుకు తీసికొనిపోయి విడిచి అంతర్ధాన మగుట-అక్కడ అటుమాపుచున్న గంగిరెద్దులవాడు దానివింత రూపము చూచి సంతోషించి కొలిక్రితాడు విసరివేసి మెల్లగా స్వాధీనము చేసికొనుట వానివద్ద దాని విద్యాధ్యయనము, సంక్రాంతి పండుగనాడు పల్లెలో దాని విద్యల కౌశల ప్రదర్శనము, దానికి వచ్చిన బహుమాన గౌరవములు, తుదకు తాను పుట్టిన పల్లెకే వచ్చి అది తన్ను వెక్కిరించి వేధించిన వారి చేతనే ప్రొక్కులుగొనుట, తన్ను పెంచిన కాపు దంపతులు గుర్తుపట్టియెంతో సంతోషపడుట-ఇవన్నియు ఈ కావ్యమందు సవిస్తరముగా సరసలలిత మధురముగా సహృదయమును చదివి యను భవింపగల వస్తువులు. సామాన్యకవులు గ్రహించుటకును తోచనివి, ఈకవి

గ్రహించి అసామాన్యముగా చిత్రించినవి. ఇందు కవిగారు చూపిన సంయమము, పదసంగ్రహణము, అర్థభావము లందలి సామనస్యము చాలా కమనీయములు.

అందందు నీతిబోధ చేయునప్పుడింక కొంత యెక్కువగా సంయమము చూపి యుండినచో ఈ కావ్యమందలి చిక్కదన మింకను హృద్యముగా ఉండియుండెడిది, అట్టే కథారచనలో చౌకరకపు నవలలు వ్రాయువారివలె, ముందు తానే చెప్పబోవు విషయములు తనకేమియు తెలియనట్లు కవి నటించుట ఇందొకటి రెండు చోట్ల కానవచ్చెడిని. ఈ గంభీర కావ్యములో ఆ చక్కదాలు అగ్గువ సరుకులై యున్నవి. శాక్కరము, ఇట్చరము మొదలగు పదములు ప్రయోగించుట గూడ కవిగారు వదలి యుండిన మేలయ్యెడిది. సంస్కృత భాషలోనే యెన్నడో యెక్కడనో కన్నులు మూసుకొన్న శబ్దాలివి. వాని రెప్పలు బలవంతముగా తెరచి ఫలము లేదు. మాండలికములైన కొన్ని వింతమాట లిందు వాడబడినవి. వానికి ప్రత్యేకముగా అర్థము ప్రాసి నావంటి అన్యమండలము వారి కెంతో సాయపడినారు. "సేద్యమ్మాకు" 'ప్రయాణమ్మాకు' వంటి ప్రయోగములు అట్లు గ్రాంథికములు ఇట్లు వ్యావహారికములు గాని రేవణులు. 'హైతుకు' అన్న దానిలో ఉన్న సరళత వానిలో లేదు. ఇవిగాక అందందు చొరవతో కవిగారు చేసిన వ్యావహారిక సంకరము శయ్యతో చక్కగానే అతుకు కొన్నది.

పై విషయము లెట్లున్నను ఈ కావ్యము ఆపాత మధురము, ఆలోచనామృతము గూడ. దీని కుపోద్ఘాతము తప్పక వ్రాయవలయునని నన్ను ప్రణయముతో నిర్బంధించిన రసిక కవిద్వయము శ్రీదాశరథి, శ్రీ నారాయణరెడ్డి వారికి నా ధన్యవాదములు. ఎందుకనగా ఈ వ్యాజముతో వారు నాకీ కవితారసానుభవము గల్గించినారు గనుక.

○—○—○

తెనుగు మీరా

ఓరుగంటి రామచంద్రయ్య

నవ్య కవితావేశ మావరించిన నా చిన్నతనమందు ఎప్పుడో "మీరాబాయి" అను పేర చిన్న పద్యకావ్యము రచించి ప్రకటించియుంటిని. నాటికి గాని నిన్న మొన్నటి వరకుగాని నాకు మీరాబాయి సంకీర్తనములతో గాని చరిత్రముతో గాని యెట్టి పరిచయమును ఉండలేదు. ఎవరో చెప్పగానో ఎక్కడనో చదువగానో తెలిసికొన్నది ఆ కథ. హిందీ భాష యందు గాని హిందూస్తానీ సంగీతమందు గాని నాకుగల పరిచయము అతి స్వల్ప మగుటయే అందుకు ముఖ్య హేతువు. కొన్ని దినముల క్రింద శ్రీ ఓరుగంటి రామచంద్రయ్యగారు ఐదంపర్యముగా నావద్దకు వచ్చి యిందు ప్రకటితము లైన, తాము తెలిగించిన మీరా పాటలను పాడి వినుపించువరకు నా యజ్ఞానపు నష్టమెంత గొప్పదో నాకవగతము కాలేదు. ఇప్పుడు అవగతమై నను ఇక మీద నేను హిందీ భాషను నేర్చుకొనుట అసంభవము గనుక మీరాదేవి మాలకృతులను నేరుగా చవిచూచు భాగ్యము నాకుండదు.

కాని ఆనిర్వేనదమునకవకాశము లేక చేసినారు రామచంద్రయ్యగారు. వారి తెలిగింపు స్వతఃకమనీయముగా నున్నది. భాషాంతరీకరణములందు సామాన్యముగా కానవచ్చు అన్వయక్లేశములు, అసాంప్రదాయికము లైన నడకలు, అధ్యాహార కాంక్షలు ఛందస్సంకరములు మొదలైన అవల యము లిందెక్కడను కానరావు. మీరాబాయి తెలుగులోనే వీనిని రచించి-యుండవచ్చు ననిపించును. భాషాంతరీకరణము గూడ ఒక విశిష్టమైన

పరిచయము, 1956.

స్వతంత్ర కళ యనుట ఇక్కడ గమనింప వచ్చును. మూల రచన యందలి సారమైన భావమును, ఆర్జవముతో ననుభవించు సహృదయత, దానిని తమదిగా తమ భాషలో పునశ్చర్వణగా భావించు శక్తి, స్వభావ మర్యాదలు చెడనీయక దానిని పున స్సృష్టిచేయు స్వతంత్ర కావ్య కౌశలము ఇవిగల వారికి మాత్రమే అట్టి రచన సాధ్యము.

ఈ రచన యింత హృదయంగమముగా నుండుటకు ఇంకొక ముఖ్య కారణమున్నది. మూలరచన గేయ రూపము గనుక తెలిగింపు గూడ గేయమున హిందూస్తానీ రాగతాళములలోనే ఈ తెలుగు రచనను బంధింపక, తమకు సన్నిహితమై ప్రియమైన కర్ణాటకపు వరుసలలోనే ఈ కూర్పు భావించి సాగించినారు. సింధు భైరవి, కమాను మొదలైన కొన్ని రాగాలు పొత్తరాహాలైనా అవి మనలో చేరి మనవై పోయి యెంతో కాలమై నది. 'తిలక్ కామోద్' ఒక్కటే ఇందు పచ్చి హిందూస్తానీ రాగమనుకో వచ్చు. కాని అవి కూడ, నేడు "యదుకుల కాంభోజి" యనియు, కొంత కాలము క్రింద 'ఎరుకల కాంబోది' యన్నియు, ఇంకను పూర్వకాలమున 'తెలుగు కాంబోది' యనియు, పేర్కొన బడిన మన రాగమే ఉత్తర దేశము చేరి నామరూపాలు కొంచెముగా మార్చుకొన్నది. కనుక అందు పరకీయ మను భ్రాంతి మన కక్కర లేదు. మూలమైన మీరాదేవి రచనల రాగ తాళములే నేడును వాడుకలో నున్నవని యెవరును చెప్పలేరు. జయ దేవుడు, పురందరదాసు మొదలగు వారి గేయముల వలెనే యివి గూడ భిన్నరుచి సంప్రదాయ జ్ఞానాదులకులోగి ఎన్నో మార్పులు పొంది యుండక తప్పదు. కనుక ఇప్పటి మీరాపాటల హిందూస్తానీ సంప్రదాయమునే తెలుగు రచనకును అతికించుట అర్థములేని పారవశ్యము.

రామచంద్రయ్యగారు వహించిన యీ రాగ తాళ రచనా స్వాతంత్ర్యము ఈ పాటల యందు మనకు ఆత్మీయతను సంపాదించి పెట్టి నది. మరియు ఇందుపయోగించినవి గూడ ప్రస్తార సిద్ధములైన గణిత రాగతాళములు గావు; కేవలము పామర శ్రవణములను హృతము తృప్తి పరుచునట్టి, సంస్కార శుద్ధి లేనట్టి, యిప్పటి సినిమా వరుసలును గావు. మరి పరంపరా శుద్ధములై, గంభీర భావములను స్ఫురింప జేయగలిగి

ప్రాచీన వాగ్గేయ కారకులాదరించిన రాగతాళము మార్గములే వీరిందాదరించిరి. తాళములందును చతురశ్రపు నడక కంటె ఖండ మిశ్రగతులుగల 'చాపు' తాళములే యీ పాటలలో ఎక్కువగా పరిగహింప బడినవి. సమమైన చతురశ్రమునకంటె విషమమైన ఖండ మిశ్రత్యశ్యములందే దాక్షిణాత్యులైన మనకెక్కువ ప్రీతి యనుట అనుభవ సిద్ధమైన విషయము. జాతీయమైన యీ అభిరుచికి, అభిమానమునకు, హేతువునూహించుట సులభము కాదు, మరి అనుభవ రసికులకు తత్వమేకాని తర్కముతో పని యుండదుగదా.

మరి రామచంద్రయ్య గారి బుద్ధి విశ్వకళా పరిషత్తుల రాయిడిచే ఎంత నిశితమో అంత వారి హృదయము సహజమై ఆధ్యాత్మికచింతా వేదనలచే ఆర్ద్రమైనది. ఆ వేదనలే వీరిని శ్రీరమణ మహర్షి సన్నిధికి చేర్చినవి; ఆయన వాత్సల్యమును అనుగ్రహమును సంపాదించి ఇచ్చినవి ఆ మహనీయుని మీద అసాధారణ భక్తిని గలిగించినవి.

'భగవాను నామంబు భజియించు వేళ
గనులనశ్రులు గ్రమ్మ, గాసంతలోన
గర్వించి ననుబోంట్లు గలరె భక్తాళి
సుకృతులంచని చొక్కి సోలుచునుందు" (రమణ స్మరణ పు15)

అని యొకచో వీరే వ్రాసిరి. ఈ అశ్రులు, చొక్కుటలు సోలుటలును ఎందరకో కావ్యరచనా కాలమందు మాత్రము వచ్చెడి ఆధ్యాసములు. వీరి కవి పరవశముగా అనుభవించి తీరవలసిన అంతరంగిక సత్యస్ఫురణలు. సాధారణ పండిత జీవితమును గూర్చి,

"పదము పదము పదము పదడాలమే కాని
హృదయ బాధల సుంత యేని లేదు,
వ్యధ యెఱుంగ లేని బ్రదుకువ్యర్థమ్మురా
రమణ లీల లెఱుఁగ రావె మనస!"

(రమణ స్మరణ పు. 24)

అని వీరు నిర్వేదపడినారు. కనుకనే మీరాదేవి పాటలలో ఆచ్ఛముగా ప్రతిఫలించు అపురూపమైన ఆమె హృదయ వేదనను ఈ తెలుగు రచన కెత్తి పెట్టి మనకందీయ గలిగినారు కాబట్టి అట్లు చేయుటలో మూలరచన యందలి శబ్దార్థముల విశిష్టతను పూర్తిగా వీరు మార్చి తెచ్చినారో, లేక కొన్నిటిని వదలి మరి కొన్నిటిని సొంతముగా కలిపినారా, అందువలన అసలు రచనకు విరుద్ధములైన విషయము లేమైనను ఇందు చేరుకొన్నవా ఇత్యాది ప్రశ్నలు నావంటి వట్టి తెలుగు వారికి కలుగు నవకాశముగాని అక్కరగాని ఉండదు. హిందీ మూలముతో గూడ ఇరుగు పొరుగులుగా తెలుగు పాటలను ముద్రించినారు గనుక ఉభయ భాషా విశారదులు రెండి స్వారస్య వైరస్యములను చర్చించు కోవచ్చును. హృదయ వేదనా ప్రధానమైన సారస్వతమందు నాదృష్టిలో అది శుష్కమైన బహిరంగచర్చ.

పాటలలో సామాన్యముగా కానవచ్చు యతి, ప్రాస, పల్లవాను పల్లవ చరణాల పరస్పర సంబంధము మొదలగు సంప్రదాయాలను ఇవ్వట వీరంతగా పాటింపలేదు; యథావకాశముగా యథానుకూలముగా నిర్వహించు కొన్నారు. ఇట్లే ఈ పాటల భాషగూడ సామాన్య పద సారస్వత సంప దాయమునకు కొంత విరుద్ధముగా, ప్రాచీనమై సంస్కృతమైన తెలుగుగానే యేర్పడినది. కాని పై సంప్రదాయములన్నియు ఇంకను 'శాస్త్రము' అంతస్తు కెక్కి యుండలేదు గనుక ఈ రచనా స్వతంత్రత యెవరికి గాని ఉద్వేజ కము కానక్కరలేదు. మరి ఈ అసామాన్యత మీరాబాయి భావములందలి యసామాన్యతతో చక్కగా అతుకుకొని పోయినదనియే చెప్పవచ్చును. భావములు తమవైనపుడు గూడ గౌణముగానే యుండక తీరని ఈ నియ మాలు పరభావ పునశ్చర్వణా పారవశ్యమందు రచయిత దృష్టిలో ఇంకను దుర్బలములు కాక మానవు. రామచంద్రయ్యగారు ఈ రచన యందు సాధించిన చక్కని చిక్కదనమునకీ శైథిల్యము ఒక యలంకార ముగానే పరిణమించినది.

రామచంద్రయ్యగారు ఈ పాటలను పాడి వినిపించినప్పుడు వీనివి స్వర తాళములతో ప్రకటించుట మేలని చెప్పితిని. ఆ కైంకర్యమునువారు నాకే ప్రీతితో నిచ్చినందున ఈ పాటలకు యథాశక్తిగా ఆ రెంటిని సూచించి

తిని. ప్రభావములగు కర్ణాటక రాగముల స్వరూపమును స్వరూప ములతో పూర్ణముగా వెలువరుచుట యసాధ్యము. సంగీత కళలో వ్యుత్పత్తి లైన వాసనాపరిపక్వబుద్ధులకు ఇందలి సూచనలు చాలునని నానమ్మకము. స్వరపరచుటలో ఇందాశయింపబడిన పద్ధతి మన దేశమందలి బయ కారులందఱును అంగీకరించినది.

ఇది చాలక ఉపోద్ఘాతము గూడ ప్రాయవలెనను వారి నిర్బంధ ప్రణయమును తప్పించుకోనేరక యీనాల్గు మాటలు వ్రాసితిని.

ఇక స్వచ్ఛందముగా మీరాబాయి కథను ప్రాసిన నేను ఈ సంద ర్భమున ఆ మహానీయురాలి సత్యచరితము నుల్లేఖించుట ధర్మము. కాని నా కా వివరము లేమియు తెలియవు. నా మిత్రులు ఆంగ్ల సంస్కృతాంధ్ర హిందీ భాషా పరినిష్ఠితులు శ్రీ అయాచితుల హనుమచ్ఛాస్త్రిగారు వానిని తెలిపిరి. ధన్యవాదములతో వారిచ్చిన ఆ చరిత్ర విషయములనిందను వాదము చేయుచున్నాను.

"ఆళ్వారుల కంఠనాళములనుండి వెలువడిన విష్ణుభక్తి సుధాస్రవంతి దక్షిణ భారతమునే గాక శ్రీరామానుజులు నింబార్కులు విష్ణుస్వామి మొదలగు నాచార్య పురుషుల వారిశిష్య ప్రశిష్యుల, అమృతబోధముల ద్వారా ఉత్తరభారతమును గూడ పవిత్రము నొనరింప సాగెను. కాగా కాశిలో శ్రీరామానందులు తమ ద్వాదశ శిష్య వర్గము ద్వారా జాతి ప్రాధాన్యము నిరసించి హరిని భజించువాడే హరికైన వాడు అని చాటుట కారంభించిరి.

వంగదేశమున శ్రీచైతన్య ప్రభు శిష్యులగు రూపసనాతన, జీవగోస్వాములు మధురభక్తిని ప్రసారితము గావించుచుండిరి. ఏదియెట్లైనను ఆ భక్తి ప్రవాహములు రాజస్థానమునందలి మరుభూములలో ప్రభావ రహితముగా ఇంకిపోవుచుండెను. మీదు మిక్కిలినాటి రాజస్థాన వీరులు రక్తమున వసంతో త్సవమాడి తమ జన్మములు కృతార్థములయ్యెనని భావించుచుండిరి. రాజస్థానము భక్తిధర్మమునకు అగ్నిపరీక్షగా 'జౌహర్' గుండముల నేర్పాటు చేసికొనెను. అట్టిచో ప్రస్తరప్రదేశమున పచ్చిక బయలు మొలచి నట్లు అవతరించి, రాజస్థాన సామాన్యజనుల శుష్క జీవితములను భక్తి

ప్రవాహమున జీవన రసస్నిగ్ధముగా నొనరించిన తపస్వినీమణి మీరా.

మీరా జీవిత ప్రసవంతి మూడుపాయలు (1) జన్మ మొదలు వైవాహిక జీవనమువరకు. (2) భక్తి పథమున ప్రవేశించి సంఘసంఘర్షణల రాటుదేరి లోకభావనల నతిక్రమించుట (2) మాధుర్యభావమున చరమ స్థితిని ప్రాపించుట.

మేడ్తారాజ్యాంతర్గతమైన కుట్కి గామమున రాఠోరురావు దూదా పుత్రుడగు రత్నసింహునకి మీరా జనించెను. జనన కాలము 1559–60 విక్రమ శక పూర్ణాంతము*. తల్లి చిన్నతనముననే గతించెను తాతయైన దూదో చతుర్భుజ దేవుని భక్తుడు. తల్లి చనిపోయిన పిమ్మట మీరా తాతగారి యొద్ద పెరిగెను. రావువీరమదేవుని జ్యేష్ఠపుత్రుడగు జయమల్లునితో ఆమె చిన్నతనపుటాట పాటలు వెలసినవి. అప్పటి శ్రీ రాధాకృష్ణుల పెండ్లియాట లతో మీరా యప్పుడు తానై గిరిధరగోపాలుని వరించుకొన్నదో చెప్పలేము. 1572 విక్రమ శకవత్సరమున రావు దూదా గతింపగావీరమ దేవుడు శాసకు డయ్యెను. 1573లో మీరాకు మేవాడ ప్రభువగు రాణాసాంగా (సంగ్రామసింహ) జ్యేష్ఠకుమారుడగు భోజరాజుతో వివాహము సంపన్న మయ్యెను. కాని యా సౌమంగల్య జీవితమామెకు చాలకాలము సాగలేదు. 1580 ప్రాంతమున భోజరాజు మరణించెను. పిమ్మట మీరాభక్తిప్రభావము స్వచ్ఛందముగా రాజపుత స్థానమున ప్రవహింపసాగెను. వీరమదేవుని రాజ్యాధికారులు నిష్కల్మషమైన మీరా జీవిత ప్రవాహము నడ్డగించి కలు షితము జేయ ప్రయత్నించిరి. అసలే స్త్రీ; అందులో విధవ మీదు మిక్కిలి రాజవంశము. ఒకదానికంటె వేరొకటి బలవంతమై యామె మార్గము నవరోధింప ప్రయత్నించినవి. కాని యీ యడ్డంకులచేత ఆమె హృద

---

*ఇందభిప్రాయ భేదములుగలవు:

1560 విక్రమ సంవత్సరమని వ్రజరత్నదాసు.

1554 విక్రమ సంవత్సర మని భవానిశంకరద్వివేది

1573 విక్రమ సంవత్సరమని రామచంద్రశుక్ల

1559–60 విక్రమ సంవత్సరమని డాక్టరు కృష్ణలాలు.

ముయ విచలితము కాలేదు. మొగలుల సామ్రాజ్య బలమును వణకించు రాజపుత్ర శక్తి మీరా హృదయ ధైర్యము ముందు వ్యధయయ్యెను. 1590 లో ఆమె వీరమదేవు నాజ్ఞకు లోగి మేవాడును వదలిపెట్టెను. 1595లో గిరిధర గోపాలుని లీలామానుష కీడారంగమగు బృందావనము చేరి పరమ ప్రియుడైన ఆ దేవుని భజనము చేతను సంకీర్తనముల చేతను అచ్చట ప్రత్యణువును పవిత్రముచేసెను. అంతకు పూర్వము ఆమె హృదయముపై నిర్గుణవాద ప్రభావముకలదు. అప్పుడామె 'గగనమహలులో శూలశయ్య' పై ప్రియునితో గూడి శయనింప గోరినది. కాని బృందావనము చేరిన పిమ్మట జీవగోస్వామి రూప సనాతనుల చైతన్య మతమునకు చెందిన ప్రేమభక్తిని, సూరదాసుని వల్లభ సంప్రదాయము నందలి మధుర సఖ్యభావములను ఆకళించుకొనెను. నాటినుండి ఆమె ప్రకొత్త మీరా. ద్వాపరమందలి సర్వగోపికలును, ఈమెగా నవతరించి శ్రీకృష్ణ ప్రేమ వారాన్నిధిని మునిగి పారముచేరి, తల్లీలాపారమ్యమును లలిత లలితముగా మృదుల మృదులముగా, అచ్ఛమగు స్త్రీ హృదయముతో, వెన్నవంటి నుడికారపు సొంపుతో పాడి బృందలోని దశదిశలను ప్రతిధ్వనింప జేసినది.

విక్రమశకపు 1600 ప్రాంతమున ఆమె బృందను వీడి ద్వారకయందలి 'రణఛోడ' మందిరము చేరెను. ఆ నాటికి ఆమె రమ్యకీర్తనలు నలుదెసల వ్యాపించెను. భక్త శిఖామణులగు హిత హరివంశ, హరిరామ్ వ్యాస్ మొదలగువారు ఆమె దరిజేరి ఆమె భక్తి భావమునకు ముగ్ధులై అంజలి ఘటించుచుండిరి. తీర్చిన తేనెతేటల బురుడించు గానముతో మెదిపి హృదయములందలి అమాయికమై పవిత్రమైన భక్తిభావమును శారద చంద్రిక వలె చల్లగా ప్రసరింప జేసిన మీరా జన్మము ధన్యము, ఆమె రచనలు హిందీ సాహిత్య వీధులందాచందార్కము మురళీ గోపాలుని కాలియందెలరవళులై మ్రోయించుచునే యుండును. 1630 ప్రాంతమున ఆమె భౌతిక జీవితమును చాలించుకొన్నది."

హిందీ పద సాహిత్యమున ఆమెకుగల స్థానము ఎన లేనిది. ఆమె

భావములు అకృత్రిమ రత్నములు. సూరదాసువలె ఆమె యెప్పుడును 'కూటపదములు' రచింపలేదు. మరి అతని రచనలలో 'అద్భుత ఏక అనూపమబాగ్' 'ఉపమా ఏ కన వైనగహి' మొదలగు పదములందున్న కావ్యకళా చమత్కారములు ఆమె పదముల నెచ్చటను గానరావు. కావ్యచమత్కృతములు తనకును తన ప్రియునికిని అడ్డువచ్చు శబ్దజాలము ఆమెకు గిట్టనే గిట్టను. భావము సూటిగా బైలు వెడలి కృష్ణుని యురమున మాలలు మాలలుగా పరియుటే యామె లక్ష్యము. అది యామెకు అప్రయత్న సిద్ధము.

ఈమె జీవితమందలి జనశ్రుతులు: మేవాడ్ రాజగురాణా యామెకు పాము తోడి పెట్టె విషప్రాత మొదలగునవి పంపుట, తులసీదాసు కీమె పత్రము వ్రాయగా అతడు 'జాకే ప్రియనరామ వైదేహి' అను పదముతో ప్రత్యుత్తర మిచ్చుట; జీవగోస్వామికి ఈమె 'గోవిందు డొకడే పురుషుడు' అని తీక్ష్ణముగా జవాబిచ్చుట మొదలగునవి పుక్కిట పురాణము లేయని డా. కృష్ణలాలు గారి నిశ్చితాభిప్రాయము.

తరువాతి వారీమెను తమతమ సంప్రదాయముల పాలొనరించుకో జూచిరి కాని; పరమ ప్రేమ మార్గమే యామెదనుట నిష్కృష్టార్థము. ఈమె జీవితమున గురుదీక్షా సంస్కారములు కానరావు.

ఈమె రచించిన ప్రతిపదమును భక్తిరస భోగ్యమైనను-

"మేరేతో గిరిధరగోపాల దోసరనకోయీ
ఐసో మేరే నైనన్ మే నందలాల్
జోగి మతజా మతజా
హారీ మైతో ప్రేమ దివానీ
మ్హార్ చాకర్ రాఖ్ జీ"

మొదలగునవి అత్యంత ప్రసిద్ధములు, వానికన్నిటికిని ఇక్కడ చక్కని అనువాదము వెలసినది.

తిరుపతి

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ.

సుధాబిందువులు

కుంటిమద్ది శేషశర్మ

రాజుల యాశయమున నెమ్మదిగా ప్రబలికిన కాలమున తెలుగు కవుల లేఖిని శృంగారభావలహరిలో తలమున్కలు వేసి తేలగండ్లు వేసినది. పాశ్చాత్యుల దాస్యమున నీరసమై నిలిచిన నాళ్ళలో విప్లవాత్మకమైన అల్లకల్లోలములు చెలరేగించి ఆవేశముననుభవించినది. స్వతంత్రత సిద్ధించిన తరువాత త్రివర్గమార్గముల మూటను నడవలేక కాళ్ళీచవడు చుండగా చేయునదిలేక సహజముగ సర్వశక్తుడగు శ్రీనివాసుని శరణు చొచ్చి హృదయావేదనలను ఆయన పాదాలపై ధారవోయ చొచ్చినది. అట్టి కవితలలో శ్రీకుంటిమద్ది శేషశర్మగారి యీ లఘుస్తోత్రమొక్కటి.

కావ్యము లఘువేకాని దానివెనుక బోధకముగానున్న నిర్వేదము చాల గొప్పది. ఇది సహృదయు లందఱికిని హృదయ వేధకమైనది.

సంస్కృతాంధ్ర సాహిత్యములందు అలంకార శాస్త్రమునందు నిష్ణాతులగు శర్మగారి చిత్త సంస్కృతి ఇందు ప్రతి పద్యము నందును ప్రతిఫలించినది. ప్రపంచ యోగ క్షేమరసికులగు తెలుగు వారి హృదయములనిది ఆకర్షింపగలదు.

తిరుపతి
9-11-1956

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

తొలిపలుకు, 1956.

సర్వోదయగానము

తుమ్మల సీతారామమూర్తి

శ్రీ సీతారామమూర్తిగారి కవిత స్వతంత్రమైన మాధుర్య సౌరభములు వెదజల్ల గలది. సౌలభ్య, గాంభీర్యములు దాని మూలద్రవ్యములు. వారి నెఱుగని వారుండవచ్చును. గాని వారికవిత నెఱుగని వారు తెలుగు నాటనుండరు. అనగా సాహితీ రసికులలో నన్న మాట. ఎవరైన నుండిరా వారిని దైవ వంచితులన వలయునంతే.

కవులను గూర్చి యీయన యీ 'సర్వోదయగానము'న చెప్పిన పదునెనిమిది చిన్న పద్యములు కవితా వ్యాసంగమునకు దిగిన వారందఱును మంత్రములుగా జపింప వలసినవి. అందలి యర్థ భావములు శ్రీ భావే మునీశ్వరునివే కావచ్చును. కాని వానిని జీవరత్నములుగా దీర్చి యందిచ్చిన పుణ్యము శ్రీ సీతారామమూర్తి గారిది దాని ఫలము ననుభవించు భాగ్యము తెలుగువారిది. కవితాకళ వట్టి వినోదముగానో, జీవికగానో ఉండదగినది కాదని, కవితలమీది బరువు చాల గొప్పదని, పై పద్యములు మూర్తిగారి పరాయణమును పలుదెఱగులుగా చాటుచున్నవి కవి ప్రజాజీవితమును సంస్కరించి నడపు నాయకుడు. అతని 'జీవిత నిష్ఠను ప్రచురించును'. 'అతని ప్రబుకు పల్కులు రవియుస్ రుచియుంబలె నొండొంటికి నుచితాశయమగుచునుండు నుడుగని మైత్రిన్' కనుకనే,

'సంఘమునకుఁ బుష్టి సంతుష్టి, నొదవించు
వెలఁదిపల్కు వాడ వలయుఁ గృతులఁ,

పీఠిక, 1960.

జిత్తశుద్ధి తపము జిజ్ఞాస నేర్వని
కవి కుదాత్త వాణి కానఁబడదు'

'వెలది' అనుమాటకు నిర్మలము అను సామాన్యార్థము కంటె నిర్మలయైన స్త్రీఅనునర్థమే యెక్కువ వాడుకలో నున్నది. స్త్రీల పలుకు తన విశిష్ట విభూతులలో నొకటిగా శ్రీకృష్ణభగవానుడు వెలయించినాడు, 'వాక్చ నారీణాం' అని (గీత. అ. 10) మనకు పుష్టి సంతుష్టులను ప్రసాదించుట స్త్రీ ధర్మము, స్త్రీస్వభావము. త్యాగశీలమైన ఆ ఉదాత్తత స్త్రీల స్వకమందే మాటలందే సర్వదా ప్రతిఫలించు భగవత్తత్వము. మూర్తిగారి యీ 'వెలదిపల్కు' కావ్యము 'కాంతాసమ్మితము'గా రూపొందవలెనన్న ప్రాచీన కావ్యలాక్షణికుల మాటకు చక్కని టీక. వెలది నిర్మలశీల-కాని స్త్రీ గూడ కాంతగాదోపవచ్చును-ఎవరికైన, ఎటో యొకప్పుడు ఘటు వంటి 'కాంత' కావ్యములునాటికి నేటికి ఎన్నియో పుట్టినవి. పుట్టుచున్నవి. పుట్టగలవు కూడ. కాని వాని యందు ఉదాత్తత యుండదు. నైర్మల్యము లేని స్త్రీ విషకన్య గా పరిణమించునట్లు ఉదాత్తత లేని కవిత విషవాక్కుగా పీర్పడును మన పాలికి. కనుక,

'నియమబద్ధమ్మె మధురమ్మె నిపుణమైన
పలుకుతో సాహితీసృష్టి సలుపవలయు,
రాగరోషాది దుర్వికారములు లేని
కవులకే తోఁచు నిట్టి చక్కని వచస్సు'

ఇది

అహింస యైన భూతానాం
కుర్యాత్ శ్రేయోను శాసనమ్
వాక్చ శ్లక్ష్ణాచ మధురా
ప్రయోజ్యా—ధర్మమిచ్ఛతా!

అను మనుమహాశయుని స్మృతి వాక్యరత్నమునకు ప్రదీపనము. ఇట్టి లోక కళ్యాణ హేతువైన కవితకు వలసిన భావనాబలము ప్రజల మేలుగోళ్ళఁ బాల్గొను వారికే' లభింపఁగలది. కుక్షింభరులకు లభింపదు. కావున,

'పఁట కాఁపు చేతి పని వాఁడు బైరాగి
తక్కినొరుడు పల్కఁదగఁడు కైత'

అని కొంత తీవ్రముగా నియమించి నారు మూర్తిగారు. అసాధారణమైన యీ లోకకళ్యాణ దృష్టియే, ఈ యార్జవమే మూర్తిగారి సర్వరచనలకును మూల బంధమై బలము నిచ్చి నడిపించినది. వానిలో శ్రీ గాంధిగారి "ఆత్మ కథ" వీరి తెలుగు తీపులో మెదగి మనము మఱచి పోవుచున్న ఆ మహాత్ముని ఆధ్యాత్మిక ప్రభను అప్పుడప్పుడు కన్నులు మిఱు మిట్లు గొలుపు నట్లు చేయు మహోన్నత కవితారచన.

మహాత్ముని తరువాత ఆయన యంతటి వాడు, ఆ దివిటీనే ఇంకను ఉజ్వలముగా వెలిగించుచు దేశము మూల మూలలను వెలుతురు నించుచున్న బైరాగి, మహామేధావియైన తపస్వి, దేశమందలి రాక్షస శక్తులకు సుదర్శ నచక్రము వంటివాడు — అగు శ్రీ వినోబా భావేగారి ఉదాత్తాత్మ శ్రీ సీతా రామమూర్తి చేతికి చిక్కి తెలుగు మెఱుపులతో ఇందు మెఱయుచున్నది.

ఆ యిద్దఱు మహామహులందు, గలభక్తి వారి నడవడి యందు, గల ప్రతిపత్తి, వారి యుపదేశములందుగల ప్రవృత్తి ఇవి నిర్మలములై, అనారోపితములై శ్రీ మూర్తిగారి కవిత వెన్నెల వంగక నిటారుగా నిలబడు నట్లు చేసినవి.

"బరువుజూచి కృతికి బరువు నీకుడు, చిన్న
రచనయైన నేమి? రాముడందు
గాని పించు నేని మానవు నది తీర్చి
దిద్దు నేని దాని కుద్ది లేదు"

అను మూర్తిగారి ప్రార్థనను అనువదించుట కన్న ఈ పీఠిక చేయ గలిగినది లేదు–అసలీ పీఠిక దీని కెందుకో శ్రీ మూర్తిగారినే అడుగవలయును! నాకు తెలిసినది నా యెడ ఆయనకుగల అమిత ప్రేమమే. దానికి నా ధన్య వాదములు.

తిరుపతి
15-12-1960

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

అశ్వత్థభారతము

కలుగోడు అశ్వత్థరావు

తెలుగులో రామాయణము పరంపరగా పలుతెఱగుల వెలసినది, వెలయుచున్నది, వెలయగలదు గూడగా బోలు.

కాని, కవిత్రయము తరువాత మహాభారతము స్వతంత్ర మహా పద్యకావ్యముగా పునరవతార మెత్తుట కుత్సాహము ఆరువందల యేండ్లలో శ్రీ అశ్వత్థరావుగారియందు మొలచినది, మొలక పెద్దగా పెరిగి చెట్టైనది మరి వనస్పతియు కాగలదు.

శ్రీ అశ్వత్థరావుగారి చిత్తవృత్తి అశ్వత్థ వృక్షము వంటిది. దాని వ్యాపారము నడ్డగించుట అసాధ్యము. దాని మూలబలము అనన్య సామాన్యము.

"చిచ్చునకుఁదోడు కరువలి వచ్చు గతిన్" శ్రీ కప్పగల్లు సంజీవ మూర్తిగారు, వట్టి మాటలు గాక రచనసు గూడ కలిపి శ్రీ అశ్వత్థరావును అన్నివిధముల ప్రోత్సాహించినారు.

ఫలముగా ఈ అశ్వత్థభారతము పుట్టి పెరుగుచున్నది. ఇప్పటికే మొదటినాలుగు పర్వముల కే—ఈ గ్రంథము 3225 పద్యములు వెలువరచి నది! మరి యికముందు ఎంతగా పెరుగునో! తిక్కన్నగారి యుత్తర రామాయణమువలె ఇది నిర్వచనముగా నిర్వహింపబడినది.

రచనలో కవిగారికి గల ప్రసాదగుణము, ధారాళత భావముల

అభిప్రాయము, 1961.

ఆర్ద్రవము, భాష, జాతీయ సంప్రదాయము ఇత్యాది గుణములు తెలుగు రసికుల చెవికి ఇదివరకే స్పష్టముగా నందినవి. దానికి తోడు కవిత్రయము వారి రచనపై వీరికి గల గౌరవాభిమానములు ఇందు ఆద్యంతమును ప్రతిఫలించి దోహదమిచ్చినవి. ఆ కవీశ్వరుల అనుగ్రహము అనుసరణము, ఎంతో విస్మయావహముగ ఇందెన్నియో సందర్భములందు రసికులు చూచి అనుభవింపగలరు.

ఈ మహాకార్యము కొనసాగునట్లు శ్రీనివాసుడు అనుగ్రహించుగాక.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

ఆనంద భిక్షువు

వి. వి. ఎల్. నరసింహారావు

ఇంచుమించు ఒక్కయూపులో కావ్యమంతయు చదివితిని. మీ రచన సంస్కృతమైన, సంయమసిద్ధమైన ప్రాచీన మధురపాకమున పడినది. ప్రసాదగుణ మెక్కడను మీరు జాఱనియ్యలేదు. అర్థభావములు అవసరమును, ఔచితిని మీఱక, చిక్కదనముతో నిబద్ధమైనవి. ఆధునికులలోను-ప్రాచీనులలోను-ఈ సిద్ధిని సంపాదించినవారు పలువురు లేరు. ఇందుకై మిమ్ము హార్దముగా అభినందించు చున్నాను.

కావ్యవస్తువులలో ప్రకృతి—జీవేశ్వరుల సంబంధమును వ్యంగ్య మర్యాదచే సూచింప మీరు సమకూర్చినట్లు స్ఫురించినది. కథానాయికా నాయక ప్రకృతి-ఆనందనామములు దానికి దోహద మిచ్చినవి. కావ్య ...రింప జేయదగినది రసికవస్తువే కాని, ఆధ్యాత్మిక తత్వముగా అభిప్రాయము తత్వవిషయముల నిట్లు శిల్పోపకరణము గా స్ఫురింప జేసినవారు మనలో అనూచానముగా నిజమే. కాని ఆ పద్ధతిచే కావ్యరుచి గౌణమై తత్త్వము మున్నదని నేను భావింతును. 'కాంతా సమ్మితము' ను" కాంతముగానే యుండదగునని, సుగ్రాహము త్వముగా నుండరాదని నా నమ్మిక,.....
కావ్యమందలి పాత్రల హృదయక్షోభములు,

వాని పరిణామములును, ఆత్మమంత్ర శక్తుల తారతమ్యమును ఎక్కువ రుచిగా, సంస్కారకములుగా నున్నవని నాకు తోచుచున్నది.

ఇది నా అభిరుచి మాత్రమే కావచ్చును.

17-9-63

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

o—o—o

గ్రామసీమ

కనమలూరు శివరామయ్య

శ్రీ కనమలూరు శివరామయ్యగారు తమ యీ మధుర ఖండకావ్యము 'గ్రామసీమ'ను చదివి రెండుమాటలు వ్రాసి యిమ్మన్నారు. వారి మైత్రి, కావ్యపు లలిత సౌందర్యము రెండును నన్ను కాదనలేకుండ జేసినవి.

గ్రామములలోని జీవితమును మనదేశమున ప్రాచీనకవులు గమనించలేదని, ఎప్పుడును రాజుల, మంత్రుల నాగరజీవితమే గొప్పగా వారు వర్ణించిరని ఒక యపవాదమున్నది. ఆంగ్లసాహిత్యము తోటి పరిచయము గలిగిన తర్వాత మనవారి కీ భావము ముదిరినది. కాని అది పూర్తిగా సత్యము గాదు. హాలుని గాథాసప్తశతి మొదలగు ప్రాచీన రచనములు దాని కిప్పటికిని సాక్ష్యములుగానున్నవి. తెలుగు సాహిత్యములోను గోపరాజు, పంచతంత్ర కవులు, కదీరిపతి మొదలగువారి మధుర రచనలలో ఈ గ్రామీణ జీవితము వివిధముగా ప్రపంచితమైనది.

కాని నాగరీకులందరును స్వార్థపరులని, అనుకంపలేని వారని, పవిత్రత ఎఱుగని వారని, పల్లెటూళ్ళ ప్రజకునందే ప్రశాంతి, ఆర్జవము, పరోపకారము మొదలగు మహాగుణములన్నియు ప్రోగై యుండునని నగరవాసుల సుఖవైభవముల కంతయు పల్లెలే మూలాధారములని, అయినను నాగరులు పల్లెల యోగక్షేమములను ఏమాత్రము గమనింపకున్నారని, ఈ విప్లావభావములు ఈవల మనదేశమున ప్రబలినవి. కాని అవి గూడ సత్యాసత్య మిశ్రమమైన చిత్తవృత్తి మాత్రమే. పల్లెలో పుట్టి పెరిగి పట్టణాలలో నెలకొన్న వారి కందఱికిని ఈ తత్వము గోచరము కాదు.

మున్నుడి, 1964

శ్రీ శివరామయ్యగారి యీరచన పై గ్రామాభిమానపు ప్రభావమున పైలుదేరినది. పల్లెల సామాన్య స్త్రీ పురుషుల అందచందాలు, అనుభవములు అనుభావములు ఇందు చిక్కగా, చక్కగా వర్ణింపబడినవి. అట్లే అక్కడి పూరిపెద్దల, వ్యాపారుల దురభ్యాసములును వివరింపబడినవి. ఈ రెంటను కొంత అతిశయోక్తి కానవచ్చుటయు, అనుభవరసికులకు సహజమే. కాని కవిత్వకళకు అతిశయోక్తి మూల బీజమనుట సహృదయులంద ఱును అంగీకరించిన తత్వము. శ్రీ శివరామయ్యగారి యీ రచనలో భావముల యార్ద్రపము, శబ్దార్థముల లాలిత్యము, శయ్య యందలి సొంపు దాయిక సౌభాగ్యమును చదివినవారందరును నిస్సంశయముగా అనుభవింతురు.

తిరుపతి
12-4-1964

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

గాథా సప్తశతీ సారము

రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ

భరతఖండమున ప్రాకృతభాష యెంతో వివిధముగా విస్తరముగా వాలా కాలము వెలసినది. సంస్కృతము గూడ దానిభేదములలో నొకటే కాని సర్వజనీనముగా సార్వకాలికముగా లోకప్రబోధమును గోరిన మహనీయులెందరో దానిని సంస్కరించిరి, అనగా దిక్కుకొకటిగా నున్న దాని యనంత శబ్ద రూపరాశిలో కొన్ని యెక్కువ వ్యాప్తిలోనున్నవిమాత్రము పరిగ్రహించి శాసించి తక్కినవానిని వదలిరన్నమాట. ఆది 'సంస్కృత' మాయెను. శాసకులు విడిచిన రూపములను శిష్టులు వదలినను సామాన్య లోకము విడువలేదు. సహజముగా దేశేదేశే దినేదినే ఆ శబ్దప్రవాహము జాతి, మతము, దేశము, వ్యక్తి మొదలగువాని మూలమున పలుమార్పులు చెందినది. సందర్భానుగుణముగా ఎన్నో కొత్త శబ్దములు పలుకు బడులును అందుకలిసి పోయినవి. సంస్కృతశాస్త్రమెంత ప్రబలముగానున్నను ప్రబలవ్యవహార సిద్ధములైన ప్రాకృతశబ్దరూపములెన్నో మరల సంస్కృతభాష లోనికి చొచ్చి వ్యాప్తికెక్కి నిలబడినవి.

కవిత[illegible]ాదలు నేటివరకును ప్రచారమందున్న 'సంస్కృత మైన తెలు[illegible] భిన్నప్రాంతములలో భిన్నజాతులలో వాడుక [illegible]ల పోల్చి చూచితిమేని సంస్కృతప్రాకృతముల నులను గుర్తింపగలము. తమిళము, కన్నడము మొదలగు భాషల సంపర్కమువలన తెలుగు

[illegible]ాబాదు.

ఎన్నో భిన్నపాఠ్యములాశ్రయించినది పదములలో, పలుకుబళ్ళలో, విభక్తులలో కారకప్రయోగములలో. పరిమితమైన తెలుఁగునేలయందే ఇన్ని మార్పులు గలుగఁగా ఆ సేతు హిమాచలము ఎన్నోవందల వేల యేండ్లు వ్యాపించి యున్న భాషలో ఎన్ని యెట్టి మార్పులు వచ్చి నెలకొని యుండఁగలుగునో కొంతకు కొంతయైనను ఊహింపవచ్చును. సంస్కృతభాషవలె ప్రపంచ దేశ భాషలను గూడ నిఘంటు వ్యాకరణముల మూలమున సంస్కరించు మహా ప్రయత్నము ప్రాచీనులు పెద్దలు చేసిరి. దేశప్రయుక్తముగా మహారాష్ట్రి, శౌరసేని, గౌడి, లాటి, మాగధి, పైశాచి, ఆవంతి, అర్ధమాగధి, పాశ్చాత్య, బాహ్లీక, దాక్షిణాత్య మొదలగు పేళ్ళతో స్థూలముగా విభజించిరి. అట్లే జాతి ప్రయుక్తముగాఁ గూడ ఆభీరి, శకారి, చాండాలి, శాబరి ఇత్యాదిగా కొంత పేరుపరిచిరి. కాని యీ యన్నిటికిని 'ప్రాకృతములు' అను సామాన్య నామమే వ్యవహారమున నిలిచెను. వీనిలోనెల్ల ఉత్తమమైన ప్రాకృతము 'మహారాష్ట్రాశ్రయ' మని ఆచార్యదండి యభిప్రాయము. అది 'సాగరఃసూక్తిరత్నానాం' అన్నాఁడతఁడు. (ఁ) ఇన్నిటిని సంస్కరించుట అసాధ్యమై తరువాతి లాక్షణికులు – హేమచంద్రుఁడు, వేంకటనాథుఁడు, లక్ష్మీధరుఁడు అప్పయ్యదీక్షితుఁడు మొదలగువారు – మూఁడు నాలుగుభాషలకు మాత్రమే వ్యాకృతిసంస్కారమునిచ్చిరి. ఈగట్లను దాఁటి ప్రాకృతప్రవాహము చిలువలు పలువలై 'అపభ్రంశము' లనఁబడి సుదుగొందులలో దూరినది. దానినిగూడ సంస్కారమునకు లొంగఁదీయు ప్రయత్నములు లేకపోలేదు. జీవితమందు నియమములేని నడత యేదియు నుండరాదని భావించి పరిశ్రమించిన ప్రాచీన భారతీయుల లోకకల్యాణకాంక్షకు ఈ భగీరథ ప్రయత్నము పృథమోదాహరణము. ఆ ప్రయత్నఫలముగా అపభ్రంశ భాషలలోను పుష్పదంతుఁడు మొదలగు ప్రతిభామహితులు మహాకావ్యములు రచించినారు.

ఇక 'సంస్కృత' మైన ప్రాకృతభాషలయందు ఎంతో విరివి, విలువ, వైవిధ్యము గల వాఙ్మయము జనించి యుండువలెననుట సుగ్రహమైన మాట, కాని దానిలో నేడు మనపాలికి మిగిలినది యెన్నవపాలో ఊహింపశేము. 'సేతుబంధము', గౌడవధ, ఈ సప్తశతికోశము మొదలుగా కొన్ని

కావ్యరచనలు, 'కర్పూరమంజరి' వంటి ఒకటిరెండు ప్రాకృత రూపకములు, జైనబౌద్ధులు పవిత్రభాషగా నంగీకరించినవారు గావున వారిమత తత్త్వ గ్రంథములు కొన్ని, శాస్త్ర ప్రకారము సామాన్య పాత్రములకుప యోగించినను సంస్కృతభాషా 'ఛాయ' చే మాత్రమే తెలిసికొన బడుచున్న రూపకములలోని వివిధప్రాకృత వాక్యములు కొన్ని-ఇవే నేటికి మనలో శేషించిన ప్రాకృతరచనలు, నేనెఱిగినంతవఱకు

ప్రాకృత సారస్వతము ఇంత నిర్మూలించినది బౌద్ధమతద్వేషులైన వైదిక మతపునరుద్ధారకులు' అన్న శ్రీరామలింగారెడ్డిగారి యభిప్రాయము అంతగా క్షోదక్షమమై గాదు. అవైదికులైన జైనులును బౌద్ధవిరోధులే. జైనులు మనదేశ మందే నిలబడి తమమత తత్త్వములను ఆ వాఙ్మయమును ఎంతో రక్షించుకొని వచ్చినారు. మరి ద్వైతాద్వైత విశిష్టాద్వైతాదిమతముల వారి పరస్పరద్వేషము బౌద్ధ బౌద్ధేతరుల అన్యోన్యవిరోధముకన్న ఎందును తీసిపోనిది. కాని వారివారి సారస్వతము నశింపకుండ వారువారు కాపాడు కొనియే యున్నారు. ఈవల మనదేశమున వచ్చి నెలకొన్న క్రైస్తవ మహమ్మదాదుల వాఙ్మయములకును ఈగతి పట్టలేదు. ఏరుద్ధమతముల గ్రంథములను ఇతరులు కాపాడకపోవుట, పాడు చేయుటయు సామాన్య స్వభావమే. కనుక వైదికమతములవారి క్రైవాడము గూడ బౌద్ధగ్రంథ నాశనమునకు కొంత తోడ్పడి యుండవచ్చును. కాని ప్రాకృతము లందుండినదంతయు బౌద్ధవాఙ్మయమే కాదుగదా. బౌద్ధ జాతి మనదేశ మందు-ఆ మతము పుట్టిపెరిగిన దేశమందే-నిలువ నీడలేక కాందిశీకము కాగా, దాని వెంటనే పరువెత్తిన ఆ మతసారస్వతము గూడ భిన్నదేశ ములో నలిగి, భిన్న భాషలవంటి వాసిలో-తలదాచుకొన్నదనుట సత్య మునకు సమీపము కాగలదు. బుద్ధుని మనవారు విష్ణుదశావతారములలో ఇప్పటికి కడపటిదిగా పరిగణించినను, తరువాతి బౌద్ధులతోడి సహవాస మును సహింపలేక పోయిరి. కారణము సామాన్యధర్మనీతి బాహ్యములై, సంఘమందు నెమ్మదికవకాశమియ్యని బాహ్య-గుహ్యతాంత్రికవృత్తులు వారిలో ప్రబలి యుండుటయే యనుట న్యాయము. సందర్భము వచ్చినది

గనుక వారి రహస్య గురూపదేశ శ్లోక మొకటి నా దృష్టికి వచ్చినది యిందుదాహరింతును.

"ప్రాణినశ్చ త్వయా ఘాత్యాః వక్తవ్యంచ మృషా వచః
అదత్తంచ త్వయా గ్రాహ్యం సేవనం యోషితామపి"†

మరి ప్రాకృత వాఙ్మయమేల యింత నశించినది? కారణమొకటే; ఆ భాషల విభిన్న వ్యవహార స్వరూపము. దానిని సంస్కరించి హద్దులో పెట్టు ప్రయత్నము చాలవరకు నిష్ఫలమైనది. నేటి మన వ్యావహారిక తెలుగు భాషవలె ఆకాలమున సంస్కృత భాషకెదురుదిరిగిన విప్లవకార్యమే ప్రాకృతసారస్వతము. మనలో ఇప్పుడప్పుడే వ్యావహారిక తెలుగునకు ఏదోకొంత సంస్కారనియమము చేసికోవలె నన్న దృష్టి భాషాసేవకులలో కొందఱికైనను కలిగినది. కలుగుచున్నది. కొందఱు ప్రయత్నము గూడ చేసినారు. ఫలము ముందు చూడవలసి యున్నది. ఎట్లైనను వ్యవహార మునే నమ్మికొన్న యేభాషయందలి సారస్వతమైనను కొంతకాలమునకే అంతరించుట స్వాభావిక పరిణామము అని యూహింపలేకపోవుట బుద్ధి మాంద్యమునకు గుర్తు.

జీవశక్తిచే చెలరేగుచున్న కాలమున ప్రాకృతభాషలలో కావ్యరచన యొక్కటే యెంతవిరివిగా అల్లుకొనియుండినదో ఈ 'గాథాసప్తశతి' కొంత సూచించును. ఇందు సంగ్రహించిన పద్యములు ఏడువందలే యయినను వానిని వేరు వేరుగా రచించిన కవులసంఖ్య ఇంచుమించు మూడువందల్లు! నా యీ సంగ్రహమందే 274 కవుల పేర్లు గలవు. కోటిగాథలనుండి యీ యేడువందల్లు సంగ్రహింపబడినవని యిందే కలదు (1–3) 'భువనపాలుడు'

---

† ఇది 'గుహ్యసమాజ తంత్రము' అను గ్రంథమునందలిది. హింస, అసత్యము, పరద్రవ్యాపహరణము. పారదారికత–అను నాలుగు ప్రధాన సాంఘిక పాతకములను గూర్చిన ధర్మోపదేశరత్నము! ఇట్టి మతమువారితో ఎవరు నెమ్మదిగా ప్రబుద్ధులు?

అను దీనివ్యాఖ్యాత 384 పేళ్ళను గుర్తించినాఁడట. మొత్తము పందొమ్మండ్ర వరకు దీనికి టీకాకర్తలు గలరట: పీతాంబరుఁడు' అను టీకాకర్త టీక యందు గుర్తించిన పేళ్ళను జర్మని దేశమున వేబరు పండితుఁడు సంగ్రహించి ప్రకటించిన ముద్రణమునందలి పేళ్ళను జేర్చి, బొంబాయి 'కావ్యమాల' యందు శ్రీ దుర్గాప్రసాద పండితుఁడు 1189 ప సంవత్సరమున ఈ గ్రంథ మును గంగాధరభట్టు టీకతో ప్రచురించెను. పీతాంబరుని టీక ఆయనకు పూర్తిగా లభించి యుండలేదు. దాని కొంతభాగము ఈవల ప్రకటిత మైనది. నేనీ తెలిగింపున గుర్తించిన పేళ్ళకు పైమూఁడు ప్రతులే ఆధారము. ఆ గాథా కవుల పేళ్ళలో రెండుమూఁడు తప్ప నేటికి మనయెఱుకకు వచ్చినవేవియు లేవు. అవన్నియు ఎవరో కల్పించి యతికించినవని భావించు బుద్ధిమంతు లును గలరు. కాని అది యర్థము లేని సందేహము.

ఇందలి పద్యములన్నియు ఆర్యాచ్ఛందస్సున కూర్చినవి. 'గాథ' యని దాని ప్రాతపేరు. గానము చేయఁదగినది గాథ. కనుక ప్రాచీన ప్రాకృతులు దీనిని పాటగా నుపయోగించుచుండిరనఁదగును. శార్ఙ్గదేవుని సంగీతరత్నాకరమున రాగ వివేకాధ్యాయమందు షడ్జకైశిక రాగమునకు లక్ష్యముగా ఈ క్రిందిగాథ సస్వరముగా నియ్యబడినది.

"దీహరఫణిందనాలే మహిహరకేసర దిసాముహదలిల్లే,
పిఅఇ కాలభ (బ్భ?) మరో జణమఅరందం పుహరపడిమే."

ఈగాథ సాతవాహనుని యాస్థాన కవియైన పాదలిప్తాచార్యుడు సిద్ధనాగార్జునునికి* ఉపదేశించినదని 'పురాతన ప్రబంధసంగ్రహః' అను

---

*పాదలిప్తుని శిష్యుఁడై నాగార్జునుఁడు జైనమతము స్వీకరించెనని ఆ గ్రంథమందలి కథ, 'పాదలిప్త' పదమే 'పాయలిత్త - పాలిత్త' అను ప్రాకృతరూపము గొన్నితరువాత 'పాలిత' అని పునస్సంస్కారము పొందినదేమో! ఈ గాథలలో కొన్నిటికి "పాలితుఁడు" కర్తగాఁ గలఁడు. 'కవివృషు' డైన పాలితుని హాలుఁడు - ఈకోశ సంగ్రహకర్త 'ఉత్తమ పూజచే లాలించె' నని అభినందుని రామచరితకావ్యమున నున్నదఁట.

జైనగ్రంథమునఁగలదు 'ఓపిబఱి కాలభమరో...భుహవి పశుమే' అని సరియైన ఉత్తరార్ధపాఠము దాన్నిలో నున్నది. (పు. 94) దీనినిట్లు తెలిగింప వచ్చును.

తే. "ఉరగపతి నిడునాళమై, గిరులు కేస
రంబులై, దిఙ్ముఖములు దళంబులైన
పుడమితామరపూవునఁ గడఁగి క్రోలు
మనుజమకరందమును కాలమనెడితేఁటి"

కాని వ్యపహారబాహుళ్యముచేత 'గాథ' లో పాటతనము పోయినది. తెలుగు తేటగీతియందు 'గీతి' పదమువలె 'గాథ' గూడ వట్టిఛందో నామమైనది. క్రమముగా 'ఏదో పనికిరాని, నమ్మరాని మాట' అనునర్థమున ఆపదము నేటివాడుకలోను గలదు. 'గాసటబీసటే చదివి గాథలు క్రవ్వ' వారు 'తెలుంగువారు' అన్నాఁడు నాఁడే శంభుదాసుఁడు! కన్నడమున 'గాదె' అనగా సామెత.

ఈ 'గాథాసప్తశతి'ని కూర్చిన రసికరాజకవి హాలుఁడు. ఆమాట యిందలి మూఁడవ పద్యమందే యున్నది. (1-3). 'కవివత్సలుఁ' డనియు ఇతని బిరుద నామము. 1, 2, 3, 5, 6 శతకముల కడపట 'రసికజనహృద యదయితే కవివత్సల ప్రముఖ సుకవి నిర్మితే' అని సమాపక పద్యము గలదు. ఇవ శతకాంతమున పేరులేని సమాప్తిగాథ యున్నది. 7వ శతకము తుదిని 'ఇతి శ్రీహాల విరచితే' ఇత్యాదిగా నున్నది. రెండు వ్రాత ప్రతులలో 'శాలవాహనె విరచితః కోషః' అని కలదఁట. ఇవి గాక శాత వాహన, సాతవాహణ, సాలవాహణ, సాలహణ, శాలవాహన, శాలివాహన శాల-సాల అనియుఁ గలదేమో! అనునవెల్ల హాలుని నామాంతరములే యని ప్రాచీన సంప్రదాయము. ఇదిగాక ఒకనొక గాథాసప్తశతి ప్రతిలో 'సాతకర్ణి' ఆను పేరుగూడ నున్నదఁట! క్రీ. పూ. మొదలైన శాలివాహనశకమును స్థా[illegible] మును సంగ్రహించిన ఆంధ్రరాజని

కొందరు క్రీ. శ. మూడవశతకము తర్వాతను ఏడవశతకపు వెనుకను ఎవరో సంగ్రహించి హాలునిపేరతికించి యుందురని సందేహింతురు. అసలు ఈ శకకర్త శాలివాహనుడు ఆంధ్రసాతవాహన వంశము వాడు కాడని ఇంకొక శకస్థాపకుడగు విక్రమాదిత్యునికి ఇతడు మనుమడో మునిమనుమడో కాగలడనియు; పీరిద్దఱును అగ్నివంశమునకు చేరిన 'పన్వారు' సంతతివారనియు; హాలసాతవాహనుడు యయాతివంశీయుడై చంద్రవంశమునకు చేరిన-మగధసామ్రాజ్యము నేలిన-33 గురు ఆంధ్రచక్రవర్తుల పరంపరలో 19వ వాడనియు, క్రీ.పూ. 494 మొదలు 489 వ సంవత్సరము దాక ఐదు సంవత్సరములు మాత్రమే రాజ్య మేలినవాడనియు; ప్రాచీనుల కట్టుకథలందును ఇప్పటి చరిత్ర రచనలందును పైయిరువురును ఒక్కరేయను భ్రాంతి కలిగినదని, శ్రీ కోట వెంకటాచలపండితులు భావించిరి.[1] వారి పరిశ్రమ అగాధము, వ్యాసంగము గంభీరము, కాని వారు ప్రమాణములన్న భవిష్యపురాణాది గ్రంథములు పూర్తిగా సమ్మతలసినవని, అప్రమాణములనిన కథాసరిత్సాగరము మొదలగునవి వట్టి కట్టుకథలని తిరస్కరింప వలసినవని, అంగీకరించుట సాధ్యముకాదు. అంగీకరించినచో ఆంధ్రచక్రవర్తియగు హాలసాతవాహనునికే ఈగాథాసంగ్రహమునంటగట్టి దీని జననకాలమును క్రీ పూ. 5వ శతకముగా గ్రహింపవలసి యుండును; హాలుడే సంగ్రహించినట్లు ఇందున్నదిగనుక; శకకర్త 'పన్వారు' శాలివాహనునికి హాలుడను పేరు కానరాదు గనుక, ఇక ఎవడో తర్వాతి వాడు సంగ్రహించి పేరు పెద్దకమునకై ఆంధ్రహాలచక్రవర్తికి దీనిరచనా కీర్తి సమర్పించియుండును అను వాదమున్నచో దానికి మౌనమే నిరాకరణము. పోనీ, ఆ హాలచక్రవర్తియే దీనిని కూర్చినవాడని యంగీకరింప రాదా యనవచ్చును. అట్లైనచో క్రీ. పూ. 5వ శతకము మొదలు క్రీ.శ. 6వ శతకమువఱకును ఈ సప్తశతి పేరు వినరాదే: ఇప్పటికి మొట్ట మొదలు దీని పేరెత్తినవాడు క్రీ. 6వ శతకమువాడు బాణభట్టే కాన

of [illegible]amadithya and Salivahana',

'ము' అను వారి రచనలు.

పచ్చచున్నాడు.[2] కనుక ఇంచుమించు వేయేండ్ల అజ్ఞాతవాసము వీని కంటగట్టవలసియుండును. ఎట్లైనను ఈకాలచర్చ భావిపరిశోధనవలన తెంచవలసినది. మరి యీ విషయమున నాకంతకు మించిన అధికారము, అభినివేశము, లేదు.

శాలివాహనునికి సంబంధించిన పురాణములు, కావ్యములు, ప్రబంధములును ఎన్నోకలవు. అవి ఒండొంటితో పోలు పొందు లేనివి. అందలి విషయములన్నియు ఇంచుమించు అతిమానుషవీధికి జేరినవి. ప్రకృత 'సప్తశతి' కి సంబంధించిన ఒక కథమాత్రము ఇందు సంగ్రహించి తెల్పుచున్నాను. మేరుతుంగాచార్యుడను జైనపండితుడు రచించిన 'ప్రబంధ చింతామణి' లోని 'సాతవాహన ప్రబంధ' మున ఇది కలదు–

సాతవాహనుడు మహాదాత. అందఱు పండితులను కవులను తన యాస్థానమున చేర్చుకొని పోషించుచుండెను. ఎవరో రచించినవి నాల్గు ప్రాకృతగాథలను విని నాలుగుకోట్ల బంగారునాణెములకు వానిని కొనెను. తరువాత అట్టి గాథలు ఏడు వందలు చేర్చి "సాతవాహనాభిదానమగు సంగ్రహగాథాకోశము నిర్మింపించి" చాల కాలము రాజ్యమేలెను. అతడప్పుడు క్రయమిచ్చి కొన్న ఆనాలుగు గాథలివి:

(౧) మగ్గంచియ అలహంతో హారో పీణుణ్ణయాణ థణయాణం,
ఉబ్బింబో భమఇ ఉరే జమునానఇ ఫేణ పుంజఓ వ్వ.
(ఛాయ. మార్గమివాలభమానో హారః పీనోన్నతయోః
స్తనయోః.
ఉద్బింబో భ్రమత్యురసి యమునానదీ ఫేనపుంజఇవ.)

(౨) కసిణుజ్జలోయ రేహఇ వేణీదండో నియంబబింబమ్మి,
తుహ సుందరి సురయమహాణిహాణ రక్ఖాభయంగవ్వ.

---

2. 'అవినాశినమగాధ్యమకరోత్సాతవాహనః
విశుద్ధజాతిభిః కోశం రత్నైరివ సుభాషితైః' (హర్షచరిత పీఠిక)

(ఛా. కృష్ణోజ్జ్వలశ్చ రాజతే వేణీదండో నితంబవింబే,
తవ సుందరి సురతమహానిధాన రక్షాభుజంగ ఇవ.)

(౩) పరిఓససుందరాఇం సురపే జాయంతి జోఇం సుక్ఖాఇం,
విరహాఇం తాఇం పియసహి ఉబ్బుగ్గలియాఇం కీరంతి.)
(ఛా. పరితోష సుందరాణీ సురతే జాయంతే యాని సౌఖ్యాని,
విరహే తాని (పియసఖి ఖాదితోద్గలితాని కుర్వంతి)

(౪) మా ఖాణ కీర జహ చంచులాలియం పడఇ పక్కమాఇందం,
జరఢత్తణ దుల్లలియం ఉబ్భయ తాలాహలం ఏయం.
(ఛా. మాఖానీహి కీర యథా చంచులాలితం పతతి పక్వమా
కందం,
జరతత్వదుర్లలితం ఉద్భజ తాలఫలమేతత్.)*

ఈ కథకు సంగ్రహముగా ఎవరో యీ కింది గాథను రచించెను.-

"హారో వేణీదండో ఖుగ్గలియాఇ తహ అ తాలుతి
ఏయాఇం నవరి సాలాహణేణ దహకోటి గహియాఇం"
(ఛా. హారో వేణీదండః ఖాదితోద్గలితాని తథాచ తాల ఇతి,
ఏతాని కేవలం శాలివాహనేన దశకోటిగృహీతాని.)

విస్తరములోని 'నాలుగు' కోట్లు సంగ్రహములో 'పది' యై పెరిగినవి! పై నాలుగు గాథలలో 1-3 గాథలు గంగాధరటీకతోడి 'కావ్యమాలా' సప్తశతి పాఠమున ఏడవ శతకమున 69, 68 వ సంఖ్యలతోనున్నవి. ఇతర మూలపాఠములలో తక్కిన రెండును గలవేమో! ఆరెంటినిగూడ నేను నా ఈ సంగ్రహములో చేర్చుకోలేదు.

సంగ్రహించిన హాలుడు దీనిని వీడునూర్లకే యేల నిలిపెనను ప్రశ్న వట్టి వినోదము, ఏ సంఖ్యలో నిలిపియున్నను ఈ ప్రశ్న వేయ వచ్చును. సప్తద్వీపములు, సప్తలోకములు, సప్తమాతృకలు- ఇట్లు సప్త

---

* పై సంస్కృతచ్ఛాయలు నేను గ్రహించినవి, స్థితగతిచింతనముగా. 1-3 వ గాథలకు 'కావ్యమాల' వారిపాఠమున చిఱుమార్పులు గలవు.

సంఖ్యకొక ఆధ్యాత్మికవిశేషము కలదని సమాధానమిచ్చుట సామాన్యము. ఇంచుమించు అన్ని సంఖ్యలకును అట్టి విశిష్టత గమనించి చూడవచ్చును. కాని ఈ 'సప్తశతి' నియమము ఎందఱో తరువాత అనుకరించినారు. దీని గాథలవంటి ముక్తకములే శృంగారమయముగానే సంస్కృతమున రచించిన ఆచార్య గోవర్ధనుఁడు తన రచన 'ఆర్యాసప్తశతి' గానే వ్యవహరించెను. హిందీవాఙ్మయమున 'బిహారి సత్‌సయీ' మొదలగు సప్తశతులు, ఏకకర్తృకములైన దీని యనుకరణములు, కొన్ని కలవందురు. సప్తశతీనియమము లేక జయవల్లభుఁడను వాఁడు 'వజ్జాలగ్గ' అనుపేర మరికొన్నివందలగాథలను సంగ్రహించెను. కాని ఆసంగ్రహమందలి గాథలలో ఈ అభిరుచిగాని కామనీయకము గాని కానరాదు. కనుకనే 'పజ్జాలగ్గ' విరివిగా ప్రాఁకలేదు.

ఇక సంస్కృతమున అలంకారికసారస్వతములో ఈ గాథల రాజ్యమే రాజ్యము. సంస్కృతము దేవభాషయని పేరొఁని పూజించినను ప్రాకృతము గూడ 'సరస్వతీ బాలభాష' అనుకొని లాక్షణికులు సమాన ప్రతిపత్తినిచ్చి గౌరవించిరి. 'కావ్యస్యాత్మా ధ్వనిః' అను తత్వమును గుర్తించిన తరువాత ఈ గాథలు దానికి ఉత్తమములైన లక్ష్యములుగా కావ్యమీమాంసకులు నిరర్గళముగా పరిగ్రహించిరి. ప్రాకృతములు తరువాతి సామాన్య విద్వాంసులకు సరిగా అర్థముకాని పరిస్థితి కలుగుట చేతనేమి, చదువరులందఱు ఇంచుమించు సంస్కృత భాషనే ఆదరించి గౌరవించవలసిన సంప్రదాయమును ఆవశ్యకతయు వీరఁడుటవల్లనేమి– ఈ గాథలవంటి ముక్తక రచనలెన్నో సంస్కృతభాషలో వెలువడినవి. కాని వానిలో ప్రాయికముగా ఈ గాథల ప్రధానలక్షణమైన సంయమము చిక్కఁదనమును పలుచనై పోయినవి. పెద్దపెద్ద వృత్తములలో విషయ విస్తరముతో ఆ రచనలు సాగినట్లున్నది. వానికెల్ల కిరీట ప్రాయముగా అమరుకవి శతకము రసికులను లాక్షణికులను వశీకరించుకొన్నది. కొందఱు, గాథల సంగ్రహశక్తి పిలువ గమనించినవారు, సంస్కృతమున గాథల ఆర్యాచ్ఛందస్సునే గ్రహించి సంస్కృతభాషా ఛందస్సుకు వలసిన చిఱు

మార్పులతో పరివర్తనము చేసికొన్నవారును లేక పోలేదు. రాజశేఖరుని 'కావ్యమీమాంస' లో (8వ శతాబ్దము) అట్టి ఆర్యాగాథ యొకటి కలదు.

"దైవాయత్తే హి ఫలే కిం క్రియతామేతదత్రతు వదామః
నాశోకస్య కిసలయైః వృక్షాంతరపల్లవాస్తుల్యాః"

(అధ్యా. 14, పు. 80)

సప్తశతియందు దీనిమూల మనదగినది యిట్లున్నది.

"దెవ్వాయత్తమ్మి ఫలే కిం కీరఇ ఎత్తిఅం పుణో భణిమో
కంకేల్లి పల్లవాణం ణపల్లవా హోంతి సారిచ్ఛా"

(3–39)

(ఛాయ. దైవాయత్తే ఫలే కిం క్రియతామియత్ప్రనర్ణనామః
కంకేలి పల్లవానాం న పల్లవా భవంతి సదృశాః)

పై సంస్కృతచ్ఛాయయందలి ఛందోభంగము స్పష్టమే. అన్ని భంగాల కంటె ఛందోభంగము సహింపరాదనుట ప్రాచీనుల రుచి, 'మాష' అనుదానిని 'మష' అని యైనను చెప్పవలెను గాని పద్యపు నడక చెఱుప రాదని ఎవరిదో ప్రాకృత అభాణకము. "అపిమాషం మషం కుర్యాత్ ఛందోభంగం త్యజేద్ధిరామ్". కనుకనే పై సంస్కృత పరివర్తనకర్త మూలమున లేనివి 'హి–అత్ర–వృక్షాంతర' అను పదములెక్కువగా చేర్చుకొ వలసి వచ్చినది. భాషాంతరీకర్తకు ఈ కష్టము తప్పనిది. దీని నా తెలిగింపు (1–22) ఇందుగలదు.

మరికొందఱు సంస్కృతచ్ఛందస్సులలో చిన్నదై ఎక్కువ వ్యాప్తి గలిగిన 'అనుష్టుప్' ఛందమున కొన్నిగాథలు రూపాంతరీకరించియును న్నారు. అప్పయ్య దీక్షితులు తన 'కువలయానంద' మందు 'చిత్రమీ మాంస' యందును ఇట్టి శ్లోకములు కొన్ని యెత్తినారు. అతడే యీరూపాం తరీకర్త కాబోలు. అందొకటి మచ్చుకు,–

"యథోర్ధ్వాక్షః పిబత్యంబు పథికో విరలాంగులిః
తథా ప్రపాపాలికాపి ధారాం పితనుతే తనుమ్"

దీని మూలగాథ ఇది -

"ఉద్ధచ్ఛో పిబఇ జలం జహాజహా విరలంగులీ చిరం పహిఓ,
పావాలిఆ వి తహతహా ధారం తణుఅంపి తణువీఇ

(ఛాయ. ఊర్ధ్వాక్షః పిబతి జలం యథాయథా విరలాంగులిః, పథికః,
ప్రపాపాలికాపి తథాతథా ధారాం తనుకామపి తనూకరోతి.)

మూలమందలి అర్థభావములు రెండును సంస్కృతరూపాంతరమున కొంత దెబ్బదిన్నవనుట స్పష్టమే. నాదీని తెలిగింపు ఇందు 124 పద్యము.

ఈ గాథాసారస్వతమును మరలనుద్ధరించు మహాప్రయత్నము చేసినవాఁడు 11 వ క్రీ. శతకమునన్నున్న బహుముఖ ప్రతిభాపాండిత్యనిధి భోజమహారాజు. అతని 'సరస్వతీకంఠాభరణము', అంతకంటె 'శృంగార ప్రకాశము' ప్రాకృత గాథలకు నిధి. కాని ప్రాయసకాండ్ర చేతులు. పురుగులును ఆ గాథాభాషకు చేసిన యపచారముచే దాని తలతోఁకలు తెలియుట బహుశః సాధ్యముగాకున్నది. శృంగార ప్రకాశమునుండి నాలుగు గాథలు మాత్రము ఈ పుస్తకము నాల్గవభాగమున నాతెలుఁగుతో చూడ వచ్చును.

తెలుఁగుదేశమున 15 వ శతకపుతొలిభాగమున కొండవీటిప్రభువు, సర్వజ్ఞచక్రవర్తి, వీరనారాయణుఁడు కోమటి వేమభూపాలుఁడు ఈ సప్తశతిని చేపట్టి వెలయించినవాఁడు, సప్తశతినుండి ఒకశతగాథలు మాత్రము ఏరుకొని 'సప్తశతీసారము' అనుపేర వానికి మంచి టీక రచించెను.* ఆ ప్రభువునాస్థానమందు 'విద్యాధికారి' శ్రీనాథకవిసార్వభౌముఁడు సప్తశతిని పూర్తిగా తన 'నూనూఁగు మీసాల నూత్నయౌవనమున' నే తెలిఁగించెనఁట. ఆ గ్రంథమింకను మనకు లభించు భాగ్యము రాలేదు. రానున్నదని

---

* దీనిని ఆంధ్రవిశ్వకళాపరిషత్తు ప్రకటించి కృతకృత్యమైనది. కాని సంస్కృత ప్రాకృత భాషలు రెంటిని పరిశీలించి సవరించి దానిని మరల ముద్రింపవలసిన ఆవశ్యకత యెంతోకలదు.

పేరాసపడుదముగాక, శ్రీనాథుని తెలిఁగింపులుగా మనకిప్పటికి మూఁడు పద్యములు దొరకినవి. ఒకటి కీ. శే. మానవల్లి రామకృష్ణకవిగారు 1908 వ సంవత్సరమున తొలుదొల్త ప్రకటించిన నన్నిచోడకవి కుమారసంభవము పూర్వభాగము నాల్గవయాశ్వాసమున ప. 568 ప్రకింది 'ఫుట్‌నోటు'లో చూపినది.

ఉ. "వారణ నేయ దావగొనవా, నవవారిజమందుఁ దేఁటి ప్రొ
వ్వారుచునుఁటు నీవెఱుఁగవా, ప్రియవాతెరగంటిఁ గంటికె
వ్వారికిఁ గెంపురాదె, తగవామగవారల దూర, నీమగం
డారసి నీనిజంబెఱుఁగునంతకు నంతకునోర్వ్య నెచ్చెలీ."*

ఇది "కస్సవ ణహోఇ రోసో" అనుదాని పరివృత్తి. గంగాధర టీకిత మూలమున ఇదిలేదు. కాని వేమభూపాలుని సంగ్రహమునఁ గలదు. ఇది తెలుఁగుదేశపు మూలసంప్రదాయములోనిదని వీబరుపండితుఁడు చూచిన దీని తెలుగు మార్పు ఈ నా కూర్పులో(3-59) కలదు.

రెండవ మూఁడవ పద్యములీక్రిందివి. ఇవి కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రి గారు ప్రకటించిన 'క్రీడాభిరామము' నఁ జేరినవి.

మ. "పటు జంఝూపవనోత్పతాలయములో భద్రంబుగం బట్టెకం
కటిపై ముచ్చముడింగి నిర్భరవియోగగ్లాని శోషించి యె
క్కటి నిద్రించుచునున్న బాంధవనితఁ గర్జావచఃప్రౌఢిమఁ
దటిదుద్యోతము చూపు నట్టనడురే ధారాధరశ్రేణికిఁ"(పు 19)

తే. "మాఘమాసంబు పులివలె మలయుచుండఁ
బచ్చరంబమ్మకొన్నాఁడు ప్రణయములకును (?)
ముదితచన్నులు పొగలేని ముర్ముఱములు
చలిఁనొఱగోయకేలుండు సైరికుండు?" (పు. 86)

(*) ఇది తరువాతి పండితులు సవరించిన పాఠము. కవిగారిచ్చినది కొంత అనన్వితము.

పై రెండు పద్యములకును మూలగాథలు ముద్రిత గాథాసప్తసతి యందు గలవు. (చూ. 2-70; 3-38) ఇందు నాతెలిఁగింపులు వానికున్నవి. (1.247; 1. 191.)

శ్రీనాథుని తరువాత నాతరమువఱకు తెలుఁగువారిదృష్టిని ఈగ్రంథ మాకర్షించినట్లు కానరాదు. నామట్టుకు సుమారు 1918 వ సంవత్సరమున దీనిని తెలిఁగించు చాపల్యము గలిగినది. అప్పటి ఈ శతాబ్దియందే పలువురు పండితులు విడి విడిగా ఆ పనికి చేయివేసినట్లు కానవచ్చుచున్నది. కాని క్వాచిత్కముగా తప్పనేనింకను ఆతెలిఁగింపులను చూడఁగలుఁగలేదు. ప్రాకృతభాషయందు నాకు అభిమాన మెంత యెక్కువో వ్యుత్పత్తి అంత తక్కువ కనుక సప్తశతిని పూర్తిగా తెలిఁగించు ధైర్యము నాకుఁ గలుగ లేదు. 'కావ్యమాల' వారి ముద్రణమును టీకయు మాత్రమే ఆధారముగా చేతనైనవి, రుచించినవి, గాథలు 395 మాత్రము తెలిఁగించి 1931 సంవత్సర మున ప్రకటించితిని. అనంతపురమందలి 'శ్రీసాధన' ముద్రాశాలవారు దానికుపకరించిరి. అప్పటి నాదృష్టికి పచ్చినవి, అర్థమైనవి, నచ్చినవి కొన్నిగాథలు కావ్యలక్షణగ్రంథములనుండి గ్రహించి తెలిఁగించుచు వచ్చితిని. వానిలో పెక్కులు ప్రకటించి భారతి నాకుపకరించినది.

ఈ సమయమున జర్మనీ దేశమున వీబరు పండితుఁడు ప్రకటించిన ప్రతిని చూచుభాగ్యము నాకుఁ గలిగినది. ఆ మహనీయుని పరిశ్రమ ఎంత శ్లాఘించినను తక్కువే. ఆ ముద్రణము 1881లో జరిగినది. ఎన్నో ప్రాఁత ప్రతులను ఆ కాలమున సంపాదించి, దేశప్రయుక్తముగా వానిని వేఱుపఱిచి అందు దొరికిన పాఠభేదములు మొదలగు మూర్పులు ఒక్కటిగాని వదలక పట్టీలు చేసి, జర్మనుభాషలో ప్రతి గాథకును టీకనిచ్చి, సందిగ్ధస్థలములలో ప్రశ్నచిహ్నమును వేసి, మూలమును రోమనులిపికి మార్చి, జర్మను భాష యందే ఏపులమైన ఉపోద్ఘాతము రచించి-అసాధారణ కార్యము ఆ పండి తుఁడు చేసి మనకిచ్చినాఁడు. తన కూర్పును అతఁడు నాలుగు భాగములుగా విభజించినాఁడు: (1) గంగాధరునిటీక ప్రకారము గాబోలు 698 గాథలు గల సామాన్యమూలము, (2) ఇతర వ్యాఖ్యాతల మూలమందు ప్రత్యేక

ముగాఁ గల గాథలు 116, (3) తెలుఁగుదేశమందలి మూలపాఠము నందలి 151, (4) పైవానివంటివి అలంకార గ్రంథములనుండి మరి 35, ఇట్లు మొత్తము గాథాసహస్రము సరిగా, నిండు సంఖ్యగా, అతఁడు కూర్చినాఁడు. నాకు జర్మను భాషయందేమాత్రపు పరిచయమును లేదు. అది కల మిత్రులును లభింపలేదు. అందందు పరిచితమైన ఇంగ్లీషుపదములు, టీకాంత రములనుండి రోమను లిపిలో అతఁడుదాహరించిన వాక్యములు, అచ్చు తప్పుగంధము లేని మూలము-సంస్కృతచ్ఛాయ అతఁడియ్యలేదు-ఇవే నేను పట్టుకొని ప్రాఁకినవి. ఇంతలో రెండుమూర్లు ఎరవుతెచ్చుకొన్న ఆ పుస్తక ముప్రతి తనచోటికి మరలి పోవలసి వచ్చినది. ఉపోద్ఘాతమైనను ఇంగ్లీషు భాషలో పరివర్తింపఁ జేయించుకొను అవకాశము, సమయము, చిక్కలేదు. దాన్నిప్రతులు దుర్లభములైపోయి యెంతో కాలమైనది. కనుక వెలకును దొరకవు. ఇట్టి స్థితిలో నిర్వేదపడుట తప్ప వేఱేమి చేయఁగలను: అతని మార్గమునే అనుసరించి యీ నాతెలుఁగు కూర్పును నాలుగు భాగములుగా ఏర్పఱిచితిని. ముఖ్యముగా తెలుఁగు మూలమందలివని అతఁడు ప్రకటించిన గాథలు 151లో ఒకశతగాథలు నేనిందు సంగ్రహించి తెలుఁగు వారికందియ్య గలిగితినని వీబరు పండితునికి నేనప్పుడి సంతోషించుచున్నాను. వేమ భూపాలుని శతకమున క్రొత్తగాఁదోఁచు గాథలన్నియు ఇంచుమించు ఇందు గలవు. ఇతరలాక్షణికుల గ్రంథములనుండి వీబరు ఎత్తిన గాథలలో కొన్ని యేరుకొని, నాదృష్టికందిన కావ్యలక్షణ గ్రంథములలోనివి మరికొన్ని ఆభాగమున తెలిఁగించి చేర్చితిని. సామాన్యమూలమందు మరి 117 గాథ లేర్చి మార్చి చేర్చితిని. మొత్తము ఈ నా సంగ్రహమున గాథలు 734 గా ఏర్పడి సప్తశతనియమమును దాఁటినవి. కొన్నిటికి లఘుటీక చేర్చితిని. ఎక్కువగా పెవరించుట గాథాకవిత గాంభీర్యమును చెఱుచునని, రసికులట్లే తలఁతురని, నానమ్మిక.

మరి 'సప్తశతి' గాథలనన్నిటిని పూర్తిగా తెలిఁగింపక కొన్నింటిని వదలుట యేల అను ప్రశ్న. దీనికి మొదటికూర్పున 'ప్రస్తావన' ద్వారి నన్ననుగ్రహించిన శ్రీకట్టమంచి రామలింగరెడ్డిగారే డాబులో నాకీప్రశ్న వేసిరి. దానికి నేనిచ్చు సమాధానము తృప్తికరముగానుండునో ఉండదో

తెలియదు. కాని దానినియ్యవలసి యున్నాను. కొన్నిగాథలలో చమత్కార ము శ్లేషప్రధానముగా నున్నది. తెలిఁగించుట సాధ్యముగా తోపఁలేదు. నాకు మరికొన్నిటి భావము స్పష్టపడలేదు. గంగాధరుని టీక అట్టిచోట్లి నాకుపకరింపలేదు. కొన్ని సందర్భములందతఁడు చెప్పిన భావము నాకు తృప్తిగానుండలేదు. ఇంకకొన్ని గాథలందలి ప్రమేయము సౌమనస్య మర్యాదను మీరినట్లు నాకనిపించినది. కొందఱికి అది రుచింపవచ్చును. కాని నా మట్టుకు దానిమాత్ర కొంత యెక్కువగా భాసించినది. మరికొన్నిట తెలిఁగించు ప్రయత్నమునకు తగిన కవితావిశేషము గోచరింపలేదు. పైతరగతుల గాథలు ఒకటి రెండు నాకూర్చునఁగూడ మచ్చుకున్నవి.

ఈ తెలిఁగింపున గ్రామణీ అనుపదమునకు 'రెడ్డి' అనుపదమును వాడితిని. శ్రీ రామలింగరెడ్డిగారు ఆ పదము తమకు రుచింపలేదని నాతో చెప్పిరి. "అంతకంటె మంచిపదము నాకు తోఁపదు. మా సీమలో గ్రామాధికారికి రెడ్డియనియే వ్యవహారము" అని నేనంటిని. "నిజమే కాని యేమో నాకాశబ్దము తృప్తికరముగా లేదు" అన్నారాయన. ఆ యతృప్తి నాకును గలదు. కాని విధిలేక దానినట్లే నిలిపినాను. ఇది ఇప్పటి రెడ్డి జాతివారికి ప్రత్యేకముగా అన్వయించునది కాదు. సహృదయులు దానిని గమనించి పోనిత్తురని నమ్మినాను.

ఇంక నేనేరుకొన్న గాథలు మొత్తముమీఁద నాయభిరుచిని మాత్రమే సూచించును. కోటినుండి యేడునూర్లు మాత్రము సంగ్రహించిన హాలునికి, అందుఁగూడ ఒకనూరుగాథలు వీర్చికూర్చిన వేమభూపాలునికి గల వ్యక్తి స్వాతంత్ర్యమునే నాకును ఇచ్చి చదువరులనుగ్రహింతురని నమ్మినాను.

మూలమును రచించిన కవులు, కవయిత్రులు, అందరిరచన, సంప్ర దాయమును ఒకటే: శబ్దార్థముల సంయమము, భావముల ఆర్జవము, అడ్డులేని సహజ ధారయు, తెలిగించునప్పుడు పై అసాధారణ లోపము రానీయక, తెలుఁగు పలుకుబడి చెడనీయక, రచింపవలెననియే నా పేరాస; నా పరాయణము. అందుకై ఏకవృత్తనియమమును వదలి తెలుగు జాతికి సహజమైన ప్రియమైన అటవెలఁది తేటగీతి కందములందే నాకృషి యథా

నుకూలముగ సాగించితిని. అనేకపద్యములు, ప్రాతవి క్రొత్తవి గూడ, మరల సవరించితిని. నారచనయందలి ప్రకార-వికారములను నిర్ణయించు వారు సహృదయులు. దీని పునర్ముద్రణమింత విలంబముగా జరిగినందు కదొక ముఖ్యకారణము. తొలి ముద్రణమునే యెంతో యుదారముగా విమర్శించి అభినందించిన సహృదయపండితులకు నాయనంతధన్యవాదములు.

ఈ ముద్రణ ప్రకటన భారము వహించి నన్ను ధన్యుని జేసిన పుణ్యము హైదరాబాదు ఆంధ్రసారస్వత పరిషత్తు వారిది. దానిని నిర్వహించినది నామిత్రులు శ్రీ దేవులపల్లి రామానుజరావుగారు. వారి సహృదయతకు నా "ఆంజలిః పరమా ముద్రా".

దీనినింత శుద్ధముగా త్వరగా ముద్రించిన శివాజీ ముద్రాశాలాధికారులకు నా నమోవాకములు.

తిరుపతి
శోభనకృత్తు ఫాల్గున
శుక్లతృతీయ, భానువారము
16-2-64

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

శ్రీ వేంకటేశ్వర శతకము

ముకుంద దైవజ్ఞులు

తెలుగు సాహిత్యము శతకముల కాలవాలము. తక్కిన యేభాష యందు గాని ఇన్ని శతకములున్నట్లు నాకు తెలియదు. విషయి దృష్టి ప్రధానముగా గలిగిన దైనను విషయ ప్రాధాన్యము గూడ కొరవడనివింత కూర్పు మన శతక సారస్వతమును. శతక వాఙ్మయము పరిశోధించి వ్రాసిన పండితుల దృష్టి కందనివి కొన్ని వందల శతకాలైనను ఉన్నవని నానమ్మకము; అరచన యింకను సాగుచునే యున్న దనుటకు ఈ శతకము సాక్షి.

దీనిని రచించిన శ్రీ ముకుంద దైవజ్ఞులు ఐంచుమించు శతవృద్ధులు. వీరు సుప్రసిద్ధమైన కార్వేటినగర సంస్థానమున జీవిత మందలి బహు భాగము గడపి ఇప్పుడు తిరుపతి శ్రీనివాసునియండలో నెమ్మదిగా నిర్లిప్తముగా కాలము గడుపుచున్నారు.

ఆ సంస్థానపు ప్రాచీన మహిమను తెలుపు వీరగాథలు విద్వత్కోకలాహలములు, విషాద కథలు-ఎన్నో శ్రీ ముకుందయ్యగారి మేధలో అచ్చొత్తు కొని నిలిచినవి. మరివాటిని వర్ణించి చెప్ప విచిత్రకళ వీరిసొత్తు. నావద్దకు విశ్వాసముతో తామే వచ్చి వీరు వినిపించిన కొన్ని కథల వివరణ శిల్పము నన్ను వలుమారు ఎంతో పరవశునిగా చేసినది. 'రికార్డింగు' మూలముగా వీరి కథా కథన శిల్పమును భద్రపరచి యెవరైనను పుణ్యము గట్టు కోవలెనని నాయాశ.

తొలిపలుకు, 1964.

కవిత వీరు పనిబట్టి నేర్చిన విద్యగాదు. సహజమైన రసికత్వము చేత, సంస్థానపు వాతావరణము వాసనచేత అలవడినది. అది వీరికి ఆత్మానుభవమందు పర్యవసించినది గాని కీర్తి ప్రతిష్ఠాదులకుపయోగింపలేదు. ఎప్పుడో. 'పద్మవివాహము' అను పద్య కావ్యమును రచించినారట వీరు. ఆపని తనతో చేయించిన శ్రీ వేంకటేశ్వరుని 'నన్నొక పెద్ద జేసి కవినాథులతో సరితూగ జేసి'న 'పన్ను గడేమిటో యెఱుగ' అని ఆశ్చర్యపడుచు పల్కరించినారు వీరు. (ప. 17). ఇది ఈ కవికి ఆరోపితమైన శాస్త్రపు వినయముకాదు. స్వాభావికమే యని నేనెరుగుదును; ఈ శతకమును చదువుకొని యనుభవించు సహృదయులెరుగగలరు.

సాధారణముగా కవితా శిల్పమును నేర్చుకొనువారు తొలిరచనగా భక్తి ప్రధానమైన శతకమొకటో రెండో వ్రాసి తమ జీవిత విద్యకు శీకారము చుట్టుదురని యందురు. కాని అట్టి శతకాలలోని భక్తిభావము సర్వాంగీణముగా పండి భోగ్యమగుట వయస్సు చెల్లి అనుభవమును శ్రద్ధయురూఢ మూలములైనప్పుడే; అప్పటి రచనలందే కవి యొక్క అర్హత స్పష్టముగా చదువరులకు స్ఫురించును.

ఈ శ్రీ వేంకటేశ్వర శతకమున ఈ కవిగారి ఆ హృదయ పరిపాక జన్మమైన నేర్మి అడుగడుగునకు గోచరించుచున్నది.

> సర్వము త్వన్మయంబనుచు సాక్షిగనుండుట కొప్పకుండ నీ
> యుర్విని భ్రాంతిలో పడుచు యోజన సేయక పోతినయ్య; నా
> గర్వమొ? నీదు మాయయొ? ఖగధ్వజ! కారణమేనెఱుంగ,త
> త్సర్వమెఱుంగుదీవు మనసా సకలేశ్వర! వేంకటేశ్వరా!
>
> (ప. 68)

అనుభావమందరును చెప్పలేరు; చెప్పినను ఇంత చక్కగా చెప్పలేరు. శ్రీ వేంకటేశ్వరులీస్తుతి నంగీకరించును. శ్రీ ముకుందదైవజ్ఞ కవిగారికి సర్వ శ్రేయస్సులను దయ చేయును. ఇది నా మంగళాశంస.

తిరుపతి
22-10-1965

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

సర్వజ్ఞుని వచనములు

కలుగోడు అశ్వత్థరావు

సర్వజ్ఞుని వచనాలను కన్నడపు పిన్న పెద్ద లెందరినోటనో ఎన్నో మార్లు విన్నాను. వేమన్న పలుకులను పరిశీలించ వలసినప్పుడు ఆ వచనాలసంహితను కొంత శ్రద్ధగా చూడవలసి వచ్చినది. అప్పుడే వానిని తెలిగించుట చాలా తగిన పని యనుకొన్నాను. రెండో మూడో తెలిగించుటయు జరిగినది. అంతలో "ఆత్మన్యపత్యయంచేతః" అన్నతత్వము అడ్డుదగినది.

ఇప్పటికి మిత్రులు శ్రీ కలుగోడు అశ్వత్థరావుగారు ఆ నా యాశను నెరవేర్చినారు, వేమన పద్యాలవలె సర్వజ్ఞునివి గూడ అనేక విధపదపదార్థముల కలగాపులుగమైన రచనలు. వానిలో తమకు నచ్చినవి–రుచించినవి–మాత్రము కొన్ని–491–గ్రహించి రచించినారు రావుగారు. నేనును చేసియున్న అట్లే చేసియుందును. కాని ఇంత చక్కగా రచింప గలిగియుందునన్న నమ్మిక నాకు లేదు.

"దినము ముప్పదిగ" [491] ఈ తెనిగింపు సాగించినా నన్నారు రచయిత. ఆ ధార ప్రతిపద్యమునను ఇందు చదువరులు గమనింపగలరు, కాని కవితాశిల్పమునకు, అందును భాషాంతరీకరణమునకు, నెమరు ఎంత వేసిన నంతమేలు. ఈ తెలిగింపులో ఆ యాశురచనాచ్ఛాయ లందందు తోపకమానలేదు.

శ్రీ అశ్వత్థరావుగారింకొక నిర్బంధమును విధిలేక గ్రహించినను అందు అసాధారణముగా నెగ్గినారు మూలచ్ఛందోగతినే తెలుగునను దించి

1966; జూన్, 27.

నారు. కన్నడమందలి "త్రిపది" దేశీయమైన ఛందస్సు. దానికి మూలమైన ఐదుమాత్రలగతి తెలుగునను చాలా వ్యాప్తిగలది. మన సీసము, తేటగీతి, ద్విపది, అక్కర మొదలైన వానిలోని అంతర్వాహిని యిదే; అక్షరములను లెక్కపెట్టక వాని, మాత్రలగణములను గణించిచూడగలవారి కిది స్పష్టము, నాల్గు నాల్గు పంచమాత్రాక గణములు గలపాదములు మూడైనచో త్రిపది యగును కాని ఆ పాదములు మూడింటికంటె నాలుగుగానే మలచినచో మన చతురత్రశాభిమానము తృప్తిపడును. ఈ తత్వమును గమనించి సుందర ముగా రచించినది ప్రాచీన నారాయణ శతకము.—

శ్రీ రమా । హృదయేశ్వ । రా ।।।। భక్తజన ।
చిత్తజల । రుహభాస్క । రా ।।।। ।।।।॥
కారుణ్య । రత్నాక । రా ।।।। నీవెగతి ।
కావవే । నారాయ । ణా ।।।। ।।।।॥

ఆధునికులలో శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు దీనిని ధీరలలిత ముగా వాడుకొన్నారు. "శ్రీరామ । భూపాలు । డు ।।।। పట్టాభి॥ షిక్తుడై । కొలువుండ । గా ।।।। ।।।।॥" వంటి ప్రాతతెనుగు జానపద గేయముల చ్ఛందస్సిదే. కన్నడ మందలి త్రిపది—సాహిత్య దృష్టికి త్రిపదిగా గానపచ్చినను దానిని పాడునప్పుడు అయిల్లాండ్రు దానిని చతుష్పదిగానే మలచుకొందురు, ఎట్లనగా,

ఖండిసదె । చిత్తవను । దండిసదె । దేహవను
డుండుండు । స్వర్గవే । రలెక్క ।।, ।।।।।
డుండుం ।। । డూస్వర్గ । వేరలెక్క । అదనేను ।
రండెయా । భువళె స । ర్వజ్ఞా ।।, ।।।।॥

అనగా, రెండవ పాదమును మూడవ గణముతో నిల్పి, పాదము ముగియుదాక విశ్రాంతి తీసుకొని, మరల దానినే నాలుగవ గణముతో చేర్చి, మూడవ పాదము పాడి ముగింతు రన్నమాట. అప్పుడు ఆరెండవపాదపు మూడవ గణముతో వాక్యమో పదమో ముగియ పలయును.

శ్రీ అశ్వత్థరావుగారి రచనలోను ఈ యనుకూలము చాలావరకును నిర్వహింపబడినది. మరి ప్రాసమునకు తోడు తెలుగుయతినిగూడ శ్రీ రావు గారు నిర్వహింపక వదలలేదు. ఇది సామాన్య కార్యముగాదు.

ఈ 'కన్నడ వేమన్న' తెలుగువారి హృదయములను చూరగొనుటలో సందేహము లేదు.

ఇట్లు
రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

తిరుపతి.
27-6-66

శ్రీ యతిరాజీయము (మొదటిభాగము)

కుంటిమద్ది శేషశర్మ

శ్రీ వత్స చిహ్నమిశ్రులు భగవద్రామానుజునికి ముఖ్య శిష్యుడు, గురువుగారిని సేవించుటకై సర్వస్వమును- కన్నులను గూడ-త్యాగము చేసిన ధన్యుడు, స్వాచార్యుల నిత్య స్మరణకై ఆ శిష్యుడు రచించిన శ్లోకము-తనియను-ఇది:-

"యోనిత్య మచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ
వ్యామోహతస్తదితరాణి, తృణాయ మేనే,
అస్మద్గురోః భగవతోస్య దయైక సింధోః
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే.

వైదిక మతములలో నెల్ల ప్రబలమై సార్వభౌమముగా వ్యాపించిన శ్రీ శంకరుల యద్వైత సిద్ధాంతమును నిర్లక్ష్యముగా ఢీకొని నిలబడిన విశిష్టాద్వైతమును ఇంత వ్యాప్తికి తేగలిగినందులకు శ్రీ రామానుజుల ఆ "దయైక సింధు" త్వము-లోక కళ్యాణ లాలస-ముఖ్య సాధనమైనది. పరబ్రహ్మము-నామరూప క్రియాది విశేషణము లేవియు లేనిది. ఒక్కటితప్ప తక్కిన జగత్తంతయు "మిథ్య", వట్టి 'వ్యావహారిక సత్యము-ఇను శబ్ద స్వార్థ పరాయణులైన సామాన్య జనుల జీవితములో నెట్టి విప్లవములు గలిగించునో ఊహించుటయు కష్టము. ఆ అల్లకల్లోలమును నిరోధించి, ప్రజల చిత్త వృత్తిని ధార్మికముగా, అందముగా, శాంతి పుష్టులు నిండు కొనునట్లు సంస్కరించి తరింపజేయు పుణ్యప్రయత్నము చేసిన మహా భగీరథుడు భగవద్రామానుజుడు, యోగులు సాధించు ఆత్మ సాక్షాత్కారానందమును ఆయన

ప్రస్తావన, 1966.

కాదనలేదు. దానిని సర్వశక్తియైన పరమాత్మని సాక్షాత్కారముదాక సాగించుటయే మోక్ష పురుషార్థమని ఆయన ప్రతిపాదించెను. నిష్కల్మష ప్రేమమయమైన భక్తి, నాదేమియులేదు, అంతయు ఆ పరమాత్మనిదే, అను సంపూర్ణ భరన్యాసము, స్వధర్మమును ఫలాపేక్ష లేక ఆచరించుట ఇవే ఆ పురుషార్థము సాధించు యోగములు. తుదకు ఈ చిత్తవృత్తి గూడ ఆ భగవాను డిచ్చినదే యని భావించుట వరకును సాగవలసిన దీత్యాగము. దీనిని,

"స్వామిస్వశేషం స్వవశం స్వభరత్వేన నిర్భరమ్.
స్వదత్త స్వధియా స్వార్థం స్వస్మిన్ న్యసతిమాం స్వయమ్".

అని వేదాంత దేశికులు 'న్యాస దశకము'న సుగహించిరి.

మరి యీభావన గూడ భగవత్కార్యమేగదా! ఈ అనవస్థా దోషము అగుట యెప్పుడు'– అను ప్రశ్న యుండనే యున్నది. కాని అమేయము ఆది మధ్యాంత రహితమునైన భగవత్తత్వమునందు అనవస్థ దోషము గాదు, అనవస్థాదోషమునునదంతే. ఇక ''నేను చేయు పనులన్ని యు భగవంతునివే." అన్న నిశ్చింతతో చేయరాని పనులు చేయుచు 'నిర్భరో నిర్భయోస్మి'. అని స్వచ్ఛంద జీవితమును సాగించు దురవస్థ యీ సంప్రదాయమున కలుగ వచ్చుననన్నచో కాదనుట కష్టము.

ఎట్లును మహాపురుషులందరి జీవిత ప్రయత్నములును తాత్కాలిక ముగా ఏర్పడిన ధర్మవిప్లవమును ఇంచుమించుగా అణచి పెట్టి సామాన్య సంఘమందు ప్రశాంతి సౌహార్దాది గుణములు నెలకొల్పుటకు మాత్రము సాధనములై నడచినవి. తరువాత వానియందలి శబ్దోదేకములు ప్రకము ముగా పలుచబడి వేషభాషాది బహిరంగములందు మాత్రమే తోచుచుండు పరిణామము ప్రాయశః తప్పనిదగును. ఆ మహనీయుల జీవితమునుమన మప్పుడప్పుడు నెమరు వేయుచుండినచో క్వాచిత్ కెనను కొంతైనను హృదయ సంశోధన చేసికోగలము

శ్రీ రామానుజుల చరిత్రను తెను వారిలో

మొదటి వాడు తాళ్ళపాక తిరువేంగడనాథుడు-చిన్నన్న అనవచ్చును. అతని 'పరమయోగి విలాసమున' కడపటిదిగా శ్రీ రామానుజ చరిత్రకలదు.

ఇటీవల శ్రీ తిరుమల బుక్కపట్టణం నరసింహాచార్యులు, 'శ్రీ రామానుజ కల్పకము' అనుపేర మూడు సంపుటముల వచన గ్రంథము రచించిరి.

ఈ "యతిరాజీయము" ఆ గ్రంథమాలలో ఇప్పటికి కడపటి పూవు. ఇంకను పూర్తిగా వికసింపనిది. దాని పృథమ భాగము మాత్రమే యీ సంపుటము. ఎన్ని భాగములుగా కవి సంకల్పముగలదో తెలియదు.

రామానుజ సంప్రదాయమునందు వడగల-తెంగల అనిరెండు శాఖలున్నవని, వాటి పరస్పర స్పర్ధ దుస్సహముగా ప్రబలియున్నదని అందరికిని తెలిసిన విషయమే. ఈ రెండు తెగలవారును ఈ చరిత్రను వివిధ విస్తరముగా వాసుకొన్న వారయిన ద్వితీయ బ్రహ్మతంత్ర పరకాల యతీంద్రులు రచించిన 'పన్నీరాయిరప్పడి (పండ్రెండు వేల గ్రంథము) గురు పరంపరా ప్రభావము' ఇప్పుడు దొరకదు. వారి శిష్యులు తృతీయ బ్రహ్మ తంత్రస్వామి పైదానిని మూడు వేల గ్రంథముగా సంగ్రహించిన 'మువ్వాయిరప్పడి గురుపరంపరా ప్రభావము' కలదు. ఇది తమిళ భాషలో గద్యమయముగానున్నది. ఇది వడగల శాఖవారిది. 'ఆరాయిరప్పడి (ఆరువేల గ్రంథము) గురుపరంపరా ప్రభావము' ఇట్లే తమిళ గద్య రూపముగా వీర్పడిన గ్రంథము; తెంగల సంప్రదాయముది. దానిని రచించినది 'పిన్బళహియ పెరుమాళ్ జీయర్' అనువారు. పైరెండు గ్రంథములను రెండు శాఖలవారు ప్రత్యేకముగా ప్రమాణములుగా స్వీకరింతురు.

సంస్కృత వేదములను ద్రావిడ వేదములను ప్రమాణ గ్రంథములుగానే పరిగ్రహించినను వడగల వారికి మొదటి వాని యందును. తెంగల వారికి రెండవ వాని యందును అభిమానము కొంతమొల్లు చూపు చుండును. కనుక ఆరెండవ [illegible] యందును ముఖ్యమైన చారిత్రికాంశములలో వ్యత్యాసము [illegible] యవాంతర విషయములలో భేదము గాన వచ్చును. [illegible] మో నిర్ణయించుట ఇప్పుడు సాధ్యము గాదేమో [illegible] చ్చినంబి కథ చూపవచ్చును.

కాంచీ పూర్ణుడని పేర్కొనబడిన తిరుక్కచ్చి నంబి భగవద్రామానుజులకు ప్రాచార్యుడైన శ్రీ యామునమునికి-ఆళవందారులకు ఆంతరంగికశిష్యుడు. కంచి శ్రీ వరదరాజు స్వామికి ఆంతరంగిక కింకరుడు. ఆ దేవదేవునితో నేరుగా మాటలాడ గలిగి ఆయన దివ్యచిత్తమును శ్రీ రామానుజులకు తెలియ జేసిన మహాపురుషుడు. అతనిని రామానుజులు ఆచార్యునిగా భావించి గౌరవించుచుండిరి. నంబిది వైశ్యకులము.† రామానుజులొకనాడు ఆచార్యుని శేషప్రసాదము స్వీకరింప నాశపడి ఆహ్వానించెను. అయనయు నంగీకరించెను. ఇంటిలో వంట సిద్ధపరిచి దేవతారాధనము ముగించి, నంబి గారిని తోడుకొని వచ్చుటకై రామానుజులొక దారిని వెళ్ళగా, నంబి మరొకదారిని వచ్చి "అమ్మా! నాకు దేవళమున స్వామికైంకర్య మున్నది. త్వరగావడ్డించితిరేని భుజించి పోవలయును' అని తొందర పెట్టి వడ్డింపించు కొని ఆరగించి వెడలిపోయెను. ఊరంతయు తిరిగి శిష్యుడు గురువుగారిని గానక యింటికి వచ్చి చూచుసరికి ఇల్లాలునంబి గారి యెంగి లాకును కట్టెతో త్రోసివేసి ఆ చోట అవు పేడ నీళ్ళు చల్లి, తానును స్నానము చేసియుండినది. ఇదేమని రామానుజు లడుగగా జరిగిన విషయమును చెప్పి నంబి శ్రీ వైష్ణవ బ్రాహ్మణుడు కాడుగనుక ఆయనకు వడ్డించిన తరువాత స్నానము చేయవలదా?" అన్నదా ఇల్లాలు. రామానుజుల హృదయము దానిచే నొచ్చినది-ఇది తెంగల గురు పరంపర యందలి కథ.

నంబిగారి భగవద్భక్తికిని, శ్రీ వరదరాజస్వామి కాయనయందు గలిగిన అసాధారణానుగ్రహమునకును పరవశులై రామానుజు లొకనాడు, "అత్యంత భక్తి యుక్తానాం నైవ శాస్త్ర నచక్రమః' అను సామాన్యోక్తి ప్రకారము-ఒక యభిసంధి గలిగి-ఆ యభిసంధియేదో గ్రంథము చెప్పదు-

---

† "విష్ణుపాదజకులోత్పన్నుండు' అని యీ కావ్యమున గలదు. కాని 'హరివిలాస' కృతిభర్త అవచి తిప్పయ్యసెట్టి "తిరుక్కచ్చి నంబికుల జలధిశశి"యని (5-61) 'సరసిరుహాభావోరుస్తంభగోత్రాగగామి' (1-67) అనియు స్పష్ట పరిచినాడు. రెండు గురు పరంపరలలోను అతని జాతి పేర్కొనలేదు.

ఆయనను తనయింటికి వేంచేయించు కొనిపోయి నమస్కరింపబోగా అట్లు చేయుట శాస్త్రోల్లంఘనమగునని గురువు శిష్యుని వారించెను. శిష్యుడును విధేయతతో అంగీకరించి గురువుగారిని మరల ఇంటికి సాగనంపి వచ్చి లోపల, ఇల్లాలు నంబిగారు కూర్చొండిన చోటు శుద్ధి చేసి తానును స్నానము చేసి యుండినది. ఆ భాగవతాపచారమునకై రామానుజులు చాలా మనో వ్యథ ననుభవించిరి. ఇది వడగల గురుపరంపర కథ.

రామానుజులు భార్యను వదలి సన్యాసమును తీసికొనుటకు కారణ ములని చెప్పబడు మూడు తప్పులలో ఇది మొదటిది, వడగల వారు డాతి ఛేదము శరీరముండు దాక ఉండవలసినదందురు. తెంగలవారు భక్తి నిండిన వారివిషయమున దానిని పాటింపరాదందురు. పైకథలో తెంగలవారి కథను వడగలవారు చించిరో, లేకపోరి కథను వారు పెంచిరో నిర్ణయింప సాధ్యముగాదు. అసలీకథ చిన్నన్న చెప్పనేలేదు. మరి రామానుజుల సాక్షాచ్ఛిష్యుడైన వడగనంబి–ఆంధ్ర పూర్ణుడు గూడ తన యతిరాజ వైభవ మందు దీనిని తాకలేదు.

ఇట్టివి మరికొన్ని భేదములు గలవు. చరిత్రలు వ్రాసిన ప్రాచీనులు ఇట్టి స్వల్ప వ్యత్యాసములను గమనింపక పెంచియో తుంచియో సాగించిరి. కాని ఆ స్వల్పములే ఈ తెంగల వడగల విభేదములకు స్పర్ధలకు మూలములుగా ఇప్పుడు నిలిచి యుండుట వింత! ఇక ఆధునిక చరిత్ర కారులు గూడ ఇట్టి విషయములకే ప్రాయికముగ ఎక్కువ ప్రాధాన్యమిచ్చుచు వాదోవాదులను చేయుచుండుట అంతకంటె తక్కువ వింత యేమియు కాదు.

ఈ 'యతిరాజీయము' సంస్కృతమునగల 'ప్రపన్నామృత' మను అనంతాచార్యుని కావ్యము ననుసరించి రచించినదని కవి సూచన. నేనా కావ్యము చూచినవాడనుగాను. అది తెంగల సంప్రదాయమునకు చేరునైన దని విన్నాను. కాని తన రచనను,

"అనువాద బుద్ధితో జుల
కనగా జూడక స్వతంత్ర కావ్యమ్ముగా.
గనగా దగు (యతిరాజీయము, 1–8)

అనుట కవి యిష్టము. కనుక. "సంస్కృతమును దెనుగును బరికించి నిజము తెలియు డు విబుధుల్" అను తరువాతి మాటను గమనించి శ్రమింప బని లేదు.

కావ్యముగా శ్రీ రామానుజ కథను సంతరించు ప్రయత్నము హృద యంగమమైనది. పురాణముగా తీర్చుటకు వలసిన అద్భుత విషయాలు ఈ కథలో చాలా తక్కువ. చీకటి రాతి కారడవిలో ఒంటరిగా చిక్కి, శ్రీ పెరుందేవీ వరదరాజుల దయతో తెల్లవారు లోపల ఏ తొందరయులేక ఇల్లు చేరుకో గల్గుట. బ్రహ్మరాక్షసుని పిడిపించుట-ఇట్టి ఒక్కటి రెండు సందర్భ ములు తప్ప శ్రీ రామానుజుల చూపిన నమ్మరాని అద్భుతము లేవియులేవు. ఆయన "పవాడపురుషుడు" గాడు. ఇంత ప్రసిద్ధిని పూజ్యతను సంపాదించు కొని ఇంత కాలము నిలబడిన మహాపురుషులలో ఇంత తక్కువ అద్భుత కార్యములు చేసిన వ్యక్తి యింకొకడు కానరాడు. కనుకట్టులు, హస్తలాఘ వాలు, యక్షిణులు. పెద్దరోగములు కుదుర్చుట మొదలగు చిల్లర జిత్తులో, సిద్ధులో చూపి 'మహాత్ములు' 'భగవానులు'గా చెలామణీయగువారు నాటికి, నేటికి, ఎందరో కలరు. అదివారి తప్పుగాదు. మరి లోతుకు దిగి చూడలేని పామర ప్రజల దౌర్భాగ్యము.

ఇక ఆధునిక పద్ధతిగా 'చరిత' రచించుటకు కావలసిన శాసనాద్యా ధారములు ఈ విషయమున లేనే లేవన వచ్చును. ఉన్నవానిని మన యను భవమును భావనను పురస్కరించుకొని జల్లెడ పట్టి పైకెత్తినచో అది ఆకు-పోకలు రెంటికిని చాలని సున్నమై అతుకుల బొంత యయి పోవును. అందు హృదయంగమమైన తడి యుండదు.

కావ్యరచన రెండు ముఖ్య శాఖలుగానుండును. ఒకటి తాత్కాలిక ముగ మన మనస్సులలోని కుళ్ళును జళ్ళును, ఆశానిరాశలను, అసూయాభి మానములను వెలవరుచునది. దీనిని ఆత్మాశ్రయమని పేర్కొందురు. దీని కొలత చిన్నది. ఈ క్షుద్ర రచనలు మొదటినుండి మనలో వెలువడుచునే యున్నవి. తెనుగులో ఇప్పుడివి విధిపిరామము లేక సాగుచున్నవి.

రెండవది ప్రమాణములో పెద్దది. ప్రమేయము వివిధ సందర్భములతో వివిధ వ్యక్తుల నడవడులతో నిండి యుండును. దీనియందు విషయభావన విషయిభావనకంటె లోతుగా విశాలముగ పరాశయముగా సాగవలసినది. ఈ 'మహా' కావ్యరచనకు చేయివేయగల వారు ఎప్పుడును కొందరే. ఆ పరరికాణయ ప్రవేశ యోగమున సిద్ధి పొందగలిగినవారు, కాలూని నిలబడగలిగినవారు 'ఏ యిద్దరు ముగ్గురో'!

"మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే
యత తామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః"

(గీత. 7-3)

అన్న భగవద్వాక్యము కావ్యరచనా సిద్ధికిని అన్వయించును. ఓర్పుతో, నేర్పుతో, లోకకళ్యాణమునకై, ప్రయత్నించి పారమార్థికముగ పరిశ్రమించిననే కాని మనలో భగవద్దత్తమైన ఆ యాధ్యాత్మిక శక్తి యెంత కలదో తెలుసుకొనలేము. ఈ పరిశ్రమలో ఎంతో సిస్సారము దుస్సారము నైన కుప్ప బయలు పడుట తప్పదు. కాని మనుష్యుడు శాశ్వతముగా నిర్మించుకొన్న వస్తువులలో గొప్పది, చెత్తబుట్ట; అందలి సరకును ఏ గాలియో ఊడ్చికొని పోవును.

ఈ మహాకావ్య రచనకు పూనుకొన్న చిరాయువు శ్రీ కుంటిమద్ది శేషశర్మ నా సమీపబంధువు. ఆ కుంటిమద్ది మా రాళ్ళపల్లికి ఎక్కువ దూరముగాదు.

పశ్చిమాంధ్ర సీమయందు పెనుగొండ తిరుమల వారనబడు శతమర్షణ గోత్రపు శ్రీ వైష్ణవ కుటుంబములు పెక్కింటిలో కుంటిమద్ది వారిది పేరుగన్నది. అనూచానముగ మారెండు కుటుంబములకును సౌహార్ద విశ్వాసములు నెలకొని యున్నవి.

ఈ కవి పితామహులు శ్రీ శ్రీనివాసాచార్యులు మరి రెండు విధముల నాకును బంధువులు. మైసూరు శ్రీ బ్రహ్మతంత్ర పరకాలాస్థానిలో మహారాజ గురువులుగానుండిన, ఉదాత్తమైన చంపు, నాటక, కావ్య ధర్మ శాస్త్రాలంకారములు మొదలగు బహుగ్రంథములు రచించి సుగ్రహీత

నామధేయులైన శ్రీకృష్ణ బ్రహ్మతంత్రపరకాల యతీంద్రులకు సంస్కృత సాహిత్యమున ఆయన ప్రథమ శిష్య పంక్తికి చేరివారు. నాది కడపటిపంక్తి. నామాతామహులయిన అనంతాచార్యులవద్ద జ్యోతిష్యమును వారభ్యసించిరట. ఆ కారణముగ మాయిద్దరి నడుమ సుమారు అర్ధశతమానము వయోభేద మున్నను, వారికి నాయందు భ్రాతృవాత్సల్యముండెడిది. ఇదిగాక వ్యాకరణ వేదాంత ధర్మశాస్త్రములెన్నిటనో పట్టభద్రులు. సామాన్యముగ వైదిక సంప్రదాయమువారు తాకని భరతశాస్త్రమును గూడ, ఏదో యొక మాటకులోగి, వెంపరలాడించినవారు. నంది భరతము, అర్జున భరతము మొదలుగా ఏడో ఎనిమిదో భిన్న భరతశాస్త్ర గ్రంథములువారివద్ద నుండెడివట. అందు కొన్ని కి. శే. మానవల్లి రామకృష్ణకవిగారి చేతికి జిక్కి అంతర్ధాన మైనవని వినికి. తక్కినవైనను దక్కిన పుణ్యాన మనము పోలేదు.

ఆ తాతగారి వద్దనే సంస్కృత సాహిత్యమున దృఢమూలముగా బాలలీలలు చేసిన వాడీ పౌత్రుడు. తిరుపతి పాఠశాలయందా కాలమున నుండిన మహా విద్వాంసులవద్ద మెలిగి 'సాహిత్యశిరోమణి'గా మెరుగెక్కినాడు. స్వయం కృషిచే తెలుగు మరుగు మెరుగులు తరచి యెత్తుకొన్నాడు. రెంటియందును ధారామధురమైన కవితా కళలు నిర్వహింప గలిగిన నిత్య వ్యాసంగి. పెద్దన్నగారి మను చరిత్రను. సంస్కృతమున తీయనిశయ్యతో పరివర్తించినవాడు. 'తెనుగు తల్లి' 'సుధాబిందువులు' 'రామిరెడ్డి' మొదలగు చిన్న కావ్యములు కొన్ని తెలుగువి, సుమతి శతకమునకు సంస్కృతానువాదమును ఈ వరకే వెలుగుచూచినవి. ఏ పద్యము ఏ శ్లోకము వ్యాసినను సుప్రసన్నమై సంస్కార నిశితమైన మార్గమున, నెమ్మదిగా, అన్వయ గ్రంథులు లేక, అధిక ప్రసంగమును లేక సాగించు శక్తి యీ కవిది.

కావ్యాదియందు కవితాకళను గూర్చి కొన్ని పద్యములు ఇందు గలవు. అవివట్టి సంప్రదాయపు మాటలు గావు. ఈ కవిస్వాభిప్రాయములు. ఈయన కవితాశిల్పమున సర్వత ప్రతిఫలించినవి. అవన్నియు సహృదయులంగీకరింప గలరు. కాని ఒక్క విషయమున మాత్రము నేను ఈయనతో కొంత వేరు పడవలసి యున్నాను.

అర్థ మెరుగరానిదప్రయుక్తంబని
యెంచ వలవదీసడించవలదు;
భాష కంతు లేదు, బహు కావ్యములఁగాంచు
కడక, యవధి, లేదు గాన మనకు.

ఇందలి యుత్తరార్ధము మాటనిజమే. భాషలో ఉండిన ఉన్నశబ్దమున్నియు ఎరిగిన వా రెవరు? కనుక 'అప్రయుక్తము' అనగా ఎవరును ఎప్పుడు ప్రయోగించి యుండనిది అని యర్థముగాదు. అటువంటి పదము వ్యాకర్తలు గాని, నిఘంటు కర్తలుగాని గ్రహించుటయే జరుగదు. ఏమూలలో ఏకాల ములో ఏకొందరు వాడియున్నను ఆ పదములు గ్రహించి వ్యుత్పత్తిని అర్థ మును సూచించుట వారిపని. కానిఅది కవి కార్యము గాదు. కాళిదాసాదులు సంస్కృతమున నన్నయ తిక్కనాదులు తెలుగున, క్వాచిత్వముగా అట్టి పదములు ప్రయోగించుట సత్యమే, కాని వారి కావ్య గౌరమున కది హేతువు గాదు కనుక మన కనుసరింప దగినదియుగాదు. అట్లగుటచేత వాడుక తప్పిపోయిన కొన్ని శబ్దములు అందందు ప్రయోగించుటయు, వానికి అర్థము వాయుటయు, ఈ కావ్యమున సంభవించి కవికిని చదువరుల కును వెట్టి పని కొంత యేర్పడినదని నా తలంపు.

బండిరాలు సిద్ధ ఖండబిందువులును
గాల ఏకట వదన గలిత మగుటఁ
'గానరా' వటంచు గాలింపఁ బనిలేదు,
తొలచినాడ వానిఁ దెలిసి తెలిసి" (1–16)

అని చూపించిన స్వతంత్ర ప్రవృత్తి పై 'అప్రయుక్త' పదములను గూర్చియు ఈ కవి చూపియుండినచో చదువరులు ఎక్కువ సంతోషించి యుందురు. మరి ఆ ఖండబిందువులలోను సాధ్యమైనవి చేయని యపరాధము సిద్ధము లేమి చేసినవో నేనూహింపలేను.

"సరస్వత్యా స్తత్త్వం కవిసహృదయాఖ్యం విజయతే" అను అమూల్య మైన మాటతో అభినవగుప్తాచార్యుడు ధ్వన్యాలోక వ్యా ఖ్యానమునకు నాందీ మంగళము చెప్పినాడు. వాగ్దేవీ విలాసములో కవి—సహృదయు లిద్దరి

కని సమానమైన ప్రపత్తి, విలువ, కలవు. కవి యుద్దేశింపని యర్థభావములను బలవంతముగా ఈడ్చి చూపు వ్యాఖ్యాత, "ప్రాతవడ్డ మాటలు" చేర్చి చదువరులను చిక్కు పరచు కవి—ఇద్దరును ఒక పంక్తివారు, సరస్వతీ తత్త్వాను సంధానమున ఇంకను కొన్ని మెట్లెక్క వలసినవారు. అది యుండనిండు.

శ్రీ శేషశర్మ రచించిన యీ కావ్యమందలి ప్రసాద మాధుర్యములు, ఆర్ద్రవ సౌకుమార్యములు తెలుగు చదువరులను తొలినుండి తుదివరకును ఆకర్షింప గలవు. శ్రీ భగవద్రామానుజుల మహనీయ చరిత్రను ఆయన నెలకొల్పిన సాత్విక భక్తి ప్రపత్తి మధువును తంగేడి ఱొన్నుగా వారి హృదయముల కందింప గలవు.

ఈ కవి భవిష్యత్కవితాలహరికి నామంగళాశంసలు. ఈ యతిరాజీయము పూర్తియై త్వరలో వెలువడి వెలయును.

తిరుపతి
పరాభవ చైత్ర
శ్రీరామనవమి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

శ్రీరామ నిర్వేదము

నారు నాగనార్య

ఇదొక అపూర్వరచన. అసాధారణము గూడ. సీతాద్వితీయవియోగ విధురుడైన శ్రీరాముని హృదయ వేదనను విపులముగా స్ఫురణకుఁ దెచ్చు ప్రథనమిది. సీతా తృతీయ వియోగమునకు తరువాతి దని కూడ భావింప వచ్చును గాని ప్రంథావసానమున "సీ. యాస్యాంబురుహంబు గాంచి ముద మందెన్ డెంద మింకేమి యీ నాయానందము మేరమీరె" (ప. 163) నని శ్రీరాముని మాట కలదు గనుక ఈ కావ్య సందర్భము రెండవ యెడబాటు తరువాతి దనియే చెప్పవచ్చును. ఇట్టి నిర్వేదము ఇతరులైనచో కొన్ని పద్యములలో ముగించి యుందురు. ఈ గ్రంథమందఁ 163 చక్కని పద్యములుగా విస్తరించుకొన్నది.

"ఒక యంశమ్మును గూర్చి నైకవిధ భావోద్వేగ సంపత్కళా
త్మక కావ్యంబు రచించుటంత సులభంబు"

గాదని కవియే అన్నారు. (165ప.) నిజమే. ఇదిగాక యిన్ని పద్యములును తెలుగు వారికనూచానముగా అచ్చమెచ్చైన చంపకోత్పల మత్తేభ శార్దూల వృత్తముల మయమై నిరర్గళ ధాటిగా సాగినవి.

అంతర బాహ్య ధర్మముల సంఘర్షణలో బాహ్యధర్మమే ప్రబలమని భావించి యాచరించిన శ్రీరాముని "పుటపాక ప్రతీకాశ" మైన కరుణ

భూమిక, 1967, డిశంబర్, 12.

శ్రీ ఆత్మారామ విహారము, నాగవరము.

భావము నిష్ప్రతీకారమైనది. అనుకంప యొక్కటే దానికి మనుషులు చూపగలిగిన చూపవలసిన ప్రతిభావన. తన హృదయమందలి ఆ ప్రతి భావననే ఖండన సమర్థనల గొడవకుపోక, యీకవి యిందు నిబంధించి నారు. దానికి అడివారముగా, అక్కర లేకున్నను, సీతా-రాములు ప్రకృతి-పురుషులను ఆధ్యాత్మిక రూపణము గూడ కవిభావనకు సాయపడినది; మన యనుభవము వట్టియాధిభౌతికమై పోసీయక కొంత పైమెట్టున కెక్కించు చున్నది. సీతావిషయమైన శ్రీరాముని ప్రేమ కామచోదితము గాదని కవి భావన.

"ఆంగిక సౌఖ్యసంపదల కాస యొకింతయులేదు; నిర్భరా
నంగ శరాభిభూత వివశాత్ముడ నంతకు మున్నెకాదు;నా
యంగద, స్నేహశీలవు ప్రియంవద వార్ద్రమనస్కవైన నీ
చెంగటనిల్చి యీ హృదయ శేవధి నప్పన సేయుకోసమే

(142 ప.)

ఇది శ్రీరాముని హృదయ తత్వమును లోతుగా దిగిచూచిన యుదాత్త భావన.

ఈ కావ్యధార ప్రాచీన మార్గమున పరిణతమైన శయ్యతో నాగేటి చాలువలె నిటారుగా సాగియుండుట చదువరులకు హృదయంగమమైన విషయము. భాష స్వాధీనమైనది. అర్థ భావములలో అర్థము కన్న భావము ఉద్విగ్నముగా గోచరించును. పద్యములు ఎత్తుగడ యెట్టిదైనను తడవు కొనక తిరిగి చూడక తలకొలము దాక సాగినవి. అచ్చ తెలుగులోనే కావ్యములు రచింపగల ఆధునిక కవులు కొందఱే. వారిలో ఈ కవిగారి పదవి సుప్రతిష్ఠితము. ఆ యచ్చతెలుగు మీది యభిమానము ఇందును ఒకటి రెండు చోట్ల పల్లవించినది. సంస్కృత జటిలము గానున్నను ఈ కావ్యమందలి సీత "నాగలి చాలి పుట్టువు" అనిపించుకొన్నది. (132 ప.) పెద్దవృత్తములనే గ్రహించుట చేత అందందు కూర్పు ఎక్కువ యై ప్రసాద గుణము కొంత కుంటు పడినదని స్వచ్ఛంద శబ్దరూపములు కొన్ని దొరలినవని, అర్థములలో కొంచెము పునరుక్తికి పాలైనవని సూచింప కుండలేను. కాని మంచి సర్వాంగీణ సౌందర్యముగల పద్యములెన్నో ఇందున్నవి.

వానిని పరిచయ వాక్యములలో నుదాహరించుట వట్టి విస్తరమగును.

శ్రీ నారు నాగనార్యుల ప్రశాంతమైన పల్లెటూరు వాతావరణమున ఆశ్రమ జీవితమును సాగించు మధుర హృదయులు "శివేత రక్షతి" మాత్రమే ఫలముగాగోరి సాహితీ వ్యాసంగము సాగించువారు. ఈ కృతితో వీరు రచించిన కావ్యములు "ఏబదొకండు (134 ప). అందులో ముద్రించి నవి ఇప్పటికి 15 మాత్రమే! "అంకానాం వామతో గతిః" అన్న ప్రాత ఛాదస్తము ఇక్కడ గూడ అన్వయించుట చింత్యము! త్వరలో యోగ్యమైన దక్షిణాచారము ఆ రచనలకు లభించునుగాక!

తిరుపతి
12-12-1967

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

సీతాప్రవాసము

కనమలూరి శివరామయ్య

'రామాయణ కవుల బరువ్రతో ఫణిరాయడు తినుకుచున్నాడు' అని కన్నడ కవిరాయడు గదగు నారణప్ప చెప్పెను. ఇది సుమారు ఆరునూఱేండ్ల మాట. ఆదిశేషునికి ఆ బరువు ఇప్పటికింకను ఎన్నో రెట్లు పెరిగినది. పెరుగనున్నది. హిందూజాతి సృష్టిలో నిలిచియుండు దాక శ్రీ సీతారాములకథ, దానిని ఆత్మ తృప్తికై యిష్టాను సారము నెమరు వేయు కవులు ఎడతెగక పుట్టుచునేయుందురు. వారిలో కొందఱు ఉన్న కథా వృక్షముతో తృప్తిపడక కొమ్మలు రెమ్మలు ఎన్నో కల్పించి, చేర్చి సంత సింతురు. మఱికొందఱు ఉన్నదానినే తమ నోరార ఱునశ్చరణము చేయుదురు.

ఈ రెండవ తెగకు చేరినవారు ఈ చిన్న కావ్యము రచించిన నామిత్రులు శ్రీ కనమలూరి శివరామయ్యగారు. సంప్రదాయ శుద్ధమైన కవ్వడు లేనిభావన, స్నిగ్ధమైన హృదయము, ప్రసన్న మధురమగు నడత, ఇవి వీరి వ్యక్తికి నింపునిచ్చినవి. వీరి యాంధ్రసాహిత్య సౌష్ఠవము గూడ వానిచే రూపొందినది. ఉపాధ్యాయవృత్తి వీరి జీవనాడి. శిష్యులందఱి ప్రేమగౌరవములు వీరు సాధించిన మహాఫలములు. ఈ కావ్యమందా గుణమే ఆద్యంతమును ప్రతిఫలించుచున్నవి.

'శోకమేశ్లోకముగా' పరిణమించిన వాల్మీకిరచనలో సీతారాముల

ఉపోద్ఘాతము, 1968, జూన్. 27.

దివ్యదాంపత్యము విషాదాంతముగా పరిణమించినది. అదే సత్యముగా వచ్చును. కని, సౌకుమార్యము, సౌమనస్యము పరమఫలముగా పెరిగిన భారతీయ సంస్కృతిలో కొందఱికైనను ఆ పరిణామము, ఓర్చుకోరాని దైనది. కనుకనే వాల్మీకిరామాయణము 'వేదఃప్రాచేత సాదాసీత్' అని భావించి పూఱాపారాయణములచే ఎంత గౌరవించినను అదంతయు అరు కాండలకే నివేదించి ఉత్తరకాండను మనవారు దూరముగా నుంచిరి. తుదకది వాల్మీకి రచన కాదేమో అన్న సంశయమునకును పాల్పరచిరి. మఱి ఆ యాదికవి కోకిల పంచమ స్వరము గూడ ఆరుకాండల షడ్జ స్వరముతో సంవాదము చాలకుండనే ఉత్తరకాండలో సాగిన దనక తప్పదు.

విషాదాంతమైన యీ కథ ప్రసాదాంతముగా పురాణాంతరము లలో నున్నదంచురు. దాని ప్రామాణికత యెట్లున్నను అది మనలో అనేకుల హృదయములకు నెమ్మది గలిగించినది. భవభూతి మహాకవి ఉత్తరరామచరిత్రలో ఆ మార్పును వెలయించెను. తెలుగు కవితకు పట్టు గొమ్మ తిక్కన సోమయాజి ఉత్తర రామాయణమునట్లే ప్రసన్నాంతముగా తీర్చెను.

శ్రీ శివరామయ్యగారు కూడ ఆ ప్రతీవనేతమ యీ ప్రసన్న మధుర రచన సాగించినారు. పండిత పామరులు, బాలవృద్ధులు అను భేదములేక తెలుగు వారెవరైనను దీనిని చదువుకో గలరు; చదువుకొని ఆనందింప గలరు.

తిరుపతి
27-6-68

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

ఆంధ్రపద్య గీతాంజలి

వే. ఆంజనేయ శర్మ

రవీంద్రమహాకవి రచనలు-ముఖ్యముగా-గీతాంజలి—ఎందరో తెలుగులోనికి పరివర్తించినారు. ఆయనకు నోబెల్ బహుమాన మందిచ్చిన గీతాంజలిని మొట్టమొదట సుమారు 1911లో తెలుగు తేటగీతులుగా వడగట్టించినది కీ॥ శే॥ అదిపూడి సోమనాథకవిగారని నాజ్ఞప్తి. ఇప్పటికి కడపటిది శ్రీ ఆంజనేయశర్మగారి యీ మధుర రచన. ఈ రెంటినడుమ అయిదారైనను వేరువేరు తెలిగింపులు వివిధములుగా నా కంటి కందినవి. అందనివియు కొన్ని యుండును.

ఉదాత్తరచనలకు ఎన్ని భాషాంతరీకరణము లున్న అంతమేలని ఒక మహా పండితుడు నాతో నన్నాడు. ఒక్కొక్కరికంటికి మూలమందలి అంద చందములు వేరువేరుగా స్ఫురించునని ఆయన ఆశయము. అన్నియు ఒక్కనికి స్ఫురింపవు. కనుక ఈ విషయమున పునరుక్తి దోషముగాక గుణమే యగును.

శ్రీ శర్మగారి యీ పరివర్తనము బంగారీ మూలమును గాక దాని పరివర్తనమై అన్నిదేశముల వారికిని అందుబాటులోనున్న ఆంగ్లరచన నాశ్రయించి సాగించినదని వారే నాకు తెలిపినారు. ఆ రెండు మూలములతో దీనిని పోల్చి చూచుశక్తియు, అవకాశమును నాకు లేవు. స్థూలముగానే నేను చదివి మూచినప్పుడు ఆపోలిక అనావశ్యక మనిపించినది. పరివర్తన

అభినందనలు, 1969.

మునకు అది మొదటి మహాగుణ మని నావిశ్వాసము. సూక్ష్ముగా పరిశీలించినచో శ్రీ శర్మగారి తెలిగింపులో ని మెలకువ లింకను పెక్కులు గమనింప వచ్చుననుమాట నిస్సందేహము.

ఉభయభాష లందలి తలస్పర్శియైన వ్యాసంగమునకు తోడు రచనలో ఆతములేని సంయమము, భావుకత, వినయము, ఇందలి ప్రతిఖండిక యందును కానవచ్చును. ఈ సంపుటి మొదటి తిలకముగా చేర్చిన "పరాత్మ స్తుతిః" అను వీరి స్వతంత్ర సంస్కృత రచన చిన్నదైనను లోతైన వీరి భావనకు, భాషాపటిమకు, ఆర్జవమునకు, చక్కని సాక్ష్యముగా నున్నది. నేటి సంస్కృత పండితులలో ఇంత చక్కని రచన చేయగలవారు పలువురు కానరారు.

ఒకటే పద్యమనిగాని, దానికి నాలుగే పాదములని గాని నియమమును వీరంతగా ఇందు గమనింపలేదు. మూలమందలి యర్థభావముల తీర్పునకు అది యెంతో ఈ రచనకు సహాయ పడినది. కనుక చదువరుల కది కొదువగానే తోపదు. హార్ద సౌందర్యరసికులకు శారీరనియమముల మీది చూపు పడిపోవుట తప్పదు.

ఈ కృతికి నామంగళాశంసలు.

రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ

సుందరపాండ్య విరచిత ఆర్య

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

సుందరపాండ్యుని యీ పరమసుందరకృతిని సంపాదించి మొట్ట మొదలు ప్రకటించినది శ్రీకనుపర్తి మార్కండేయ శర్మగారు-1928లో. దానిని సంస్కరించి పరిశోధించినది శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, శ్రీ పురాణం సూర్యనారాయణ తీర్థులును. ప్రభాకరుల సంస్కృతోపోద్ఘాతము, శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారి ఆంగ్లపీఠికయు చిన్నవైనను ప్రామాణ్య సౌరభముగలిగి ఆ ముద్రణము నలకరించినవి. పైనలువురు మహామనీషుల యశఃకాయము జరామరణభయములేక వెలసియుండుటకు గల ఎన్నో ఘన కార్యములలో ఇదొకటి. ఈ ప్రస్తావనలోని ముఖ్యవిషయములకు ఆ రెండు పీఠికలే ఆధారము.

మద్రాసులోని ప్రాచ్య వాచ్యపుస్తకముల బండారమున 'నీతి ద్విషష్టిక' అను పేరుగల ఒక ప్రతి గలదు. మూలగ్రంథమందలి ఆద్యంత పద్యములలో ఇది 'ఆర్యా' అని మాత్రమే పేర్కొనబడినది. అందలి పద్యముల మొత్తము 116. నాలుగు పద్యములు తక్కువైనను గుండు సంఖ్యగా ఎవరో 'నీతి ద్విషష్టిక' అని దీనిని పేర్కొన్నట్లున్నది. వాచ్యప్రతిలో చేతితప్పులు గ్రంథపాతములును గలవు. వానిని సవరించి పరిష్కరించి ముద్రించుపని సగము సాగినపిదప తిరువనంతపురము రాజకీయ పుస్తకశాలయందలిది ఇంకొక ప్రాచ్యప్రతి సంపాదకులకు దొరకినది. లేఖకప్రమాదములు

ప్రస్తావన, 1970.

శ్రీరాయల సాహిత్యపరిషత్తు, ప్రొద్దు.

అందును గలవు. దానికి 'ఆర్యావలి' అని అక్కడి నామకరణము. అదియును మూలగ్రంథమున లేనిపేరే. ఆ పద్ధతిలో మొదటిదానిలోలేని 33 ఆర్యలు ఎక్కువగాఁ గలవు. అవి వేఱుగానున్నవో, లేక తక్కిన 116 ఆర్యలలో యథాయథముగా కలిసియున్నవో, సంపాదకులు తెలుపలేదు. అచ్చులో ఆ 33టిని అనుబంధముగా చేర్చినారు. శబ్దార్థశైలీ వైశిష్ట్యమునుబట్టి ఆ యార్యలును అసలు కవి రచించినవే యని సంపాదకుల యభిప్రాయము. దానిని కాదనలేము. కనుక నే నిక్కడ వానిని అనుస్యూతముగానే కలిపితిని. మఱి 'నీతిద్విషష్టిక' 'ఆర్యావలి' అను రెండు పేళ్ళను గ్రంథగతములు కావు గనుక, గ్రంథమందలి 'ఆర్యా' అను పేరే ఇక్కడ నిలిపితిని.

పరిష్కర్తల ప్రామాణికమైన పాండిత్యము జగమెఱిఁగినది. తప్పులు నిండిన రెండు వ్రాతప్రతులతో ఇంత చక్కగా ఈ గ్రంథమునుద్ధరించుట సామాన్యకార్యము గాదు. అందుకు సంస్కృత సాహితీరసికులందఱి ధన్యవాదములును వారికి చెల్లును. ఐనను కొన్నిచోట్ల పాఠ పరిష్కరణము ఇంకను చేయవలసియున్నట్లు తోఁచును. నా మిత్రులు సుగృహీతనామధేయులు డా॥ వి. రాఘవగారు కొన్ని యేండ్లుగా దీని పరిశోధనవ్యాసంగమున నున్నారు. వారి పరిష్కరణమింకను వెలువడలేదు. కొంతకాలము క్రింద వారిని కలిసికొని నా సందేహములలో ఒకటి రెంటిని సరిచూచుకొనఁగలిగితిని. దీనికి వారికి కృతజ్ఞుఁడను. నాకు తోఁచిన కొన్ని చిఱుమార్పులను ఇక్కడ అందందు సూచించినాను. వానిని సహృదయరసికులు సమీక్షింతురు.

దీని తుదిమొదలి పద్యములలో కర్త సుందరపాండ్యుఁడని మాత్ర మున్నది. అతనిని గూర్చిన యే యితర విషయముగాని యిందు కానరాదు. ఎవఁడీ సుందరపాండ్యుడు? ఎప్పటివాఁడు?

మధురలో వేంచేసియున్న పరమశివమూర్తికి సుందరపాండ్యుఁడను పేరు అనూచానము. అతఁడిలువేల్పుగా మధురనేలిన రాజులెందఱో సుందరపాండ్యులు చరిత్రసిద్ధులు గలరు. ఇతరత్ర ఆ పేరునకు వ్యాప్తిలేదు. కనుక ఈ సుందరపాండ్యుఁడు శాత్యుఁడైన ద్రావిడుఁడనవచ్చును.

'వీరపాండ్యక్షితీశుఁడు' రచించిన సంస్కృత క్రియానిఘంటువు గలదు. అందలి 14 వ శ్లోకమునుండి 'నిక్షతి చుంబతి నిం స్తే తన్వ్యాముఖపంకజిం ప్రేయాఁ' అను భాగమును క్రీ. ప. 12వ శతాబ్దిలో కృష్ణలీలాశుకముని తన 'పురుషకార' మను వ్యాకరణగ్రంథమున సుందరపాండ్యునిదిగా ఉదాహరించెను. 'వీరసుందరపాండ్య' అను పూర్ణనామము అనేక శాసన ములలో కలదు. మీఁది క్రియాసిఘంటుకర్త వీరపాండ్యక్షితీశునికి వీర సుందరపాండ్యక్షితీశుఁడని నిండుపేరుండె ననుకోవచ్చును. అట్లైనచో మన గ్రంథకర్త రాజుగా నుండెననియు భావించుట సులభము.

జల్హణుఁడు మొదలుగా తరువాతి సుభాషిత సంగ్రహకర్తలెందఱో ఈ ఆర్యలను కొన్నిటిని గ్రహించినారు. కొందఱు కర్తను పేర్కొనలేదు. పేర్కొన్నవారు తప్పుపేళ్ళిచ్చినారు. లోకవ్యాప్తముగానున్న శ్లోకాలను వినికిచే గ్రహించి అసలు గ్రంథమును చూడకయే వారట్లు చేసినారనుకో వలసియున్నది. కాని వీరందఱికంటె ప్రాచీనుఁడు సూర్యపండితుఁడు-12వ శతాబ్దివాఁడు-'కులశేఖరసూక్తి రత్నహారము' అను తన సుభాషిత సంగ్రహమునందు ఐందలి యార్యలను సుందరపాండ్యనిపనియే పేర్కొన్నాఁడు. ఇంకను ఇందలి 'చారిత్ర నిర్మల జలః' అను 24వ ఆర్యను జనాశ్రయుఁడు తన 'ఛందోగ్రంథమున ఉదాహరించినాఁడు. అతని కాలము సుమారు క్రీ. ప. 600 మఱియు క్రీ. ప. 5వ శతక మునకంటె ప్రాచీనమనఁదగిన విష్ణుశర్మ పంచతంత్రమున ఇందలి 29, 30, 48 సంఖ్యల ఆర్యలు గ్రహింపఁబడినవి. ఈ కారణములచేత ఈ 'ఆర్యా' కర్త సుందరపాండ్యుని పరమప్రాచీనత స్పష్టము.

ఇంతేకాదు. శ్రీ శంకరాచార్యులు సమన్వయాధికరణ సూత్ర భాష్యము తుదలోను, కుమారిలభట్టాచార్యులు తంత్రవార్తిక బలాబలాధి-కరణమునను కొన్ని మీమాంసాకారికలను ఉదాహరించినారు తరువాతి ప్రాచీనవ్యాఖ్యాతలు ఆకారికలు ఆచార్య సుందరపాండ్యునివని వివరించి నారు. అరికేసరి యను ఒకనొక ప్రభువు తన పూర్వికులలో 'సమస్త శాస్త్ర ర్ణవ కర్ణధారుఁ' డగు ఒక సుందరపాండ్యుని పేర్కొనుచు శాసనము

వేయించినాఁడు. ఈ శాసన కాలము సుమారు 750 వ క్రిస్తాబ్దము. (శిన్న మానూరు శాసనము). ఈ 'ఆర్యా'కర్త తాను 'శ్రుతిస్మృతి ప్రసృత సత్ప దార్థజ్ఞుఁ'డని చెప్పుకొన్నాఁడు. కనుక నీతివేత్తయైన యితఁడే దార్శనికుఁడైన యతఁడు గావచ్చునని విమర్శకుల యభిప్రాయము; ఇప్పటికి కాదన లేము.

క్రిస్తుషష్ఠశతకమునకు పూర్వమే మధురలో 'తమిళ్ సంగం' అను కవి విద్వత్సమితి యుండెడిది. ఆ సమితికి ఉదాత్తమని తోఁచిన రచనను బంగారుపీటమీదనుంచి కనకాభిషేకముచేయు సంప్రదాయముండెను. ఈ 'యార్య' కడపటి 'ఇమాం కాంచనపీఠస్థాం' అను శ్లోకము ఆ సమ్మానము దీనికి జరిగినట్లు-జరుగవలసినట్లు-చూచాయగా సూచించుననియు పీఠికా కర్తల ఊహ.

మీఁదివన్నియు అట్లుండనిచ్చి కేవలము భాషావిశేషమును శయ్యా మాధుర్యమును ధారాసౌష్ఠవమును గమనించు అనుభవరసికులకు ఇది చాలా ప్రాచీనమని తోఁపకపోదు. ఇట్టి రచన సంస్కృతసారస్వత మునందు నిలిచిపోయి వేయేండ్లైనను గడచినవన్నను తప్పుగాదు.

ఇందుఁగల ఆర్యలన్నియు ముక్తకములే. ఒకదానితో ఇంకొకటికి అన్వయసంబంధము లేదు. తోఁచిన భావమును అప్పుడే ప్రాసిపెట్టిన రచన యిది. ఒకటి రెండుచోట్ల పద్యములు సాటికి పోటికి రచించినట్లు తోఁచును. (చూ. 9, 17) అర్థభావముల పునరుక్తియు క్వచిత్తుగా లేక పోలేదు. (10,70) కాని రచనలో విన్నరుచి గలదు.

ఇది ధర్మశాస్త్రముగాదు. స్వర్గనరకాల పేరాసలు-బెదరింపులు-ఇందు లేవు. శృంగారమును సూదంటురాయిగా ప్రయోగించి లాగుచక్కందము ఇక్కడ కానరాదు. ముక్తిని పరిశీలించు ముడిసరుకు సోఁకులేదు, ఇది వట్టి నీతికోశము. ఎంతో లోకానుభవము పరిశీలన గలవాని హితబోధ. సాధారణ జీవితమును ప్రశాంతమధురముగా ఒడుదుడుకులులేక సాగించు నెమ్మది ప్రోవ దీని ప్రమేయము. ఇందలి ప్రతిపద్యమునందలి యుపదేశ

మును, అందఱికిని, జాతిలింగాదివివక్షలేక, ఒకమారుగాకున్న ఇంకొకమారు, మితసమ్మితముగా జీవితమందాదుకొనఁగలము. ఆధ్యాత్మిక శాస్త్రములు అర్థముకాక, అనుభవమునకు రాక, పోవచ్చును, జాతి మత దేశ సంఘాముల ధర్మశాసనములు మోయరాని బరువులై తోఁపవచ్చును, అర్థ కామశాస్త్రములు చిత్తశుద్ధిని చెఱచి, తప్పులదోవలకు లాగవచ్చును. కాని తన, ఇతరుల యోగక్షేమములు మాత్రమే తాత్కాలికఫలములుగా చూచు ఇట్టి నీతి సార్వకాలికము, సర్వజనీనము, భర్తృహరి సుభాషితములు మొదలైనవి ఎన్నో నీతిగ్రంథములు పూర్వకాలమునుండియు సంస్కృత ప్రాకృతములలో నున్నవి. కాని వాని ప్రమేయము ఇట్లు వడియఁగట్టి దించినట్లుండదు. తెలుగులోని నీతిగ్రంథములన్నియు అట్టి మిశ్రరచనలే-నానుభవములో.

ఇంత మంచిరచనను ప్రకటింపఁబడిన నాఁటినుండి నేఁటివఱకు తగినట్లు గమనించినవారు కానరారు. ఒకరిమాటయేమి. నావద్ద దీని ప్రతి యున్నను నేనే యెంతోకాలము దీనిని ఉదాసీనముగానే చూచినవాఁడను: సుమారు పదేండ్ల కింద ఆకస్మికముగా చదువుకొని దీని వాగర్థశైలీమాధుర్యములకు పరవశుఁడనైతిని. తెలిగింపవలెనను చపలము గలిగినది. దాని ఫలమే యీ రచన. ముద్రింపించి ప్రకటించు ప్రయత్నము చేసినది ఫలింపలేదు. నీతుల పుస్తకమనఁగానే 'డైడాక్టిక్' - శుష్కోపదేశము-అనుకొని దానిని తాఁకకుండుట మనలో సామాన్యము. అనేక నీతిపుస్తకములట్టివే యగుట నిజమే. అట్టివానిని ప్రకటించుట మొదలుచెఱచు బేరమే యగును. మఱి నీతి కావ్యకళకు వస్తువు కాఁజాలదను సామాన్యపు చాపస్తమొకటి యిపుడు మనలో వ్యాపించినది. కాని, పరికించి చూచు రసికులకు ఇందలి యార్ద్రత, కవితాసౌరభమును తప్పక గోచరమగును. కనుక దీని ప్రకటన విషయమే మఱచిపోవునంతటి యుదాసీనత నేను వహింపవలసివచ్చినదింత కాలము.

కాని ఆకస్మికముగా ఆ శుభకార్యమునకు ఇప్పుడు ముహూర్తము కలిసివచ్చినది. ప్రొద్దుటూరి వణిగ్వరేణ్యులు శ్రీ జూటూరి రమణయ్యగారు

దీనిని వెలికిదీసి తుడిచి వెలయించు పెద్దమనసు చేసినారు. కీర్తిమూర్తులగు వారి పితృపాదులు శ్రీ గురప్పశెట్టిగారి మధురస్మృతి పూజకు దీని నొక పూవుగా ఎన్నుకొన్నారు. మిత్రము శ్రీ సి. వి. సుబ్బన్న శతావధాని మొన్నటి ప్రోధి సంవత్సర శ్రీకృష్ణజయంతినాడు రచించి ప్రకటించిన 'దివ్యస్మృతి' యను సుమధురలఘుకృతిలో శ్రీ గురప్పగారి గొప్ప గుణములును, శ్రీకృష్ణభక్తిమయజీవితమును, కుమారుల పితృభక్తి సౌభాగ్యాది సద్గుణసమృద్ధిని వివరించినారు. తండ్రిగారికి కుమారులు చేయు వివిధకైంకర్యములలో నొకటి ప్రతివర్షమును శ్రీకృష్ణజయంతినాడు ఒక రచయితను సమ్మానించి అతని రచన యొకటి అచ్చువేయించి కృష్ణార్పణముగా దక్షిణ సమర్పించుట. కడచిన రెండేండ్లుగా ఆ పని జరుగుచున్నది. ఇది మూడవయేటి భూరిసంభావన. తండ్రిగారి తపఃఫలముగా శ్రీకృష్ణభగవానుడు, విశ్వమూర్తి, శ్రీ రమణయ్యగారికి సకుటుంబముగా సార్వభౌమశ్రేయస్సులు ఉత్తరోత్తరముగా అనుగ్రహించుగాక! ఈ మంగళాశాసనమును మించి నేను వారికి ఇందుకై చూపగల కృతజ్ఞవృత్తి ఇంకొక్కటి లేదు.

మంచన, శ్రీనాథుడు, సుమతిశతకకర్త-మొదలగు ప్రాచీనాంధ్ర కవుల రచనలలో ఇందలి ఒకటి రెండు ఆర్యల తెలిగింపు కానవచ్చుచున్నది. అది యాదృచ్ఛికముగా జరిగిన పని యనియు అనుకోవచ్చును. సామాన్యనీతిప్రస్తావములందు ఇతరానేకకవుల పద్యములందును అందందు దీని నీడలు కానరావచ్చును. కాని పూర్తిగా దీనిని ప్రాచీనులు ఆర్వాచీనులు ఎవరును తెలిగించినట్లు తోచదు.

నా తెలిగింపును గూర్చి నేను చెప్పుకోదగినదేమియు లేదు. మూల మందున్న ఏకవృత్తనియమమును నేను పాటింపలేదు. అసలు ఆర్య చిన్న వృత్తము గనుక అర్థభావములలో దానికి చేతనైనంత చేరువగానుండ వలెనను కోరికతో మన చిన్నపద్యములైన అటవెలది తేటగీతి కందాలను యథానుకూలముగా గ్రహించితిని. ఆ పేరాస యేమాత్రము నెరవేరినదో సహృదయులు నిర్ణయింతురు.

మూలమున పద్యములు 149. కాని 84 వ పద్యమునకు ఉత్తరార్ధమున పాఠాంతరమున్నది. అందుకై దానిని వేఱుగా తెలిఁగించితిని గనుక తెలుఁగుపద్యాలు 150 అయినవి. అనుబంధపద్యాలను మూలముతోనే అనుస్యూతము చేసితిని గనుక, గ్రంథసమాప్తిని తెలుపు 115–116 వ పద్యములను ఈ కూర్పు తుదకెత్తి చేర్చితిని. అవి 149–150 వ పద్యములైనవి.

ఎదురుబదురుగా మూలమును అనువాదమును ప్రకటించినచో సంస్కృతకవితారసికులకు, అనువాదము మితిగతులను పరిశీలింపఁగోరు వారికిని అనుకూలముగా నుండునను నా వేఁడికోలును శ్రీ రమణయ్యగారు ఉదారహృదయముతో నంగీకరించినారు.

సంస్కృతభాషాసంప్రదాయమైన పరసవర్ణమును నే నిందు వాడ లేదు; అనాదిగా అట్టిచోట్ల నిండు సున్ననే వాడు పద్ధతి తెలుగుప్రాఁతలో పుట్టి నెలకొన్నది గనుక.

అందమై చొక్కమైన అచ్చుకట్టుకు పేరువాసిగన్న మద్రాసు 'ఫ్రీడమ్ ప్రెస్సు' సూత్రధారులు శ్రీ ఎమ్. బాలసుందరం గారు ప్రత్యేకముగా శ్రద్ధవహించి దీనినింత కమనీయముగా ముద్రించినారు. వారికి నా ధన్యవాదములు.

తిరుపతి
సాధారణ-శ్రావణ
శ్రీకృష్ణజయంతి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

శ్రీ రఘునాథీయము

గడియారము వేంకటశేషశాస్త్రి

ముప్పదియేండ్లకు మునుపు, మొదలు తమశివభారతము వెలువరు చుచు 'విజ్ఞప్తి'లో శ్రీ గడియారము వేంకటశేషశాస్త్రిగారు 'నా కవిత్వ మనుపేర నిప్పటికి శివభారతము చాలు'నని ధీరవినయముతో వ్రాసిరి. అప్పటి తెలుగు కవిత్వపు చిలవపలవల కాలువలలో ఆ మహాకావ్యము కూలంకష విశాల గంభీర ప్రసన్న గతితో అవతరించి, దేశపు మూల మూలలకును ప్రవహించి, గౌరవాదరములను అభిమాన సమ్మాన ములను పలురీతులఁ బడసినది, పడయుచున్నది, పడయఁగలదు.

కాని యెప్పటికిని ఆ మహాకావ్యమొక్కటే 'చాలు' ననుకొని తృప్తి పడు జాతిగాదు తెలుగురసికులది. వారు 'నేడు-రే' పని గడియారము శాస్త్రిగారి యింకొక మహాకావ్య సృష్టికై యెదురుచూచుచునే యుండినారు. ఈ లోపల దాని వలెనే చరిత్ర సందర్భ మాధారముగా కొన్ని ఖండకావ్య ములు, 'మహా' కావ్యములును తలయెత్తినవి, వంచినవి కాని "అశ్వస్యగతి రన్యాస్యాత్ గతిరన్యా ఖరోష్ట్రయోఃl మద క్లిన్నకపోలస్యగతి రన్యాహి దంతినఃl" అన్నారు "కావ్యవాసనా పరిపక్వబుద్ధులు" తొల్లిటి రసికులు.

ఇంత కాలము ఎదురు చూచుచు వేచియున్న తెలుగువారి యోర్పును ఆశంసయు ఇప్పుడు ఫలించినది. ఆ పుణ్యము ఈ 'రఘునాథీయము'ది. దీనికి సుస్వాగతము! ఆ యైరావతమునకు ఈ పుండరీకము అన్నివిధముల

పీఠిక, 1973.

తగిన తమ్ముడు.

శివభారతము వెలువడిన తరువాత ఈ యసాధారణ విళంబము కారణముగా దాని కర్తృత్వమును గూర్చి అపోహలు, దాని యోగ్యతను బట్టి ఆక్రోశములు, కొన్ని బయలుదేరి యుండినవి. తెలుగు కావ్యరసికుల స్వాభావికమైన సమ్యగ్దృష్టి కారణముగా అవి చల్లారినవి.

శాస్త్రిగారిది పుటలు నించి, సంపుటములను పేర్చి పఠదర్శించు ఆశురచనాధోరణి కాక, చిక్కగా చిలికి దేవి పిండి పైకెత్తి. అర్థభావముల నావిష్కరించు ప్రశాంతభావుక కవితా సుపంథ యగుటయే ఆ విళంబమునకు ముఖ్య కారణము. శతాష్టావధానములు పచరించు తారుణ్యమున వారు వశీకరించుకొని అడచిపెట్టుకొన్న ఆశుధార యీ కావ్యమునందును కనులు నిలిపి చూచువారికి, గోచరించును. కాని అది భావనలయల్లికను పట్టి రూపు గొలిపి ముందుకు తోయుటకు మాత్రమే ఇక్కడ పనికివచ్చినది. ఈ యాపిత కాలములో వారు కవితాకళామర్మములను ఎంతో లోతుగా భావన చేయుచునే యున్నారనుటకు ఈ రఘునాథీయము సర్వత్ర సాక్షిగాగలదు.

రెంటికిని మూలాధారము చారిత్రసందర్భములే. అయినను కొంత భేదమున్నది. శివభారత నాయకుడు శివాజీ చరిత్ర ఎందరో ఎన్నోవిధముల తఱచి పరికించి వెలయించి నిలిపినది. స్వ-స్వీయాభిమానములకు పేరెత్తిన మహారాష్ట్రులు ఆయన స్వరూప స్వభావసిద్ధులను వర్చస్సు తగ్గనీక నివాళు లెత్తుచునేయున్నారు. ఇతర దేశాల పరిశోధక పండితులు ఎంతో అభిమాన గౌరవాల జ్యోతులెత్తినారు, ఎత్తుచున్నారు. కనుక ఆ చరిత్ర వివరించు గ్రంథసంపత్తి వివిధభాషలలో విరివిగా గలదు.

రఘునాథనాయకుని గూర్చి తెలుగువారికే తగినంత తెలియదు. ఆతని వీరశృంగారముల చొఱవ, ఉదాత్త హృదయము, సంగీత సాహిత్యముల మీది పాండిత్యాభిమానములు, అందుల కాతని క్రైంకర్యము-ఇత్యాది విషయములమీద తెలుగుకోవిదులు చేసిన పరిశీలన చాలామితము; అదియు అందు

నందు విశీర్ణము. ఎంతో శ్రమతో ఓర్పుతో ఆ ప్రాత-క్రొత్త చరిత్రలోని చిన్న-పెద్ద వివరములను సప్రమాణముగా సంపాదించి, సమకూర్చుకొని శాస్త్రిగారు ఈ కావ్యము సంతరించినారు. కనుక వట్టి చరిత్రచూపుతో చూచువారికి వలసినంత తృప్తి యీ రచనలో కలుగక పోవచ్చును. కాని అది ఆ చూపులోపము.

ఉండినది ఉండినట్లే 'నికరముగా ప్రాసిపెట్టుము' మనుట చరిత్రకారులు ప్రకటించుకొన్న 'ధర్మ ధ్వజము' కాని, అట్టివారి ప్రాతలందే ఆభిమాన మూలమున ఎన్నియో అనుక్తులు, దురుక్తులు, అతిశయోక్తులు, అత్యుక్తులును చొచ్చి చేరు కొనియుండుట నిశ్చప్రచమైన మాట. అంతో ఇంతో వేతలు తీతలు లేని కేవల వాస్తవమైన చరిత్ర గ్రంథము మనము చూడలేని వింత. అట్టిచో ఉండిన దానికి తోడు ఉండవచ్చు దానిని, ఉండ వలసిన దానిని గూడ ఉత్తరోత్తర ప్రాముఖ్యముతో చేర్చి తీర్చు కావ్య రచనను ఆ చరిత్ర దృష్టితో పరికించుట కవితా సరస్వతికి చేయు నపచార మగును. మనము మిక్కిలి శ్రద్ధాభక్తులతో నిత్యానుసంధానము చేయు శ్రీరాముని చరిత్రకు మూలమై 'నతే వాగనృతా కావ్యే కాచిదత్ర భవిష్యతి' అని బ్రహ్మవరము గల వాల్మీకి రామాయణమునాధారముగా తరువాతి కవులు రూపకకర్తలును చేసిన అసంఖ్యరచనలందు ఎన్ని యెట్టి మార్పు చేర్పులున్నవో యెరుగని వారెవరు? భారత భాగవతముల వంటి యితిహాసముల గతిగూడ అంత కన్న మెరుగేమియు గాదు. నిజము చూడబోయినచో శివాజీరఘునాథుల యీ చరిత్రములను ఈ కవిగారు అంతకంటె ఎక్కువ శ్రద్ధతో పరిశీలించి అనుసరించినారని ధారాళముగా చెప్పగలము. మరి ఆ శ్రద్ధ ఒకచుక్కతక్కువగా నుండిన బాగుండునను అతృప్తిలేశము అందందు కొందఱికి కలుగవచ్చునన్న అది వారి వైయక్తికము.

ఎట్టి చరిత్రలలో ఇతిహాసపురాణాలలో సూచింప బడిన సందర్భ సన్నివేశాలను పిస్తరించి వివేకముతో చిత్రించు మెళకువ, వాటిలో విస్తరింప బడిన విషయాలను సంగ్రహించి సూచించు ఔచిత్యదృష్టి-ఇవి కావ్యకర్తలు తీసుకొన్న అధికారాలు. కాక, నాటి ఉదాత్తవ్యక్తులందును నేటియుదాత్తు

లందువలెనే అనుదాత్తసంగతు లెన్నో యుండును-వారును మనుష్యులే గనుక అట్టివానిని యథాతథముగా వివరించుటకు వట్టి చరిత్రకారులే సంకోచింతురుగదా! ఇక కవులు ప్రపంచించునది ఆధ్యాత్మిక సత్యమే కాని ఆధిభౌతిక సత్యము గాదనుట మహాకవులు నాడును నేడును-రేపును గమనించి ఆచరించు ధర్మము. ఆ దారిలో ఉదాత్తభావములను తేజోవంతముగా వెలువరిచి ప్రజల అంతఃకరణములను సంస్కరించుటయే కావ్యకామనీయకమునకు పరమఫలము. ఎల్ల కాలములందును పాఠకులచేత కృతార్థుల మనుకొను అల్పకవులు ఉండనే యుందురు. శ్రీ శాస్త్రిగారి యీ రెండు చరిత్ర కావ్యములందును 'శివేతరక్షతి' మూలమైన పరోక్ష ప్రబోధక ధర్మముగా పని చేయుట గమనింపగలము.

ఈ రఘునాథీయము శివభారతమునకు నిండు సోదరిముగల తమ్ముడైనను కొంత ముందంజ వేయక పోలేదు. అది ప్రకృతిసహజమైన వ్యక్తిధర్మము.

శివభారతము శృంగారధర్మము లేక వీరాద్భుతాది రసాలనే ప్రపంచించు అపురూపమైన కమనీయ రచన, సంస్కృతమున విశాఖదత్తుని ముద్రారాక్షస నాటక మొకటే ఆ ప్రయత్నమున నెగ్గినది నా యనుభవములో. అంత ధైర్యముతో శృంగారమును వెలికినెట్టగల కవులరుదు. రసములలో శృగారముదే అగ్రస్థానము. 'శృంగంఇయర్తి' అను ఆ పదవ్యుత్పత్తియందే దాని యామహత్త్వము స్పష్టముగానున్నది. మరి శృంగార మొక్కటే రసమనదగినదను వాదమును మనలో నుండినది గదా. కనుక ఆ రసము శాస్త్రిగారికి అభిరుచిపాత్రము కాదేమో యని శివభారతము చదువు వారిలో ఒకరిద్దటికి తోచినను అది స్వాభావికమే యనవచ్చును. ఆ అతృప్తిలేశమును ఈ రఘునాథీయము తొలగించినది. రఘునాథుని 'ఉభయ నాంచారుల' తోడి ప్రణయలీలలు ఇందు ఉదాత్తమధురముగా చిత్రితమైనవి. కాని ఒట్టుమీద ఈ కావ్యము గూడ తొంబదిపాళ్లు వివిధ వీర రస పీచీ విహారములతోనే మరవకు అని తొనకు చున్నది.

ఇంతేకాదు: "భావో భావంనుదతి" అని కాళిదాసు వచించినట్లు

భావము లొకదానికతుకుకొని యింకొకటి సరపణి వలె సాగుధార, దానికి తగినట్లు యతిప్రాసాది ఛాందసములను నిర్లక్ష్యముగా ఈడ్చుకొని నడచు శబ్దార్థములు, వ్యావహారికమైన దేశీయ గౌణ ప్రయోగములు, తాత్పర్య ప్రధానమైన వాక్యవృత్తులు, రెండుమాటలను ఒకమాటతో నిర్వహించు పదనైన చిక్కదనము--ఈ మొదలయిన అసాధారణ కవితా గుణము లన్నియు శివభారతమునందే పగులుమొగ్గలుగా నుండినవి- ఈ రఘునాథీ యమున విచ్చుకొన్నవని సూక్ష్మోపికతో గమనింపవచ్చును. సుగ్రహీ తములైన చంపకమాలాది పద్యాష్టకమునకు తోడు ఇందు ద్విపదను అందల దుపయోగించుటయు శివభారతమును మీఱిపెట్టిన యడుగే. ఎక్కువ తక్కువ లెక్కడను తోపని సర్వతోభద్రమైన యీ కావ్యమునుండి ఒకటి రెండుదాహరణములను వెలికీడ్చి చూపుట వికారమైన పీఠికా విస్తరమగును. సహృదయులు ఆ గుణములను కనుగొని అనుభవింతురు.

అసలీ పీఠిక యెందుకు ? ఇది శ్రీ శాస్త్రిగారికే వేయవలసిన ప్రశ్న. పొద్దుటూరినుండి బెంగుళూరికి అదేపనిగా శ్రీ గొల్లాపిన్న రామకృష్ణశాస్త్రి గారిని తోడుగా చేసుకొనివచ్చి, వారిచే ఈ కావ్యమందలి మొదటి మూడా శ్వాసములను చదివించి నేనున్నచోటనే వినిపించి, తక్కిన భాగమును చదువుకొమ్మని చేతికిచ్చి, పీఠిక వ్రాయుమని ముదలపెట్టినారు. "మీ గ్రంథ మునకు ఎవరి పీఠికతో ఏమి పని!" అన్న నామనవిని మన్నింపలేదు. ఆ నిర్బంధానుగ్రహమునకు ఓధేయత తప్ప వేఱు తప్పించుకొను త్రోవ నాకు తెలియ లేదు. ఆ కైంకర్యమే యీ నాల్గు మాటలు. సర్వజనీనమైన యీ గ్రంథమున నా పేరును గూడ చేర్చుకొనుట నాధన్యత, అంతే.

బెంగుళూరు
పరీధావి మాఘశుక్ల సప్తమి
10-2-1973

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

స్వాతంత్ర్యవీరుడు

పాణ్యం నరసరామయ్య

శ్రీ పాణ్యం నరసరామయ్యగారి యీ గంభీరోదారకృతికి అభినందన రూపముగా ఈ రెండు మాటలు వ్రాయగల్గినందుకు నన్ను నే నభినందించు కొనుచున్నాను. గ్రంథములు పరిశీలించి అభిప్రాయములు వ్రాయు నుత్సా హము మందగించి నాకు కొంత కాలమైనది. కాని కవిగారి విశ్వాసపు కోరికను త్రోసివేయలేకున్నాను–మఱి యింత చక్కని రచనను చవిచూచు సుసందర్భము ఎప్పుడోగాని అభిప్రాయము శిచ్చు వృత్తిగల వారికి తర చుగా కలుగదు.

గ్రంథమందలి రెండు ఘట్టములు మాత్రమే ముద్రించి కవిగారు నాకు పంపియుండిరి. అందలి చరిత్ర అసంపూర్ణముగా నుండి కొంత నొప్పి గలిగింపగా–దానిని పూర్తిగా వివరములు ప్రామాణికముగా సేకరించి రచించునట్లు వారిని కోరియుంటిని. వారట్లు చేసి నన్ను గౌరవించినారు. కృతజ్ఞుడను.

"సిపాయి పితూరి"కి పదేండ్లముందే ఇంగ్లీషువారి 'జనస్థాన' పు దర్బారు నోర్వలేక యెదిరించిన వీరసింహుడట యిందలి నాయకుడు నరసింహారెడ్డి. ఇట్టి వారెందరి పచ్చినెత్తురు కండలో ఈ పుణ్యభూమిలో ఇంకి యెండి పోయిన తర్వాత గదా యీ మహాదేవికి స్వతంత్ర భూమిక వేసుకొనుట సాధ్యమైనది! మరి దీనిని స్వార్థపరుల 'అహిభయము' నుండి తప్పించి నెలకొల్పుటకు ఇంకెంతో వివేకుల అవివేకుల రక్తము

అభినందనము, 1974.

ప్రవహింప వలసియున్నదని మన మిప్పుడు గమనించు చున్నాము—ఇది అనాదిగా అనంతముగా జరుగు సృష్టితత్వమని సమాధానపడవలసియున్నది.

ఈ చిన్న మహాకావ్యమున కవిగారు నరసింహారెడ్డి మూర్తినే కాక సమకాలిక వ్యక్తులను సందర్భములను అచ్చుగొట్టినట్లు చిత్రించినారు. కవి కల్పన లేవియు దీనిలో లేవనిపించినారు. చరిత్ర రచనలో ఇదొక అపూర్వ సిద్ధి—భాష బలిసి పండిన నిండు పండు—నిలుకడలేక నియమముతో సాగినవి అర్థభావాలు. అలంకారాలు ఆడంబారాలు లేని అచ్చమైన ప్రాచీనశయ్య. మొదలు పెట్టిన తర్వాత తలపొలము దాక ఈడ్చుకొని పోవు ధీరోదాత్త రచన. నరసింహుడు - నరసింహారెడ్డి యీ కవిచేతిలో అమరపదవి నందినాడు.

బెండుకవితలు బిత్తలికవితలు విప్లవ కవితలు వెఱ్ఱికవితలు ఇత్యాదిగా ఎన్నో రకాల రచనలలో మునిగియున్నను నేటి తెలుగు రసికుల హృదయమును ఈ అయఃకాంత మాకర్షింపగలదు.

బెంగళూరు
ఆనంద శుక్లద్వాదశి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

శ్రీకృష్ణతాండవము-గోపికాలాస్యము

మైనంపాటి వేంకట సుబ్రహ్మణ్యము

ఏశ్వాసముతో మీరు పంపిన పుస్తకము, ఉత్తరమును చేరినవి. ధన్యవాదములు. నేనీ 5,6 సంవత్సరాలకు మీదుగా చదువు, వ్యాకృత, మొదలైన హంగులన్నిటిని క్రమముగా వదలుకొనుచు-ఇక్కడ నా చిన్న జ్యేష్ఠపుత్రునింట సకారముగా నిర్లిప్తస్థితిలో కాలము. సాగించుచున్నాను, వయోధర్మము చేత నరములు, కన్ను, బుద్ధి సత్యాగ్రహము చేయుచున్నవి. కనుకనే ఇంతవిలంబముగా మీ విశ్వాసలేఖకు ప్రతి సూక్ష్మముగా వ్రాయుచున్నాను.

నెమ్మదిగా కొంచెము కొంచెముగా మీరచనను పూర్తిగా చదువుకొనుచున్నాను. సంతసించినాను, శ్రీకృష్ణుడు నాకును ఇంటిదైవము, అత్తదైవము. కనుక మీరు వర్ణించిన ఆయన లీలలు నాకెంతో హృద్యములుగానున్నవి. మీరచనా ధార మీరాదరించి జీర్ణించుకొన్న ప్రాచీనాంధ్ర మహాకవులను తలపించుచున్నది. వివృత్తిరూపముగా అధోజ్ఞాపికలలో ఉదాహరించిన విషయాలు నృత్యనృత్తకళలతోడి మీగాఢ పరిచయాభినివేశములకు సాక్షులుగానున్నవి. సంస్కృతసాహిత్యమందలి మీ పాండిత్య ప్రపత్తులను 'గోబృందనాంది', 'శ్రీస్తుతులు' విశదీకరించుచున్నవి.

పుట్టపర్తి నారాయణాచార్యుల 'శివతాండవము' మీకు ప్రోత్సాహమిచ్చినదని తోచును. కాని ప్రకొత్తమార్గములెన్నో మీరుత్రొక్కినారు. మీ

1975.

చిత్రాలు ఆకళయందును మీరు సంపాదించుకొన్న నిశితరేఖా విచక్షణతను ప్రకటించు చున్నవి. ఇందుకై మీరభినందనీయులు.

శ్రీకృష్ణుని బాల్యతారుణ్య లీలాలాస్యాలు చర్వణార్హములే. మరి చర్వితచర్వణముగా ఎందరో వాటిని వర్ణించి రసించినారు, మీవలెనే–కాని, మహాభారతాదులందు వన్నెకెక్కిన అతని 'ప్రౌఢ నిర్ఝర వయః పరిపాక' లాస్య తాండవాలను మీరు వదలినారు. నా అల్పదృష్టిలో అవే యెక్కువ కమనీయములైన లోకానుగ్రహ నాట్య-నృత్య-నృత్తాలు.

పుట్టపర్తి వారి యనుకరణము చేత మీరచన అర్థము కంటె శబ్దము, దాని కంటె ధారావేగమును ప్రధానముగా సాగినవనిపించినదని చెప్ప వలసియున్నాను. 42వ పుటలో 29వ ఖండిక చాల అందముగా చౌకముగా తీర్చిందినది. అట్టివి కొన్ని మాత్రమే కానవచ్చు చున్నవి. నృత్యముకంటె నృత్తమే మీరెక్కువగా అభిమానించి నట్లున్నది. కనుకనే రచన కూడ అర్థ భావాలను గౌణీకరించి గతి-ప్రాసల అధికారము క్రింద సాగినదని తోచు చున్నది.

గతి ఎక్కువగా ఐదుమాత్రల 'ఖండ' నడకలోనున్నది. ఇది 'దేశి,' లో రక్తగతమైన రుచి. కాని, అందందు ఋగణము దూరి గతిసౌందర్యము దెబ్బతిన్నదని చెప్పక తప్పదు. అర్థభావములలోను పునరుక్తులు అందందు కానవచ్చి వాని కమనీయత పలచపరుచు చున్నవను కొందును. మొత్తము మీద రచన కమ్మగా నున్నను, మీరింతకంటె రమ్యమైన రచన చేయగలవారనిపించుచున్నది.

కొన్ని శబ్దప్రయోగాలు పునర్విమర్శింప దగినవి. 'పులుక', ధాతువు 'పులకరించు' అను అర్థములో నాదృష్టి కింతవరకు రానిది. మీరే వానిని మరల పరిశీలింతురని గుర్తుచేసి వదలినాను. రాగలక్షణములలో ఒండు రెండు కొరతలు కానవచ్చినవి.

నా [illegible]. మీ ప్రాచీనుల గేయరచనలు

ఉదహరించినారు. వానిని సస్వరముగా మీరు సంపాదించి ప్రకటించుట-ఏ 'నాట్యకళ' వంటి పత్రికలోనైనను సరే-గొప్ప యుపకార మగును. రాయలసీమలో నిట్టి రచన లెన్నో వెలుగు చూడక నిర్మామములై పోవుచున్నవి. అట్లా కానీయరాదు.

జయనగర్
బెంగళూరు
18-4-1975

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

త్యాగశిల్పము

లంకా కృష్ణమూర్తి

మిత్రులు శ్రీ లంకాకృష్ణమూర్తిగారు నాకు రెండవతూరి లేపాక్షి దర్శనము చేయించినారు. మొదటిసారి చేయించిన పుణ్యశాలి శ్రీ కీర్తిమూర్తి కల్లూరి సుబ్బారావుగారు.

సుమారు 50 ఏండ్ల క్రింద హిందూపురములో జరిగిన మాయింటి యొక వివాహసందర్భములో వచ్చియుండిన కొందరు బంధువులతో నన్ను గూడ చేర్చుకొని తోడుకొని పోయి సుబ్బారావు లేపాక్షియందలి శిథిల భూయిష్ట శిల్పసౌభాగ్యమును చూపించిరి. అప్పుడది యొక 'బేచిరాకు' గ్రామము. ఊరిపక్కలు అదిపోయినట్లే పోనిచ్చినస్థితిలో నుండినది. ఆ శిల్ప సంపదగూడ ఆ యవస్థలోనే దయనీయమైన దర్శన మిచ్చినది. అది సాక్షాద్దర్శనము.

ఇప్పుడు శ్రీ కృష్ణమూర్తిగారు తన యీకావ్యమును ఆద్యంతము విశ్వాసముతో వినిపించి, ఆ క్షేత్రమును ఆధ్యాత్మికముగా నాకు దర్శింప జేసినారు. నాచర్మదృష్టికి మసకు మసకుగా అంటుకొనియున్న రూపమును అంతశ్చక్షువున చిక్కగా అచ్చుగొట్టినారు.

విశ్వాసముతో ఎంతో కష్టపడి ఆయన సంపాదించి నాకందించిన-కథ కావ్యము, చరిత్ర, రూపకము, ఊరి పంచాయితీ వారి వార్షికనివేదిక-

---

మంగళాశీస్సులు, 1977, జనవరి, 2.
సుదర్శన పబ్లికేషన్స్, అనంతపురం.

మున్నగు రీతులుగా పెరుగుచున్న లేపాక్షి సారస్వతము చదువగా ఆ గ్రామము ఎంతగా పెరిగి పెద్దదగుచున్నదో, అందలి చిత్రశిల్పకళా ఖాండాగారమైన పాపనాశేశ్వరు దేవళము ఎంత ఇంటి-బైటి సహృదయుల నాకర్షించుచున్నదో, పౌరాణికముగా, చారిత్రికముగా ఆచోటు ఎంత కమనీయమైనదో– కొంత తెలిసికో గలిగినాను.

సర్వాంగీణముగా అభ్యుదితమైన యిప్పటి లేపాక్షిని మరల సాక్షాత్తుగా దర్శించు యోగ్యత నాకు వయఃప్రభావముచే అంతరించి నందుకు చింతించి ఫలములేదు. ఆరోగ్యము, పారిశుద్ధ్యము, తీర్థప్రసాద సౌకర్యము, వృత్తులు, విద్య, కృషి, స్వాభిమానము మొదలగు అన్ని విషయములందును ఆ క్షేత్ర ప్రజలు సాధించిన, సాధించుచున్న అభ్యుదయాలకు అక్కడి నాయకులు సర్వథా అభినందనార్హులు. అందును అన్నిటికిని ఆధార స్తంభముగా నేర్పడి నిలిచి పనిచేసి, చేయించుచున్న శ్రీ లేపాక్షి వెంకటనారణప్పగారి పారమార్థిక సేవ, సిద్ధి, రెండును పొగడ్త మితిమీరినవి. కలియుగమున అపురూపమైన కృతయుగ లక్షణములలో అగ్రగణ్యము.

అట్టిదే యీ శ్రీకృష్ణమూర్తిగారి కవ్యము గూడ. గంభీరము, వేషాభినయములు లేనిది ప్రాచీనాంధ్ర మహాకవుల నిరాండబరమైన దారిలో, చాదస్తములకు దూరమయి, ప్రసాద మధురమయి, భావనా మర్యాదలకు లోగి సాగినది. ఆధునిక పరిమళము లేకపోలేదు గాని. అది ప్రాచీనశయ్యా సౌభాగ్యములో తలదాచుకొన్నది. కవికి కీర్తి, ప్రతిష్ఠ, ధనము మొదలైన గొంతుపట్టి ముందుకు త్రోయు పేరాసలు లేవు. ఏ పదునెనిమిదేండ్ల ప్రిందనో దీనిని రచించియున్నను, ఇందాక వెలికితీయక పెట్టుకొని యుండుటయే దానికి గుర్తు. శిల్పకళయందు వీరికిగల అసాధారణ భక్తిరక్తులు నిండి తొనకినపొంగు ఇది.

ఇది చరిత్రగాదు; కవిత. కనుక చరిత్రదృష్టితో చూచువారికి అందందు అతృప్తిని గలిగించు సందర్భములు కొన్ని కానరావచ్చును.

అది వారి సులోచనముల దోషము, కవిదిగాదు. రామాయణ మహాభారతాది రచనలందు చారిత్రికాంశములను వెదకుచు పుటలు పంక్తులు త్రిప్పినానిని జూచి, సహృదయులు "అయ్యో పాపము" అనుకొని ఊరకుందురంతే! అందుకై వేరువ్యాకలను చదువుకోవచ్చును.

శ్రీ కృష్ణమూర్తికి సంస్కృతాంధ్రములలో ఆచార్యకము నెరపి కృతార్థులైనవారు నాకుపరమమిత్రమై, రెండవ హృదయముగా నుండిన సాహితీమూర్తి, ధీర సాత్విక జీవితులు కీ. శే. తిరుమల బుక్కపట్టణాభి జనులు అణ్ణయాచార్యులు, ఆయన విని హార్దమయిన తృప్తి ననుభవింప వలసినది ఈ కావ్యము. నావలె కవిగారును దానికి నోచుకోలేదు; విధి విలాసము! వారి ప్రత్యామ్నాయముగా, నా బదులుగా, ఈ కవి-కావ్యములకు మంగళాశీస్సులను గుర్తుపెట్టుచున్నాను.

ఈ యవకాశమునకు ధన్యవాదములతో,

22-1-1977
బెంగళూరు

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

ద్రోణప్రశస్తి

దీపాల పిచ్చయ్య శాస్త్రి

తమ "ద్రోణప్రశస్తి"ము జాబును చేరినవి. ధన్యోస్మి. గ్రంథము చేతికందినదే తడవుగా సాంతము చదివితిని. ఈవల కొంత శ్రద్ధతో క్రమముగా మూలభారతమును చదువుచున్నాను. ఆదిపర్వమున ద్రోణాచార్యుని విచిత్రవ్యక్తి యెంతో హృదయంగమముగా చిత్రింపబడినట్లు తోచినది. సత్వరజస్సులు రెండును సమానముగా కలిసి మెదిపిన మూర్తి యాతనిది. కాని రజస్సే ప్రబలమై వెలసి ఒకమారు సత్వము ప్రక్కను. ఇంకొక మారు తమస్సు ప్రక్కను మొగ్గుచల చూపినది. ఇట్టి ప్రకృతిగల వ్యక్తికి అతని వలన ఇతరులకు సంభవించు త్రైపర్శికములైన చిక్కులు అతని జీవితమున ప్రతిఫలించినవి. శ్రీ వ్యాసభగవానుని కైవాడమే అట్టిది, ప్రతి పాత్రము నందును విశిష్టమైన గుణదోషములు దుష్పరిహారముగానుండి అందువలన జీవితమున కలుగు ధర్మార్థకామముల చిక్కులను మునకంటి యెదుట నిలుపుట, అవసరమైన చోట్లనెల్ల ఆ చిక్కులకు ధార్మికనైతిక ప్రతీకారములను సూచించుట. ద్రోణాచార్యుడు గొప్పవాడే. అసాధారణ వ్యక్తియే. మేధావియే కాని ఆదర్శమూర్తి కాడు. కనుకనే మన ప్రాచీను లెవరును అతనిని ఆరాధ్యమూర్తిగా పరిగ్రహింపలేదు. భీష్మునకి మనలోగల గౌరవము ఆధ్యాత్మికోన్నతి ద్రోణునికి లేదు. గొప్పవారందరును మంచి వారు కారు అనుతత్వమును మహాభారతము ద్రోణపాత్ర మూలమున మనకు తెలిపినది.

ఇక్కడ నన్నయ్యగారి తెలిగింపులో ఒక గొప్ప మూలవిరోధము

పండితాభిప్రాయము.

కానవచ్చుచున్నది (దోణుడు అర్జునుని గురుదక్షిణ యాచించినది—
"యుద్ధేఽహం పృతియోద్ధవ్యోయుధ్యమాన స్త్వయానఘ"
[ద్రోణ 128–14]
అనియే. దానికనుగుణముగా అవకాశము కలిగినప్పుడంతయు అర్జునుడు గురువ్రతో పోరాడ వెనుదీయలేదు.

నన్నయ పాఠ మొకవేళ "యుద్ధేఽహం నతు యోద్ధవ్యో" అనియేమైన నుండునేమో! కాని అర్జునుడు ఆట్లు గురువుగారికి (పతిజ్ఞ చేసి యుండినను దాని నెప్పుడును నిలుపుకొనలేదు, స్మరింపనైనను లేదు. రాగ ద్వేషములను స్వాభిమానమును (పతిష్ఠాకాంక్షను పూర్తిగా నియమించుకోలేని (దోణునికి మూలమందలి మాటయే అనుగుణముగానున్నది.

ఈ భావములను తాము సాంగోపాంగముగా (పతిపాదించితిరని సంతసించుచున్నాను. తాము చేయగల కార్యమే నిర్వహించినారు గనుక (పత్యేకముగా ఈ (గంథమును పృశంసింప బనిలేదు. సహజమై, పరిణతమునైన తమశైలి విషయ గౌరవమును హెచ్చించినది.

కర్ణుని విషయమున మాతృము తగినంత న్యాయము తాము చేయలేదేమో అనిపించినది. (బహ్మ(పధానమైన జన్మము క్ష(తమునందు మరలించి, చచ్చువరకును పాంచాల జాతి మీద కసితీర్చుకొన్న ద్రోణాచార్యులు శ్లాఘ్యుడేని, క్ష(తృజన్మమెత్తి సూతజాతిలో పెరిగి, శక్తియుక్తులకు తగని పరాభవమును, తిరస్కారమును అనుభవింప వలసిన కర్ణుని శోచనీయ చరి(తను గమనించినప్పుడు అతనిపై మనకెక్కువ అనుకంపాగౌరవములను చూపదగునని నా భావన.

పెండ్యాలవారి యపభృష్ట గ్రంథమును ఎంత ఖండించినను తగును. తాము పని చక్కగా చేసితిరి. అసలు ఆయన చిత్తవృత్తిని చెఱచినది కట్టమంచి రామలింగారెడ్డిగారు. ఆయన వినోద(పియుడు, విప్లావబుద్ధి. కనుక కొంత వినోదముగాను, మరికొంత సవ్యదర్శన పీ(తితోను రెడ్డిగారు చేసిన వాదములకు ఆపాదమస్తకముగా వంగి సలాముకొట్టి పెండ్యాల శాస్త్రులు కృతకృత్యమ్మన్యులైరి. వారి పాండిత్యికి నేను కొంత గౌరవము

చూపుచుంటిని. నాయెడ వారికిని వాత్సల్యముండెను.

వారికి వయస్సు ముదిరి చూపు మందగింపగా- "నేను భారతమహా వ్యక్తులను అగౌరవముగా విమర్శించుట చేత- ఆ పాపఫలముగా-కన్నులు గుడ్డియైనవని కొందరన్నారు" అని నాతో వారు చెప్పిరి. అట్టివారిలో నేనుగూడ ఒకడని వారితో మోమోటము లేక చెప్పితిని. "నీకు సత్య మక్కర లేదా?" అని వారడిగిరి. ఎన్నడో మరచిపోయినవి, లేదా అన్యథా సమర్థితములైనవి యగు ప్రాచీనుల లోపములను-అవి లోపములనియే, సత్యములనియే వాదమున కంగీకరించినను మరల ప్రత్యి లోకమున కెత్తి సత్యప్రీతిని ప్రకటించుటకు, పాండవ కౌరవుల కాలము దాకా పోనేల, మీ తలిదండ్రులు తెలిసియో, తెలియకయో, చిన్నతనమున చేసిన తప్పులను పరిశోధించి కనుగొని ప్రకటించి మీరభిమానము చాటుకోరాదా అని ప్రతి ప్రశ్ననేను అధిక ప్రసంగముగానే వేసితిని. పాపము వారి తలిదండ్రుల దోషములు నాకేమియు తెలియవు. కాని వారును మనుష్యమాత్రులే కనుక ఈ "సత్యాభిమానము" కలవారు పరిశమించినచో. ఇక్కడ ప్రయోగించిన హేతువాద పద్ధతినే ప్రయోగించి చూచినచో, ఏదో ఒకటి రెండైనను దోషాభాసములు కానరాక తప్పవు ఈ సత్యప్రియులైన పుత్రరత్నాల కంత చాలును.

ఎందరెన్నియంతస్థులలో ధర్మమాచరించినను, ఆచరింపక తప్పినను, ఈశ్వర సృష్టియందు మానవ జీవితమునందు ఆ ధర్మము-ఇట్టిదని నికరముగా నిర్వచింపరాకున్నను-ఆధారతత్వముగా ముందువెనక ఇరు ప్రక్కల తోడై వివిధవిలాసములతో నర్తించును అనుతత్వము మహాభారతము మనకన్నులకు కట్టించుచున్నది.

"ఊర్ధ్వబాహుర్వి రౌమ్యేషః నచకశ్చిచ్ఛృణోతిమే
ధర్మా దర్థశ్చ కామశ్చ సకిమర్థం నసేవ్యతే."

అని కదా వ్యాసుడు ఘోషించి మహాభారతము ముగించినాడు.

తిరుపతి
2-2-1960

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

అపవాదు

శంకరంబాడి సుందరాచారి

'బుద్ధగీత' లో మొగ్గతొడిగి 'ఏకలవ్యుడు' నందు వికసించిన శ్రీ సుందరాచారి కవిత యీ 'యపవాదు' న ఫలోన్ముఖమైనది. సహజమైన ధారాశుద్ధి, తెలుగుదనము రసభావములందలి పారవశ్యము ఇంకను నుత్తరోత్తరమగు జగా మెఱుగులతో ఇందు పక్వాస్థను జూటుచున్నవి. కందమును సీసమును నెవరెవరో సొంతము చేసి కొనినట్లు, సుందరాచారిగారు తేట గీతిని సొంతముచేసి కేన్నాళేమో, అన్నంత సామరస్యము వీరి రచనలో చూపినారు. శ్రీ సీతారాముల ధర్మవీరచరిత నిత్యనూతనమైన పాతని చిక్కు, ఎప్పుడును తెగనిది. ఎందఱో, ఎన్ని విధములుగనో చేయివేసిన విషయము. అట్టి దానిని ఇప్పుడు మరల పారవశ్యముతో మనము చదువగల్గునట్లు రచించుట సామాన్యమైన సిద్ధి కాదు. అది యీ రచన సాధించినది. దీనికి హార్దమైన మంగళాశంసలు.

ప్రస్తావన.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

స్వప్న శీతాచలము

రాచమల్లు భైరవకొండారెడ్డి

ప్రాచీన ప్రబంధశయ్యలోని యింత చక్కని రచన నా కంటికి ఈ నాడు ఎంతో అపురూపము. ఈ కవికి సంస్కృతాంధ్రములు రెంటను చేతికలమునకు వీ తొడకుగాని ఎప్పుడును కలుగునట్లు కానరాదు. అదొక అసామాన్య సిద్ధి. దానిచే శయ్య వీ ఛందస్సునందైనను ఎగుడు దిగుళ్ళు లేక తీగవలె ప్రసన్న మధురమై సాగుచున్నది. పరిష్కరించవలసిన ప్రయోగములు అపూర్వముగ ఒండు రెండు గలవు.

1. 101 పు. "కుత్కీలవసిత" "కుత్కీలోషిత" అనదగును.

2. 95 పు. "శక్రవిధునమ్మ" శచికి నీ "శక్రీ"యను వ్యవహారమున్న పుడే ఈ ప్రయోగము కుదురును

3. 89 పు. "స్వఃపూరావాసము" సమాసమున "పూర్" శబ్దము "పురం" అగుట న్యాయము.

4. 60 పు. "కదన హతిత" ఈ రూపము "హత" అనునట్లుండదగును.

5. 50 పు. "స్రామాట్టు"-సమాట్టు యుక్తము.

6. 48 పు. "పద్మటక"-పత్మటక సరి. ఇట్టివి ఒండు రెండు కలవు.

7. 48 పు. "కేకీచయంబు"-కేకి నకారాంతము. కేకి వ్రజంబన్నచో బాధ యుండదు.

8. 26 పు. "పావనలోనసేక"-స్త్రీలింగ రూపము పావని కాని పావన

అభిప్రాయము.

కాదు. కనుక "పావనులౌ" అనదగును. ఇది ముద్రాదోషమును గావచ్చును.

ధారావేగమువలన ఒకటి రెండు చోట్ల అన్వయ ప్రసన్నత చాలదని పించినది. మొత్తము మీద ఈ కవికి "అల్లసాని వాని అల్లిక" అపర్ణముగ నున్నదనుట సోపక్తి సిద్ధమే. ఆ యనుకరణమును ఎంతో హృదయంగమముగ చక్కగ సాగినది. శిల్పమునకు సంబంధించినంతవరకు సహజమైన మహోధారను కొంత అదుపులో నుంచుకొనుట యీ కవికి ఆవశ్యకమని తోచుచున్నది.

అర్థభావములకు సంబంధించినంతవరకు పై సంయమమింకను ఎక్కువగా గమనించుట మేలని భావించుట మేలని భావించుచున్నాను. అనేక పద్యముల అర్థభావములు అద్భుతములుగ, అపూర్వములుగా నున్నవి. కాని సన్నివేశములను, సందర్భములను, ఇంకను చిక్కదన ముతో నిర్వహించియుండినచో హృదయంగమముగ నుండెడిది. అట్లు చేయగల శక్తి కవికి కలదనుటలో సందేహములేదు. పార్వతీ పరమేశ్వరుల శృంగారము, శచీశక్రుల శృంగారమును, సామాన్యమోహపుటంచులను దాటలేక పోయినదని భావించుచున్నాను. కామమునకు ఉత్తరోత్తముగ ఉదాత్తతను సాధించుట మానవ సంస్కృతులలో మొదటి సిద్ధి. ప్రాచీన ప్రబంధకవులు-పెద్దన్నకూడ-కొంత ఆ విషయమున అనుచిత విస్తరము చేసినారనుట సత్యమే. కాని నేటిమన ఆదర్శము దానికంటె ఉన్నతముగ నుండవలెనని కదా మన ప్రయత్నము. కనుక మనకిప్పుడు కవిత్రయము వారిని యింకను వ్యాస వాల్మీకులను ఒరవడిగా నుంచుకొనుట ముఖ్యము. శ్రీ కొండారెడ్డిగారికి ఆదర్శముగా నుండుటకు పెద్దనామాత్యుడు చాలడని నా యూహ, అనగా పెద్దన్నయందు నాకు గౌరవము లేదని భావింపకుడు. కాని అతనికంటె ఉదాత్తకవులు కవిత్రయము వారనుట నేను దాచుకోలేని భావము. కవిత్రయము వారినే వెన్నో బలముగాకొని పెద్దన్న మొదలగువారు, కొంత ప్రకిందికి దిగినను. నిలువ గలిగినారు. పెద్దన్నవంటి వారినే అనుకరింప బోయినపుడు తారాశంకాము లవతరించి

నవి. ఆ కొరత ప్రకృత కవి కావ్యమందును కానవచ్చుచున్నదని నా చింత.

ఈ కావ్యము ముంచరి భాగములు ఇంకను ఆస్వాద్యతరములుగ నుండగలవని నా యాశంస.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

260

నాటికాలు

262

ముద్రారాక్షసము

అవధానము చంద్రశేఖరశర్మ

పరమభోగ్యమైన ప్రాచీన సంస్కృత రూపకములు కొన్నిటిలో విశాఖదత్తుని ముద్రారాక్షస మొకటి. శృంగార రసగంధమైనను లేక కేవలము రాజనీతిజిత్తులును గత్తులును ఆధారముగా గొని కథాసంవిధానమును గమనీయముగా నుడివిన రచనయిది. దానికి తోడు దీని భాషాశైలి గూడ కొంత జటిలమై మార్దవము చాలక చదువరులను ఏకధారగా ముందుకు సాగనీయనిదైనను, భావముల యానురూప్యమును, అర్థముల యుచితసంగ్రహమును గలిగి రసికుల కాకర్షకముగ నున్నది. ఈ విషయమున సంస్కృతవాఙ్మయ మందెల్ల దీని వంటిదేయని చెప్పవచ్చును. ఈ కవిదే "దేవీచంద్రగుప్తము" అనునింకొక రూపకముండినదని తెలియవచ్చుచున్నది గాని దానిని కన్నులారజూచు భాగ్యము మనకింకను కలుగలేదు. కలుగ గలదను నాశంసయు నానాటికి శిథిలమగుచున్నది.

ఈ శతాబ్దపు తొలుతనే శ్రీ తిరుపతివేంకటేశ్వర మహాకవులు దీనిని తెనిగించినారు. కాని అప్పటికే ఇంకెవరో దీనిని తెలిగించియున్నట్లు వారు దీని ప్రస్తావనలో పేర్కొన్నారు† కాని దాని వివరములు నాకు తెలియవు. ఈ శతాబ్దిలో ప్రాచీన సంస్కృత మహాకవనలు తెలిగించు నుత్సాహము పునరుక్తముగా పలువురు పండితులకు గలిగినది. కనుక ఇంక గొందరెవరైనను ఆ ప్రయత్నము చేసియుందురు. అట్టివారిలో శ్రీ అవధానము

---

* ఉపోద్ఘాతము, 1957.

† మా. షష్టిపూర్తి మహోత్సవ ముద్రణము 4-వ సంపుటము

చంద్రశేఖరశర్మ గారొక్కరు. ఈ తెలిగింపును సంతరించినవారు నాకు పరిచితులగు భాగ్యము గలిగినది. ఉభయభాషల సారస్వతమందును, తల స్పర్శి సంస్కారము కలిగి సహజవినయ సంపత్తియు, ఎడతెగని విపిదిష యుగల వీరికి ఆ గుణములను ప్రతిబింబింపజేయు కవితా శిల్పము సిద్ధించి నది. భావమును మీఱిని భాష, భాషను దిద్ది తీర్చిన బంధము వీరి ప్రధాన కావ్యగుణములు. హృదయ సమాధిని ఓర్పును దెలుపునవి. వీరిధార సహజ మాత్రమే గాదు సాధితమై సంస్కృతమైనది గూడ. ముద్రితము లైన "దీన చింతామణి" "ప్రవాసి" అను ఖండకావ్యములను తప్పక ముదింపవలసిన 'మాతృగుప్తుడు' అను కావ్యమును చవిచూడగల్గినవారికి ఇవి సుగృహీతవిషయములే.

తిరుపతి వేంకటకవుల ధారాళకవితా శిల్పము తెలుగుసీమ నలు మూలలను మారుమ్రోగినది; ప్రమోగుచున్నది. దాని గుణప్రశంస యిప్పుడు చేయబనిలేదు. కాని యీ నాటకమును తెనిగించుటలో వారి రచన కొంత స్వచ్ఛందముగా సాగినదని చెప్పక తీరదు. దానికి వారిరచనలే ప్రధాన ముగా నమ్మికొని నడచిన 'సరస్వతీ' పత్రికకు మాసాశనముగా సిద్ధము జేయబడిన వానిలో ఇదియు నొక్కరచన యగుట ముఖ్యకారణ మన వచ్చును. నైసర్గికమైన వారి స్వతంత్ర మనోధర్మము గూడ ఇందు ప్రతి బింబితమైయుండును. మఱి కార్యాంతర వ్యగ్రతచే చేసినదానిని మరల దిద్ది తీర్చు నవకాశము లేమి మఱొక హేతువు. దీనిని వారి కృతుల షష్టి పూర్తి మహోత్సవ ముద్రణము సాధించిన శ్రీ కాటూరి వేంకటేశ్వరరావు నాల్గవసంపుటపు పీఠికలో తెలిపియున్నారు. ఇంతే కాదు. మూలమును పరి శోధించి పాఠభేదములను సేకరించిన విమర్శకార్యము ఇటీవలనే విపుల ముగా జరిగినది. ఎట్లును మూలమును యథావత్తుగా తెలుగులో చవిచూర గోరువారికి తిరుపతి వేంకటకవుల తెలిగింపు ప్రవాసినంత తృప్తినీయదనుట సత్యము. ఒక యుదాహరణము మాత్ర మిత్తును.

తృతీయాంకమున శరదవర్ణన రూపకమైన యీ క్రింది శ్లోకమును జూడుడు.

అపా ముద్వృత్తానాం నిజ ముపదిశం త్యాస్థితిపదం
దధత్యా శాలీనా మవనతి ముదారే సతిఫలే
మయూరాణా ముగ్ర మిషమివ హరంత్యా మదమహో
కృతః కృత్స్న స్వాయం వినయ ఇవ లోకస్య శరదా (ప. 8)

దీనికి పై కవిద్వయపు తెలిగింపు ఇట్లున్నది.

సీ. ఉద్వృత్తులగు వారి కుండ దెంతైశ్వర్య
మేనని తటినుల కృశల దెలుప
ఫలము సిద్ధించిన కొలది సత్పురుషులు
వంగియుందురటంచు వరులు నొడువ
ఒడలెఱుంగక దాన మొనరింప వెల్లబొ
టబ్బు నంచును దెల్లమబ్బు నుడువ
గలుషితంబైనను ఘనుల చిత్తము క్రమం
బుగా దేఱునని జలంబులు వచింప

తే. ఘనుల గన్గొని మిగులగేక లిడువారి
పొగరు నిల్వంబడ దటన్న పోల్కి మత్త
కేకి మదహాని దెల్ప నీలోకమునకు
గఱపుచున్నది విషయ మీకాలమిపుడు.

మూలమందలి చిక్కని భావ మిందు సాగదీయబడి బంధమును, అర్థమును సడలియుండుటయు, సీసపద్యమును నింపవలయుటకై స్వతంత్రముగా క్రొత్తయర్థములు తెచ్చిపెట్టబడియుండుటయు స్పష్టములే.

ఈ తెలిగింపును రచించిన శర్మగారు పరిపర్తన మొక కళగా సాధించుట యందలి కష్టములను చక్కగా గమనించినారు. వారే ఈ నాటక ప్రస్తావనలో చెప్పినట్లు—

తే. వలతి నుడికారమున్న భావంబు సున్న
భావపుం బుష్టియున్న నల్పంబు శయ్య;

రెండునుం గూడ మూలానుస్మృతి దొలంగు
గతిపై సాములనువాద కావ్యరచన.

మఱి మూలయందలి యందచందాలన్నియు చెక్కు చెదరక దించవలె
నని, అనూదిత భాషయందవి స్వాభావికముగా దోపవలెనని దృఢాభి
ప్రాయముగల యీ కాలములో అనువాదకళ మఱింత కఠినమగుచున్నది.
ఎంతోనేర్పు, ఓర్పు లేనిది సంతసరకుగా ఆ కూర్పును సంతరించలేము
పై సంస్కృత పద్యమునకు శర్మగారి తెలిగింపును చదివితిమేని ఆరెండు
గుణములను వీరెంతయలవఱచు కొన్నారో తెలియగలదు.

ఉ. "హద్దు దొఱంగువారి దగ
వే నిజమార్గమునం జరింపగా.
దిద్ది ఫలాభివృద్ధి విన
తిం గొనశాలులు నిల్పి, నెమ్మిలన్
దద్దయు మించు దుస్సహ మ
దంబు దొలంచి శరత్సమాగమం
బద్దిర, తీర్చిదిద్ది విన
యంబున సిల్వగ నెల్లలోకమున్" [పు. 52]

వీరి యీ తెలిగింపంతయు ఇంతే చక్కదనముతో పలుచోట్ల ఇంత
కన్న మెఱుగుగా సాగినది. తెలుగుసీమ సహృదయులు హార్దముగా స్వాగత
మీయవలసిన రచనయిది. నేటి యాంధ్రీకర్తలలో ఆ పనికింత చక్కని
యధికారము గలవారు కొందఱే గలరు.

తిరుపతి
13-10-1956

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

ధ్రువవిజయము

వంగీపురము కృష్ణమార్యులు

ప్రాచీన సంస్కృత నాటకముల లక్షణము ననుసరించి రచింపబడిన ఆధునిక నాటక మిది. సంస్కృతాంధ్ర భాషలలో చక్కని చొఱవగల శ్రీ వంగీపుర కృష్ణమాచార్యుల రచన. ఇంతేకాక 'స్వయముగా నటకుడు గాయకుడు"ను అయిన యీ నాటకకర్త' నిసర్గ సౌహృదేన భరతేషు వర్త మానః' అనిచెప్పు కొన్న భవభూతివలె, సహజ పారవశ్యముచేత ఈ రచనసాగించినారు. కనుకనే యీ రచన ఒడుదుడుకులు లేక నటన-పఠన ములు రెంటికిని అనుకూలముగా పద్యగద్యములను ఆపాతమధురముగా నడపినది. సంస్కృతప్రాకృతములను లక్షణ బద్ధముగా వేరువేరు పాత్ర ములకుపయోగించిన ప్రాచీన నాటకకర్తలవలె ఈ కవియును తెలుగు గ్రాంథిక వ్యావహారికములను ఇందు వెవ్వేరుగా ఉపయోగించెను. ఈ కవి గారు వాడిన వ్యావహారికము కేవల మేదో యొక మండలమునకో జాతికో చేరినదిగాక విశాలాంధ్ర దృష్టితో గ్రహించిన భాషగనుక తెలుగు వారందఱికిని హృద్యముగా నున్నది. పాత్రముల స్వరూపమును గూర్చియు, నాటక లక్షణములను గ్రహించియు గ్రంథ పరిచయమునందును అనుబంధమునందును కవియే వివరించినారు. ఇట్టిది ప్రాచీన నాటకస్వ రూపము తెలియగోరు తెలుగు విద్యార్థుల కెంతో యుపయోగ పడు చున్నది.

కథ సుప్రసిద్ధమై ఆద్యంతమధురమై అజరామమైన ధ్రువచరిత్ర.

ఉపోద్ఘాతము, 1957.

శ్రీ కృష్ణమాచార్యుల శయ్య అనుభవపరిణతమై ఆస్వాదనీయమైనది. దీనిని యథార్హముగా ఆంధ్రలోక మాదరించును గాక-యని నాయా శంస.

తిరుపతి
22-6-1957

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

శ్రీశైల మల్లికార్జున మాహాత్మ్యము

పైడి లక్ష్మయ్య

మా స్వగ్రామమగు రాళ్ళపల్లికి శ్రీ పైడిలక్ష్మయ్యగారి గ్రామము అచ్చమ్మపల్లి చాలా సమీపము; అరగంట ప్రయాణము. కొన్ని తరములుగా మా రెండు కుటుంబములును సౌహార్ద్ర గౌరవముల మధురబాంధవముతో పెరిగినవి. ఏకవచన ప్రయోగముతోనే పరస్పరము వ్యవహారము చేయ మరిగిన వారము. మేము బహిరంగముగా కొత్తమర్యాద లెంత చూపినను నేటికిని-జనాంతికమున-ఆ ప్రాతచనవులు మేము, మాకును తెలియకయే, ఆచరణలో పెట్టుచుందుము.

ఆ సౌహార్దమును గ్రంథగతముగా చేయవలె ననియే శ్రీ లక్ష్మయ్య గారు నన్నీమధురనాటకమునకు పీఠిక వ్రాయుమని కోరినారు. నేనును అందుకే అంగీకరించినాను.

లక్ష్మయ్యగారిది అనూచానముగా వైష్ణవ సంప్రదాయము. కాని ఆంధ్రదేశప్రజకు ఏమతముగాని 'వీర' స్వరూపముతో వెలయుకాలము గడచి యెంతో కాలమైనది గనుక భిన్నమతాలవారు పరస్పర సౌహార్ద గౌరవములనే యెక్కువగా ప్రకటించు చిత్తవృత్తి సౌభాగ్యము మన కలవడినది. మరి లక్ష్మయ్యగారిది చక్కని సాహిత్య వ్యాసంగముచే పరిపక్వమై ఆర్ద్రమైన హృదయము. దానిచే ఏమతమందైనను 'వీర'

స్థాపన, 1962.

శ్రీశైల దేవాలయ ప్రచురణము.

ధర్మము పెరిగినప్పుడు కలుగు విపరీతములను అది గహించి వ్యవహరింపగలదు. ఇట్టి వ్యక్తిని ఆంధ్రదేశమండలి దేవధర్మాదాయములకు అధ్యక్షుడుగా నియమించి ప్రభుత్వము గొప్ప ఉచితజ్ఞతను వెలయించినది. వదాన్యచల శ్రీరామచంద్రునికి ఆయన చేసిన, చేయుచున్న సేవ అంధులెన్నడును మరువరు. దాని కంటె అన్నివిధముల ప్రాచీనము, దురాసదము, భారతమందంతయు భక్తిగౌరవములను చూరగొన్నదియు అగు శ్రీశైల మల్లికార్జున క్షేత్రమునకు ఆయన చేయుచున్న కైంకర్యము అగాధమైనది. ఇట్లే అహోబల శ్రీ నృసింహ క్షేత్రము గూడ ఇంతలోనే లక్ష్మయ్యగారి భక్తివ్యవసాయముచే రాణించి ప్రసన్నలోకమునాకర్షింపగలదనుట నిస్సంశయము. "అహం హి సర్వయజ్ఞానాం భోక్తాచ ప్రభు రేవచ" అని చెప్పిన ఆ విష్ణుపరతత్వమే లక్ష్మయ్యగారిచే ఆసేవ చేయించుకొనుటకు వలయు సౌకర్యసౌభాగ్యము లన్నియు ప్రసాదించును గాక!

శ్రీ లక్ష్మయ్యగారి సాహిత్యరసికత, భాగవత ప్రతిపత్తియు 'మార్కండేయ విజయము' మొదలగు రూపకముల రచన మూలముగా ఎన్నో యేండ్ల కించనే వెలసినది. ఇప్పుడు శ్రీశైల మల్లికార్జునుని విశాల గంభీర మహత్త్వము ఈ నాటక రూపమున కర్త హృదయ సౌమనస్యమును వెలువరిచినది. రచన యందు మాత్రము కాక నటులను కూడగట్టుకొని ఆడించుట యందును ఆయన పరిశ్రమించినారు. ప్రశ్నైల క్షేత్రమందే శ్రీ రాజేంద్రప్రసాదుగారి సమక్షమున మొదటిదానిని, శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్‌గారి యెదుట ఈ నాటకమును ప్రదర్శించుట జరిగినది. ఆ లోకమాన్యుల మెప్పును ప్రశంసలను అవి సంపాదించి ధన్యములైనవి.

ఈ నాటక మండలి కథకు చరిత్రాధారమెంత యున్నదో నాకు తెలియదు. 'హేమరెడ్డిమల్లమ్మ' అను పేరుగల యీ కథారూపకము కన్నడ దేశమందు ఎక్కువ ప్రచారము నందున్నది. మరి భక్తియను ఆధ్యాత్మిక గంభీర మతతత్వమును ప్రతిపాదించుటకు, అనుభవించుటకు, చరిత్ర సహాయము అంతగా ప్రయోజకము గాదు. మీదుమిక్కిలి ఆ శ్రద్ధా బలమును ఇది కొంత సడలించునేమో యని సందేహము గూడ పడవలసియున్నది.

మన పురాణములందలి మహావ్యక్తుల కథల వెనుక ఎంత 'చరిత్ర' గలదో అంత మాత్రము ఈ మల్లమ్మ కథకును గలదనుట నిస్సందేహము. అన్ని మత సంప్రదాయముల యందును ఇట్టి కథలు గలవు. వానిలో ప్రతిపాదింప బడిన ప్రధాన రహస్యము ఆధ్యాత్మికము; దానిని వెలువరుచు వ్యక్తుల ఊరు, పేరు, కాలము మొదలగు విషయములు దుర్బలములైన బహిరంగ ములు. ఎంతో క్రింది మెట్టులోనివి. వీనిచే దాని విలువగట్టి బూనుట ఆధ్యాత్మికాపచారము.

ఆ దృష్టిచేతనే ఈ నాటక మందలి పాత్రలు సందర్భములు నిర్మిత మైనవి. అట్లే చదువుకొని, చూచి, అనుభవింపవలసినవి. భక్తిమార్గమునకు వ్యక్తియందును సంఘమందును గల యన్యాదృశ ప్రభావమును చిత్రించుటకై ముఖ్యముగా సిద్ధపరిచిన రచనయిది. కేవలము వినోదమునకును ఇతర లాభములకును చేసిన కళాకార్యము కాదు. కనుకనే, హేమారెడ్డి పెద్ద కుమారుడు వేమారెడ్డి-అతని కీపేరు కవి యోగి వేమన పూర్వ చరిత్రను తలచుకొని పెట్టినదేమో!- సానుల యిండ్లకు తిరుగుచు ఆసియంతయు పాడు చేయు వాడైనను, వానిని గాని వాని సానులనుగాని యీ నాటకకర్త రంగస్థలము మీదికి తీసుకొని రాలేదు. తెచ్చియుండినచో ఇప్పటి పెక్కు సినిమాల వలె వారి సంగీతనాట్యాల నృత్యాల చక్కిందాలలో మూలద్రవ్య మైన భక్తిరసము దుర్బలమై పోయి యుండెడిదేమో!

రూపక శిల్పమునకు సంబంధించి నంత వరకు ఈ కవికి ధర్మ వరము, కోలాచలము. వారి రచనలే పరవడిగా నున్నవనవచ్చును. వారి వలె ఇందును పద్యములకు తోడు పాటలును చేర్పబడినవి. రెండును ఎగుడుదిగుళ్ళ శైక ధారతో సాగినవి. పద్యములన్నియు రెండవమారు చదివి అర్థము చేసికోవలసిన అక్కర లేక సుప్రసన్నముగా, మితముగా అతుకు కొన్నవి. సల్లాపభాష సాంప్రదాయమైన 'నాగర' శైలిలో ఉత్తమ పాత్రలకును, ఇతరులకు వ్యావహారికశైలిలో నడచినది.

ఆ వ్యావహారికము గూడ, ఏ కృష్ణాగోదావరీ తీరముల గాలియో తగిలి వచ్చినదిగాదు. వ్యావహారికమని పేరు పెట్టి ఇంకెవరివో యీసలు,

పలుకు బళ్ళు, శబ్దరూపములును తెచ్చుకొని వాతలు వేసికొను దురభ్యాసము ఈవల రాయలసీమ తెలంగాణాలలో ప్రబలుచున్నది. లక్ష్మయ్యగారి పాతళ్ళు ప్రాయికముగా ఆ తప్పునుండి తప్పించుకొన్నవని అభినందింప వలసియున్నది. ఇక మీద రాగలిగిన-రావలసిన-అనేక రచనలలో శ్రీ లక్ష్మయ్యగారు ఇంకను ధైర్యముతో ఆ భాషా జీర్ణోద్ధారకార్యము గూడ, దేవాలయ జీర్ణోద్ధార కార్యము వలెనే సాగింతురు గాక!

"జనయతు జగతాం శర్మ వైకుంఠనాథః"

తిరుపతి
14-12-1962

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

నవలలు-కథలు

274

లీలాదేవి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

ఆర్యులారా!

వంగభాషలో నవలలు ప్రాయుటయందు బంకించంద్రచట్టోపాధ్యాయులఁ బోలెఁ బ్రసిద్ధిఁగాంచిన శ్రీ యోగీంద్రనాథ చట్టోపాధ్యాయుల వారిచే నీ నవల తొలుత రచింపఁబడినది. దీని నాభాషనుండి 'కర్ణాటక భట్టబాణుఁ' డని పేరుపొందిన శ్రీమాన్ బి. వేంకటాచార్యులవారు కర్ణాటక భాషలో, పరివర్తించిరి.

కథా కల్పనమతి మనోహరముగను నాతిపిస్తరముగను నున్నందున గ్రంథపూర్ణముగ వారిచ్చిన యనుమతి వడసి తగు మార్పులు చేసి నా నేర్పుకొలఁదిగ నే దీని నాంధ్రీకరించినాఁడ.

ఇందుఁగల తప్పొప్పుల విమర్శించు నధికారము ప్రాజ్ఞశిరోమణులకుఁ జేరినదిగా నిర్ణయించి నిష్పక్షపాతులగు వారి చరణమూలమున నిదియుపాయనముగ సవినయుఁడనై యర్పించుచున్నాఁడ.

ఇట్లు

సుధీ విధేయుఁడు,

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

విన్నపము, 1913.

ఆంధ్ర ప్రచారిణీ గ్రంథనిలయము, అనుబంధ గ్రంథమాల– 4, నిడదవోలు.

పరంతప విజయము

మహాకాళి సుబ్రహ్మణ్యము

"పరంతప విజయము" అను నీ అపరాధ పరిశోధక కథ మొదలు కన్నడ భాషలో శ్రీ యం. వెంకటకృష్ణయ్యగారు రచించిరి. మైసూరు రాజ్యమందు ఈ యేఁబది యఱువది యేండ్లలో జరిగిన రాజకీయ సాంఘికో ద్యమములలో శ్రీ వెంకటకృష్ణయ్యగారు పాల్గొననిది లేదన్న నసత్యము కాదు. కన్నడమున వారనే కోపయోగి గ్రంథములను రచించినారు. అనేక పత్రికలు నడిపినారు. ఇంచుమించు తొంబది యేండ్లు చెల్లుచున్నను, నేటికిని వారి కార్య శూరత యకుంఠితముగా నున్నది.

పాశ్చాత్యుల కథారచనా పద్ధతి నవలంబించి దేశ భాషలలోఁ గూడ నట్టివి వ్రాయనుత్సాహించిన పూర్వ కాలపు వారి ప్రథమ రచనలలో నిది యొక్కటి. పడమట సీమవారిలో నీ విద్య చాల నభివృద్ధి చెందినది. మహా కావ్యము లనదగిన గ్రంథములు పెక్కులు ఇట్టి కథలలో నాభాష లలోఁ గలవు. ఆకస్మికముగా నట్టివి వ్రాయ వాడుక లేనివారు వ్రాయ దొరకొనుప్పుడు కథాకథనము, పాత్రరచన, సల్లాపములు, మొదలగు వానియందు అక్కడక్కడ తొట్రుపడుట సహజము. ఈ గ్రంథమునందును అట్టివెన్నియో కలవు.

ఇందలి కథ అద్భుతములతో నిండినది. పాత్రములును సాధారణ ప్రపంచమునకు మీఱినవారు. సల్లాపములు కథ నడిపించుటకు పనికి వచ్చి

ఉపోద్ఘాతము, 1931.

నంత పాత్ర స్వరూప నిర్ణయమున కుపయోగించవు. ఈ విషయమున తరువాత కర్ణాటక కథకు లెక్కువ ముందువడినారు.

ఐనను, ఉదార భావములుగల పాత్రములు, విచిత్రములై రోమాంచక జనకమగు సన్నివేశములు గలిగి యీ కథ చదువుట కింపుగానున్నది. శౌర్యము, సత్యము, ధైర్యము, ఔదార్యము మొదలగు సుగుణములు చాల శ్లాఘింపబడినవి. మంచికి జయము, చెడ్డకు పరాజయమను పర్యవసానమున నిర్వహింపబడి చదువరులకు నెమ్మది నిచ్చుచున్నవి.

దీనిని తెనిగించిన శ్రీ మహాకాళి సుబహ్మణ్యముగారు ఆంధ్ర లోకమునకు చిరపరిచితులు. విద్యాశాఖలో చాలకాల ముపాధ్యాయులుగను, పరీక్షకులుగను పనిచేసిన యనుభవజ్ఞులు. పాఠశాలలోని వేర్వేఱు తరగతుల విద్యార్థుల కుపయోగించు పెక్కు గ్రంథములను వ్రాసి వానిగన్న వారు మైసూరు దేశమునకు విశాంతి నను భవించుటకై వచ్చియుండియు, వ్యవహారోపయోగమునకై కన్నడము నేర్చి బయత్నించినపుడు అకస్మికముగా కంటబడిన యీ గ్రంథము పాఠశాలలోని తెలుగు బాలుర కుపయోగించునని గుర్తించి, వెంటనే సహజమైన కార్యశూరతతో దీనిని తెలిగించిరి. అందను మక్కికి మక్కిగా దెనిగింపక యథా యోగ్యముగా సాధ్యమైన మార్పు లందందు జేసిరి. పాత కొత్త తెలుగులు రెంటిని వదలి మధ్యమ శైలిలో బాలురకు భాషాజ్ఞానమలవడుటయే ప్రధానోద్దేశముగ నుంచుకొని యిది రచింపబడినది.

ఆంధ్రలోకము దీనిని యథా యోగ్యముగ నాదరించి భాషాంతరీకర్త గారి పరిశ్రమము సఫలము చేయుదురుగాకయని నాకోరిక.

మైసూరు.
19-1-31

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

పగడాలు

ఆచంట శారదాదేవి

"ఎంతతియ్యని సంగీతమైనా యేదో అపశ్రుతి, చల్లని గంగాజలంలో కూడా యేదో వేడిమి, మధువులో కూడా యేదో చిరుచేదు. జీవితమే యింతే నేమో!" (పు. 120)

ఏకాసోన్ముఖమైన అనుభవపరిణతి చాలని సీమంతినీ హృదయంలోని వేదన యిది. 'ఇంతేనేమో' అనేకాని 'ఇంతే' అని ధైర్యంతో చెప్పలేని హృదయం. ధైర్యం ధైర్యంగా వేషం తీసుకొనడానికి ముందుజీవిత నేపథ్యంలో చూపే అవ్యవస్థ, తొందర – ఈ వేదన.

దాన్ని ఎంతో సహానుభూతితో ఈ ప్రబంధసంగ్రహంలోని ఒక్కొక్క ఖండికలోనూ చల్లగా సన్నని కంఠంతో చిత్రించారు శ్రీమతి ఆచంట శారదాదేవి.

వీటిని ప్రబంధాలనడం పొరబాటేమో, తెలుగు సాహిత్యంలో ఆ పేరు కొంత నిస్తేజమును అలవరచు కొన్నది. మరి సంగీతంలో ఒక్కొక్క పాటకూ ప్రబంధమనేది పాత పేరు. ఒక స్వరభావం, పల్లవి, దానిచుట్టూ దానే్న పోషించి చరితార్థమయే్య చరణం–నాలుగైదు పుక్తులవి–అంతటితో ఆరూపం ముగిసింది. ఇందలి ప్రకరణాలు అట్టివి.

ఒక్కొక్క ప్రకరణమందూ ప్రధానభావం ఒకటే. మీద చెప్పినది. దాన్నిపోషించే సందర్భాలువేరు. ముఖ్య విషయాన్ని మీరి పోయే మాటలు

పీఠిక, 1960.

గాని నడవలుగాని ఇందుండవు. కథ అని పేర్కొనదగినదేదీ ఇందులో లేదనే చెప్పవలెను. ఉద్రేకాలు ఆక్రోశాలు లేవు. అన్నీ ధ్వని ప్రధానంగా పాత్రల వ్యవహారాలు సాగును. రచయిత్రి చూపిన యీ సంయమం, తీర్చిన రేఖలందలి దిట్టతనం-ఇందలి విస్మయావహమై కమనీయమైన కథా రహస్యం. చిన్నదైనా ఒక్కొక్క సందర్భమూ చదివిన తరువాత పుస్తకము క్రింద బెట్టి భావనలో చిత్రించుకోవలసినవి. ఆడంబరమనేది ఎక్కడా లేకయెంతో లోతులు చూపే చల్లని రచన.

ఇట్టి వెన్నో ఇంకా శ్రీమతి శారదాదేవి చేతిమీదుగా రావలసినవని నాయాశ, నాయాశీస్సు.

16-9-60

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

280

వేమన

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

శ్రీ సర్ రఘుపతి వేంకటరత్నముగారి యౌదార్యమును, ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారి యభిమానమును ఈ యుపన్యాసములు నాచేఁ జేయించి నన్ను ధన్యుని జేసినవి.

శక్తిలో లోపములు చాలఁగలిగినను శ్రద్ధలో లోపములేకుండ ప్రయత్నించితినిగాని, దూరదేశమందుండుటచే తగిన సహాయ సంపదలేక నాకే తృప్తిగా ఈ కార్యమును నెఱవేర్చలేక పోయితిని. కడప కర్నూలు మండలములలో సావకాశముగా సంచారముచేసినఁగాని, వేమన కాలదేశములు నిర్ణయముగాఁ జెప్పవీలులేదు. పెక్కు ప్రాంతప్రతులనుచూచి పద్యములన్నియు సంగ్రహింపనిది యతని సిద్ధాంతములు వీర్పఱుప వీలుగాదు. కాపున నేఁజేయఁ గల్గినదంతయు, ముందు వేమన పద్యములను వ్యాసంగముఁ జేయఁగలవారి కొకవిధముగా పూర్వపక్షములను సమకూర్చుటయే కాని వేఱుకాదు.

ఇందు నే నుదాహరించిన పద్యములు సామాన్యముగా బందరు ప్రతినాధారముగాఁగొని ప్రాయఁబడినవైనను, పాఠములలో నల్పభేదములందందుఁ గనవచ్చును. నేను చూచినతక్కిన ప్రాంత యచ్చుప్రతులందలి పాఠములుగూడ నింకను విమర్శింపవలసి యున్నవి. ఆ పని యిఁకముందు సవిమర్శముగా వేమన పద్యము లచ్చువేయువారు చేయవలసినది.

మైసూరు
10-11-1928

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

పీఠిక, 1928.
ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, వాల్తేరు.

వదరుబోతు

కడచిన ప్రపంచ మహా సంగ్రామము మనుష్య జాతి దృష్టినే క్రొత్త తోవకు ద్రిప్పిన దనుట సుప్రసిద్ధ విషయము. నీతి, మతము, ధర్మము, సంఘము మొదలగు వాని దృఢమూలములగు కట్టుదిట్టముల ననన్నింటిని కదలించి మన మనో వాక్కాయములను దిక్కు దిక్కులకు పరవశముగా ద్రోసిన పెను తుఫానుగా నా యుద్ధము పరిణమించినది. తీవ్రముగా యోజించు స్వభావము గల యనంతపురపు దరుణులలోని యొకరిద్దరి హృదయములందా యుద్ధకాలమున గలిగిన కదలిక ఫలమే యీ "వదరుబోతు".

ఇవి రచింపబడి యించుమించుగా పదునైదు వర్షములు గడచినవి. ఈ పదనైదు సంవత్సరములలో మన త్రికరణముల నడవడులందు కలిగిన మార్పు అత్యద్భుతము. స్వాతంత్ర్యకాంక్ష యిపుడు శాఖోపశాఖలుగా పుంఖాను పుంఖములుగా ప్రాకుచున్నది. కాని యప్పటి సన్నివేశములు వేఱు. ఇప్పటి కాయలును, పండ్లును అప్పుడు పిందెలుగానో పూవులుగానో యుండినవి. తమయందలి యీ జీవశక్తిని బలవంతముగా రవులు కొల్పి భయలు దేర్పగల యుత్సాహమును, ఉద్రేకమును గలవారాకాలమున గొందఱే ఈ వ్యాసకర్తలకు ఆకొందఱిలో జేరుట కధికారము గలదు.

కని ఉత్సాహోద్రేకము లున్నవారి కందరికిని ఫలముగాని, పని చేయు తోవలుకాని ఒక తీరున నుండవు. భరత ఖండమునకు స్వాతంత్ర్యమును శక్తిని సంపాదించు నాత్రమతో పనిచేసిన దేశభీరులలో కర్మాగార

ప్రస్తావన

ములను స్థాపించినవారు కొందఱు; కారాగారములకు పోయిన వారు కొందఱు; అసెంబ్లీలకు పోయిన వారు కొందఱు; అండమానుదీవులకు పోయిన వారు కొఱవఱు, అందిరను అందకున్నను జుట్టు పట్టుకొని పోరాడ పోయిన వారు కొందఱు, కాళ్ళుపట్టుకొని విడిలింపులు తన్నులు దిన్నవారు కొందఱు; చంపిన వారు కొందఱు: చచ్చిన వారు కొందఱు; తామొక్కరు కష్టపడి త్యాగము మూపుట కంటె ప్రజలలోనుద్బోధము గలిగించుట యుత్తమమని తలచి మరి కొందరుపన్యాసముల మూలమున నాపని చేయుచురు. ఇంక కొందఱు తమ వాపచ్చిక్ మేర నెఱిగిన వారు-వ్రాత మూలమున నాపని చేయ దొడగుదురు. ఈ వ్యాసకర్తలట్టివారు.

స్వాతంత్ర్యమనగా స్వరాజ్యమని మాత్రమే కాదు. కేవలము దానికై పోరాడుచు ప్రజలలోని నీతిమత ధర్మాదులయందు గల దాస్యమును దైన్యమును గమనింపక విడిచిన స్వతంత్రవాది ప్రాయశః స్వార్థపరులలో మొదటి వాడని భావించి మనము దూరముగా తొలగిపోవలయును. రాజకీయ స్వాతంత్ర్యమొక కొమ్మలోని పండేకాని పంటనంతయు నదే కాదు. తక్కిన వానితో పాటదియు పండును. దానికై ప్రత్యేకముగా ప్రయత్నించి తక్కిన వానిని వదలుట వెఱ్ఱిసేద్యము. కావుననే ఈ వ్యాసకర్తలు భరత ఖండ రాజకీయ స్వాతంత్ర్యమును గూర్చి యెక్కువ జోక్యము చూపలేదు. వీరు పొమ్మనువారుగారు, పొగబెట్టువారు.

ఇట్టి ప్రజోద్బోధ కార్యమునకు ఇంగ్లీషు సారస్వతమునందలి అడిసన్ దొర ఆశ్రయించిన పేరుపెని యుపన్యాసములను పంచి పెట్టు పద్ధతి చాలా అనుకూలముగా ఈ వ్యాసకర్తకు దోచినది. అడిసను ప్రకటించిన 'స్పెక్టేటరు', అతని మిత్రుడగు స్టీలు ప్రచురించిన 'టాట్లరు' వ్యాసములకు గల ప్రసిద్ధియు విలువయు ఆంగ్ల సారస్వతముతో పరిచయముగల వారందఱు నెఱుగుదురు. ఈ 'పదరుబోతు' వ్యాసకర్తలకన్న మునుపే అనగా 1913వ సంవత్సరమునసే ఈ కార్యము చేయుటకు ప్రారంభించిన వారు సుగృహీత నామధేయులు శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారాయ కవీశ్వరులు. వారు అడిసన్ దొరయొక్క 'స్పె[illegible]టరు' పదమునే 'సాక్షి'

గా భాషాంతరీకరించి ఆ పేరుతో తమ యమూల్య వ్యాసములను సువర్ణ లేఖ పత్రికలో తొలుదొల్త ప్రచురింప మొదలిడి కొన్నాళ్ళకెచులకో నిలిపి వేసిరి. తరువాత 1920 యవ సంవత్సరమునుండి పుంభానుపుంభములుగా ఆంధ్ర పత్రికయందు బయలు వెడలు చుండిన వారి 'సాక్షి' వ్యాసములను చదివి ఆనందింపని యాంధ్రుడుండడు. కాని యీ వ్యాసకర్తలు ఆ మొదటి 'సాక్షి' వ్యాసముల నెఱుగరు. వీరేకాదు, ఆంధ్ర పత్రికలలో వచ్చువరకును ఏకొందఱికో కాని యాంధ్ర దేశమున 'సాక్షి' పేరు తెలిసియుండ లేదని స్పష్టముగా జెప్పవచ్చును. కావున 1917 లో వదరుబోతు జనన మునకు 'సాక్షి' తో నే సంబంధమును లేదనుట నిక్కము. ఇరువురకును ఒక విధమైన యుత్సాహోద్రేకము లేయుండినను నరసింహారావుగారికి, 'స్పెక్టే టరు' ను అడిసను దొరయుంచిన పేరేతామును తెలుగులో తమ వ్యాసముల కుంచుకోవలెనని తోచినది. ప్రకృత వ్యాసకర్తల కంతకంటె స్టీలు యొక్క టాట్లరు అనుపద మెక్కువ రుచించి వారు దానిని "వదరుబోతు" అని తెలిగించుకొనిరి.

కాని నిజముగా పరీక్షించితిమేని 'సాక్షి'కి 'వదరుబో'తనియు 'వద రుబోతు'నకు 'సాక్షి'యనియు పేళ్ళుండిన స్వరూపౌచిత్య మెక్కువగానుండి యుండునేమోయని యొక యూహ తోచెడిని. 'వదరుబోతు' అను పదము నందలి నీచార్థమును వదలి 'వాగ్మి' అను నర్థమును మాత్రము గ్రహించితి మేని అట్లే గ్రహింపవలయును గదా-'సాక్షి' లో నున్నంత మాటల పాటు వము, అడ్డు ఆపులేని నాగుబాము నడక, సందేహము లేని సిద్ధాంతములు గరుసు పాఱని గొంతుకతో రచ్చలో నున్నవారి కెల్ల వినవచ్చునట్లుగా చేయు రాద్ధాంతములు, ఇవి 'వదరుబోతు' లో కానరావు. 'సాక్షి' సంపు మందలి ప్రముఖ పాత్రమగు జంఘాలశాస్త్రికి నోరు తప్ప మఱియేమైన నవయవము లుండెనాయను సందేహము చదువరులకు గలిగినను అది సహజముగానే తోచును. 'వదరుబోతు' మార్గము కొంతవఱకు మృదువై నది. ధ్వని ప్రధానము. ఇరువురును తిట్లలో మేటులైనను 'సాక్షి' తిట్లలోని తెగువ 'వదరుబోతు' కీకు లేదు. 'వదరుబోతు' తిట్లలోని తీపు 'సాక్షి' కిట్లకు లేదు. ఉదాహరణముగా వీరిరువురును చేసిన సారంగధర నాటక

విమర్శను చూచినచో నీ విషయము స్పష్టమగును. ఇంత కన్ననెక్కువ చర్చ కిది చోటుగాదు.

ఈవల కే॥ శే॥ వంగూరు సుబ్బారావుగారు 'వసంత లేఖలు' అను పేర కొన్ని వ్యాసముల వాంధ్ర పత్రికలో ప్రకటించుట సర్వ విదితమే. ఇంకను కొంద ఱట్టివేమైన వ్రాసిరేమో మాదృష్టికి రాలేదు.

ఈ వ్యాసకర్తలు ఇరువురు, ముగ్గురన్నను తప్పులేదు. వారి పేర్లు ప్రకటించుటకు మా కిప్పు డధికారము లేదు. మొదలు వారు ప్రకటించుకోలేదు. కారణము మాకు చూడగా నిది: అధికార వ్యద్ధులు, వయో వ్యద్ధులు, విద్యావ్యద్ధులు గూడ నాచరించుచుండిన కొన్ని పద్ధతులను ఆచారములను తప్పులని తోచినప్పుడు విమర్శించి ఖండించుటకై జన్మించిన వీవ్యాసములు. ఈ వ్యాసకర్తలు అధికార విద్యావయోధనాదులందు సామాన్యులే కాని విశిష్టులుగారు. అట్టివారు ఇతరులను ఖండింపబూనినప్పుడు వారి పేరు ప్రచురమయ్యేనా వారి ననామధేయులకన్న నల్పముగా దలచి తిరస్కరించు జనులే యెక్కువ. తమ్ము ఖండించువా రనామధేయులుగా మఱుగున నుండిరా వారెవరో సుగృహీత నామధేయులని జనులు భావించి మన్నించుటయు సహజము. కావున సంఘమందలి లోపములను వెలికి బెట్టుటయే ప్రధానోద్దేశముగా గల 'వదరుబోతు' వ్రాయసగాండ్రకు తమ పేరు మఱుగించుకొనుటయే కార్యసాధన మార్గముగా తోచియుండును. మఱియు సంఘసేవాకార్యమునకు తోడు స్వసేవయందు ప్రకటనమేలయను నౌదాసీన్యము గూడ రెండవచ్చును. ఈ వ్యాసకర్తల నెఱిగిన మిత్రులు వారి రాహిత్యము ఎంతసేటికిని కలదనుట యెఱిగియుండుటచే ఇప్పుడును వారినామములు వ్రాయరు.

ఈవదరుబోతు జన్మించినది. పన్నెండు అనంతపురమందే. అప్పటి కీయూరిలోను వలె పది పక్కలందును పదిమంది 'ప్రెసిడెన్సు' ఒకటే! అది 'స్వామీలు'

ఆధారము. చేత డబ్బు ఎక్కువలేక, అధికారము లేమియు లేకయున్నవారు ఆ కాలములో పక్షమునకొక తూరి క్లుప్తముగా నాలుగైదుపుటల వ్యాసమును ముద్రింపించు భగీరథ ప్రయత్నమాపని చేసిన వారు తప్పనితరు లెఱుగ లేరు! ఎట్లో కష్టపడి ము, దింపించి వ్యాసములను కాలణా కొకటిగా వీధిలో అమ్మి, పోస్టు కర్చులు పెట్టుకొని బ్రెటికెందఱికో సచిత్రముగా పంపి, ఎన్నో ప్రతులు తిరిపెము పంచి, సుమారు రెండేండ్లకు మించి దీనిని నడపి తుదకు సుప్రసిద్ధ కారణములచే, 'వదరుబోతు' వాయి మూసికొనెను. మొత్తము ప్రకటించిన వ్యాసములు సుమారు 50.

కాని ఇప్పుడు వానినెల్ల నొక సంపుటముగా ప్రకటింపబూనుకొనగా దొరకినవి 22 మాత్రమే. కర్తలు స్థలాంతరములకు బోయి కార్యాంతరములకు జిక్కి పోవుట చేతను, ఒక తూరి ప్రాసి పంచిపెట్టుట చేత తాము తలపెట్టిన పనియైనది గావున నీవ్యాసములను భద్రపఱచి యుంచవలసినంత యక్కర వారి కంతగా లేక పోవుట చేతను పైవ్యాసములలో ననేకములు దుర్లభములైనవి. కాని చదువరులలో హిందూపురము శ్రీ పక్కా గురురాయాచార్యులవంటి యభిమానశాలులుండబట్టియే ఈ వ్యాసము లిన్నియైనను నేటికి దొరకినవి. ప్రకాశకులు వారికి కృతజ్ఞులు, తక్కినవి యెంత ప్రయాస పడినను దొరకవయ్యెను. ఎవరి వద్దనైనను ఇప్పుడు లభింపని వ్యాసములున్నచో దయచేసి యిచ్చినచో ప్రకాశకులు కృతజ్ఞ

కొని యవకాశము లభించినప్పుడు చేర్చి ప్రకటింతురు.

మముగా నున్నను, కాలమెంత మాటీనను, ఇంకను
న ప్రబోధ కార్యమున కవకాశముగలదని
కున పర్యవసింపవలసెను. తక్కినది "భాగ్యం"
అన్నాడు వేఱొక సందర్భమున

—o—o

ప్రబంధనాయికలు

వుట్టపర్తి నారాయణాచార్యులు

శ్రీ వుట్టపర్తి నారాయణాచార్యులు ఇదివఱకే ఆంధ్రసాహిత్యవీథులతో సుగృహీత నామధేయుఁడు. ప్రౌఢకౌశిత్త కీరు తియ్యముల మెఱుగులు రెండునూ సమానముగా మెదిగి తయారైన జీవితము. సంస్కృతము, తెలుగు, ప్రాకృతము ఆంగ్లము, హిందీ... ఈ భాషాకవుల, విమర్శకుల రాచబాటలలో స్వచ్ఛందసంచారము చేసిన—చేయుచున్నవాఁడు. కవిగా, విమర్శకుఁడుగా వయస్సు చిన్నదయ్యును, పెద్దయశస్సునకు స్వతంత్రముగా పునాది భద్రముగా వేసికొన్నవాఁడు. ఈయన గ్రంథమునకు ఇతరుల యుపోద్ఘాతమక్కరలేదు. కాని నాకు వ్రాయక తప్పినది కాదు. కారణము: నాకు మిత్రుఁడు, మిత్రుని కుమారుఁడు, మీదుమిక్కిలి నాభార్య వైపున బంధువు. మఱి యితని కోరిక నుల్లంఘించుట యెవరికి సాధ్యమగును?

కావ్యనాటకాదులను శాస్త్రీయమగు పారిభాషిక దృష్టితో చూచి తూచుట యొకదారి; దానియందు తెలిసియో తెలియకయో ప్రతిబింబించిన ఆయాకాలపు సాంఘిక రాజకీయాది విషయముల నెఱుగు కంటితో మూల మట్టుగ పరిశోధించుట రెండవదారి; ఇవిగాక గ్రంథకర్త యొక్క ఆశలు; అభిమానములు, రాగద్వేషములు మొదలగు జీవనసూత్రములను గ్రహించి వాని యావిష్కరణ పద్ధతులు, అందుచేమన హృదయమందు గలుగు సంవాదవివాదములను బైలుపఱచుట మూడవది. మొదటి రెండుమార్గములు ఎంత యుపయోగకరములైనను గుమాస్తాపనికి చేరినవి; విషయ సంగ్రహము మాత్రమే. మూడవది అనుభవ సంగ్రహము. కనుక ఇందులో ధైర్యము జవాబ్దారీయు నెక్కువ ఇట్టి విమర్శనము ఒక్క కావ్య

ఉపోద్ఘాతము, 1942.

మును విషయీకరించుకొని ప్రవాసిన వేఱొక కావ్య మనవచ్చును ఇట్టి రచనలకు తెలుగులో దారి తీసినవారిలో అగ్రేసరులు నేనెఱిగినంతవరకు శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారే.

ఈ 'ప్రబంధనాయికలు' పైతెరగతికి చేరిన విమర్శ కావ్యము. శ్రీ కృష్ణదేవరాయల సాహితీసర్వభూమిని మోచుకొన్న అష్టదిగ్గజములలోని మహత్తరగజములగు-పెద్దన-తిమ్మన-సూరన్న-మూర్తి-వీరు సృజించిన నలుగురు ప్రధాన నాయికల తీర్పును గుఱించినది. దానిని గూర్చి ఈ గ్రంథకర్త యిచ్చిన తీర్మానము కొంతవఱకు హేతువాదపు ఫలమైనను ముఖ్యముగా రసవాదము నాశ్రయించినది. ఆయన రుచుల స్వరూపమును ముఖ్యముగా తెల్పును. ఇట్టి విమర్శములను గూర్చియే "ప్రతి విమర్శన మును ఒక ఆత్మకథ" "Every criticism is an autobiography" అను మాట పుట్టినది. ఇది శాస్త్రముగాదు; చర్వణము. బంధము గాదు; ప్రబుకు. కాబట్టియే కీ. శే. కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారి వంటివారికిని నారాయణా చార్యుల వంటివారికిని సమానాధికరణము ఎన్నటికిని కుదరదు. బ్రహ్మయ్య గారు మనుచరిత్రలోని వరూధిని ప్రబుకు రసాభాసము గాన నీచమనిరి. రసాభాస మనునది పేరు మాత్రమే కాని రసత్వమున కందు లోపము లేదని యీ గ్రంథకర్త తలచెను. "సర్వేపి రసనాద్రస్సాః" అన్న విశ్వనాథ పంచాననుని వంటి లాక్షణికుల వాక్యములు గూడ గమనింపరు శాస్త్రి గారు! కాబట్టి ఇట్టి విరుద్ధ మార్గదర్శులగు విమర్శకు లిద్దఱు గలిసి కలహా మునకు దొరకొనిరే గాని అది కంఠశోషలోనే ముగియవలసినదే తప్ప వేఱుఫలము గానరాదు.

నారాయణాచార్యుల వాక్కు వణకు లేనిది. స్వతంత్రమగు భావనా బలము; తీవ్రములైన భావములు, అడకువలేని యభిప్రాయములు, అను భవశూరుల లక్షణములన్నియు నిందు గలవు. తోచిన పొగడ్తను గాని, తెగడ్తను గాని వెనుదీయక విసరి చెప్పు నార్జవ మీతనికి గలదు. ముఖస్తుతి గాని, ముఖనిందగాని విద్యగా నేర్చిన పాతకమున బోనివాడు. అనుభవ మునకు మితి, లోపము ఉండవచ్చును. కాని అది ఆరోపితము మాత్రము

కాదు. భావోద్రేకముతో కావేరివలె ఇతని వాగ్ధార తెగదూకులు దూకు చుండును. ఆ వేగములో కొన్నియభిప్రాయములు అందదుకులుగా గాన రావచ్చును. కొన్ని మాటలు కొంత కఠినముగా దొరల వచ్చును. కాని వానికి కారణము చారుదత్తుడు చెప్పినట్లు "యౌవన మ్రతా పరాధ్యతి, న చారిత్ర్యమ్" [మృచ్ఛకటిక].

ఇటీవల సాహిత్యము ద్రబదుకునుండి బయట పడి ఉపన్యాస వేదికల కును, ఉపాధ్యాయ పీఠములకును ఆంటుకొని యాత్ర గడుపుచున్నది. మఱల దానిని నిత్య జీవితముతో మేళగించి స్వతంత్రానుభవతత్వమును ప్రసాదించునట్లు చేసికొనమేని బ్రదుకులో బండతనము తప్ప మఱేమియు మిగులకపోవును. ఈ వ్యాసములవంటి రచనలట్టి పునరుజ్జీవనమునకు చాల తోడుపడుననుట నిస్సంశయము.

ఈ గ్రంథకర్త కలమునుండి ఇట్టి వ్యాసము లింకను పెక్కులు వెలు వడునని యాశించుచున్నాను.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

సాహిత్య సంపద

పిల్లలమఱ్ఱి హనుమంతరావు

ఇతర ఫలములు ఆనుషంగికముగా ఎన్ని లభించినను సాహిత్య వ్యాసంగమునకు ప్రధానఫలము అవిదిత వేద్యాంతరమైన ఆత్మానుభవమే అన్నది రసికులందఱును అన్నికాలములందును అంగీకరించిన సిద్ధాంతము. విమర్శలేని ఆత్మానుభవము ఈతరానివారు మహానదులలో మోకాలిబంటి నీటిలో వేయు మునక వంటిది. దానికి లోతు తెలియదు, విశాలత తెలియదు. వట్టి గ్రంథపారాయణము చేత శబ్దార్థములు సమగ్రముగా కంఠస్థములగును. పండితప్రథ లభించును. కాని వ్యుత్పత్తి సిద్ధింపదు. నా ఆచార్యులొక్కరు కొందఱు మహాపండితులను గూర్చి "గొప్ప విద్వాంసులే కాని అందఱును అవ్యుత్పన్నులు" అనిపలుమాఱు చెప్పగావిన్నాను. ఆవ్యుత్పత్తిని సంపాదించుటకే విమర్శదృష్టి యావశ్యకము. శబ్దార్థ భావరసములందు గల సూక్ష్మతర శక్తులను మననము చేసి యనుభవించుటయే కావ్యవ్యాసంగమునకు పరాయణము. మనవారు నిత్యకృత్యముగా విధించిన శ్రీ రామాయణ మహాభారతాది పారాయణములు దీనికొఱకే!

ఈ విమర్శ[illegible]ార్థులందు ప్రోత్సహించుటకే వ్యుత్పన్న[illegible]ావుగారు "సాహిత్యసంపద"యను సీగొప్ప [illegible] వారు సంకల్పించిన దానిలో ఇది [illegible]ఐవ శతాబ్దము మొదలు నేటివరకుగల [illegible]రచనయందలి మఱుగు మెఱుగులను

ఇందు వివరించినారు. ప్రాత, క్రొత్త ప్రోవలు రెంటియెడను సమానమైన సహానుభూతిని అభిమానమును వెలువరించినారు. కనుక నిదియొక అఖండ గ్రంథమేయై తెలుగులకు కావ్యరసానుభవమునకు చక్కని మార్గదర్శకమై యున్నది.

శ్రీ హనుమంతరావుగారు దీని కుపోద్ఘాతము వ్రాయుమని ఆదర గౌరవములతో నన్ను నిర్బంధించినందుకు వారీ గ్రంథమును సంకల్పించి నప్టి "విస్తరభయము" లేక అఖండాంధ్ర కావ్యరచనాపగాహిగా త్వరలో రచింతురుగాక యని ఆశంసించుట, ఆశించుట తప్ప నేనెక్కువ ప్రాయ వలసినది గాని వ్రాయగలిగినదిగాని వేఱుగా లేదు.

మైసూరు
విరోధి. ఆశ్వయుజ
కృష్ణపంచమి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

ఆంధ్రుల సాంఘిక చరిత్ర

సురవరము ప్రతాపరెడ్డి

మహారాజశ్రీమాన్యులు సురవరం ప్రతాపరెడ్డిగారి సన్నిధికి; మిత్రుఁడు రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ చేయు మనవి:—

తాము దయతో పంపిన 'ఆంధ్రుల సాంఘికచరిత్ర' కృతజ్ఞతతో అందుకొన్నాను. విడిచే బుద్ధిపుట్టక పూర్తిగా చదివితిని. ఇట్లు ఏకధారగా నన్ను చదివించిన గ్రంథము ఈమధ్యలో ఇదొక్కటే.

చాలా గొప్పపని చేసితిరి. ఇందు సేకరించి మీరు జతపఱచిన విషయాలు చాలా అమూల్యములు ఎన్నోవత్సరాలుగా ఏకాగ్రతతో చదివి సంగ్రహింపనిది ఈ పని నిర్వహింపగల్గుట కాదు. స్వాతంత్ర్యము సిద్ధించిన తరువాత ఆంధ్రసాహిత్యంలో వెలువడిన అనర్ఘగ్రంథాలు కొన్నింటిలో ఈ గ్రంథము అగ్రగణ్యమని నమ్మితిని.

చదివినప్పుడు నాకు స్ఫురించిన కొన్నిభావాలను తమ పునరాలోచనకోసము ఇందు సంగ్రహముగా మనవి చేయుదును. ఇది సూచనమాత్రమే; విమర్శకాదని గ్రహింప వేడితిని:

(1) 'పులిజూదములు, దొమ్మరి ఆటలు తెలుఁగు వాఁడే' (పు. 7) కాని కన్నడ దేశమందును ఇవి అంతే వ్యాప్తిగల్గియున్నవి. మొదటిది 'హులికల్లు' అను పేరితో నున్నది. మరి 'దొమ్మరి' వాఁని, డొంబ, దొంబ –అని కన్నడులఁటారు. 'రి' అనునది, ద్రావిడ బహువచన ప్రత్యయము తెనుగు ప్రకృతికి చేరినదేమో. అమర వ్యాఖ్యాత క్షీరస్వామి (11 వశతకం)

అభిప్రాయము, 1949, అక్టోబర్, 30.

శ్వపచ జాతులలో 'డోంబ' జాతిని చేర్చినాడు. డోంబర్ అనేదే దొంబర-దొమ్మర-దొమ్మరి-అయియుండును.

(2) 'వైష్ణవమున కన్న శైవము అరవదేశమందు పూర్వీన తరము అన్నారు. ఈ సిద్ధాంతము ఇంకా విమర్శనీయము. పరమ పూర్వీన ద్రావిడ వాఙ్మయములో శివకేశవు లిరువురును గలరు. మరి ఆళ్వార్ల కాలమింకను నిస్సంశయముగా నిశ్చితం కాలేదు. పరస్పరస్పర్ధతోను సమరసంగానూ ఈ రెండు మతాలూ ప్రవహించినట్లే ఆదినుండి కానవచ్చుచున్నవి. పు.21

అట్లే శ్రీరామానుజుల కాలమునకు చాలా ముందే వేంకటేశ్వరులను విష్ణుమూర్తిగా ఆరాధించి పాడిన ఆళ్వార్ల సాక్ష్యం సులభముగా తోసివేయు రానిది. ప్రాపతి పండితుల భాష్యం పలు సందేహాల కాస్పదమయినది. మరియు చాలా ఆధునికము, రామానుజాచార్యులు చేసినదెల్ల అన్యాక్రాంతమయిన మూర్తిని పునస్థాపించడమేనని వారిచరిత. వేంకటేశమూర్తిలో శైవ, వీరభద్ర, స్కంధ, శక్తి చిహ్నాలు కొన్ని కలవనుట సత్యము, దాని నిశ్చిత స్వరూప మిదియని ప్రకృతం నిర్ణయించడం కొంత తొందరపనేమో.

(3) మాహురమ్మకు నగ్నత్వం జైన సంప్రదాయమునుండి వచ్చిందేమో అని శంకించినారు. జైనులో నగ్నపురుషులున్నారు కాని స్త్రీ దేవతలు అట్టివారొక్కరూ లేరు, ఇదిగాక మన దేశమందలి నగ్నపూజ తాంత్రికము. దక్షిణాచారము కన్న ప్రాచీనమైన ఈ వామాచార తంత్ర పంథ బౌద్ధులమూలాన పరదేశములనుండి మనలో వచ్చి చేరుకున్నదని శోధకులు భావిస్తారు. పు. 30.

(4) 'కర్ణాట కిరాట కీచకులు' పాఠాంతరము. కిరాటులు కోమట్లు, [illegible] లోభులన్నమాట.

పదం కాము. పాల్య-పాలింపదగిన-శబ్దము. 'కావలి' అనే అర్థం 168 వ పుటలో తామే వ్రాసినారు.

(6) 'యథార్థముగా బ్రాహ్మణులయందే అన్ని విద్యలు కేంద్రీకృతములై యుండెను.' ఇది తమవంటివారు చెప్పవలసిన అతిశయోక్తి కాదని మనవి; ఇట్టి వాక్యములను అక్షరశః గ్రహించే అల్పబుద్ధులెందరో యుందురు కాన. సంస్కృతి, తత్వము-వీనికి సంబంధించిన విద్యలుతప్ప తక్కిన వ్యావహారిక విద్యలన్ని అందరికి అందు బాటులోనుండినవే. కనుక రాజులు అపవాద భూతులు కావలసినదెప్పుడూ లేదని తలంతును. పు. 88:

(7) 'అంతరాళిక యతి గ్రామాభిరామంబుగా' అన్నచోట యతుల సముదాయమనే అర్థము చెప్పుటమేలు. గురులఘుద్రుతాది తాళాంగములను మిక అందమైన రీతితో గూర్చుటయిు. ఇది తాళదశ ప్రాణములలో నొకటి. పలువిధములు గలది అంతే కాని 'జతిగ్రామ విధాన'మను విశిష్ట పద్ధతి నా దృష్టికి రాలేదు. పు. 122;

(8) పేరంటాలు శబ్దమునకు మీ వ్యాఖ్యయే న్యాయము. సోమశేఖర శర్మగారి అర్థం 'సతి' శబ్దమునకు వలె తాత్పర్యం కావచ్చును. పర్యంత శబ్దం ప్రాకృతంలో 'పేరంత' అయి తెలుగులో పేరంటము-పేరటముగా మారింది. పేరంటాలు అనగా ఇరుగుపొరుగు స్త్రీ. క్రమంగా శుభాహ్వానానికి తగిన ముత్తైదువ అని ఛాయార్థం కలిగింది. చేసే శుభానికి 'పేరంటము' పేరైనది. పు. 135.

(9) యక్షకిన్నరాదులు అనార్యులన్నారు. జక్కులు అనునది యక్ష శబ్దభవమని ప్రాకృతవా[illegible]ుపతుంది. కన్నడంలో గూడ 'జక్క' [illegible]యోనులన్నాడు.

జాగ్రత్తగా వాడవలసినవనుకుంటాను. టీబెటులో 'డాక్' అనబడు అడవి జాతులవారున్నారందురు. యక్షులదీ ఉత్తర దిగ్భాగమే, ఏమో! పు. 165.

(10) కృష్ణదేవరాయలు హేళనము చేసిన 'రెడ్లు' సామాన్యపు పల్లె కాపులనుకొంటాను. రెడ్డిజాతిని ఆయన పరిహసించెనని తలపనక్కరలేదు. సోమశర్మవంటి కొందరు బ్రాహ్మణబువ్వలను గూడ నితడు పరిహసించెను. కాని అతని బ్రాహ్మణభక్తి ప్రసిద్ధము. పు. 222

(11) 'పడవాళ్లు' సరియైన రూపము. 'పడతాలు' అచ్చుతప్పని తలంతును, భటుడు అనియే యర్థము. పు. 229.

(12) సాత్తిన–సాత్తని అనునవి ఆర్చకుల శాఖలుగావు. వైష్ణవులలో ద్విజ–ద్విజేతర భేద సూచకములు. శాత్తిన–శాత్తాద అను ఆరవ పలుకుబడికిది తెలిగింపు. ధరించిన–ధరింపని–అనియర్థము. జండెమని శేషమూహ్యము. కనుక సాత్తినవారు బ్రాహ్మణులు, సాత్తనివారు ఇతరులు కాబట్టి విష్ణుచిత్తుని వెంట సరకులను మోసికొని వచ్చిన ఆ వైష్ణవులు 'విధినిషేధంబు లెరిగితే' నన్నాడు రాయలు. సాత్తనివారే ఇప్పటి సాతానులు. ఈయిద్దరికిని తామిచ్చిన లక్షణ మెక్కడిదో యెఱుగను. పు. 235.

(13) శంఖఫలకము అరవములో 'చంగప్పలై' అనుదాని పరివర్తనము. మథురలోని ప్రాచీన ద్రావిడ 'సంఘ' సంప్రదాయములకు చేరినది. అరవప్రాత 'చంక' అనేయుండునుగదా. తెలుగులో అది సంస్కృత వాసనతో 'శంఖ'గా మారిందేమో. ఈ మార్పు ధూర్జటికాలానికే పచ్చిందేమో. ధూర్జటే స్వతంత్రంగా చేసిన ప్రయోగాలో, అచ్చువేసినవారు అపివేచనగా చేసిన రూపాలో కాళహస్తిమాహాత్మ్యంలో ఎన్నోయున్నవి కదా. పు. 239

(14) ఇడుమ కట్టు = చేతులు కాళ్ళు ఆడించ వీలులేకుండా కట్టిన బంధన మనవచ్చును. 'ఇంటిముందట' అనునర్థము సుగ్రహంకాదు.

పు. 248

(15) 'గర్భమంటపీ' త్యాదిపద్యము ఇంకొకమారు తాము చూడ వేడినాను. మాలదాసరికి అభిషేక తీర్థార్హత లేదు; అతని కిచ్చు తీర్థము నేల కడిగిననీళ్ళే, దానిని గూడ ఇచ్చువాడు 'ప్రతివర్ణేతరజాతి' వాడే 'గుడివెడలివచ్చు' ఆ ముచికినీటినిగూడ తాకుటకు అతని కర్హతలేదు. ఇంతే కాని ఆ ఘట్టములో మీరు సూచించిన వైష్ణవసంస్కార ప్రియత్వమునకును శూద్రార్చకత్వమునకును అవకాశము కానరాదు. పు. 251

(16) "కూచిమారమనోజ...కామసిద్ధాంతములు" 'నాట్యము'లా ?
పు. 267

(17) 'రఘునాథమేళ' అనునది వీణ, రాగముగాదు. పు. 270

(18) 'హుసివోవగా' అంటే అసత్యముకాగా-వ్యర్థము కాగా-అని యర్థము. కన్నడంలో ఇదే అర్థం 'పుసి' అని ప్రాచీనరూపం తెలుగులో 'ముసి' అని మారింది. శ-ర-చూడుడు, 'అధికము కాగా' అనే అర్థమన న్వితమగును. పు. 307

(19) 'ప్రొక్కుడు బొమ్మ' ఏదో నాకూ తెలియదు. కాని చరణాభ = కాళ్ళకాంతి, దానిమీద, బచ్చెన = వన్నె = ఘటింప వడకిరని అర్థము సరసంగా లభిస్తుంది. చరణాభ, బచ్చెన-రాట్నపు సామానులు కావు. పు. 310

(20) 'పొప్పళి' అన్నపదము మాప్రక్క 'చౌకపుఇండ్లు' అనే అర్థంలో వాడుదురు. పొప్పళి చీరలు నేటికిని ఈ దేశం కోమటిస్త్రీలకు చాలా ప్రియం. పొప్పాయికాయతో దీనికి సంబంధం మృగ్యం. ఈ పదం కన్నడంలోనూ కలదు. కదిరీపతి కన్నడ దేశానికి సమీపంలోని వాడు. పు. 311

(21) 'జక్కణి'. సరియైనరూపమే. దక్షిణ నాట్యపద్ధతులలో నొకటి గాబోలు. పు. 343

(22) వేణుగోపాలశతకం పదాల సారంగపాణి వ్రాసినదని విన్నాను. అతడు తిరుపతికి దగ్గరివాడు. పు. 382

తమగ్రంథం నిజంగా నాకెన్నో నూతనవిషయాలను తెలిపినది. మరల ఎన్నోమారులు పఠింపవలసి యున్నాను. ఆ గౌరవమే మైభిన్నాభిప్రాయములను మీపునర్విమర్శ కొఱకు నన్ను ఇట్లు వ్రాయ్ బేరించినది. మీరన్యథా భావింపరని నేనెఱుగుదును.

మీగ్రంథం చేతికందిననాడే మా అన్నగారు గోపాలకృష్ణమాచార్యులు ఇక్కడనుండి కొంత పఠించి నావలెనే చాలాసంతోషించిరి. అనాడే వారు వెళ్ళవలసియుండి పూర్తిగా చూడలేరైరి. ఇంతలోనే వాకు హైదాబాదుకు వత్తురు. తమ దర్శనము చేయదలచినారు. జ్యోతిషమందు వారెక్కువ పరిశ్రమించిన వాకని తాము వినియుందురని నమ్మెదను. మరియు విజయనగరచరిత్ర వారి కభిమానపాత్రము. సాహిత్యమందు చక్కని పాండిత్యము.

చిత్తగింపుఁడు
మీవాఁడు
రా. అనంతకృష్ణశర్మ

సారస్వతాలోకము

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

ఎన్నో యేండ్లకు ముంచు 'సారస్వతోపన్యాసములు' అను పేర అనంతపురపు సాధన ముద్రాశాలాధిపతులు దయతో ఇందలి మొదటి మూఁడు ప్రబంధములు ప్రకటించియుండిరి. ఇప్పుడు వానికితోడు మఱికొన్ని వ్యాసములు చేర్చితిని. వానిని 'భారతి'లో ప్రకటించి శ్రీ శివలెంక శంభు ప్రసాదుగారు నన్నను గ్రహించి యుండిరి.

విభిన్నమైన సన్నివేశములలో, చిత్తవృత్తులలో సుమారు 40సంవత్స రాల నా జీవితకాలమందు తలఁచిన తలఁపుల, ఆడిన మాటల సంగ్రహ మిది. కనుక అందందు కాలాతీతదోషము, పునరుక్తి, పరస్పరసంగతి చాలమి-ఇత్యాదు లిందు తోఁప వచ్చును. చదువరుల యుదారహృదయమే దానికి శరణ్యము.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

ఉపోద్ఘాతము, 1954.
త్రివేణీ), మచిలీపట్టణం.

30 రూ 1

ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము

బాలాంత్రపు రజనీకాంతరావు.

సుపరిచితులను పరిచయం చేయబూనడం స్వల్ప శ్రమమే. కాని ఆ యింత శ్రమంకూడా అనావశ్యకమైన పునరుక్తే కాగలదు. అయినా మిత్రులు శ్రీ రజనీకాంతరావుగారివంటి వారితో వ్యవహరించేటప్పుడు ఆ పని చేయకుండలేము. ఆయన సుగృహీత నామధేయుడే. కాని సుకుమార హృదయుడుగూడ. హృదయ సౌకుమార్యమున్నవారిలో హఠంకూడా సుకుమారంగానే ప్రబలంగా ఉంటుంది. కనుకనే చర్వితచర్వణంగానైనా ఈ నాల్గు పంక్తులు వ్రాయవలసియున్నాను. ఇది వట్టి పుటపూరణమే అయినా మా యిద్దరి సౌహార్దహారంలోని ఒక చిన్న ముడిగా సార్థకమే కాగలదు.

వాక్కారులూ, గేయకారులూ నేడు తెలుగుసీమలో ఎందరో ఉన్నారు. కాని ఉభయకారులు–బయకారులు–చాలామంది లేరు. నేడేకాదు; ఎప్పుడూ వారి సంఖ్య స్వల్పమే. కనుకనే బయకాడు అంటే 'రాగమును బయలు పఱచువాడు' అని బయకారమునకు 'యౌవనమునందు బయలు పడు శృంగార చేష్ట' అని, 'బయకారి' అనగా 'విలాసవతి' అని– ఏవేవో అర్థాలు నిఘంటువుల కెక్కినవి; (శబ్దరత్న). వాగర్థాలూ, నాదభావాలూ పరస్పర బంధంతో కవలపిల్లలవలె పుట్టిన వైనా, అవి తర్వాత స్వతంత్రతంగా అన్యోన్య నిరపేక్షంగా పెరిగి పెద్దవై పిస్తరిల్లినవి కాపడంచేత, ఈ రెంటినీ

పరిచయవాక్యాలు, 1958.

వీరాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ.

ఆకళించుకొనే సాహస ప్రయత్నాన్ని చేసేవారు కొద్దిమందే. అందులో నెగ్గినవారి సంఖ్య యింకా తక్కువ అని చెప్పబనిలేదు. మరి ఆ రెంటి కలయికలో స్వతంత్రంగా రచన సాగింపగలిగినవారిని లెక్కించడానికి చేతిలో పదివేళ్ళు అక్కరలేదన్నది అనుభవ సిద్ధమైన సత్యం. 'రజని'కి ఆ రెంటి యందూ సమానంగా కల శ్రద్ధాభక్తులూ, అట్టి రచనలో ఉపక్షాబలమూ, విరామ మెరుగని కార్యశూరతా – ఎన్నో యేండ్లుగా తెలుగుసీమలో పాదుకొన్న పరిచిత విషయాలే. వీరి తండ్రిగారు, నేటి తెలుగు నవ్య గద్య పద్య వాఙ్మయానికి మూలస్తంభమైనవారిలో నొక్కరు అగు శ్రీ బాలాంత్రపు వేంకటరావుగారినుండి 'అన్యం నయాతి హి విభూతి రపత్యభాజాం' అనే న్యాయంగా దిగివచ్చిన విభూతి యిది. ఇంకా వీరి పితామహులై "శివనారాయణ తీర్థయతి వరకృత తరంగిణీ ప్రథిత గాంధర్వ"లగు 'నారసింహమౌని' గారి మంగళాశాసనంకూడా తల్లి వేర్లై పై బయకారి సంస్కారానికి దోహదం చేసింది. 'శతపత్ర సుందరి' మొదలగు గేయ రచనలు వీరివి అచ్చుమూలాన ఆకాశవాణిమూలాన తెలుగునాటిలో ఎంతో వ్యాపించినవి. 'శతపత్ర సుందరి' గేయసంహిత మదరాసు ప్రభుత్వపు బహుమతికి పాత్రమైనది. ప్రస్తుతమైన 'ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము' గూడ తెలుగు భాషా సమితివారి సన్మానమును సంపాదించుకొన్నది. ఇందు వింత యేమీ లేదు. వాటి అర్హత చెల్లిందంతే.

భరతాచార్యుని మొదలు బాల మురళీకృష్ణ వరకును గల కర్ణాటక సంగీత వాగ్గేయకారుల పరామర్శ ఈ గ్రంథము. ఇది యెంత విశాల గంభీరమైన విషయమో ఎంత ఓర్పుతో సంగ్రహింపవలసిందో, యెంత ధైర్యంతో నిష్పక్షపాతంతో పరిశీలింపదగిందో ప్రత్యేకంగా వివరింపబని లేదు. అసలు వాగ్గేయకారుల చరిత్ర పరిశీలనార్హమనే భావమే ఇటీవల కలిగింది మనలో, అదిగూడ వీ కొందరికో మాత్రమే పూర్వకాలపు పండితులకు గాయకులు పంక్తిబాహ్యులుగా గానవచ్చిరే కాని, గానవిద్యను 'ఉపవేదం'గా మన్నించి ప్రచారం చేయడంలో వారి ప్రయత్నం సామాన్యం కాదు. జీవితంలో గానానికి ప్రవేశంలేని సందర్భమే వారి సంస్కృతిలో లేదు. కాని గాయకుల వ్యక్తి జీవితాలను గూర్చి, వారి రచనలను గురించి

కాని వివరాలు సేకరించే ఉత్సాహం వారిలో చూపలేదు. మరి యిప్పటి యూనివర్సిటీల పండితులకు పాట ఒక వినోదవస్తువు-అదిగూడా అయితే:- వారి పాలిటి భౌతిక శాస్త్రాల పాండిత్యమే పాండిత్యం. విశ్వకళా పరిషత్తులలో వారిదే ప్రభావత్యమూ పలుకుబడీ కూడా. కాబట్టి, నేటి విద్యా తారాపథములలో సంగీతం, నాట్యం మొదలైన లలితకళలమాట కేమిగాని, అసలు సాహిత్యం, చరిత్రవంటి విషయాలకే స్థానం దుర్భరమైపోయింది. కడుపు నించేపని మొదటిది; దానికి కావలసిన వేవో వాటిని అక్కడ మెత్తితే చాలు, చదువు సార్థకమయిపోయింది; బుద్ధిని నిశితంచేసే విషయాలుగాని, హృదయాన్ని స్నిగ్ధంచేసే కళలుగాని దమ్మిడీ తెచ్చిపెట్టేవి కావు; అవి నోమారులూ సుకుమారులూ మెచ్చుకొనేవి; ఆ రెండు తెగలవారికీ నేటి మానవ జీవిత తుములంలో చోటులేదు-అనేదే ఇంచుమించు ఇప్పటి విద్యాధికారుల దృష్టి. కాబట్టి, కళాకారుల యోగక్షేమాలు నేటి చదువరుల కక్కరలో లేనివి. ఈ స్థితిలో ప్రాచీనాధునిక వాగ్గేయకారు లందరికీ సంబంధించిన విషయాలను ఏర్చి కూర్చే ప్రయత్నం ఎంతో గొప్ప సామాన్యమైన త్యాగమంటే అతిశయోక్తి కాదు.

శ్రీ 'రజని'గారు ఆ పనిని ఈ గ్రంథంలో ఎంతో సమర్థతతో నెరవేర్చినారనేది స్పష్ట విషయమే. ఎందరో ఆంధ్ర వాగ్గేయకారులను గూర్చి ఇంతవరకును బైలుపడని చిన్న పెద్ద విషయాలెన్నో సంగ్రహించి చెప్పినారు. గ్రంథ నామానికి 'ప్రసిద్ధ వాగ్గేయకారులను గురించి ఆంధ్రములో వ్రాసిన చరిత్ర' అనే అర్థాన్ని ఉదారంగా వినరించుకొని జయదేవుడు. గోవిందదీక్షితుడు మొదలైన అనాంధ్ర బయకారులను గూడ కలుపుకొనారు వాగ్గేయములలో వారి పూర్వోత్తర సంబంధాలను పరిశీలించినారు. లక్ష్య లక్షణాలు రెంటినిగూర్చి ఇతరుల మాటలను వాదం చేయక సొంతముగా చూచి సోదాహరణంగా తమ యభిప్రాయములను వెలువరిచినారు. ఇతరుల అభిప్రాయాలలో తమకు తోచిన భేదాలను ఎంతో సుకుమారంగా గౌరవంగా సూచించినారు. పరిశుద్ధమైన పరిశోధక దృష్టితో ఈ రచన సిద్ధమైనదని ఒక్కమాటలో దీని గౌరవమును చెప్పవచ్చును. ఆ యా వాగ్గేయ రచనలపై వీరు కట్టిన విలువలు రెండీయందును వీరికి గల సాధనానుభవాల నైశిత్యాన్ని స్పష్టపరుస్తోంది.

విషయం చాలా విశాలమైనది. వివరాలు తెలుసుకొనే అవకాశాలూ సాధనలూ చాలా మితమైనవి. కనుక ఇందులో చేర్చవలసినవారు బయ కారులు ఇంకా ఎందరో ఉంటారని ఊహించడమూ పేర్కొనడమూ సులభమే. సర్వాంకషంగా ఇటువంటి విషయాన్ని నిర్వహించడం ఎప్పటికీ అసాధ్యమే గనుక, ఒకటి రెండు కొరతలున్నమాత్రాన ఈ గ్రంథం ప్రయోజనమూ యోగ్యతా అల్పమనుకొనేది అపచారం.

ఇట్లే శ్రీ 'రజని' గారి అభిప్రాయాలు కొన్నిటిని యథావత్తుగా అంగీకరించడం కొందరికి సాధ్యంకాకపోవచ్చును; లీలాశుకుడు అంధ్రుడనుకొనడానికి వారించిన హేతువులు చాలా దుర్బలములుగా నాకు కానవచ్చినవి. ఇట్లే సంగీత సమయ సారకర్త పార్శ్వనాథుడు, రాగ విబోధ కర్త సోమనాథుడును అంధ్రులని భావించేది సహేతుకంగా తోపదు. మరి యింత శ్రమతో వారి ఆంధ్రత్వాన్ని ఊహించి మనం సాధించేది వట్టి అభిమానం మాత్రమే. భాషలు యెల్లలన్నీ దాటిన కర్ణాటక సంగీత ప్రపంచంలో ఇటువంటి అభిమానాలు ఎంత దుర్బలంగా ఉంటే అంత క్షేమం.

"నేటి కర్నాటక సంగీతపు రాగా లెన్నో స్పష్టరూపం తాల్చినది క్షేత్రయ పదాలలోనే." (పుట 226) "అనుపల్లవికి క్షేత్రయ్య మార్గదర్శి" (పుట 251) ఈ యభిప్రాయాలు క్షోదక్షమంగా కానరావు. క్షేత్రయ వాడిన రాగాలు తాళాలు అన్నీ పురందర దాసాది ప్రాచీనుల రచనలలో నున్నవి. ఆ పదాలు పాడినట్లే వీటినీ పాడవచ్చును. నా గురువుగారు శ్రీ విడారం కృష్ణప్పగారు దేవరనామాలు పాడునట్లే క్షేత్రయాదుల పదాలూ అద్భుతంగా పాడేవారు. భక్తిశృంగార రూప భావ భేదమే తప్ప పాట శైలిలో ఏమీ భేదం మా యనుభవానికి అందులో రాలేదు. పదాలను రాగ ప్రధానంగా తెగయీడ్చి వాగర్థాల భావమే అపగతం కాకుండా పాడే పద్ధతి యీవల వీణ ధనమ్మాళ్ ప్రచారంలోకి తెచ్చిందని నా ఊహ. ఆమె త్యాగరాజాదుల కీర్తనలుగూడ ఆ శైలిలోనే పాడేది. అందలి రాగ మాధుర్యానికి లోగి ఎందరో గాయకులు – వాగర్థాల దృష్టి లేనివారు – దక్షిణ దేశంలో ఆ శైలినే అక్షరశః అభ్యాసం చేసి పాడుచున్నారనేది వేరుమాట. క్షేత్రయ్య యీ శైలిని తెచ్చిపెట్టినవా డనేది న్యాయం కాదేమో. అట్లే

అనుపల్లవి పురందర దాసుల కీర్తనలలో ఎన్నిటికో యున్నది. కనక దాసకృతులలో కలదు. ఇంతెందుకు? ఈ క్రింది అన్నమయ్య సంకీర్తన లోనే కలదు:

శ్రీరాగం

"ఇతరులకు నిను నెరుఁగ తరమా
సతత సత్యవ్రతులు - సంపూర్ణ మోహ విర
హితు లెరుంగుదురు నిను - నిందిరా రమణా"

దీనికి తర్వాత నాల్గు పంక్తుల చరణాలు మూడున్నవి. పై మూడు పంక్తులును ఒక పల్లవిగా కలిపికొట్టి పాడేది యెట్లో నా కర్థంకాదు. అట్లే,

"పరిపూర్ణుఁడవు నీకుఁ బరాకున్నదా, నిన్ను
మరిగి వుండనిదే-మావల్ల తప్పుగాక."

అనే తిరుమలయ్య సంకీర్తనలో రెండవపంక్తిని అనుపల్లవిగా అమర్చు కొనకపోతే రెంటినీ ఒక రూపంగా భైరవిరాగంలో పాడే రీతి దుర్గ్రహం కనుక దీని బరువంతా క్షేత్రయ్యమీదనే వేయడం నా దృష్టిలో న్యాయం కాదు.

తెలుగు కాంబోది యెరుకల కాంబోదిగా తరువాత యదుకుల కాంబోదిగా, ఉత్తరదేశంలో తిలక్ కామోదుగా మారినట్లే ఆంధ్ర భైరవి శ్రీ రజనిగా రూహించినట్లు, ఆనందభైరవిగా మారడం అసాధ్యమేమీ కాదు. కాని తాళ్ళపాక ఆంధ్రులు దీనిని గ్రహింపలేదు. మరి పురందరదాసాది కన్నడులు దీనిని వాడినట్లు పాట సాంప్రదాయమున్నది. మొన్న మొన్నటి దాకా తెలుగులాక్షణికు లెవరూ దీన్ని లక్ష్యించినట్లు తోపదు. కనుక ఆంధ్రులకు ఆ రాగంమీద కల విశిష్టానురాగం అది వారిదే అనడానికి హేతువు కాగలదా?

ఇట్లే క్షేత్రయ్య వాడిన 'మోవనాడు' అనే పలుకుబడిలో 'మువ్వ నాడు' అనే యెవ్వరూ కనివిని యెరుగని కొత్తనాడుగాని, 'నారదగానలోల' అనే త్యాగయ్యగారి కృతిలో నారదస్తుతి 'పంచరత్నాలకు' కావలసిన నారదుని స్వరూపంకాని నా చూపు కందని విషయాలు. మోవన్ అడు=

నామీద తప్ప మోచునట్లుగా ఆడుము అని మొదటిదాని కర్థం. రెండవ కృతిలో ప్రతిపాద్యవ్యక్తి 'నీరదసమ నీలుడు' కనుక 'భేశసంకాశుడు' 'కడు తెల్లదేహము' † గల నారదమని కాజాలాడు. కాబట్టి అతడు 'నారద గానలోలు'డే గాని 'నారద-గానలోల!' అనదగినవాడుకాదు. పంచ రత్నా లను కొన్నిటిని కనుక్కొనే ఉత్సాహంలో వచ్చి పడిన భ్రాంతి యిది. ఇట్లే క్షేత్రయ్యగారి 'మేరగాదు రమ్మనవే' అనే పదం అనుపల్లవిలోని 'మోరతోపు'ను 'మొరతోపు'గా ఎవరో తిద్దుట పలుకుబడి యర్థము మాత్రమేకాదు. ప్రాస సామంజస్యముగూడా గమనించక చేసినది.

ఇట్లే ఇంకా ఒకటి రెండు చిన్న విషయాలను గూర్చి అభిప్రాయ భేదాల కవకాశమున్నది యిందులో. కాని అసలు వస్తువు పెద్దది. స్వతంత్రము, ప్రామాణికము. అంధ్రదేశమందేగాక తెలుగు తెలిసిన సహృదయ గాయకులందరూ కృతజ్ఞతతో శ్రీ రజనీకాంతరావుగారి యీ మహా గ్రంథానికి స్వాగతమిస్తారు.

తిరుపతి
1-8-58

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

---

† శ్రీ నారదనాద-నారదమని వెడలిన అను త్యాగరాజకృతులను చూచునది.

భాసుని రామనాటక మూలములు

జీరెడ్డి చెన్నారెడ్డి

శ్రీ చెన్నారెడ్డిగారు ఈ తమ యుదాత్తరచనకు ఉపోద్ఘాతముగా రెండు మాటలు వ్రాయుమనుటకు నాయందు వారికి గల సౌహార్దమే హేతువు. దానికి నా ధన్యవాదములు. దానికి తోడు భాసమహాకవి రచనలందు నాకు గల అసాధారణ గౌరవముగూడ ననీన్న పనికి పేరేచినది. ఈ యానంద సందర్భమును జారవిడుచుట నాచేతగానిపని, కాని నేను విశిష్టముగా వ్రాయగలిగిన దేమియు లేదు.

భాసుని పదుమూడు రూపకములు ప్రపథముగా ప్రకటింపబడినది నేటి కించుమించుగా అర్ధశతాబ్దికింద. నాటి మొదలు నేటివర కెందఱో ప్రాచ్యపాశ్చాత్యపండితులు వివిధముగా ఆ సమస్యను విమర్శించినారు. వట్టి కాతస్కుతచిత్త వృత్తిగల కొందరు విమర్శకుల మూలమున ఆ చిక్కు మరింత దువ్వారానిదైనది. కాని హేతువాదము, హార్దవాదము అనురెంటిలో రెండవపద్ధతి బలీయమైనది. దాని బలముచేతనే, ఇప్పుడు లభించిన పదుమూడు రూపకములకును కర్తభాసుడే అను నమ్మిక బహుళముగా లోకమున నెలకొన్నది. దీనికి విరుద్ధమైన వింతవాదము లన్నిటికిని బలవత్తర సమాధానములిచ్చి శ్రీ శివరాం మహాదేవ పరాంజపేగారు తమ ప్రచురించిన ప్రతిమానాటక* పీఠికలో నికరముగా ఖండించినారు. 1930 వ సంవత్సరమునసే. ఐనను లోకమున కొందఱింకను ఆ సందేహ రజ్జువునే పట్టుకొని యూగులాడు చున్నవారున్నారు. అది ముక్కుకు సూటిగానే పోవు

ప్రస్తావన, 1961, ఆగస్ట్, 22.

* Poona Oriental Book Agency Publication, pp. XIV to XXXVI.

చారిత్రికదృష్టిని తెగబెంచుకొన్న లోపము; కవి హృదయమును, కావ్య జీవమును తలస్పర్శగా అనుభవింపలేని సంస్కారదోషము. అట్టివారితో తగవు తెగనిది, నిష్ఫలప్రయాసము.

అట్లే ఇటీవల కనుగొనబడిన 'యజ్ఞఫలం' అను నాటకము ఈ పదుమూడు రూపకములను రచించిన భాసుని కైవాడమే యని నమ్ముట సాధ్యముకాదు. ఆధునికు లెవరో దానిని కల్పించి భాసునిపేర చెలామణికి తెచ్చిరను ప్రవాదము నిజము కాకపోవచ్చును. కాని, పూర్వీకులలో అపక్వబుద్ధి యెవడో భాసుని ననుకరించి చేసిన శిథిలరచన యది యనుటకు సహృదయులు శంకింపరు. తక్కిన పదుమూడు రూపకములందును స్పష్టముగా మనము గ్రహింపగలిగిన భాసుని మనోధర్మముగాని, రచనావ్యక్తి గాని 'యజ్ఞఫల'మున వెదకిచూచిన నిర్వేదమే ఫలించును.

కాళిదాసునివంటి విశ్వకవికి అసూయను, స్పర్ధను గలిగించిన ప్రతిభామహితుడు భాసుడు. రంగస్థలమున రక్తి గలిగించు శిల్పములో సంస్కృతసారస్వతమున అతనిదే పైచేయి. అతని రచనలోని కొన్ని కొదవలను సవరించి కాళిదాసు రూపకశిల్పమును సంస్కరించి ముందుకు నడపినాడనుట సత్యమే, కాని భాసుని అసాధారణ ప్రతిభాగుణములు అందే నిలిచినవి-అనుకరింపరానివిగా.

భాసునిది చాల సంయతమైన చిత్తవృత్తి. పద్యములను అతడు వాడినంత గంభీరవివేచనతో వాడినవారు లేరు. ఒక కాళిదాసునకే కొంత ఆ వివేకము పట్టువడిన దనవచ్చును. ఏ వృత్తము రచించినను దానిసిండ అర్థభావములను కుదించి పెట్టి, ఒక్క అధికపదములేకుండ, గద్యము వలెనే నడపుట భాసుని యసాధారణగుణము. అతని పద్యములన్నియు సల్లాప ధోరణిలో కలిసి ముందటిమాటతో అతుకుకొని సాగును. ఇక భాసుని గద్యము ఎంతో మితభాషగలిగి సూత్రప్రాయముగా నిలుకడలేక నడచును. నాలుగుమాటులు చెప్పవలసినచోట ఒక మాటచేతచే కార్యము నిర్వహించు సంయమచాతురి యితనిది. ఆ యొక్క మాటను సందర్భోచితమైన కాకు స్వరముతో, అభినయబలముతో, ప్రయోగించి రంగమున పాత్రవ్యక్తిని

సంపర్శుద్ధిని నటులు నిర్వహింపవలసియున్నారు. కనుక ఇతని రూపక ములలో రంగమందున్న యే పాత్రగాని అభినయములేక బొమ్మవలె నిలచుండ వీలులేదు. పాత్రాభినయమును సూచించు మాటలు చాలమిత ములు. ఈ తత్త్వమును గ్రహింపకపోవుట చేతనే భాషాంతరీకర్తలు కొందఱు ఇతని మాటలను అనన్వితముగా పరివర్తించినారు. రంగమం దభినయించు నటులు ఇది తెలియక నటించినప్పుడు భాసుని రూపకములు శుష్కముగా భాసించునని చెప్పబనిలేదు. కనుకనే కొందఱు విమర్శకుల దృష్టికి భాసుని రచనలో రూపకకళ చాలమందమని తోచినది గూడ. భాసుని ఈ సంయమ మెంత గొప్పగుణమైనను అందందు లోపముగాగూడ అది పరిణమించినదనియు చెప్పకతప్పదు.

ఎట్లైనను సంస్కృతవాఙ్మయమున భాసునికృతులు అసాధారణ వాగ్దేవీ దరహాసములు. కాళిదాసునివి అమెవిలాసములు, "భాసో హాసః కాళిదాసో విలాసః" అన్న ప్రాచీనాభియుక్త సూక్తి యీ యిద్దఱి రచనా వైఖరిని వివరించినది. కాళిదాసునివి మూడే రూపకములు మనపాలికి వచ్చినవి అదృష్టము, భాసునివి పదుమూడు లభించినవి. ఆతడు రచించిన రూపకములు ఇరువదిమూ*డని యొక ప్రవాదము గలదు, ఉండ వచ్చును. పదమూటిని రచించినవాడు మరి పదిఱిని రచించియుండుటలో ఏంత యేమియు లేదు.

ఈ కళానిధిని తెలిచి తెలుగువారి కందజేయవలయునని శ్రీ చెన్నా రెడ్డిగారి సుసంకల్పము. శ్రీ రామకథామూలకములైన యజ్ఞఫలము, ప్రతిమానాటకము, అభిషేకనాటకము అను మూఁటిలోతైన సమీక్ష యీగ్రంథము. యజ్ఞఫలము భాసుని రచన కాదని విస్తృతముగా చర్చించి నిర్ణయించినారు. వీరి యీ నిగమనమును కాదనుట సులభముకాదు. నామట్టుకు నాకది యెంతో తృప్తినిచ్చినది.

---

* శ్రీ రంగమందలి వాణీవిలాసముద్రాశాలలో ప్రకటితమైన శివ స్వామిని ప్రియదర్శిక పీఠిక, అభినవబాణభట్ట శ్రీకృష్ణమాచార్యులు ప్రవాసినది, పుట XXVIII చూడుడు. భాసునిగూర్చిన వింత వింత ప్రవాదములు కొన్ని అందు గలవు.

పఠితము, అభిషేకముల సమీక్ష అంతే లోతుగా నడచినది. ఇది ప్రధానముగా రూపకసంవిధానవిమర్శ. కనుక ఇతర విషయముల నిందు తడవలేదు. పాత్రస్వభావపోషణము, సంవిధానమందలి సందర్భశుద్ధి వీనికై భాసుడు చేసిన మూలకథయందలి చిన్న-గొప్ప మార్పులు వాని విలువలు-ఇందు కూలంకషముగానేకాక సర్వంకషముగా గూడ వివరముగా విమర్శింపబడినవి. భాసుడు చేసిన మార్పులకు పద్మపురాణానందరామాయణములందు ఆకరము లున్నవని సూచింపబడినది. పద్మపురాణము మాటయట్లుండ, ఆనందరామాయణము భాసునకన్న ప్రాచీనమని నే ననుకొనలేను. రెడ్డిగారికిని ఆ సందేహము లేకపోలేదు. కాని స్థితగతిచింతనముగా ఆ రామాయణము నిందు వీ రుపయోగించుకొన్నారు. ఆ మార్పులందలి యౌచిత్యములవలె అనౌచిత్యము లని తోచినవానిని గూడ నిష్పక్షపాతముగా మఱుగు లేక ధీరముగా స్పష్టపఱిచినారు. ఆధునిక విజ్ఞానవివేకములం దెంత నిష్ణాతులైనను రెడ్డిగారు కేవలము విషయదృష్టితోనే విషయి దృష్టితోగాక-భాసుని రామాయణ మహత్తర పాత్రలను పరిశీలించినారు. ఇప్పటివారిలో పలువురికి ఈ సంయమము అందుకోలేని పండు. ఇందుకై వీరు పలుమారు ప్రత్యక్షరముగా శ్రీమద్రామాయణమును, పద్మపురాణానందరామాయణములను, భాసుని రూపకము లన్నిటిని, వానిని గూర్చిన ఆధునిక విమర్శగ్రంథములను, ఆంగ్లాంధ్రభాషలలోని పరివర్తనములను పరిశోధించినా రనుటకు ఈ గ్రంథమందలి పఠితపుటమును సాక్షీభూతముగా నున్నది. విషయమును దాటని చర్చ, ప్రసన్న గంభీరమైన శైలియు ఈ గ్రంథమునకు వన్నె తెచ్చినవి.

ఇట్లే భాసుని భారతనాటకము లేడింటినిగూడ సమీక్షింప సంకల్పించినారు శ్రీ చెన్నారెడ్డిగారు. ఆ కార్యము త్వరలో పూర్ణమై తెలుగు సారస్వతమునకు ఇంకొక రత్నాభరణ మగుగాక.

22-8-1961. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

సమగ్రాంధ్ర సాహిత్యం (సంపుటం 8)

ఆరుద్ర

శ్రీ ఆరుద్రగారి యీ 'సమగ్రాంధ్రసాహిత్యం' అపూర్వమైన, అసాధారణమైన రచన. ప్రయత్నం గొప్పదా, ఫలసిద్ధి గొప్పదా అని ఆశ్చర్యపడవలసిన పెద్ద పనితనం.

మరి విశేషమేమంటే, ఇప్పటి మునిసిపల్ పార్కులవంటి 'దేశి' వాఙ్మయవీధులలో స్వచ్ఛందగా ఈదులాడుతూవుండిన ఆరుద్రగారు ఉన్నట్టుండి ఈ 'మార్గ' కావ్యమహాటవిలో ముండ్లనక, రాళ్ళనక పరిశోధనకు దిగి, పెదమొగం పెట్టకుండా ధీరంగా, దీర్ఘంగా ప్రయత్నం సాగిస్తూవుండేది! ఈ సాహసకార్యంలో వారికి అప్పుడప్పుడు తమ ఆధునికరచనాశీలలు విశ్రాంతిస్థానాలుగామాత్రం ఉపకరించిందేమో అనిపిస్తుంది. సద్దు లేకుండా ఎన్నేండ్లుగానో ఈ పరిశోధనప్రయాస సాగుతూ వుండవలెను. లేకపోతే ఈసిద్ధి ఇంత సార్వభౌమంగా రూపొందదు.

రెండుచేతులా 'శాపాదపి శరాదపి' అన్నట్లు వీరు సాధిస్తూవుండే యీ పరిశోధనలో మొదటిది కవి-భర్తల చరిత. నూరేండ్లకూమించి పెద్దలు, చిన్నలు ఎందరో ఈ విషయం చర్చిస్తూవున్నారు 'కనుక ఇదేమంత కష్టమైన పనా?' అని ఒక మిత్రులన్నారు. కాని అది అన్యాయంమాట. మన కవుల చరిత చాలాభాగం వేర్లు చేతికందకుండా పెరిగిన ఎక్కడ వేలుపెట్టినా కథల, కింవదంతుల, అభిమానాలముండ్ల

పీఠిక, 1965.

ఎం. శేషాచలం కంపెనీ, మదరాసు.

తప్పదు. ఈ విషయంగా రాసిన గ్రంథాల, వ్యాసాల రాశిని-అచ్చైనవీ, కానివీకూడా-సంగ్రహించి కడమట్టా చదివి అవిటిలోని సారాసారాలు తేల్చుకోని, ఆయాకవుల కావ్యాలు సొంతంగా చూచి కొత్తవిషయాలు కని పెట్టి కూర్చుకోని, వంశవృక్షాల పౌర్వాపర్యం నిర్ణయించుకోని స్వతంత్ర సిద్ధాంతం చేసేదంటే చిల్లరపనికాదు. ఆరుద్రగారు ఆ పని యెంతో శ్రద్ధతో చేసిన్నారు.

రెండోది ఆయాకవుల కాలపు సాంఘికవిపరివర్తాల, విప్లవాల ప్రభావం, వాండ్ల ప్రతిభలు పారిన దారి, వాండ్ల ఉపజీవ్యోపజీవక భావం. వారి కడుపుకక్కురితి-ఇత్యాదుల అన్యోన్యాశ్రయగుణదోషాల నీడలు ఆయారచనల్లో ఎంతమాత్రం పడిందో చూపే ప్రయత్నం, భావాశ్రయమైన యీ విమర్శ ఇంతదనకా చరిత్రకారులు ఎవరూ క్వాచిత్కంగా తప్ప క్రమంగా చేసింది కాదు. ఇందులోనూ ఆరుద్రగారి పరిశ్రమ స్వతంత్రం; శ్లాఘనీయమున్న్నది. ఇందుకని వారి నెంత అభినందించినా తెలుగువారి కృతజ్ఞతాధర్మంతీరదు.

కాని ఒట్టు మీద పైరెండు మహావిషయాలలో మొదటిదే ఈ సంపుటాల్లో ఎక్కువచోటు ఆక్రమించిందేమో అనిపిస్తుంది. కాని అది విషయ మహత్వ దోషం; గ్రంథకర్తది గాదు. వీకకాలికంగా రెండు పెద్దపనులకు చేయివేస్తే వీదోవొకటి గౌణం కాకతప్పదు మరి. రెండవదే ముఖ్యంగా ఈ రచన సాగింటే తెలుగువారి సాహిత్యానుభవసంస్కారానికి శ్రీ ఆరుద్రగారి సహృదయభావాలు ఎంతో దోహద మిచ్చివుండేవి. కాని యిప్పుడేర్పచుకొన్న సంపుటాల నియమంలో, కాలపరిమితిలో ఇంత జరిగిండేదే వింత.

కవిచరిత్రవిషయంలో ససాక్షికమై స్వతంత్రమైన నిర్ణయాలు చేసినా శంలో, అనూచానంగా వచ్చిండే పద్ధతులను ఒకటి రెండు చోట్ల అట్టనే సాగనిచ్చినారని తోస్తుంది. ఒక వుదాహరణం:—

రన్న కృష్ణదేవరాయల అష్టానాష్టదిగ్గజాలలో ఒకడుగా కొందరు నమ్మినారు. ఆరుద్రగారూ దాన్నే స్థాపిస్తా ని ఈ కోవకు చెందిన సూరపరాజుగారు కృష్ణదేవ

రాయల అష్టదిగ్గజాలలో ఒకరు కాకపోతేనేం'' (8-228) అని నిగమించి నారు కాకపోతే ఏమీలేదుగాని అయ్యుండగూడదా అనే ప్రశ్న మాత్రం నాకు మిగిలేవుంది.

సూరన్న కాలం నిర్ణయించేదాంట్లో ఒక పెద్ద ఘట్టముంది. దాన్ని చదునుచేయడం ఒక్కే, అళియరామరాయలు కృష్ణదేవరాయల అల్లుడుగదా. కనుక సమకాలికుడు. రామరాయలు ఆర్వీటి బుక్కరాయల పౌత్రుడు, రెండవపెండ్లామునంతతిలో. సూరన్నగారి కళాపూర్ణోదయ కృతిభర్త నంద్యాల కృష్ణమరాజు పై బుక్కరాయల మొదటిభార్య సంతతిలో మునిమనమని మనమడు. అంటే ఒక భార్యవంశంలో అయిదో తరంమనిషి, రెండోభార్యవంశంలో మూడవతరంవాడూ ఒక కాలంలోనే కృష్ణదేవ రాయల సంస్థానంలో వుండగలరా అనేది చారిత్రిక చిక్కు.

నాకేమో ఉండవచ్చు ననిపిస్తుంది. నిస్సందేహమైన నా జీవితంతో పోల్చుకుంటే చాలు నా వూహకు బల మెక్కుతుంది. మన్నించండి-ప్రకృతో పయోగియైన నా వంశవృక్ష మిది:

అనంతాచార్యులు

(పెద్దభార్య శింగమ్మ)	(రెండోభార్య లక్ష్మమ్మ)
లక్ష్మమ్మ	అలమేలుమంగమ్మ
నరసింహాచార్లు	నేను
లక్ష్మీనరసమ్మ	
లక్ష్మీదేవమ్మ	
రఘునాథం	
అతని చిరంజీవి	

నా తాతగారిని నే నెరుగను, ఆయన గతించిన పదహారేండ్లకు నా జన్మం. ఇప్పటి నావయస్సు 73. ఐతే మా పెద్దవ్వగారి మొదలు ఇందరంతా

ఆ పరంపరలో అందరినీ నేను చూచినాను. ఇంకొక తరంగూడా చూడ వచ్చునేమో? కన్యాశుల్కమిచ్చి పెండ్లిండ్లు చేసుకొనే పూర్వకాలంలో, కలిగినవారు కొడుకులకు పదహారేండ్లతొలిపాయంలోనే వివాహసంస్కారం జరిపేదీ, సమానస్కంధులతో వియ్యాలు జరపవలసిన రాజుల వంశాలలో తగిన సంబంధాలు దొరకనికారణంగా కొడుకుల కూతుళ్ళ వివాహకాలం అనిశ్చితంగా ముందుకు పోయేదీ, సామాన్యమైన ప్రాచీనసాంఘిక వ్యవహారాలే అనుకొంటే తప్పేమీ ఉండదు. కాబట్టి తలా ఇరవైయెదేండ్లు సగటు పంపకం శాస్త్రీయమైనా సత్యానికంటే సందేహానికే యెక్కువ అనుకూలించే పద్ధతేమో!

కొన్ని వ్యాప్తిలో వున్న అభిప్రాయాలను తరచి చూడకుండా ఆరుద్ర గారు ఇందులో చేర్చినారు. కొన్నిటిని పేర్కొంటాను.

(1) (1 సం. పు. 7) 'చెంబు' అనే పదంలో వుండేది 'బు' ప్రత్యయం కాదు. 'చెంబొగ' అంటే ఎఱని లోహం–రాగి. స్వర్ణం అంటే బంగారేకాక దానితో చేసిన నాణ్యంగూడా అర్థమైనట్లే 'చెంబొగ' 'చెంబు'గా మారి తామ్రపాత్రగా, అదీ ఒకరకమైనదిగా, వాడుకపడింది. మరి ఇది "అసలు సిసలు తెలుగుపదం" అనీ అనుకోకూడదు. అరవ–మళయాళాల్లో 'శెంబు', కన్నడంలో 'చెంబు'. మరి శ్రీ ప్రభాకరశాస్త్రిగారు గుర్తించిన అక్షరాలు 'నాగబు' అన్నదాన్ని ఎవరూ కాదనలేరు. ఆయన ప్రామాణికత్వం అట్లాంటిది. కాని అమరావతీ స్తూపం ముగియడానికి పట్టిన ననూ్నరేండ్లలో ఆ రాతిపలకమీది ఆ మూడక్షరాలు ఏకాలంవో, ఏభాషో, ఏమర్థమో! అప్పటికే 'నాగ' పదానికి సంస్కృతంలో ఎనో్న అర్థాలు వచ్చినాయిగదా!

(2) (1–36) కందం "తెలుగువాళ్ళనుంచి ప్రాకృతంలోకి, ప్రాకృతంలోనుంచి సంస్కృతానికీ వెళ్ళింది." చాలా పెద్దమాట! పింగలాచార్యుడు లక్షించి ఉదాహరించిన పద్యం ఆర్యాగీతియే తెలుగు కన్నడాల కందం, పింగళుడు ప్రాచీనుడుగా ఇతిహాసపురాణప్రసిద్ధుడు. పాణినికాలం వాడని కొందరి మతం. ఇంకా పాతవాడనీ అనేవారున్నారు. అతడిచ్చిన లక్షణం "అర్ధేవసుగణ ఆర్యాగీతిః" (4–31) ఇచ్చిన లక్ష్యం చూడండి:

"అజమజరమమరమేకం ప్రత్యక్చైతన్య మీశ్వరం ప్రబ్రహ్మపరమ్
ఆత్మానం భావయతో భవముక్తిః స్యా దితీయ మార్యాగీతిః"

ప్రాకృతలాక్షణికులు దీనికి 'ఖందయ' అని పేరుపెట్టినారు. 'స్కందకం' అని సంస్కృతోచ్చారణ. ఎప్పుడు, ఎందుకు ఈ పేరుమార్పు కల్గిందో తెలియదు. అదే 'కందం'గా తెలుగుకన్నడులు వాడినారు. ఈ రూపపరిణామాన్ని కందం-ఖందయం-స్కందకంఅని తల్లకిందులుగా చూచుకొమ్మని సూచిస్తారు ఆరుద్రగారు! కన్నాటకులు ప్రాసంమాతమే, తెలుగువారు యతినిగూడా, దాని కతికించినారంతే 'సేతుబంధం' వంటి ప్రాకృత ప్రాచీనకావ్యాలు కొన్ని యీ ఆర్యాగీతిలోనే ప్రాయశః నడిచినవి. ఇతరార్యాభేదాలవలెగాక ఇది రెండుసగాలలోనూ ఒకే ప్రమాణంతో చౌకంగా వుండేది దీని వ్యాప్తికి ముఖ్య కారణం కావచ్చు. తాము వాడిన సంస్కృత వృత్తా లన్నిటికీ తెలుగు వాండ్లు మూలంలో లేని యతిప్రాసలను దిగ గొట్టినారు. అంతమాత్రాన శార్దూలం, ప్రస్ఫర మొదలైన వృత్తాలన్నీ తెలుగునుంచే సంస్కృతానికి ఎగబాకిన పనుకునే అల్పసంతోషిత్వానికి నేను నోచుకోలేదు. మరి ఒక దేశంవారికి కొన్ని ఛందస్సులమీదనే అభిమానమూ, అభ్యాసమూ కలిగేందుకు సంప్రదాయభక్తి ముఖ్యకారణమనేది నిజం.

(3) "ఆదిలో శ్రీరామచంద్రుడంతటివాడు దేశిని ఈసడించి మార్గ పద్ధతిగానాన్నే మెచ్చుకొన్నాడంటే మధురకవితలు ఎటువంటి పరిస్థితిలో ఉండేవో ఆలోచించుకోవచ్చు" (1-100) పాపం! శ్రీరామచంద్రుణికిగాని వాల్మీకికిగాని యీ భావమే లేదు. కుశలవులు 'మార్గవిధానసంపదా' పాడిరని మాత్రమే అక్కడున్నమాట. వాండ్లు "దేశి పద్ధతిని పాడుతూ అభినయించ సాగారు. ఆ గానానికి సదస్యులందరూ ఉప్పొంగిపోయారు. తన్మయులు అయినారు. అప్పుడు రాముడు ఆ కుశలవులను చూచి 'మార్గపద్ధతిన ఆ మహాకావ్యమును గానంచేయ'మని చెప్పాడు" అని శ్రీనివాసశిరోమణిగారి వాల్మీకి రామాయణానువాదంలో ఉందట! ఉంటే వుంటుంది. ఆ వాల్మీకి మూలాన్ని గూడా ఒకమారు చూచింటే ఆరుద్రగారు ఈ అపవాదం రామునీ

నెత్తిన వేసిండరు.

ఇట్టివి మరికొన్ని సూచించి విడుస్తాను.

(4) (1-108) "శంకరాచార్యులు బుద్ధుడిని విష్ణుమూర్తితొమ్మిదవ అవతారం చేసి జనసామాన్యాన్ని మంత్రముగ్ధుల్ని చేసినారు"

(5) (1-110) బాలచరితం భాసుని భారతనాటకం.

(6) (1-129) "ఈ సూక్తులు మూలంలో లేవు." ఉన్నవి. చూడండి 1-42-8,9 శ్లోకాలు.

(7) (1-77) "మన ఆడవాళ్ళ పాటలన్నీ తరువోజలోనే ఉంటాయి"

(8) (2-94) "తిక్కన్నది ఆనాటి శిష్టవ్యావహారికం" భావాలనూ శయ్యలనూ వ్యావహారికానికి సమీపంగా దించేది మహాకవుల లక్షణం. భాషారూపాలనుగూడా అట్లనే కూర్చే మహాకవి కానరాడు, నాకు, కొన్నిటిని పరిగహించివుండవచ్చును, అంతే.

(9) (2-132) తిక్కన్నభారతం ఆనందపదాంకిత మనేది మొదట నేనే గమనించింది; రామలింగా రెడ్డిగారు కాదు—నే నెరిగినంత వరకు. మరి ఇదొక్కగొప్పగా నే నాయనతో చెప్పలేదు. ప్రాస్తావికంగా అన్నమాట మిత్రుడు జ. రుక్‌గారు అరచెవితో విన్నట్టుంది. కావ్యాలను ఆభిమానిక పదాంకితంగా సంస్కృతంలో 'భారవి-మాఘులవలె తెలుగులోనూ కొందరు చేసినట్టుంది. తిక్కనవలె హరిహరోపాసకుడైన కొరవిగోపరాజు తన 'సింహాసనద్వాత్రింశిక' ను 'స్వరూపా' అనే మాటతో అంకితం చేసినాడని ఈవలనే నాకంటికి తట్టింది.

(10) (5-110) భోజుడు రామాయణచంపులో "కిష్కింధా కాండను వ్యాకొడట." ఐతే తక్కిన కాండలు రాసిందెవరట? యుద్ధకాండ

మాత్రం అతడు రచింపలేదని సంప్రదాయం. అది పూర్తిచేసిన వాండ్లుకొందరున్నారు. పుస్తకం చూచింపే ఈ 'అట' అక్కరశేకుండేది.

(11) (8-202) పింగళి సూరన్న "పూర్వం లలాటేక్షణభక్తిశీలుడు. ఇప్పుడు (కళాపూర్ణోదయరచనకాలానికి) విశిష్టాద్వైతిగా మారాడు"—అది మార్పు అనలేము. నంద్యాల ప్రభువులకై చేసుకొన్న దాక్షిణ్యం పెండ్లి. మరి పద్మావతీపరిణయాన్ని కాలానికి శివభక్తుడే అయినాడు. ప్రాయశ: అల్లసానిపెద్దన్న, తెనాలిరామకృష్ణుడు మొదలైన వారిదంతా—ఒక తాళ్ళ పాకవారిది విడిచి ఇటువంటి కప్పకొన్న వైష్ణవమే.

(12) (8-90) వాసిరాజు రామయ్య 'గంగను వర్ణిస్తున్న' సీస పద్యం స్పష్టంగా వేసవిని వర్ణించేది. "ఘర్మసమయ మేచి పర్వె" అనే దాని ముగింపు. ఈ అపార్థం ఎట్ల కలగిందో ఊహింపలేను.

ఇట్లాంటి 'ధోరణి' అభిప్రాయాలు మరికొన్ని ఎత్తి చూపవచ్చు. పీఠిక సామాన్యస్వరూపాన్ని దాటి పైమాటలు రాసినందుకు ఆరుద్రగారు నన్ను మన్నిస్తారని నమ్మినాను. ఈ స్వతంత్రం నాకిచ్చి అనుగ్రహించినవారు ఈ గ్రంథం ప్రకటించే మహాకార్యం నిర్వహిస్తావుండే శ్రీయం. యస్. రావుగారు. ఆ యిద్దరు మహాశయుల ప్రయత్న సిద్ధులందు నాకుండే గౌరవవిశ్వాసాలే నా యీ అధికప్రసంగానికి మూలం. ఇది కుదృష్టి చేతనో, అసూయచేతనో చేసిన కొతస్కృత విమర్శకాదు. ఇట్లాంటి మహాకార్యం తేజస్వీగా వెలయవలెనని చేసిన సూచన.

తిరుపతి
21-12-65

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

వేమన చరిత్రము

బండారు తమ్మయ్య

శివశ్రీ బండారు తమ్మయ్యగారి యీ 'వేమన' ఆ విచిత్ర మహాపురుషుని గూర్చిన విమర్శ గ్రంథములలో ఇప్పటికి కొలికిపూస. వీరి శ్రద్ధా భక్తులు, రక్తిశక్తులను అసాధారణముగా కడచిన శతకార్ధమున కెక్కువగా ఆంధ్రసాహిత్య ప్రపంచమున ప్రతిఫలించుచునేయున్నవి. కనుక దీనికి ఇతరుల యపోద్ఘాతముల పనిలేదు. వారి పేరొకటి ముఖపత్రమున నుండుట చాలును. కాని వారి ప్రణయ నిర్బంధమును కాదనలేక రెండుమాటలు వ్రాసి వారియెడ నాకు గల గొప్ప గౌరవమును సూచింతును. సుమారు 45 సంవత్సరాలకు ముందు ఆంధ్రవిశ్వకళాపరిషత్తు వారి ప్రోత్సాహముతో వేమన్నను గూర్చినేను గొంత తప్పకపు పని చేసితిని. కాని యీవల మరల ఆజోలికే నేను పోలేదు. అంతే చాలునని శ్రీ తమ్మయ్య గారు తమ యీ విస్తృతరచనలో నాపేరు గూడ అతికింప గోరి నన్ను ధన్యుని చేసినారు.

అనుస్యూతముగా వేమన్నను గూర్చి పరిశోధించి చర్చించిన వారిలో శ్రీ తమ్మయ్యగారిది మొదటి పీట. ఆ వ్యాసములన్నియు కూర్చి క్రొత్త విషయములు చేర్చి సిద్ధపరిచినదీ రచన. సుగృహీత నామధేయులు శ్రీ నార్ల వేంకటేశ్వరరావుగారు ఇటీవలనే ఇంగ్లీషులో "వేమన" అను పేర కేంద్రీయ సాహిత్య అకాడమీ వారి "మేకర్స్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్"

ఉపోద్ఘాతము, 1970, ఫిబ్రవరి, 4.
శ్రీ నిర్మల శైవ సాహితీ గ్రంథమాలిక, కాకినాడ.

అను గ్రంథమాలలో ఒక్క చక్కని గ్రంథమును ప్రకటించినారు. శ్రీ తమ్మయ్యగారు దానిని చూసిన సూచన యిందు కానరాదు. వేమన్న విషయమై శ్రద్ధగలవారు తప్పక చూడ వలసిన పుస్తకమది. ఇవి గాక శైలిలో–చిత్తవృత్తిలో వేమన్న ననుకరించి ఆటవెలదులెనో్న వారు రచించి ప్రకటించియున్నారు. కపితారసికుల కవి ఎంతో కమనీయములైనవి. ఇందు వేమన్నను గూర్చి నేను గమనించిన అంశములను, నేను పడిన యభిప్రాయములను ప్రాయికముగా ఆలోచించుట మాత్రము గాక, వానిని విమర్శించి నన్నను గ్రహించినారు శ్రీ తమ్మయ్యగారు. భిన్నభావములను స్నిగ్ధముగా సూచించినారు. వేమన్న ధర్మ–నీతి–కావ్యకళల వైశిష్ట్యమును ఉజ్జ్వలముగా పైకెత్తి పద్ధరించినారు.

అభిప్రాయభేదములకు కావలసినంత చోటు వేమన్న వనబడు పద్యాలలో గలదు. దానికి ముఖ్య కారణము కొన్ని వేలసంఖ్యగల ఆ పద్యాలలో నికరమైన అసలు పాఠమని నమ్మదగినవి కొన్ని పదులైనను లభించునని చెప్పట కష్టము. ప్రాతలో, నోటిలో, అభిప్రాయములో, అభిరుచిలో–ఎన్ని విధములుగా చెడవచ్చునో అన్ని విధములుగాను చెడినవి అతని పద్యాలు. దానిచే అపార్థములకు భిన్నాభిప్రాయములకు–వానిలో అవకాశము సులభము. ముద్రితాముద్రితములుగా ఉన్న వేమన పద్యాలన్నిటిని సంగ్రహించి పోల్చి పరీక్షించి మూలపాఠమును నిర్ణయించుట పెద్ద బరువు. దానికి యీవరకు ఎవరునూ శ్రద్ధతో చేయివేయలేదు. మరి అది ఒక వ్యక్తి చేయ గలిగిన పని కాదు. ప్రామాణికుడై కేవల విషయదృష్టి గల పరిశోధన ప్రపీణుడు సర్వాధికారము కలిగి నడుపునట్టి సంస్థయొకటి కొన్నేండ్లు పరిశ్రమించి నిర్వహింపవలసిన నిష్కామకర్మ అది, అందాక మనము చేయు విమర్శనలన్నియు ప్రాయశః మన అభిరుచులచే శ్రద్ధలచే ప్రబోధితములైన అభిప్రాయముల ప్రకాశనమే అగును. కాని వేమన్న వంటి ఆకర్షకవ్యక్తి విషయమున ఆ కార్యోత్కంఠను అణచుకోలేము. మనకు నచ్చినవి, రుచించినవి వేమన వని, కానివి ఇతరు లెవరో అతని పేరు పెట్టి సమకూర్చి దూర్చినవని భావింపవలసియున్నాము. మరి యింకేమి చేయగలము?

శ్రీ తమ్మయ్యగారు ప్రకృత నిబంధమును ఎంతో విశాలమైన చూపుతో సంతరించినారు. అయినా అందందు భిన్నాభిప్రాయచ్ఛాయల కవకాశము లేకపోలేదు.

"వేమన మతము వీరశైవమే" అని నిర్ణయించి [పు. 165] "సామాన్య వీరశైవ ధర్మముల నాతడంతగా చాటింపక విశేష వీరశైవము నాశ్రయించి యుండునని నాయాశయము". [పు. 53] అన్నారు తమ్మయ్యగారు. ఈ సామాన్య విశేషముల భేదమెట్టిదో అది వేమన సూక్తులలో ఎక్కడ ఎట్లు స్ఫురించుచున్నదో వారు వివరించియుండిన బాగుండెడిది. ఆ యధికారము వారికి గలదు. సామాన్యజనులకు వీరశైవమతమును సూచించునవి ఇష్టలింగధారణము, విభూతి, రుద్రాక్షలు మొదలగు బహిర్లక్షణములు. వేమన వాటిని తిరస్కరించుట మాత్రమే కాదు, "గంగాధరుడే దైవము" అన్ననోటనే "హరిహరాదులందు నాసవిడిచి" "శివుని జంపి తాను శివయోగి గావలె" అనికూడ అన్నవాడు. ఇంతపై వీరశైవ మందతడు కట్టుకొన్నదేమో తెలియదు. ఈ సందర్భమున "ఈ షణ్మతములలో శైవము చాల ప్రాచీనము ప్రధానమయినది [పు. 159] అన్నది తమ్మయ్యగారి ఆభిమానిక ప్రత్యయము. దాని ప్రాచీనత్వమును ప్రధానత్వమును గూడ ఎందరో ప్రతిఘటించినారు. ఈ ప్రస్తావన మందే

"ఆఱు మతము లందు నధికమైన మతము
లింగమతము కంటె లేదు జగతి
లింగధారి కన్న దొంగలు లేరయా"

అను పద్యమందలి ప్రచలిత పాదమును వదలి "ఆఱుమతముల పయి" "లింగధారులందు దొంగలు గలరయా" అను పాఠాంతరములను కనుగొని పరిగ్రహించినారు శ్రీతమ్మయ్యగారు. నాదృష్టికది అనావశ్యక మనిపించుచున్నది. అట్లే "ఏడు మతములందు నెనసి చూడగబోవ లింగమతము కన్న లేదు మతము" అన్న పద్యమున "[సామాన్య] శైవము కంటె వీరశైవము నొక ప్రత్యేక మతముగ నెంచినాడు" అనుట గూడ [పు. 166] వేమనపై వేయకలిగిన భావముగా తోపదు. అసలీ పద్యము వేమనదే అగునేమో పరీక్షింపవలసియున్నది. పై పద్యము మూడవపాదము

"మతము మూలమెఱుగ మర్మంబు లేదయా" అనునది అస్పష్టము. పై రెండు పాదములలో దీని సంగతి గూడ నట్టిదే.

కాశీఖండావతారిక యందలి "విలసిత కీర్తిశాలియగు వీరమహేశ్వరు దేహరంబు శీనిలయమునన్" అనుపద్యము వేమారెడ్డిని గూర్చినది గాదు. [161] మరి వీరభద్రారెడ్డినిగూర్చినది కనుక దానిలోని "వీరమహేశ్వరు" అనునది "వీరమహేశ్వరు" అనియుండతగును. ఆ పద్యమునకు వెనుక [ప. 47] నున్న "వీరక్ష్మాపతి వలె" తరువాతి పద్యము [50] నందలి "వీరశౌరి" వలె వీరభద్రపదమునకు సంగ్రహము. అంతే కాని అది వీరశైవునిగా అతనిని పరికిపాదింప ననుట సందేహ విషయము. మహేశ్వర శబ్దమునకు మాహేశ్వరుడను నర్థము లాగుటయు యుక్తము గాదు. శ్రీనాథుని శివభక్తి కాళిదాసుని శివభక్తి వంటిదే కాని పాలకురికి సోమనాథుల దాని వలె బసవేశ్వర ప్రచారితమై, జాతిభేద నిరాసకమై మద్య మాంసములను పూర్తిగా వర్జించి, లింగధారణాది లక్షణములు గల వీరశైవముగా నుండినదనుటకు ప్రమాణములు లేవు. అప్పటి రెడ్డిరాజుల మంత్రుల శైవము గూడ ఆ తీరుదేయనుకొనుట న్యాయమని తోచును.

వేమన వేశ్యాలోలుపత్వమును అతని జీవిత మందలి యొక దశా విశేషముగా శ్రీ తమ్మయ్య గారంగీకరించుట వారి సత్యాన్వేషణ దృష్టికి సాక్షి. ఇది శ్రీనాథుని విషయమున వారు చూడని చూపు. ఇంద్రియలౌల్యమును ప్రకటించు వేమన పేరిపద్యములు కొన్ని అతనివే అని అంగీకరించిన తర్వాత అట్టి శ్రీనాథుని వనబడు పద్యములను గూడ కొన్నైనను అతనివిగానే అంగీకరింపవచ్చును. వీరెవ్వరుగాని "ఆజన్మశుద్ధులు" అని మనము పట్టు పట్టనక్కరలేదు.

రసవాదమును గూర్చియు శ్రీ తమ్మయ్యగారి వివేచన యుక్తిసహముగానున్నది. దానిని గూర్చిన వేమన పదములు వేమనవిగా గ్రహింపరాదని, అతనివే యనుకొన్నను ఎవరో మూర్ఖులైన [illegible]లు ఆ రహస్యములను తెలుపవలెనని తన్ను తొందర పెట్టగా [illegible] కె వేమన

చెప్పినవిగా వాటిని గ్రహింపదగునని శ్రీనార్లవారి మాట [వేమన పు. 54]. ఇట్టి విషయముల తత్వము మనకు తెలియదని యంగీకరించుట యుచితము. ఇవన్నియు పిచ్చి నమ్మకములని, హేతువాదమునకు నిలువవని ఆక్షేపింతురు. కాని యెవరి హేతువాదము? ఏ విషయమందలి సత్యాసత్యములను పరీక్షింతుమో దాని వలయ మందే హేతువాదము నడుపవలయును గాని దానితో ఏజోక్యమును లేని బైటివారి రాగద్వేషముల కందు చోటుండ రాదు. అన్ని విషయములకును సమానముగా అన్వయించు తర్కపద్ధతి, యిప్పటికి ప్రపంచమున పుట్టలేదు. ఇక ముందును పుట్టబోదు. జ్యోస్యము, శకునము, వైద్యము, రసాయనము, యోగము-మొదలైన అన్నిశాస్త్రముల గతిని-మితిని నిర్ణయించువారును ఈ మూలతత్వమును మన్నింపవలసి యున్నారు. ఇక ''జ్ఞానులను దుర్విదగ్ధులు'' లోకవంచన చేసి, ఆత్మవంచన చేసికొనువారు నాడును వుండిరి. నేడును వారికి కొదువలేదు. ప్రామాణికముగా తత్వము నిర్ణయించు కోరికగలవారికి వారడ్డురారు.

గుంటుపల్లి ముత్తమ్మతిమీది పద్యమాధారముగా వేమన్న క్రీస్తు పదునారవశతకము తరువాత నుండిన వాడని యీ గ్రంథకర్తగారి నిర్ణయము-న్యాయమే. ఆ పద్యము ''ప్రక్షిప్తమని నిరాకరింపదగిన కారణములు కానరావు'' అన్నమాట [పు. 71] సర్వజనసమ్మతము కాదగినది. పదునారవ శతకము తరువాత వేమన్న కాలము నికరముగా తెల్పు సాధనములు కానరావు. అన్నియు ఊహాసిద్ధములే. పట్టుకు దొరుకునవి గావు.

తుంగపుల్లారెడ్డి తాను వేమన్న యపరావతారమని చెప్పుకొన్నప్పుడు లేదా యితరు లెవరో ఆమాట చెప్పినప్పుడు సామాన్యజనులు అది సత్యముగా నుండవచ్చునని నమ్మటకు అంతకు మునుపే వేమన యొక్క పేరు ప్రతిష్ఠలు కదిరి సీమలో నెలకొని యుండవలెననియు, దానికి ఆ ప్రదేశములందు వేమన్న తగినంత సంచరించియుండవలెననియు నాయూహ. అందుకు వేమన్న గండికోటను, నందిదుర్గమును పేర్కొనుట ముఖ్యహేతువు. ఆ రెండు పద్యముల పాఠములో అర్థములో ఏమైనను, ఆ రెండు స్థల

ములును నాటికిని నేటికిని ప్రసిద్ధములే. వేమన్న వానిని పేర్కొనుట యీ ప్రదేశముల తోడి ప్రబలపరిచయమును సూచించుననుమాట కాదనలేము. అంతేకాని అతనికి ''దత్తమండలము'' లనబడిన పశ్చిమాంధ్రసీమతో అంత కంటె ఎక్కువస్థిర సంబంధమును స్థాపించు ప్రయత్నము నేను చేయలేదు. అట్టియుద్దేశము నాకెప్పుడును లేదు. పశ్చిమాంధ్రసీమలో ఎక్కువవాడుకలో నున్నవని నేను చూపిన అనేకపదములు గుంటూరు మొదలగు చోట్లను ఉన్నవన్నారు శ్రీ తమ్మయ్యగారు, అట్లైనచో అది నా యజ్ఞానమే. కాని ఇతరాంధ్ర మిత్రులతోడి వ్యవహారమున నా కాపదములు చెవి కందలేదని మాత్రము చెప్పగలను. ఇట్లే ''కదిరి తూర్పునంచు'' అన్న పద్యము తుంగవేమన్నకే అన్వయించుట మేలు, తమ్మయ్యగారు తలచునట్లు. ఈ సందర్భమున ''మూగ చింతపల్లె మొదటియిల్లు'' అను పాదమునకు శ్రీ తమ్మయ్యగారు సూచించిన యర్థము నాకు రుచించలేదు మొదటి యిల్లు అనగా ''మొదలు ఉండిన నివాసస్థలము'' అని వారి యర్థము. "ఆ పల్లె మేము మొదలుండిన యూరు అందురు గాని 'యిల్లు' అని యెవరును వ్యవహరింపరు. ఆ భావమే యైనచో ధారాళముగా, సహజముగా, "మొదటి యూరు'' అనియే వేమన్న చెప్పియుండును.

'వేము' అను చెట్టు పేరనే వేమన్న అనుపేరేర్పడినదను శ్రీ తమ్మయ్యగారి నిర్ణయము సహజమై పరిగ్రాహ్యముగా నున్నది. సంస్కృత 'వేమ' శబ్దము నేతపలకనుండి దానిని సమర్థింపజూచుట వ్యర్థప్రయాసము.

మొత్తముమీద యిప్పుడు లభించిన కలగూరగంప పద్యాలరాశినుండి వేమన్న యనుభవమునందలి క్రమపరిణామమును నిర్దిష్టముగా అతని పరిణత, నీతి-ధర్మ-తత్వముల స్వరూపమును మీది కెత్తి చూపుట చాల బరువైనపని "వేమన్న కవిగానే లోకమున కుపయో....." అన్న శ్రీ తమ్మయ్యగారి తుది నిర్ణయము "బండారు మాట". ప్రకృతమున తెలుగువారి కంతచాలును.

తిరుపతి
4-2-70

రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

సాహిత్యతత్త్వము–శివభారతదర్శనము

సర్దేశాయి తిరుమలరావు

శ్రీ సర్దేశాయి తిరుమలరావుగారి యీ "సాహిత్యతత్త్వము–శివభారత దర్శనము" చదువువారికి ఆస్వాదింపక తప్పని రసము అద్భుతము. ప్రాచ్య పాశ్చాత్య ఖండములలోని ప్రాచీనాధునిక సారస్వతములందలి విశాల విజ్ఞాన విశేషములను, వివిధ కావ్యకళారహస్యములను వీరెంత యోర్పుతో ఉత్సాహముతో శ్రద్ధతో పరిశీలించి, తఱచి మీగడ యెత్తుకొన్నారో, ఆ యనుభవములను ఈ "శివభారత దర్శన"మున ఎంత చక్కగా సమన్వయించినారో—గమనించి ఆశ్చర్యపడుదుము.

శివభారతము పుట్టి యిప్పటి కించుమించు ముప్పదియేండ్లుగా పెరుగుచున్నది. కొన్నివేల ప్రతులు అచ్చుపడి ప్రచారములో నున్నవి, అంతరంగ బహిరంగ రంగాలలో రసికులు దానికవితాపరిమళమును, అందందు అప్పుడప్పుడు మూచూచి యనుభవించుచున్నారు; ఆనందించుచున్నారు. దానిని రచింపగలిగిన అసాధారణ భాగ్యశాలిశ్రీ గడియారం వేంకటశేషశాస్త్రిగారికి గండపెండేర కనకాభిషేకాది సత్కారములు సంభావనలును, రాయలసీమ జాతకులకు తగిన యళతిలో జరిగినవి జరుగుచున్నవి. కాని,

"అంధీభూయ గుణాగుణేషు తరవో వాతావధూతా ఇవ
శ్లాఘంతేయది సాహితీం రసవతీ మజ్ఞాఃతతః కింఫలమ్ ?
జానన్ వ్యంగ్య చమత్కృతీః రసగతిః అర్థాచితీరాదరాత్
అంతశ్చర్మ యదశ్నతే సహృదయః సా జీవనాడీ కవేః"

1971, అక్టోబర్, 10.

అని ఎవరో వచించినట్లు కవి హృదయమును విషయ విజ్ఞానముతో మీది తెత్తి చూపు విమర్శ యిన్నేండ్లకు ఇదొక్కటే వెలువడినది.

శివభారత కవిత విప్లావకము కాదు, ఉద్రేవకముగాదు, సంత వారిని సివమెత్తించు వావదూక పటుహాముగాదు. చాని జీవనాడి ననన్నయ భట్టారకునికి పరాయణమైన "మితహిత సత్యవాక్శి"త, దాని "భావాంబర వీధి" యెంతో పెద్దసత్యము, దానిని ధ్వనింపజేయు అర్థములు హితములు. ఈ కవితాగుణత్రయమందు గౌరవము లేని వారిపాలికి శివభారతము నులివెచ్చ కాఫీరసము వంటిది, వేడిచాలని చప్పిడివస్తువు దాని పరమోద్దేశము; ఫలము, హృదయసంస్కారము; సంఘ సంస్కారముగాదు, రేపటి శ్రేయమే కాని నేటి ప్రేయము గాదు.

శ్రీ తిరుమలరావుగారు ఈ తత్వమును కూలంకషముగా ఆకళించు కొన్నారు. వివిధమై విశాలమైన వీరిజ్ఞాన విజ్ఞానముల మనస్కారము దానికి దోహదము చేసినది. సామాన్యహృదయునికి ఈ సాధన సంపత్తి యింత యుండదు. కనుక ఇంత దీర్ఘదర్శిగా తలస్పర్శిగా విస్తరభయము లేక వీరు శివభారత కవితను దర్శింపగలిగినారు, ప్రదర్శింపగలిగినారు.

"సంఘము, వ్యవస్థ, మతము, జాతి, దేశము, వర్గ సామరస్యము, సమష్టి ప్రయత్నము—వంటి ఇతివృత్తములను నిర్మాణాత్మకముగ, బాధ్యతాయుతముగ, ఉదాత్తముగ చిత్రించిన కావ్యములు ప్రాచీన ఆధునాతన సాహిత్యములందరుదు. ఇరువదవ శతాబ్దములో ఒక నాటకము, ఒకనవల, ఒక కావ్యము మాత్రమే పని చేసినవి. అవి 'కన్యాశుల్కము', 'మాలపల్లి', 'శివభారతము'" (పుట 360)

రావుగారి యీ నిగమనమును ఎవరెట్లు భావించినను, నా చిన్న మట్టుకు నేను కాదనలేదు. కాక, పై మూడు మహారచనలలో ఉదాత్తత అను ధర్మము శివభారతమందెక్కువగా నాకంటికి కానవచ్చుచున్నదనియు చెప్పగలను.

ఈ "దర్శన"మున సాహిత్య తత్వమును సర్వాంకషముగా సందేహ భయములు లేక వివరించి, కావ్యరసికుల కెంతో హృదయ సంస్కారమును గలిగించినారు శ్రీ రావు. శివభారతము దానికి వ్యాజ మైనది. మరి అంత గొప్ప వ్యాజము లభించుటగూడ అసాధారణమే. ఇప్పటికి తెలుగు సాహిత్యములో దానికదే, దీనికదే సాటి. ఒకటిరెండు చోట్ల ఇందలి యభిప్రాయముల శ్రుతి కొంత తగ్గింపవలసినట్లు తోప వచ్చును. కాని ఉదాత్తతలో మొదటినుండి తుదిదాక దానికిది యెందును తీసిపోదు. ఈపల శివభారత కర్తృత్వవిషయమున రేగిన దుమ్ము గంధము గూడ ఈ వివులవిమర్శలో చొరనీయక నిర్వహించుట గూడ, రావుగారి ఉదాత్తతనే చాటుచున్నది.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

జానపద కళాసంపద

తూమాటి దొణప్ప

నాగరకుల సూత్రబద్ధమైన వాఙ్మయ మందెంతో అంతే శ్రద్ధా వ్యాసంగాలు జానపదుల స్వచ్ఛంద వాఙ్మయమునందును చూపి చేసిపెట్టిగల మనీషులు చాలామంది దొరకరు. అట్టివారిలో అగ్రగణ్యులు నాయెరుకలో శ్రీ తూమాటి దొణప్పగారు. ఆయన సమకూర్చిన యీ 'జానపద కళా సంపద' తెలుగువారంతా రెండు చేతులా స్వాగతింపవలసిన మన అపభ్రంశ కళా సంహిత.

గ్రామ్యము అపభ్రంశము అను మాటలు ఈనాడు మనకు అసహ్యమైన మైల పలుకులు. కనుక గ్రామ్యము అనుటకు బదులుగా 'వ్యావహారికం' అను పదము వాడుచున్నాము గంభీరంగా. అపభ్రంశము అపశబ్దము రెండూ ఒకటే అని అమరసింహుడు అనుశాసించినా, ప్రాతకాలపు వివేకి రసికులు ఆ కావ్యసంహతిని గావించి వీర్చి కూర్చి దానికి వ్యాకరణమును రచించి అపభ్రంశమనే మాటకే మర్యాద గలిగించి మీదికెత్తినారు. ప్రాకృత భాషాభేదాలలో అపభ్రంశమొక ముఖ్యభాగమైంది. దాని ఫలంగా అపభ్రంశ భాషలో ఎన్నో రచనలు-అన్ని అంతస్తులవీ-బయలుదేరినవి. ఆ సారస్వతం ముక్కాలుమ్మువ్వీసం మన చేతికి దొరకుండా నశించిపోయిందనే దానికి భారతీయులు కాని మతాంతరస్థులు, మనలోనే వేరు వేరు మతాలవారు, వీరికి తోడుపోయిన పురుగులూ భాగస్వాములు. విజ్ఞాన సారస్వతమందు అతిశ్రద్ధతోలాక్షణిక భక్తితో సరస వాఙ్మయాన్ని

తొలిపలుకు, 1973, ఆగస్ట్, 20

నిర్మలా పబ్లికేషన్, విశాఖ-3.

అరగంటితో చూచి పోనిచ్చే మన దోషజ్ఞుల దృష్టికి అందులో పొలున్నది. నిత్యాపభ్రంశనంతో నిలుకడలేక సాగేది భాషా సామాన్య స్వరూపం. దేవతలు దిగివచ్చినా దానిని మార్చలేరు. కనుకనే వాండ్ల భాష అయిన సంస్కృతంలో వేదకాలం నుంచీ ఇప్పటిదాకా ఎన్నో అపభ్రంశ సోపానాలేర్పడినవి. మరి ఒక్కొక్క మెట్టికలోనూ నలుదిక్కులా ఎన్నో బుగ్గలు జెలలు చెలమలు చీలికలూ వీర్పడి అవిటిలోని నీళ్ళు మలిచి మురిగి యెండిపోవును. లేకపోతే వానకాలపు జల్లుతో కలిసి ఏ వంకకో వాగుకో సాగి పెద్ద నీటిలో గలిసిపోవును. కనుక అన్ని భాషలూ అపభ్రంశాలే. సంస్కృతం ప్రాకృతం అపభ్రంశం అనే వేర్పాట్లు తాత్కాలికంగా అనుకూలంకోసం సంకేతించుకున్నవి. అవి సత్యమూ కావు. శాశ్వతమూ కావు.

నేటి రాయలసీమ తెలుగు అట్లాంటి అపభ్రంశాల్లో ఒక స్థూల రూపం తెలంగాణాది ఇంకొకటి. కృష్ణా గోదావరి సీమది మూడవది. ఆంధ్రదేశం రాజుల-మంత్రుల యాజమాన్యంలో ఈ మూడు వప్పాలుగా నిలబడినందు కంటే ముందే యెంతో అనాదిగా ఈ అపభ్రంశాలు పుట్టి పెరుగుతానేవున్నవి. వాటిలో మూడవది మాత్రం వ్యావహారిక మనే నామకరణ సంస్కారం పొంది, ఇంతా 'శిష్ట వ్యావహారిక' మనే మడిగట్టుకొని, రాష్ట్రం మూడు మూలలకూ పాకి అల్లుకొంటూ అధికారం చెలాయిస్తావుంది. తెగువకూ చొరవకూ పేరుపొందిన తూర్పువారి అపభ్రంశం పక్కలో మలకసీమ భాష గూడా అక్కడక్కడ కొంత తల యెత్తుకుని తిరిగి ప్రయత్నం చేస్తావుండేది గమనించవచ్చును. దాని బలం రాష్ట్ర కేంద్ర పదవి. ఈ రెండు బలాలూ లేక రాయలసీమ భాస వట్టివాతలు పెట్టుకుంటూ నిసర్గమైన నింపు సొంపులను దారబోసుకుంటూవుంది. ఇక్కడ పుట్టి పెరిగిన చదువరులే తమ రాతకోతల్లో ఆ యాసే ఆ వేసమే పూసుకుని గడ్డకెక్కుతున్నారెందరో. వాండ్లలో కొందరికైనా ఇప్పుడిప్పుడు అక్కడక్కడ స్వ-స్వీయాభిమానాలు తలచూపుతున్నందుకు మెచ్చుకోవలసివున్నది. శ్రీ దొణప్పగారి ఈ 'జానపద కళా సంపద' అందుకు ప్రశస్తమై ప్రామాణికమైన ఉదాహరణ. నాకు తెలిసినంతలో ప్రథమోదాహరణము.

కూడా. ఈ కూర్పులో విషయ వివృతిలో ఆయన చూపిన అభిమానమూ అనుకంపా ఎంతో కమనీయమైనది.

రాయలసీమలో పుట్టిన ఈ స్వచ్ఛంద సాహిత్యం ఎప్పుడు మొదలైందో, ఎంత విస్తరమయిందో ఇప్పుడెవరూ చెప్పలేరు. నిజ- పర నిరాదరణ వల్ల గాలికి కొట్టుకొనిపోయిన భాగం ఇప్పుడు దొరికేంత కంట్టే యెన్నింతలో పెద్దదని మాత్రమూహింపవచ్చు. దొరికిన యీ 'సంపద'లో ఆ జానపదుల చిత్తవిలాసాలు, చేసిన చరిత్రలు పురాణాలకు వేసిన వన్నెలు భాపించిన భావనలూ, అల్లిన కథలూ, అనర్గళమైన ఆశాపాశాలూ, గ్రహించిన ధర్మనీతి తత్వాలూ ఎంత స్పష్టంగా హృదయంగమంగా అచ్చుపడినవో నెమ్మదిగా చదువుకొన్న వారు, రసికులు గ్రహింపగలరు. ఇంకా యెంతో పెద్దకుప్ప నురిపిన రాశి తనవద్ద వుందని సంగ్రహీత సూచించినారు. దాన్ని బండ్లకెత్తి యిండ్లు చేర్చే పుణ్యమెవరిదో!

సందుగొందులు దూరి ఈ సారస్వతాన్ని సంపాదించేది ఒక యెత్తు. దాన్ని చెరిగి జల్లెడ బట్టి అలిగండ్లూ మలిగండ్లూ ఏరి చదను చేయడమంటే కంటే పెద్దయెత్తు. ఈ పంకజాలకు ఎంతో చెత్తా తిప్ప సరకూ బురదా అంటుకొని వుండేది సహజం. చరిత్ర చూపుకు అంతా ఒకటే. కాని సాహిత్య సౌమనస్యాన్ని అందులో కొంతమట్టుకే ఆకర్షిస్తుంది. సంగ్రహీత సంస్కారమూ లోకకళ్యాణ కాంక్షా ఆ పనిలో ప్రతిఫలిస్తుంది. కోటి ప్రాకృత గాథలలో ఏడు నూర్లు మాత్రమేరి పెట్టి ప్రచారానికి తెచ్చిన ప్రాచీనాంధ్ర చక్రవర్తి హాలుడు ఇటువంటి పనివారికి ప్రోపచూపినవాడు. ఆ గాథా ప్రపంచంలో వుండిన బిత్తలి చెత్తను తరువాతి జయవల్లభుడు "వజ్జాలగ్గ"లో కొంత చేర్చి చొరవ చూపినాడు. కాని సప్తశతికి వచ్చిన ప్రచారమూ విలువా దానికి రాలేదు; రాదు; రాగూడదు. అసభ్యం అసహ్యం అనే భావం మనుష్యుడే సంసార మార్గంలో తన యోగక్షేమాలకై కల్పించుకొన్నది. కాయ వాఙ్మనసాలలో ఉత్తరోత్తరంగా ప్రబలమై వ్యాపించేదది. గనుక స్వచ్ఛంద రచనలలో స్వచ్ఛతను కొంతైనా గమనించవలసి వుంటోంది సంగ్రాహకులు. ఇది మడిగట్టుకొన్న మనోధర్మమని కొందరు నవ్వవచ్చును. నవ్వితే నవ్వరి. నోరున్న వారంతా నవ్వగలరు. వారిని

చూచి మనమూ నవ్వితే సరి. ఆ విషయంలో [illegible] తీసుకున్న శ్రద్ధ అభినందనీయం.

వీరి చేతిలో ఈ పని ఇంకా సార్వభౌమంగా సాగవలెనని నా యాశంస; నా మంగళాశంస.

తెలుగుపూరు
20-8-73

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

క్షేత్రయ్య పదసాహిత్యం

ఎన్. గంగప్ప

క్షేత్రయ్య పదములను గూర్చిన డా. గంగప్పగారి యీ సిద్ధాంత గ్రంథము తెలుగు సాహిత్య రసికుల స్వాగతమునకు తగినది. ఇంతకు ముందు ఎందరో యీ విషయమును చెదరు మదరుగా చర్చించినారు. వారిలో కి. శే. విస్సా అప్పారావుగారి పరిశోధన గణనీయమైనది. ఆయా విమర్శలను అభిప్రాయాలను అన్నింటినీ సంగ్రహించి తమ యభిప్రాయాలను మోమోటములేక సవినయముగా వివరించింది గంగప్పగారి యీ రచన. ఇందులో నా యభిప్రాయాలను ఎక్కువగా గమనించి ప్రాయికంగా అంగీకరించినారు రచయిత. ఆ పక్షపాతము కొంత మితిని మీరిందనుకొన్నా తగును. ఈ విశ్వాసమునకు ప్రతీకారమే నా యీ పఠవేశిక. అదీ వారి సంబంధవిశ్వాసమును కాదనలేక వ్రాసినదే.

క్షేత్రయ్య పదాల పరిశీలన యిప్పటికెంతో జరిగిందిగాని యింకా జరగవలసింది ఎంతో నిలబడింది. అతని రచనలోని సారమంతా శృంగారమే. మధురభక్తి యని సగౌరవంగా మనం పేర్కొన్నా, అంతరార్థాలు పైకి తీసిచూపినా, దానిరూపరేఖలలా సారభమూ శృంగారందే. మరి నేటి పరిశీలకులు ఆ పరిధిని దాటి ఇతర విషయాలను ఎక్కువగా పరామర్శించ లేదంటే అది చింతనీయమైనా సహజమే. శ్రీ గంగప్పగారు ఇందు ఆధోరణిని కొంత మార్చుకొన్నారని సంతోషిస్తాను.

అసలు పదాల సంగ్రహణమూ, విశేషమూ పూర్తిగా, తృప్తికరంగా

పఠవేశిక, 1974, సెప్టంబర్, 30

సాగలేదనిపిస్తుంది. పిఠాపురం వారి ప్రచురణలో ఎక్కువ లెక్కగల పదాలున్నవట. నేను దానిని చూడలేదు. కాని "బొట్టుకట్టిన వాని యింటికి పోయివచ్చెద" అనే పదం ఆ సంగ్రహంలో ఉన్నదట [క్షే. ప. సా. పు. 75]. అది 'వేణుగోపాల' ముద్రగలది. ఆ ముద్ర సారంగపాణిది. దాని అర్థభావాలూ, భాష క్షేత్రయ్య తలకు కట్టదగినవికావు. ఇది సహృదయవేద్యం. ఇట్లే పిఠాపుర సంకలనంలో ఉన్నవని గంగప్పగారు దాహరించిన [పు 150, 173] "ఇద్దరి హృదయము లేకహృదయములైతే", "ఇంత విరహము -పలుక వెరపగు" అనే రెండు పదములూ క్షేత్రయ్య పని భావించడం కష్టం. మొదటిదానిలో కంచిపరచుడున్నాడు గాని మువ్వ గోపాలునికి చోటులేకపోయింది. రెండవ పదంలో స్పష్టమై తోచే మిశ్రజాతి-వీడు మాతల నడకలో-శ్రీ వీరరాఘవుడూ, శ్రీ మువ్వ గోపాలుడూ బలవంతాన ఒత్తుకొని దూరి నిలచినారు! రెండు పదాల శైలీ, అర్థాన్వయాల సామరస్యం చాలనిదని పైమాపుకే తెలుస్తుంది. విస్సావారి కూర్పులోనున్న 'ఎవతెతాళునమ్మా' అనే అతాణారాగ పదంలో అనుపల్లవిలో "సవతి మువ్వగోపాలు కెక్కువేమో" అని యతిలేని పాఠమూ గ్రాంథికంగానూ, గ్రామ్యంగానూ గతిలేని 'గోపాలుకు' అనే ప్రయోగమూ క్షేత్రయ్య రుచిమరగిన చెవికి కంటగింపులు. "సవతి గోపాలసామికెక్కువేమో" అని నా పరిచితపాఠము. ఈ పదం కడపటి చరణంలోనూ 'మువ్వ' లేని గోపాలుడే కానవస్తాడు. గనుక ఇది క్షేత్రయ్యదే అనగలమా? అర్థభావభాషలేమో అతనికైవాడమే అనదగినంత సరసముగా నున్నవి. కాని 'వరదగోపాల' ముద్రలు గల పదాలు కొన్ని క్షేత్రయ్యను చక్కగా అనుకరించినవి వ్యాప్తిలోనున్నవి, "ఏలనే అలవాని చెలిమి", 'ఏమాటలాడిన నీ మాటలేకాని', 'దారిజూచుచున్నది నీదుప్రియ' మొదలైనవాటిని గమనించవచ్చును. పై అతాణా పదం గూడా అట్టిదే కావచ్చునేమో! పైగా నావద్ది 1878-1879 ప్రాత కూర్పులలో ఈ పదం చేరలేదు.

చాలా యేండ్లక్రిందనే నేను మధురకుపోయి అక్కడి సౌరాష్ట్ర సభవారి గ్రంథాలయములోని వ్రాతప్రతినుండి [B-46] అప్పటికి వ్యాప్తిలో లేని క్షేత్రయ్య పదాలు వీడింటిని వ్రాసుకొని వచ్చినాను.

ఈ పల్లవిలో వుండినవి 236 పదాలని నేను వేసుకొన్న గుర్తు. అన్నీ క్షేత్ర య్యవే అవునోకాదో ఇప్పుడు చెప్పలేను. ఆ యేడు పదాలలో నాలుగు పదాలు- 'మనపేసేయనేలే మగువా' [శంకరాభరణం-త్రిపుట], 'రాయబార మంపినాడేమో రాను నేను రానుపొమ్మనవే' [శంకరాభరణం-చాపు], 'చాలుచాలు యీ చిన్నెలతో నా సరస జేరకురా' [ముఖారి-ఆది], 'ఎవ్వరి నన బనియేమున్నదమ్మలార' [ముఖారి-త్రిపుట] అనేవి విస్సావారి సంకలనంలోవున్నవి. కాని చిన్నపన్న పాఠాంతరాలు గలవు. కొన్ని అసమంజసపాఠాలూ వున్నవి. ముఖ్యమైనవి ఒకటిరెండుదాహరిస్తాను.

'ఎవ్వరి ననబనియేమున్నది' అనేపఠం రుంపతాళమని విస్సావారి ప్రతిలో. కాని 'యేమున్నదమ్మలార' మొదలైన ఖండాలను పదిమాత్రల రుంప కాళంలో తుడికేవి సాధ్యమైనా అసహ్యంగా వినిపిస్తుంది. మధుర ప్రాతప్రతిలో దీనివి త్రిష్టతాళం. అదే సరియైనదని పాడేవారు గమనింప గలరు. ఈ పదంలోనే మొదటి చరణంలో 'మగువలందరు వాని చేలాంచల మునకాసించి' అని యున్నది. ఇక్కడ 'మగుపలు' నాయికకు మిత్రద్రోహం చేసి నాయకుని వెలికి తీసినారు. వారికి నాయకుని 'చేలాంచలము' పై ఆశ ఆర్థంలేనిది. మధుర ప్రతి 'వానిచే లంచమున కాసించి' అని సరస పాఠమిచ్చింది.

దీనివల్ల విస్సావారు మధుర పఠాని చూడలేదని తేలుతుంది. మరి పిఠాపురం కూర్పులో ఈ పదాలు చేరింటే అదలి పరిశోధన యింతకంటే మేలైయుండుందని ఊహించేది కష్టం.

మధుర పఠానుండి నేను వ్రాసుకొన్న మరి మూడు పదాలను ఇక్కడ పూర్తిగా ఉల్లేఖిస్తాను. ఇతర సంగ్రహణాలలో ఇవి చేరినవేమో, పాఠాంతరాలున్నవేమో, పరిశీలి చవచ్చును

(1) సావేరి రాగం-త్రి తాళం.

ప. మగువ ఊరు దూరమైతే-మనసు దూరం-,

అ. తగవు మాటలైపయి-పగనాడించితే నేరాయ॥

చ. (i) కూడియాడి యుండలేదా-కోరిక లీడేర్చలేదా,
జోడుగూడి కొన్నాళ్లైనా-సొగసు మీరినదే చాలు

(ii) సొక్కిసోలి యుండలేదా-సుదతి పనులీడేర్చలేదా
మక్కువ కొన్నాళ్లేనా-మనసుగూడినదే చాలు॥

(iii) కలసిమెలసి యుండలేదా-కౌగిట జేర్చుకోలేదా
చెలియ మువ్వగోపాలుడు-చేరికూడినదే చాలు॥

(2) వలహరి-, తిష్టట.

ప. పొయ్యేనంటాడా నాసామి పోపొమ్మనవే

అ. అయ్యయ్యో యెవరు వద్దన్నారో అవురా తనవుద్ధరింపు॥

చ. (i) వెరచేనంటాని మెల్లని వింతలు సేయ వచ్చినాడా,
తరుణీ తా తనకంటే కోపవారులే యివతలివారు॥

(ii) ఇంత పైపై యున్నవాడు ఇంటికి మునుపు రాన్యాశే
ఇంత తానుండేనన్నాగాని ఇక నాకు సైసదుపోవే॥

(iii) నేడు దెలిసె మువ్వ గోపాలు రీతిగాదుర ననెపుడు
కూడితే నీతో కూడేనని ఆడే మాటలింతగాదు॥

(3) మోహన-[తాళం వ్రాయలేదు].

ప. ముద్దు-కులుకుచు నడిచే చిలుకల కొలకి పలుకవె నాతోను

అ. నిలిచి నిలిచి తలవూచుచు మెల్లన అలివేణి మదహత్తివలెనే॥

చ. (i) కామలు గుంపులు గుంపులు గూడుక భ్రమసి చూడను ఓ
కోమలిరో నీ సొగసు పయ్యెద కొంగు విసరగను,
కామని బాణమువోలు నీ కడగంట చూచుచును
రామ పున్నమ చంద్రుని వలె యీ రాతిరివేళను॥

(ii) కాళ్లనందెలు గజ్జెలు గొలుసులు - ఘల్లుఘల్లు మనగా, పడి
వేళ్ల కెంపుటుంగరములు వెలుగగ మెరుగడల, వెయి
మాట్లు నీ కిచ్చేనని విటులు వెంబడి తిరుగగను॥

(iii) శంకరాభరణ రాగమున సంచున బాడుకొని
శంకలేక నడివీధిలో చిటికలు జడియక వేయగను,
ఇంతకు మువ్వగోపాలుని గుణములు ఎంచదగనో॥"

ఈ మూడు పదాలూ సంస్కారసాపేక్షములు. ముఖ్యముగా 3వ పదం. దాని 2-3 చరణాలలో ఒక్కొక్క పంక్తే లోపించిందని తోస్తుంది. ఇవి కన్నడికన్నట్లు వ్రాసుకొన్నని. 3 వ దాని 3 వ పంక్తియంతూ ఏమీ అతుకదు. వ్రాతప్రతులు నమ్మి దొరకినట్లు అచ్చువేయుట సంపాదకుని పనిగాదు, నకలు వ్రాయువానిదది. మూలమును కవి, భాష. సంకేత, సంప్రదాయం మొదలైనవాటిని గమనించి అవిరుద్ధముగా సంస్కరించేది సంపాదకుని ధర్మం, కర్మం. ఇంతపరకూ వెలువడిన పదాల కూర్పులలో ఆ విధమైన సంపాదింపు కావలసినంత చాలపనిపిస్తూందనక తప్పదు.

ఈ సందర్భం పురస్కరించుకొని చాల కాలంక్రింద నేను మైసూరులోని ఒక సంగీతవిదునిచే విని గుర్తు చేసుకొన్నది, ఇందాక అచ్చులో నాకంటపడనిదీ అయిన యీ క్రింది పదమును ఇక్కడ వ్రాసి పెట్టుతాను. లభించినది పల్లవి, అనుపల్లవి ఒక చరణం మాత్రమే. తక్కిన చరణాలను రసికపరిశోధకులు సంపాదించే ప్రయత్నం చేయుదురుగాక. ఇది మేలుకోటి చెలువరాయస్వామి మీదిది.

నీలాంబరి–త్రిపుట తాళం.

ప. జలజనేత్రి విరహ వేదన, పలుకనోరాడదురా,

చ. చెలులు కనుగొని మూర్ఛపోయిరి, చెలువరాయుడ
మువ్వగోపాల।

చ. నిలదు జీవము మారుబారికి, మునుడ నీకిది మేరగాదుర,
అలదాని వార్తలిపుగో, అవల నీదయ దాసి భాగ్యము; అది యోగ్యము
॥జల॥†

---

† దీని ధాతువు నాకిచ్చినది ఇట్లున్నది–

ప॥ ,,, సపని। సమగరిగా మా॥ గమపా మా। గమగరిపమా॥

యేర్పాట్లు, కాళాలకు వాటితోడి పొందికలు, బహుప్రియావ్రతం గల ● కాలపు శృంగారోపాసకుల సహవాసంలో స్త్రీల సుఖదుఃఖాలు అపసోపాలు, విప్రలంభ-ప్రలంభాల విషయంగా-కవుల ఉపకారం కొరకు-ప్రాచీన లాక్షణికులు చేసిపెట్టిన సాంకేతిక సమయాలు ఈ అన్నిటా క్షేత్రయ్య చూపిన ప్రతిభను, చేసిన మార్పులనూ గమనింపగలిగిన లక్ష్య వ్యుత్పత్తి ఆ పని కావశ్యకం. వట్టి రక్తిగాని, భక్తిగాని చాలదు.

శ్రీ గంగప్పగారు పై విషయాలన్నిటా ఎంతో విరివిగా పరిశ్రమ చేసినారనుట పునరుక్తి. ఇంతటితో చాలుచేసుకోక ఇంకా విపులంగా లోతుగా

జిలజినే ప్రతి విరహ చే దన

॥ (((మగమ। పా(((పామగ॥ రిగరిసమగ। రిపమగరిగాస ॥

పలుకనో రా డ దు రా

ఆ॥ (((స స స। సా సా సా సా ॥ సా(((సని। ధ ని స ని ప ద మా

చెలులు కనుకొని మూర్ఛ పో యిరి

॥ (((మ గ మ । పానిధధపమా ॥ మాగపమ। మగరిపమరగశ ॥

(((జిలజి)

చెలువరా యడ మువ్వ గోపా ల

చ॥ (((సనిరి(సా ((సనినీ ॥ సామగమా । మగ మ రి రి ప మా॥

నిలదు జీ వ ము మా రు బా రి కి

॥ (((మ గ మ । పా(((స మ గా॥ రి గ రి ప మగ। రిపమగరిగసా॥

ఘ ను డ నీ కిది మేక గా దు ర

॥ (((స సా । సా((((సని । ధ ని స ని ని పపా॥ (((

మగమ। పానిధ ధధపమా॥

అల చా ని వార్త లివిగో అవలనీదయ

।మ గ మ ద ప మ।మ గ మ గ గ రి ప మ॥ (((((। మ గ గా(గ మా॥

దా ని ఖా గ్య ము అది

॥ పా సి ప మ గ। రి ప మ గ గా (స॥ (((జిలజి)

యో గ్య ము

క్షేత్రయ్య సూక్తులను అప్పటి-తరువాతి పద సాహిత్యంలో కలిగిన పెంపు వంపులను పరిశోధించి చూపగలరని నాయాశ, నాయాశంస.

శ్రీ గంగప్పగారి ఈ గ్రంథాన్ని ఉత్తమమైనదిగా ఎన్నిక చేసి బహుమతినిచ్చి, ముద్రణమునకై చాలా సహాయపడిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు గుణపక్షపాతమునకై ఔదార్యమునకై అభినందనార్హులు.

బెంగుళూరు
30-9-1974

(సం) రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

తాళ్ళపాక కవుల పదకవితలు

భాషా ప్రయోగ విశేషాలు (భాగము 2)

పేటూరి ఆనందమూర్తి

చిరాయుశ్రీ పేటూరి ఆనందమూర్తిగారు తమ పితృపాదులు ఖండవల్లి యశోమూర్తులైన ప్రభాకరులు నాంది పాడిన తాళ్ళపాక వాగ్గేయకార రచనా పరిశీలన తలపొలము దాకించి ధన్యత గడించుకొన్నారు. అందులో కొంతభాగమును "తాళ్ళపాక కవులకృతులు వివిధ సాహితీ ప్రక్రియలు" అనుపేర ఇంతకుముందు ప్రకటించినారు. ఇప్పుడు చాని తరువాతి భాగముగా "తాళ్ళపాక కవుల పదకవితలు భాషాప్రయోగ విశేషాలు" అని పేర్కొని ఈ పుస్తకము వెలువరచుచున్నారు. ఈ రెండును గలిసి వేయిపుటలు కాగా దాటిన ఈ గ్రంథాలు రెంటినీ పరిశీలింపగా మూడవ భాగముగా ప్రకటింపవలసిన సరకుగూడ ఇంకా మిగిలించుకొన్నారేమో అనిపించును. ఈ రెండవ భాగమందును తాళ్ళపాకవారిరచనలే సర్వాంకష ప్రమేయముగా వెలసినవి.

మొదటి భాగమునకు నా ఆశీరూపముగా సంతోషమును తెలుపుకొని యున్నాను. దీనికంత చాలక ఆశీస్సులతో గూడిన ముస్నుడి కోరినారు. శ్రీ ఆనందమూర్తి. ఆది నా యందాయనకు గల ప్రేమ విశ్వాసములకు గుర్తు. ఎంత వ్రాసినా చాలదనిపించే యీ రచనకు ఉపోద్ఘాతంగా ఎంత కొంచెం వ్రాస్తే అంత మంచిదనిపించును. ప్రకృతమంతే నేను చేయగలిగినది.

తమ్మునివలెనన్ను ప్రేమతో మన్నించిన శ్రీ ప్రభాకరశాస్త్రిగారు అచింతితముగా అకాల సిద్ధినందుట, ఆ చోటికి ఎంతో దూరమందున్న

నన్నిడ్చి తెచ్చివారి కార్యభారము నా నెత్తిన వేసి కొంతకాలము సాగించుట రెండూ శ్రీ శ్రీనివాసుల అనిర్వాచ్య సంకల్పాలు-పరిణతస్థిత ప్రజ్ఞామయులు శాస్త్రిగారే 'పదేండ్లు విసుగు విరామాలు లేక పనిచేసినా ఈ వాఙ్మయ రాశిని పూర్తిగా పైకెత్తగలనా? అని సందేహపడుచుండినవారు. వాఙ్మయ మును అనేక దృక్కోణములతో చూచి చూపగల శక్త్యుత్సాహాలు వారివి. మితంపచములైనవి నా జ్ఞానానుభవాలు. వారు స్వతంత్రముగా పరిశీలించి శాళ్వపాకవారి గేయరచనములు ప్రకటించిన సంపుటమునందలి తీరు ఆదర్శముగా గొని కొనేండ్లు నాచేతి పరిశోధన సాగింది. ఆ పని నేనుద్యోగము మానుకొన్న తర్వాతనైనా అనుక్రమంగా సాగింటే ఇప్పటికి సంకీర్తనల మూలమైనా పూర్తియై వెలుగు చూచియుండేది. దాని ఇంకా సగాని కించుమించుగా వెలికి రాలేక అది రేకులలోనేవాగి యున్నది. అశ్రద్ధ, అశ, అసూయ, అసహకారము-మొదలైన వెన్నో ఈ స్థితికి కారణాలు. వాటిజోలి పనికేదు.

ఈ కైంకర్యమునకు నేను దిగి చూచినపుడు మొట్టమొదలునన్ను ప్రేరేచిన నిర్ణయమొకటే. రేకులలోని మూలమును చదువుకొనుట కనుకూలముగా ప్రాత పింతలను సవరించి ప్రకటించుట. ఆ సంకీర్తనల సాహిత్యమున ప్రతిఫలించిన పురాణము. వేదాంతము. సంప్రదాయము, చరిత్ర, భాష వ్యాకరణము, నుడికారము, ఛందస్సు గేయలక్షణాలు, కావ్యకళ మొదలైన వొక్కొక్కటి ఒక్కొక్క సముద్రము వంటి విశేషాలు. వాటి గొడవ ఒకవ్యక్తి శక్తికి మించినబరువు, అనందమూర్తిగారి యీ మహాపరిశీలన సమీక్షించువారికి అది కొంతైనా విశదమగును. ఈ నేర్పు, ఓర్పు, పరిశ్రమ, పూర్వగ్రహ పక్షపాతములసోకు లేని విషయ విమర్శ-అన్నీ వారి పితృపాదుల మంగళాశాసన శిక్ష పండిన పంటలు.

అనేక విషయాలను సవిస్తరముగా విమర్శించి వివరించిన యిటు వంటి గ్రంథమును చదువు కొనేటప్పుడు అందందుకొన్ని భిన్నాభిప్రాయాలు తోచేది సహజం. నాకు స్ఫురించిన అట్టివి అనుక్రమంగా ఇక్కడ కొన్ని సూచిస్తాను. అది కావి విమర్శకులకు ఏమైనా ఉపకరింపగలిగితే తృప్తి పడగలను.

(అ) పుట 35. కృష్ణమాచార్యుని దశరథాత్మజరామారామా అనే నామ భజన సంకీర్తన నడక 'తకధిమితక', 'తకధిమితకధిమి' అని జతి పలుకులతో సూచింపబడినది. అప్పుడది 14 అక్షరాల 'మిశ్ర' గతియగును. జతి పలుకులు మొదటి భాగంకూడా 'తకధిమితకధిమి' అనియుండదగును. శ్రీకుంటే చతురస్రజాతి సిద్ధింపను. ఒక ధిమి లోపించుట అచ్చుకూర్పులోని దారుకాదగును. మరి యీ పాట ఏక తాళమున కంటే ఆదితాళము నకే ఎక్కువ రుచికరముగా ఒదుగును. ఏకతాళము అంగముగా ఆదితాళము అంగిగా నడపుటయే సాంప్రదాయికరుచి.

(ఆ) పుట 40. 'తివడ-పల్లవి అనునవి' ప్రాచీన కాలమందే ప్రయోగమున నుండినట్లుతోచును. నేడివి ప్రచారమున లేవు- 'తినడ' ప్రతిపట శబ్దభవము. ప్రతిపుట తాళమునేడూ రసిక ప్రియమై ఎక్కువ ప్రచారమందున్నది. తివడ వేరే తాళమనుకో బనిలేదు. ఇక 'పల్లవి' తాళ విశేషముగా నాడుగాని నేడుగాని కనబడదు. రేకులో నుండెనేని అది చెక్కడపు పొరబాటె అనుకోవగును.

(ఇ) పుట 71. చిన్నన్నను గూర్చి సుబ్బరామ దీక్షితులు వ్రాసిన మాటలలో అతడు 'పదకర్త' అని స్పష్టముగా తెలుపలేదు. కాని చిన్నయ్య రచనలని రెండు కీర్తనలను సాంప్రదాయిక స్వర తాళములలో ఆయన మన కందిచ్చినాడు. ప్రభాకరశాస్త్రిగారి దృష్టికీ విషయము వచ్చినట్లు లేదు. దీక్షితులు 'అట్లు పేరొక్కనుట ప్రమాదఫలితమే అనుకొందును' అంటారు ఆనందమూర్తి. దీక్షితుల మాట నమ్మిననేను, శ్రీ సాంబమూర్తి మొదలైన కొందరి పేరోక్కలు "స్థూల" మని వారి భావన. నేనింకా అట్లు భావింపలేను.

(ఈ) పుట 193. "చూడు డిందరికి సులభుడు" అనే అన్నమాచార్యుని సంకీర్తన తన వైష్ణవ దీక్షాచార్యుడై మహోబలమఠ ప్రతిష్ఠాపకుడైన ఆదివణ్ శఠకోప యతీంద్రుని స్తుతియని భావించి, భైరవి, ఆదితాళములలో దానికి నేను వర్ణమెట్టు కుదిర్చి కొంత ప్రచారమునకు తెచ్చితిని. అది అళ్వార్లలో అగ్రగణ్యులగు నమ్మాళ్వార్లను గూర్చినదిగా ఈ గ్రంథకర్త భావించినారు.

ఉండవచ్చును. కాని నమ్మాళ్వార్లను విశిష్టముగా సూచించుమాట యేదీ ఆ కీర్తనలో కానరాదు.

(ఘ) పుట 213. "పల్లాండు" పదానికి తమిళులో బహుసంవత్సరములు (పల-ఆండు) అని అర్థము. దీర్ఘాయుస్సని తాత్పర్యము. "కలుగునుగాక" అని ధ్వని. సాక్షాత్కరించిన శ్రీమన్నారాయణమూర్తిని గూర్చి ఆనంద పారవశ్యముతో అతని పాదాలకు, అపినాభూతులైన భక్తులకు హృదయమంచలి శ్రీదేవికి చేతులందున్న శంఖచక్రములకు శాశ్వతమైన రక్ష (తిరుక్కాప్పు) కోరి పెరియాళ్వారు చేసిన ప్రార్థనా గీతమున ఈ పదము పలుమారుపచ్చును. శ్రీ వైష్ణవుల నిత్య భగవదారాధనలో కడపట ప్రార్థన గీతమై యిది వ్యాప్తికి వచ్చినది. పదార్థము తెలియనక్కరలేని దీని భావము "మంగళము".

(ఙ) పుట 276. "పునగుకాపు" లోని "కాపు" అనుపదమునకును మీఁ "తిరుక్కాపు" వలె తమిళులో "రక్ష" అనుసదే అర్థము. కాచిపూయుట చేత వచ్చినది కాపు. ఎణ్ణె కాపు, మంజల్ కాపు, శందనకాపు మొదలైన సాంప్రదాయిక పదములలో దీనిని గమనింపవచ్చును. భగవద్విగ్రహమునకు రక్షను కోరియే ఈ పూతలు సమర్పించుట తెలుగులో ఇది "కాపు వలగా" పెరిగినది.

(ఙు) పుట 281. శ్రీవైష్ణవ సంప్రదాయములో తిరుపతియంతే ముఖ్యమైనది అహోబల క్షేత్రము. ఆ కొండమీది పెద్ద గహనమందే అక్కడక్కడ నవ నారసింహుల మూర్తులుగలవు. ఆ కొండకును వేదాద్రి గరుడాద్రి మున్నగు పేర్లున్నవి. దశావతారములలో నృసింహరూపము తీవ్రమై భయంకరమైన భావన గలది. ఐన అసలు స్వరూపం దయామయమైనది. ప్రహ్లాదుని మీది వాత్సల్యము శ్రీదేవి యందలి ప్రేమా ఆ దయను పోషించి చూపగలవి. వేదాంత దేశికుల భావన యిట్లున్నది:—

"సటాపటల భీషణే సరభ సాట్టహాసోద్భటే-స్ఫురత్ప్రభ పరిస్ఫుట
భ్రుకుటకేపి వక్త్రేక్షతే

కప్పాకపట కేసరిన్ దనుజడింభదత్తస్తనా-సరోజ సదృశా దృశా
వ్యతి షిషజ్యతే వ్యజ్యతే"
(కామాసికాష్టకం ప. 7)

కారడవులలో దూరి కొండమీది ఆ విభిన్న నవనారసింహులను దర్శింప గలిగినా సామాన్య భక్తులు ఆ మూర్తుల శ్రీవతను భావించి భరింప లేరని ప్రహ్లాద లక్ష్మీ సహితమైన సౌమ్యమూర్తి పలుచోట్ల ప్రతిష్టగన్నది, క్రింది అహోబలమందు విచ్చేసి యుండునది ఆ మూర్తియేకాని 'ఉగ్రనరసింహుడు' గాడు. నేటి నిత్యోత్సవాదులన్నీ ఆ వేల్పునకే (ఇది నేను బహుభావిన్న మాటే కాని కన్నదిగాడు) ఆ క్షేత్రమందలి ఇతర విశేషములకు బ్రహ్మాండ పురాణమందలిదని చెప్పబడు అహోబలమాహాత్మ్యమును చూడ దగును. తాళ్ళపాకవారిది ఈ రెండు క్షేత్రములందును భేదములేనిభక్తి.

ఈ సందర్భమున అన్నమాచార్యులు పలుమార్లు పేర్కొన్న సుగ్రీవ నరసింహమూర్తి ఒక పెద్ద సమస్య. 'సుగ్రీవ' అనుపూర్వ పదమే వాడినాడు. గనుక అదేదో పారిభాషికపదమే యనిపించును గాని సాధారణ నరసింహమూర్తి కంఠశోభను వర్ణించునదిగా తోపదు. ఎక్కడ ఏదేవత యైనా కీర్తన కడపటి చరణములో ముద్రా సిద్ధికై సామాన్యముగా వేంకటాద్రికి రాక తప్పదుగనుక ఈ దేవత తిరుమలమీద వెలసి యుండెనని స్పష్టముగా చెప్పలేము. మరిఒక కీర్తనలో (11-217) తుంగ భద్రాతటమున ఉన్నట్లు చెప్పబడినది గనుక పిజయ నగరమందే అన్నమయ్య ఆ మూర్తిని దర్శించి కీర్తించినాడనవలెను. నేను అక్కడి వారిని పలువురను విచారించితినిగాని ఫలములేక పోయినది. నా యెరుకలోని వాఙ్మయములో ఎక్కడా ఆ విశిష్టమూర్తి పేరు నాకు కాన రాలేదు. కిష్కింధాధిపతి సుగ్రీవుడు ప్రతిష్ఠించినట్లు అక్కడ ఆ కాలమున ఒక నారసింహ దేవాలయము ఉండినదేమో, ఆ పాడుపట్టణములోని యెన్నో 'పాడు' లలో ఇదీ ఒకటి కావచ్చును.

(బూ) పుట 290 పోంపిలో మాల్యవంతమున కెదురుగానున్న కొండల యుపత్యకయందు ఒక మంచి చక్కని హనుమద్విగ్రహమున్నది. గుడి చిన్నదైనా మూర్తి పెద్దదిక సుమారు పదడుగులయెత్తు, 'కళసాపుర

మాంజనేయులు అనినేటి వ్యవహారము. కళసాపురం అనేగ్రామం ఆ దేవళం చుట్టు పక్కలనే ఉండినదంటారు. కాని ఆ సూచనలేనేడు కానరావు. ఇరుగు పొరుగూళ్ళ వారు ఆ దేవునికి తమమొక్కులు ఎక్కువగా చెల్లింతురట. ఎవడో భక్తుడు నిత్య పూజ చేసి పోషచుండుసట. గొప్ప ప్రభావంకల దేవతయని అక్కడి వారి నమ్మిక. ఆరెండు కొండల పంక్తుల నడుమనున్న ప్రదేశమే శ్రీనాథుడు చూచి మెచ్చిన 'కదళీవన' ము గావచ్చును. నేడట్టి దేమీలేదు.

(౫) పుట 318 'అలర చంచలమైన' అను పాటలోని వన్నీ సమా వృత్త పాదాలనేదిసరే కాని పాదాని కేడావృత్తాలని లెక్కించడం మాత్రం చింత్యం. ఇవి తాళ జీవితమైన లయ (మాత్రాసామ్యము) ను అక్షర దృష్టితో చూచుటవల్ల కలిగింది. అప్పటికిన్ని 'ఉయ్యాలో' అనే పాదాంత మగణం ఆరుమాత్రలుగలిగి, మొదటినుండి క్రమంగా నడచి వచ్చే ఐదు మాత్రల గణాళిచాటితో పొందిక లేక ముగ్గరించును. చతురశ్రమే జీవాతు వుగా వెలసే కర్ణాటక పద్ధతిలోని నిబద్ధ ప్రబంధాలలో ఏడు గణములు మాత్రము గల పాదము లెందును ఉండవు. కనుక ఈ 'ఉయ్యాలా' అనే పదాన్ని 'ఉయ్యా (–) లా' అని 'యా'కు మూడు మాత్రలును లాకు ఐదు మాత్రలును ఇచ్చి పొడిగించి ఖండలయను గణముల చతురశ్రతను కాపాడు కోవలసియున్నాము. పాడేటప్పుడు ఊపిరి విడిచి తీసుకొనే సౌకర్యమునకైనా, వాటి రాగ రచనమందలి ఊపు చూపుటకైనా పాటపాద మున కడపటి గణము నిట్లు కురుచపరిచి రచించుట ప్రబంధ సాహిత్య ములో సామాన్యము. ఇట్లే "కదిసి సురవరులు" అను పాట రెండవ పంక్తిలో 'పేడావృత్తములే యున్నవి' అనుకొనరాదు. అందవి 'గాను' అనే యేడవ ఆవృత్తమును 'గాను...'గా సాగించుట ఆవశ్యకము. ఇక్కడ మాత్రమే కాదు. పాటలన్నిటి యందును అంతోయింతో ఈ ధర్మము కను గొనవచ్చును. ఇంతేకాదు; అక్షరాల గురు-లఘువుల మాత్రలను "ఏక మాత్రోభవేత్ ప్రహస్వః ద్విమాత్రో దీర్ఘ ఉచ్యతే" అనే సూత్రము ప్రకా రము కొలిచితే పాటల తూనిక చేతికందక దారి తప్పించును. గేయ పద ములనుండి పుట్టిన జాత్యుపజాతి పద్యముల లక్షణములలో ఈ లోపమే

కానవచ్చును. మన సీసపద్యము పఠిశీలింపవచ్చును ఒక వరుసగా ఆరు ఇంద్రగణాలతో ఖండలయను నిర్వహించి కడపట రెండు సూర్య గణాలత్రిశ గతితో కుంటి పాదమును ముగించుమని సీసలాక్షణికుల యాదేశము! కాని ఇంద్రగణములు వీడింటినినడిపి ఎనిమిదవ గణముగా ఒక లఘ్వక్షరమును ఐదు మాత్రల విలువతో చేర్చి పెట్టు కొమ్మనుట న్యాయము; ''కళసాపు-రప్రాంత-కదళీవ-నాంతర-వ్యాక్షాల-తాఫల-స్తబకమునకు..." అన్నట్లు మన ద్విపద, తరువోజ, అక్కర మొదలైన వాటిలో నెల్ల ఈ లయధర్మము గమనింపక అక్షర మా తా దృష్టితో లక్షణ నిర్ణయము జరిగినది, దీని విస్తరము ప్రకృతమింత చాలును.

(శా) పు. 336 'శోభనమే శోభనమే' అన్నపాటకు 'వసంతం' అని రాగ నిర్దేశమున్నది. దీనిని 'నేటికిని భజనపరులు సంప్రదాయమునను సరించి' పాడేవారు. ఆ రాగమందే పాడుచున్నారా? ఎక్కడిదాసంప్రదాయం? దానిలోని వసంతరాగ స్వరూపమెట్లు? అల్పపంచమమా! మహాసంపూర్ణభావోన్నతి గల భట్టుమూర్తిపంచమమా? నిష్పంచమమా!

(ఎ) పుట 359–60 నేను విన్న తెలుగు పీలల స్వరూపము విళంబ కాలములో 'తకతకిట' అనే ఖండలయతో సౌరాష్ట్రరాగబద్ధమై వినవచ్చునది. ఒక్కొక చరణమూ ఆరు ఖండములుగా సాగునది. సస్వరమాత్రా విభాగముగా ఆరణినిక్కడ గుర్తుచేయుడంమేలు విస్తరమైనా-

1. సాసా। ధాధా। పాగా।మాపా।
   మేడలెక్క। నిన్ను జూచి
2. పాధా।మాపా।। పధమా।గారీ।
   కూడే ననే। యాస తోడ
3. సారీ।పామా।। గారీని సరిపామా
   వాడు దేరి వుస్సురందు
4. రీ।।। ఫా।।।। పదమా।గారీ।
   రా వెంక టేశ

5. సారీ పామా। గారీని సరిపామా
యాడ నుం। టి విడాకామ

6. రీఁఁ సాఁఁఁ (ఇక్కడ ఒక ఆవృత్తము విశ్రాంతి)
రా... తక్కిన అన్నినుడుగులూ ఇదేధాటిలో.

దేసాళరాగం నాకు తెలియదు. ఈ రాగానికే ఆది ప్రాతపేరా! సౌరాష్టమని నేననుకొన్నరాగంకూడా ఇప్పటి విద్వాంసులు పాడే పద్ధతికి కొంచెం భిన్నంగా స్ఫురించవచ్చును. ఇందలి దైవత స్వరం శుద్ధము. చతుశ్రుతిగాక త్రిశ్రుతిగా చెవికెక్కును. 364 పుటలో ఉదాహరించిన తిమ్మ భూపాలుని ఏల "కాంభోజి" రాగమని యున్నది. ఆ కాంభోజి యెట్టిదో! ఏలపదములో దాని యేర్పాటెట్లో అందలి "శ్రీ వెంకటేశా" అనేచోట 'శ్రీ' కారము వెనుకటి గణమునకే చేర్చుకొనవదినేమో! గేయపదముల బహి రంగోపాంగముల విశ్లేషణ యెంతో జరిగింది గాని ఆ సారస్వత మందలి జీవశక్తియైన రాగతాళ రచనను వివరముగా వివేచించి తెలిపే పనికి పూనినవారు, ప్రాచీనులుగాని ఆధునికులు గాని, కానరారు.

(వీ) పుట 374. "కరగు" ధాతువు "పండు" ధాతువువలె, కరగించు పండించు అనునట్లు. 'అంతర్భావితణ్యర్థము'గా ప్రయోగించుటగలదు. "కంసాలి బంగారుకరగినాడు" "రైతుపది పుట్లు పండినాడు" అనువాడుక రాయలసీమలోనున్నది. "కోట కొండలుగ ధాన్యరాసులు పండు వట సుజన భజనై కవిఖ్యాతి శూద్రజాతి" అన్న అముక్తమాల్యద ప్రయోగ మున పండును (పండించును) అని పదచ్ఛేదము చేయుటయే ఉచితము. 'పండునట్టి వీట' అని సమస్త పదముగా గ్రహించి 'కలదు" అని శ్రీ వేదం వారు చేసిన క్రియాధ్యాహారము చింత్యము.

(ఐ) పుట 398. "అరుళప్పాడు" తమిళ సాంప్రదాయిక పదము. అరుళ్-దయ, పాడు తెలుగుపాటే. పడుధాతువు కృదంత భావనామము. దయచేయించుట-అనుగ్రహింప జేయుట అని అర్థము. అరుళ్ అరళుగా మార్పు ఉచ్చారణ లోపము. మరి మూడక్షరాల పదములలో-వెదకు చదువు-కొరగు ఇత్యాదులలో-రెండవ లఘ్వక్షరముమీది అకార మో

ఉకారమో నిశ్చయముగా చెప్పలేము. అరళు ధాతువు కన్నడమందున్నది గాని తమిళులో కానరాదు. మరి ఇది శైవైష్ణవవాగ్వివాదుల సంప్రదాయములోని సంకేతపదము. కనుక వికసించు అనే కన్నడార్థముతో 'అరళుపాడు' నిర్వచింపపనిలేదు.

(ఒ) పు. 400. "తిరు = శ్రీయనుటకు వికృతరూపము" అని ఆనందమూర్తి విస్పష్టముగా చెప్పినారు. సంతోషం శుద్ధ ద్రావిడాభిమానులు దీనికొప్పక పోవచ్చును. అది వేరుమాట. ద్రావిడవైష్ణవులవలెనే ద్రావిడ శైవులును సమృద్ధిగా దీనిని వాడుదురు. తిరునీఱు, తిరుత్తణి, తిరువణ్ణామలై ఇత్యాదులు చూడవచ్చును. ఈ 'తిరు' శైవులకంటె వైష్ణవుల వ్యవహారములో ఒక చుక్క ఎక్కువగా వచ్చును.

(ఓ) పు. 415. "సంతపాకలంజ" అనే నుడికారములోని 'సంతపాక' ఏదో డొరిపేరు గాని, 'పాక' పేటగాని కానక్కరలేదు. సంతలలో పాక = కొట్టము వేసుకొని లగజెతనము చేయుట ఇప్పుడూ లేకపోలేదు. సంతలో కాదు పరషలలో గూడా ఈ వ్యాపారం జరిగేది తెరమరుగు సత్యమే.

ఇట్టి అభిప్రాయచ్ఛాయా భేదాలు మరికొన్ని గలవు. కాని ఇంతటితో విరమించెదను. ఇప్పటికే ఈ ఉపోద్ఘాతము పెరిగినది. సాంప్రదాయికమైన విస్తరభయము చేతనైనా దీనిని పెరుగనీయక నిలుపుట న్యాయము.

చి॥ శ్రీ ఆనందమూర్తిగారి యీ విశాల విస్తృత గంభీరపరిశోధన మున్ముందు ఈ వ్యాసంగమునకు చేయి పెట్టువారికి హెచ్చరికయై, మార్గదర్శకమై ఉపకరించుననుట నిస్సందేహము.

ఆయనకు సార్వభౌమమైన నా మంగళాశీస్సులు.

బెంగుళూరు
5-5-1976

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

ఇతరములు

శ్రీకృష్ణ భూపాలీయము

చంద్రకవి

ఈ శ్రీకృష్ణభూపాలీయ కృతికి భర్తయగు, శ్రీమున్మడి శ్రీకృష్ణరాజేంద్రవడయర్ బహదూర్ జి. సి. ఎస్. ఐ గారు, ప్రకృత మహీశూర సంస్థానాధీశ్వరులగు శ్రీ నాల్వడి శ్రీకృష్ణరాజేంద్రవడయర్ బహదూర్ జి. సి. ఎస్. ఐ జి. బి. ఇ. గారికి పితామహులు. వీరు క్రీ. శ. 1799 వ సిద్ధార్థి సంవత్సరమున, బాల్యమునందే, పట్టాభిషిక్తులై, 1868 వ విభవసంవత్సరమువఱకు, అనంగా ఇరుచుమించు డెబ్బదియేండ్లు, చరిత్రప్రసిద్ధమగు శ్రీమహీశూర కర్ణాటసామ్రాజ్య సింహాసనమునలంకరించి యుండిరి.

మైసూరు ప్రభువులలో శ్రీచికదేవరాజవడయరు మొదలగు వారు ఆంధ్రభాషయెడఁజూపిన యభిమానౌదార్యములు తెలుఁగువారికిఁ గ్రొత్త విషయములు కావు; నేటికిని దక్షిణదేశమున గీర్వాణాంధ్రకర్ణాటభాషలు మైసూరు ప్రభువుల పోషణముచేతనే కదాబ్రతికియున్నవి? మై ముమ్మడి శ్రీకృష్ణరాజేంద్రవడయరుగారు సంస్కృత కన్నడభాషలలో స్వయముగా రచించిన, మఱి రచింపించిన, గ్రంథములకు మితిలేదు. వంశపరంపరాగతమగు నాంధ్రభాషాభిమానముగూడ వారు వదలియుండలేదనుటకు ప్రకృతగ్రంథమే చాలినంత సాక్ష్యమిచ్చుచున్నది.

సంపాదకులు: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
పీఠిక, 1924.
మైసూరు సర్కారు శాఖా ముద్రాలయము.

ఈ గ్రంథకర్త పేరు చంద్రకవి. ఇతఁడారువేలనియోగి; నారాయణ మంత్రి పుత్రుఁడు. ఈతని వంశస్థులగు శ్రీ వెంకటనారాయణకవిగారను వృద్ధులు, సంస్కృతాంధ్రములయందు చక్కని సాహిత్యముఁగవితాశక్తియుఁ గలవారు, కోలారుమండలమునందు చింతామణిగ్రామము సమీపముననుండు 'కుందలగుర్కి' యను గ్రామమున నిప్పుడున్నారు. వారే యీగ్రంథమును ప్రకృత మహారాజుగారి సన్నిధిలో సమర్పించిరి ఈ గ్రంథకర్త బమ్మెర పోతనామాత్యుని భోగినీదండకము నాశ్రయించి 'పద్మినీదండక' మును గూడరచించినాఁడు. ఇతఁడు మఱియే గ్రంథములను రచించెనో, తెలియ మార్గములు లేవు.

అప్పకవి మొదలగువారి లక్షణమార్గమును, రామరాజ భూషణాదుల కవితాపద్ధతిని, ఆశయించి ప్రవాసిన గ్రంథమిది. ఇందుచే నీతని లక్షణ ముల ప్రామాణ్యమును, కవిత్వపు విలువయు, మనమూహింపఁగలము. గ్రంథమసంపూర్ణమేమోయని సందేహింప వలసియున్నది.

దొరకినదొకటే ప్రతి; అందును వ్రాఁతపొరఁబాట్లు మెండు; సాధ్యమైనంతవఱకు గ్రంథకర్తగారి భావమునూహించి యథామతి సవరింపఁబడినది; ఐనను సందిగ్ధాంశములనేకములు గలవు. కొన్ని యందందు సూచింపఁబడినవి. విస్తరభయముచే సూచింపనివియుఁగొన్నిగలవు. కొన్ని విచిత్ర ప్రయోగములును గమనింపవచ్చును.

శ్రీమన్మహారాజా శ్రీ నాల్మడి కృష్ణరాజేంద్రవడయరుగారు, ఆంధ్రుల యుపయోగము కొఱకు దీనిని ప్రచురింప నాజ్ఞదయచేసిరి. దీనిని యథాయోగ్యము గానుపయోగించుకొనుటయేకదా ఆంధ్రులు వారియెడఁజూపఁగల కృతజ్ఞత?

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

నూతన సంస్కృత వ్యాకరణ బాలబోధిని
(ప్రథమభాగము)

బుక్కపట్టం అణ్ణయాచార్యులు

సంస్కృత భాషా వ్యాసంగమందలి కష్టము ఆ పనికి చేయివేసిన వారందఱెఱుగుదురు. దానిని నేర్చుట నేర్పుట రెండును భగీరథప్రయత్నములు. సంధి, సుబంతములు, కారకములు, తద్ధితములు, తిఙంతములు మొదలగు భాషావిభాగములందు సంస్కృతములో నున్నన్ని రూపభేదములు ఇంకే భాషయందైనను ప్రపంచమున గలవాయనుట ప్రతి సంస్కృత విద్యార్థియు వేయు ప్రశ్న. సామాన్య సూత్రములను మించనన్ని అపవాద సూత్రములీ భాషయందే చూడవచ్చును.

కాని దాని ప్రాచీనత, అందలి సారస్వతము యొక్క యమేయత, దాని వైవిధ్యము, అందలి విషయముల యమూల్యత-వీనిని బట్టి చూచితిమేని, హిందువుల మగు మనమాట కేమి, మనుష్య జాతిలో సంస్కారయైన యెవ్వడు గాని దాని నుదాసీనము చేయనీలుకేదు. మన కన్నులో ఇది ఋతుకులోని జీవగఱ్ఱ. హిందూజాతి, ధర్మము, నీతి, రసికత. ఇంకను గొన్నాళ్ళైనను బతికియుండ గోరితిమేని మనమే జాతి వారమైనను, ఏ మతము వారైనను ఆ భాషయందు సామాన్యమైన పరిచయమైనను సంపాదించుకొనక పోవుట యవివేకము; అధర్మము.

కావున దానిని సాధ్యమైనంత వఱకు సర్వజనీనముగా సుగమముగా జేయుట సంస్కృతాభిమానులందఱును జేయవలసిన పని. పూర్వ

పీఠిక, 1934.

కాలపు పాఠపద్ధతిని తప్పులు పట్టట నా పనికాదు కాని దాని ప్రకారము ఇప్పుడా భాషను నేర్చుట మనకసాధ్యము, అనావశ్యకము గూడ. ప్రయోజన దృష్టితో మనము పరీక్షించితిమేని ఆభాషయందును దాని వ్యాకరణము నందును త్రోసి వేయవలసిన చెత్త యెంతో కలదనుట స్పష్టమగును.

ఈ బాలబోధినీ గ్రంథకర్తగారిట్టి తీవ్రభావముగల వారిలో నొక్కరు. సుప్రసిద్ధమై యనూచానమగు పండితవంశమువారు. పండితులు. పదార్థముల మితి యెఱిగిన రసికులు. ఎన్నో యేండ్లుగా హైస్కూళ్లు తరగతుల విద్యార్థులకును ప్రత్యేకముగా శిష్యులకును కావ్యనాటక వ్యాకరణాలంకార గ్రంథములు పాఠము చెప్పుచున్న యనుభవశాలులు. సంస్కృత భాషాభ్యాసులలో మొదటి తరగతుల వారికి వలసిన సుబంత, సంధి, తిఙంత రూపములను చక్కగా నేర్చి కూర్చి దీనిని వ్రాసినాడు. నేనెఱిగినంత వఱకు తెనుగులో ఈ పద్ధతిలో ఇట్టి బాలబోధిని వ్రాసినవారు లేరు.

దీనిని యథార్థముగా నుపయోగించు కొని యింకను ఉత్తమములగు ఇట్టి గ్రంథములు రచించునట్లు వారిని ప్రోత్సాహపఱుచుట విద్యాభిమానులగు నధికారుల ధర్మము.

మైసూరు
29-9-34

ఇట్లు
రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

శ్రీరామానుజ ప్రభావ కల్పకము

(పూర్వభాగము)

బుక్కపట్టణం నరసింహాచార్యులు

శ్రీ భగవద్రామానుజాచార్యులు మనదేశమందు వేదబోధితములైన మహాదర్శనములను స్థాపించిన అగ్రగణ్యమహాపురుషులలోనొక్కరు. ఉపనిషత్తులు, గీత, సూత్రములు అను ప్రస్థానత్రయమునకు వారుచేసిన వ్యాఖ్య స్వపరదేశములలో పలువురు మహామతుల యంగీకార ప్రశంసలను బడసినది. సర్వశేషియైన శ్రీ పరవాసుదేవునికి శేషభూతులగు నిత్యసూరులలో పరమాంతరంగికుడగు ఆదిశేషుని యవతారముగా శ్రీవైష్ణవులా మహానుభావుని భావించి పూజించుచున్నారు. తుదకు భగన్నామముగూడ స్మరింపనక్కరలేదని, 'రామానుజ' అనుచతురక్షరి యొకటే ముక్తి సాధనకు చాలునని, భావించి యాచరించువారు కూడ శ్రీ వైష్ణవులలో లేకపోలేదు.

అట్టివారి చరితకు తగినంత వ్యాప్తి తెలుగుదేశములో కలుగలేదు. కారణము స్పష్టమే. వారు తమ జీవితమంతయు ఇంచుమించు ద్రవిడ దేశమునందే కడపినవారు. అద్వైతమతము సంస్కారులందును, శైవమతము సామాన్యజనులందును, ఎక్కువ ప్రబలముగా శ్రీ రామానుజుల కాలమందును తరువాత చాలకాలమున తెలుగుదేశములో వ్యాప్తిలోనుండినది. సుమారు పదునాఱవశతాబ్ది తరువాతనే విజయనగర రాజుల యాశయము చేత విశిష్టాద్వైత దర్శనమునకు ఆంధ్రదేశములో కొంత కాలాతీత. అదిగూడ అంతదృఢమైనది కాలేదు. ఆంధ్రదేశమున నెలకొన్న శ్రీవైష్ణవ బ్రాహ్మణులలో అనేకులు ఆచార్య పుస్తక నిర్వహణమునకై వచ్చిన

ఉపోద్ఘాతము, 1947.

అరవవారు. మతప్రచారముకంటె మనిమాన్యములమీద ఎక్కువ దృష్టి గలవారు. తెలుగు భాషయందువారికి శక్తిరక్తి రెండును మట్టము. ఇక శ్రీ రామానుజ చరిత్రమునకు సంబంధించిన విషయములన్నియు సంస్కృత భాషలోను అంతకంటె ఎక్కువగా తమిళభాషలోను కలవుకాన ఇతరుల కవి అంతగా అందుబాటులో లేవు. కాబట్టియే శ్రీ రామానుజుల చరిత్రమున తెలుగు వారి పరిచయము మితమైనది.

ఇంకొకటి. ఎవరిదైనను చరిత్రమని వ్రాసినచో అందు జనసామాన్యమున కాకర్షకములగు విచిత్రవిషయము లెక్కువగా లేకుండెనేని చరిత్రకారునికి బేరముగిట్టదు. శ్రీ రామానుజ జీవితమందు అట్టివింతలు చాల తక్కువ. ఇతర మతముల పవాడపురుషులతో పోల్చిచూచితిమేని వీరి జీవితమున ఆశ్చర్యపడవలసిన విశేష సన్నివేశాలు ఏమియులేవనే చెప్పవచ్చును. ఇక్కడ మనకు కానవచ్చునదెల్ల శ్రీ రామానుజుల అసాధారణ భగవదభక్తి, స్వాచారప్రతిపత్తి, శిష్టవాత్సల్యము, లోకకల్యాణకాంక్ష ఇత్యాదులే కాన చరిత్రను కథగా చదివి సంతోషింపదలచెడు వాడకవి చాలవు.

ఇట్టి ప్రశిచరిత్రమునకు ఇప్పుడు ఎక్కువ ప్రచారముచేయ ప్రయత్నించి నారీ ప్రగంథకర్తగారు. వీరు శ్రీ రామానుజుల మేనమామ గారగు శ్రీ పెద్దతిరుమలనంబిగారి వంశపరంపరలోనివారు. అనూచానముగా వచ్చిన ఆచార్యపుంస్త్వమునను భవించుచున్నవారు. సంస్కృతాంధ్ర సాహిత్యములందు మంచిపరిచయము గలవారు. జ్యోతిశ్శాస్త్రమందనిష్ణాతులు. ఆంగ్ల విద్యాసంస్కారము చక్కగా గలవారు. ముఖ్యముగా శ్రీ రామానుజ సిద్ధాంతమును సత్సంప్రదాయమును ప్రచారముచేయుటయందు ఎక్కువ ప్రశ్రద్ధావ్యవసాయములు గలవారు; ఆర్ద్ర హృదయముతో కాననుభవించువారు. వీరీ ప్రగంథము ప్రవాయదొరకొనుట చాల శ్లాఘార్హమైన విషయము.

దీనిని వీరు చరిత్రదృష్టితో పరిశోధించి వ్రాయలేదు, మరి చదువరు

లకు రుచిగా భోగ్యముగానుండవలెనను తలంపుతో కావ్యధారతో రచించినారు. గ్రంథమాద్యంతమును ఒక కథవలె చదివి యనుభవింపవచ్చును. మహాపురుషుల జీవితమును చూడవలసిన దృష్టిముఖ్యముగా ఇదే. ఎట్టి మహాపరాయణమునకై వారు జీవించిరో, ఎన్ని కష్టములెదుర్కొని దానిని సాధించిరో, ఎట్లు ప్రచారమునకు తెచ్చిరో తెలిసికొని, మననముచేసి, మనజీవితమందుదాని నావరణలో యథాశక్తిగా పెట్టుకొనుటకు దారిమాపుట ఇట్టి గ్రంథముల ముఖ్యఫలము. కనుక (1) యాదవ ప్రకాశుల వద్ద శిష్యవృత్తి చేయునప్పుడు గోవిందుడును రామానుజునివలె గృహస్థుగానుండెనా లేక బ్రహ్మచారియా? (2) రామానుజుల కాశీయాత్రకు పూర్వమా తరవాతనా బ్రహ్మరాక్షసుని విడిపించిన కథ? (3) తిరుమలనంబి కాళహస్తిలో గోవిందుని ముందు తాటాకులో వ్రాసి పడవేసినశ్లోకము 'స్వాభావికానవధికాతి శయేశితృత్వం' అనునదియా లేక 'కః శ్రీయః' అనునదియా? (4) తిరుక్కచ్చినంబి వైశ్యుడాలేక చతుర్థవర్ణుడా?—ఇత్యాది చారిత్రిక శంకలు ఈ గ్రంథచమత్కారములు వేనికొనరాము. ఆ వ్యాసంగరీతి వేఱు. ఆ దృష్టితో పరిశోధకులితరు లెవరైనను చేయవలసినపని శ్రీ రామానుజ చరిత్రలో ఎగాధముగా గలదు.

ఇప్పటికి శ్రీ రామానుజుల విషయమున చదువరులకు హార్దమైన భక్తి గౌరవములను వారిసిద్ధాంతమున ప్రతిపత్తియు గలిగించుటకు ఈ గ్రంథము చాలనుపకార మనుటకు సందేహములేదు.

ఈ గ్రంథకర్తగారితో నాకుగల సన్నిహిత బంధుత్వము, అంతకన్న ఎక్కువగా మైత్రి, దానిని పురిచి విషయమందును రచనాశైలియందును నేననుభవించిన సంతోషము-వీనికి ఒడుకానుక ఈ తొలిపలుకు. దీనిని ఇంతకన్న పెంచబని లేదుగదా!

మైసూరు
సర్వజిత్తు కార్తీకశుక్లపంచమి

ఇట్లు
రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

3056

శబ్దప్రపంచం

- వేమరాజు భానుమూర్తి

శబ్దం పుట్టి విస్తరించే వింతలు విజ్ఞానశాస్త్రం ప్రకారంగా 'శబ్ద ప్రపంచం' వివరించింది. ప్రాచీనులు అధ్యాత్మశాస్త్రంలో ఇట్లు దాన్ని వివరిస్తారు.

శబ్దం నిత్యమైనది. అంటే పుట్టు చావులు లేక ఎప్పుడూ ఉండేది. పరబ్రహ్మ స్వరూపమూ అదే అనే మతమూ ఒకటి కలదు. కాని దాన్ని మనం సామాన్యంగా వినలేము. దానికే 'అనాహతం' అనిపేరు అంటే దెబ్బతిననిది. కంపనం లేని శబ్దం పుట్టదని మీకు వైజ్ఞానికులు చెప్పినారు. దెబ్బకొట్టక కంపనం కలుగదు. కనుక కంపనానికి మూలమైన దెబ్బ-ఆహతి-శబ్దాన్ని కలిగిస్తుందన్నారు ప్రాచీనులు ఆ ఆహతి కూడా లేని శబ్దమే అనాహతం. దెబ్బ దానివల్ల పుట్టే కంపనం ఉన్న శబ్దాన్నే వినవచ్చేటట్టు చేస్తుంది కాని లేనిదాన్ని కొత్తగా సృష్టిచేయదు. కనుక అది నిత్యవస్తువు. యోగాభ్యాసం చేసినవారు బహిర్ముఖంగా ఉండే మన చెవిని లోపలి కీడ్చుకొని గురూపదిష్టమార్గంలో దాన్ని వినగలుగుతారు.

మరి దెబ్బవల్ల పుట్టే శబ్దం అనాహతం. శరీరంలో నాభి క్రింద బ్రహ్మ గ్రంథి అనే 'దుంప' కలదు. అది వాయువు పుట్టి క్రిందుమీదుగా సంచరించే చోటు. దాని క్రింద దేహమధ్యంలో ఒక చక్రమున్నది. అందు కుండ రూపంతో అగ్ని ఉంటుంది. జీవునికి ఏమైనా చెప్పవలెనని తోచినప్పుడు

తిలకం, 1954.

విజ్ఞాన సాహితీ ప్రచురణలు, మద్రాసు.

మనస్సును ప్రేరణ చేయును. ఆ మనస్సు వెంటనే ఆ సూక్ష్మాగ్నిని కొట్టి రగిలించును. అది బ్రహ్మగంథిలోని వాయుపును పైకి తోయును. అది మీదికి వ్యాపిస్తూ, నాభి, హృదయం, కంఠం, తల, నోరు అన్న ఐదు ఘట్టాలలో ధ్వనిని ఆవిర్భవింప జేస్తుంది. నాభిలో అతి సూక్ష్మంగా, హృదయంలో సూక్ష్మంగా, కంఠంలో పుష్టంగా, తలలో అపుష్టంగా, నోటిలో కృత్రిమంగా-అంటే నేరువేరు అక్షర రూపాలుగా-ధ్వని బైలు పడుతుంది. "నాభిలో సూక్ష్మంగా హృదయంలో అతి సూక్ష్మంగా ప్రకాశిస్తుంది" అని ఇంకొక్క మతం. ఇవంతా మనుష్య శరీరంలో పుట్టే శబ్దాన్నిగూర్చిన మాట. బయటి ప్రపంచంలో పుట్టే శబ్దానికి "ఆహతి" యే కారణం. దాని వల్ల పుట్టే శబ్దాన్ని గాలి తెరలు తెరలుగా వ్యాపిస్తూ తోసుకొనివచ్చి మన చెవిని తాకినప్పుడు మనకు శబ్దం తెలుస్తుంది.

ప్రకృతం నేను ఇక్కడ సూచించబోయేది భారతీయ కళకు సంబంధించిన ఆ ఆహత శబ్ద స్వరూపం మాత్రమే.

దెబ్బవల్ల జనించే ధ్వని మనకు రెండు విధాలుగా గోచరిస్తుంది ఒకటి పుట్టిన క్షణంలోనే నిలిచిపోతుంది. మళ్ళీకొట్టితేనే తప్ప అది పుట్టదు. మీనమో, బల్లవంటి పదార్థం మీదనో మనం కర్రతో కొట్టినప్పుడు వినవచ్చే శబ్దం ఈ జాతిది. ఇంకొకటి మనం కొట్టినప్పుడు పుట్టి, తరువాత కొన్ని క్షణాలు అనువర్తిస్తూ ధారగా సాగుతుంది. గంటను వాయించినప్పుడు ఈ జాతిధ్వని చెవికందుతుంది. ప్రతి ధ్వనికి కొన్ని కంపనలు ఉండక తీరదని మీకు తెలుసును. ఆ కంపనాల సంఖ్య చివరకుండా ధ్వని కొంత కాలం సాగవలెనన్నమాట. అప్పుడే రూలుకర్రను పట్టి గీచిన సరళరేఖ కంటికి కానవచ్చినట్లు ధారాకారంగా వంకలు లేక ధ్వని చెవినాకర్షిస్తుంది. చిత్రరచనకు రేఖవంటిది సంగీతానికి ధ్వని. రేఖలో ఒకటే పరిమాణం కల బింబములు ఒకటితో మరొక్కటి అతుకుకొని సాగును. ఈ రెండవజాతి ధ్వనిలో కంపనాలు అట్టే భేదంలేకుండా సాగగలవు. దీనికే 'నాదం' అనేపేరు ఇటీవల వాడుకలోనికి వచ్చింది. శబ్దమంతా నాదమే అయినా సంగీతమందుపయోగించే నియతకంపన సంఖ్యగల దానికి మాత్రమే ఈ పరిభాష వాడేది అనుకూలం. సంగీతకళకు ఇదే మొదటి మూలద్రవ్యం.

ఒక నియతకంపన సంఖ్యగల నాదాన్ని పెట్టుకొని. దాని కంపన సంఖ్యను ఎక్కిస్తూ పోయినా, దించుతూ పోయినా, మనకొక ప్రకృతి సిద్ధమైన సూత్రం అనుభవానికి వస్తుంది. అదేమంటే మనం ఎత్తుకొన్న నాదం వంటిదే ఇంకొక్కటి ప్రత్యక్షమౌతుంది. ఈ రెంటినే కలిపి పాడినా మంటే-లేదా శాయిస్తే-ఏమీ భేదం తెలియకాదు. రోడ్డులో మైలురాళ్ళవలె నాదచారలో ఇరుప్రక్కలా కొన్ని ఘట్టాలున్నాయన్నమాట. ఈ ఘట్టాలను అందుకొనడానికి కంపనాల సంఖ్యాజ్ఞానం గాని దానిని తెలిపే యంత్రం కానీ అక్కరలేదు. తంబూరవంటిదాని తంతిని మీటగానీ గంటవంటి దాని మీద దెబ్బకొట్టికానీ, వచ్చిన నాదాన్ని గహించి నిలుపుకొని, దానికంటే ఎక్కువైన నాదాలను క్రమంగా ఎక్కిస్తూ పోయినా, తక్కువ నాదాలను తగ్గిస్తూపోయినా ఆ ఘట్టాలు మనకు తప్పక గోచరింపగలవు వాటి కంపనసంఖ్యల వ్యవహారమంతా విజ్ఞానశాస్త్రం వారిదే కాని కళావిద్యార్థుల కావశ్యకమూకాదు, సాధ్యమూ కాదు. రెండు నాదాలకు గల పరస్పర మైత్రిని మన చెవియే నికరంగా గ్రహించగలదు. అన్వీక్షణ మాత్రం పలుమారు చేయగలిగితే చాలు. మంచి ఉపాధ్యాయులు గాని, శుద్ధంగా మేళంచేసిన వీణవంటివాద్యం కాని విద్యార్థి కీవిషయంలో చాలా సహాయ పడగలదు.

ఇటువంటి రెండు పూర్వాపర నాదాల మధ్యభాగాన్ని 'స్థాయి' అంటారు. సామాన్యంగా మనుష్యశరీరంలో మూడు స్థాయిలవరకూ పలుకుతుంది. వాటికి మంద్రస్థాయి, మధ్యస్థాయి, తారస్థాయి అనిపేళ్ళు. మందగ్రం క్రిందిది. తారంపైది. మధ్యం నడుమ నుండేది. మంద్రానికి దిగువ 'అనుమంద్రస్థాయి'ని తారానికి మీద 'అతితార' స్థాయినీ కలిపి మొత్తం ఐదు స్థానాలనూ వాద్యాలలో చూపవచ్చును. మరి ప్రత్యేకంగా ఇందు కొరకే తయారుచేసిన 'పియానా' వంటి వాద్యాలలో మీదా కిందా ఇంకొక్క స్థాయిని గూడా చేర్చి సప్తస్థాయిలను చూపవచ్చునంటారు. ఐతే వాటి నాదం అతిబల్వజంగానో, అతి సూక్ష్మంగానో ఉండి వినటానికి కటువుగా ఉంటుంది. గాఢనిద్రపోయేవారి గురకవలెనో, కీచురాయి కూతవలెనో, వినవచ్చునే కాని, భావాలను వెలువరిచే శక్తి ఆ నాదాలకు చాలస్వల్పం•

మనుష్యశరీరంలో మూడుమంద మధ్యతారలు స్పష్టంగా భావరచనకు పనికివచ్చును. ఇలకా తారస్థాయిలో మొదటి సగమూ. మంద్రస్థాయిలో రెండవ సగపాలు మాత్రమే ప్రసన్నంగా భావకల్పనలకు పనికివచ్చేది. మనవాచ్యాలు గూడా ఈ దృష్టితోనే సిద్ధమైనవి, వాయించవలసినవి. వీణ వంటి వాచ్యాలలో అనుమంద్ర, అతితార స్థాయిలు చూపగలిగినా ఆ నాదాలు స్త్రీలగాత్రంలో స్థాయి వ్యాప్తి ఇంకా తక్కువ. సుమారు రెండున్నర స్థాయి మాత్రమే. కళాకౌశల్యానికి గానీ, భావోన్మీలనానికి గానీ అంతగా ఉపయోగించవు. అచోట్ల కొందరు అప్పుడప్పుడు చేసే నాదసంచారాలు కొంత వింతగానూ, వేడుకగాను ఉండగలవు, అంతే.

ఒక్క స్థాయిలో మొదటినాదాన్ని పట్టుకొని కడపటి నాదాన్నివదలి, ఈ రెంటినడుమ వేరువేరు నాదాలు ఎన్ని పుట్టగలవో పరీక్షిస్తారు గాయకులు. సిద్ధాంత దృష్ట్యా ఆలోచిస్తే ఒక్కొక్క కంపనం ఎక్కువో తక్కువో అయినప్పుడంతా భిన్ననాదం పుట్టుతుందనవలెను. కాని ఆ సూక్ష్మతమ భేదం గ్రహించే శక్తి మన చెవికి ఉండదు. కనుక పరస్పర భిన్నంగా స్పష్టంగా చెవికి తోచే నాదాలను పరీక్షించి ప్రాచీనులు వాటిసంఖ్య 22 అని నిర్ణయించినారు. ఆ యిరవైరెంటినీ వారు "శ్రుతులు" అని పేర్కొన్నారు. "శ్రుతి" అంటే చెవి గ్రహింపగలిగేదని అర్థం. వాటి కన్నిటికీ వేరువేరుగా పేర్లుగూడా పెట్టినారు ప్రాచీనులు.

ఇతే స్థాయిలోని యీ యిరవైరెండు నాదాలనూ క్రమంగా ఒకదాని తరువాత మరొక్కటి ఆరోహణంగాగానీ, అవరోహణంగాగానీ ప్రయోగిస్తే చెవికి రుచించదు. కళలో ముఖ్యతత్త్వంగా ఉండవలసింది రక్తి. అది కొన్ని కొన్ని శ్రుతులను మాత్రమే క్రమంగా పట్టి పాడినప్పుడు కలుగుతుంది. ఆ రీతిగా చాలా ప్రాచీనకాలంలో ఒక స్థాయి యందు వీడుశ్రుతులను క్రమంగా పాడే సంప్రదాయం ఉండేది. ఆ యేడూ శ్రుతి మండలంలో 1, 4, 6, 10, 14, 17, 19 సంఖ్యగల శ్రుతులు వీటినే "స్వరాలు"అన్నారు. వాటికే క్రమంగా షడ్జం, ఋషభం, గాంధారం, మధ్యమం, పంచమం, ధైవతం, నిషాదం– అని ప్రత్యేకంగా పేళ్ళు. ఇంకా సంగహించి ఆపేళ్ళ మొదటి అక్షరాలను మాత్రం కొద్ది మార్పులు–ఉచ్చారణ సౌకర్యానికైచేసి,

గ్రహించి 'సరిగమపదని' అని వాడుతున్నారు గాయకులు. ఇది గూడా ఎన్నో శతాబ్దాలకు ముందే జరిగిన సంకేతం. సామాన్యంగా ఆరోహణంలో గాని, అవరోహణంలోగాని ఒక స్థాయిలో ఏడుస్వరాలకంటే ఎక్కువగా ప్రయోగింపగూడదనే నియమం మన సంప్రదాయంలో ఉన్నది. ఇంకా 6, 5, 4 వరకూ స్వరసంఖ్యను దించవచ్చును గూడ. ఒక స్థాయిలో గ్రహించిన స్వరాలే దాని కింది మీది స్థాయిలలోనూ ప్రయోగించవలెననేది ఇంకొక్క నియమం. స్వరాలు ఏవైనా ఆ బేసి సంఖ్యను సరిసంఖ్యగా మార్చుకొంటే నాల్గునాల్గుగా సమంగా పరిచిపోవచ్చును. గనుకపై స్థాయి మొదటి స్వరమైన తారషడ్జాన్ని కూడా చేర్చుకొని 'సరిగమపధనిస' అని పాడే వాడుక వచ్చింది. దానితో స్థాయి మొదటిస్వరమే కడపటిది గూడా అయి ఇరుపక్కలా ముఖ్య విశ్రాంతి స్థానమౌతుంది. సంగీత కళారచనలో ఇదొక ముఖ్యమైన మూలతత్వంగా ఏర్పడిపోయింది.

ఇందులో ప్రకృతిసిద్ధమైన ఇంకొక తత్వం కలదు. తంబూర తంత్రిని ఒక్కదానిని మీటి అవధానంతో వినామంటే మన ప్రయత్నమేమీ లేక మొదటి నాదంతో పిడదీయ రాకుండా చేరిపోయి ధ్వనించే మరికొన్ని స్వరాలు మనం వినగల్గుతాము. మొదటి దాన్ని షడ్జమనుకొంటే దాన్ని పంచమం, నిషాదం, అంతరగాంధారమనే మూడవస్వరం-ఇవి మనకు స్పష్టంగా వినబడగలవు. ఇంకా సూక్ష్మంగా తెలిసికోగలిగిన చెవికి, ఇతర స్వరాలూ గోచరించును. వీటిని 'స్వయంభూ' స్వరాలని మన మనవచ్చును. అంటే ఏనాదాన్ని ఆధారంగా పెట్టుకొని చూచినా దాని మీది స్వరాలన్ని అందులోనే అంతర్భవించి వున్నట్లు మనం గ్రహించగలం కనుకనే మొదటి స్వరానికి షడ్జమనే పేరు. షట్ + జ = అనగా అరిచట్టిని పుట్టించేది. ఋషభం మొదలైన ఆరుస్వరాలూ దీనినుంచే పుట్టివన్నమాట. ఇంకా యోచించి చూస్తే ఏనాదమైన, ఏ స్వరమైన కాగలదు. ఒకదాన్ని దేన్నైనా ఆధారంగా పెట్టుకున్నప్పుడే తక్కిన వాటి స్వరూపమూ, పేరు నిర్ణయం కాగలవు. ఇందు చేత 'శ్రుతి' అంటే గానోపయోగిగా శ్రవణేంద్రియానికి గ్రాహ్యమైన నాదమని, 'స్వరం' అంటే ఆధార నాదంతో సాపేక్షంగా స్వరూపాన్ని పొందిన నాదమని మనం గ్రహించవలెను.

షడ్జమం ఆధారంగా పెట్టుకొని, పై సప్తస్వరాలను ఎగుడు దిగుడుగా అందందు దాట్లుగా, అల్లికలుగా హ్రస్వ దీర్ఘాలుగా ప్రయోగించి పాడినప్పుడు ఆ నాదమండలానికి ఒక వ్యక్తిధర్మం మనకు గోచరిస్తుంది. మీవ చెప్పిన సప్తస్వరాలలో మొదటిది ఆధారస్వరం గనుక దాన్ని మార్చక స్థిరంగా పెట్టుకొంటాము. వీకనాదం, తంబూర, వీణలో పక్క తంతులు, శ్రుతిపెట్టె, ఒత్తు నాగస్వరం-ఇత్యాదులన్నీ ఇందుకే ఉద్దేశింపబడినవి. ఋషభం మొదలైన ఆరుస్వరాలకు వాటికిపైన చెప్పిన శ్రుతుల నియత సంఖ్యను ఎక్కువో తక్కువో చేయడం మూలాన ఒక్కొక్కటే రెండు రెండు రకాలౌతుంది. కాని ఐదవ పంచమస్వరం కూడ షడ్జంవలెనే ప్రబలమైనది. 'రిగమధని' స్వరాలు చెరి రెండు విధాలు కాగా మొత్తం స్వరాలు షడ్జ పంచమాలతో పండ్రెండు. వీటి ఆవాపోద్వాపాలతో ఎన్నో రాగాలు పుట్టుతున్నవి. ఈ పండ్రెండు స్వరాలను చూపడానికే మనవీణలో స్థాయికి పండ్రెండు మెట్లు కట్టబడినవి. హార్మోనియం, పియానో, మొదలైన వాద్యాల పలకలూ ఇందుకే. కాని ఈ పండ్రెండనేది చాల స్థూలమైన మాట. దీనికి పైబడి ఇరవైరెండు శ్రుతులున్నవి గదా సూక్ష్మంగా. సూక్ష్మ తరంగా నాదాన్ని పరిశీలించి ప్రయోగించ గలవారికి అది గూడ స్థూలవిభాగమే అని పిస్తుంది. ఆ సూక్ష్మ సూక్ష్మతర నాదాలను సాక్షాత్తుగా స్పష్టంగా స్వతంత్రంగా ప్రయోగిస్తే రక్తి చెడుతుంది. కాని ప్రధాన స్వరాలకు పరికరంగా, అలంకారంగా ప్రయోగించినప్పుడు అవి సూక్ష్మసూక్ష్మతర భావాలను వెలువరించగలవు. ఆ మార్గాలనే గమకాలంటారు. స్వరాన్ని కదలించేది గమకం. కదలించినప్పుడు ఎగువా దిగువాగల సూక్ష్మనాదాలను అది కలుపుకొంటుంది. ఆ కదలింపులు ఎన్నో విధాలు.

ముఖ్యంగా ఆరోహణావరోహణాల వివిధ సంచారాలకు వేరువేరు స్వరాలను వీరుకొని, ఆ మూలాన స్పష్టమైన, వ్యక్తిత్వం కలవేరువేరు రాగాల మూర్తులను కల్పించి చూపేది సంగీతవిద్యకు మొదటిపని. ఇట్లు స్వరాలను వీరుకొనడంలో ముఖ్యమైన సాధనం వాటి పరస్పర సంవాదం. సంవాదమంటే ఇద్దరు స్నేహితులవలె కలియగలుపుగా చేసి రాణించుట. చెప్పిన స్వయంభూ స్వరాల జ్ఞానం ఈ సంవాదాన్ని నిర్ణయించడానికి

చాలా పనికి రాగలదు. ప్రతి స్వరాన్ని షడ్జంగా గ్రహిస్తే దాని అంతర గాంధారం, మధ్యమం, పంచమం, నిషాదం–ఇవి దాని స్వయంభూస్వరాలు గనుక సంవాదం కలవి కాగలవు. సప్తస్వరాలలో ప్రతిదానికీ ఇట్లు సంవాది స్వరాలు స్పష్టంగా నాలుగుండి తీరుతుంది. కాని రాగవ్యక్తికి వాటిలో కొన్నింటినిమాత్రమే ప్రత్యేకంగా వీరుకొనేవి విధిలేనిపని. ఇదిగాక సరిగమ పధనిస అనే రెండు చతుష్క భాగాల పరస్పర సంవాదం, ఉపయోగించే గమకాల పరస్పర సంవాదం, స్వరసంచారాల పరస్పర సంవాదం–ఇట్లు ఇతర సంవాదాలూ రాగస్వరూప నిర్ధారణకు ఎంతో తోడుపడేవి ఉన్నవి. మరీ కొన్నిస్వరాలను ఆరోహణంలోనో అవరోహణంలోనో పూర్తిగానో వర్జించే రాగవ్యక్తిని స్ఫురింపజేసే ఇంకొక పద్ధతి. ఇటీవల గణితం ప్రకారం స్వరసంచారాలను వర్జ్యాలను పట్టి చేసి కొన్నికోట్లరాగాలు సృష్టిచేసేదీ వాటినిసాధించి పాడేవే వాడుకలో వస్తూవుంది. కాని అందులో ముప్పాతి కాముప్వీసం రక్తిలేని రచన–సంవాదమనే జీవధర్మాన్ని గమనించదు గనుక.

సంగీతకళకు మూలతత్వాలలో మొదటిదైన నాదాన్ని గూర్చి స్థూలంగా కొంత తెలిపినాను. రెండవ మూలద్రవ్యం కాలం. నాదం అనంతమై అఖండమైనా మితగ్రహణశక్తిగల మన చెవికి గాహ్యమయ్యేది గనుక దాని ఖండాలూ, వేరువేరు విధాలూ మనం అర్థంచేసుకోవచ్చును కొంతకు కొంతైనా. కాలం అంతకంటే అఖండమై ఏ ఇంద్రియానికీ దొరకక ఇట్టిదని చెప్పరాని వస్తువు, కనుకనే పరబ్రహ్మ కాలాత్మకమని అంటారు. శ్రీ మహావిష్ణువుకు 'కాలః' అనే మరొక్కపేరు కూడావున్నది. కాని దాన్ని గూడా మన ఇంద్రియాలకు గోచరించే క్రియ, శబ్దం, వీటినిబట్టి ఖండాలుగా గ్రహింప గలము. క్రియ కంటికి గోచరించేది. ఇద్దరు నడిచే నడకను జూచి అందులో ఒకడి నడక వేగమని, ఇంకొక్కనిది నిదానమని కాలాన్ని తెలుసు కొంటాము. ఈ ఇద్దరికే కాలవ్యత్యాసాన్ని గడియారపు ముల్లువంటి దాని నడకను లెక్కించి సూక్ష్మంగా నిర్ణయిస్తాము. ఇట్లే చెవి గ్రహించే భిన్న శబ్దాలను బట్టి రెండుశబ్దాల అంతరం నిర్ణయిస్తాము. రైలుబండిలో ప్రయాణించే టప్పుడు కిటికీగుండా చూచే అవకాశము లేకపోయినా చక్రాల

'చటపట' శబ్దాల అంతరాన్ని విని బండివేగాన్ని-అది సూచించే కాలాన్ని-తెలుసుకో గలము కదా. ధ్వనిఖండాలు సూచించే కాలఖండాలే సంగీతకళలో 'లయం' అనబడుతున్నవి. ఆధార (శుతియైన షడ్జానికి తక్కిన నాదాలను, లోబరిచి నియమించినట్లుగానే, ఆధారభూతమైన ఒక లయానికి-నడకకు-ఆ నాదరచనను లోబరిచి నియమిస్తారు గాయకులు. శుద్ధమైన (శుతిలయంలో ఏసౌఖ్యమున్నదో అటువంటిదే శుద్ధమైన కాలలయంలోనూ కలదు. నాదలయానికి ఆధారం తంబూర, వీణవంటివైతే. కాలలయానికి చేతితాళాలూ, చిటికలు, కంచుచిప్పలు, మృదంగ మొదలైన అనద్ధఘనవాద్యాలు ఆధారంగా నిలిచి పాటను నడిపించేవి. కర్ణాటక సంగీతపదాయంలో ఈలయ విద్య ఇతరులకు డోహించుటకైనా సాధ్యం కానంత విరివిగా, లోతుగా వివిధంగా పెరిగింది. ఈలయను, చిన్నచిన్న గుంపులుగా చేర్చి కూర్చి లెక్కపెట్టి చూపేది తాళం.

ఈ రాగాలుగానీ, తాళాలుగాని తమంతట మనకిచ్చే రక్తి కేవలం (శవణేంద్రియానికి మాత్రమే గోచరించేది. వీటిని ఆధారంగా చేసుకొని (ప్రతిభాబలంతో గాయకుడు కొత్తకొత్త భావాలు సృష్టిచేసినప్పుడు ఆరక్తి ఇంకా లోతుకు దిగి మనబుద్ధికీ, హృదయానికీ ఆనందాన్ని ఈయగలదు.

సంగీతకళ మూలాన మనహృదయాలలో ఆవిర్భవించే భావాలు ఏభాషకు చేరినవి కావు. కనుక అవి ఇట్టివని చెప్పలేము. చెప్పడం అంటే భాషతోనే కదా. భాషలో శబ్దాలకు సంకేతాలున్నవి. అంటే 'ఆవు' అనే రెండక్షరాలనుచ్చరిస్తే నాల్గుకాళ్ళు, గంగడోలు, తోక కలిగి పాలుపిండే జంతువు అని తెలుసుకోవలెనని తెలుగువారంతా ఏర్పాటు-సంకేతం-చేసుకొన్నారు. ఇంకొక భాషలో ఆమాట కుక్కకో, నక్కకో, దేనికో సంకేతం కావచ్చును. కాని తెలుగువారి కంతా మీద చెప్పిన వస్తువే బుద్ధికి గోచరిస్తుంది. కాని సంగీతకళలో ఈస్వరానికి-ఈ సంగతికి-ఈయర్థమనే సంకేతం లేదు. అది స్వతోరంజకమైనది. స్వరం అనే పదానికి ఇదే అర్థం-'స్వతః రంజయతి'- ఇంకొకవాని దాక్షిణ్యం లేక తానే వినినంత మాత్రాన రక్తిని గలిగించేది అన్నారు పూర్వీకులు. సంకేతాలతో బంధించింది గనుక భాష చాలా మిత వ్యాప్తిగలదనక తీరదు. మనహృదయంలో కలిగే ఎన్నో

అనుభవాన్ను వివరించే శక్తి భాషకు చాలదు మంచి పుష్పాన్ని చూచినప్పుడు దాని రూపరస గంధాలనే స్పష్టంగా చెప్పలేక భాష తన్నుకులాడు తుంది. ఇక మనహృదయంలో కలిగే ఎగుడుదిగుళ్ళను తాకే శక్తి దానికేది? సంగీతకళ ఆ అనిర్వచనీయాన్ని అందుకొనే ప్రయత్నం చేస్తుంది. త-ద-రి-న తోం అనే అర్థంలేని అక్షరాల సహాయంతో అకారం-ఇకారం-మొదలైన అచ్చులను పెంచి, తుంచి, కలిపి, వీర్చి, కూర్చి, నిలిపి, పరుగెత్తించి గాయకుడు పాడినా అ త-ద-రి-న-తో లు గూడా లేక వాద్యకుడు వట్టిమూగపని చేసినా ఇది యీ రాగం, దీనిలో వర్జ్యావర్జ్యాలివి, దీనిలో ఇది కొత్తపోకడ, ఇది అపస్వరం, ఇది అవలయం, ఇడి అనువాదగ, ఇది చిలిపి చేష్ట, ఈ తాళం ఇత్యాదిగా తెలుసుకోగలమే కాని దీనికంతా అర్థమేమని అడగము. అడిగినా ప్రత్యుత్తరం రాదు.

ఇతే భాషతో చేసిన పద్యాన్నిగాని గద్యాన్నిగాని సంగీతం సహాయంతో చదివి రక్తి యెక్కువ యిచ్చేటట్టు చేయవచ్చును. సామాన్యంగా మనమంతా చేసేపని అదే ఆ మూలాన మనం చదివేది ఎక్కువ ఆకర్షకంగా ఉంటుంది. రాగతాళ బద్ధంగా చేసిన కావ్యానికి-అంటే పాటకు-లోకంలో వ్యాప్తి ఎక్కువ. రచనలో నాదకళ ప్రబలమైతే అక్షరకళ దానికి వట్టి ఊతగా మాత్రమే వుండగలదు. మరి అక్షరకళ సారవంతమైతే నాదకళ వట్టి పైపూతగా మాత్రమే పని చేస్తుంది. అంతే కాని దానికి ఇది కానీ, దీనికి అది కానీ అర్థమూ వ్యాఖ్యా కానేరవు

సంగీతానికి మూలద్రవ్యాలని చెప్పిన రాగతాళాలలోనూరెండు సదా సమాన ప్రాధాన్యంతో ఉండవు. రాగాలాపనలో లయలేదు. తాళమసలే ఉండదు. తానంలో రాగలయలు కలిసి పని చేస్తున్నవి. గాని అందులో తాళం లేదు. పాటలలో రాగలయతాళాలు మూడూ కలిసి ఉంటోంది. మరి భాషగూడా దానిలో స్పష్టంగా యూజమాన్యం వహిస్తుంది. స్వర కల్పనలో తాళం ప్రధానంగా స్ఫురిస్తుంది. పల్లవి నెరవళ్ళలో భాష నదిమిపట్టినట్టే రాగ-తాళ-లయల స్వేచ్ఛా కల్పన గోచరిస్తుంది. మృదంగం మొదలైన వాటి రచనలో శుద్ధమైన తాళలయలు మాత్రం పనిచేసేవి.

మనదేశంలో కర్ణాటకం-హిందూస్థానీ-అనే రెండు సంగీత కళా సంప్రదాయాలున్నవి. ఈ భేదం చాలా ఇటీవల ఏర్పడింది. రెంటికీ మూలము, అంతరంగము ఒకటే, వేషభాషలవంటి బహిరంగాలలో మాత్రం కొంత భేదమున్నది. శుద్ధ నాదంతో ఇంద్రియ తృప్తి చేయడంలో హిందూస్థానీకి ప్రయత్న మెక్కువ. శుద్ధలయంతో గమకబద్ధమైన వింత నాద వాక్యాలతో హృదయం తాకే ప్రయత్నం కర్ణాటకంలో ఎక్కువ, దానికిదీ దీనికదీ త్యాజ్యమూ కాదు, అనావశ్యకమూ కాదు.

జయ: సంవత్సరాది

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

తిరుపతి.

నృత్తరత్నావళి

డాయసేనాపతి

ఈ నృత్తరత్నావళి భారతీదేవి సన్నిధిలో తెలుగువారు వెలిగించిన నందాదీపములలో మొదటిది, ఇప్పటికి; తరువాతి లాక్షణికుల కెందరికో మార్గదర్శకమైన ప్రామాణికగ్రంథము. దీనిని రచించిన డాయసేనాపతి 'గీతరత్నావళి' అను గ్రంథమును రచించినట్లు ఈ గ్రంథమున చెప్పుకొన్నాడు. కాని అది యిప్పటికి లభించిన పుణ్యము మనకు లేదు. శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు 'వాద్య రత్నావళి' అనుదానినికూడ ఇతడు సంతరించినట్లు వినికి గలదన్నారు.[1] ఆ వినికి యెక్కడిదో తెలియదు.

ఆంధ్రప్రదేశ సంగీతనాటక-అకాడమీ యేర్పడిన తొలిదినాలలోనే దీని సంస్కృతమూలమును పరిష్కరించి తెలుగు తాత్పర్యములతో ప్రకటించు కోరిక గలిగినది. అప్పుడు అకాడమీ అధ్యక్షులుగానుండిన శ్రీ ఆర్. బి. రామకృష్ణరాజుగారు ఆ విషయమున చాలా ఉత్కంఠ చూపిరి. అప్పటికే మద్రాసులో సుగృహీతనామధేయులగు శ్రీ డా. వి. రాఘవన్‌గారు

అనువాదం: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
ఉపోద్ఘాతము, 1969, ఏప్రెల్, 10.
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ.

1. భరతకోశము; 'వాద్యరత్నావళి' అను పదము ప్రకింద. అందే 'నృత్త రత్నావళి' అనుమాట ప్రకింద "ఈ గ్రంథమున 'ఆత్మచరిత' మను పేరి గ్రంథమొకటి యుదాహరింపబడినది" అని కవిగారు వ్రాసిరి. లభించిన నృత్తరత్నావళి గ్రంథములో 'ఆత్మచరితము' నాకంటికంద లేదు.

మూలమును పరిష్కరించి ముద్రింపించుచున్న చిత్రకాకితములను నేను చూచియుంటిని. కనుక అకాడమీవారు వేరుగా పరిష్కరింపుభారము అనావశ్యకమని, మద్రాసు ముద్రణము వెలువడిన తర్వాత తెలుగు తాత్పర్యముతో చేర్చి ముద్రింపవచ్చునని, కార్యనిర్వాహకసమితిలో నేను సూచించితిని. సదస్యులు దయతో నాసూచన నంగీకరించిరి. కాని యే కారణములచేతనో అచ్చుపని ముగిసిన తర్వాత కొన్ని యేండ్లవరకును ఆ గ్రంథము బైలుపడలేదు. ఈ నడమ శ్రీ రామకృష్ణరాజుగారు అధ్యక్ష పదవినుండి విశ్రాంతి పుచ్చుకొనగా శ్రీ పసల సూర్యచంద్రరావుగారు ఆ పదవినంగీకరించిరి. శ్రీ రావుగారును నృత్తరత్నావళి పరిష్కరణ-ప్రకటనల విషయమున ఎంతో ఉత్సాహాసక్తులను చూపిరి. కాని వారును నాసూచనను మన్నించి, మద్రాసు పుస్తకమునకై వేచియుండుటకంగీకరించి అది వెలువడిన వెంటనే దానికి తెలుగు తాత్పర్యమును వ్రాయుభారము నామీద పెట్టిరి. వారి విశ్వాసమును వ్రోసివేయలేక అంగీకరించితిని.

తుదకు ఓర్పు సుతిమించకముందే, మద్రాసు ప్రభుత్వ ప్రాచ్య గ్రంథభాండాగారమువారు కడచిన సంవత్సరము గ్రంథమును ప్రకటించినారు. ఇంతకాలము వేచియుండినది సార్థకమైనది. శ్రీ రాఘవన్‌గారి ప్రామాణికమై తలస్పర్శియైన పాండిత్యమునకు, శ్రమసహిష్ణుతకు, ఈ పరిష్కరణము సర్వత్ర సాక్షిగానున్నది. 164 పుటలు నిండిన, వివిధవిషయములను వివరించు ఇంగ్లీషు పీఠికతో, 42 పుటల 'నోట్సు' తో 166 పుటల 'విశిష్టశబ్ద సూచి' తో, నృత్తరత్నావళి మూలము సర్వాంగసంపన్నమై వెలువడినది. ప్రతిపుటయందును వాతప్రతులలోని పాఠభేదములు అడుగున చూపబడి యున్నవి. నేటి గ్రంథ పరిష్కరణకిది యొకమేలుమచ్చు. ముప్పది యేండ్లకు పైబడి ఈ గ్రంథమును పరిశీలించుచుండినట్లు శ్రీ రాఘవన్‌గారు తెలిపినారు.[1] దానికి వింతపడవలసినది లేదు. ఈ పరిష్కరణకార్యమునకు తంజావూరి సరస్వతీమహలునందున్న రెండు తెలుగు తాటాకుల ప్రతులు వారికాధారమైనవి. రెండును ఒకమూల ప్రతికి ప్రతికలే యనుకోవలసినవి.

---

1. See Preface P. 1.

రెండును ప్రాతప్రతుల కుప్పలు. ఇవిగాక 'ఏషియాటిక్ సొసైటి ఆఫ్ బెంగాల్' వారి ప్రాతప్రతి యొకటి వారికి లభించినది.[1] కాని దానిలో మూల గ్రంథము 4వ అధ్యాయమున 11వ శ్లోకము మొదలు 7వ యధ్యాయమున 132వ శ్లోకముదాక మాత్రమే యుండినది. ప్రాత పొరబాట్లును, చిక్కులును ఏమియు తక్కువగావు. ఈ మూటి యాధారముతో ప్రాచీనములగు అనేక లక్షణగ్రంథముల సహాయముతో, పరిష్కర్త మూలమును సవరించి యుద్ధరించినారు. అప్పటికిని అందందు కొన్ని శిధిలభాగములు, చిన్నవి-పెద్దవి, అట్లే దుష్పూరములై నిలిచినవి.

ఇక నా మాట. ఈవల అనారోగ్యముతో దృష్టిబలము, ధారణాబలమును చాలక యశక్తుడనుగానున్నను, నా సూచన ప్రకారము ఇంత కాలము వేచియున్న అకాడమీవారి సౌహార్దవిశ్వాసములకు కానుకగా ఈ తెలుగు తాత్పర్యమును ఎట్లో వ్రాసియిచ్చినాను. నాట్య నృత్య నృత్తములలో దేనియందును నాకు ప్రవేశము చాలదు. ఉన్న స్వల్ప సంస్కృత భాషాపరిచయమాధారముగా మాత్రమే యీ తెలిగింపు సాగించితిని. కనుక లక్ష్యలక్షణకోవిదులకు ఈ తెలిగింపులో కొన్నియైనను లోపములు కానరాక పోవు. ఈ కార్యమునకు భరతనాట్యశాస్త్రము, అభినవగుప్తాచార్యుని అభినవభారతి, శార్ఙ్గదేవుని సంగీత రత్నాకరము, దాని సింగభూపాల-మల్లినాథుల వ్యాఖ్యలు, మానవల్లివారి భరతకోశము, శ్రీ పోణంగి శ్రీరామ అప్పారావుగారి భరతనాట్యశాస్త్రాంధ్రానువాదము-ఇవి నాకు చాలా తోడు పడినవి. శ్రీ రాఘవన్‌గారి సూచనలమాట చెప్పబనిలేదు. అకాడమీవారు నాకిచ్చిన వ్రాతప్రతికితోడు తిరుపతి ప్రాచ్య పరిశోధనశాలయందలి వ్రాతప్రతియొకటి చూచి పోల్చుకొనునవకాశము అధ్యక్షులు శ్రీ డా. జీ రెడ్డి చెన్నారెడ్డిగారు నాకు కలిగించిరి. ఇడిగాక దుర్లభమైన అభినవభారతి రెండవ సంపుటమును తమ సొంతమైన దానిని నాకెరవుగా శ్రీ రెడ్డిగారే యిచ్చి యుండిరి. వీరందరికిని నాధన్యవాదములు.

దీనికి తగినంతవిపులముగా పీఠిక ప్రాయుటకు ప్రకృతము అను

---

1. See Introduction P. 4.

కూలము, ఆరోగ్యము నాకులేక ఆ భారము వహింపుడని మిత్రులు శ్రీ డా॥పోణంగి శ్రీరామ అప్పారావుగారిని ప్రార్థించితిని. ఎంతో కార్యభారము గలవారైనను వారివలె ఈ పని నిర్వహింపగల సమర్థులు ఇతరులు కాన రాక ఈబరువు వారి కప్పగింపక తప్పినదిగాదు. వారు దయతో నావేడి కోలు మన్నించి ఈ గ్రంథమునకు నిండుదనము గలిగించినారు. దానికి నా ప్రతికారము అంజలి మాత్రమే.

మూలగ్రంథమున అందందు కొన్ని చిన్నసవరణలు చేయదగునని తోచినది, అట్లు చేసిన సవరణలు అక్కడక్కడ స్పష్టముగా చూపినాను. వాని యౌచిత్యానౌచిత్యములకు సహృదయపండితులు ప్రమాణము.

ముద్రణమునకై దీనిపగతి సిద్ధపరచుట, విషయసూచిక, విశిష్టపద సూచి–ఈ పనులను తృప్తిగా నిర్వహించినది ఇక్కడి శ్రీ వేంకటేశ్వర కళాశాలలో ఆంధ్రోపాధ్యాయుడైన చిరాయు చేట్లూరి శేషాద్రి, ఎం.ఏ.; అతనికి నా మంగళాశీస్సులు.

తిరుపతి
10–4–69

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

తాళ్ళపాకవారి పలుకుబళ్ళు

అసాధారణమైన తాళ్ళపాకవారి వాఙ్మయము గూర్చి చేయవలసిన విశాల పరిశీలనకు ఈ కోశం విష్ణ్వీశపూజ. ఇప్పటికి తెలుగులో ద్విపద సాహిత్యానికి తాళ్ళపాకవారు ప్రథమాచార్యులు. ఆ రాశిలో మూలపురుషుడైన అన్నమాచార్యుల పాలే చాలా పెద్దది. కుమారుడు పెద్ద తిరుమలయ్య, మనమలున్నూ దానికెంతో పోది చేసినారు. తాళ్ళపాకవారి పద్య ద్విపద రచనలు కొన్ని దొరకినవి. దొరకునేమో యని పేరాస పడవలసినవి యింకా యెన్నో వినికి కందినవి. దొరికిన వాటిలో "లఘుకృతులు" ముద్రణ కెక్కినవి. పదములలో యింకా యించుమించు సగపాలు అచ్చు కావలసి యున్నవి. అచ్చైన వాటిలో సంకీర్తన లక్షణము, అష్టమహిషీకల్యాణము, ఉషాపరిణయము వంటికృతులు కొన్ని ఎంతో పరిశోధించి మరల ప్రకటించ వలసియున్నవి. ఈ పని పూర్తిగా ఎప్పుడు ఎట్లు నెరవేర్చునో ఆ శ్రీనివాసు నికే యెరుక. తిరుపతి తిరుమల దేవస్థాన ధర్మాధికారులు ఎన్నోరకాల తాపత్రయాలకు లోగి ఆ పని నెమ్మదిగా సాగించవలసియున్నారు, సాగించు చున్నారు. అందుకై దేశమంతా వారికి ధన్యవాదాలర్పిస్తుంది.

గ్రంథమంతా ప్రామాణికంగా బయటపడేవరకూ సాహిత్య పరిశోధ కులు వేచివుండడం మంచిదే. కాని దానికి కొండంత ఓర్పూ, ఆయుస్సూ

సంపాదకురాలు : రామలక్ష్మి ఆర్ద్ర
ప్రధాన సహాయకుడు : ఎం. వి. ఎల్. నరసింహారావు
ప్రస్తావన, 1971.
ఆం. ప్ర. సాహిత్య అకాడమీ, హైదరాబాదు.

కావలసివున్నవి. ఆ సాహిత్యరాశిలోని అందచందాలు, ఓజస్తేజస్సులు, రసధార, భావవైవిధ్యాలూ మనలను అట్లు వేచి వుండనీయవు. ఆ ఆతమే; అడపరాని ఉత్సాహమే ఈ కోశరచనకు శ్రీమతి రామలక్ష్మిని ముందుకు త్రోసినవి. అదృష్టం ఆమె సహధర్మి. 'సమగ్ర ఆంధ్రసాహిత్యం" సమరాంగణ సూత్రధారి శ్రీ ఆరుద్ర చేదోడువాదోడై నిలబడినాడు కనుకనే యీ తొలి గణపతిపూజ సాంప్రదాయికమైన చిట్కాపనిగాక విస్తరంగా సాగింది.

ఈ విస్తరానికి నాసలహా గూడా ఒకచిన్న కారణం కావచ్చు. అన్నమాచార్యుల పలుకుబళ్ళు కొన్ని సంగ్రహించే సంకల్పమున్నదని రెండుమూడేండ్ల క్రింద యాదృచ్ఛికంగా శ్రీమతి రామలక్ష్మినాతో అన్నప్పుడు నేను "తాళ్ళపాక కవులందరి రచనల్లోను ఉన్నవాటిని సంకలనం చేసేది మేలు" అని సూచించినాను, ఆ సూచన విశ్వాసంతో ఆమె అంగీకరించినారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అధ్యక్షులు; కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావుగారున్నూ దానికి తృప్తిపడి ప్రోత్సహించినారు అల్పంగా ఆరంభించినా యిది తనంతట తనే పెరిగే విషయం గనుక ఎట్లూ గ్రంథవిస్తరం తప్పనిదే నా సూచన ఆకస్మిక వ్యాజ మాత్రమే.

ఈ వ్యాసంగం, తాళ్ళపాకవారి రచనలలోని సామెతలూ, జాతీయాలు, కొత్తపదప్రయోగాలు మొదలైన అనేక విషయాలలోనికి రచయిత్రిని లాగింది. ఇంకా పర్యాయపదాలు, జమిలి పదాలు, ఆభరణాలు, వంటకాలు మొదలైన వాటినిగూడ గుర్తించి వేర్వరచి, యిందామె సంకలనం చేసినారు. ఇంత చేసినా ఈ కోశం యింకా అసంపూర్ణంగానే సిద్ధమైంది, కాకతప్పదు. మరి ఇది శబ్దసంగ్రహమాత్రమే. అదే దొరికిన వాజ్ఞ్మయంలో ఇంచుమించు సగానికే పర్యవసానమైంది. కాని ముప్పడియేండ్లకు పైబడి యీ సారస్వత శాఖ వెలుగులోవున్నా తెలుగువారి చూపు తగినంత దీని మీద పారలేదు. దానికి కారణాలెన్నో! వాటి గొడవ యిక్కడ తడవ బనిలేదు. శబ్దం, అర్థం తాత్పర్యం, వాక్యం, వ్యాకరణం, జాతీయం, దేశీయం, సంగీతం, శృంగారం, పదరచనా పరిణామం, సంకీర్తన, భక్తి, తత్త్వం, సమకాలపుసంఘ

చరిత్రనీడలు ఇత్యాదిగా పలుమొగముల పర్యవేక్షణ యిందు సాగవలసి యున్నది. ఆ పనుల కంతా శ్రీమతి రామలక్ష్మి సంతరించిన యాకోశ్రం పూర్వపీఠికగా ఆధారంగా వుండగలదనేందుకు సందేహంలేదు. ఈ సేవతో ఆమె తెలుగు సరస్వతి మంగళాశీస్సులను సంపాదించుకొన్నారు. రాళ్ళపాకవారి రచనలతో నాకుండిన అల్పసంబంధం పురస్కరించుకొని, ఈ రెండుమాటలు వ్రాస్తావనగా వ్రాసే అవకాశం ఆమె నాకు కల్పించి నారు. ఇది నాకెంతో హృదయంగమమైన సంగతి.

తిరుపతి

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

సంగీత సంప్రదాయ ప్రదర్శిని

సుబ్బరామదీక్షితులు

కర్ణాటక సంగీతపు లక్ష్యలక్షణములను ఎంతో విపులముగా విశదముగా చేర్చి కూర్చిన మహాగ్రంథము ఈ సంగీత సంప్రదాయ ప్రదర్శిని. ఇప్పటి మన సంగీత కళకు ఇది గొప్పనిధి. దీని వంటిది నాటికి నేటికి ఇంకొకటి లేదు. రహస్యముగా రక్షింపబడుచుండిన యిందలి విషయములను వెలికి తీయించిన ఎ. ఎం. చిన్నస్వామి మొదలియారుది, వెలికితీసి చక్కగా వీర్చరిచి గమకాదుల నిందు గుర్తులతో దీనిని తెలుగు భాషలో లిపితో సిద్ధ పఱిచిన సుబ్బరామ దీక్షితులది, అచ్చపు తమిళ రాష్ట్రమున దీనినింత చక్కగా ఆ కాలమున 1904 వ సంవత్సరము ప్రాంతమున అచ్చువేయించి ప్రకటించి యెందఱో సంగీత విద్వాంసులకు రసికులకు బహుమానముగా ఇచ్చుచుండిన ఎట్టయపుర మహారాజులది--ఈ మూడు ప్రయత్నములలో దేనికంటే ఏది యెక్కువ శ్లాఘా పాత్రమో చెప్పలేము. ముగ్గురును కర్ణాట సంగీత రసికుల మూర్తీభవించిన భాగ్యము. ఈ గ్రంథమునకు పీఠము వంటిది, ఈ గ్రంథకర్తయే రచించిన "ప్రథమాభ్యాస పుస్తకము" గూడ నిట్లే చాల విలువగలది.

ఈ రెండు పుస్తకముల ప్రతులు ప్రాయశః ముగిసి పోయి ఎన్నో

ద్వితీయ ముద్రణ, సంపా. నోరి నాగభూషణం.

పర్యవేక్షకులు: రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

ధన్యవాదలేశము, 1973.

ఆం. ప్ర. సంగీత నాటక అకాడమీ.

యేండ్లయినవి. సంస్థానములు స్వరూపమును పోగొట్టుకొన్న అవాంతర సమయమున ఎట్టయపురము నగరంలో మిగిలియుండిన కొన్ని ప్రతులను ఎవరెవరో సంగ్రహించుకొని దండు బేహారము సాగించుచుండిరి. వాతప్రతి మనకు పల్చని కాగితముల మీద ముద్రితములైనవి కనుక ఆ ప్రతులు కూడ తాకితే చాలును విరిగిపోవు జీర్ణస్థితికి లోనైనవి.

ఈ స్థితిలో దీని పునర్ముద్రణము చేయగల పుణ్యాత్ములకై కలలు గనుచుండిన పలువురలో నేనొక్కడను. ఏదైనను గొప్ప సంస్థ యొకటి చేపట్టి నిర్వహింపవలసిన పనియిది. వ్యయప్రయాసములు ఎక్కువ. కేంద్రీయ సాహిత్య అకాడమీ తెలుగు ఉపసమితిలో నేనున్నపుడు ఈపని నెరవేర్పుడని ప్రార్థించితిని. వారంగీకరించి సూచింపగా కేంద్రసంగీతనాటక అకాడమివారు సమ్మతించి ఈ గ్రంథము తెలుగుమూలమును, తమిళ హిందీభాషలలో దీని పరివర్తనమును గూడ ప్రకటింప నిర్ణయించిరి. అందు హిందీ అనువాదమే స్థితిలోనున్నదో తెలియదు గాని తమిళ తర్జుమా మాత్రము ప్రమసంచికలుగా సాగుచున్నది. తెలుగు మూలమును ముద్రించు ప్రయత్నము ఇంతకాలమైనను రూపుగొనకుండెను

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమీ ఈ మహాకార్యమును శ్రద్ధాభిమానములతో నెరవేర్పబూనుకొన్నది. వ్యయము మూట అట్లుండగా అచ్చుకై యథామూలముగా దీని వాతప్రతిని సిద్ధపరచుట సామాన్య కార్యముగాదు. ఎంతో ఓర్పు, శ్రద్ధ, వైదుష్యము, వ్యుత్పత్తి, ఉత్సాహము కలవారుగాని దానిని నెరవేర్పలేరు. ఈ గుణములు నిండిన శ్రీ నోరి నాగభూషణంగారు ఈ బరువునెత్తికొని నెరవేర్చుటను ఎంతమెచ్చుకొన్నను చాలదు.

అకాడమీ అప్పటి అధ్యక్షులు శ్రీ పసల సూర్యచంద్రరావుగారి సహృదయత, కార్యశ్రద్ధ, రసికత, కళాభిమానము, దీర్ఘదర్శిత్వము మొదలగు గుణములు జగమెరిగినవి. ఈ మహాకార్యమునకు ఆయన సూత్రధారత్వము లభించుటగూడ వరప్రసాదము వంటిది.

సిద్ధమైన దీని వాతప్రతి నీవొకసారి పరికించియిమ్మని శ్రీ సూర్య

చంద్రరావుగారు నాకు నియమించిరి. యథాశక్తిగా ఆ పని చేసితిని. ఈ అవకాశము నాకు కలిగించిన శ్రీ రావుగారి దయకు నాధన్యవాదాంజలి.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

376

సవరణలు

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
5	19	భావము	ప్రభావము
13	8	గురువు	గరువు
16	3	షట్కారములకు	వషట్కారములకు
20	2	బలమెచ్చు	జలమెచ్చు
23	18	సహప్రకృతులును	సహస్రకృతులను
27	15	బేళి	బౌళి
31	16-23	శ్రీపతి	శ్రీహరి
32	2	తెలిసి	తెలిసిన
36	7	విని	వీని
36	16	దుబ్బకే	దెబ్బకే
36	28	చారిత్రిత	చారిత్రిక
		పరిధామము	పరిణామము
47	15	నక్షిణ	లక్షణ
49	13	జాతికిన్	యాతికిన్
100	1	'ఉదయమనోదయ'	'ఉదయనోదయ'
100	4	తన	మన
100	9	రచనమే	రచనయే
105	13	మౌల్యము	లౌల్యము
108	7	గురి	గరి
108	7	కాక్షౌయ	కాక్షేయ
111	12	అసంగీతము	అసంగతమా
112	20	తిమ్మణాచార్యుడు	తిమ్మణార్యుడు
112	26	ద్విపదము	ద్విపదకు
114	26	లేరు	లేను

[100-101వ పుటలలోని పాదటిప్పణిని 102వ పేజీలోని 15వ పంక్తిలోని ".....ఒకగాథ" అనువాక్యమునకు అన్వయించుకొనవలయును]

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
117	11	మసి	మపి
118	13	లను	లును
122	12	సేసికంబు	సేకంబు
123	2	పేరు వాసిన	వాసిపేరు
124	2	ప్రయాణమునకు	ప్రమాణమునకు
124	6	లజ్జి	కొదవ
130	4	నాయొద్ద క	నాయొద్ద లేక
130	6	మే యామె	మేలాయె
130	7	తొదుకులు	తొడుకులు
134	13	యోర్యరావి	యోర్వరాక
134	28	లందఱు	లందఱికి
137	4	వాక్యమున	కార్యమున
138	19	యుద్రేకమును	యుద్రేకమునకు
139	25	నున్నవి	నున్నది
140	7	చారిత్రక	చారిత్రిక
140	20	సందేశమును	సందేహమును
140	21	ప్రరహించుచున్నది	ప్రవహించుచున్నది
140	22	నుపకారము	నుడికారము
141	2	కందగీతములు	కందగీతసీసములు
143	13	'అశోకావతి'	'ఆశోకావసి'
145	8	సీతమ్మనే	సీతమ్మయే
145	10	ననద్దచి	ననన్దచి
145	11	మ్మనరోహ	మ్మానకోహ
145	19	త్ముడైన	త్ముడౌ
147	4	బైటు	బైటి
149	3	'ఆశ్వత్థేశ'	'త్రశ్వత్థేశ'
149	15	సాంప్రదాయక మైన	సాంప్రదాయిక మైన

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
150	6	నమూవాఙ్మనసైక	నమోనమోవాఙ్మనసైక
150	15	ఆభేవ	ఆ భేద
150	22	భావము	భవము
150	27	మహియాన్	మహీయాన్
154	9	మమూర్ష	ముమూర్ష
155	3	మురోఁచమైన	దురోఁచమైన
155	4	వన	వాన
155	27	దుశ్చికిత్స్యము	దుశ్చికిత్సము
156	7	యఁబాహ్మణ్యము	యఁబహ్మణ్యము
156	13	దృష్టి	దృష్ట
168	8	దండి	దంచి
173	1-2	సహ్వా	సహవా
173	15	పనిన్	వానిన్
174	3	వానిచే	దానిచే
174	26	సహృదయమును	సహృదయులు
176	12	మాల	మూల
177	10	కమాను	కమాసు
178	1	రాగతాళము	రాగతాళముల
178	23	బాధల	బాధ
179	4	తెచ్చినారో	తెచ్చినారా
180	18	ద్వాదశి	ద్వాదశ
181	12	యప్పుడు	యెప్పుడు
187	4	మెదగి	మెదిగి
190	15	సుగ్రాహము	సుగ్రహము
192	17	విప్లావ	విప్లావక
196	22	ములో	ములలో
198	5	1189	1819

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
199	21	సాలహణ	సాలాహణ
209	24	అసాధారణలోపము	అసాధారణ గుణములకు లోపము
213	6	అడ్డుదగినది	అడ్డుదగిలినది
220	20	వాదోవాదులను	వాదోపవాదములను
220	26	కావ్యమ్మగా	కావ్యమ్మనుగా
222	5	పరకాణయ	వరకాయ
222	27	సుగ్రహీత	సుగ్గహీత
223	2	చేరివారు	చేసినవారు
223	10	కవిగా	కవిగారి
224	5	శబ్దమున్నాయు	శబ్దములన్నాయు
224	6	ఎప్పుడు	ఎప్పుడును
224	12	గౌరమును	గౌరవమున
225	12	వెలయును	వెలయును గాక
226	15	అంతర	అంతర
227	19	తలకొలము	తలపొలము
242	25	మెళకువ	మెలకువ
247	4	సభారమగా	సదారముగా
249	4	ఆట్లా	అట్లు
254	23	విప్లావ	విప్లావక
256	6	కెన్నారేమో	కొన్నారేమో
257	3	తొడకు	తొడుకు
258	15	శక్తుల	శకుళల
263	8	వసటిదే	వంకదిదే
264	23	చపిచూర	చవిచూడ
265	4	కృతజ్ఞ	కృతజ్ఞ
265	7	కృశల	కృశత

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
265	13	ఋగా	బుగ
265	17	విషయ	వినయ
266	3	యందలి	మందలి
271	24	సాఁపద్దాయమైన	సాంఁపదాయికమైన
271	25	శైలిలో	శైలిలోను
277	4	చక	క
279	1	నడవలు	నడతలు
283	8–15	ప్రాంత	ఁపాఁత
285	14	నంతయు	యంతయు
28ఁ	3	రెండునూ	రెండను
290	20	గాని	ని
303	4	ప్రజాపత్యము	ప్రాజాపత్యము
303	10	నోమారులు	సోమారులు
303	20	విసరించుకొని	విస్తరించుకొని
317	8	కప్పకొన్న	కప్పుకొన్న
322	11	జ్ఞానులను	జ్ఞానులవ
327	11	గావించి	గాలించి
328	17	ఇంతా	ఇంకా
331	18	వివేచమూ	వివేచనమూ
333	11	తుదికేది	తురికేది
340	10	'తినడ'	'తివడ'
344	7	స్తబకమునకు	స్తబకములకు
344	18	అరతి	ఆ రీతి
345	11	వడినేమో !	వలెనేమో !
345	18	వట	వీట
349	6	అనంగా	అనఁగా
353	7	భగన్నామము	భగవన్నామము

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
353	14	చాలకాలమున	చాలకాలమును
353	18	పుస్త్వ	పుంస్త్వ
357	16	మీదనో	నేల మీదనో
357	23	సంగీతాసికీ	సంగీతానికి
358	5	శాయిస్తే	వాయిస్తే
359	1–2	మంద	మంద్ర
359	6	దాలు	దాలు దుర్బాములు
361	23	సంబారాలకు	సంచారాలకు
364	8	వర్జ్యావర్జ్యలివి	వర్జ్యావర్జ్యాలివి
364	21	రాగాలాపాసలో	రాగాలాపనలో
364	21	లయా	వీలయా
364	25	పట్టనట్టే	పట్టినట్టి
371	15	తనే	తానే
371	23	అదే	అదీ
373	6	నిందు	పిండు
374	3	వ్రాత	ప్రాత
374	4	మనకు	మసకు
374	4	ముడితము	ముద్రితము

YDR01E124

384

Check List

Book Number	YDROIE124	Date	2-3-2023
Front Cover	YES	Back Cover	YES
Blank Pages	C.I, XX, XXI, XXII 383.,376 ,260 ,VI,120,262,274 348		
Missing Pages	NO		
Prepared By	K. Manasa	Cutting By	Yameema
Scanned By	P. Pragathi	Pages	407
Quality Checking	prathyu.		